త్వరలో ఇవన్నీ ఇంటర్నెట్‌కి అప్‌లోడ్ చేయబడతాయి. మొత్తం ప్రాజెక్ట్ పూర్తయ్యే సమయానికి దాదాపు 70 వేల పేజీలతో, 80 నిఘంటువులు అందుబాటులోకి వస్తాయి.

ఈ నిఘంటువుల్లో ప్రామాణిక సాంప్రదాయ నిఘంటువులతో పాటు, మాండలిక పదకోశాలు, వివిధ వృత్తుల పారిభాషిక పదాల, పర్యాయ పదాల నిఘంటువులు కూడా ఉన్నాయి. వీటికి తోడు, ఇంగ్లీషు, సంస్కృత, ఉర్దూ పదాలు, పురాణాల్లో వచ్చే పేర్లు, సంగీతం, ఆయుర్వేదం వంటి వివిధ శాస్త్రాల్లో వచ్చే పదాలు, సాంకేతిక పదాల అర్థాలు కూడా ఇక్కడ లభ్యమౌతాయి.

ఇంత పెద్ద పనికి పూనుకున్నది శేషతల్పశాయి, నాగభూషణ రావులు. అయితే దీనికి ఆర్థిక సహకారాన్ని అందించింది తానా. అమెరికా వ్యాప్తంగా ఉన్న అనేకమంది పంపిన విరాళాల ద్వారా సేకరించిన మొత్తాన్ని వారికి అందజేయటంతో పని వేగవంతమయింది. కాబట్టే ఐదు సంవత్సరాల్లోనే మూడొంతుల పని పూర్తయింది. మరొక్క సంవత్సరంలో ఆంధ్రభారతి.కామ్ వెబ్‌సైట్‌లోని డిక్షనరీ విభాగం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుంది.

తెలుగు భాషావికాసానికి, భావితరాలకి తెలుగు పదాలను నిక్షిప్తం చేసే కార్యక్రమంలో పాల్గొన్నందుకు తానా సంతోషపడుతోంది. ఈ యజ్ఞంలో పాల్గొన్న సాహిత్యాభిమానులకు, విరాళాలు అందజేసినవారికి తానా కృతజ్ఞతలు తెలియజేస్తోంది.

Pailla Malla Reddy
Chairman
Advisory Council

Telangana American Telugu Association

Atlanta

Smt Jhansi Reddy
President

21 BEST WISHES FOR TANA National Convention

Goutham Goli
Executive Committee Member

21వ ఉత్తర అమెరికా తెలుగు సంఘము
తానా మహాసభలు

విజయవంతం కావాలని కోరుకుంటున్నాము

Chandrashekar Rao Palla
RVP, Atlanta

Have a Delicious day Every day!

Country Oven
cakes & baked delicacies
SINCE 1993

Any festivity is incomplete, unless we share our happiness with our loved ones back home.
Don't let distance spoil the fun and frolic of celebration.

Send your Love & Affection to your dear ones In India!

countryoven.com

India's First and #1 online E-Commerce Cake

Wide variety of gifts to choose from

- Exclusive Designer Cakes, Kids Cakes & Theme Cakes in delectable flavors.
- Fresh Flower Bouquets & Arrangements.
- Specially moulded Chocolates, Cup Cakes, and Brownies & Cookies
- Exquisite Pearls, Silverware, Watches, Kitchen Appliances, Gift Vouchers,
- Alluring keepsakes like Caricature Mugs to delight your loved ones.

- More than two decades of Quality & Trust
- Customer First Courteous Service

USA: 732 790 0578 **INDIA: +91 40 48789922, +91 9848155830**

Iselin, NJ – 08830	North Brunswick, NJ – 08902	Herndon,Virginia,20171	Issaquah, WA 98027
Ph. No: +1 732-494-4838	Ph. No: +1 732-658-6700	Ph No: +703-793-2253	Ph. No. 425 507 2039

Hyderabad | Vijayawada | Guntur | Vizag | Tirupati | Warangal | Bengaluru | Chennai | Kolkata | Mumbai | Pune | Delhi

ఎల్లలు లేని తెలుగు

ప్రాభవం • ఆనవాళ్లు



ఈ విభాగంలో...

1.	సందేశం	సిహెచ్. రామోజీరావు	...	121
2.	ఆంధ్రుల సంస్కృతికి నారుమడి అమరావతి	డా. వావిలాల సుబ్బారావు	...	122
3.	తెలుగు నేలపై జాతక కథలు	డా. ఈమని శివనాగిరెడ్డి స్థపతి	...	127
4.	మన సంస్కృతి వైభవానికి ఆనవాళ్లు శాసనాలు డా. పి.వి. పరబ్రహ్మశాస్త్రి ఇంటర్వ్యూ		...	130
5.	ఏ దేశమేగినా ఎందు కాలిడినా తెలుగే!	ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు	...	133
6.	ఏదండీ తెలుగునేల కానిది? ఎవరండీ తెలుగువారు కానివారు?	స.వెం. రమేశ్	...	138
7.	ఎల్లల కావల వినిపించిన తెలుగువాణి	వాసిరెడ్డి నవీన్	...	143
8.	తెలుగు అక్షరానికి తానా చేయూత		...	146
9.	యితనాలు యిత్తేనా... (కొంగునాడు కత)	మార్టూరి సంజనా పద్మం	...	147
10.	కుంటోడు (హోసూరు కత)	సామల మురళి	...	152
11.	తెలుగుకు సాధికారత కావాలి	డా. సామల రమేష్‌బాబు	...	155
12.	భాషావికాసం కోసం మానవీయ, సామాజికశాస్త్రాల అధ్యయన ఆవశ్యకత	గారపాటి ఉమామహేశ్వరరావు	...	158
13.	తెలుగు ఆధునీకరణలో మీడియా కృషి	ఆర్.వి. రామారావు	...	162
14.	ఎల్లలు దాటే - ఎల్లెడలా వెలిగే తెలుగు	లలిత టి.ఎస్.	...	165
15.	తెలుగు అక్షరాలతో ఆటలు	డా. జాస్తి శివరామకృష్ణ	...	167
16.	మన తెలుగు	ఉమ ఉపమాక	...	170
17.	దేశభాషలందు తెలుగు లెస్స	అశోక్ కొత్తమాసు	...	171
18.	My experiences with my culture	Bhuvana Sai Vejandla	...	172



ఎల్లలెరుగని తెలుగుకు వందనం

సిహెచ్. రామోజీరావు
ఈనాడు, రామోజీ ఫిల్మ్‌సిటీ

సందేశం

అమెరికా తెలుగు బంధువులకు...

నమస్కారం,

ఉత్తర అమెరికా తెలుగు సంఘ పాలకవర్గానికి, సభ్యులకు నలభయ్యో వార్షికోత్సవ శుభాకాంక్షలు. మాతృభూమికి 15 వేల కిలోమీటర్ల దూరంలో ఉండి కూడా మన భాష, సంస్కృతులను కాపాడుకోవడం కోసం మీరు చూపుతున్న శ్రద్ధ, చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకం.

ఓ జాతి అస్తిత్వాన్ని, ప్రత్యేకతను చాటి చెప్పేది భాషే. ఎంతో విశిష్ట చరిత మన తెలుగుది. హాలుని గాథాసప్తశతి క్రీస్తుశకం ఒకటి నాటిది. అప్పటికే తెలుగు వినియోగం ఉన్నట్లు ఆధారాలు చెబుతున్నాయి. దేశవిదేశీయులూ అమోఘమని ప్రస్తుతించే అద్భుత సాహితీ సంపద మన తెలుగువారి సొత్తు. అటువంటి మన అమ్మ భాషను, సంస్కృతిని కాపాడుకోవడమంటే మన జాతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవడమే. అంతేకాదు భావి తరాలకూ ఆ ఆత్మగౌరవ పతాకను అందించాలి. ఈ బృహత్కార్యంలో ప్రతి తెలుగు తల్లీ, ప్రతి తెలుగు తండ్రీ భాగస్వామి కావాలి.

సొంత భాషలో చక్కగా మాట్లాడటం, రాయటం వచ్చిన వారి ఉత్పాదన సామర్థ్యం ఇతర భాషల్లో చదువుకున్న వారి కన్నా మిన్నగా ఉంటుందని మన తెలుగువాడు నేతృత్వం వహిస్తున్న మైక్రోసాఫ్ట్ 22 దేశాల్లో అధ్యయనం చేసి తేల్చింది. అందుకే మన పిల్లలు ఏ మాధ్యమంలో చదువుతున్నా మన భాష, సంస్కృతుల పట్ల ఆసక్తిని కలిగించాలి. వారికి చక్కటి తెలుగును తప్పనిసరిగా నూరిపోయాలి. తెలుగు మాధుర్యాన్ని భావితరాలకు అందించడానికి, పది కాలాల పాటు పదిలపరుచుకోడానికి ఇదే అత్యుత్తమ మార్గం. ఇందువల్ల తెలుగు వారి మధ్య మమతలు, అనుబంధాలూ పటిష్ఠమవుతాయి.

ఇటీవల అమెరికాలో జరుగుతున్న పరిణామాలు బాధాకరం. ఎలాంటి అడ్డంకులనైనా మీ తెలివితేటలు, శక్తిసామర్థ్యాలతో అధిగమించగలరన్నది నా నమ్మకం. తెలుగువారు ఎక్కడైనా చక్కగా ఇమిడిపోగలరు, ప్రతికూల పరిస్థితులను కూడా అనుకూలంగా మలచుకోగలరన్నది చాలా సందర్భాల్లో రుజువైన సత్యం. ఐక్యత, కలుపుగోలుతనం, ప్రేమ, వినమ్రత, క్రమశిక్షణ, శ్రమ, నిరాడంబరతలే మనకు ఆభరణాలు. జనహృదయ విజేతలుగా నిలవడానికి ఇవే తారకమంత్రాలు.

ఇతర భారతీయ సంఘాలనూ కలుపుకుంటూ అమెరికా, భారత దేశాల అభివృద్ధికి తానా ఇతోధికంగా కృషి చేయాలి... మరెన్నో వార్షికోత్సవాలను జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ...

శుభాభినందనలతో...

మీ

రామోజీరావు



ఆంధ్రుల సంస్కృతికి నారుమడి అమరావతి

డా. వావిలాల సుబ్బారావు



అమరావతి అనగానే గతకాలపు ఆంధ్ర శిల్పుల నైపుణ్యం, బుద్ధుడు, ఆచార్య నాగార్జునుడు చేసిన ధర్మబోధలు గుర్తుకు వచ్చేవి. శైవక్షేత్ర పవిత్రత మనసును తట్టేది. ఇపుడు అమరావతి అనగానే వేగవంతమయిన నూతన నిర్మాణదీక్ష గుర్తుకు వస్తున్నది. ప్రపంచ కళాచరిత్రలో స్థిరమయిన అమరావతి శిల్పశైలీ ప్రశస్తి ఇపుడు మొగ్గ తొడుగుతున్న ప్రపంచ నగరంగా కళ్ల ముందు నిలువబోతున్నది. ఆంధ్రుల నవ్య రాజధానికి అమరావతి అన్న అందమయిన పేరును ఆమోదించటంలో ఎవరి కంఠంలోను జీరగాని, వివాది స్వరం గాని వినపడలేదు. అమరావతి ఆంధ్రులందరికీ మనసు మురిసిన పేరు.

ఇటీవల చరిత్ర వ్యాఖ్యాతలు ఆంధ్రుల మూలసంస్కృతి బౌద్ధం అంటున్నారు. నిజమే, ఆంధ్రుల సంస్కృతిలో పునాది నిర్మాణమంతా బౌద్ధ ధర్మానిదే. అనేకత్వాన్ని ఆదరించే ఔదార్యం, ఘర్షణ లేకుండా సమన్వయం చేసుకొనే విశాలత్వం, ఉద్రేకం ఉరిమినా జల్లు కురిసి చల్లబడే సంయమనం, ఇవన్నీ తెలుగువారి లక్షణాలు. ఈ సుగుణాలను కుప్పబోసి, కలబోసికొని దానికి 'తెలుగుదనం' అన్న స్పష్టత నిచ్చుకున్నది ఈ అమరావతీ మాగాణంలోనే. ఈ అన్ని లక్షణాలను గుదిగ్రుచ్చి-

అమరావతి ఒక అనుభూతి। ఆంధ్రావళికది జయగీతి॥
అందలి శిల్పకళారీతి। అది అందానికి అమరజ్యోతి॥

తెలుగు పతాకలు గగనాంగణమున। వెలుగులు చిమ్మిన దిచ్చటనె॥
తెలుగు నౌకలు కృష్ణానదిలో। తిరుగుచు మురిసిన దిచ్చటనె॥

శాతవాహనుల విజయకథా। గౌతమబుద్ధుల కరుణసుధా॥
చేతులు చేతులు కలిపి ప్రజకు। నవజీవం పోసిన దిచ్చటనే॥

తెలుగు దుందుభులు రణరంగమ్మున। ఫెళఫెళ మ్రోగిన దిచ్చటనె॥
తెలుగు గాయకులు మధుర మధురముగ। గానము సలిపిన దిచ్చటనే॥

అని కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు అమరావతికి నగరగీతి కాదగిన కవితను అమరాతిలోనే వ్రాసి పులకించారు.

ఈ చారిత్రక భూమి సుమారు 2500 సంవత్సరాల నుండి ఆంధ్రజాతిని తీర్చిదిద్దుతూ, ధనకటకంగా, ధాన్యకటకంగా, ధరణికోటగా- వివిధ పేర్లతో గౌరవం పొందుతూ ఉన్నా, 1795 నుండి అమరేశ్వరాలయం, మహాచైత్య పరిసర ప్రదేశాలు మరొక గ్రామంగా ఏర్పడి 'అమరావతి' అన్న అందమయిన పేరుతో కొత్త చివురులు తొడిగింది. అమరావతి అన్న పేరు గతచరిత్రకు, ఒక గ్రామానికి మాత్రమే పరిమితమై పోకుండా- నవజీనం పోసి ఆధునికం చేసి ప్రపంచ మహా

నగరాల స్థాయికి తేవాలన్న మహోస్వప్నానికి పూనిక వహించినది ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ నేత శ్రీ నారా చంద్రబాబునాయుడు. ఏకగళంతో ఆమోదించిన సర్వ రాజకీయ పక్ష నేతలను, ప్రభుత్వ నేతను సమకాలీన ఆంధ్ర ప్రజలే కాదు, రాబోయే తరతరాల మన పిల్లలూ, వారివారి సంతతీ అభినందిస్తారు.

ప్రతికూల పరిస్థితులపై పోరాటంలో గెలుస్తూ, సాంస్కృతిక వారసత్వాన్ని నిలుపుకుంటూ, ప్రణాళికాబద్ధంగా నూతన రాజధానిని నిర్మించుకుంటూ, పురోగమించే దీక్షలో, ధాన్యకటకం నిర్మించిన శాతవాహనులు, అమరావతీ క్షేత్రం నిర్మించిన వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు, ఇపుడు నవ్యాంధ్ర రాజధానిగా అమరావతిని రూపొందిస్తున్న ప్రజా ప్రభుత్వాధినేత చంద్రబాబు నాయుడు పోరాడి అధిగమిస్తున్న సమస్యలలో సారూప్యం కనిపిస్తున్నది. భిన్న ప్రాంతాలకు, భిన్న వర్గాలకు, సమన్వయం కూర్చటమే మొదటి సమస్య.

భిన్న తెగల ప్రజలకు నివాసభూమిగా ఉన్న ప్రాంతాలన్నింటిని ఏకం చేసిన ప్రయత్నాల సూచనలు పురాణకాలంలో 'తారకాసుర వధ' కథలోనే కనిపిస్తాయి. తారకాసుర వధ అమరావతి ప్రాంతంలోనే జరిగింది కాబోలు. ఎందుకంటే, అతని మెడలో ఉన్న శివలింగాన్ని కుమారస్వామి ఖండిస్తే మొదటి శకలం ఇక్కడే పడిందట. దాన్నే అమరేంద్రుడు ప్రతిష్టిస్తే అమరేశ్వర లింగమై పంచారామాలలో మొదటిదయింది. ఇది ఇక్కడి స్థల పురాణగాథ. ఈ కథ వెనుక జాతుల ఏకీకరణ, సంఘర్షణ సూచనగా ఉందన వచ్చు. శైవారాధన ప్రవేశాన్ని కూడా ఇది సూచిస్తుందేమో! శబరులు, మూతిబులు, యక్షుల, నాగులు, ఆంధ్రులు, తెలుగులు ఎంద రెందరో కలిసి ఆంధ్రులయినారు. అందుకే, 'ఆంధ్రులంటే అనేకులు' (ఆంధ్రాశ్చబహవహ) అన్నది 'మహాభారతం.'

నాగారాధనలు, నాగులచవితి వంటి పండుగలు, యక్షుల యక్షగానాలు, అన్నీ మన సమిష్టి సంస్కృతిలో భాగాలయినాయి. ఆంధ్ర సంస్కృతీ రసాయనానికి అమరావతీ క్షేత్రమే పాకశాల. ఉత్తరభారత - దక్షిణభారతాల మధ్య జరిగిన సంస్కృతీ వినిమయానికి, ఆదాన ప్రధానాలకు కూడలి ప్రదేశం ఇదే. ఈ కూడలిలో జైనం బౌద్ధం వచ్చి చేరాయి. బౌద్ధం ధాన్యకటకంలో (అమరావతి), జైనం వర్ధమానపురంలో (నేటి 'వడ్లమాను') మునికూటంలో (నేటి 'మునుగోడు') అప్పటికే ఉన్న శైవంతో (స్కంద ముద్రలు కొన్ని దొరికాయి) కలిసి సహజీవన సంస్కృతికి నాంది పలికింది ఈ క్షేత్రం.

అశోకుని కాలానికే స్తూపారాధన సంస్కృతి ఇక్కడ స్థిర పడింది. అశోకుని పాలన వల్ల బౌద్ధ ధర్మం, 'సదా' రాజుల వల్ల బహుశ జైనం, రెండు కలిసిన ప్రశాంత జీవనం ఇక్కడ ప్రజల శైలిగా ఏర్పడింది. ఆరాధనలో భిన్న రూపాలున్నా పౌర జీవనంలో 'శాంతి-అహింసలు' రెండూ రెండు శ్వాసకోశాలయినాయి.

దక్షిణ భారత పశ్చిమ తీరంలో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్న శాతవాహనులకు పూర్వగౌరవ పునరుద్ధరణకు ధాన్యకటకం (అమరావతి) ఆధారక్షేత్రమయింది. నేడు ఆ చరిత్ర పునరావృతమవుతున్నది మన కళ్ల ముందే.

గౌతమీపుత్ర శాతకర్ణి తండ్రి 'శివస్వాతి' (22వ శాతవాహన రాజు) తల్లి గౌతమీ బాలశ్రీ దాదాపు 20 సంవత్సరాలు శ్రమించి ధాన్యకటకాన్ని రాజధానిగా పటిష్టపరిచారు. ఆ స్థిరభూమి నుండి మహారాణి బాలశ్రీదేవి శిక్షణ దార్శనికతలతో శాతకర్ణి, పులోమావి దుర్నిరీక్ష్యమయిన చక్రవర్తులయినారు. దక్షిణ భారతదేశ రాజవంశాలలో చక్రవర్తులనదగినవారు ఆంధ్ర శాతవాహన రాజులు మాత్రమే. వారి కీర్తిని ఎంత గానం చేస్తే తృప్తి తీరుతుంది! అందుకే ఒక ప్రాచీన జైనకవి-

సచ్చ భాణ గోదావరీ పువ్వ సముద్దేణ సహి ఆసంతి
సాతవాహనకుల సరిసమం జయైతి కులే కుల అత్థి

(ఓ గోదావరీ నదీ! నీవు తూర్పు సముద్రం దిశగా ప్రవహిస్తావు గదా! చెప్పు! శాతవాహన వంశంతో సమానమయిన గొప్ప వంశం మరేదయినా ఉందా! - బృహత్కల్ప సూత్రభాష్యం)

రాజ్య పాలనాధికారానికి వెన్నెముకగా ఉండి మూడు తరాల మహారాజులను నడిపించిన మహారాణి, రాజమాత, రాజ పితామహి ఒక్క గౌతమీ బాలశ్రీ తప్ప భారతదేశ చరిత్రలో వేరొక మహిళ కనుపించదు. భర్త శివస్వాతి, కుమారుడు శాతకర్ణి, మనుమడు పులోమావి పాలనలో 19 సంవత్సరాలు ఆమె పెద్దరికం చెలామణీ అయింది. ఆంధ్ర మహిళా గౌరవానికి ఆమె వజ్ర కవచమై నిలిచింది. అమరావతి-ధరణికోట ప్రాంతమంతా ఆమె పాదముద్రాంకితమే.

రెండు తరాల తర్వాత మరొక శాతవాహన చక్రవర్తి గౌతమీపుత్ర యజ్ఞశ్రీ, ఆతని గురువు ఆచార్య నాగార్జునుడు ఆంధ్ర గౌరవాన్ని, అమరావతి క్షేత్రాన్ని ప్రపంచ నాగరికతా చరిత్రలోనే శిఖరస్థానంలో నిలిపారు. సామ్రాజ్య విస్తృతిని, రాజ్యప్రశస్తిని పూర్వ గౌరవస్థాయిలో నిలుపుతూనే, బౌద్ధతత్త్వ వికాసంలో, తత్త్వశాస్త్ర అధ్యయన అధ్యాపనాలతో అమరావతిని మకుట స్థానంలో నిలిపారు. శాతవాహన రాజులు దయగల పాలన అందించారు. 'శాతకర్ణి శత్రు భయంకరుడుగ ఉంటూనే ఏమాత్రం అవకాశం వచ్చినా దయగా ఉండేవా,'డని బాలశ్రీ తన కుమారుని గురించి శాసనంలో పేర్కొన్నది. అదే పాలనా విధానం అనంతర రాజులు కొనసాగించారు.

ఆచార్య నాగార్జునుడు, రెండవ బుద్ధుడని, అపూర్వ తార్కికుడని మహాయాన బౌద్ధానికి సిద్ధాంతకర్త అని అనవద్య కీర్తిని పొందాడు. అమరావతి మహాచైత్యానికి ప్రాకార నిర్మాణ బాధ్యత వహించాడు. అమరావతి శిల్పుల నైపుణ్యానికి తాత్త్వికతను జతచేసి సౌందర్యానికి భావగౌరవం జోడించాడు. విదేశ భిక్షువులు ఇతని వద్దకు తత్త్వాధ్యయనం కొరకు వచ్చేవారు. మహాయాన ప్రామాణిక గ్రంథాలు అనేకం వ్రాశాడు. చైనా, జపాన్, టిబెట్ వంటి మహాయాన బౌద్ధ దేశాలలో ఆయన రచనలు శిరోధార్యాలు. భారతీయ తత్త్వశాస్త్ర చరిత్రలోనే ఆచార్యునిది ఒక శిఖరస్థానం.

సార్వభౌముడయినవాడు యుద్ధ విజేత, సమర్థ పాలకుడు, ఐశ్వర్య సాధకుడు మాత్రమే అయితే సరిపోదని ధార్మిక విలువలకు లక్ష్య నిర్దేశం చేసుకొని నడవాలని, హింసకు, ప్రతీకారానికి,

గౌతమీపుత్ర యజ్ఞశ్రీ శాతకర్ణి

మనోకాఠిన్యానికి పాలనలో తావు ఉండకూడదని రాజుకు బోధించాడు. తన రాజునకుండవలసిన ప్రవర్తనను రెండు ధర్మలేఖల రూపంలో వ్రాసి యిచ్చాడు. బహుశ ప్రపంచ సాహిత్యంలోనే ఇవి మొదటి ధర్మలేఖలు.

సుగతు బోధల ఉన్నతి తెలుపగోరి
చెప్పుచుంటిని ఆర్యావృత్తములలోన
నీవు పాటించి ఔన్నత్య మందగలవు
సావధానముగ వినుము శాతకర్ణి॥

అని సంబోధించాడు.

అందులో కొన్ని భావాలనయినా తెలుసుకుంటే ఎటువంటి పాలనా సంస్కృతిని ఆశించారో బోధపడుతుంది.

- *సత్యాన్ని దర్శించినవాడు నక్షత్రాల వలె ఆకాశం నుండి రాలేదు. ధాన్యం మొక్కలాగ భూగర్భం నుండి మొలుచుకొని రాలేదు. గతంలోని పాపాల నుండి వెలికివచ్చిన పృథగ్జనులే.*
- *కర్మలకు ఫలితముండదనుట నాస్తిక దృష్టి. అస్తిత్వదృష్టి యంటే కర్మలన్నిటికి ఫలితం ఉండుననుటే. ఇట్టి చింతనయే సమ్యక్‌దృష్టి.*
- *అహంకారం నిర్మూలించే ధర్మం ఎంతవరకు బోధపడదో, అంతవరకు దానము, శీలము, క్షమా గుణములు శ్రద్ధతో పాటించవలెను.*
- *నిరంతరం బాధితులకు, పంటలు నష్టమయినవారికి, రోగగ్రస్థులకు, క్షతగాత్రులకు, పరాజిత రాజ్య ప్రజకు శ్రద్ధ చూపు మధికముగ.*
- *నీ సంపద నాశించు అవస్థ వేదలకు తొలగింపుము- కొత్త పన్నులు విధింపకుము. భారము తగ్గింపుము. గుమ్మములో నిలచు సుంకరుల బాధ తగ్గింపుము.*
- *అర్థించకున్న నేమి ధార్మికులు, పరరాజ్య భాగమందున్ననేమి? సత్పురుషుల ననుగ్రహింపుము. భేదములేక అనుపమాన వర్తమున.*
- *ధర్మకార్యము కొరకె నీ రాజ్యము- కీర్తికొరకు గాదు, కామ్యముల కొరకుగాదు. అట్లగుట చేతనే కలుగు పూర్వ ఫలము అన్య విధమయినచో అన్ని యనర్థములే.*
- *హంతకులపై తీవ్ర పాపులపైన విశేషముగ కరుణ చూప వలయు. ఉదార హృదయుల అపార కృపకు పతనమైనవారె మిక్కిలి పాత్రులు.*

(ఆచార్య నాగార్జున లేఖలు నుండి- స్వీయానువాదం)

నేర శిక్షాస్మృతి నుండి ఉరిశిక్షను తొలగించమని, ధర్మబద్ధంగా రాజ్యాన్ని పాటించటం దుష్కరమయితే, సింహాసనం వదలి భిక్షుదీక్ష తీసుకొనుట మంచిదని, తనను ఆదరించిన రాజుకు స్పష్టంగా బోధించాడు ఆచార్య నాగార్జునుడు. తన గురువు మాటలు కొంతమేరకయినా అమలులో పెట్టే ఉంటాడు యజ్ఞశ్రీ శాతకర్ణి. అశోక చక్రవర్తి అంతటి ధర్మప్రభువుగా తీర్చిదిద్దటానికి, 'ఆచార్యుడు' అంతటివాడు కావటానికి శాతకర్ణి ధాన్య కటకంలో ప్రయోగం చేసి ఉంటారనుకోవటం అత్యూహ కాదు. బౌద్ధ తత్వశాస్త్ర చరిత్రలో మహాయానశాఖ, శిల్పసౌందర్య పరాకాష్ట ప్రపంచవ్యాప్త కీర్తిని సంతరించినది ఈ యుగంలోనే, ఈ నేల మీదనే. మరికొన్ని శతాబ్దాలకు గూడా మసకబారని ఆంధ్ర వారసత్వ దీధితులు విస్తరించింది ఈ కాలంలోనే. అందుకనే అమరావతి ఆంధ్ర సంస్కృతికి నారుమడి.

వీలయినన్ని స్థూపాలు దేశమంతటా నిర్మించమని, పాఠశాలలు నెలకొల్పి గురువుల పోషణభారం వహించమని ఆచార్యుడు 'రత్నావళి'లో బోధించాడు. బహుశ దాని ఫలితమే తెలుగునేల అంతటా విరివిగా స్థూపశిథిలాలు, ఆరామ చిహ్నాలు, అమరావతి శిల్పశైలికి చెందిన శిలాఫలకాలు బయటపడుతున్నాయి. ఇవన్నీ అమరావతి వెదజల్లిన సంస్కృతీ బీజాలు. నాగార్జునకొండలోని ఆరామం గూడ ఆచార్యుని కొరకు యజ్ఞశ్రీ నిర్మించినదే నంటారు.

భూభ్రమణం వల్ల పగటికాంతులు మసకబారినట్లే, చరిత్ర భ్రమణం వల్ల కీర్తికాంతులకు గూడ కొంతకాలం గ్రహణం తప్పదేమో! అయినా నక్షత్రకాంతులు, చంద్రజ్యోత్స్నలు సూర్యోదయకాలం వరకు దారి చూపుతూనే ఉంటాయి.

ఇక్ష్వాకులు శాతవాహనుల తర్వాత విజయపురి నుండి పాలించినా ధాన్యకటకంలో గూడ బలాలు నిలుపుకున్నారు. సముద్ర వాణిజ్యం కొనసాగింది. ధరణికోట వద్ద నౌకానిర్మాణ శిథిలాలు కనిపించాయి. రాజ్యాధికారం దూరమయినా సాంస్కృతి కాధిపత్యం కొనసాగుతూనే ఉంది. నూరు అడుగుల ఎత్తున మహా చైత్యం సగర్వంగా దీపకాంతులీనుతూ సుదూర తమస్సులకు ధర్మకాంతులను ప్రసరిస్తూనే ఉంది. విదేశ యాత్రికులు విద్యార్థులు వస్తూనే ఉన్నారు. బౌద్ధం మహాయానం నుండి తంత్ర యానం వైపుకు దృష్టి సారిస్తున్నది. బౌద్ధతాంత్రిక సాధనలు,

తార, మంజుశ్రీ, యక్షి, ఇత్యాది దేవతా మూర్తులు శిల్పాలై చైత్యాన్ని అలంకరిస్తున్నాయి. బౌద్ధంలోని అన్ని పరిణామాలకు అమరావతీ క్షేత్రం ఆశ్రయమిచ్చింది.

ఆనాటి స్థాయికి అమరావతి ఒక మహానగరమే. సుమారు 15 కిలోమీటర్ల చుట్టుకొలత గల పట్టణం. రాజులు వైదికమతం అవలంబించి యజ్ఞయాగాలు చేసినా బౌద్ధాన్ని గౌరవించి పోషించారు, ప్రజలు ఆదరించారు. సమాజంలోని అన్ని స్థాయిల వారు శిల్పదానాలు చేశారు. ఒక చర్మకారుడు దానంచేసిన 'పూర్ణకుంభ' శిల్పఫలకం లభించింది. చిన్నచిన్న ఆరాధనా స్థూపాలు అక్కడక్కడ బయట పడ్డాయి. నదీతీరాన అమరవటేశ్వర పూజలు, అంతఃపురంలో స్కందపూజలు జరిగాయి. వైకుంఠపురం, వడ్లమాను గ్రామాల్లో (వర్ధమానం) జైన వసతులున్నాయి.



ఆచార్య నాగార్జునుడు

శాతవాహన రాజధాని తూర్పున ధాన్యకటకానికి మారటం వల్ల రాజ్యానికి ఆర్థికపుష్టి కలిగింది. తూర్పుదేశాలలో సముద్ర వాణిజ్యం, సంస్కృతీ విస్తరణ జరిగాయి. తూర్పు దేశాలలో అనేక పట్టణాలకు మన పేర్లున్నాయి. భర్మదేశం (బర్మా/మయన్మార్) భాషాలిపికి ఆంధ్రలిపియే మూలం అంటారు. శాతవాహనుల పశ్చిమ పాలన పోరాటాలతో గడిచింది. తూర్పున ధాన్యకటక పాలన సంస్కృతీ విస్తరణలోను జరిగింది.

ఇక్ష్వాకుల పాలన తర్వాత ఇక్కడ అన్నీ యుద్ధాలే. బౌద్ధం తంత్రయాన పరిణామాలతో ప్రజలకు దూరంగా జరిగింది. కొందరు రాజులు బౌద్ధం మీద గౌరవంతోనే ఉన్నారు. కందార రాజులలో చివరివాడు 'సమ్యక్సం బుద్ధ పాద పద్మారాధకుడ'ని చెప్పుకున్నాడు.

ఆనంద గోత్రీకులు, పల్లవులు, శాలంకాయనులు, విష్ణుకుండినుల మధ్య ఎడతెగని యుద్ధాలతో ధాన్యకటకం నిత్య కల్లోలంగా గడిచింది. బహుశ అందుచేతనే శాంతికాముకులు ప్రశాంతచిత్తులయిన బౌద్ధ భిక్షువులు చాలామంది దూరంగా వెళ్లిపోయారు. అయినా ఆరామాలలో ఏకాంతిక సాధనలు, నూతన సిద్ధాంత ప్రయోగాలు జరుగుతూనే ఉన్నాయి. 'ధారిణి'లు అనబడే దేవతామంత్రాలు, ఆరాధనామంత్రాలు సృష్టింపబడుతున్నాయి. అందువల్ల ధారిణీకోట/ధరణికోట అనే పేరు వచ్చి ఉంటుందని కొందరి ప్రతిపాదన.

ఆరవ శతాబ్దంలో విష్ణుకుండిన రాజయిన మాధవవర్మ శైవమతాన్ని ప్రోత్సహించాడు. అప్పటివరకు అప్రధానంగా ఉన్న అమరేశ్వరాలయానికి ప్రశస్తి ప్రారంభమయి ఉండవచ్చు.

అమరావతిలో బౌద్ధం ప్రజలకు దూరమయిందేగాని పండితులకు దూరం కాలేదు. విదేశాల నుండి బౌద్ధాభిలాషకులు వస్తూనే ఉన్నారు. అధ్యయనాలు, అధ్యాపనాలు జరుగుతూనే ఉన్నాయి. సుప్రసిద్ధ చైనా యాత్రికుడు 'యుఆన్-చాంగ్' ఇక్కడకు వచ్చి, సంవత్సరకాలం పాటు ఉండి, బౌద్ధంలో జటిలమయిన 'అభిధమ్మ శాస్త్రం' అధ్యయనం చేసి అనేక గ్రంథాలు సేకరించు కొని వెళ్లాడు. ఇది జరిగింది క్రీ.శ. 650లో. అనేక దేవతారాధన పెరుగుతున్నవని, ఆరామాలు ఖాళీగా ఉంటున్నాయని కొన్నింటిలో మాత్రమే భిక్షువులున్నారని పేర్కొన్నాడు.

చాళుక్య భీముని కాలంలో (క్రీ.శ. 920) అమరేశ్వరునికి స్థిరమయిన దేవాలయం ఏర్పడి ఉంటుంది. వరదల తాకిడి నుండి రక్షించటానికి దేవాలయం ఎత్తయిన మేడమీదకు మారింది. కాకతీయ రాజులు సామంతులుగా ఈ ప్రాంతాన్ని కోటరాజులు ఎక్కువకాలం ప్రశాంతంగా పాలించారు. అమరేశ్వరాలయానికి కేతరాజు 1185లో పునఃప్రతిష్ట చేశారు. 'బుద్ధదేవరకు-అమరేశ్వర దేవరకు' విరివిగా దానాలు చేస్తూ 'చైత్యమత్యున్నతం యత్రనానా చిత్ర సుచిత్రితం' అని స్థూపాన్ని వర్ణించాడు. అప్పటికి చైత్యా రాధన, శివారాధన ఎంతో కొంత కొనసాగుతూనే ఉన్నాయి. యుద్ధాల హోరు కొంతలో కొంత తగ్గినట్లున్నది.

1344లో 'ధర్మకీర్తి' అనే శ్రీలంక భిక్షువు వచ్చాడు. కొన ఊపిరితో ఉన్న ఆరామాలకు డబ్బు వెచ్చించి కొన్ని మరమ్మత్తులు చేయించాడు. 14వ శతాబ్దాంతానికి స్థూపం పూర్తిగా ఆదరణ కోల్పోయింది. విగ్రహారాధనను వ్యతిరేకించే మహమ్మదీయుల దండయాత్రల ఫలితంగా అమరేశ్వరాలయము, బౌద్ధాశిల్పాలు శిథిలమయ్యాయి. బౌద్ధం మీద ప్రజలకు శ్రద్ధ తగ్గిన కారణంగా రెడ్డిరాజులు అమరేశ్వరాలయానికి మాత్రం పునఃప్రతిష్ట చేయించారు. ఇది రెండవ పునఃప్రతిష్ట.

అమరావతి సమీపంలో బొడ్డుపల్లె గ్రామంలో (నదిలో కలిసిపోయింది) కవి సార్వభౌముడు శ్రీనాథుని జీవితం చివరిదశ గడిచింది. ఆయన ఈశ్వరార్చన కళాశీలుడు కనుక, రెడ్డిరాజుల ఆశ్రయం పొందినవాడే గనుక అమరావతిని సందర్శించే వుంటాడు.



1515లో శ్రీకృష్ణదేవరాయలు దేవేరులతో కూడి అమరేశ్వరుని దర్శించి 'తులాభారం' తూగి విరివిగా దానాలు చేశాడు. తాను వైష్ణవుడయినా శివారాధన చేసి అగ్రహారాలు ఇచ్చి శాసనం వేయించాడు. 'ధాన్యకటకాన్ని' 'ధరణికోట' అన్నాడు. విజయనగర సామ్రాజ్యానంతరం మహమ్మదీయ దాడులు విజృంభించి అమరేశ్వరాలయ పవిత్రతకు మళ్లీ భంగం కలిగింది. మళ్లీ 1626లో హంద్రికం పెద్దప్ప అనే అమాత్యుడు, బహుశ వాసిరెడ్డి వీరపనేని మంత్రి అయి ఉండవచ్చు, అతడు పూనుకొని మూడవసారి పునఃప్రతిష్ట చేయించాడు.

వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు

ఆలయ ప్రశస్తి మాత్రమే మిగిలిన ధరణికోట, వ్యవసాయ గ్రామంగా మాత్రమే మిగిలిపోయింది. కోటదిబ్బల మధ్య గ్రామం ఇమిడిపోయింది. ఈ ప్రాంతానికి మళ్లీ వైభవం రావటానికి 1790 వరకు క్షేత్రలక్ష్మి ఎదురుచూపులు చూడవలసి వచ్చింది.

చింతపల్లి జమిందారయిన రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు దృఢసంకల్పం, కార్యదీక్ష, ప్రతికూల పరిస్థితులతో పోరాడి నిలువగల పటిమ గలవాడు. బ్రిటిష్ కంపెనీ వారి పాలనలో వారి ధాష్టీకాన్ని, పిండారుల భీకర దోపిడీ దాడులను ఎదుర్కొనవలసి వచ్చింది. చింతపల్లి నుండి రాజధానిని మార్చటం అవసరమయింది. తాను శివారాధన తత్పరుడు. భక్తి, ధార్మికదృష్టి కలవాడు. కనుక అమరేశ్వరుని సన్నిధి అనువయిన స్థలమనిపించింది.

ధరణికోట గ్రామానికి తూర్పున 'దీపాలదిన్నె' పేరుతో ఉన్న మహాస్తూపానికి నదీతీరాన అమరేశ్వర దేవాలయానికి పరిసర ప్రాంతాలను వేరుచేసి 'అమరావతి' అన్న అందమయిన పేరుతో అందమయిన నగరం నిర్మించాడు. విదేశీ నగరవాస్తు నిపుణులతో ప్రణాళిక వేయించాడు. వివిధ ప్రాంతాల నుండి అన్ని వర్గాల కుటుంబాలను పిలిపించి, ఇండ్లు కట్టించి, వృత్తులు ఇచ్చి, తీరయిన వీధులతో రథోత్సవానికి విశాలమయిన రాజవీధిలో గ్రామ నిర్మాణం చేయించాడు. ఎత్తయిన గాలిగోపురం కట్టించాడు. నదికి ఐదుమైళ్ల దూరంలో ఉత్తరవాహిని వద్ద ఉన్న గ్రామానికి వైకుంఠపురమన్న పేరు పెట్టి వేంకటేశ్వర దేవాలయం కట్టించాడు. 16 ఎకరాల విశాలమయిన పూదోట కల్పించి, 'నందనవనం' అన్నాడు. కవి పండితులను పోషించాడు. బృహస్పతి వంటి గురువు ములుగు పాపయారాధ్యులను గౌరవించి కావ్యాలు వ్రాయించాడు. ఉచ్చైశ్రవం వంటి తెల్లని గుర్రం తెచ్చాడు. ఇక తానే దేవేంద్రుడని ప్రజలు అనుకునేలా చేశాడు. తానే ముందుగా టీకా వైద్యం చేయించుకొని ప్రజలకు భయం పోగొట్టి ఆధునిక వైద్యాన్ని ప్రోత్సహించాడు. నవ్యాంధ్ర రాజధానికి ప్రస్తుత ప్రభుత్వం పడుతున్న శ్రమలన్నీ కొద్ది మోతాదులో తాను ఎదుర్కొన్నాడు.

అమరావతి యమరావతి
యమరగ నింద్రుండు వేంకటాద్రీంద్రుండే
అమరులు గోత్రామరులే
కమనీయ నందనమ్ము ఘన నందనమే

('వాసిరెడ్డీంద్రియం'- పూర్వకవి అమరవాది రామకవి)

ఆలయములెన్ని, అన్న సత్రాదులెన్ని,
అగ్రహారములెన్ని, మాన్యంబులెన్ని,
వృత్తులవి యెన్ని కల్పించినావు,
ఆంధ్రభూమి భవద్దానమందు తడిసె

('విజయప్రస్థానము' - వావిలాల నరసింహారావు)

అమరావతి రాజధాని నిర్మాణ సమయంలో శిథిలమయిన స్తూపానికి, ఎవరి అజ్ఞానం వల్ల నయితేనేమి శిల్పాపచారం కొంత జరిగింది. కాని ఉద్దేశపూర్వకమో, విధ్వంసబుద్ధియో మాత్రం కాదు. సమయానికి బ్రిటీష్ అధికారి కల్నల్ మెకంజీ వచ్చి వాటి గొప్పతనాన్ని గుర్తించి జాగ్రత్త తీసుకున్నాడు. త్రవ్వకాలు మరికొంత చేయించాడు. శిల్పాల భద్రత తీసుకొని మచిలీపట్నం - మదరాసు మొదలయిన చోట్లకు తరలించాడు. విదేశాలకు కూడా చాలా తరలిపోయాయి. మనకు దూరమయినా క్షేమంగా ఉన్నాయి. ఢిల్లీ, కలకత్తా, లండన్, ప్యారిస్ మొదలైనచోట్ల మన శిల్ప వారసత్వాన్ని అక్కడ చాటుతున్నాయి.

'అమరావతి' అన్న కొత్త పేరు వచ్చిన తర్వాత బయటపడ్డ శిల్పాలు గనుక వాటికి 'అమరావతి శిల్పాలు' అనీ, 'అమరావతి శిల్పకళ' అన్న పేర్లు స్థిరపడిపోయాయి.

ఇపుడు మళ్లీ ఆంధ్రుల ఆధునిక చరిత్రకు అమరావతి పతాక శీర్షిక అయింది. శాతవాహనుల 'ధాన్యకటకం' మధ్య యుగాలలో 'ధరణికోట'గా మారి, జమీందారి పాలనలో 'అమరావతి'గా పరిణమించి, ఇపుడు ప్రజాస్వామిక యుగంలో మళ్లీ 'అమరావతి' మహానగరంగా రూపుదిద్దుకుంటున్నది.

ప్రముఖ సాహితీవేత్త, నిరంతర జిజ్ఞాసపరుడు వావిలాల సుబ్బారావు అమరావతి ఆర్.వి.వి.ఎన్. కాలేజీలో పనిచేశారు. 'చలం కథానికలు-అనుశీలన' వీరి సిద్ధాంత గ్రంథం. ఆచార్య నాగార్జునుడి లేఖలు వ్యాఖ్యాన సహితంగా అనువదించారు. ధాన్యకటక బుద్ధవిహార ట్రస్టు అధ్యక్షుడిగా నాగార్జున విగ్రహం, శాతకర్ణి విగ్రహం అమరావతిలో వేయించారు. నివాసం అమరావతి. ఫోన్: 9866402973

తెలుగు నేలపై జాతక కథలు

డా. ఈమని శివనాగిరెడ్డి
స్థపతి



సంబోధిని పొందక ముందు, బోధిసత్వు (సిద్ధార్థు)ని పూర్వజన్మల గురించి తెలిపే 547 కథలనే జాతక కథలని బౌద్ధ సాహిత్యం తెలియజేస్తుంది. బుద్ధుని బోధలను సుత్తపిటకం, వినయపిటకం, అభిధమ్మ పిటకం అని త్రిపిటకాలంటారు. వీటిలోని సుత్త పిటకంలోని పాలీ (ప్రాకృత) భాషలో నున్న బుద్ధ కనికాయం అనే విభాగంలో జాతక గ్రంథమొకటి. మానవుల ప్రవర్తనలోని ప్రస్తుత వైఫల్యాలకు, గత జన్మలలో కూడా వారిలో ఉన్న అటువంటి లక్షణాలను గుర్తించి, ఒకే విధంగా ఉన్న ఆ రెండు కథల నుంచి నేర్చుకోవాల్సిన నీతిని చూపించటమే జాతక కథల ముఖ్యోద్దేశం. ప్రతి జాతక కథ దానిని చెప్పవలసి వచ్చిన సందర్భాన్ని సూచిస్తూ మొదలై, మధ్యలో బోధిసత్వుని పూర్వజన్మ కథను కలిగి ఉంటుంది. కథ చివరన బుద్ధుడు, వర్తమానంలోని వ్యక్తులను, పూర్వజన్మ కథలో గుర్తించి, ఆ జన్మలో ఎవరు ఎలా జన్మించారో తెలుపటంతో జాతక కథ ముగుస్తుంది. గత జన్మల నుంచి సంప్రాప్తమైన లక్షణాలతో, సంకీర్ణమైన కారణ-కార్యసూత్రం జీవరాశిలో ఏ విధంగా పనిచేస్తుందో చెప్పటమే కథావస్తువుగా సాగుతుంది జాతక కథ. మానవులు, ఇతర ప్రాణుల మధ్య ఎలాంటి భేదభావాన్ని చూపక, ప్రాణిక ఏకతను చాటుతూ, బుద్ధుడు బోధించిన అనిచ్చ (అనిత్య), దుక్క (దుఃఖ), అనత్త (అనాత్మ) అనే మూడు లక్షనాలు, పది శీలగుణాలు, నాలుగు ఆర్య సంఖ్యలతో కలిపి నైతిక బోధ ప్రధానాంశంగా సాగుతాయి జాతక కథలు.

ఒక పాఠకుడు ఎరుకతో సంకల్పించి నైతిక, ధార్మిక పురోగతిని సాధించి, సంసారంలోని ఇబ్బందులను అధిగమించి, ప్రశాంతమైన ఎల్లలులేని బుద్ధత్వాన్ని పొందే పరిణామాన్ని జాతక కథలు వివరిస్తున్నాయి. ఈ మనోహరమైన కథలు చిరకాలం ఉండే విధంగా బార్హుత్, గాంధారి, అమరావతి, నాగార్జునకొండ, గోలి, అజంతా గుహలు, చైనాలోని డుకుహాంకు గుహలు, జపాను, మధ్య ఆసియా, టిబెట్ దేశాల విహారాల్లో వర్ణచిత్రాలు, శిల్పాలుగా తీర్చిదిద్దబడినాయి.

శ్రీలంకలోని అనూరాధపురంలో మహావిహారంలో నున్న ఫలితం పూర్వ జాతక అట్ట కథలను అనుసరించి ఆచార్య బుద్ధ ఘోషుడు జాతక అట్ట కథలను రాసిన గ్రంథ ఆరంభంలో త్రిరత్నాలకు నమస్కరించి ఇలా తెలియజేశాడు. 'లోకనాధుడైన బుద్ధుడు, వేల కోట్ల జన్మలుగా ఈ లోకానికి అంతులేని హితాన్ని చేకూర్చాడు. ఆయా కారణాలను బట్టి ఆ ప్రకాశ స్వరూపుడు, శ్రీపణ్ణిక మొదలైన జాతకాలను బోధించాడు.

వాటన్నిటినీ ఒకచోట కూర్చి, ధర్మ సంగ్రాహకులు సంగీతిలో వాటికి జాతకం అని పేరు పెట్టారు. క్షత్రియ వంశంలో జన్మించి, దుఃఖ విముక్తికి మార్గాన్ని తెలిపిన బుద్ధదేవుని చరిత్రను, శుద్ధ బుద్ధులైన భిక్షువుల చరిత్రను చెపుతూ, అచింతమైన ఆయన శక్తిని ప్రకాశింపజేస్తూ మహా విహార వాసుల పద్ధతిని అనుసరించి జాతక అర్థవర్ణన చేస్తాను. సాధువులైనవారు శ్రద్ధతో గ్రహింతురుగాక.' ఈ విధంగా జాతక కథల వివరాలు మనకు తెలిశాయి.

బోధిసత్వుడు బుద్ధుడు కావటానికి ఆచరించి సాధించ వలసిన పది పారమితల (దాన, శీల, క్షాంతి, వీర్య, సమాధి, ప్రజ్ఞ, త్యాగ, పత్య, కరుణ, సమధ)ల ప్రాముఖ్యత గురించి బోధించటమే జాతక కథల ప్రధాన ఉద్దేశంగా చెప్పబడింది. బౌద్ధారామాల్లో ప్రతి పున్నమినాడు జాతక కథలను మననం చేసుకోవటం ఆనవాయితీ. తెలుగు నేలపై అమరావతి, నాగార్జునకొండ, గోలి, ఫణిగిరి మొదలైన బౌద్ధ స్థావరాల వద్ద జాతక కథలను, కట్టడ భాగాలపై కథనశైలిలో చెక్కారు. ఉపాసకులు ఆయా బౌద్ధ స్థావరాలకు వెళ్లినపుడు, అక్కడ చెక్కి ఉన్న జాతక కథల గురించి భిక్షువులు వివరించి చెబుతారు. వీరిని జాతక భాణకులంటారు.

తెలుగు నేలపై గల 50 జాతక కథల్లో దీపంకర, కట్టహారి, మాతకభట్ట, నలపాన, వనరింద, రుష్యశృంగ, శశ, అహిగుండక, దిఘితి కోసల, కళింగ, ఘటపండిత, కునాభ, కాకతి, మహా పదుమ, మహాహంస, శిబి, మాతంగ, శంఖపాల, మహాసుత సోమ, విదుర పండిత, శిగ్రాధమృగ, చద్దంత, కూర్మ అవదాన, మాంధాత, మహాకపి, చంపేయ, శ్యామ, మహాయగ్గ, అశ్వముఖి, దశరథ, కవికుమార, సువర్ణ ప్రభాస (మోర), లోసక, మత్స్య, కురుగమృగ, మహిష, తిమింగళ, హస్త సింహళావదాన మరియు వెస్సంతర ముఖ్యమైనవి. వ్యాస విస్తరణ భీతి చేత ఈ 50 జాతక కథలను ఇక్కడ వివరించటం సాధ్యం కాదు కనుక మచ్చుకు రెండు జాతక కథలను వివరిస్తున్నాను.

పల్నాడులోని గోలి అనే గ్రామంలోని స్థూపం వద్ద గుర్తించి

ప్రస్తుతం చెన్నై మ్యూజియంలో నున్న వేస్సంతర జాతక కథన శిల్పం అమరావతి శిల్పకళకే తలమానికం. బుద్ధుడు ఒకప్పుడు సంజయ మహారాజు, రాజకుమారునిగ జన్మించాడు. అతడు వైశ్య వీధిలో, వైశ్య బృందం నడుమ జన్మించుట చేత వైశ్యాంతరుడు (వెస్సంతరుడు) అని పిలిచారు. వెస్సంతురుడుకి అడిగినవారికి కాదనకుండా ఇచ్చే దానగుణం అబ్బింది. తానున్నచోట కరువు అనేది రానీయకుండా, వెస్సంతరుని వద్ద ఒక తెల్ల ఏనుగు ఉండేది. ఈ సంగతి తెలుసుకొన్న కళింగ దేశపు బ్రాహ్మణులు, కళింగంలో కరువు రాగా, ఆ ఏనుగును దానమడుగగా వెస్సంతరుడు వెంటనే దానిని వారికి దానం చేశాడు.

ఈ సంగతి తెలుసుకున్న ప్రజలు ఆగ్రహించి, అమూల్యమైన తెల్ల ఏనుగును దానం చేసిన వెస్సంతరుని రాజ్యం నుండి వెళ్లగొట్టమని సంజ మహారాజును కోరగా, ఆయన వెస్సంతరుని భార్య మాద్రి, పిల్లలతో సహా రాజ్యబహిష్కరణ చేశాడు. వెస్సంతరుడు భార్యాపిల్లలతో అడవుల్లో నివసిస్తుండగా కొందరు బ్రాహ్మణులు అతన్ని సమీపించి దానం కోరగా, తన రథాన్ని, గుర్రాలను, ఇద్దరు పిల్లల్ని దానం చేశాడు. ఇతని దాతృత్వాన్ని పరీక్షించదలచిన శక్రుడు (ఇంద్రుడు) మాయా బ్రాహ్మణ వేషంలో వచ్చి, అతని భార్యను దానం అడుగగా, వెస్సంతరుడు ఆమెను వెంటనే అతనికి ఇచ్చేశాడు. దాతృత్వానికి మెచ్చిన శక్రుడు, నిజరూపంలో ప్రత్యక్షమై, అతని భార్యను అతనికి తిరిగి ఇచ్చేశాడు. తరువాత వెస్సంతరుని తండ్రి, పిల్లలను దానంగా పొందిన బ్రాహ్మణులకు వారడిగినంత ధనాన్నిచ్చి, ఇద్దరు పిల్లలను విడిపించాడు. పిల్లలను తీసుకొని వెస్సంతరుని, అతని భార్యను కలిసి తన రాజ్యానికి తీసుకొని పోవటంతో కథ సుఖాంతమైంది. ఒక శిలాఫలకంలో వెస్సంతరుడు, దానం చేసేపుడు కావలసిన జలకుండిక, జలపాత్ర, పరిజనంతో పాటు తెల్ల ఏనుగుపైన తన దానగృహానికి వెళ్లటాన్ని అత్యంత సుందరంగా చెక్కారు. నాలుగో శిల్పంలో కరువు వచ్చిన కళింగదేశానికి చెందిన 8 మంది బ్రాహ్మణులు, కరువును పారదోలటానికి ఏనుగును దానమడుగగా, అతడు నీరు పోస్తూ ఏనుగును దానం చేస్తున్న దృశ్యం; ఐదో శిల్పంలో రాజ్య బహిష్కృతుడైన వెస్సంతరుడు గుర్రాలు లాగుతున్న రథంలో తన భార్యాపిల్లలతో అడవులకు వెళ్లటాన్ని; ఆరో శిల్పంలో రథాన్ని, భార్యను, బిడ్డలను దానం చేయటం; ఏడోదీ, ఆఖరిదీ అయిన శిల్పంలో దానం తరువాత బ్రాహ్మణుడు ఎడమచేత గొడుగును పట్టుకొని, కుడిచేత్తో తన

కర్రతో పిల్లలను కొట్టుకొంటూ ఇంటికి తీసుకెళుతూ రాజ ప్రాసాదం గుండా పోవటం, అప్పుడు రాజు తన మనుమలను విడిపించుకొని తన తొడపై కూర్చుండబెట్టుకొనుట చెక్కబడినవి. ఎందుకో ఇందులో భార్యను శక్రునికి దానమివ్వటం, తరువాత వెస్సంతరుడు తన భార్యతో రాజ్యానికి తిరిగి వచ్చిన దృశ్యాలు చెక్కబడలేదు.

ఈ విధంగానే చద్దంత జాతకం కూడా గోలిలో అద్భుతంగా చెక్కబడింది. ఈ కథలో బుద్ధుడు ఒకసారి ఆరు దంతములు (షడ్డంత-చద్దంత) గల గజరాజముగ పుట్టాడు. ఆ గజరాజుకు ఇద్దరు భార్యలు. చిన్న భార్య పట్ల మక్కువ పెంచుకొన్న ఆ గజరాజు పట్ల పెద్ద భార్య కక్ష పెంచుకుంది. ఆమె చనిపోయి, స్త్రీగా పుట్టి కాశీరాజుకు భార్య అయింది. ఆ కాశీరాజు ఈమె పట్ల అమితమైన ప్రేమను పెంచుకొన్నాడు. ఈమె గత జన్మ స్మృతి కలిగి, తనకు భర్తగా ఉన్న ఆరు దంతములు గల ఏనుగుపై పగ తీర్చుకోవాలనుకొంది. తనకు జబ్బుగా ఉందని నటించి, తానొక కలగన్నానని, అందులో ఆరు దంతాలు గల ఏనుగును చూచానని, ఆ ఏనుగు దంతాలను తెచ్చి ఇచ్చినచో తన జబ్బు నయమౌతుందని చెప్పగా, ఆ కాశీరాజు శోణుత్తరుడనే వేటగానిని హిమాలయ పర్వతాలకు పంపుతాడు. అతడు ఆ ఏనుగును పట్టుకోవటానికి ఒక గోతిని తవ్వగా, ఆ దారిని వచ్చిన ఆరు దంతముల ఏనుగు ఆ గోతిలో పడింది. ఆ వేటగాడు ఆ ఏనుగును చంపటానికి ప్రయత్నిస్తుండగా విషయం తెలుసుకొన్న చద్దంతుడు స్వయంగా తన ఆరుదంతాలను కోసుకోవటానికి సహకరిస్తుంది. వాటిని తీసుకొని వెళ్లి రాణికి ఇవ్వగా, అయ్యో తన భర్త మరణించెనా అని వగచి, గుండె పగిలి మరణిస్తుంది. ఈ శిల్పంలో మొదట ఏనుగు మోకాళ్లపై వంగి కూర్చోగా, వేటగాడు దంతములను రంపంతో కోయటం, రెండో ఫలకంలో కాశీరాజు ఒళ్లో భార్యను కూర్చోబెట్టుకొని ఉండగా, వేటగాడు తెచ్చిన దంతాలను చూసి ఆమె గుండె పగిలి చనిపోవటం హృద్యంగా మలచబడినవి. ఈ విధంగా వెస్సంతరం జాతకం దానగుణాన్ని, చద్దంత జాతకం క్షాంతి (ఓర్పు), దానగుణాన్ని ప్రతిబింబించాయి. తెలుగు నేలపై చెక్కిన మిగిలిన జాతక కథన శిల్పాలు కూడా బోధిసత్వుడు ఆచరించవలసిన దశ పారమితలకు అద్దం పడుతూ, తెలుగువారి జీవనవిధానంలో నైతికవర్తనం, సశ్శీలాలను పెంపొందించుకోవటానికి తోడ్పడినాయి. అంతేకాదు, మధుర, గాంధార శిల్పకళలో కంటే అమరావతి శిల్పకళలో చెక్కిన జాతక కథన శిల్పాలు వాస్తవానికి దగ్గరగా, ఆకట్టుకొనేలా తీర్చిదిద్దబడి ప్రపంచ కళా వేత్తల ప్రశంసలందుకొన్నాయి.

డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి దేవాలయ పునర్నిర్మాణ ప్రక్రియలో నిష్ణాతులు. ఆలంపురం, సోమశిల, నల్గొండ, రామప్ప దేవాలయాల పునర్నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పురావస్తు శాఖలో స్థపతిగా పనిచేసి పదవీ విరమణానంతరం కొత్త రాజధాని అమరావతిలో ప్రభుత్వానికి సలహాదారుగా సేవలు అందిస్తున్నారు. గౌతమీపుత్ర శాతకర్ణి, కొండవీటి రెడ్డిరాజులు వంటి అనేక చారిత్రక గ్రంథాలు రచించారు.

email: drreddynithm@gmail.com

మన సంస్కృతి వైభవానికి ఆనకొళ్లు శాసనాలు

డా. పి.వి. పరబ్రహ్మశాస్త్రి ఇంటర్వ్యూ

***భా**రతదేశంలో మరెక్కడా లభ్యం కానన్ని శాసనాలు తెలుగు నేలమీద దొరికాయి. చరిత్ర గుండె చప్పుడుగా వినిపించే ఈ శాసనాల ద్వారా తెలుగు లిపి, భాషా వికాసాన్ని తెలుసుకోవచ్చా?*

భాష లేనిదే జాతికి ఉనికి లేదు. అన్యభాషల ప్రభావం మితిమీరడంతో ప్రస్తుతం తెలుగు ఎన్నడూ లేనన్ని సమస్యలు ఎదుర్కొంటోంది. ప్రతి తెలుగువాడూ భాషా మూలాల పరిరక్షణకు కంకణం కట్టుకోవాల్సిన దశలో శాసనాల ప్రస్తావన ఉత్తేజం కలిగిస్తోంది. భట్టిప్రోలు శాసనం మొదలు బెజవాడ యుద్ధమల్లని శాసనం వరకూ లభించిన శాసనాలన్నీ తెలుగు లిపి, భాషా పరిణామ, వికాసాలకు అద్దం పడతాయి. నిజానికి పత్తిప్రోలు (పత్తిని నిల్వ చేసే ప్రాంతం) అన్న మాట క్రమంగా భట్టిప్రోలుగా మారింది. క్రీ.పూ. మూడో శతాబ్దానికి చెందిన భట్టిప్రోలు శాసనం తెలుగు లిపికి సంబంధించిన మొట్టమొదటి శాస్త్రీయ ఆధారం. ఈ శాసనంలోని దాదాపు ప్రతి అక్షరంలోనూ 'అ'కార ప్రయోగం, శబ్దం కనిపిస్తుంది. తెలుగు లిపికి ప్రాణప్రదమైన తలకట్టు ప్రయోగాన్ని తొలిసారిగా ఈ శాసనంలోనే గమనించవచ్చు. తెలుగు ప్రాచీనత నిరూపించడం కోసం అశోకుడికి కాస్త ముందు కాలంనాటి ఈ శాసనాన్ని తరచి చూస్తే చాలు. ఉత్తరాదిలో ఎక్కడా కనిపించని 'ళ' అక్షరమూ ఈ శాసనంలోనే సాక్షాత్కరిస్తుంది.

'నా విషఃపృథ్వీపతి' అని నమ్మినన్నాళ్లూ రాజులు, రాజా స్థానాల కథలే చరిత్రగా చలామణీ అయ్యాయి. రాజుల రోజుల లెక్కలు తేల్చిన మీరు- ప్రాచీనాంధ్ర గ్రామీణుల జీవనం మీదా అంతే సాధికారికంగా స్పందించారు. తెలుగు జాతి ఎలా బతికిందో తెలిపే సాంఘిక చరిత్రలు తక్కువ. తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలను శాస్త్రీయంగా వెలికి తీసే సాధనాలేవైనా ఉన్నాయా?

మన తాత ముత్తాతలు ఎలా ఉన్నారో, ఏం తిన్నారో, ఎలాంటి విశ్వాసాలతో జీవించారో, వారి ఆటపాటలెలాం టివో, రోగాలొస్తే ఎలాంటి చికిత్సలు పొందారో తెలియజెప్పని చరిత్రకు విలువ లేదు. జనం గురించి మాట్లాడకుండా చరిత్ర చెబితే అది నేల విడిచి సాము చేయడమే అవుతుంది. పూర్వచరిత్రలను బట్టి ఆయా ప్రాంతాలకు స్థిరపడిన నామ ధేయాలను విశ్లేషిస్తే మన ముందు అద్భుతమైన ప్రాంతీయ చరిత్రలు సాక్షాత్కరిస్తాయి. పునాది స్థాయిలో వెల్లివిరిసిన

నివాళి

చరిత్రలోని మంచి చెడ్డలను, నిమ్నోన్నతాలను తెలియజెప్పేందుకు ప్రయత్నించిన అతికొద్దిమంది చారిత్రక పురావస్తు పరిశోధకుల్లో పుచ్చా వాసుదేవ పరబ్రహ్మశాస్త్రి ఒకరు! నేలమాళిగల్లో దాగిన ఎన్నో శాసనాలను వెలికితీసి, చదివి, వ్యాఖ్యానం చెప్పి ఆకాశమంత చరిత్రను తెలుగువారికి పరిచయం చేసిన విఖ్యాత పరిశోధకులాయన. మెరుగైన రవాణా సదుపాయాలు, కెమెరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వంటి హంగులేవీ లేని కాలంలోనే మారుమూల పల్లెలకు కాలి నడకన వెళ్లి చారిత్రక ఆనవాళ్లను వెలికితీసిన పీబీ శాస్త్రికి భాషా సంస్కృతు లతో అసాధారణ ప్రేమానుబంధం ఉంది. చరిత్రతో పాటు లిపి పరిణామక్రమాన్నీ ఆపోసనపట్టిన పరబ్రహ్మ శాస్త్రి శాసనాలన్నింటినీ చదవగల ఏకైక మేధావిగా గుర్తింపు పొందారు. చరిత్రను కాలగర్భంలో మలిగి పోనివ్వకుండా నేలపొరలను తవ్వి భావితరాలకు దోసిళ్ల నిండా జ్ఞానం పంచిన పరబ్రహ్మశాస్త్రికి శాసనాలే లోకం!

భారతీయ లిపులను, పద స్వరూపాన్ని, వాటి అర్థాలను, అన్వయాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి నిరంతరం చరిత్రతో సంభాషిస్తూ, శాసనాలనే శ్వాసిస్తూ బతికిన పరబ్రహ్మశాస్త్రి 2016 జూన్ 27న తుదిశ్వాస వదిలారు. ఆయన తుదిశ్వాస విడవడానికి సరిగ్గా ఒకరోజు ముందు (జూన్ 26) 'తెలుగు వెలుగు' మాసపత్రికకు ఇచ్చిన ముఖాముఖీ ఇది.

ఈ స్థానిక చరిత్రలన్నింటినీ గుదిగుచ్చితే అఖండ భారత చరిత్ర ఆవిష్కృతమవుతుంది. 'కోలు' అనే బ్రిటిష్ అధికారి పనిచేశాడు కాబట్టి 'కొల్లూరు' అనే గ్రామం పేరు ఏర్పడిందని; రేవు పక్కన (సముద్రం) ఉంటుంది కాబట్టి 'రేపల్లె' అనే ఊరి పేరు స్థిరపడిందని; తామ్ర యుగంలో ఆవుల మందలను రేవు పక్కన మేపుకొనే వారు కాబట్టి ఆ ప్రాంతాన్ని 'ఆలేరు' అని పిలిచారని ఎంతమందికి తెలుసు? ఇదే విధంగా పల్లెల్లో ఉపయోగించే వివిధ పరికరాలకు ఆ పేర్లు ఎలా స్థిరపడ్డాయి, తినే తిండిని, పండించే ధాన్యాన్ని విభిన్నమైన పేర్లతో ఎందుకు పిలుస్తున్నారు వంటి విశేషాలను తవ్వి తీస్తే తెలుగుజాతి అఖండ సామాజిక చరిత్ర మనముందు నిలుస్తుంది. మూలచరిత్రలను సరిగ్గా అర్థం చేసుకుంటేనే తెలుగు భాషా సంస్కృతులకు సంబంధించిన సంపూర్ణ స్వరూపం కళ్లకు కడుతుంది. తెలుగుభాషలోని అనేక పదాల మీద సమగ్ర వ్యుత్పత్తి పదకోశం తీసుకురావాలి. ఉదాహరణకు 'ముంగిలి', 'లోగిలి', 'వాకిలి' వంటి పదాల్లో 'గిలి' అంటే ఇల్లు అని అర్థం. దానికి ముందు ఒక అక్షరాన్ని చేర్చడం ద్వారా అర్థం మారుతోంది. ఇలాంటి పదాలు తెలుగులో కోకొల్లలు. ముందు తరాలకు వీటన్నింటి గురించి విడమరచి చెప్పాలి. విస్తృతమైన వ్యుత్పత్తి పదకోశంతోనే అది సాధ్యం!

మూలాలకు వెళ్లి ఎంతో లోతున పూడిపోయిన మన సామాజిక చరిత్రను తవ్వి తీయడం మామూలు విషయం కాదు. అందుకు నిరంతర పరిశోధన కావాలి, వేల సంఖ్యలో ఉన్న మన శాసనాలు, నాణేలు ఈ పరిశోధనకు ఎంతవరకు ఉపకరిస్తాయి; వాటిని చదివి మీ తరహాలో ముందు తరాలకు అర్థం చెప్పగలవాళ్లు ఎంతమంది ఉంటారు?

మిగిలిన భాషలతో పోలిస్తే తెలుగువాళ్లలో చరిత్ర, సంస్కృతి పట్ల పరిశోధనాసక్తి బాగా తక్కువ. శాసనాలను చదివి అర్థం చేసుకోగలవాళ్లు మన దగ్గర నిజానికి వేళ్ల మీద లెక్కపెట్టగల సంఖ్యలోనే ఉన్నారు. వీరి సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక కృషి జరగాలి. చారిత్రక స్పృహ కోల్పోవడంవల్ల సంస్కృతీ సంప్రదాయాలపట్ల అవగాహన కొరవడుతోంది. దానివల్ల మన నిత్య జీవనం సంక్షోభంలో పడుతోంది. పోలీసు స్టేషను, న్యాయస్థానాలు వంటి ఆధునిక వ్యవస్థలు లేని రోజుల్లో సామాజిక క్రమశిక్షణ ఎలా సాధ్యపడింది? అబద్ధం చెప్పరాదు, దొంగతనం చేయరాదు, స్త్రీలను గౌరవించాలి వంటి అలిఖిత నిబంధనలను ఆ కాలంలో ప్రజలు తు.చ తప్పకుండా పాటించేవారు. తాంబూలం తీసుకుని ఒప్పందాలు ఖరారు చేసుకోవడం ఆనాటి పద్ధతి. వివాహాది శుభకార్యాలు సహా భూ తగాదాల పరిష్కారం, క్రయ విక్రయాలన్నీ ఆకు వక్క పుచ్చుకోవడంతోనే పూర్తయ్యేవి. పెద్దమనుషుల సమక్షంలో కుదిరిన 'తాంబూలం' కట్టుబాటును అప్పట్లో ఉల్లంఘించినవారు దాదాపుగా లేరు. తాంబూలం తీసుకోవడమన్నది తెలుగువాళ్ల నమ్మికగా, సంస్కృతిగా శతాబ్దాలపాటు కొనసాగింది. వరంగల్ జిల్లాలోని కొండపర్తి శాసనంలో 'తంబుల శ్రవంబు చేసిన భూమి' (తాంబూలం స్వీకరించడం ద్వారా కొనుగోలు ఒప్పందం

పూర్తయిన భూమి) అని స్పష్టంగా ప్రస్తావించారు. తెలుగువారి సాంస్కృతిక వైభవాన్ని, నైతిక ఔన్నత్యాన్ని చాటిన ఇలాంటి శాసనాలను విస్మరించడమంటే... మన చరిత్రను మనం వదిలేసుకోవడమే! ఆ ఘన సంప్రదాయాలను విస్మరించాం కాబట్టే ఒకప్పుడు తాంబూలంతో పూర్తయిన విషయాలను ఇప్పుడు కోర్టులదాకా లాగి వాటి చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితిలో పడిపోయాం.

ప్రాచీన కాలం నుంచీ ప్రజల పలుకుబడిలోనే తెలుగు సజీవంగా ఉంటోందన్నది నిజం. అయితే భాషాపరిరక్షణకు అధికార స్థాయిలో కృషి జరిగిన దాఖలాలేవైనా మన చరిత్రలో ఉన్నాయా?

తెలుగుభాషను కాపాడేందుకు నిజానికి శాతవాహనులు, కాకతీయులు వంటి రాజ వంశాలు పెద్దగా చేసిందేమీలేదు. అధికారంలో ఉన్నవారి అండదండలతో కాకుండా జన సామాన్యానికి దగ్గరైన, వారి హృదయాలకు హత్తుకున్న భాషానే తెలుగు శతాబ్దాలుగా మనగలుగుతోంది. పాలపాభాషగా ప్రజల భాషను ప్రోత్సహించిన రాజులు బాగా తక్కువ. ఎంతటి వారినైనా కట్టిపడేసే జీవ లక్షణం మన భాషకు ఉంది. కాబట్టే ఏ రాజులూ పనిగట్టుకుని ప్రోత్సహించకపోయినా అది ప్రవహిస్తోంది. అయితే రాజరాజ నరేంద్రుడు మాత్రమే తెలుగు భాషకు పట్టం కట్టేందుకు గట్టిగా పూనుకొని కృషిచేశారు. ఆ తర్వాత విజయనగర రాజులు తెలుగుకు మంచి ప్రాధాన్యమిచ్చి ప్రోత్సహించారు.

తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలపట్ల సహేతుక అవగాహనకు ఉపకరించే ఆధారాలను మనం ఎంతమేరకు పరిరక్షించుకోగలిగాం?



క్రీ.శ. 930 నాటి బెజవాడ యుద్ధమల్లుడి శాసనం

అమరావతి అపురూప శిల్పకళా సంపద ఇప్పటికే విదేశాలకు తరలిపోయింది. మన ఘన వారసత్వానికి అద్దంపట్టే ఎన్నో రుజువులను వదిలేసుకున్నాం. మద్రాసు మ్యూజియంలో మన తామ్ర శాసనాలు రెండొందల వరకూ మూలుగుతున్నాయి. వాటిని తిరిగి తెచ్చుకోవాలన్న స్పృహే ఎవరికీ లేదు. మన జాతి భాషా సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఆ శాసనాలను తెలుగు నేలకు తరలించాలని మాలాంటి పరిశోధకులు కొంతమంది కోరుతున్నా ఏనాడూ ప్రభుత్వాలకు ఆ ఊసు పట్టలేదు. మన చరిత్రకు పూర్ణరూపమిచ్చే క్రమంలో ఇలాంటి ఎన్నో ఆధారాలు సేకరించాల్సి ఉంది. మరీ ముఖ్యంగా మన దగ్గర ప్రాచీన భాండాగారాల్లో అత్యంత విలువైన చారిత్రక పత్రాలను, నాణేలను, శాసనాలను మ్యూజియంలోని స్ట్రాంగ్ రూంలో భద్ర పరచి తాళమేస్తుంటారు. ఔత్సాహికులకుగానీ, పరిశోధకులకు గానీ వాటిని అందుబాటులో ఉంచరు. ప్రాచీన శాసనాలను లోతుగా అధ్యయనం చేసినకొద్దీ కొత్తకోణాలు బయటపడతాయి. భాషాసంస్కృతులకు సంబంధించిన నూతన కోణాలు వెలికి వస్తుంటాయి. ప్రాచీన శాసనాలు, నాణేలను ఇలా ఎవరికంటా పడకుండా స్ట్రాంగ్ రూంలో తాళమేసి పెడితే, ఇక వాటిమీద తదుపరి అధ్యయనాలకు అవకాశం ఎక్కడుంటుంది? మ్యూజియాల్లో నిక్షిప్తమైన ఈ ప్రాచీన సంపద మీద పరిశోధన నిరంతరంగా కొనసాగాలి. అందుకోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసి ప్రోత్సహించాలి. రాష్ట్ర విభజన తర్వాత ఈ ప్రాచీన భాండాగారాల్లో నిక్షిప్తమైన పుస్తకాలను, శాసనాలు, నాణేలనూ ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం పంచుకోవాల్సి ఉంటుంది. ఏ ప్రాంతానికి సంబంధించిన శాసనాలు, నాణేలను ఆ ప్రాంతానికి తరలించి- ప్రత్యేకంగా భద్ర పరచాలి. మన ప్రాచీన ప్రతీకలపట్ల సహేతుక అవగాహన కలిగినవారిని ఈ పనికి నియమించాలి.

దేశంలో పారిశ్రామిక విప్లవం, హరిత విప్లవం వంటి వాటి గురించి విన్నాం. భాషా సంస్కృతుల పరిరక్షణకూ అలాంటి విప్లవం ఒకటి ప్రారంభం కావాల్సి ఉందంటారా?

శతాబ్దాల పరిణామక్రమంలో తెలుగు భాష, సంస్కృతి ప్రస్తుత రూపం సంతరించుకున్నాయి. భాషా సంస్కృతుల పూర్వ రూపాలను వేగంగా విస్మరిస్తుండటం తెలుగుజాతి ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాలు. ఇప్పటికే ఎంతో చరిత్రను కోల్పోయాం. ఎంత చరిత్రను కాలగర్భంలో కలిపేశామన్న అవగాహన కూడా మనవారికి లేదు. ఆ విషయం తెలియజెప్పేవారూ ఇప్పుడు మన ముందు లేరు. మూలాలను పదిలంగా కాపాడుకుని ఆ పునాదుల మీద భవ్యమైన భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన బాధ్యత మన మీద ఉంది. కూచిపూడి భాగవతుల నాటకాలు ఇప్పుడు మచ్చుకు కూడా కనిపించడం లేదు. వారు అప్పట్లో విస్తృతంగా ప్రదర్శించిన ప్రహ్లాద నాటకాలు, రుక్మాంగద వాటిని తరచి చూస్తే విస్మరించిన సాంస్కృతిక భాషా చరిత్ర కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. సురభి నాటకాలకు మళ్లీ ప్రాణం పోయాలి. ఈ నాటకాలను రవీంద్ర భారతి వంటిచోట్ల కాకుండా జిల్లా కేంద్రాల్లో, మండలాల్లో, గ్రామాల్లో సామాన్య ప్రజల ముందు ప్రదర్శించాలి. అప్పుడే తెలుగు సంస్కృతులు పునాది స్థాయిలో వికసించి, విస్తరిస్తాయి.

ఏ దేశమేగినా... ఎందు కాలిడినా... తెలుగే!

ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు

ప్రవాసం, ప్రయాణం బహుశా తెలుగుజాతి రక్తంలోనే ఉన్నాయి. వర్తకులుగా సముద్రాలు దాటి ప్రపంచాన్ని చుట్టారు. మతధర్మాలను ప్రచారం చేస్తూ దేశదేశాలు తిరిగారు. వేల మైళ్లకు ఆవల సామ్రాజ్యాలు స్థాపించారు. బానిసలుగా పుట్టిన గడ్డను వీడి ఎక్కడో నాటుకున్నారు. కూలీలుగా కొత్త తీరాలు చేరుకుని పంటలు పండించారు. నిర్మాణశిల్పులుగా అద్భుతాలు సృష్టించారు. వేగులుగా, సంచార జీవులుగా తెలుగు కళలను ప్రచారం చేశారు. వందల ఏళ్లు గడచినా, ఏ నేలన పుట్టి పెరిగినా తెలుగు మూలాలను మాత్రం ఎన్నడూ మరువలేదు. తెలుగు నేలకు దూరమై తరాలు దాటినా వారసత్వంగా తమ పిల్లలకు తెలుగు సంస్కృతిని అందిస్తూనే ఉన్నారు. తెలుగుభాషను, తెలుగు ఆచారాలను, తెలుగు కట్టుబొట్టులను కాపాడుకునే ప్రయత్నంలో ఎన్నో ఆటుపోట్లు, సంఘర్షణల నడుమ ప్రవాస తెలుగుజాతి జీవనం సాగుతోంది.

రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దులు దాటి దేశంలో ఏ మూలకు వెళ్లినా, ప్రపంచంలో ఏ దేశాన అడుగుపెట్టినా తెలుగు ముఖం పలకరిస్తుంది. తెలుగు పలుకు వినిపిస్తుంది. తెలుగు జాడ కనిపిస్తుంది. బహుశా స.వెం. రమేశ్ పరిచయం తర్వాత నా చూపులో వచ్చిన తేడా ఇది. ఒకసారి గ్యాంగ్‌టక్ నుంచి నాథులాపాస్‌కు బయలుదేరాం, జోరు వాన జారుతున్న కొండచరియలు. మా వాహనంలో ఇద్దరు సైనికులు. రోడ్డు కొట్టుకుపోయి రాళ్లు తేలిన బాటలో వాననీటి ఒరిపిడికి టైర్లు పట్టు తప్పుతున్నాయి. క్షణం ఏమారితే లోయలోకి జారిపోవాల్సిందే. గడ్డ కట్టిపోయే చలి. గోడ కట్టినట్టున్న పొగమంచు. ఊపిరి అందడంలేదు. ఎగశ్వాస దిగశ్వాసగా ఉంది. మిట్ట మధ్యాహ్నపు చీకటిలో సరిహద్దులకు చేరుకున్నాం. కంచె అవతల లీలగా కదులుతున్న ఆకారాలే చైనా సైనికులు అని చెప్పారు. ప్రాణాలు పిడికిట్లో పెటుకుని చూస్తూ ఉండగా హిందీ హెచ్చరికల నడుమ తియ్యటి తెలుగుమాట వినిపించింది. జారిపోతున్న ప్రాణం లేచి వచ్చినట్లయింది. చిత్తూరు జిల్లా కుర్రవాడు. నెత్తురు ఐసుగడ్డగా మారేచోట దేశానికి పహారాగా ఉన్నాడు. తిరిగి వెనక్కి ధైర్యంగా ప్రయాణించడానికి ఆ తెలుగు పలకరింపు శక్తిని ఇచ్చింది. ఇంకో సందర్భం గుర్తు చేసుకుంటాను. మూనార్ కొండలు దిగుతుండగా కాళ్లకు చుట్టుకున్న జలగలను వదిలించుకోవడానికి ఒక చెరకు గానుగ దగ్గర ఆగాం, జలగలు కుట్టిన పాదాల్లోంచి నెత్తురు

బొట్లు రాలుతున్నాయి. కాళ్లకి ముక్కుపొడి పూసుకోని నడిస్తే ఇవి పట్టుకోవు అంటూ పాదాలు కడుక్కోవడానికి నీళ్లు ఇచ్చిన రైతు నోటి వెంట విన్న తెలుగు మాటలు, ఆయన ఆడిస్తున్న బెల్లం కన్నా తియ్యగా ఉన్నాయి. అతను తెలుగువాడు కాదు. 'ఈ పక్కనంతా తెలుగు పల్లెలు ఉండాయి సార్,' అన్నాడతను. మలేసియా విమానాశ్రయంలో బయటకు వెళ్లే తోవ దగ్గర కాస్త తికమక పడుతూ ఉంటే, 'ఇక్కడ పొండి' అని చేయి చూపాడు ఒక భద్రతా ఉద్యోగి. ఆ పక్కనే వాష్‌రూమ్ శుభ్రపరచడానికి బయట ఉన్న మహిళను పలకరించాడు స.వెం. రమేశ్. చక్కని తెలుగులో మాట్లాడింది. మేము తిరిగిన ప్రతి దేశంలోనూ ఇటువంటి అనుభవాలు ఎన్నో ఎదురయ్యాయి.

మారిషస్ దీవిలో గెస్ట్‌హౌస్‌గా మారిన ఇంట్లో మా విడిది. దాని యజమాని పేరు ఇంద్రాణి. మారిషస్ తమిళ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షురాలు ఆమె. తమిళ సంఘంలో క్రియాశీలంగా ఉంటారు. రెండు రోజుల తర్వాత ఆమె పుట్టు పూర్వోత్తరాలు ఆరా తీశాం, ఆమె అమ్మ పేరు నాగమ్మ. కులగోత్రాలు బయటకు వచ్చాయి. మీరు తెలుగువాళ్లు అని తేల్చి చెప్పాడు రమేశ్. ఆమె అపనమ్మకంగా, ఆందోళనగా ఇంట్లోకి వెళ్లిపోయింది. మరుసటి రోజు బయటకు వెళ్లి వచ్చిన మాకు దీపంలా వెలిగిపోతున్న ముఖంతో ఆమె స్వాగతం చెప్పింది. 'మా అవ్వది చిత్తూరు. వెతికితే కాయితాల్లో ఉంది,' అని చెప్పింది. 'అయితే నేను ఇంక నుంచీ తెలుగు సంఘంలో పని చేయాలన్నమాట,' అనింది ఆమె నవ్వుతూ. మారిషస్ దేశపు ఉపాధ్యక్షుడు ఇంద్రాణికి మేనల్లుడు. పేరు పరమశివం పిళ్లై. తమిళ సంతతికి చెందిన నాయకుడు. ఇంటి పేరు వయాపురి. బహుశా వేపూరి కావచ్చు. చిత్తూరు సమీపంలోని వేలూరు దగ్గర ఆయన ఇంటి పేరుతో ఒక ఊరు ఉందని ఉపరాష్ట్రపతి భవనంలో ఆయనను కలిసినపుడు స.వెం. రమేశ్ చెప్పాడు. కళ్లను చెవులు చేసుకుని విన్నాడు ఆయన. తమిళులుగా పేరుబడ్డ వీరు ఇప్పటికిప్పుడు తెలుగువాళ్లం అని ఒప్పుకోకపోవచ్చు గానీ, లోలోపలి తెలుగుజాడలు వాళ్లకి వాళ్ల మూలాలను గుర్తు చేస్తూనే ఉంటాయి.

ఈ నవంబరులో అడపాల సుబ్బారెడ్డి, స.వెం. రమేశ్, నేను,

విష్ణుప్రియ, మా అమ్మాయి రాగలీన కలిసి మలేసియా, మారిషస్, కంబోడియా, సింగపూర్ దేశాలకు వెళ్లాం. అంతకు మునుపు ఏడాది సుబ్బారెడ్డి, రమేశ్, నేను బంగ్లాదేశ్‌లో తెలుగువాళ్లని వెతుక్కుంటూ తిరిగాం. ఆ ముందు సంవత్సరం శ్రీలంక వెళ్లివచ్చాం. తెలుగు జాడల కోసం చేసిన ప్రతి ప్రయాణమూ ఎంత సంతృప్తిని ఇచ్చేవో అంత దిగులునూ మిగిల్చేవి. తెలుగువాళ్లు ఉన్నారని తెలిసి ఇంటర్‌నెట్లో వెతికి పట్టుకున్న కొన్ని ఫోన్ నెంబర్లలో వారిని సంప్రదించి ప్రయాణం పెట్టుకునేవాళ్లం. అడపాల సుబ్బారెడ్డి వీసాలు, టికెట్ల వ్యవహారం అంతా చూసుకునే వాడు. తెలియని తావు, తెలియని భాష, తెలియని మనుషులు. మొండిగానే బయలుదేరేవాళ్లం. అపరిచితుల పలకరింపులు తొలుత అపనమ్మకపు చూపులతోనే మొదలయ్యేవి. కాసేపటికి అవే ఆత్మీయంగా మారేవి. వేలమైళ్లకు ఆవల ఉన్న తెలియని మనుషులతో తెలుగు బంధమేదో పెనవేసుకునేది. తిరిగి వచ్చేటపుడు ఎంతో వేదన కలిగేది. సెలవులకి ఇంటికి వచ్చి తిరిగి వెళ్లే విద్యార్థుల్లా ఉండేది మా పరిస్థితి. ప్రయాణాలకు ముందు ఇంటర్‌నెట్‌లో సేకరించుకున్న సమాచారానికీ, కళ్ల ముందు కనిపించే నిజాలకీ మధ్య చాలా అంతరం కనిపించేది.

కంబోడియాలోని ఆంగ్కోర్‌వాట్ ఒక పెద్ద ప్రాచీన హిందూ దేవాలయం అని మాత్రమే తెలుసు. ఆకుపచ్చ వనాల నడుమ దాగిన తెల్ల, నల్ల రాతి అద్భుత నిర్మాణాలు చూసిన తర్వాత, వాటిలో తెలుగు ఆనవాళ్లు కనిపించాయి. గోడలమీది శిల్పచిత్రాల్లో నిర్మాణ శైలిలో తెలుగు పల్లవరాజుల జాడలున్నాయి. ఆగ్నేయాసియాలో చైనాకు దక్షిణంగా దిగువన థాయ్‌ల్యాండ్ లావోస్, వియత్నాం దేశాల మధ్య ఉండే కంబోడియాలో ఈ భారీ గోపురాల సముదాయాన్ని 12వ శతాబ్దంలో హిందూ రాజులు నిర్మించారన్నది చరిత్ర చెబుతున్న నిజం. ఎవరా హిందూ రాజులు? ఎక్కడి నుంచీ వచ్చారు? ఎందుకు ఈ నేల మీదకు వచ్చారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కునే క్రమంలో తెలుగు జాడలు కనిపిస్తాయి. క్రీ.శ. 14 శతాబ్దాలలో భారతదేశం నుంచి ఇక్కడికి వర్తకులు వచ్చేవాళ్లని గుర్తించారు. క్రీ.శ. 802లో రెండవ జయవర్మ పాలనతో ఇక్కడ ఖ్మేర్ సామ్రాజ్యం అవతరించింది. బౌద్ధం, హిందూ మత ప్రచారాలు సాగాయి. వీళ్లంతా భారతదేశంలో ఏ ప్రాంతం నుంచీ వచ్చి ఉంటారో ఊహించ గలిగితే తెలుగు తీగ తగులుతుంది. భారతదేశపు తూర్పు తీరంలోని పడవ రేవుల నుంచే వీరు బయలుదేరి ఉండాలి. కళింగం నుంచి మహాబలిపురం దాకానే అప్పట్లో పడవరేవులు ఉండేవి. ఇదంతా తెలుగు ప్రాంతం. పల్లవ రాజుల పాలన సాగుతున్న కాలం. సహజంగానే వ్యాపారులుగానీ, రాజులుగానీ, వారి అనుయాయులు గానీ, పనివాళ్లుగానీ, మత ప్రచారకులుగానీ ఈ ప్రాంతంవారే అయి ఉండే అవకాశం ఎక్కువ. అంటే అప్పటి కంపూచియాకి చేరుకున్న తెలుగుజనం తమ వెంట తీసుకువచ్చిన

ఆచార వ్యవహారాలు, కళాసంస్కృతులు ఆ నేల మీద పరిచయం చేశారు. అందువల్లే పల్నాడు కోడిపందాలు, గిత్తలు, పైగుడ్డ వేసుకున్న రైతులు, ఎముకలు తేలిన బానిసలు. వీళ్లంతా ఆంగ్కోర్‌వాట్ గోడల మీద శిల్పాలుగా మారారు.

మారిషస్‌లోనూ, మలేసియాలోనూ శతాబ్దాల కిందటి తెలుగు వలసల చాళ్లు కనిపిస్తాయి. కంబోడియాలో ఆంగ్కోర్‌వాట్ నిర్మాణాల్లో కనిపించే తెలుగుజాడలు మనుషుల్లో కనిపించవు. వెయ్యేళ్ల కన్నా ముందు వలస వచ్చిన చిన్న సమూహాలు అక్కడి జనంలో భాగం అయిపోయి ఉండచ్చు. మారిషస్, మలేసియా, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో మాత్రం తెలుగుదనం మాయం కాలేదు. బంగ్లాదేశ్ తూర్పు ప్రాంతంలోని తెలుగువాళ్లకు తెలుగు మాట్లాడడం అంతగా రాదు. ముసలివాళ్లు మాత్రమే మాటలు కూడేసుకుంటూ సంభాషణ జరుపుతారు. ఈతరం పూర్తిగా తెలుగును మరచిపోయింది. అయితే తెలుగు పాట మాత్రం సజీవంగా ఉంది. మేలుకొలుపు పాటలు, పనుల సమయంలో పాడుకునే పదాలు, కీర్తనలు ఇప్పటికీ పాడుకుంటున్నారు. కోలాటం, భజన పల్లెల్లో ఆడుతున్నారు. శ్రీకాకుళం ప్రాంతంలో అంతరించిపోయిన గెంతుభజన ఢాకాలో కనిపించింది. తెలుగు మాట్లాడడం రాని పాతికేళ్లలోపు కుర్రాళ్ల బృందం తెలుగు పాటలు పాడుతూ గెంతు భజన ఆడుతున్నారు. బంగ్లాదేశ్‌లో అయిదున్నర లక్షల మంది తెలుగువాళ్లు ఉన్నారని అంచనా. ఇందులో 65 వేల మంది సిలేట్ రాష్ట్రంలోనే ఉన్నారు. మేఘాలయ, అస్సాం సరిహద్దుల్లో ఉండే ఈ చల్లని ప్రాంతంలో తెలుగు పల్లెలు అనేకం చూశాం. ఇక్కడ పట్టణాల్లో తెలుగుమాట మాయమైనా పల్లెల్లో చక్కగా మాట్లాడుతున్నారు. కాకపోతే తెలుగు అక్షరం వీరికి తెలియదు. దాదాపు 250 ఏళ్ల కిందటి నుంచీ తెలుగువాళ్ల ఉనికి బంగ్లాదేశ్‌లో ఉంది. ఢాకా, సిలేట్, రాజ్‌షాహి చిట్టగాంగ్ డివిజన్లలో తెలుగు ప్రజలుండే పల్లెలున్నాయి. ఢాకా నగరంలో పారిశుధ్య పనివాళ్లలో అత్యధిక సంఖ్యలో ఉన్నది తెలుగువాళ్లే. మురికివాడల్లో ఇరుకిరుకు నివాసాలు, దుర్భరమైన దారిద్ర్యం. పెద్దగా చదువుల్లేవు.

మారిషస్ దీవిలోని తెలుగువాళ్లది కూడా రెండు వందల ఏళ్ల చరిత్ర. 1800 ప్రథమార్ధంలో బ్రిటీషు పాలనలో వేలాదిమంది ఈ పగడాల దీవికి చేరుకున్నారు. 1886 జూలైలో కోరంగి రేవు నుంచి గేంజస్ అనే ఓడలో తెలుగువాళ్లు తొలిసారి మారిషస్‌కి చేరుకున్నారు. కాకినాడ దగ్గరలోని కోరంగి నుంచి చెన్నపట్టణం దాకా ఉన్న రేవుల నుంచి పడవల్లో వందలు, వేలుగా పిల్లా జెల్లా సహా ఈ దీవికి తరలిపోయారు. 1843 ఒక్క సంవత్సరంలోనే భారత దేశం నుంచి మారిషస్‌కి 85 ఓడలు ఎనిమిది వేలమందిని తరలించాయి. ఇందులో సగంమంది తెలుగువాళ్లు. మానవ సంచారం లేని ఈ దీవిని అందాల నివాసంగా మలచిన కష్టంలో తెలుగువాళ్ల పాత్ర చాలా ఉంది. 1885లోనే లూయీ రేవు పట్టణాన్ని భారత దేశం నుంచీ ఫ్రెంచివారు తీసుకువచ్చిన కార్మికులు నిర్మించారు. ఈ కార్మికులు తెలుగువాళ్లయి ఉండవచ్చు. ఎందుకంటే గంజాం నుంచీ చెన్నపట్టణం దాకా ఉన్న తెలుగు ప్రాంతం నుంచే అప్పట్లో పడవ ప్రయాణాలు సాగేవి గనుక. ప్రస్తుతం మారిషస్ జనాభా 18 లక్షలు. ఇందులో లక్షన్నరమంది కూలీలుగా, బానిసలుగా, ఖైదీలుగా ఈ దీవికి చేరుకున్న తెలుగువాళ్లు ఎన్నో కష్టనష్టాలనోర్చి ఇక్కడ స్థిరపడ్డారు. తెలుగు కట్టూబొట్టూ వీరు నిలబెట్టుకున్నా తెలుగు మాట తడబడుతూ ఉంది. తెలుగు అక్షరాన్ని కాపాడుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వం సహకారం కూడా వీరికి బాగానే ఉంది. ప్రాథమిక నుంచి హయ్యర్ సెకండరీ

దాకా తెలుగులో చదువుకునే అవకాశం మారిషస్‌లో ఉంది. దాదాపు 600 తెలుగు బడులు నడుస్తున్నాయి. 4000 మంది తెలుగులో చదువుకుంటున్నారు. 200 మంది తెలుగు టీచర్లున్నారు.

మలేసియాలోనూ అయిదు లక్షలమంది తెలుగువాళ్లున్నారు. సెనేటర్లుగా, సివిల్ సర్వెంట్లుగా, డాక్టర్లు, లాయర్లుగా, ఇంజనీర్లుగా, వ్యాపారవేత్తలుగా తెలుగు సంతతి కుదురుకున్నారు. ఒకప్పుడు బతుకు కోసం పోరాడిన తెలుగువాళ్లు ఇప్పుడు తెలుగుభాష కోసం పోరాడాల్సి వస్తోంది. నూట యాభై ఏళ్ల కిందట రబ్బరుతోటలు, టెంకాయ తోటలు, చెరకు తోటల్లో పని చేయడానికి మలేసియాకు తెలుగువాళ్లని తరలించారు. కొందరికి ఆశ చూపి, కొందరిని బెదిరించి, కొందరిని బలవంతంగా తీసుకువచ్చారు. 1942లో థాయ్‌ల్యాండ్ - బర్మాల నడుమ రైల్వే లైను నిర్మాణ పనులకు బలవంతంగా తరలించిన కార్మికుల్లో లక్షమంది చనిపోయారు. వీళ్లలో అత్యధిక సంఖ్యలో తెలుగువాళ్లున్నారు. గోచీలతో ఈ నేల మీదకు వచ్చిన తొలిరోజుల్లో తెలుగు అక్షరాలు మరచిపోకుండా ఉండడానికి ఇసుకలో అఆ లు దిద్దేవాళ్లు అని ముసలివాళ్లు కొందరు చెప్పారు. టెంకాయ తోటల్లో దారుణమైన పరిస్థితుల మధ్య పనిచేస్తూ రామనాటకాలు, భజన పాటలు, కోలాటాల ద్వారా తెలుగును కాపాడుకున్నారు. కాస్త కుదురుకున్నాక పనిచేసే చోటే తెలుగుబడులు తెరుచుకున్నారు. క్రమేణా అవి మూతబడడంతో తెలుగుశిబిరాల పేరుతో సెలవు రోజుల్లో పిల్లలకు తెలుగు చదవడం, రాయడం నేర్పించే ప్రయత్నం చేస్తున్నారు. మలేసియా తెలుగు సంఘం కౌలకబుబారు అనే ప్రాంతంలో నిర్వహిస్తున్న ఒక తెలుగు శిబిరానికి మేం హాజరయ్యాం. తెలుగు

రాష్ట్రాల నుంచి టీచర్లను పిలిపించుకుని పిల్లలకు అక్షరాలు నేర్పిస్తున్నారు.

రెండు కోట్ల జనాభా ఉన్న శ్రీలంకలో 8.5 లక్షల మంది తెలుగువాళ్లున్నారు. 1802 తర్వాత దక్షిణ భారతదేశంలోని చోళ, పాండ్య మండలాల (ఇప్పటి దక్షిణ తమిళనాడు) నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు శ్రీలంక చేరుకున్నారు. టీ, కాఫీ తోటల్లో పనుల కోసం బ్రిటీషు పాలకులు వీరిని తరలించారు. తంజావూరు, తిరుచురాపల్లి, రామనాథపురం, మధురై ప్రాంతాలున్న చోళ, పాండ్య మండలాలు తెలుగు ప్రాంతాలు. రెడ్డి, నాయుడు, మాదిగ, కోమటి కులాలవాళ్లు ఎక్కువగా వలసపోయారు. బంగారం, బట్టలు, హోటలు వ్యాపారాల్లో తెలుగువాళ్లే ఎక్కువ. శ్రీలంకలో బంగారం ధరను రోజూ నిర్ణయించే స్థాయిలో ఉన్న దేవీ జ్యువెలర్స్ తెలుగు వారిదే. అయితే ఇక్కడి తెలుగువాళ్లలో చాలామంది తమిళమే మాట్లాడుతారు. పెద్దవాళ్లు మాత్రమే ఇళ్లలో తెలుగు మాట్లాడుతారు. తమిళ ప్రత్యేక వేర్పాటు ఉద్యమం తెలుగువారి అస్తిత్వాన్ని మాయం చేసేసింది. ప్రభుత్వ రికార్డుల్లో కూడా వీరంతా తమిళులుగానే నమోదయ్యారు. వ్యాపార ఉద్యోగ వర్గాలుగా ఉన్న తెలుగువాళ్లకి తెలుగుభాష పట్ల ప్రత్యేక శ్రద్ధ ఏదీ శ్రీలంకలో కనిపించలేదు. అయితే కొలంబోలో ఆటో నడిపే మాణిక్యం వంటి కొందరు మాత్రం ఆరాటపడుతున్నారు. మన తెలుగు మనం కాపాడుకోవాలి. ఏమైనా చెయ్యండి సార్ అని ప్రాధేయపడుతున్నారు. దక్షిణ భారతదేశం నుంచీ తరలివచ్చామని చెప్పుకునే శ్రీలంక తెలుగు ప్రజలకు భిన్నమైన మరో తెలుగుజాతి ఈ దీవిలో ఉంది. వీరు అహికుంటికలు అని పిలిచే సంచార జాతి. శ్రీలంక మధ్య ప్రాంతంలో ఉంటారు. మగవాళ్లు పాములు, కోతులు ఆడిస్తారు. ఆడవాళ్లు సోది చెబుతారు. ఇదే రకమైన జీవనవిధానం ఉన్న సంచారజాతి తెలుగు రాష్ట్రాల్లోనూ కనిపిస్తారు. అయితే అహికుంటికల్ని వలస వచ్చినవారుగా గుర్తించరు. శ్రీలంక మూలవాసులుగా వీరిని చెబుతారు. ఒకప్పుడు అడవుల్లో తిరిగే అహికుంటికలు, ఇప్పుడు శ్రీలంక పర్యాటక ప్రదేశాల్లో కోతులూ, పాములూ ఆడిస్తూ పొట్ట పోసుకుంటున్నారు. అనురాధపురం, త్రికోణమల, బట్టికలోవ జిల్లాల్లో పది గ్రామాల్లో వీరు ఇప్పుడు స్థిరనివాసులుగా ఉన్నారు. దీవెరగమ అనే వీరి పల్లెకు మేం వెళ్లాం. వీళ్లతో పాటూ రెండు రోజులు ఉన్నాం. బయటకు వచ్చినపుడు సింహళ, తమిళం మాట్లాడే అహికుంటికలు ఇళ్లలో మాత్రం తెలుగే మాట్లాడుకుంటారు. నగరాల్లోని జనం వీళ్లేదో అనాగరిక భాష మాట్లాడుకుంటారని అనుకునేవాళ్లు. తాము మాట్లాడుకునే భాష 'తెలుంగు' అని చెబుతారు వీళ్లు. అయితే ఈ భాషకి లిపి ఉందని వీళ్లకి ఇటీవలి దాకా తెలియనే తెలియదు. తెలిశాక మాత్రం అక్షరాలు నేర్చుకోవడానికి ఆరాటపడుతున్నారు. 'పొత్తాలు (పుస్తకాలు) అంపండి,' అని మమ్మల్ని అడిగారు. తెలుగువాణి సంస్థ సహకారంతో సింహల నుంచి తెలుగు అక్షరాలు నేర్చుకునేలా ఒక పుస్తకాన్ని స.వెం. రమేశ్ తయారుచేశాడు. వాటిని

అచ్చు వేసి మేం తీసుకువెళ్లాం కానీ, నేర్పించేవాళ్లు లేకుండా నేర్చుకోవడం సాధ్యం కాదని అర్థమైంది. తమ మాసిలు (మనుషులు) ఉండే తావు ఇండియాలో ఉందని తెలిశాక, ఒక్క సారి ఆ తావును చూడాలని కోరుకుంటున్నారు. తెలుగు పాటలు ఇప్పటికీ వీళ్లు పాడుకుంటున్నారు. అహికుంటికల్లో ఎక్కువమంది క్రిస్టియన్లుగా, సింహాలులుగా మతం మార్చుకున్నారు. చచ్చిపోతే పూడ్చడానికి క్రిస్టియన్లకీ, సింహాలులకీ స్మశానాలు ఉన్నాయి. అహికుంటికలు అడవులు వదిలేశాక ఇదొక పెద్ద సమస్యగా మారింది. ఎక్కడ పూడ్చాలి? చావు కోసమే తాము మతం మార్చుకున్నామని మశన్న అనే అహికుంటికల ఊరి పెద్ద చెప్పాడు. బంగ్లాదేశ్‌లో కూడా తెలుగువాళ్లు పెద్ద సంఖ్యలోనే క్రిస్టియన్ మతంలోకి మారిపోయారు. దారుణమైన పేదరికంలో ఉన్న వీళ్ల బతుకుకోసం మతం మారితే, లంక మూలవాసులు చావుకోసం మతాన్ని ఎంచుకున్నారు.

మలేసియాలోనూ, శ్రీలంకలోనూ తెలుగు అస్తిత్వానికి తమిళం ఒక సవాలుగా మారింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉండిపోయిన తెలుగువాళ్లకి, భాషాప్రయుక్త రాష్ట్రాల విభజన తర్వాతనే సమస్య మొదలైంది. భారతదేశంలో తమిళ భాషాభిమానం ఉన్మాద స్థాయికి చేరుకున్నట్లే బయటి దేశాల తమిళుల్లోనూ వ్యక్తమవుతోంది. మలేసియా తమిళ జనాభాలో సగానికి పైగా తెలుగువాళ్లు ఉన్నారు. ప్రభుత్వ తమిళ బడులు 500 ఉంటే తెలుగు బడి ఒక్కటంటే ఒక్కటీ లేదు. తెలుగు సినిమాలు మలేసియాలో ఆడనివ్వరు. తమిళులకి దినపత్రికలున్నాయి. వారపత్రికలున్నాయి. తమిళ ఛానెల్స్ ఉన్నాయి. తెలుగువాళ్లకి ఇవేమీ లేవు. లేకపోవడానికి కారణం తమిళులు నిరంతరం అడ్డుకోవడమే అని మలేసియాలోని తెలుగువాళ్లు భావిస్తున్నారు. తెలుగువాళ్లు వెంకటేశ్వరస్వామి గుడి కట్టుకుంటే తమిళులు రారు. శివాలయాలు, శక్తి గుడులు మాత్రమే తమిళులవిగా భావిస్తారు. శ్రీలంక తెలుగువాళ్లలో చెక్కిలియార్లు (చెప్పులు కుట్టేవాళ్లు) పెద్ద సంఖ్యలో ఉన్నారు. వీళ్లు తెలుగే మాట్లాడుతారు. దీంతో తెలుగంటే చెక్కిలియార్ల భాష అని తమిళులు ఎగతాళిగా మాట్లాడడం మొదలు పెట్టారని, అందువల్లే తామంతా తెలుగు మాట్లాడడం మానేశామని కొలంబో నగరంలో ఒక వ్యాపారి మాతో చెప్పాడు. మారిషస్ దేశంలో తెలుగువారి మీద దౌర్జన్యం లేకపోయినా ఇక్కడా తమిళుల ఆధిపత్యం ఉంది. తెలుగు జనాభాతో సమానంగా తమిళులు ఈ దేశంలో ఉన్నారు. మలేసియాలోలాగే ఇక్కడా రాజకీయాల్లో వీరి పాత్ర చాలానే ఉంటుంది. మారిషస్ కరెన్సీ మీద హిందీ తర్వాత స్థానంలో తమిళం ఉంటుంది. శ్రీలంకలో అధికార భాష తమిళం, సింగపూర్లోనూ అంతే. తమిళం అంటే చాలు అందరూ ఒక్కటైపోతారు. గొంతెత్తుతారు. భారతదేశంలోని తమిళనాడు వెంటనే స్పందిస్తుంది. పార్టీలతో ప్రమేయం లేకుండా అందరూ అండగా నిలబడతారు. ఏ దేశాన ఉన్నా తమిళులు అనుకున్నది సాధించుకుంటారు. విదేశాల్లో ఉన్న తెలుగువాళ్లకు, భారతదేశంలోని రెండు తెలుగు రాష్ట్రాల్లోని తెలుగువాళ్ల కంటే ఎక్కువగా తెలుగు మీద మక్కువ ఉంది. తెలుగు సంస్కృతిని, తెలుగు భాషను కాపాడుకోవాలనే ఆరాటం ఉంది. అయితే వీరికి తెలుగు రాష్ట్రాల నుంచి తగినంత అండా దండా లేవు. మారిషస్‌లో, మలేసియాలో, శ్రీలంకలో, సింగపూర్‌లో, బంగాదేశ్‌లో, బర్మాలో, ఘనాలో, ఫిజీలో, బాలిలో- ఇంకా అనేక దేశాల్లో వందల ఏళ్ల కిందటే వలసపోయి స్థిరపడ్డ తెలుగు జనం ఉన్నారు.

అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ దేశాల్లోనూ స్థిరపడ్డ తెలుగు సంతతి ఉన్నారు. మొత్తంగా విదేశాల్లో ఉన్న తెలుగువారి సంఖ్య దాదాపు కోటి పైనే ఉండొచ్చని అంచనా. రెండు తెలుగు రాష్ట్రాల్లో 8 కోట్ల మంది తెలుగువాళ్లు ఉంటే, భారతదేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఎనిమది కోట్ల మంది తెలుగువాళ్లు ఉన్నారు. కాకపోతే బయట ఉన్నవారిలో ఉన్న తెలుగు తపన తెలుగు రాష్ట్రాల్లోని తెలుగువారిలో కనిపించదు. తెలుగు ప్రభుత్వాల్లో కనిపించదు. తెలుగు నేల మీద పుట్టకపోయినా తెలుగుదనం కోసం ఆరాటపడుతున్న వీరిని చూస్తే హృదయం పులకిస్తుంది. అయితే, ఈ అన్నదమ్ములు అక్కచెల్లెళ్లు గుర్తుంచుకున్నంతగా తెలుగు పేగుబంధాన్ని మనం గుర్తుంచుకోవడం లేదే అనే బాధ కూడా కలుగుతుంది. ఈ విశాల ప్రపంచంలో నలుమూలలా విస్తరించిన తెలుగు ప్రజలను కలిపి ఉంచే నిరంతర ప్రయత్నం ఒకటి జరిగితే బావుండుననే ఆశ పుడుతోంది. ఆ ఆశతోనే తెలుగు దిమ్మరులుగా మారి స.వెం. రమేశ్, అడపాల సుబ్బారెడ్డి, నేను భుజాలకు సంచులు తగిలించుకుని దేశాలు తిరుగుతున్నాం. తెలుగు మూలాలు తడుముకుంటున్నాం.

కవి, పరిశోధకుడు, సీనియర్ పాత్రికేయుడు ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు 10కి పైగా కథలు రాశారు. ఉత్తమ పాత్రికేయుడుగా వివిధ ప్రతిష్టాత్మక పురస్కారాలు లభించాయి. ఆంధ్రజ్యోతి రాయలసీమ బాధ్యుడు. నివాసం తిరుపతి. 2009 చికాగో తానా మహాసభల అతిథి. email: umatpt@gmail.com

ఏదండీ తెలుగునేల కానిది? ఎవరండీ తెలుగువారు కానివారు?

స.వెం. రమేశ్

2017 తానా సభల అతిథి వ్యాసం

పత్రికలో వినవస్తున్న కొన్ని గొంతులు వేదనను కలిగిస్తున్నాయి. శక్తి శివరామకృష్ణగారిని వింటున్నారా? రెండు నెలల క్రిందట కరణం బాలసుబ్రమణ్య పిళ్లెగారి యాతనను చదివినారా? తెలుగుజాతి ఎట్లా పోతున్నది, మనల్ని మనమే మింగేసుకొంటున్నామా? 'ఇదే తెలుగునేలంటే' అని ఆంధ్రులు అరకొరగా గీసుకున్న నేలలోనే తెలుగు బాసకూ తెలుగుజాతికీ దిక్కులేదంటే, ఆ గిరికి బయటనున్న వారి గతేమిటి?

కొండరెడ్ల వాడుకలోని కొన్ని జబ్బుల పేర్లను చెప్పినారు శివరామకృష్ణగారు. ఆ పేర్లను చదివి నిండా అచ్చెరపోయినాను. ఇప్పటి తమిళనాడులోని కొన్ని గిరిజన తెగలలో చిన్నచిన్న మార్పులతో ఈ పేర్లు ఇట్లాగే ఉన్నాయి. ఇక్కడ పడమటి కనుమలలో చాలా రకాల తెగల గిరిజనులున్నారు. వాళ్లలో తమిళం, మలయాళం, కన్నడం, తెలుగు బాసలను మాట్లాడే వాళ్లతోపాటు వాళ్లకే విడిగా ఉండే బాసలను కూడా మాట్లాడే వాళ్లున్నారు. తూర్పు కనుమలలో అన్ని తెగలు, అన్ని బాసలు లేవు. ఇప్పటి కర్నాటక, తమిళనాడు ఎల్లలలో, తూర్పు, పడమటి కనుమల కలయికగా ఉండే నీలగిరులనూ, వాటి నానుకొని వున్న తూర్పుకనుమల చీలికైన మేలగిరులనూ పక్కన పెడితే, మిగిలిన తూర్పు కనుమల చీలికలైన పచ్చమల, కొల్లిమల, సేర్వరాయనిమల, కల్రాయనిమల, జవ్వాది, ఏలగిరి వరుసలలో ఉన్న ఒకే ఒక తెగ 'మలయాళర్.' వీళ్లకూ మలయాళ బాసకూ పొత్తు లేనేలేదు. వీళ్లు ఇంటా బయటా మాట్లాడేది తమిళమే. అయితే ఆ తమిళంలో తమిళులకు తెలియనివీ తెలుగువాళ్లు మటుకే తెలుసుకోగలిగినవి ఎన్నో మాటలున్నాయి. పోయినేడాది కొద్దికాలం పచ్చమల, కొల్లిమల కొండలలోని మలయాళర్లతో కలిసి వుండే అవకాశం వచ్చింది. కొండరెడ్ల మాటలను చదువుతుంటే అప్పుడు నేను సేకరించిన మలయాళర్ల మాటలు గురుతుకొచ్చినాయి. మలయాళర్లు చెప్పుకునే జబ్బుల పేర్లు ఇవి, వాళ్ల యాసలోనే వ్రాస్తున్నాను చదవండి. సళివేకి (జ్వరాన్ని వీళ్లు వేకి అంటారు. ఇది తమిళమాట కాదు. జ్వరాన్ని తమిళంలో కాయ్చల్ అంటారు), ఎండవేకి, పొక్కువేకి, వమనాలు, బేదులు, నీరు వాయువు, లక్కవాయువు, కీలువాయువు, నక్కవాయువు, అగ్గివాయువు, మళుగువాయువు, కుట్టునొప్పి, మొట్టునొప్పి, బొగ్గిలినొప్పి, సందులునొప్పి, నెత్తి నొప్పి, ఒరుబొమ్మనొప్పి, నూగమ్మ, పెరవుదిగుడు, పెద్దరొగ్గం, సెకరొగ్గం, తెళ్లపాత...

రోగాల పేర్లే కాదు చాలా మొక్కల పేర్లు కూడా తెలుగులోనే వాడుతారు. ఒకసారి హేమాద్రిగారితో ఈ మందలను చెప్పినాను. ఆయన కూడా అచ్చెరపోయి, 'అయితే వాళ్లంతా నాయక రాజుల కాలంలో తమిళనాడుకు వలసపోయారేమో,' అన్నారు. నాకు చివుక్కుమనింది. ఈ మలయాళర్లకు ఇంటి పేర్లున్నాయి, వీళ్లు ఉంటున్న కొండలను నాడులుగా పంచుకొని ఒక్కొక్క నాడుని ఒక్కొక్క పేరుతో పిలుచుకొంటారు. పచ్చమల మీద మూడు నాడులున్నాయి, కొల్లిమల మీద పద్నాలుగు నాడులున్నాయి. ఒక్కొక్కనాడులో ఐదు నుంచి పది వరకూ పల్లెలుంటాయి. కొల్లిమలపైన గుంటూరునాడు, చిత్తూరునాడు, నెల్లూరునాడు లున్నాయి. పరిసరాలను చాలావరకు తెలుగు పేర్లతోనే పిలుస్తున్నారు. అయితే ఇట్లా పేర్ల వరకే తెలుగుంది. వీళ్లను వీళ్లు 'నోచ్చ గౌండర్' అని చెప్పుకొంటారు. పరంపరగా వీళ్లు చెప్పుకొనే వీళ్ల కథలో, తాము కాంచీపురవాసులమనీ అక్కడి తమ వాళ్లు వెలి వేయగా కొండలమీదకు వచ్చినామనీ అంటారు. కాంచీపురమంటే పాత చెంగల్పట్టు జిల్లాలోనిది. పాత చెంగల్పట్టు, దాని నానుకొని ఉండే పాత దక్షిణార్కాడు జిల్లాలలో 'నోక్కంవారు' అనే సంచార కులం ఒకటుంది. వీళ్లు వన్నియర్లకు ఆశ్రితకులం. తల్లిబాస తెలుగు. నోక్కంవారికీ, నోచ్చగౌండర్లకూ ఆచార వ్యవహారాలలో చాలా పోలికలున్నాయి. అట్లాగే ఇద్దరి ఇంటిపేర్లూ దాదాపు ఒకటిగా ఉంటాయి.

'నోక్కంవారు' వాళ్ల కులచరిత్రను చెబుతూ, తాము మలయాళ దేశం నుండి కాంచీపురానికి వలస వచ్చినామని అంటారు. కేరళలోని 'తెయ్యం' జానపద నృత్యానికీ నోక్కంవారు ఆడే 'నోక్కం ఆట'కూ దగ్గరి పోలికలు ఉన్నాయి. కేరళలోని చాక్కియార్‌కూత్తు గురించి ఇదివరకొకసారి చెప్పినాను. చాక్కియార్ కూత్తులో 'అసమక దేశ' ప్రస్తావన ఉంది. సబ్బినాటి పరయర్లు తమిళనాడును దాటి, కేరళలో కూడా చాలాచోట్ల పరచుకొని ఉన్నారు. సబ్బినాటి పరయర్లు ఈనాడు తమిళం, మలయాళం మాట్లాడినా వాళ్ల మూలం తెలుగే అనడానికి వాళ్ల చీలిక పేరే చాలు.

ఉత్తర తెలంగాణా ప్రాంతపు సంస్కృతికీ దక్షిణాన ఉన్న తమిళ, మలయాళ దేశాల సంస్కృతికీ దగ్గరి పోలికలున్నాయి. అదే పనిగా వెతుకుతూ, వెతికినప్పుడు దొరికినవన్నిటినీ కూర్చుకొంటూ వస్తే, మనదైన ఎంత సంపదను మనది కాదనుకొని వదిలి వేస్తున్నామో తెలుస్తుంది.

నిన్న మొన్నటివరకూ తెలంగాణ ప్రాంతపు చరిత్ర బయటకు రాకపోవడం దారుణం అనుకొంటే, ఇంత ఉద్యమాలు జరుగుతున్నప్పుడైనా సమగ్రంగా తెలంగాణపు మూలాలను వెతక లేకపోతున్నామంటే అది ఇంకెంత దారుణం?! తెలంగాణమంటే ఇప్పటి పదిజిల్లాలు కాదు.

రాజకీయంగా పది జిల్లాలే కావచ్చు, నేను రాజకీయపు గిరి గురించి చెప్పడం లేదు. రాజకీయంగా తెలుగువాళ్లం ఇప్పటికే చెల్లాచెదురు అయిపోయినాము. తెలంగాణపు సంస్కృతి అంటే తెన్నాట మూడు కడళ్ల కూడలి వరకూ. కన్యాకుమారి జిల్లాలో వేటాడి జీవించే తెలుగు కుళువర్లే ఇందుకు ఉదాహరణ. కుళువర్లలోని మెతుకు, గతుకు చీలికలే వాళ్ల తెలంగాణ మూలాలను ఎత్తి చూపే ఆనవాళ్లు. మెతుకు, గతుకు సీమలు ఇప్పటి మెదక్, గదక్ లే. గదక్ కర్ణాటకలో ఉందికదా అని వాదించొద్దు. కర్ణాటక, తమిళనాడులు నిన్న మొన్నటివి!

ఇంత తెక్కణానికి దిగిన తెలుగుదనం వక్కణాన ఇంకెంత దూరానికి పోయిందో. రాజస్థానంలో కూడా తెలుగు బయిరూపు లున్నారట. ఈ నడుమ ఓ టీవీ ఛానల్‌లో ఒక సంచార కుల పాయనను చూపించినారు. వీరతాడుతో ఒళ్లు బద్దలు కొట్టుకుంటూ తెరువులు తిరుగుతూ యాచించే కులం, మేము వాళ్లని ఉరుమారెమ్మలనీ, సాట్టై అడికారర్ అనీ అంటాము. తమిళనాడు, కర్నాటక, కేరళలో తెలుగునే మాట్లాడుతున్నారింకా. ముంబై మహా నగరపు వీధులలో తిరిగే ఆయన్ని టీవీ యాంకరమ్మ హిందీలో ఏదేదో అడిగింది. తడబడుతూ బదులిచ్చిన ఆ పెద్దాయన మాటల్లో ఎన్నో తెలుగుమాటలు తానుగా బయట పడినాయి, 'అచ్చినం, ఉర్కుతం' అంటూ.

తెలంగాణ ఉద్యమంలో భాగంగా తెలంగాణ తెలుగు సంస్కృతి ఎంత దూరం పరుచుకొనిందో ఎవరైనా వెతికితే బాగుండును.

'అప్పయ్య దీక్షితులు తెలుగువాడే' అని వ్రాసిందెవరో కానీ వాళ్లకి మప్పిదాలు. ('తెలుగు తాత్వికులు (హిందూ, బౌద్ధ, జైనులు)- విక్టరీ పబ్లిషర్స్, విజయవాడ వారి ప్రచురణ. రచయిత డా॥ కోటరాజు శివరామకృష్ణారావు గారు -సం.) నేను కూడా అప్పయ్య దీక్షితులను తమిళుడే అనుకొనేవాడిని (ఇప్పుడు తమిళం, కన్నడం, మలయాళం, తుళు మాట్లాడుతున్న బ్రాహ్మణ శాఖల మూలాలన్నీ తెలుగేననుకోండి, అది వేరే విషయం). ఆ వ్యాసంలో 'పాలారు నది' అని ఒకచోట వచ్చింది. 'ఆఱు' అంటే నదికి తమిళం మాట. తెలుగులో 'ఏఱు'. మనకు బండి ఱ పట్టింపు పోయింది కాబట్టి 'ఏరు' అనేస్తాం. తమిళులట్లా ఒప్పుకోరు. వాళ్లకి వాళ్ల వ్రాతల పట్ల మక్కువ ఎక్కువ, మనకి పొరుగు వాటిపై ఉన్నంతగా. మనది మొదటినుంచీ అదే గోలలేండి! మనవైన బండి ఱ, అరసున్న (అదేనండీ అర్థానుస్వారం), క్రొత్త, ప్రాత, వ్రాతల్లోని క్రావడులు పోయినా, పోతున్నా మనం పట్టించుకోము (ఈ విసురు నామీద కూడానండీ). ఒక్క గూటం పెట్టలేదో (మహా ప్రాణాక్షరాలు) కింద మీదయిపోతాము. సరే, ఇక్కడ నేను చెప్పాలనుకొన్నది అదికాదు. 'పాలారు' ఏమిటండీ, అది 'పాలేరు'. కోలారు జిల్లా నందికొండలలో పుట్టి, చిత్తూరు, వేలూరు, కాంచీపురం జిల్లాలలో పారి వంగకడలిలో కలిసే ఏరిది. ఇది పుట్టిన దగ్గర్నుంచీ మెట్టేదాకా దీని అంచున, ఈ ఏటి నీటిచాలున బ్రతికేది నూటికి అరవైమంది తెలుగువాళ్లు. తమిళ, కన్నడ, ఉరుదూ, మరాఠ, సౌరాష్ట్రీయులందరూ కలిసి నలభైమంది. మరి

ఇది పాలారు ఎట్లా అయింది? కుప్పం దగ్గర ఈ నదిపై కట్టే చిన్న ఆనకట్టపైన తమిళ రాజకీయ పక్షాలు గగ్గోలు పెడుతున్నాయి, తమిళరైతులు అన్యాయమై పోతున్నారంటూ. ఈ ఏటంచునున్నదంతా తెలుగువాళ్ల నేలలే.

పాలేటిని పాలారు చేసినారు తమిళులు. బాగానే ఉంది కానీ దీంట్లో కలిసే గొడ్డేరుని ఏమని మారుస్తారు? మజ్జిగ దొనని ఏమని మారుస్తారు? చెయ్యేరుని, పొన్నేరుని ఏమంటారు? ఈ నడుమ గొడ్డారు, మోర్‌దొన, చెయ్యారు, పొన్నారు అంటున్నారు. గొడ్డు, దొన, చెయ్యి, పొన్నలకు తమిళమాటలను పెట్టినా, మంది నోళ్లలో నానాలి కదా. ఈ ఏటి అంచునున్న పల్లెలలో దీనిపేరు పాలేరు.

'పాలు' పైనే నాకొక అనుమానముంది. 'పాలు', నిత్య బహు వచనమంటారు కదా. తెన్నాట తెలుగువారిలో 'పాసి', 'పాపులు' అనే వాడుక మాటలున్నాయి, పాసి ఏకవచనమయితే పాసులు బహువచనం వాడుకలో ఉంది. 'లు' తెలుగు బహు వచన ప్రత్యయమైతే, తమిళంలోని 'పాల్', కన్నడంలోని 'హాలు' తెలుగునుంచే పోయినవయి ఉండాలి కదా. చాన్నాళ్ల అనుమానమిది. పెద్దలెవరైనా తీరిస్తే బాగుండును.

ఏతావాతా నేను చెప్పేదేమింటంటే, ఈనాడు, ఆంధ్రజ్యోతి లాంటి దినపత్రికలన్నీ కుప్పం గొడవప్పుడు 'పాలారు' అనే వ్రాసినాయి. ఇట్లా వ్రాస్తే ఎట్లా? మా మనసుకెంత నొప్పిగా ఉంటుందో ఆలోచించండి.

సుందరంగారి వ్యాసాలలో మైసూరు ముచ్చట్లు ఎన్నో వుంటాయి. ఇదివరకు చెప్పిందేననుకొంటాను, అయినా మళ్లా ఒక్కసారి మనవి చేసుకొంటాను. నాకు మైసూరంటే మైమరపు, తెలియని మైకం. తరచూ ఆ మత్తులో ముంచెత్తుతుంటారు సుందరంగారు.

కోదండరామయ్యగారు- నన్నయ్య నంజనగూటివాడని అన్నారనుకొంటాను, కన్నడిగుడని ఆయన అనలేదేమో, నన్నయ్య కాలానికి నంజనగూడులో తెలుగు ఉండేదనడానికి పల్లెపదాల్లో ఋజువులు ఉన్నాయి. ఇంకా వెనక్కి, నన్నయ్యకు వెయ్యేండ్ల వెనక్కిపోతే, తెలుగే ఉండేదనడానికి కూడా గట్టి సాక్ష్యాలే ఉన్నాయి.

నంజనగూటికి అల్లంత దూరానున్న బిళిగిరులు కొంగు, ఎరుమ, చీకలనాడుల కూడళ్లు. ఈ కొండలలోని సోళిగర్లు అనే ఆదివాసులలో తెలుగు చీలికలు ఇంకా ఉన్నాయి. కొంగునాడులోని కొద్దినేల మటుకు ఇప్పటి కర్నాటకలో ఉంది. కొళ్లేగాల తాలూకాగా. మిగిలినదంతా ఇప్పటి తమిళనాడులోనే ఉంది. ఎరుమనాడు పూర్తిగా కర్నాటకలో ఉంటే చీకలనాడు మూడొంతులు కర్నాటకలో ఒకవంతు తమిళనాడులో ఉంది. ఈ మూడునాడులూ కావేరితో ఎంతో కొంత పొత్తున్నవే. తమిళనాడులోని చీకలనాడంటే దాదాపుగా ఇప్పటి డెంకణికోట తాలూకా. చీకల, మొరసనాడులను సనత్కుమార నది వేరు చేస్తుంది. ఈ ఏటి మాటలు కొన్ని చెప్పుకొని తీరాలి. బెంగుళూరు నరగానికి ఆనుకొని బన్నేరుగట్ట అడవులుంటాయి. ఆ అడవిలో సంపంగి రామస్వామి పాదాల చెంత చిన్న నీటి సెల పుడుతుంది. పుట్టే చోట ఈ సెలకు వేరు పేరు లేదు, ఆ స్వామి పేరుతోనే పిలుస్తారు, అక్కడున్న అడవి బిడ్డలు.

పుట్టిన సెల తను పోయే దోవలో పుట్టెడు ఊటలను తనలో కలుపుకొని వంకవుతుంది. రాగిపల్లి అడవుల్లోని ఇర్లోళ్ల దొడ్లను తొక్కుతూ పారి రెండు పాయలవుతుంది. ఒక పాయ ముత్యాల మడుగు పేరుతో ఆనేకల్లు లోయలోకి దూకుతుంది. దూకిన వంక వన్నేరవుతుంది. మొరసనాటిలోని పెన్నేటికి ఉపనది ఈ వన్నేరు. పెన్నేరంటే దక్షిణ పెన్న. ఉత్తర, దక్షిణ పెన్నలు రెండూ పుట్టేది ఒకేచోట. కోలారుజిల్లాలోని నందికొండలలో ఒకే పాయగా పుట్టి అదే జిల్లాలో రెండు తమర్లయి, వక్కణపు చీలిక అనంతపురం, కడప, నెల్లూరు జిల్లాల మీదుగా వంగకడలిని చేరుతుంది. దక్కణపు చీలిక అనంతపురం, కృష్ణగిరి, ధర్మపురి, అరుణాచలం, విళుపురం, కడలూరు జిల్లాలను తడిపి అదే కడలిలో కలిసిపోతుంది. ఉత్తర పెన్న కన్నా దక్షిణపెన్న పొడవెక్కువ. పెన్నగొడవను కాసేపు పక్కనబెడదాం. అది పెద్ద పురాణం. పెన్నేరు, వన్నేరులు కలిసే తావులను పెద్దకూళ్లు, చిన్నకూళ్లు అంటారు. కూళ్లు అంటే కూడళ్లు అని.

సంపంగి రామస్వామి సెలలోని రెండోపాయ, దేవరకొండ లోయలోకి దూకుతుంది. దేవరకొండలోయ ఇప్పుడు డెంకణికోట తాలూకాలో ఉంది. ఈ లోయలోని సంకురుని గవిని ఒరుసుకొంటూ పారుతుందీ వంక, సంకురుడంటే శంకరుడనుకొనేరు, కానేకాదు. సంకురుడంటే దేవరకొండ లోయలోని పది పన్నెండు పల్లెజనులకు పల్లెదేవర. ఈ పల్లెలలో మాదిగలు ఎక్కువ. చత్రం దొడ్డి లాంటి ఒకటిరెండు పల్లెలయితే అచ్చంగా మాదిగపల్లెలే. సంకురుని కత ఒక్కటేనా! అందానికే ఆనవాలైన ఒక మాదిగ పడుచు కత 'ఆలంబగిరి' పదం. ఆడవాళ్లందరూ కోరి వెంటపడే ఆ నల్లనయ్య, ఈ మాదిగపడుచు సొగసు చూసి సొరణ తప్పి, తన అష్ట రాణులనూ విడచి పడుచు వెంటపడతాడు. మహాసాధ్వి అయిన 'అల్లమదేవి' పదంలో మనకు మహాంధ్రుడు కనిపిస్తాడు. అల్లమదేవికి మొగుడు మహాంధ్రుడు. మశానానికి కావలికాసే మాదిగ వాడైన మహాంధ్రుడు తన జాతి రక్షణకోసం వెంకటరమణస్వామితోనే పోరాడుతాడు. వేలయేండ్ల నాటి అశోకుని శాసనాల్లో కనబడే సత్య పుత్రరాజులు 'సిరివన్నె' పదంలో మళ్లీ మన ముందుకొస్తారు. పల్లెపదాలను మనం లెక్క చేయంగానీ, అట్లా ఒప్పుకొంటే సిరివన్నె పదం ప్రకారం సత్య పుత్రులు మాదిగలు. ఇట్లా ఒకటా రెండా, ఇక్కడున్న అప్పటపు తెలుగు పాటల సోయగానికి, ఆ పదకవితాపితామహుడే తలవంచి తీరాలి.

ఈ మాదిగపల్లెల అంచులను తడుపుతూ పారే వంక పేరు తల్లివంక. తడబడక పారుతూ వచ్చి తల్లి చెరువును చేరుతుంది తల్లివంక. తల్లిచెరువు ఎంత విశాలమైనదంటే తల్లి మనసంత. వేల ఎకరాల నేల సాగవుతుంది ఈ చెరువు క్రింద. ఈ చెరువు గట్టున పుట్టిన, పల్లే పట్టణమూ కాని ఊరు తల్లి. తల్లి ఎంత చల్లనిదంటే నిండువేసవిలో కూడా ఇక్కడ ఎండ వెచ్చవెచ్చగానే ఉంటుంది. ఈ చల్లదనానికి మురిసే తెల్లోడు ఈ ఊరికి 'లిటిల్ ఇంగ్లాండ్' అని పేరు పెట్టుకొన్నాడు.

తల్లి చెరువు మొరవపారితే అది తండ్రి వాగవుతుంది. ఈ వాగు పదిమైళ్ల దవ్వు పారి తండ్రిచెరువులో కలుస్తుంది. తల్లి చెరువంత విశాలమైనది కాదు తండ్రి చెరువు, కానీ లోతెక్కువ. నిజంగానే తండ్రి గుండె లోతయినదే కదా. ఇక్కడి నుంచి ఈ వాగు సనత్కుమార నది అవుతుంది. మొరస, చీకల నాడులను వేరుచేస్తూ కావేరిలో కలిసిపోతుంది. కలిసేముందు తనలో రెండు చిట్టిపొట్టి వంకలను చేర్చుకొంటుంది. ఈ వంకలు రెండూ ఒకే పాయగా మంచు కొండపల్లి అడవుల్లో పుట్టి, మెట్టురాయి దగ్గర జలపాతమై రెండుగా చీలుతాయి. ఒకటి దొడ్డమంచి లోయలోపడి అన్నదమ్ముని వంక పేరుతో సనత్కుమారను చేరుతుంది. రెండోది అంచెట్టి లోయకుదిగి రామసంద్రం, వెంకటాపురం, గంగదేవునిపల్లి, ఆంధ్రదేవుని పల్లెల మీదుగా వచ్చి 'అక్కచెల్లెలు వంక' అని పిలిపించుకొని సనత్కుమారలో కలిసిపోతుంది.

ఆంధ్రదేశమనే రాజకీయపుగిరిని ఎందుకు గీసుకొన్నారో ఎంతకీ తెలియదు. ఆ గిరికి వెలుపటే తల్లి, తండ్రి, అన్న దమ్ముడు, అక్కచెల్లెలు అందరూ ఉన్నారు, చివరకు మహాంధ్రుడు కూడా.

ఈ చోటనే ఇప్పటి కరునాడును వదిలి తమిళనాడులో అడుగుపెడుతుంది కావేరి. కర్నాటకలో కావేరి దాటే చివరి తావు పేరు మేకదాటు. కావేరికి తమిళనాట తగిలే తొలితావు బిళిగుండ్లు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర ఉద్యమం వలన తెలుగునేల ఎంతగా చిక్కిపోయిందీ తెలుస్తున్నదా! ఇప్పుడయితే తమిళ, కన్నడ నాడులున్నాయిగానీ, పాతకాలంలో ఈ పేర్లెక్కడివీ?

కావేరి కొడగునాట పుడుతుంది. అదే ఇప్పటి కూర్గుజిల్లా. కొడగునాటిలో కొడగుబాసను మాట్లాడేవారు ఎక్కువ. వారి తరువాతనే కన్నడిగులు. వాళ్లూ వీళ్లూ సరే, మన తెలుగువాళ్లున్నారిక్కడ. కొడగునాటి తలనగరం మడికేరిలో తెలుగు కోమట్లున్నారు. కొడగునాడంతా తెలుగు మంగళ్లున్నారు, బుట్టలల్లే కొరసకులం పూర్తిగా తెలుగు, పచ్చబొట్లు పొడుస్తూ తిరిగే కొరమలందరూ తెలుగువాళ్లే. మాదిగలు, మాదిగలను నమ్ముకొన్న కులాలన్నీ తెలుగే. ఇంకొక ముక్కైమైన మందలేమిటంటే, ఇక్కడ కొడగునాటి కాపులున్నారు, వీళ్లు ఇంకా తెలుగును వదలలేదు. ఇప్పటి కర్నాటకలోని కాపులు తమపేరు చివర రెండురకాల కులపట్టాలను వాడుతూన్నారు. ఒకటి గౌడ, రెండు రెడ్డి. కాపునే కన్నడంలో ఒక్కలిగ అంటారు. పాత మైసూరు రాజ్యం (ఇప్పటి కోలారు, బెంగుళూరు, తుముకూరు, చిత్ర దుర్గం, హాసన, చిక్కమగళూరు, శివమొగ్గ, మైసూరు, మండ్య జిల్లాలు)లో రెడ్డి పట్టం పెట్టుకొన్న వారందరూ తెలుగును ఇంకా మాట్లాడుతున్నారు. గౌడపట్టం పెట్టుకొంటున్న వారిలో తెలుగు, కన్నడ చీలికలు రెండు ఉన్నాయి. కూర్గుజిల్లాలోని కొడుగునాటి వారు రెడ్డిపట్టం పెట్టుకొన్నవారు.

చిత్తూరు జిల్లాలో గొడుగునాటి రెడ్లున్నారు. మొగిలేటి అంచునే ఉంటాయి వీళ్ల పల్లెలు. ఈ ఏరు పారుతున్న తావుకు పాత తమిళ శాసనాల్లో 'తిరుక్కుడైనాడు' అనే పేరు కనబడుతుంది. అంటే ఇదికూడా ఒకప్పుడు కొడనాడే. ఈనాటివారు కనుకనే ఇక్కడి కాపులకు కొడగునాటి రెడ్లు అనే పేరు వచ్చింది. ఇట్లా ఒకేపేరు రెండు ప్రాంతాలకు ఉండడం మనకు ఒకటిరెండు చోట్ల కనిపిస్తుంది. ములకనాడు, కొడగునాడు అట్లాంటివే. ఇప్పటి తెలంగాణంలో గోదావరి ఒడ్డున ఒక ములకనాడు, కడపజిల్లాలో ఒక ములకనాడు చరిత్రలో కనిపిస్తాయి. గోదావరి ములకనాడు చాలాచాలా పాతది. అక్కడి నుంచి బయలెక్కి వచ్చి దక్షిణంగా కుదురుకొన్న ఒక పెద్దగుంపు, తాము కుదురుకొన్న ప్రాంతానికి పాతపేరే పెట్టుకొని ఉండాలి. అందుకే గోదావరి అంచు ములకనాటితో పోల్చితే కడప ములకనాటి చరిత్ర ఇటీవలిది. కూర్గు జిల్లాలో అక్కడక్కడా ములకనాటి బ్రాహ్మణులున్నారు. వీరికంటే ఎక్కువగా ములకనాటి మాలలున్నారు. ఇద్దరూ ఇంట్లో తెలుగును మాట్లాడుతున్నారు.

మొగిలేటి అంచు కొడగునాటి చరిత్ర మైసూరు సీమ కొడగు నాటికంటే పాతది. మరి ఇటునుంచి అటు జరిగిన వలసలవలన ఈ పేరు వచ్చివుండవచ్చా?

కొడగునాట పుట్టిన కావేరి ఎరుమనాడు చేరుకొనేటప్పటికి, ఈ ఏటి అంచున తెలుగుదనం ఎక్కువవుతుంది. మనిషి పుట్టుక నుంచి చావువరకూ తెలుగువాడు లేనిదే అడుగుముందుకు పడదు ఎరుమ నాటికి. అవును, ఇప్పుడయితే చావు పుట్టుకలకు ఆసుపత్రుల్లాంటి సదుపాయాలు వచ్చినాయిగానీ, నిన్న మొన్నటి వరకూ మంగలి, మాదిగ కులాలు లేనిదే పుట్టడం, గిట్టడం ఎక్కడివి?

ఎరుమనాడు మంగళ్లందరూ తెలుగువాళ్లే, మాదిగలందరూ తెలుగువాళ్లే. పుట్టడం, చావడం సరే, ఈ రెంటి నడుమన బ్రతకడం ఒకటుంది గదా. ఇక్కడ సేద్యం చేయడానికి కావలసిన నూతులను తవ్వే మన్నుబడ్డెర్లు తెలుగువాళ్లు. నూతికి రాతిని చేర్చి చేపట్టులు పెట్టి బావులుగా తీర్చిదిద్దే రాయిబడ్డెర్లు తెలుగు వాళ్లు. మంది మలమూత్రాలను ఎత్తిపోసి ఊరికంపును కడిగే పియ్యబడ్డెర్లు తెలుగువాళ్లు. ఈదులతో బుట్టలు, గంపలు అల్లే మేదర్లు తెలుగువాళ్లు. వెదురు గంపలు, చేటలు, నిచ్చెనలు చేసే కొరసోళ్లు తెలుగువాళ్లు. సేద్యపుబావులకు తోలుతో కపిలబానలు చేసే మాదిగలు తెలుగువాళ్లు.

తల్లికి పురుడుబోసి, బిడ్డకు ఉసురుబోసే మంగలివాళ్లు, కులగోత్రాలను పట్టించుకోకుండా పలకల దరువులతో కాటి వరకూ తోడువచ్చే మాదిగవాళ్లే కాదు, ఉసురుపోయిన కట్టెకు కడా తోడయిన సుడుగాడు సిద్దులూ తెలుగువాళ్లే ఇక్కడ. అవును మరి, అమ్మయినా అప్పడయినా, ఆలయినా మొగుడయినా, అన్నదమ్ములు అక్క జెల్లెళ్లయినా కట్టెను కట్టెలమీద లేదా గుంటలో పెట్టడం వరకే కదా ఉంటారు. తరువాత ఆ కట్టె కట్టెల్లో కాలిపోయేవరకో మన్నులో మన్నయిపోయేవరకో కని పెట్టుకొని ఉండేది సుడుగాడు సిద్దులే.

ఇంత తెలుగూ కృష్ణదేవరాయల కాలంలో వలస వచ్చిందేనని చరిత్రకారులు ఒక్కమాటతో కొట్టిపారేస్తారు. అయితే అంతకు ముందు కన్నడ సమాజంలో ఈ వృత్తులు లేవా? 16వ శతాబ్దం వరకూ కూడా ఆటవిక సమాజంగానే ఉండేవారా కన్నడిగులు? నేను పైన చెప్పింది తెలుగు ఇంకా ఇంట మాటాడుతున్న కులాల గురించే. కన్నడ కులాల మూలాలు చెబితే ఎలవరపోతారు. చాకలివారిలో తెలుగు వారున్నా కన్నడిగులే ఎక్కువిక్కడ. కన్నడ చాకలివారి చీలిక పేరు 'పసుపునాటి'. ఎరుమనాట కన్నడ కాపు కులం గంగటకారరు. వీళ్లను ఆశ్రయించిన సుడుగాడు సిద్దులు తెలుగువాళ్లు. గంగటకారులే గాంగులని కన్నడ చరిత్రకారుల ఊహ. అట్లా అయితే గాంగుల మూలం ఇప్పటి ఆంధ్రదేశమే కదా. నామధారి కాపులూ కన్నడమే మాట్లాడతారు, వీళ్లనా శ్రయించిన నన్నియవర్లు తెలుగువాళ్లు.

బ్రాహ్మణులలో ములకనాట్లు, వెలనాట్లు, వంగిపురం వాళ్లు తెలుగువాళ్లే. వీళ్లగురించి సరే, కన్నడం మాట్లాడుతున్న కమ్మనాటి వారి మూలం కూడా తెలుగే. ఒకప్పటి కమ్మనాటి నుంచి వచ్చినవారు. కమ్మనాడంటే గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో కొంత భాగం. కమ్మనాటి వారిలో ఒక చీలిక పేరు ఆదికర్నాటక వారు. అంటే కర్నాటక ప్రాంత బ్రాహ్మణులలో తొలి చీలిక ఇది. ఈ చీలికకు ఇంకొక పేరు మార్కరు. ప్రకాశం జిల్లాలోని మార్కాపురం వీళ్ల తొలి తావు అని కొందరి అభిప్రాయం. అట్లాగే ఉలిచి కమ్మవారు. కర్నూలు జిల్లాలోని ఉలిచాల గానీ ప్రకాశం జిల్లాలోని ఉలిచిగానీ వీళ్ల మూల స్థావరం అయి వుండవచ్చు.

తమిళ సంగ సాహిత్యంలో కూడా ఎరుమనాటి విషయమై మనం గమనించాల్సిన దొకటుంది. "కున్టుడై ప్పెరునిలై మన్టునిరై తరుఉమ్ నేరా వందోళ్ వడుగర్ పెరుమగన్ వేర్ ఇపై ఎరుమై నల్నాట్టు ఉళ్లదై అయిరి మాఉ ఇఉందనర్ ఆయినుం..." (అగనానూరు). ఈ గీతం ఎరుమై అనే తెలుగురాజును గురించి చెబుతున్నది. ఎరుమనాటి రాజు కాబట్టి ఈ పేరు వచ్చి వుంటుందని అనుకోవచ్చు. ఇందులో అయిరి అనే నది గురించి కూడా వుంది. కావేరికి ఉపనది అయిన హారంగి నది గురించేనా ఈ ప్రస్తావన?!

ఎరుమనాటిలో చరిత్రకందని కాలం నుండీ తెలుగే ఎక్కువగా ఉండేదనడానికి ఇంకొక ఆధారం, తెలుగుబాసకు కేరళ పల్లెల్లో ఎరుమబాస అని ఇంకొక పేరుండడం, ఉత్తర కేరళలోని ఎరుమనాట కన్నడమే ప్రధాన భాష అయివుంటే కేరళలో ఎరుమనాటి గొల్లవారు ఇంకా తెలుగును విడువక ఉండడం. కన్నడానికే ఎరుమబాస అని పేరు వచ్చి ఉండేది కదా!

ఎరుమనాడుపైన ఇంకా చాలా లోతుగా వెతుకులాట జరగాలి. ఒక్క ఎరుమనాడే కాదు, మనది కాదనుకొని వదిలేసిన మన నేల పొరుగున ఎంతో ఉంది. దానిపైన, ఆ నేలను నమ్ముకొని బ్రతికే జీవులపైన మన చూపును సారించి తీరాలి. అట్లా జరగా లంటే ముందు మనలో తెలుగుజాతి అనే భావన రావాలి. అప్పుడే అది వల్లపడుతుంది.

తెలుగు భాషోద్యమ కార్యకర్త. ప్రపంచమంతా తిరుగుతూ తెలుగు ఆనవాళ్లు పట్టుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. యాంత్రొపాలజీ చదువుకున్నారు. తమిళనాడులో వివిధ ప్రాంతాలలో తెలుగు అక్షరాన్ని నేర్పే ప్రక్రియలో ఉన్నారు. ప్రస్తుతం ఉడుమలపేట ప్రాంతంలో తెలుగు పాఠశాలలను నిర్వహిస్తున్నారు. కథకుడు, వ్యాసకర్త. రెండు కథాసంపుటాలు, రెండు వ్యాససంపుటాలు ప్రచురించారు. 2015 డెట్రాయిట్ తానా అతిథి.

email: savenramesh@gmail.com

ఎల్లలు దాటిన తెలుగువాణి

వాసిరెడ్డి నవీన్

2017 తానా సభల అతిథి వ్యాసం

అదొక అపూర్వ సన్నివేశం.

అదొక విషాద సన్నివేశం కూడా.

ఆ అపూర్వ, విషాద సన్నివేశానికి నేనే ప్రత్యక్షసాక్షిని. ఆశ్చర్యమనిపించవచ్చు కానీ అపూర్వ, విషాద సన్నివేశాలు ఒక్కటిగా ఉండవచ్చునని నాకూ మొదటిసారిగా తెలిసొచ్చింది.

2015 నవంబర్ నెల. ఈ సందర్భానికి నాతోపాటు ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు, స.వెం. రమేశ్, చంద్రలత వంటి రచయితలు, సామల రమేష్‌బాబు, వేణుగోపాలరెడ్డి వంటి తెలుగు భాషాభిమానులు, ఆంధ్రప్రదేశ్ పత్రిక ముఖ్య సంపాదకులు కందుల రమేష్ కూడా దీనికి సాక్షులే.

ఎక్కడో లోతట్టు తమిళనాడులో, కేరళకి 20, 30 కి.మీ.ల సరిహద్దు ప్రాంతంలో కొంగునాడుగా పిలవబడే ప్రాంతంలోని ఉడుమలపేట దీనికి వేదిక. మార్టూరు సంజనాపద్మం అనే పన్నెండేళ్ల పాప తను తెలుగులో రాసిన 'రేగడి నీడల్ల' అనే కథల పుస్తకం ఆవిష్కరణ సభ సందర్భంగా జరిగిందీ సంఘటన. అంతవరకే అయితే ఇది మామూలు సంఘటనే. చెప్పుకోడానికి ఏమీలేదు. కానీ...

★ ★ ★

ఒక్కసారి వెనక్కి వెళ్లి 'రేగడి నీడల్ల' రచనకు ఉన్న సామాజిక నేపథ్యం గురించి చెప్పుకోవాలి. అంతకుముందు నాలుగేళ్ల నుంచి ప్రముఖ కథారచయిత, భాషోద్యమ కార్యకర్త స.వెం. రమేశ్ తమిళనాట తెలుగు గుబాళించే పల్లెల గురించి, మరీ ముఖ్యంగా కొంగునాడు ప్రాంతపు (కొంగునాడు అంటే ఉత్తరాన సేలం నుండి దక్షిణాన కేరళ సరిహద్దు ప్రాంతమైన ఉడుమల పేట వరకు విస్తరించిన ప్రాంతం) పల్లెల గురించి, అక్కడివారి జీవన విధానం, ఇళ్లలో మాట్లాడే తెలుగుభాష గురించి, లక్షలాదిగా ఉన్న మాదిగ, కమ్మ, ఇరు వత్తినాల్ చెట్టియార్లు, బలిజ నాయుళ్లు గురించి చాలా చెప్తూ వస్తున్నాడు. చాలాసార్లు అతిశయోక్తులు అనిపించి వినీ విన నట్లుండేవాడిని. 2015 మే నెలలో కేరళలోని ఒట్టప్పాలం దగ్గర పల్లెలో ఉన్న మా బంధువుల ఇంటికి వెళ్లి తిరిగివస్తూ ఉడుమల పేటలో ఆగాను. పల్లెల్ని చూశాను. అందరినీ కలిశాను. మాట్లాడాను. వారి ఆప్యాయతకి, అనురాగానికి ముగ్ధుడనయ్యాను. అప్పుడే మార్టూరి వసంతనాయుడు కుటుంబం పరిచయం (ఆయన కూతురే కథలు రాసిన సంజనాపద్మం) అయింది. ఆ రెండ్రోజుల్లో ఓ పది పల్లెలు తిరిగాను.

అప్పుడర్థమయింది, రమేశ్ చెప్పేవి అతిశయోక్తులు కావని. అంతేకాదు, వాస్తవానికి అక్కడున్న పరిస్థితిని ఇరవై శాతం మాత్రమే చెప్తున్నాడని. ఆ క్షణం నుంచి అది నా తెలుగునేల అనిపించింది. అక్షరానికి దూరమైన వారి ఆవేదన అర్థమైంది. వారు మాట్లాడే ఆ తెలుగు కొంచెం విచిత్రంగా ఉంటుంది. ఎప్పుడో 17, 18 శతాబ్దాల్లో ఆగిపోయిన తెలుగులా అనిపించింది. పల్లెల్లో పదుల సంఖ్యలో రైతుల్ని కలిశాను. పెద్ద ఆసాములే. ఎక్కువగా కొబ్బరి తోటలు. వచ్చే ఫలసాయాన్ని పెట్టుబడిగా పెట్టి తిరుప్పూరు, కోయంబత్తూరు వంటి ప్రాంతాల్లో చిన్నా, పెద్ద పరిశ్రమలు స్థాపించుకున్నారు కొందరు. ఇళ్లలో అంతా తెలుగే మాట్లాడతారు. వీధుల్లో ఎదురుపడితే తెలుగులోనే పలకరించుకుంటారు. తెలుగులోనే ఆలోచిస్తారు. దొరికితే తెలుగు సినిమాలే చూస్తారు. అడిగితే తెలుగువాళ్లకే ప్రత్యేకమైన తమ ఇంటి పేర్లు చెప్తారు, మార్టారు, చెన్నారు, నీరుకొండారు (చెన్నావారుకి ప్రాస్వరూపం) అని. ఆంధ్రలో ఏ ప్రాంతం నుంచి వలస వచ్చారని అమాయకంగా అడిగితే నొచ్చుకున్నారు. కొంచెం కోపం కూడా వచ్చినట్లుంది. కృష్ణదేవరాయల కాలం నుండి మేం ఇక్కడి వాళ్లమే అన్నారు. నిజమే కావచ్చు. మన తెలుగు ఆచార వ్యవహారాలు, పద్ధతులు, పండుగలు పబ్బాల పూర్వ రూపాలన్నీ యథాతథంగా అక్కడ అమలు చేసుకుంటున్నారు. ఇంటి పేరుకో పేరంటాలు, ఆమెకో గుడి, సంవత్సరానికోసారి సంబరాలు జరుపుతారు. బిడ్డ పుట్టిన దగ్గర్నుంచి చావు వరకు అన్నీ పద్ధతి ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అన్నీ బాగానే ఉన్నాయి. కానీ అక్షరమే లేదు. తెలుగు చదవడం, రాయడం రాదు. నేర్చుకోవడానికి తమిళనాడులో ఆ ప్రాంతంలో తెలుగు బడులన్నీ నలభై ఏళ్లనాడే మూసేశారు. తాము నిత్యజీవితంలో మాట్లాడే భాషని చదవడం, రాయడం రాని వారి బాధ వర్ణనాతీతం. ముడుకుపల్లె అనే ఒక పల్లెలో ఓ పెద్దాయన్ని కలిశాను. 75 సంవత్సరాలు. పేరు మద్దినేని దొరసామి నాయుడు. అడవి ప్రాంతంలోని వివిధ చెట్ల పేర్లను, పక్షుల పేర్లను చక్కటి అచ్చ తెలుగు మాటల్లో చెప్తున్నాడు. ఆ చుట్టుప్రక్కల ఇప్పుడున్న పల్లెల అసలు తెలుగు పేర్లన్నీ ఆయనకు తెలుసు. వెన్నమానుపల్లె, దీపాలపల్లి ఇట్లా. కానీ రాయడం మర్చి అర్ధ శతాబ్దం దాటింది. ఆ విషయం అడిగి, బాధనిపించదా అంటే, 'కండ్లల్లో నుండి నెత్తురు కారుతుంది సామీ, నీరు కాదు,' అన్నాడు ఆయన తెలుగులో పైపంచెతో కళ్లొత్తుకుంటూ. అంత పెద్దాయనా అక్షరం కోసం ఆక్రోశిస్తూ కళ్లనీళ్లు పెట్టుకుంటే నాక్కూడా కడుపులోంచి దుఃఖం పొర్లుకొచ్చింది.

మాటల మధ్యలో 'రేగడి నీడల్ల' పుస్తకం ఆవిష్కరణకు రమ్మని మరీ మరీ ఆహ్వానించాడు రమేశ్.

★ ★ ★

మరోసారి 2015 నవంబర్ నెలలో ఒకరిద్దరు మిత్రులతో కలిసి వెళ్లాను. దాదాపు రెండు, మూడువందల మంది తెలుగు వాళ్లు. వాళ్లలో రైతులున్నారు, కూలీలున్నారు, చిన్న వ్యాపారులున్నారు, పెద్ద పారిశ్రామికవేత్తలూ ఉన్నారు. వాళ్ల తెలుగు భాషలోనే బ్యానర్లు రాయించారు. నవ్వొచ్చినా వారి స్ఫూర్తికి సంతోషమేసింది. సభ మొదలయింది. నేనే అధ్యక్షుడ్ని. ఇంతలో నడవలేని ఓ పెద్దావిడని ఇద్దరు వ్యక్తులు కుర్చీలతో మోసుకొచ్చి ముందు వరసలో కూర్చోబెట్టారు. స.వెం. రమేశ్ వేదికనెక్కి ఆ పెద్దావిడ గురించి పరిచయం చేశాడు. 92 సంవత్సరాల వయస్సున్న ఆవిడ పేరు నారమ్మ. అక్కడికి 15 కిలోమీటర్ల దూరంలోని గోమంగళం కొత్తూరు ఆవిడ గ్రామం. ఆ ప్రాంతంలో తెలుగు రాయడం, చదవడం వచ్చిన ఏకైక వ్యక్తి. ఆవిడ పోతే మరెవరూ లేరు; ఇప్పటి 12 సంవత్సరాల సంజనాపద్మం తప్ప. ఈ విషయం రమేశ్ సభకు వివరిస్తుండగా...

నేనీ వ్యాసం మొదట్లో చెప్పిన అపూర్వ, విషాద సంఘటన అప్పుడు జరిగింది. సంజన వేదిక మీద నుంచి వడివడిగా వచ్చి పెద్దావిడ దగ్గరకి వెళ్లి పూర్తిగా వంగి తన తలను ఆవిడ పాదాలకు తాకించింది. కాళ్లను చేతులతో తాకి కళ్లకు అద్దుకుంది. ఒక్కసారిగా సభలో హర్షధ్వానాలు. సభ మొత్తం ఉద్విగ్నభరితమయింది. ఇప్పుడు నేను రాసినది చదివినా, ఎవరన్నా విన్నా మామూలుగానే అనిపిస్తుంది. కానీ ఆ క్షణాన్ని అనుభవించిన వారికి మాత్రమే అర్థమయ్యే అర్థవంతమైన సందర్భం అది. 92 ఏళ్ల తెలుగు అక్షరా నికి అప్పుడే అర విరుస్తున్న అక్షర కుసుమం అందించిన అనురాగ నీరాజనం. ఆప్యాయతపు కౌగిలింత. అదొక అక్షరానుభూతి.

అంటే ఆ ప్రాంతంలో మళ్లీ 80 ఏళ్ల తర్వాత తెలుగు అక్షరం వికసించింది. 80 ఏళ్ల చీకటి తొలిగింది. తొలిగింది అని అపూర్వం అందామా, 80 ఏళ్ల పాటు అక్షరం చీకట్లో మగ్గినందుకు విషాదం లో మునిగిపోదామా!

ఇప్పటికీ ఎప్పటికీ అర్థంకాని ప్రశ్నే.

సభ ముగిసింది. మర్నాడు ఆ ప్రాంత పల్లెలు తిరిగేందుకు అందరం బయల్దేరాం. దగ్గర్లోని నాయకరాజుల కాలం నాటి చెరువులు, ఆనకట్టలు, ఇంకా వ్యవసాయ భూములకు నీళ్లు అందిస్తూనే ఉన్నాయి. ఆ డ్యామ్ దగ్గర్లో ఓ పెద్ద మర్రిమాను, దాని చుట్టూ విగ్రహాలు. రాజుగారు, చెలికత్తెలు, భార్యలు- ఇలా వివిధ భంగిమల్లో బొమ్మలున్నాయి. వసంత్ ఆ చరిత్రను వివరిస్తున్నాడు. అది మరీ అంత పాతదేం కాదు. ఆ విగ్రహాల్లో ఉన్నది ఎద్దులప్ప నాయుడు ప్రతిమలు. దగ్గర్లోని జల్లిపల్లెలో పుట్టి, 1820-60ల మధ్య బ్రిటిష్‌వారికి సామంతుడుగా ఉంటూ తరవాతి కాలంలో వారికి ఎదురుతిరిగి బ్రిటిష్ సైన్యాన్ని ముప్పుతిప్పలు పెట్టిన బుర్జుబొమ్మ ఎద్దులప్పనాయుడు సంస్థాన ప్రాంతమంది. సుమారు ఆ కాలంలోనే మనందరికి బాగా తెలిసిన వీరపాండ్య కట్టబొమ్మన అనబడే గట్టిబొమ్మ వీరపాండ్య నాయుడు కూడా బ్రిటిష్‌వాళ్లకు ఎదురుతిరిగిన ధీరుడు. ఇద్దరూ కొద్ది తేడాలోనే ఉరితీతకు గురయ్యారు. వారిద్దరూ ఆ ప్రాంతపు తెలుగువారంటే ఆశ్చర్య పోవడం మా వంతైంది. అక్కడి నుండి పక్కనే ఉన్న శివాలయం వైపు కదిలాం. నడుస్తున్న దారిలో తెలిసిన వారినందరినీ తెలుగులోనే పలకరిస్తూ మమ్మల్ని పరిచయం చేస్తున్నాడు వసంత్. ఇదంతా చూసి ఆశ్చర్యంగా నేను, అంతా తెలుగుమయమే అన్నాను. వెంటనే రమేశ్ అందుకుని, ఇక్కడ సరే రేపు కేరళ వెళుతున్నారు కదా, మీ బంధువుల ఊరి దగ్గరలో ఒట్టప్పాలం అనే టౌన్‌లో కూడా ఇరువత్తినాల్ చెట్టియార్ తెలుగు కుటుంబాలు ఉన్నట్లు సమాచారం. ప్రయత్నం చేయండి అన్నాడు. ఈసారి ఆయన మాటల్లో నమ్మకం కుదిరి, సరే అన్నాను.

తెల్లారి బయల్దేరి కేరళలోని పాలక్కాడ్ మీదుగా అక్కడికి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న వాణియంగుళంకి చేరుకున్నాను. అక్కడ మా అత్తయ్య ఉంటుంది. తెల్లారి బయటికి వచ్చి ఆటో కోసం చూస్తున్నా. మనసంతా రెండు రోజుల సంఘటనలతో ముసురుకుంటోంది. తెలుగు అక్షరం చుట్టూ తిరుగుతోంది. మనసంతా అదే ఆలోచన నిండిపోయింది. ఇంతలో ఓ ఖాళీ ఆటో నన్ను దాటింది. దాని వెనక వైపు 'నాయుడూస్' అని ఇంగ్లీషులో రాసి ఉంది. చూసి ఉలిక్కిపడ్డాను. ఆటో వెనక పరిగెత్తి ఆపాను. అదెక్కి ఒట్టప్పాలం పోదామని చెప్పి, అసలు విషయం అడిగాను మలయాళంలోనే. ఈ 'నాయుడూస్' ఏమిటీ అని. అతనూ మలయాళంలోనే సమాధానం చెప్పాడు. తానూ ఆంధ్ర సి.ఎం. చంద్రబాబు కులమని, మా ఇండ్లల్లో అదే తెలుగు మాట్లాడతామని అన్నాడు. నెమ్మదిగా తెలుగులో మొదలుపెట్టా. వాళ్ల తాత సేలం ప్రాంతం నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడ్డాడని చెప్పాడు. అప్పుడర్థ మయింది, తమిళనాడులోని బలిజనాయుడు కులం వీరిదని. 'ఇంకా మీ కుటుంబాలున్నాయా?' అని అడిగితే, 'రెండు మూడు ఉన్నాయి, అయితే మా పక్క వీధిలో ఇరవై, ముప్ఫై తెలుగు కుటుంబాలున్నాయి,' అని చెప్పాడు. వెతకబోయిన తీగ కాలికి తగిలింది. ఇరువత్తినాల్ చెట్టియార్ కుటుంబాలా అంటే, అవునన్నాడు. అక్కడికి తీసుకెళ్లమంటే, మరో అయిదు నిమిషాల్లో ఒట్టప్పాలం బస్టాండుకి వెనక ఓ ఇరుకు సందులోకి తీసుకెళ్లి ఇదే అన్నాడు. బెరుకు, సంకోచాలు ఎప్పుడో వదిలేశాను. తలుపు తట్టి ఓ ఇంట్లో ప్రవేశించా. 70 ఏళ్ల ముసలావిడ మలయాళంలో ఎవరని అడిగితే, నేను వెంటనే ఉడుములపేట తెలుగులో మాట్లాడే ప్రయత్నం చేశాను. ఆవిడ ఆశ్చర్యపోయి, మలయాళ యాస నిండిన విచిత్ర తెలుగులో మాట్లాడుతోంది. నా ఆనందానికి అంతులేదు. ఏమీ సాధించకపోయినా ఏదో తెలుసుకున్నానన్న ఆనందం అది. మీ కుటుంబాలు ఎక్కడ్నించి వచ్చాయని అడిగితే, తమ ముత్తాతలు నుంచి ఈ ఊరే అంది. పక్కింటివాళ్లను పిలిచి నాకు పరిచయం చేసింది. ఏదో తెలియని అవ్యాజమైన బంధుప్రేమ తొణికిసలాడింది. అక్షరం కలిపిన బంధం అది. ఇప్పుడు వాళ్లు నాకు బంధువులు. ఆమధ్య కేరళ వెళ్లినప్పుడు మళ్లీ పలకరించి వచ్చా.

ఈ విషయం మా అత్త కొడుకుతో చెపితే, 'ఈ సంగతి నాకు ఎప్పుడో తెలుసు. ఇరువత్తినాల్ చెట్టియార్‌లు మాట్లాడే తెలుగు తెలుగు అనిపించక నీతో ప్రస్తావించలేదని, వీళ్లు ఇంకా పెరిందల్‌మన్న ఊళ్లోను, చాలామంది కాలికట్ సిటీలోనూ వున్నారు కదా,' అన్నాడు.

మూర్ఛపోవడం నా వంతైంది.

మళ్లీ అక్కడికి ప్రయాణం పెట్టుకోవాలి.

తెలుగునాట 27 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా వార్షిక కథా సంకలనాలు ప్రచురిస్తున్న కథాసాహితి సహ సంపాదకులు. వ్యాసకర్త. అంతకుముందు ప్రజాసాహితి పత్రిక సంపాదకులు. 'తెలంగాణ సాయుధ పోరాట కథలు', 'తెలుగు కథ - 60-85' పుస్తకాలకు సంపాదకులు. 2017 సెయింట్ లూయిస్ తానా సభల అతిథి. నివాసం హైదరాబాద్.

email: kathanaveen@gmail.com

తెలుగు అక్షరానికి తానా చేయూత

తాము మాట్లాడే భాషకు అక్షరం రాయడం రానివారి బాధ వర్ణనాతీతం. తమిళనాడులోని ఉడుమలపేట చుట్టుపక్కల వందల పల్లెల్లోని పరిస్థితి ఇది. ఆ అక్షరం కోసం తపించేవారి ఆరాటాన్ని 2015 జులైలో డెట్రాయిట్‌లో జరిగిన తానా సభలకు అతిథిగా హాజరైన స.వెం. రమేశ్ సభల్లోనూ, వివిధ సందర్భాల్లో వ్యక్తిగత సంభాషణల్లోనూ వివరించారు. ఈ ఉపన్యాసాలు విన్న తానా నాయకత్వం, ముఖ్యంగా అధ్యక్షులు జంపాల చౌదరి చొరవతో ఆ పల్లెల్లో అక్షరాన్ని నేర్పించటానికి కావలసిన పది లక్షల ఆర్థిక వనరుని సమకూర్చాలని నిర్ణయించింది. రెండుసార్లుగా తానా నాయకత్వం ఆ ప్రాంతాన్ని పర్యటించి, పరిస్థితిని అర్థం చేసుకుంది.

ఈ ప్రాజెక్టును ఆచరణ రూపంలో తీసుకురావడానికి తెలుగువాణి ట్రస్ట్ పూనుకున్నది. ఆ కార్యక్రమాన్ని నడిపించాలని పూనుకున్నది స.వెం. రమేశ్. సహాయపడుతున్నది వసంతనాయుడు. తానావారి ఆలంబనతో రూపుదిద్దుకున్న 'ఎల్లలు లేని తెలుగు' ప్రాజెక్ట్ ఇప్పుడు పట్టాలకెక్కింది. దాదాపు 100 గ్రామాల్లో తొలి విడతగా తమిళ మాధ్యమం ద్వారా తెలుగు నేర్పించే అక్షరదీపానికి అంకురార్పణ జరిగింది. 23 మంది సుశిక్షితులైన ఉపాధ్యాయ బృందం గ్రామాల వెంట తిరిగి తెలుగు అక్షరాన్ని నేర్పిస్తున్నారు. ఎనభై ఏళ్లుగా తెలుగు అక్షరానికి దూరమైన ఆ పల్లెలు అక్షర చైతన్యపు దారుల వెంట నడుస్తున్నాయి. కొన్నిచోట్ల ఈ తరగతులకు తమిళ బృందాల నుంచి వ్యతిరేకత ఎదురైనా తట్టుకుని కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళుతున్నారు. ఈ జూన్ ఆఖరు నాటికి దాదాపు 1000 మంది ఆ ప్రాంతంలో తెలుగు అక్షరాన్ని తిరిగి సొంతం చేసుకోబోతున్నారు. తమ రాను తామే రాసుకోబోతున్నారు. ఇది వాళ్ల తలరాతనూ మార్చవచ్చు.

TELUGU ASSOCIATION OF NORTH AMERICA, INC.
TANA
ఉత్తర అమెరికా తెలుగు సంఘము
Our Youth are Our Heritage

కొంగునొడు కుతయితనాలు యిత్తేనా...

మార్టూరి సంజనా పద్మం

2017 తానా సభల అతిథి కథ

ఈ కథలో ఉన్న తెలుగు మనం మామూలుగా చదువుకునే తెలుగు కాదు. ఉడుమలపేట ప్రాంతంలో, అక్కడి పల్లెల్లో తెలుగువాళ్లు మాట్లాడే భాష ఇది. అందుకే భిన్నంగా వుంటుంది. కొంచం కష్టపడి చదవాల్సి వస్తుంది. ఈ కథ రాసిన సంజనా పద్మం తెలుగు అక్షరం నేర్చు కుని తను మాట్లాడే భాషలో ఈ కథ రాసింది. ఇలాంటివే మరికొన్ని కథలు రాసింది.

ఊరు కూటం కూడింది. సూర్యుండు మరుగయికొని ఉండినా, ఆతండి వెలుతురూ వేడీ మటుకు ఇంకా తక్కువనే లేదు. సాయింతరం వేళలా కూటం కూడిందానికి కారణమే ఆతండి ఎండ. ఇంకా చెప్పాలనితే కూటం కూడిందానికి కారణమే ఆతండు, ఆ సూర్యుండు.

పెద్దమనుసులు అందురునూ వచ్చి ఉండారు. ఊరిపెద్ద అయిన బోడినాయుండు మటుకు ఇంకా రాలేదు. పెద్దమనుసులు అందురూ మానునీడలా వాళ్లవాళ్లకు తగిన తావును చూసికొని వసతిగా కూసుండుకొనిరి. సూర్యుండి తీవరం నుండి తప్పించుకొనే దానికి మానునీడలా కూసుండు కొని, ఇంక ఈ తీవరాన్ని ఎట్ట తప్పించుకోవాలంట మాటాడే దానికి ఆ కూటం కూడి ఉండాది.

బోడినాయుండూ వచ్చేసె. వచ్చి ఆతండికనే ఉండిన తావులా కూసుండె. అప్పుడు ఆడాండ్లు కొందరు తాగేదానికి చల్ల కొనివచ్చిరి. అందరికీ ఒగొగ చెంబు చల్లను ఇచ్చిరి. చల్ల లేకుండా వాళ్లనించి ఉండను కాదు. చుర్రంటా మండే ఎండ నుండి ఆ చల్లే కొద్దిగా పాదుగాపు వాళ్లకు. అయితే ఆ చల్ల అయినా ఇంక ఎన్ని దినాలు చిక్కు? ఇంక కొద్ది దినాల్లా నీళ్లు చిక్కేదే కష్టం అయిపోవు, ఇంక ఏడ చల్ల? ఆ ఒగ గుక్క చల్లను తాగి గొంతును తడుపుకొనిరి వాళ్లందురూ.

ఆడ కూసుండుకొని ఉండేవాళ్లు అందురూ బాగా సొత్తులు ఉండేవాళ్లే. పంటలు బాగ పండలేదనితేనూ కొద్దిగా సొత్తును అమ్మి బతికెయ్యచ్చు. అయితే వాననే లేకుండాపోతే తాగేనీళ్లకు బదులు సొత్తును తాగను అవునా! ఇప్పుడు వాళ్లందరి నిలమ (పరిస్థితి) అదే. ఆడ కూసుండుకొని ఉండే ఒగొగ మనిసికీ, ఏడిచేదానికి ఏదో ఒగ కారణం ఉండాది. అయితే ఏడిచి ఏమి ఒదవు (ప్రయోజనం)? కంటిలా ఉండే నీళ్లు పొల్లుబోవు తప్ప మంటిలా నీళ్లు చిక్కునా?

పలకరింపులు అన్నీ ముగిసి పెద్దాళ్లు అందురూ వేదనగా మాటాడేదానికి ఆరంబించిరి. "మనుసులకూ గొడ్డూగోజలకూ తినేదానికి ఏదీ లేకుండా పోడిసె. బొద్దాకూ కత్తాళి (కలబంద) గేంగు (దుంప)లూ కూడా కన్నుకు కానకుండా పోడిసె. ఎట్ట ఈ వరపు (కరువు)లా బతికేది" అనినాండు ఎండపల్లి రుద్రప్పనాయుండు.

"నువ్వు తినేదాన్ని పట్టి మాటాడేవు. ఇంక కొద్ది దినాల్లా తాగేదానికి నీళ్లే చిక్కేమాదిర లేదు. గొడ్డూ గోజల్ని విడండ. నీళ్లు లేకుండ మనం బతికేది ఎట్ట?" అడిగినాండు పుట్టా రంగయ్యనాయుండు.

"గంప సర్దుకొని ఈ తావును విడిచి వలసు పోవాలసిందే. ఈడనే ఉండితే అందురూ చచ్చేది కడ్డాయం" చెప్పినాండు ఆరి వరదరాజనాయుండు.

అబ్బ కూడా కూటానికి వచ్చి కూసుండి, దీన్నంతా వినికొని ఉండాడు ఏడు ఏండుల పిన్నాండు ఒగండు. వాని పేరు ఆవుల వేలుసామినాయుండు. వినికొని ఉండే ఆ పిన్నాండికి ఏలనో తెలవకుండానే బయం వేసింది. చుట్టూ చూసినాండు. అందురి మూతులూ(మొకాలు) ముడుచుకొని ఉండాయి. అబ్బను చూసినాండు. అబ్బ ఆవుల రంగసామి నాయుండి మూతీ అట్టనే ఉండాది. బయం జాస్తి అయింది.

"అబ్బా, వరుపు వచ్చితే మనమందురుమూ చచ్చిపోతుమా బా?" అంట సద్దుగా రాగం తీసికొని అడిగినాండు అబ్బను. వాండి అబ్బ "ష్" అంటా నోటికిపైగా చెయ్యిని మూసినాండు. రెండో నిముసంలానే తిప్పి అదే అడిగినాండు వేలుసామి.

"గమ్మట ఉండురా, ఊరికే నొయ్యి నొయ్యి అనికొని ఉండావు. దీనికే చెప్పితి, నిన్ను పిలిచికొని రానూంట" రంగసామి నాయుండు కొడుకుని సద్దుగ తిట్టినాండు. పెద్దలందరునూ మాటాడేది నిలిపేసి ఆ అబ్బాకొడుకుల పక్కకు చూసిరి. రంగసామికి అవమానం అయిపోడిసె.

"రేయ్, అవతల మానునీడలా పొయి కూసుండురా. మేము ఈడ మాటాడికొని ఉండితే, నువ్వు సద్దేసుకొని ఉండావు" అంటా వేలుసామిని తిట్టినాండు నీరుకొండ సుబ్బానాయుండు. వేలుసామి లేచి అవతల మానికిందకు పొయినాండు. కొడుకు పైగా కోపం వచ్చి, వాండిని తిట్టేదానికి రంగసామి నాయుండూ పొయినాండు. అవతల మాను వేరుపైగా మూతిని ముడుచుకొని కూసుండి ఉండాడు పిన్నాండు. ఆ చిన్న ముద్దుమూతిని చూసి, కోపం అంతా ఎగిరిపొయింది అబ్బకు. పొయి కొడుకు పక్కన్నే కూసుండినాండు.

"నిక్కంగానే వరపు వచ్చితే చచ్చిపోతుమా బా?" అబ్బను చూసి బయంబయంగా అదే అడకను అడిగినాండు వేలుసామి.

వరపును పట్టి (గురించి) కొడుకుకు తెలవబట్టేదాని కోసరం ఒగ కతను ఎత్తుకొనినాండు రంగసామి నాయుండు. అది ఆతండు అప్పటికప్పుడు యోచించి చెప్పింది కాదు. పరంపరగా ఆ తావు కాంపువాండ్ల (రైతుల) ఇళ్లల్లా చెప్పుకొనే కత అది.

★ ★ ★

"మన పంటల్ని పండించి మనల్ని బతికించే కాంపురాజుకు ఇద్దురు పన్నగత్తెలు (పెండ్లాలు) కొడుకా. ఓటి వానమ్మ, ఇంకోటి వరపమ్మ. వానమ్మ కురిసి కురిసి అన్నిటినీ చేవచేసి పెడితే, వరపమ్మ తన వేడి ఉసురును విడిచివిడిచి అన్నిటినీ అడచేసు (నాశనం చేసేసు). బతుకులా ముక్కాలువాసి కాలం వానమ్మ ఏలుమ(పరిపాలన) నడిచినా, ఆ కాలువాసి కాలంలానే, వానమ్మ ఇచ్చినదాన్ని అంతానూ అడచేసి పోడుసు వరపమ్మ. ఇచ్చేది మటుకే ఉండకూడదు, అడచేదీ ఉండాల అని, దేవుండ్లు కాంపురాజుకు వానమ్మనూ వరపమ్మనూ ఇచ్చి పెండ్లి చేసి పెట్టిరి.

కాంపురాజు ఇంటిలా ఆ సవతులకు జగడమే ముయ్యదు (తీరదు). జగడాలకు కారణమే కావలసింది లేదు, ఊరికే నేను పెద్దా నువ్వు పెద్దా అంటానే జగడాలు ఆడుతురు. అట్టనే ఒగపాలి వరపమ్మ జగడం ఆరంబించింది.

'నువ్వు ఏమో పెద్దమనిసి మాదిర మాటాడేవు. నేను లేను అనితే నీ అరుమ (ఘనత)నే తెలవదు తెలుసుకోవే' అనింది వరపమ్మ.

'ఊఁ ఊఁ, నువ్వు ఉండితేనే నా అరుమ తెలిసేది! పోవే నువ్వు ఎంతే బిగిసికొనినా, నీ కాలంలా కూడా జనాలు ఎండబావి (ఎండమావి)గా అయినా నన్ను చూసే తీరుతురు' అంట గర్వంగా చెప్పింది వానమ్మ.

వరపమ్మకు కోపం వచ్చి, 'సరిసరి, నువ్వే పెద్దమనిసని నేను నమ్మాలనితే నీ ఏలుమ కాలాన బతికిన, తిమురు(పొగరు)లేని ఒగ మంచిమనిసినయినా చూంపు చూస్తాము' అంట సవాలు వేసింది వరపమ్మ.

వానమ్మ కొద్దివేళ యోచించి, 'సరి విను, నా కాలాన బతికిన ఒగ అమ్మను పట్టి (గురించి) చెప్పేను. బాగా విని అనిక తెలుసుకో నా అరుమ' అంట ఆరంబించింది.

★ ★ ★

"గురవమ్మ ఊరు అదే. ఒగ ఇల్లు, బాగ పంట పండే చేను, ఆవులు, అన్నిటికంటే మంచి మొగుడు తోడ గురవమ్మ ఆ ఊరివాసి అయ్యుండింది. పెళ్లి అయ్యి అప్పుడే ఆ ఊరికి వచ్చి ఉండింది గురవమ్మ. ఆపెకు అప్పుడే పెళ్లి చేసికొనేదానికి ఇష్టం లేదు. ఇంత గక్కున (వేగంగా) పెళ్లి చేసినారని అమ్మా అబ్బాపైకి నిండా కోపం ఆపెకు. అయినా మొగుడే గతి అంట వచ్చింది.

ఆ ఊరి జనాలు అందురూ నవ్వు మూతి తోడ ఆపెను పలకరించిరి. దాన్నించి ఆపెకు కోపం ఎగిరిపోయింది. రెండుమూడు దినాల్లానే మొగుడంటే నిండా ఇష్టమయింది. ఇట్ట కష్టపడి వచ్చి, అనిక ఇష్టపడి కొత్త బతుకును ఆరంబించింది గురవమ్మ.

గురవమ్మ ఆరంబించిన ఆ కొత్త బతుకులా, కష్టాలూ ఇష్టాలూ అన్నీ ఒగ నెలలానే ముగిసిపోయె. చెప్పాలనితే గురవమ్మ బతుకు అర్థమే ముగిసిపోయె. ఆపె ఆడకు వచ్చినదానికి కారణమయిన మనిసి, ఆపె పన్నగాడు (భర్త) లేకుండా పోడిసె. గురవమ్మ మొగుడు ఉసురును విడిచేసె.

ఆ ఊరే పడిపడి ఏడిచింది. ఆతండు చచ్చిపొయిన దానికి ఏడిచిన వాళ్లకంటే, గురవమ్మ నిలవరాన్ని (పరిస్థితిని) చూసి ఏడిచిన వాళ్లే జాస్తి. అయితే గురవమ్మ కంట్లా నుండి ఒగ చొట్టు (చుక్క) నీళ్లే రాలేదు. ఒగ మూలలా, మోకాళ్లని రెండు చేతల్లా కట్టుకొని, ఓరినీ చూడకుండా, ఎర్రంగా సురిగి (కమిలి) పొయిన మూతితోడ, మొగుడి పీనిగను మటుకే చూసికొని కూసుండుకొని ఉండిపొయింది. అందురూ ఏడిచీ చీందీ అన్ని కార్యాలూ చేసి ముగించినాక కూడా, ఆపె ఆ తావుని విడిచి లెయ్యలేదు. మేము ఉండాము, బయపడొద్దు అంట తెంపు చెప్పను వచ్చిన వాళ్లనూ కనుగో(పట్టించుకో) లేదు గురవమ్మ. ఆపె పైకి ఎరక(జాలి) పడి వచ్చినాళ్లు కూడా, ఏమిరా ఈ ఆండది మొగుడు చచ్చినా ఏడవకుండా ఇట్ట రాయాల కుసుండుకొని ఉండాది, ఇది వచ్చే ఒగే నెలలా వాండు పోడిసినాండు అంటా తిట్టేసి పొయిరి.

గురవమ్మ పదారు దినాలు బైటకే రాలేదు. ఊరంతా ఆపెను తిట్టికొనే ఉండింది. బొట్టును తుడిపి తెల్లచీరను కట్టినప్పుడు కూడ ఒగ చొట్టు కన్నీళ్లు రాలేదే అని ఆపెను పట్టి మాట్లాడికొనే ఉండిరి. నెల దినాలు తాలి బైటకి వచ్చింది గురవమ్మ, తెల్లచీర కట్టుకొని, ఎర్రంగా మారిన అదే మూతితోడ. ఆపె వచ్చిన తోడనే, అప్పుటివరకూ తిట్టికొని ఉండినాళ్లు కూడా ఎరకపడి మాటాడించిరి. అయితే గురవమ్మ ఓరినీ(ఎవరినీ) కనుగోలేదు. వాళ్లు మాటాడిస్తేనూ తిరిగి కూడా చూడకుండా పొయికొనే ఉండింది. వాళ్లందరికీ కోపమూ ఆరువమూ(కుతూహలం) ఒగేపాలి వచ్చె, ఆపె ఏడకి పొయికొని ఉండాదా అని.

గురవమ్మ వేరే ఏడకూ పోలేదు. ఆపె చేనుకే పొయింది. గరికెక్కి(కలుపు మొలిచి) పొయి ఉండిన చేనును సుద్దం చేసేదాని కోసరం పొయింది. ఒగే ఆండది పనిని ఆరంబించింది. ఒగే ఆండది పనిని చేసింది. ఓరి ఒదవు(సహాయం)నూ తీసికోలేదు. ఓరి కోసరమూ ఎదురు చూడలేదు. ఇట్టనే ఆపె మొదటినాండు పనిని ముగించింది. ఊరంతా ఈ నడితి (సంఘటన)ని అరిది (ఆశ్చర్య) పడి చూసికొని ఉండింది.

దీనికంటె అరిదిపడే నడితి ఇంకొక పదిదినాల్లా నడిచింది. గురవమ్మవాళ్ల అమ్మా అబ్బా వచ్చి, గురవమ్మని వాళ్ల ఇంటికి పిలిచిరి. గురవమ్మ వాళ్లతోడ మాటాడనే లేదు. ఊరినాయుండు వచ్చి, ఎట్టెట్టనో చెప్పి చూసిరి. గురవమ్మ నోటిని తీయలేదు. ఎంత తిమురు ఈపెకు అంట ఊరివాళ్లకంతా గురవమ్మపైకి కోపం వచ్చేసె. ఆపె అమ్మా అబ్బా ఏడిచికొనే పొయ్యేసిరి. గురవమ్మ పైకి ఎరకపడిన వాళ్లంతా ఆపెను బాగా తిట్టిరి. మౌనంగానే అందరి తిట్టులనూ తీసికొని, తన పనికి తాను పొయింది గురవమ్మ. ఇట్ట ఆ ఊరిలానే ఇంకొగ పాలి రెండో కొత్తబతుకును ఆరంబించింది ఆపె.

ఆ ఊరే గురవమ్మను తోసి పెట్టేసిందంటే అది తప్పుమాట అవ్వు. ఆపెనే ఆ ఊరిని తోసి (దూరంగా) పెట్టేసింది అని చెప్పాల. ఊరిలా ఆపె మాటాడిన మనిసే లేడు. చేనులా ఆపె చెయ్యని పనేలేదు. గరిక కోసేదంట్లా ఆరంబించి, దుక్కిదున్నేది, విత్తులు విత్తేది, నీళ్లు కట్టేది ఇట్ట అన్ని పనులూ ఆపెనే చేసింది.

మొగుడు చచ్చినాక ఆ ఆండది పుట్టింటికి పోడుసు, అనిక ఈ అరబల్ల (రెండెకరాలు) చేనిని మనమే పెట్టుకోవచ్చు, అంట తలిచిన మొగాండ్లకు కోపం. ఈ ముండగరాలు ఇంటిపనినీ చేనిపనినీ చేసికొని మనల్ని తిట్లు తియ్యపెట్టికొని ఉండాదే, అంట ఆడాళ్లకు కోపం.

గురవమ్మ ఓరి కోపాన్నీ కనుగోలేదు. పంట పెట్టే కాలాన చేనిపని. పంటలేని కాలాన, తాటిఆకుల్లా బుట్టిలూ, ఈతాకుల్లా చాపలూ చేసి అమ్మికొని ఉండింది. కమ్మ పుట్టక పుట్టి కానిపనులు చేసికొని ఉండాది చూడు, థూ అంట దానికీ తిట్టిరి.

ఊరంతా తిట్టికొని ఉండినా గురవమ్మ తనపని తాను చేసికొనే ఉండింది. ఆ అరబల్ల రేగడి చేనిని, పాటుపడి పాటుపడి, మంచి పంటచేనిగా మారిచి మొదటిపంటను ఎత్తి చూంపేసింది. ఇట్టనే ఒగొగ ఏండూ పంటను జాస్తి చేసికొనే వచ్చింది గురవమ్మ. పంట జాస్తి అవ్వను అవ్వను, కడుపుమంట తోడ గురవమ్మను తిట్టేవాళ్లూ జాస్తి అయ్యిరి. దానినంతా కనుగోకుండా తన పాటులా తాను ఉండిపొయింది గురవమ్మ.

చూసితివా, ఓరూ లేని ఒగే ఆండది ఎట్ట బతికిందో నా కాలాన. ఇదే నా అరుమ, ఇదే నా పెరిమ" అంటా కతను నిలిపి, వరపమ్మను గర్వంగా చూసింది వానమ్మ.

వరపమ్మ మెల్లింగా నవ్వి "ఇంతవరకే చెప్పి ముగించేస్తే ఎట్ట? అనిక నీ ఏలుమ తీరి, నువ్వు పోడిసితివి. నా ఏలుమ కాలం వచ్చె. అప్పుడు నడిచింది చెప్పేను విను. అనిక నువ్వు ఏ లొల్లు అయినా మాటాడు' అంటా గురవమ్మ కతను తొడరింది వరపమ్మ.

'అట్టనే నిండా ఏండాదులు పోడిసె. గురవమ్మకు ఏంబై ఏండ్లు నిండిపోయె. అయితేనూ ఇంకా పాటు పడికొనే ఉండాది ఆపె. ఊరు ఆపెను తోసి పెట్టేసే ఉండాది. ఆ ఏండాది మంచి వాన కురిసె. అందరూ ఒగే సంతోసంగా దుక్కులు దున్ని విత్తనాలు వేసిరి. అయితే గురవమ్మ మటుకు ఆ పని చెయ్యలేదు. బతుకంతా తన రేగడిచేనులానే పాటుపడికొని ఉండాది కదా. ఆ చేనమ్మ ఏమి చెప్పెనో తెలవదు, ఆ ఏండాది దుక్కిదున్ని విత్తనాలు వేయలేదు గురవమ్మ.

'దీనికే చెప్పేది, ఆండదానికి ఏంటికి ఈ పనంతా అని. మంచి వాన కురిసినప్పుడు విత్తనాలు వెయ్యకుండా ఈ ముండగరాలు ఏమి చేసికొని ఉండాదో' అంటా ఎగతాళి చేసిరి అందురూ. అయితే వాళ్ల ఎగతాళి వాళ్లకే తిప్పిపోయింది. ఆ ఒగ

వానకు అనిక ఇంక వాననే లేదు. మొలిచిన విత్తనాలన్నీ మాడి పొయినాయి. నా ఏలుమ ఆరంబమయి ఉండాదే. అది వాళ్లకు తెలవలేదు. ఇట్టనే రెండుమూడుపాలి నడిచింది. జనాలు ఏమారి పొయి విత్తనాలు అన్నీ రేగడి చేనుల్లా పోసి వీను(వృథా) చేసికొనిరి. ఈపాలి అంత సులువుగా విడవకూడదు అని ముడువు (నిర్ణయం) చేసితి. నా శక్తిని చూంపను ఆరంబించితి.

పంటలన్నీ మాడిపొయినాయి. కుంటలన్నీ వట్టిపొయినాయి. ఇంతనూలు తేమ కూడా లేకుండా రేగడి నేలలన్నీ పాలపాలంగా పగిలి నెరకలుగులు పడినాయి. ఒగొగ నెరకలుగూ, మనిసిని పూడిచే అంత అగలంగా పగిలినాయి. గొడ్డూగోజా, మాను మనుమూ (జంతువు), గువ్వాకాకీ అన్నీనూ అల్లాడిపొయినాయి. జనాలు చిక్కి చిన్న (శ్రమ) పడి అయ్యో అంట అంగలారిచిరి. ఎందరో మనుసులు ఊరును విడిచి వలసు పోడిసిరి. పోలేని వాళ్లల్లా ఎందురో మనుసులు చచ్చిపోయిరి. ఒళ్లుమండి (జబ్బుతో) చచ్చినవాళ్లు కాదు, కడుపుమండి (ఆకలితో) చచ్చినవాళ్లే అందురూ. చాలదు చాలదు అంటా నా కన్నులు ఎరను (ఆహారాన్ని) తొళవి (వెదకు)కొనే ఉండినాయి....''

వరపమ్మ ఆ మాటలు చెప్పేనప్పుడు, బిడ్డల్ని తుడిపేసిన దానిని ఎట్ట పెరిమగా చెప్పెనో చూడు, అంట వానమ్మకు నిండా కోపం వచ్చింది. ఆ కోపాన్ని కనుగోకుండా వరపమ్మ కతను తొడరింది.

''ఇప్పటివరకూ బతికికొని ఉండిన మనుసులందరూ వాళ్ల ఒళ్లులా ఉండిన కొవ్వునించి బతికేసిరి. ఇంక ఇప్పుడు సన్నంగ కడుపే లేకుండ అయినాక ఏంజేసుతురో అంట తలిచి నవ్వి కొనితి. అయితే వాళ్లకు ఒళ్లు తక్కవ అయింది కానీ అరువు (బుద్ధి) తక్కవ కాలేదు. చింతాకుని నూరి తినేది, బొద్దాకుని ఉడకబెట్టి తినేది, గేంగుల్ని తోడి తినేది, మామిడిగొట్ట(టెంక)లా ఉండే పప్పును పిండిచేసి తినేది, ఎలిక బొందల్లా విత్తుల్నీ ఎలికల్నీ తినేది, ఇట్ట మంచిదీ చెడ్డదీ అంట తెలవకుండా చిక్కింది చిక్కినట్ల తిని బతికికొని ఉండిరి.

గురవమ్మ బతుకు అయితే ఇంకా మోసం. మొదటనే ఆపెను తోసి పెట్టేసిన ఊరు, ఇప్పుడు గురవమ్మ అనే ఒగమనిసి ఉండాదనే మరిచిపొయింది. గురవమ్మ మటుకు బతుకును విడవలేదు. ఆ కష్టకాలాన కూడాకొండలు గుండులు ఎక్కి, చింతాకు బొద్దాకు అంటా తెచ్చి తినికొని ఉండింది. ఐదారు దినాలకు ఒగపాలి ఇంటిని విడిచి బయటకు వచ్చు, అంతే.

ఓరన్నా, ఆపె ఇంటి పక్కనుండి పొయేటప్పుడు, ఇంటికి వెనకాల ఉండే మామిడిమాను కింద నుండి గురవమ్మ సన్నంగా పాడే పాట సద్దును వినికొని పోతురు. ఆ పాట అనితే గురవమ్మకు నిండా ఇష్టం. చేనిలా పనిచేసే కాలాన్నుండి దినానికి ఎన్ని పాలి ఆ పాట పాడుకొనే తెలవదు. ఇప్పుడునూ సన్న గొంతు తోడ అదే పాట పాడికొనే ఉండాది.

వానలు కురిసేనా మామిడి వానలు కురిసేనా
ఈ నా మంచి నెల్లో మామిడి వానలు కురిసేనా
దుక్కులు దున్నేనా మామిడి దుక్కులు దున్నేనా
ఈ నా మంచి నెల్లో మామిడి దుక్కులు దున్నేనా
యితనాలు యిత్తేనా మామిడి యితనాలు యిత్తేనా
ఈ నా మంచి నెల్లో మామిడి యితనాలు యిత్తేనా
మొలకంట మొలిసేనా మామిడి మొలకంట మొలిసేనా
ఈ నా మంచి నెల్లో మామిడి మొలకంట మొలిసేనా
పైరంట పెట్టేనా మామిడి పైరంట పెట్టేనా
ఈ నా మంచి నెల్లో మామిడి పైరంట పెట్టేనా...
....

'మామా మామా, మిమ్మల్ని గురవమ్మ సామ (అవ్వ) పిలిచికొని రమ్మనింది' అంటా ఒగ చిన్నపిన్నాండు వచ్చి ఊరి నాయుండికి చెప్పినాండు. ఆతండికి ఒగే అరుదూ అతిసయం. 'గురవమ్మ సామా రా, సరింగా చెప్పు' ఇంకొగపాలి అడిగినాండు. 'అవ్వ మామా' అని ఆ పిన్నాండు చెప్పిన తోడ (వెంట)నే, గురవమ్మను చూసేదానికి వెళ్లినాండు.

ఊరినాయుండికి ముప్పయ్యేండ్లు ఉండు. ఆతండి చిన్నవయసునుండీ గురవమ్మను చూసికొనే ఉండాడు. ఆపె ఓరి కూడా మాటాడేది లేదని తెలుసు ఆతండికి. ఆ మాదిర మనిసి, ఇప్పుడు పిలిచిందంటే ఏమి కారణం ఉండు అంటా ఆరువంగా పొయినాండు.

ఆ ఇంటి లోగా ఎట్ట ఉండునో, నలుగురు మనుసులు ఉండే ఇళ్లే ఇప్పుడు ఓటీ లేకుండా ఉండాయి. ఒక్క మనిసి ఉండే ఇల్లు ఇంక ఎట్ట ఉండు, అని తలచికొనే ఇంటిలోగాకి పొయినాండు. ఆతండు తలచిన మాదిరే ఆ ఇల్లు బొక్కుంటా (బోసిగా) ఉండాది. గురవమ్మ మటుకు ఒగ మూలలా పండికొని ఉండాది. నాయుండు వచ్చిందామ (వచ్చిన వెంటనే), మెల్లింగ లేచి వచ్చింది. ఆపెని చూసితే నిండా మోసంగా ఉండాది. ఎమికల గూండు పైకి సురిగిన తోలు, ఆ తోలుపైకి చినిగిన తెల్లచీర, అంతే.

దగ్గిరకి వచ్చి 'బిడ్డా' అంటా నాయుండి మూతిని తడిమింది. పుల్లలాల ఉండే ఆపె వేలి ఎమికలు నాయుండి మూతిని గుచ్చినాయి. ఆతండికి ఇంకా అరిది జాస్తి అయ్యింది. ఇన్ని దినాలు ఓరికూడానూ మాటాడని మనిసి, ఇప్పుడు నన్ను పిలిచి మాటాడికొని ఉండాదే అని. ఆపె, నాయుండి చెయ్యిని ఎత్తి తన తలపైకి పెట్టికొని 'నువ్వు నాకు ఒగ సత్తెం చెయ్యాల బిడ్డా' అంట అడిగింది. నాయుండికి గొంతునుండి మాటే రాలేదు. సరి అనే మాదిరిగా తలను ఆటినాడు.

'నేను చచ్చినాక నన్ను ఆ మామిడిమాను కిందనే పూడవాల. ఇదే కడసీ కోరిక' అంట అడిగింది గురవమ్మ. 'అట్టనే చేసేను సామా' అంటా చెప్పేసి బయటకి వచ్చేసినాండు నాయుండు. ఏల ఈ సామ ఇట్ట అడిగింది అంట నాయుండికి కలకం (వ్యాకులత) ఉండింది.

రెండు దినాల్లానే నాయుండి కలకాన్ని పోబెట్టేసింది గురవమ్మ. ఆపె చచ్చిపొయింది. నాయుండికి దిక్కుంట (గుభీమని) అయిపొయింది. నాయుండికి ఏమి, ఓరికయినా అట్టనే ఉండు. ఓరి కూడానూ మాటాడకుండా ఏండులేండులే బతికేసిన ఆపె, చచ్చేదానికి ముందర, నన్ను ఈడనే పూడవాల అంట చెప్పి చచ్చిపోతే ఎట్ట ఉండు?

సమాచారం తెలిసిన తోడనే నాయుండు గక్కున గురవమ్మ ఇంటికి పొయినాండు. ఆతండికి సమాచారం ఇచ్చిన ఒగ అమ్మ తప్ప ఆడ ఓరునూ లేరు. ఇంకా ఊరిలోగా తెలవలేదా, తెలిసినా వచ్చుతురా అని కలకంలానే ఆతండి కడమ (కర్తవ్యం)ను ఆరంబించినాండు.

ఊరిలోగాకి సమాచారాన్ని అంపపెట్టినాండు. నలుగురు మనుసుల్ని పిలిచికొని వచ్చి, గురవమ్మ చెప్పిన మామిడిమానుకు కింద గుంటను తోండేదానికి ఆరంబించినాండు. ఊరి మనుసులు వచ్చుతురా అని నాయుండు సందేహ పడిందానికి అట్టనే ఎదురు(వ్యతిరేకం)గా నడిచింది. ఊరు ఊరే ఆడ ఉండాది. గుంట తోండను తోండను, అందురికీ తలతిరిగి పడిపొయ్యేంత ఆచ్చెర్యం.

ఓరి కూడానూ మాటాడకుండా, ఓరినూ కనుగోకుండా, అమ్మా అబ్బా వచ్చి గెంజినా (బతిమాలినా) పోకుండా, వాన కురిసినా విత్తనాలు వేయకుండా, పాలపాలంగ పగిలిన రేగడి చేనులా మొగాళ్లు చేసే పనుల్నంతా చేసికొని ఉండిపొయిన ముండగరాలు గురవమ్మ, బానలు బానలుగా విత్తనాలను పాదుగాచి (బద్రంచేసి), ఆ ఊరికోసరం, ఆ మామిడిమానికింద పూడిచిపెట్టి ఉండాది.

నాకే అతిసయంగా, నాపైకి నాకే కోపంగా ఉండింది. ఊరి జనాలకు కూడా అట్టనే ఉండి ఉండాల. ఏడిచిరే, ఆడాండ్లూ మొగాండ్లూ అంట తెలవకుండ అందురూ ఏడిచిరే, ఏల వానమ్మా, నువ్వే ఏడిచితివే గురవమ్మ త్యాగాన్ని చూసి, నెల లెక్కలా ఏడిచితివే, ఏడిచి ఏడిచి నా ఏలుమను తరిమేసితివే, జ్ఞాపకం లేదా నీకు? నీ ఏడుపులా గురవమ్మ విత్తుగా మారి ఒగ కొత్త యుగమే పుట్టిందే. ఇప్పుడు చెప్పు ఓరు పెద్దమనిసి అంట. నీ కాలాన తిట్టులు తీసికొని ఉండిన గురవమ్మ, నా కాలాన పేరంటాలే అయిందే, ఇప్పుడు చెప్పు" అంట అడిగింది వరపమ్మ. వానమ్మ దగ్గిర బదులుగా ఉండింది మళ్లీ ఏడుపే. ఏడిచింది.

★ ★ ★

"రేయ్ కొడుకా, ఇప్పుడు వరపు అనితే ఏమి అని తెలిసిందా రా" అంటా కొడుకు గడ్డాన్ని పట్టి కులికించుకొనే అడిగినాండు రంగసామినాయుండు. వేలుసామి తలను ఊఁ అంట ఆటికొనే 'తెలిసింది అబ్బా' అనినాండు. రంగసామి మనసుకి ఒగ నెమ్మది చిక్కింది. పరంపరగా వచ్చికొని ఉండే కతను అవతల తలకట్టు(తరం)కు అందబెట్టిన నెమ్మది అది.

"రేయ్ రారా, కూటంలా ఏమో చదివికొని ఉండారు. కూటం ముగిసే మాదిర ఉండాది" అంటా కొడుకుని ఎత్తికొని కూటంకు వచ్చినాండు ఆతండు. ఇంకా ఓరూ లెయ్యలేదు. కూటం నిండా ఆరువంగా గమనించికొని ఉండాది. బోడినాయుండు గంబీరంగ కూసుండికొని ఉండారు. ఆతండి పక్కలానే కరణం నిలిచికొని, చదవబోయేదానికి తయారుగ ఉండారు. రంగసామినాయుండూ, ఆతండి కొడుకూ నిలిచి వినికొని ఉండారు.

"కూడు లేని ఈ వరపు కాలాన, మన ఊరు బతికేదాని కోసరం, ఇన్ని దినాలుగా మేము చేరిచి పెట్టికొని ఉండిన మా మద్దినేని వారి జొన్నగుంట (ధాన్యం పాతర) ఇంక ఊరి పొదువు (ఉమ్మడి). ఏంబై తులాల బంగారమూ, రెండుపడుల (సేర్ల) ముత్తేలూ, రెండు పడుల పగడాలూ, ఐదు మణుపుల వెండీ... ఊరందరికీ కూడు వేసేదానికీ, అనిక చెరువు కట్టేదానికి అయ్యే చెలువు (ఖర్చు)కూ ఉపయోగంపడు. మా నూరు బల్లల(400 ఎకరాలు) చేనూ ఇల్లూ అన్నీనూ ఇంక ఎండకుండ నీళ్లను ఇచ్చే చెరువుగా మారి, ఊరికి మంచిది చేసు. మా తోంట పన్న మనుసులు (పాలేర్లు) అందురూ ఇంక ఊరికోసరం పని చేసుతురు. ఇన్ని ఏండాదులుగ మేము సంపాదించి పెట్టికొని వచ్చిన, మా పరంపర సొత్తు అయిన దీనినంతా, మేము మా దాయాదులూ అందరమూ చేరి, మనసుపూర్తిగ నిండా సంతోసంతోడ, ఈ ఊరికీ ఊరిజనాల మంచికీ ఇచ్చేము..." అంటా కరణం చదివి ముగించిరి. బోడినాయుండు లేచి చెయ్యెత్తి మొక్కిరి. ఊరే ఏడిచే దానికి ఆరంబించింది. ఏడిచికొని ఉండే జనాలను అందరినీ నవ్వుమాతి తోడ చూసేసి, మాటాడేదానికి ఆరంబించిరి బోడినాయుండు.

"ఈ సొత్తులన్నీనూ కూడుగా కాసుగా చెరువుగా మారినాక దానినంతా చూసుకోవాలసిన బొరువు (బాధ్యత)ను ఆపుల రంగసామినాయుండి దగ్గిర ఇచ్చేను..."

బోడినాయుండి మాట విని జనాలంతా కొలపం (అయోమయం)గా చూసిరి.

"మీరే ఉండేనప్పుడు ఏల ఈ బొరువుని ఇంకోరి దగ్గిర ఇచ్చేరు" అంట కూటం నుండి ఎవరో సద్దుగా అడిగిరి.

"ఇంకమీదట ఈ సొత్తులన్నీ ఊరిపొదువు. దీనిపైకి మేము ఒరిమ (హక్కు) అడగలేదు అనినా, మా ఎదురుకాల (భవిష్యత్తు) తలకట్టులు అడగచ్చు. దాన్నించి..." అంట కొద్దివేళ మాటాడేది నిలిపిరి బోడినాయుండు. ఆతండి గొంతు నుండి వెళ్లేదానికి ఆ మాటకూ ఇష్టం లేదు ఏమో! అందురూ ఆరువంగా చూసికొని ఉండారు. మళ్లీ ఆరంబించిరి బోడినాయుండు.

"మేమూ మా దాయాదులు అందరమూ ఈ ఊరిని విడిచి వెళ్లేము" అంట ముగించిరి.

ఆ కూటం పొంగి ఏడిచేదానికి ఆరంబించింది. ఆ ఏడుపు సద్దుల నడువులా వేలుసామి, వాండి అబ్బుమాతిని తిరిగి చూసినాండు. అబ్బా ఏడిచికొనే ఉండాడు. వాండికి తెలిసిపొయింది, వానమ్మ కండితంగా ఏడుచు అని.

కొంగునాడు ప్రాంతంలోని ఉడుమలపేటలో నివసించే 14 ఏళ్ల సంజనా పద్మం తెలుగు నేర్చుకుని, వారు మాట్లాడుకునే తెలుగులో రాసిన కథ ఇది. ఇలాంటి దాదాపు ఇరవై కథలు రాసింది. 'రేగడి నీడల్ల' పుస్తకం వెలువడింది. 2017 సెయింట్ లూయిస్ తానా సభల అతిథి. email: vasanthpadvel@gmail.com

కోసూరు కుంటోడు

సామల మురళి

ఈ కథలో ఉన్న తెలుగు మనం మామూలుగా చదువుకునే తెలుగు కాదు. కర్ణాటక సరిహద్దుగా వున్న తమిళనాడు ప్రాంతంలోని హోసూరు ప్రాంతపు తెలుగుభాష ఇది. తెలుగులో బోర్డులు రాయించడానికి, బస్సుల మీద ఊళ్ల పేర్లు తెలుగులో పెట్టడానికి, తెలుగు బడులు నిలబెట్టుకోడానికి పెద్ద ఉద్యమమే సాగింది. ఆ ఉద్యమం లోంచి పుట్టిందే 'కృష్ణగిరి జిల్లా రచయితల సంఘం.' ఆ సంఘ సభ్యుడు ఈ రచయిత

మా ఊరు లోగాకి మీరు వస్తా వుంటే, మొదులు మొదులు మీ కండ్లల్లా పడేది కొలముదిన్న దగ్గరుండే మా బడే. బడిని ఆనుకోని ఇండ్లు మొదులయితాయి. ఒగప్పుడు మా ఊర్లా బడే ఉండ్లేదంట. బడి ఉండే తావులా మా తాతోళ్లు చేను చేసుకోని జొన్నలు పెడుతా ఉండిరంట. గవురుమెంటోళ్లు బడి ఇచ్చినంక, తాతోళ్లు ఆ తావును బడికే విడిచేసిరంట. చిన్నోళ్లు చదివి ఉద్దారకం కానీ అని పెద్దోళ్లకి ఆస ఉంటాది కదా!

బడిలా మేము ఆరుగురు చిన్నోళ్లము జతగాళ్లము. జుట్లోడు (అంటే నేను), తోట్లోడు, చిన్నోడు, పెద్దోడు, ముళ్లపందిగాడు, కుంటోడు ఇదీ మా గుంపు. మా ఆరుగురులా కుంటోడు ఒగడే బడిలోగాకి వచ్చేలేదు. వాడిని లోగాకి రానిస్తారా? అట్లా వస్తేనూ తన్ని తరిమేస్తారు.

కుంటోడు అంటే ఎవురికీ ఇష్టం లేదు కానీ మా ఐదుగురికీ మట్టుకు చానా ఇష్టము. మేము తెల్లవారి తొమ్మిది గంటలకు బడిలోగాకి పొయ్యేటబ్బుడు కానగమాను కింద కూకోని మమ్మల్ని పలకరిస్తాడు. తిరగా మాపుసారి బడి విడిచినంక ఇంటికి పొయ్యేటబ్బుడు 'బద్రంగా పోడిసిరండ్రా' అని చెప్పి అంపిస్తాడు. మద్దేనము అన్నము గంట ఎబ్బుడు కొడతారా అని బడిలా మేము కాసుకోనుంటే, బడిబయట కానగమాను తావ కుంటోడు కాసుకోనుంటాడు.

మా వక్కాకు మేస్టరు మాకు పాటము పద్దెము చెప్పిచ్చి, కతలు చెప్పి నగిపిచ్చి, కంబడి బర్రల్ని మా యీపులమింద యించిపారేసి ఏడిపించి, అనెంక అన్నము గంట కొట్టిపిస్తాడు. అందరమూ జాబుగా కూకొన్నంక పాపక్క, గంగక్కలు వచ్చి, మా ముందు తట్టలు లోటాలు పెట్టి, అన్నమూ చారూ కోడిగుడ్డూ వేసేసి పోతారు. 'ఆకొన్న కూడె అమృతము....' అంటా పద్దెము చెప్పేసి, చిన్నోళ్లంతా తట్టల మిందకు వంగుతారు. మేము ఐదుగురుమూ మా తట్టలెత్తుకొని బయట కానగమానుల నీడకు పోతాము. ఆడ మా కుంటోడు కాసుకోనుంటాడు మా కోసరము.

మమ్మల్ని చూస్తానే కుంటుకుంటా ఎదురొస్తాడు మాకు. ఆరుగురుమూ నీడలా కూకుంటాము. ముద్దకి ముద్దకి నడాన మాటల్ని నంచుకొంటా తింటాము. కుంటోనికి తట్ట లేదు కదా, దాన్నింక మేమే వానికి ఒగొక ముద్దను కలిపి పెడతాము. రవంచ రవంచ కోడిగుడ్డునూ తుంచి ఇస్తాము. గమ్మున్నే ఒగ తావ కూకోని తినేలేదు కుంటోడు. కుంటికాలు ఎగరేసుకుంటా మా ఐదుగురుకీ ఆ పక్క ఈపక్క

తిరుగులాడతా తింటుంటాడు. మేము నగితే నగుతాడు. మేము తిడితే దూరంగా పొయి మమ్మల్నే చూస్తా ఉంటాడు. మేము పిలిస్తే పారి వస్తాడు. తినేసి మేము కానగమానుకింద కోతికొమ్మచ్చి ఆడేకి సురువు చేస్తాము. ఆ కుంటికాలుతోనే కుంటోడు కొమ్మలమింద దుముకులాడతా మా జతలా ఆట్లాడుతాడు. లోపలిగంట కొట్టి మేము బడిలోగాకు పోతావుంటే, ఏమో పోగొట్టుకొన్నోని మాదిరిగా మా తట్టు చూస్తాడు. మాపుసారి బడి విడిచినంక కుంటోనితో రవంచ పొద్దు ఆట్లాడతాము. మేము ఇంటికి పోతా ఉంటే, కానగమాను బీటి వరకూ మాకు తోడుగా వస్తాడు. రెయ్యిపూట కూడా ఆ కానగమాన్నే వానికి దిక్కు.

వానికి ఎవురూ లేరా అంటే ఉండారు. వాని గుంపే చానా పెద్దది. అయితే కుంటోడు అనేమో వాళ్లెవురూ కుంటోన్ని చేరిపించుకొనేది లేదు. మావాళ్లయితే దగ్గరికే రానిచ్చేది లేదు. ఇందురుండి కూడా ఒంటి బతుకు మా కుంటోనిది. ఎండకు వానకు రెయ్యికి పగులుకు ఆ కానగమానే వానికి తోడు.

ఒగదినము మద్దేనము మా జతలా అన్నము తిన్నాడు, ఆట్లాడినాడు, మేము లోగాకి పోతా ఉంటే మమ్మల్ని వెతగా చూసినాడు. మాపుసారి బడి విడిచినంక చిన్నోళ్లందురూ ఇండ్లకు తిరిగిరి. మేము ఐదుగురుమూ కుంటోని తావుకు కానగమాను కిందకి పోతిమి.

మానుకింద కుంటోడు యెల్లలుకులా పడిండాడు. మేము బిరబిర పోయి వానిని తాకి చూస్తిమి. ఉసురాడతా లేదు. కుంటోడు చచ్చిపోయిండాడు. మేము ఐదుగురుమూ గొళ్ళో అని ఏడిచేస్తిమి. ముళ్లపందిగాడైతే 'కుంటోడా లెయిరా' అంటా బొడుసుకోని బొడుసుకోని ఏడిచినాడు. 'నిన్ను మన్ను చేసేకి ఈవూర్లా ఎవురుండార్రా' అంటా తోట్లోడు కెర్లినాడు.

నేనే ముందుగా కండ్లు ఉజ్జుకొని, అందరినీ సుదారిస్తిని. 'రేయ్, మన కుంటోనికి మనముండాము కదరా. వాన్ని మన్ను చేసి, అన్ని సాంగేలూ చేయాలరా' అంటిని.

'అవున్రా, వాన్ని మన్ను చేసేకి వాళ్లగుంపూ మనగుంపూ ఎవురూ వచ్చేలేదు రా. మనమే చేయాల్రా' అన్నాడు చిన్నోడు.

'సరిరా, చిన్నోడా పెద్దోడా, మీరిద్దురూ పొయ్యి మన బడి వెనకాలుండే చింతమాను కింద గుంత తోడండ. ఏయ్ ముళ్లపందీ, నువ్వూ తోట్లోడూ చేరి పాడెకట్టండ. నేను మా ఇంటికి పొయ్యి, మా పిన్నయ్యకు తెలీకుండా మా అంగట్లా ఉండే ఉప్పును ఎత్తుకోనొస్తాను' అనేసి నేను ఇంటితట్టుకి పారితిని.

నేను రెండు ఉప్పు పొట్లాలు దొంగిలించుకొని వచ్చేతలికి, ముళ్లపందిగాడూ తోట్లోడు కలిసి పాడెను కట్టిపెట్టిండారు. ఇంగ రవంచేపుకి గుంత తోడేసిన చిన్నోడూ పెద్దోడూ వచ్చిరి. అందురుము చేరి కుంటోన్ని పాడె ఎక్కిస్తిమి.

ఎవురైనా తీరిపోయినబ్బుడు పాడె ముందు పలకలు కొడతా పొగిడే పబ్బితి మా తావులా ఉంది. మేము బడిలా ఉండే మా తట్టల్ని ఎత్తుకోనొచ్చి, కట్టెతో ఆ తట్టను టమటమ అని కొడితిమి. నడాన ఒగతావులా పాడెని నిలిపి, 'ఉప్పుకప్పురంబు ఒక్క పోలికనుండు, చూడచూడ రుచుల జూడ వేరు, పురుషులందు పుణ్యపురుషులు వేరయా, విశ్వదాభిరామ వినుర వేమా అన్నట్లుగా మన కుంటోడు సొర్గలోకానికి పోయి, ఆడ రంబా ఊరువశీ మేనకలతో సంతోసంగా ఉండాలని, ఎవురయ్యా అంటే మన అమరనారా బసవరాజన్న ఏభైపైసాలిచ్చి బో గొప్పగా బో యశస్సుగా పొగిడించినాడహో...' అని పొగిడితిమి.

గుంతతావ పాడెని దింపితిమి. నేను గుంతలోగాకి చూస్తిని. గుంతలా తలకాయి గుంతలేదు. గుంతలోపల్నే పీనిగ తలకాయిని ఇంగ రవంచ లోగాకి పెట్టేకి ఇంగొక చిన్న గుంతను తోడుతారు. దానిని మరిచిపొయ్యిండారు మావోళ్లు. నేను గుంతలా తలకాయి గుంతను తొగితిని. గుంత అడుగులా కానగాకుల్ని పరిచి, ఆకుల మింద ఒగ పొట్లము ఉప్పును పోస్తిమి. ఏడుపు వస్తా ఉంటే

మింగుకోని, కుంటోన్ని పాడెనింక ఎత్తి గుంతలో పెడితిమి. పైన ఇంగొక పొట్లం ఉప్పును పోసి, ఆకులతో మూస్తిమి. అనెంక కుంటోని మింద తలా పిడికిడు మన్నేసి, గుంతను మూసేస్తిమి.

'రేయ్, ఇంతే అనుకొనద్దండా. మన కుంటోనికి మూడు దినాలకు పాలు, ఏడు దినాలకు చిన్నదివసము, పన్నెండు దినాలకు పెద్ద దివసము అన్నీ చేయాల. వానికి మనమే కదా సొంతగాళ్లము' అంటిని. 'అట్లే చేస్తాము రా' అన్నట్లు అందురూ తలల్ని గుంకాయించిరి. ఎవురెవురు ఏమేమి తేవాలో అనేది మాట్లాడుకోని ఊరి తట్టుకు అజ్జలు పెడితిమి. అంతవరకూ మాకు తోడుగా ఉండి, కుంటోని చావుకు వెతపడతా ఉండిన పొద్దప్ప కూడా వాళ్లింటికి తిరుక్కొన్నాడు.

ఆ మరుసనాడు ఆయిత్తారము కాబట్టి మేము బడితట్టుకే పోలేదు. సోమారం తెల్లవారి లేసి, పొయ్యిమింద ఉండే పాలు ఒగ చిన్న సీసాలాకి నింపుకొని, పటము తావ ఉండే సామ్రాణికడ్లు రెండూ, అగ్గిపెట్టే ఎత్తుకొని బడితావుకి పారిపోతిని. అంచేపుకే నా జతగాళ్లు నలుగురూ వచ్చిండారు. వాళ్ల చేతుల్లా నిప్పట్లూ కజ్జాయలు అట్లా తినేకులు ఉండాయి. నలుగురుము కలిసి బడి దగ్గిరికి పోతిమి. ఎబ్బుడూ ఎదురొచ్చి పలకరించే కుంటోడు గేపకానికి వచ్చినాడు. మాకు ఏడుపొచ్చింది. అట్లే వాని గుంత తావుకి పోతిమి. ఒగ లక్కిలి చెట్టు కొమ్మను కొట్టుకోనొచ్చి, కుంటోని తలతావ పూడిస్తిమి. ఆ కొమ్మ బుడములా పాలు పోస్తిమి. తీళ ఆకుల్ని పీక్కోని వచ్చి, ఆయాకుల్లా తినేకుల్ని పెట్టి, కుంటోనికి తళిగ వేస్తిమి. సామ్రాణికడ్లు అంటించి, కుంటోనికి మొక్కేసి, కండ్లు ఉజ్జుకుంటా బడికి పోతిమి.

ఆపొద్దు కుంటోడు లేకుండా, మేము ఐదుగురే ఒగ తావ చేరి అన్నము తింటా ఉంటే, అన్నము మాకు లోగాకి పోతా ఉండ్లేదు. ముళ్లపందిగాడయితే కుంటోన్ని తలుచుకోని దుక్కిచ్చి దుక్కిచ్చి ఏడిచినాడు. మేమందురుమూ చేరి వానిని సుదారిస్తిమి.

'అది సరేరా, ఏడో దినము చిన్న దివసానికి కుంటోనికి నంజర పెట్టాల కదా, ఎట్లరా?' అన్నాడు చిన్నోడు. అవును ఎట్ల? నంజర తెచ్చి చారు చేసి పెట్టేకి మా చేతిలా అయితుందా అనుకొని వెతపడితిమి.

'ఒరే నాదొక యోచన. మనకు మద్దేనము అన్నములా కోడిగుడ్లు ఇస్తారు కదా. గుడ్లు కూడా నంజరే కదా. అవిటిని కుంటోనికి పెట్టి చిన్నదివసము చేద్దాము రా' అన్నాడు తోట్లోడు. వాని యోచన అందరికీ సరే అనిపించింది.

దినమూ అన్నముగంట పొద్దులా కుంటోని గుంత తావుకి పొయ్యి వాన్ని తలుచుకోని వస్తా ఉంటిమి. అట్లే చిన్న దివసము నాడు మా కోడిగుడ్లునంతా వాని గుంత తావునే పెట్టి, వానికి మొక్కేసి వస్తిమి.

ఇంగ పన్నెండో దినము పెద్ద దివసము చెయ్యాల. పెద్ద దివసానికి అన్నదానము చేయాల. కేళిక ఆడిపించాల. ఎట్లా అని యోచన చేస్తిమి. మా వక్కాకు మేస్టరు దినమూ వక్కాకులు తెమ్మని చెప్పి నన్ను అంగడికి అంపిస్తా ఉంటాడు. తెచ్చిచ్చి నందుకు దినానికి ఒగ రూపాయి ఇస్తాడు నాకు. ఆ దుడ్లునంతా కూడేస్తిని. బడిలా ఏమిటికో కట్టాల అని చెప్పి, మా ఇండ్లల్లా ఐదైదు రూపాయలు అడిగి ఇప్పించుకుంటిమి.

ఆ కాసుల్నంతా పెట్టి, అటుకులూ బెల్లమూ సామ్రాణికడ్లూ కర్పూరమూ తీస్తిమి. తోట్లోడు వాని ఇంటితావనింక తెంకాయా అంటిపండ్లూ ఎత్తుకోని వచ్చినాడు. తెంకాయీ బెల్లమూ తురిమి అటుకుల్లా వేసి, అంటిపండ్ల ముక్కలు కలిపి, కుంటోని గుంతతావ పెట్టి మొక్కితిమి. ఆ అటుకుల్నే మా బడి చిన్నోళ్లకంతా పంచిపెట్టి అన్నదానమును ముగిస్తిమి. అనెంక మేము ఐదుగురుమూ గుంత తావుకి పోయి, కట్టెలు ఎత్తుకొని తిప్పతా 'సోపుదారి వచ్చే సబకు...' అంటా ఏవేవో పాటలు పద్దేలు పాడి కేళిక ఆడిన సాంగెమును ముగిస్తిమి.

'అన్ని సాంగేలూ ముగిస్తిమిరా, ఇంగ మన కుంటోడు నెట్టుగా సొర్గానికి పోయిడుస్తాడు రా' అని ఒగరికొగరు చెప్పుకొని నెమ్మది పడితిమి.

సాంగేలన్నీ చేసి వానిని సొర్గానికి అంపిస్తిమే కానీ, వాడు లేని వెత మాకు చానా దినాలు అట్లే ఉండిపోయె. కానగమాను నీడలా కావుకావుమంటా మమ్మల్ని పలకరిస్తా, కూటిగంట పొద్దులా కుంటికాలేసుకోని మా చుట్టూ తిరగతా ఉండిన కాకినే మేము కుంటోడు అంటా ఉండింది. మా కుంటోన్ని మరిచేకి మాకు చానా దినాలు పట్టె. ఇబ్బుడూ కావుకావుమనే ఒగే కాకి అరుపు నా చెవ్వులా పడితే, మా కుంటోడేమో అని తిరిగి తిరిగి చూస్తా ఉంటాను నేను.

తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా డెంకణకోట తాలూకాకు చెందిన సామల మురళి తన ప్రాంతపు తెలుగులో రాసిన కథ ఇది. ఇది ఇతని మొదటి కథ. ప్రస్తుతం ఉడుమలపేటలో పల్లెల్లో తెలుగు నేర్పే కార్యక్రమములో ఉన్నాడు.

తెలుగుకు సాధికారత కావాలి

డా. సామల రమేష్‌బాబు

2017 తానా సభల అతిథి వ్యాసం

భాషాప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడాలని స్వాతంత్ర్య దినోత్సవ కాలంలోనే పలువురు ఉద్యమించారు. మార్క్సిస్టు భావజాలంలో వున్నవారు, ఇతర సోషలిస్టు వర్గాలు కూడా పలు భాషాజాతీయుల సమాఖ్యగానే మన సమాజాన్ని చూశారు. భారత జాతీయ కాంగ్రెస్ ఈ విషయంలో తీర్మానం చేసింది కూడా. అప్పుడు స్వాతంత్ర్యం సాధించడమే ప్రథమ కర్తవ్యమని, దేశం స్వతంత్రమైన తరువాత భాషాప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడాలని. కానీ రాజ్యాంగం ఏర్పడిన తరువాత కూడా ఉద్యమాలు చేసిగానీ భాషాప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటుచేసుకోలేని పరిస్థితి వచ్చింది. ఆంధ్రరాష్ట్రం భాషా ప్రాతిపదికన ఏర్పడిన మొట్టమొదటి రాష్ట్రంగా చెపుతూ వుంటాం మనం. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన కొద్దికాలానికే నిజాం రాజ్యంలోని తెలుగు ప్రాంతమైన తెలంగాణని, ఆంధ్రరాష్ట్రాన్ని కలిపి ఆంధ్రప్రదేశ్‌గా చేశారు. ఈ కలయికకు ప్రాతిపదిక ఒకే భాషీయులమని సూత్రమే.

భారతదేశం పలు భాషాజాతుల సంగమంగా వుంది. ఇక్కడే రాజకీయాలను కూడా భాష శాసిస్తుంది. ఇక్కడ భాష, కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య, రెండు సమూహాల మధ్య సంబంధాలను ఏర్పరచేది మాత్రమేగాక, రాజకీయమైన రాగద్వేషాలకు ప్రధానమైన కారణం కూడా అయింది. అయితే ప్రాంతీయమైన అస్థిత్వపోరాటాలు భాషాజాతుల వాస్తవ రేఖలను దాటి ఇతర రాజకీయాంశాల సాధనే ప్రధానంగా చేసుకుని సాగిన సందర్భాలున్నాయి. ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు వెనుక ఈ లక్షణం వుంది. సంయుక్త మద్రాసు రాష్ట్రంలో వుండగా కూడా ఆ రాష్ట్రాన్ని తెలుగు ముఖ్యమంత్రులే పరిపాలించారు. వారు అగరం సుబ్బరాయలు రెడ్డి (1920-21), పానగల్లు రాజా (1921-26). డాక్టర్ సుబ్బరాయన్ (1926-30), బొల్లిని మునిస్వామినాయుడు (1930-32), బొబ్బిలి రాజా (1932-37), కూర్మా వెంకటరెడ్డి (1987), టంగుటూరి ప్రకాశం (1946-47), ఓమండూరు రామస్వామిరెడ్డి (1947-49), పి.ఎస్. కుమారస్వామిరాజా (1949-52), చక్రవర్తుల రాజగోపాలాచారి (1952-54).

ప్రత్యేక తెలుగురాష్ట్రం కోసం ఆనాడు పోరాడిన నాయకులకు ఈ సంగతులు తెలియవని కాదు. స్థానిక నేతలతో పోటీపడి తాము ఎన్నటికీ అధికారంలోనికి రాలేమేమో నని తలచిన ఆంధ్ర ప్రాంతపు మేధావులు ప్రారంభించిన ఉద్యమం చివరకు ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు దారితీసింది. దానితో మిగిలిన రాష్ట్రం తమిళ భాషా రాజకీయాలలోకి కూరుకుపోయి అక్కడి అసంఖ్యాక తెలుగు ప్రజలు భాషా పరమైన అణచివేతకు గురి కావలసి వచ్చింది.

మొత్తం తెలుగుజాతికి బలమైన స్థావరంగా తయారుకాగల దనుకున్న ఆంధ్రప్రదేశ్‌ను పరిపాలించిన నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసమే అధికారపీఠాల్ని ఆక్రమించారు తప్ప, తెలుగుజాతి భాషా సంస్కృతుల రక్షణకోసం ఎన్నడూ చిత్తశుద్ధితో ఆలోచించలేదు. శతాబ్దాలుగా విభిన్న పరిపాలకుల కింద నలిగిన ప్రాంతాలు తెలుగుభాష పేరున రాజకీయంగా ఒకటైనపుడు వారిమధ్య వున్న వైవిధ్యాంశాలను సమీక్షించి వారిమధ్య ఐక్యతా భావాన్ని సంబంధాలను పెంపొందించే ప్రయత్నం ఏనాడూ చేయకపోగా విభజించి పాలించే సూత్రాల్నే వాళ్ళ అవలంబించారు. దాని ఫలితంగా రాష్ట్రం మళ్ళీ రెండుగా విడిపోయింది. ఆంధ్ర ప్రదేశ్ సంయుక్తంగా వున్న కాలంలో పరిపాలనలో, విద్యారంగంలో తెలుగు అణచివేతకు గురయింది. సమకాలీన అవసరాలకు తగ్గవిధంగా భాషను అభివృద్ధి చేసుకోలేకపోయాము. దానికితోడు 1990 తరువాత ప్రపంచీకరణ వ్యూహాల్లో మన ప్రభుత్వాలు ఇరుక్కుపోయాయి. ఇంగ్లీషు పట్ల మోజును పెంచి పోషించాయి. ఇంగ్లీషే దిక్కని, తెలుగు ఒట్టి పనికిమాలిన భాష అని అనుకునే పరిస్థితిని తెచ్చిపెట్టారు. ప్రపంచంలోనే శక్తివంతమైన గొప్ప భాష, గొప్ప లిపి కలిగిన భాషగా నిపుణులు నిర్ణయించిన తెలుగును ఆధునిక అవసరాలకు ఉపయోగించుకోలేకపోవటంతో అది క్రమంగా కేవలం మాట్లాడుకోవటానికి పనికొచ్చే భాషగా మాత్రమే జనసామాన్యం భావించే పరిస్థితిని పాలకులు తెచ్చి పెట్టారు.

ఆంధ్రప్రదేశ్ పరిపాలకులకు ఒక భాషావిధానం అంటూ ఎన్నడూ లేదు. తమిళనాడు, కర్ణాటక వంటి పొరుగు రాష్ట్రాలలో పరిస్థితి పూర్తిగా మనకు భిన్నంగా వుంది. వారు వారి భాషలను అన్ని రంగాల్లో సమున్నతంగా నిలిపారు, తమ భాషా జాతీయతను చెప్పకోడానికి అక్కడి ప్రజలు గర్వపడేట్లు చేశారు. ఆఖరుకు తమిళనాడులో 42% తెలుగు మూలాలున్న ప్రజలు తమిళీకరణ చెందే విధంగా వారి ప్రభుత్వ విధానాలు రూపొందించుకున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా అదే పరిస్థితి. కర్ణాటకలో కూడా ఇంచుమించు ఇదే పరిస్థితి. ఇటువైపు ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు స్వాభిమానం కేవలం పెదవుల వరకే పరిమితమై ఆచరణలో శూన్యమైన స్థితికి కేవలం పాలకవర్గాలు కారణం. ఇక్కడ పాలక వర్గాలు అంటే నా అభిప్రాయం ప్రతిపక్ష పార్టీలు కూడా.

మన పతన శాతం ఎంత?

మాతృభాషల ప్రాధాన్యాన్ని మాతృభాషల్లోనే పరిపాలన, విద్యాబోధన వండాలన్న శాస్త్రీయ ధృక్పథాన్ని 'యునెస్కో పరిగణన లోకి తీసుకుని, 6,000కు పైబడిన ప్రపంచ మాతృభాషల్లో సగానికి పైగా అదృశ్యమయ్యే పరిస్థితిని గుర్తించి, 1999లో ప్రత్యేకంగా సర్వేలు నిర్వహించింది. మాతృభాష రక్షణకోసం ప్రతి ఏడూ ఫిబ్రవరి 21న 'అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం'గా ప్రకటించింది. నేటి బంగ్లాదేశ్ తూర్పుపాకిస్తాన్‌గా వున్నపుడు 1952లో పశ్చిమ పాకిస్తాన్ పరిపాలకులు తమను కూడా ఉర్దూలో పరిపాలించడాన్ని నిరసించి తమ మాతృభాష బెంగాలీని రక్షించుకోవటం కోసం ఉద్యమించారు.

భారతదేశం మొత్తమ్మీద తెలుగు ప్రజలు ఇప్పుడు 18 కోట్లకు తక్కువ వుండరని అంచనా. వీరిలో సగంమంది మాత్రమే నాటి సంయుక్త ఆంధ్రప్రదేశ్‌లో అంటే నేటి ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాలు రెంటిలో కలిపి వున్నారు. తక్కిన సగంమంది ఇతర రాష్ట్రాల్లో, ఎక్కువగా పొరుగు రాష్ట్రాల్లో వున్నారు, తమిళనాడులోనే 8 కోట్ల మంది; కర్ణాటకలో సుమారు 2 కోట్లు: మహారాష్ట్ర, ఒరిస్సా, మొదలైన రాష్ట్రాల్లో కూడా పెద్దసంఖ్యలో వున్నారు. బంగ్లాదేశ్‌లోనే కొన్ని లక్షలమంది బహుశా 3 లక్షలకు పైగా తెలుగు వారు వున్నట్లు ఇటీవలి అంచనా. ఇప్పుడు చెప్పండి రెండు తెలుగు రాష్ట్రాల్లో వున్న 9 కోట్ల మందిలో నిరక్షరాస్యులెంతమంది? అక్షరాస్యుల్లో తెలుగు నిరక్షరాస్యులెంతమంది? మనపిల్లలు, మనుమలు ఎంతమంది ఇప్పుడు తెలుగు నేర్చుకుంటున్నారు? ఇంగ్లీషు మాటలకు తెలుగు మాటలు జోడించి మాట్లాడుతున్నారా లేదా తెలుగు మాటలకు ఇంగ్లీషు జోడించి మాట్లాడుతున్నారా? మన పరిపాలనలో తెలుగు భాగం ఎంత? ఆధునిక శాస్త్ర సాంకేతిక అవసరాలకు తెలుగుకు స్థానమంటూ వుందా? పాఠశాలల్లో, కళాశాలల్లో తెలుగు వుందా, వుంటే ఎంతవరకూ వుంది, ఎలా వుంది? ఇవన్నీ ఆలోచిస్తే సూలంగా అర్థమయ్యేదేమిటి? ఇంకొక్క ఆలోచన కలపండి. ఇతర రాష్ట్రాల్లో సగంమంది తెలుగువారున్నారనుకున్నాం కదా, వారిని గురించి ఏనాడూ మనమూ పట్టించుకోలేదు, రాష్ట్రాల్లో తెలుగు స్వాభిమాన ఉద్యమాలూ అంతంత మాత్రమే. భాషాపరమైన అణచివేతకు వాళ్ళంతా గురై మాతృ భాషా హక్కులకు దూరమైనారు. వాళ్ళల్లో బహుశా 95 తెలుగు భాషా నిరక్షరాస్యులే. ఇప్పుడు లెక్కవేయండి- మనం, మన పతనం ఏ శాతంలో వుందో!?

మాతృభాషా మాధ్యమం

ఇన్ని సంగతులను నిజాలను చెప్పకున్నాం, మాతృభాషకే చోటు లేని పరిస్థితుల్లో మాతృభాషామాధ్యమాన్ని గురించి ఏం చెప్పకుంటాం? రాజ్యాంగంలో కూడా 17వ విభాగంలో అధికార భాష గురించి వివరించారు. దానిలో 2వ అధ్యాయంలో రాష్ట్రాల అధికార భాషల గురించి, రాష్ట్రాల్లో అల్పసంఖ్యాకుల భాషలకు ప్రత్యేక గుర్తింపునివ్వటం గురించి స్పష్టంగా చెప్పారు. 850-ఎ అధికరణంలో భాషాపరమైన మైనార్టీలకు ప్రాథమికస్థాయిలో మాతృభాషా విద్యాబోధన గురించి స్పష్టంగా చెప్పారు. భాషా రాష్ట్రాల్లో వున్న పిల్లలకే తమ మాతృభాషలో ప్రాథమిక విద్యను నేర్చుకునే హక్కున్నప్పుడు, స్వరాష్ట్రంలో వున్న పిల్లలకు తమ మాతృభాషలో కనీసం ప్రాథమికవిద్యను నేర్చుకోవడాన్ని ఒక హక్కుగా, ఒక తప్పనిసరి అంశంగా ఎందుకు అమలు చేయరు? మనరాష్ట్రంలో ఒకప్రక్క ప్రాచీనభాషగా గుర్తింపు కోసం పోరాటం జరుగుతుండగానే 2006లో నాటి ముఖ్యమంత్రి జి.వో.76 ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశపెట్టారు. కనీసం ప్రాథమికస్థాయిలో

తెలుగును తప్పనిసరి చేయలేదు. అంటే పిల్లవాడిని ఎల్.కె.జి.లో చేరుస్తూనే అప్పటిదాకా పుట్టి పెరిగిన భాషలో కాకుండా పరాయి భాషలో వాడికి విద్యాబోధన మొదలవడాన్ని ప్రభుత్వం అనుమతి స్తుందన్నమాట!

తెలుగు ప్రజలకు తెలుగు వారమనే స్వాభిమానం ఏ ఇతర భాషీయులకూ తీసిపోదు. ఇది అనేక సందర్భాలలో ప్రకటిత మైంది. అందువల్లనే 18 కోట్లమంది తెలుగు ప్రజలు మాట్లాడు కునే భాషగా, పాడుకునే భాషగా, ఆడుకునే భాషగా సుఖదుఃఖా లను తెలుపుకునే భాషగా తమ తల్లిభాషలలోనే బ్రతుకుతున్నారు, ఎటుతిరిగి తమ పిల్లల భవిష్యత్తుకు తెలుగుభాష, ఆ భాషా మాధ్యమం ఉపకరించదనే అభిప్రాయంతో ప్రభుత్వం, మేధా వులు చూపిన దారిన నడుస్తున్నారు. దీనికి తప్పపట్టవలసింది ప్రభుత్వాన్ని పాలక వర్గాలను, మేధోవర్గాలను మాత్రమేగాని ప్రజలను కాదు, భాషను ఆధునిక అవసరాలకు తగ్గట్లుగా అభివృద్ధి చేయనందువల్ల, అన్ని స్థాయిల్లో తెలుగును వినియోగించనందు వల్ల మాత్రమే ప్రజలు తెలుగు వాడుకకు దూరమవుతున్నారు. ఈ వాస్తవాన్ని గుర్తించి ఇప్పుడు మనం ఉద్యమాలను రూపొం దించుకోవలసి ఉంది.

మాతృభాషా మాధ్యమమే శాస్త్రీయమని ప్రత్యేకంగా చెప్పన వసరం లేదు. అయితే ఇప్పడున్న వాస్తవ పరిస్థితిని బట్టి ఆలోచిస్తే ఎల్.కె.జి. నుండి పి.జి దాకా, శాస్త్రసాంకేతిక విద్యలతో సహా మొత్తం విద్యారంగాన్ని వున్నపాటున తెలుగులోకి మార్చేయడం సాధ్యం గానంత అగాధంలో మనం పడివున్నాం. కనుక ఒకటి నుంచి పదో తరగతి వరకు మాతృభాషా మాధ్యమంలోనే బోధించడాన్ని వెంటనే తప్పనిసరి చేయాలి. ఇదీ ఒప్పుకోని పరిస్థితులున్నపుడు కనీసం ప్రాథమిక విద్యను అంటే 5వ తరగతి వరకు మాతృభాషా మాధ్యమాన్ని తప్పనిసరి చేయాలి. దీన్ని కఠినంగా రాష్ట్రమంతా స్కూళ్ళతోసహా తప్పనిసరి చేయాలి. తెలుగుభాషోద్యమ సమాఖ్య 2008లో వచ్చిన జి.వో.నెం. 86 ప్రకారం ఒకటి నుంచి పదో తరగతి వరకు ఏ భాషా మాధ్యమంలో నడిచే బడిలోనైనాసరే తెలుగును ఒక సబ్జెక్టుగా తప్పనిసరి చేశారు. కానీ దాని అమలులో నాటి నుంచి నేటి వరకు అన్ని ప్రభుత్వాలూ శీతకన్ను వేశాయి. ఇంటర్మీడియెట్ నుంచి ఆపై చదువులో తెలుగుకు దాదాపు లేకుండా పోయింది. మాధ్యమం ఏదైనా కాలేజీ, ఆపై దశల్లో కూడా తెలుగును ఒక సబ్జెక్టుగా బోధించాలనే డిమాండు అట్లాగే వుంది.

ముందుగా- కనీసం పాఠశాల స్థాయివరకు లేదా ప్రాథమిక విద్య వరకు మాతృభాష మాధ్యమాన్ని పాటించితీరేట్లుగా ఉద్య మించాలి. జి.వో.నెం. 86ను కఠినంగా అమలుపరచటంతోపాటు కళాశాల స్థాయి చదువుకు కూడా ఆ సూత్రాన్నే వర్తింపజేసేటట్లు అదేవిధమైన మరొక జి.వో ను తీసుకురావాలి. మాతృభాషలో పునాది గట్టిగా వుంటే పరభాషలనెన్నైనా భాషలుగా నేర్చుకోవచ్చు నని, మాధ్యమంగా వాటిని తీసుకోవాల్సిన అవసరం లేదనే శాస్త్రీయ సూత్రం ప్రాతిపదికపై విద్యావిధానం వచ్చేట్లు పోరాడాలి. తెలుగుభాషోద్యమ సమాఖ్య ఎంతో పోరాడి సాధించిన జి.వో.నెం. 909/2018 ప్రకారం ఏర్పడిన భాషా మంత్రిత్వశాఖ క్రింద తెలుగు ప్రాధికారసంస్థను వెంటనే రెండురాష్ట్రాల్లోనూ ఏర్పాటు చేయించి అన్నివిధాలా తెలుగు రక్షణ, భాషాభివృద్ధి బాధ్యతలను దానికప్పగించాలి. ఇందుకోసం భాషోద్యమకారులు ఎప్పటినుంచో కోరుతున్నారు, తెలుగును అత్యాధునిక అవసరాలకు తగినట్లు తీర్చిదిద్దడంతో పాటు విద్యా పాలనారంగాల్లో తెలుగును సాధికా రికం చేసేందుకు ప్రాధికార సంస్థను నెలకొల్పవలసిందిగా రెండు ప్రభుత్వాలను కోరుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఈ సంస్థను నెలకొల్పటానికి నిర్ణయించారుగాని ఇంతవరకు అమలు లోకి రాలేదు.

భాషారక్షణ అనే మాటను సరైన విధంగా చేసుకోవటంలో విఫలమవుతున్నారో లేక కావాలనే ప్రవర్తిస్తున్నారో కాని కళా సాహిత్య సాంస్కృతిక రంగాల్ని పెంచి పోషిస్తే భాషను రక్షించు కున్నట్లేననే తప్పుడు అభిప్రాయాన్ని వ్యాప్తి చేస్తున్నారు. ప్రజా స్వామ్యవ్యవస్థలో తమ సర్వహక్కుల్ని కాపాడుకునేందుకు ప్రజలకు బలమైన ఆయుధం తమ మాతృభాష. ప్రపంచంలోని అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా దూసుకుపోయేందుకు అనువైన, శక్తివంతమైన భాష మన తెలుగు, వాడకుండా వుంటే ఏ ఆయుధ మైనా, ఏ అవయవమైనా నశించిపోతుంది. భాష కూడా అంతే, పైపెచ్చు స్వంత భాషలో, స్వాభిమానంతో వ్యవహరించలేని జాతి పరాయీకరణ చెందుతుంది. బానిసజాతిగా మిగిలిపోతుంది. ఇతర భాషలను వద్దనడం లేదు. ఇప్పటి పరిస్థితుల్లో ఇంగ్లీషును వద్దనడం అసలే లేదు. కాని దాన్ని ఒక భాషగా అవసరం అను కుంటే 1వ తరగతి నుండే లేదా 8వ తరగతి నుండే నేర్చండి. భాషగా మాత్రమే. మాధ్యమంగా కాదు. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలు అనుసరిస్తున్న విధానం ఇదే.

తమ భాషా సంస్కృతులను పరిరక్షించుకోవాలని, ఒక పెద్ద భాషాజాతికి చెందిన సమూహంగా, అమెరికాలో సామాజిక గౌరవాన్ని పొంది తమదైన ఉన్నత ప్రభావాన్ని కలిగిస్తున్న తానా ప్రత్యేకంగా భారతదేశంలోని తెలుగువారి మధ్య కొన్ని సమున్నత కార్యక్రమాల్ని చేపట్టి నడుపుతున్నందుకు సంతోషం.

అలుపెరుగని తెలుగు భాషోద్యమ కార్యకర్త. తెలుగుభాష పరిరక్షణ కోసం ఇరవై ఏళ్లుగా 'నడుస్తున్న చరిత్ర' పత్రికను నడిపి, ఆ తర్వాత దాన్నే 'అమ్మనుడి'గా మార్చారు. ఏడు పదుల వయసున్న ఈ ఆయుర్వేద వైద్యుడు తెలుగు భాషా వైద్యానికి పూనుకున్నారు. తెలుగుభాష మీద పదులకొద్దీ వ్యాసాలు రాశారు. 2017 తానా గిడుగు స్మారక పురస్కార గ్రహీత. నివాసం విజయవాడ. 2017 తానా సభల అతిథి.

email: ammanudi@gmail.com

భావితరాల కోసం మానవీయ, సామాజిక శాస్త్రాల అధ్యయన ఆవశ్యకత

గారపాటి ఉమామహేశ్వరరావు

భారతదేశంలో విద్యా విధానం నూటయాభై ఏళ్లనాటి నుంచి పెద్ద మార్పులు ఏవీ లేకుండా ఉంది. మానవీయ, సామాజిక శాస్త్రాలూ ఇంకా అదే వ్యవస్థను ప్రతిబింబిస్తున్నాయి. మానవీయ, సామాజిక శాస్త్రాలు సంక్లిష్టమైనవీ వైవిధ్యభరిత మైనవీ. ఇవి ఇతర శాస్త్రాలలాగా ఏకీకృతంగానో ఏకరూపత తోనో ఉండవు. వీటిలో, ప్రాథమికంగా, సాహిత్యం, భాషా శాస్త్రం, తర్కశాస్త్రం, తత్వశాస్త్రం, చరిత్ర, రాజనీతి, సాంఘిక, మానవపరిణామంలాంటి సామాజికశాస్త్రాలు మానవ సమాజంతో ప్రత్యక్ష సంబంధం కలిగినవి. మానవ సమాజంలో వ్యక్తులలో సామాజికనీతిని నెలకొల్పేవీ వ్యక్తులమధ్య నైతిక సంబంధాలనూ నిర్వచించేవీ మానవీయ విలువలను పాదు కొల్పేవీ మానవీయ, సామాజికశాస్త్రాలే. సమాజాలలోని వైరుద్ధ్యాలను తగ్గిస్తూ అందరికీ ఆమోదయోగ్యమైన సామాజిక వ్యవస్థకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేసేవి మానవీయ సామాజికశాస్త్రాలే. ఇది నిరంతర ప్రక్రియ. ఒకసారి జరిగి అయిపోయేది కాదు. ఎప్పటికప్పుడు సమాజంలోని వివిధ వ్యవస్థల మధ్యనున్న ప్రతికూల పరిస్థితులను సర్దుబాటు చేసేవి మానవీయ, సామాజికశాస్త్రాలే.

కాలంతోపాటు వచ్చిన మార్పులతో వివిధ రంగాలకు సంబంధించిన జ్ఞానక్షేత్రాలు వాటి సహజ సరిహద్దులను మార్చుకొంటూ కొత్త వర్గీకరణలతో మార్పులూ చేర్పులూ పొందాయి. ఈ రంగాలలో సృజించిన జ్ఞానం సమాజంలో వాటికి దక్కిన గౌరవం ఎల్లప్పుడూ ఒకే విధంగా లేదు. ప్రాచీన కాలంలో వ్యాపార వాణిజ్యశక్తులు బలహీనంగా ఉన్నప్పుడు, సమాజంలో పేరూ గౌరవమూ పొందిన పౌరులు ఎక్కువగా భాషాశాస్త్రం, సాహిత్యం, తర్కశాస్త్రం, తత్వశాస్త్రం, రాజనీతి లాంటి మానవీయ సామాజికశాస్త్రాలకు చెందినవారే. పాణినీ, పతంజలీ, కాళిదాసూ, భర్తృహరీ, భవభూతీ, ఆర్యభట్టూ, వరాహమిహిరుడూ, కౌటిల్యుడూ, నాగార్జునుడూ మొదలైన వారంతా మానవీయ శాస్త్రాల సిద్ధాంతకర్తలే. వారికి చాలా వరకూ అమూర్త ప్రయోజనాలే ముఖ్యం. వస్తు ప్రయోజనాలపట్ల ఆసక్తి తక్కువ. వీరందరూ తమతమ రంగాలలో నిరంతరంగా సరికొత్త భావనల సృష్టి వాటిని వ్యాప్తి చేసినా దైనందిన జీవి తానికి పనికివచ్చే ఉపకరణాలనూ పనిముట్లనూ నిర్మించడం పట్ల పెద్దగా ఆసక్తి కనబరచలేదు.

18వ శతాబ్దంలో ప్రారంభమైన భౌతిక, సాంకేతిక, గణితశాస్త్రాలలో విప్లవాత్మక పరిశోధనలూ వాటి ద్వారా సాధించిన బ్రహ్మాండమైన అభివృద్ధీ దానితో సరితూగుతూ

సామాన్యుల జీవితాలకు వెలుగు చూపిన పారిశ్రామిక ప్రగతి, దానికి తగ్గట్టుగా టెక్నాలజీ విస్ఫోటనం మానవ సమాజంలో పెనుమార్పులనే మోసుకొచ్చాయి. ఇవన్నీ, ప్రపంచం నలు మూలలా మానవ సమాజంలో సరికొత్త వాణిజ్యశక్తుల పెరుగు దలకు బీజాలు పడేందుకు దోహదం చేశాయి. అవే వివిధ దేశాల రాజకీయాలను శాసిస్తూ మానవ సమాజాలకు ఆధునిక రూపురేఖ లను సంతరించిపెట్టాయి. ఐతే ఇది మానవీయ శాస్త్రాలపట్ల చిన్నచూపు కలిగేలా, ప్రజలకు వాటి అవసరంలేదు అన్నట్లుగా చేసి వాటిపట్ల ఏహ్యతాభావాన్ని పెంచింది.

మానవ సమాజం చివరకు అతిసాంకేతికతకు లక్ష్యమైంది. దీనితో మానవ సమాజం మొత్తం 'హైటెక్' కిడ్నాపుకు గురయింది. వ్యక్తుల సంబంధాలను మలచడంలో మార్కెట్ శక్తులు నిర్ణాయ కంగా మారడానికి మార్గం సుగమమైంది. నేటి భౌతిక వస్తువుల నిర్మాణానికి అవసరమైన జ్ఞానసృజ నకూ, దానికి అవసరమైన సమాచార వినిమయానికి అంతర్జాలంతో మమేకమైన ప్రసారరంగం ఓ విప్లవా త్మక శక్తిగా ఎదిగింది.

మానవీయ శాస్త్రజ్ఞులు తమ సుషుప్తావస్థ నుండి మేల్కొని మాన వీయ శాస్త్రాల ఔచిత్యాన్ని ప్రస్తుత సందర్భంలో వాటి సామాజిక అవసరాన్నీ గుర్తించి తిరిగి ఉద్ధరించడం తక్షణా వసరం.

జీవ, ఖగోళ, భౌతికశాస్త్రాలైన వివిధ రంగాలలోనూ మానవ శాస్త్రాలైన తత్వ శాస్త్రం, సాహిత్యం మొదలైన ప్రతి పరి శోధనా రంగంలోనూ లేదా ఏ రంగంలో నైనా జ్ఞాన సృష్టి నిరంతరంగా జరుగుతూనే ఉంటుంది. ఐతే అట్లా నిరంతరంగా వివిధ రంగాలలో వెలువడుతున్న సమస్త జ్ఞానమూ ఉపయోగకరమే అయినాగానీ అదంతా ఉ న్నదున్నట్లుగా ఉప యోగించదగినది కాదు. ఎందుకంటే, అన్ని జ్ఞానరూపాలూ ఉప యోగకరమే కానీ ఉ పయోగించదగిన రూపంలో ఉండకపోవచ్చు. కారణం, సాధారణరూపంలో ఉన్న ఆ జ్ఞానం నేరుగా వాడకానికి లేక వస్తువుల ఉత్పత్తికి పనికిరాకపోవచ్చు.

అనువర్తిత శాస్త్ర, తంత్ర సాంకేతిక రంగాలలో అంటే అప్లైడ్ సైన్సెస్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ అని పిలవబడే రంగాలలో పరి శోధనలు వెంటనే ఉపయోగించదగినవిగా ఉంటాయి. ఏమంటే, ఈ రంగాలలో సృష్టించిన జ్ఞానం వస్తువుల ఉత్పత్తికి అను సంధించదగినవిగా ఉంటాయి. ఇట్లాంటి ఉపయోగించదగిన జ్ఞానాన్ని సృష్టించినవారికి ధనలాభం ఉంటుంది. ఇది నేరుగా సంపద సృష్టితో సమానం. ఈ జ్ఞానాన్ని ఉపయోగించి సృష్టించిన వస్తువులకు విపణివీధులలో గిరాకీ, సృష్టికర్తలకు సంపదా చేకూరతాయి.

> *మానవీయ శాస్త్రవేత్తలు సంప్రదాయ సాధారణ విశ్వాసాల నుండి బైటపడి ఆర్థిక వనరులను సృష్టించే మార్గాల అన్వేషణను ఆలోచించే సమయం ఇప్పుడు ఆసన్నమైంది. భాషాశాస్త్రం, సాహిత్యం, తర్కశాస్త్రం, తత్వశాస్త్రం, రాజనీతి లాంటి మానవీయ సామాజిక శాస్త్రాల ద్వారా సృజించిన జ్ఞానసంపద అమూర్త స్థితిలోనే ఉంటుంది. అంటే వీటికి ఇప్పటివరకూ వస్తు రూపంలో ఉండే అవకాశానికి ఆస్కారం తక్కువ. ఇవి సమాజంలోని వ్యక్తులనూ వివిధ వ్యవస్థలనూ తద్వారా మొత్తం సమాజాన్ని నియంత్రిస్తాయి.*

వివిధ రంగాలలో సృజించే జ్ఞానరీతుల మధ్యనున్న వ్యత్యా సాన్ని గమనించండి. జ్ఞానం ఏ రంగంలోదైనా ఉపయోగకరమే కానీ ఉపయోగించదగిన జ్ఞానం కొన్ని రంగాల నుండి మాత్రమే వస్తోందని గమనించాలి. సామాజిక, మానవీయ శాస్త్రాల పరిశోధన లలో వెలువడుతున్న జ్ఞానం ఉపయోగకరమే అయినా ప్రస్తుతం సంపదను ఆర్జించే విధంగా ఉపయోగించదగిన జ్ఞానసృష్టి మాత్రం జరగడంలేదు. అంటే మానవీయ శాస్త్ర పరిశోధనలు సంపదను సృష్టించడంలేదు. ఇంకో విధంగా చెప్పుకోవాలంటే, మన సమాజంలో మానవీయ సామాజిక శాస్త్ర పరిశోధనలను సంపదను సృష్టించగలవాటిగా గుర్తించ నిరాకరిస్తున్నాం. దీనితో వారికి వాణిజ్యంలో వాటా దక్కడంలేదు. స్థూల జాతీయ ఉత్పాదనలో చెప్పుకోదగ్గ భాగస్వామ్యం లేదు. అందుకే ఈ రంగాలలోని పరిశోధకులకు సంఘంలో గౌరవమర్యాదలకు లోటు. వారి జ్ఞానం సంపదను సృష్టించదు గనుక వారి పోషణ సమాజానికి భారం అవు తోంది.

ఐతే, ఇక్కడ అందరం ఒక విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఏ శాస్త్రం సృష్టించిన జ్ఞానమైనా అధ్య యన అధ్యాపనలకు దూరం కాదు. కానీ, ఇంజనీరింగ్, తంత్ర, సాంకేతిక రంగాల పరిశోధనల నుండీ ఉత్పన్న మైన జ్ఞానబోధనకు అవకాశాలు ఎక్కువ. సంపదను సృష్టించే అవకా శాలను అందించే జ్ఞానబోధనకు విపరీతమైన గిరాకీ ఉండటం పెద్ద ఆశ్చర్యజనకం ఏమీకాదు. ఈ ప్రపంచంలో మూడు రకాల జ్ఞాన సృష్టి జరుగుతోంది. సంపదసృష్టికి ఆధారమైన వస్తూత్పత్తిలో ఉపయోగించదగిన జ్ఞానసృష్టికి ఆధార మైన తంత్ర, సాంకేతిక రంగాలూ (టెక్నాలజీ, ఇంజనీరింగ్) ఒక వైపూ అమూర్త ప్రయోజనాలలో వాడేందుకు మాత్రమే ఉపయోగకరమైన జ్ఞానసృష్టిని మాత్రమే అందించగల సామాజిక మానవీయ శాస్త్ర రంగాలూ ఇంకొకవైపూ ఇంకా ఈ రెండింటికీ చెందని మూడవ తరహా జ్ఞానసృష్టికి ఆధార రంగాలైనవాటిలో వైద్యం, వ్యవసాయం మొదలైనవీ ఉంటాయి. ఇవి సామాజిక, మానవీయ శాస్త్ర రంగాలలా పూర్తిగా సేవారంగానికి చెందినవి కానప్పటికీ, వైద్యం ప్రధానంగా సేవారంగమే. ఇక వ్యవసాయం మౌలికంగా ఇంజ నీరింగ్ రంగమే. ఐతే ఇక్కడ సహజ వనరుల నుండి ఉపయో గించదగిన భౌతికావసరాలను తీర్చే పదార్థాలను ఉత్పత్తి

చేయడమే దీని లక్షణం. ఇక్కడ వస్తువు భౌతికమైన పదార్థం మాత్రమే.

ప్రస్తుతం, మానవీయ శాస్త్రాలలో పరిశోధకులకు ప్రేరణ, ఇంజనీరింగ్ తదితర సాంకేతిక రంగాలలోని శాస్త్రవేత్తల పరిశోధనలకు భిన్నంగా ఉంది. నేడు మానవీయ శాస్త్రాలలో పరిశోధనల ఉత్పత్తి తమ జ్ఞానసృజనల ప్రచురణలకూ సేవలకూ మాత్రమే పరిమితం.

అంటే వేల సంవత్సరాల నుండి నేటిదాకా మానవ నాగరికతకు మూలమైన జ్ఞానసృజనకు ఆధారమైన జ్ఞానక్షేత్రాలను అన్నింటినీ ఉత్పత్తి రంగాలనీ సేవా రంగాలనీ రెండు విధాలుగా వింగడించవచ్చు. మానవీయ, సామాజిక, వైద్య, యాజమాన్య విద్యారంగాలు నేరుగా సేవలను మాత్రమే అందిస్తాయి. ఈ రంగాలలో పరిశోధన ఎలాంటి వస్తూత్పత్తి లేకుండా సేవలను మాత్రమే అందించేందుకు ఉపయోగపడుతుంది. ఐతే ఇంజనీరింగ్, తంత్ర, సాంకేతిక వ్యవసాయ రంగాలలో పరిశోధన వస్తూత్పత్తి ద్వారా పరోక్షంగా సేవలను అందిస్తుంది. పాడి పరిశ్రమను చూడండి. పశుపాలన ద్వారా పాలూ, వాటి నుండి అనేక ఉత్పత్తుల తయారీ అంతా ఒక ఇంజనీరింగ్ వ్యవస్థకు చెందినదే. ఇంజనీరింగ్ అంటే ఇంతకు మునుపు వ్యవసాయం గురించి చెప్పుకొన్నట్లే పదార్థ ఉత్పత్తి లక్ష్యంగా గలది. సేవారంగాలలో వైద్యం ఒక ప్రత్యేక ప్రతిపత్తి కలది. కారణం దాని లక్ష్య విషయం. వైద్య లక్ష్యం ఆరోగ్యవంతమైన సమాజం. ప్రాణంమీదికి తెచ్చే అత్యవసరమైన వైద్య అవసరాలు వైద్యసేవలకు గిరాకీ పెరిగేటట్లు చేసింది. ఇక మానవీయ, సామాజిక, యాజమాన్య అవసరాలకు అంత గిరాకీ లేకపోవడానికి కారణం అత్యవసర పరిస్థితులు అంతగా లేకపోవడం కాదు. మనం మన సమాజంలోని అత్యవసర పరిస్థితులను గుర్తించలేకపోవడమే. వస్తూత్పత్తి లేని ప్రత్యక్ష సేవలను అందించే మానవీయ, సామాజిక, యాజమాన్య రంగాల శాస్త్రాలు సమాజ పురోభివృద్ధికి సమయానుసారంగా దశాదిశా నిర్దేశంచేస్తూ అందుకు అవసరమైన ఆధునిక ఉపకరణాలను సమకూర్చుకోవాలి.

మానవీయ శాస్త్రవేత్తలు సంప్రదాయ సాధారణ విశ్వాసాల నుండి బైటపడి ఆర్థిక వనరులను సృష్టించే మార్గాల అన్వేషణను ఆలోచించే సమయం ఇప్పుడు ఆసన్నమైంది.

భాషాశాస్త్రం, సాహిత్యం, తర్కశాస్త్రం, తత్వశాస్త్రం, రాజనీతి లాంటి మానవీయ సామాజిక శాస్త్రాల ద్వారా సృజించిన జ్ఞానసంపద అమూర్త స్థితిలోనే ఉంటుంది. అంటే వీటికి ఇప్పటి వరకూ వస్తు రూపంలో ఉండే అవకాశానికి ఆస్కారం తక్కువ. ఇవి సమాజంలోని వ్యక్తులనూ వివిధ వ్యవస్థలనూ తద్వారా మొత్తం సమాజాన్ని నియంత్రిస్తాయి. మానవీయ, సామాజిక శాస్త్రాల జ్ఞాన సంపదను వస్తురూపంలోకి మార్చలేకపోయినా కొంతవరకూ సమాంతరంగా ఆధునిక ఎలెక్ట్రానిక్, డిజిటల్ రూపాలను సంతరించుకొని సమస్యలకు పరిష్కారాలను అందించగలిగినప్పుడు ఒక విధంగా వస్తూత్పత్తి జరిగినట్లే. ఒక విధంగా ఇవి వర్చ్యువల్ ఉత్పాదనలేగానీ వస్తూత్పత్తులు కావు ఐతేనేం వీటికీ వాటికీ అవసరాలను తీర్చడంలో పెద్ద తేడా ఏమీ ఉండదు. ఇవి అమూర్త జ్ఞానానికి వాస్తవాభాస వస్తూత్పత్తులే.

వర్చ్యువల్ ఉత్పాదనలు = ఎలెక్ట్రానిక్, డిజిటల్ రూపాలు

అంతర్జాల విప్లవం మానవ నాగరికతలో ఇప్పటివరకూ వచ్చిన విప్లవాలన్నిటికంటే అత్యంత ప్రభావశీలమైనది. అంతర్జాల విప్లవం ఆధునిక సమాచార విప్లవానికి ఆధారం. భాష ఆయువు పట్టు. నేడు జరిగే జ్ఞానసృష్టి సమస్తం అంతర్జాలంతో అనుసంధానించబడి ఉండటంద్వారా జ్ఞాననిధులనుండి సమాచార ప్రసారం అవధులు లేకుండా ఎక్కడికైనా ఎవరికైనా దొరికే అవకాశం వుంది. ఐతే సమాచారం వివిధ భాషలలో ఉండడం వలన భాషలు అవరోధాలుగా పరిణమించవచ్చు. దీనికి విరుగుడు అనువాదం. అనువాదాన్ని పూర్తిగా యాంత్రికం చేయాల్సిన అవసరం ఉంది. దీనికి మానవీయ శాస్త్ర రంగాలవారు పూనుకోవాలి. దీనికి ప్రతి భాష

లోనూ లక్షలాది పుటల అనువాద సాహిత్యం కావాలి. అంటే అనువాద సాహిత్యసృజన ఊపందుకోవాలి. అనువాద సాహిత్యానికి సంబంధించిన పరోక్ష వస్తూత్పత్తులు నేటి సమాచార విప్లవానికి అత్యంత ఆవశ్యకం. వివిధ భాషలలో అనువాద ఉపకరణాల తయారీ వేగవంతం కావాలి. అంతర్జాల సమాచార సాంకేతిక యుగంలో ఒకరి భాషను మరొకరిపై రుద్దవలసిన అగత్యం లేదు. యాంత్రిక భాషా ప్రక్రియలు ఎన్నో అందరికీ అందుబాటులోకి వస్తాయి. ఒకరి భాష మరొకరిపై ఒకరి మాండలికం మరొకరిపై రుద్దే ప్రయత్నాలకు కాలం చెల్లింది. అసలిక భాషా ప్రామాణికతకు అర్థమేలేదు. అ భావన అవసరమే లేదు. ప్రమాణ భాషలూ అప్రమాణ భాషలంటూ ఇక ఏమీ ఉండవు, ఉండరాదు. అన్నీ మాండలికాలే. అన్నీ ప్రామాణికాలే. ఎవరి మాండలికం వారిది. ఎవరి భాష వారిది. ఎవరికి వచ్చిన భాషలో వారు తమకు నచ్చిన మాండలికంలో రాస్తే చదువుకొనేవారు తమకు వచ్చిన భాషలో నచ్చిన మాండలికంలో చదువుకోవచ్చు. ఇది, మనం కోరుకున్న క్షణంలో కంటిముందు బుల్లితెరలపై ప్రత్యక్షమవ్వచ్చు. దీనివలన, మన సొంత భాషలో భావవ్యక్తీకరణ నిరాటంకంగా జరిగి, సృజనాత్మకతకు వీలుకలుగుతుంది. సృజనశీలతను పెంచుకోడానికి భాష అడ్డంకి కాకూడదు. ఆంగ్లమాధ్యమ చదువులలో సృజనాత్మకత కుంటువడుతుంది.

మాండలికాల మార్పిడి సమస్యేకాదు. భాషా పరివర్తనంలో కొంతవరకూ సమస్యలు ఉన్నా రాబోయే ప్రత్యమ్నాయ సంగణక ప్రక్రియలతో చాలావరకూ యంత్రానువాద సమస్యలు తీరేకాలం వచ్చింది. మరి సమాచార వినిమయమే భాషా ప్రయోజనం అయితే మాతృభాషా మాధ్యమం వదిలి ఆంగ్ల భాషా మాధ్యమంలో పాఠశాల విద్యలెందుకు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటివరకూ 70 ఏళ్లలో నత్తనడకన పెరిగిన మన అక్షరాస్యత 50% దూరాభారం బడులూ, టీచర్ల కొరత, సౌకర్యాల లేమి, పరిమిత వనరులతో బడిలో చేరే పిల్లలసంఖ్య తక్కువ, బడి మానేసే పిల్లల సంఖ్య ఎక్కువతో ప్రపంచంలోనే అక్షరాస్యతలో వెనకబడిన దేశాల జాబితాలో ఉన్న కొట్లాది మన జనాభా కేజీ టూ పీజీ ఇంగ్లీషు మాధ్యమం ద్వారా విద్యావంతులమై ఉద్యోగాల దారి పట్టగలమా? అసలు ఈ ఆలోచనకు తార్కిక, హేతుబద్ధ, శాస్త్రీయమైన మద్దతుగానీ, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పరమైన స్పృహగానీ కనపడదు. అసోసియేటెడ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్) అంచనా ప్రకారం, ప్రతి యేటా, విదేశాలలో చదువుతున్న భారతీయ విద్యార్థులతో మన దేశానికి సంవత్సరానికి కనీసంగా లక్షకోట్లకు (17 బిలియన్ డాలర్లు) పైగానే కోల్పోతున్నాం (మన విశ్వ విద్యాలయ విరాళాల సంఘం మొత్తం సాలుసరి ప్రణాళికా వ్యయం 20,000 కోట్లు మాత్రమే). విదేశాలలో మన విద్యార్థులు ఖర్చు పెట్టేదానిలో కొంతైనా ఇక్కడ ఖర్చుపెడితే, ఎన్ని వందల పాఠశాలనూ, డజన్ల కొద్దీ విశ్వవిద్యాలయాలనూ, పరిశ్రమలనూ మొదలు పెట్టవచ్చో ఆలోచించండి. మన మాతృభాషల మాధ్యమంలో చదువు చెప్పటం సులభం, చదువుకోవటం తేలిక. ఆంగ్ల మాధ్యమంలో చదువుకు యేటా లక్షలకోట్ల రూపాయల ఖరీదు చేసే ఆంగ్ల గ్రంథాలను దిగుమతి చేసుకోవడానికి ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇదే మన మాతృభాషలో జరిగితే ప్రపంచ వ్యాప్తంగా సృజింపబడుతున్న ఆధునిక జ్ఞానాన్ని మన భాషలలోకి అనువదించుకొని ఇక్కడే అచ్చువేసిన గ్రంథాల తయారీతో విదేశాలకు తరలే మన సంపదను కట్టడిచేసి, ఇక్కడే వేలాది మందికి ఉపాధి ఉద్యోగావకాశాలను పెంచవచ్చు. ఇంగ్లీషు మాధ్యమం ద్వారా చదివిన చదువుతో మన మాతృభాషలకు దూరమై రెండు దశాబ్దాలలో తెలుగంటే తెలియని తరం తయారవుతుంది. దీనితో మన స్థానీయ భాషాసాంస్కృతుల ఆధారంగా నడిచే పరిశ్రమలు మూలబడి లక్షలాదిమందికి ఆధారమైన జీవనోపాధి ఉద్యోగావకాశాలు అడుగంటుతాయి. అన్నిటికీ ఇంగ్లీషే అవడంతో పూర్తిగా ఇంగ్లీషు మాట్లాడే దేశాలపై ఆధారపడాల్సి వస్తుంది. అసలు ఇక్కడిదంటూ ఏమీ పనికివచ్చేది ఉండదు. బ్రిటిషువాళ్లు పోయినా ఇంగ్లీషుభాషతో బ్రటిషువలసదేశంగా మారి ఇంగ్లీషు ప్రపంచానికి ఊడిగం చేసే జనాభాను అందించే బానిస బతుకుల వనరులున్న దేశంగా మారుతుంది. వందల సంవత్సరాలు లక్షలాది మంది స్వాతంత్ర్య సమర వీరుల రక్తంతో తడిసి పునీతమైన ఈ నేలపై మనలాంటి వాళ్లు పుడతారనీ మళ్లీ బాని సత్వంలోకి కూరుకుపోతున్న దేశాన్ని చూస్తూ చేవచచ్చి మిన్నకుండిపోతారనీ ఊహించి వుండరు. తమకు తెలియని మైకంలో పోటీ నెపంతో ఆర్థిక మార్కెట్ల ఆధిపత్యంలో నడుస్తున్న రంగులరాట్నంలో ఇరుక్కుపోయిన యువ జనులూ ఇలాంటి యువజనుల తయారీలో క్షణం తీరిక లేకుండా తమకు చేతనైనంతగా రాట్నం తిప్పే ఉపాధ్యాయవర్గం పిల్లల భవిష్యత్తే జీవితాశయంగా చేతనైనంతగా బరువెత్తు కొంటున్న తల్లిదండ్రులూ, మనమేది చేసినా ప్రజలకోసమే అని దేశాన్ని నడిపిస్తున్న రాజకీయులూ ఉద్యమాలకు ఊపిరిలూదాల్సిన మానవీయ సామాజికశాస్త్రజ్ఞులూ సామాజికస్పందనకు సమయమే లేక బతుకుబాటలో నడవలేక అలసిపోతున్న బహుజన సమాజం. ఇన్ని అవాంతరాలు దాటి సొంత భాషలో చదువుకొని మన భాషలలో మనం బతుకుబాటలు పరుచుకొనే రోజుల కోసం ఉద్యమిద్దాం.

హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయంలో తెలుగు భాషా విభాగంలో ప్రొఫెసర్‌గా రిటైరయ్యారు. తెలుగు అక్షరానికి సాంకేతికను జోడించటంలో అందుకోసం కావలసిన భూమికను ఏర్పాటు చేయటంలో అహరహం శ్రమిస్తున్న వ్యక్తి. అనేక వ్యాసాలు రాశారు.

email: guraohyd@gmail.com

తెలుగు ఆధునీకరణలో మీడియా కృషి

ఆర్.వి. రామారావు

తెలుగుకు ప్రాచీనభాష హోదా కల్పించాలని తెలుగువారు పోరాడారు. కాని భాషా శాస్త్రవేత్తల, విశ్వవిద్యాలయాల దృష్టిలో తెలుగు ఆధునిక భాషే. జనం వాడుకలో ఉన్న భాషలను ఆధునిక భాషలని, వాడుకలో లేని వాటిని ప్రాచీన భాషలని భాషా శాస్త్రవేత్తలు పరిగణిస్తారు. అంటే లాటిన్, సంస్కృతం లాంటి భాషలు ప్రాచీన భాషల కింద లెక్క. ఒక భాష ప్రాచీనమైందా, ఆధునికమైందా అన్నది ఈ దృష్టితో చూసినప్పుడు అది కాలంతో సంబంధం లేని వ్యవహారమే.

తెలుగు ఆధునిక భాషే అయినా దానికి నిజంగా ఆ స్థాయి ఉందా అంటే ఆలోచించాల్సిందే. ఆధునిక అవసరాలన్నింటినీ వ్యక్తం చేసే సామర్థ్యం ఉన్న భాషే ఆధునిక భాష. భాష కేవలం వ్యాకరణ సూత్రాలకు పరిమితమైంది కాదు. భాష సామాజికమైంది. ప్రయోజనాత్మకమైన భాషలే మనగలుగుతాయి. ఇవి లేని భాషలు క్రమంగా కాల గర్భంలో కలిసిపోతాయి. భాషలు అంతర్ధానం కావడానికి ఆ భాష మాట్లాడేవారు అంతరించడం ఒక కారణం అయితే ఆధునిక అవసరాలకు తగ్గట్టుగా ఆ భాష ఎదగక పోవడం మరో కారణం. భాష మనగలగాలంటే ఆధునికం కావాల్సిందే. భాష ఆధునీకరణకు నిరంతర ప్రయత్నం అవసరం.

అభివృద్ధి చెందిన దేశాల జీవన విధానం ఆధునికతకు గీటురాయి. అభివృద్ధి చెందిన దేశాల భాషలను ఆధునిక భాషలుగా గుర్తిస్తున్నారు. ఒక సమాజం ఆధునికం అయింది అంటే ఆ సమాజం ఉపయోగించే భాష కూడా ఆధునికమైనట్టే. అభివృద్ధే ఆధునికతకు గీటురాయి అనుకుంటే అభివృద్ధి చెందుతున్న సమాజాల భాష కూడా సంపూర్ణంగా ఆధునిక భాష కానట్టే. ప్రపంచ దేశాలలో కొన్నింటిని అభివృద్ధి చెందిన దేశాలని, మరికొన్నింటిని అభివృద్ధి చెందుతున్న దేశాలని లేదా వర్ధమాన దేశాలని, ఇంకా కొన్నింటిని అభివృద్ధి చెందవలసిన దేశాలని అంటున్నాం. మన దేశం అభివృద్ధి చెందుతున్న దేశం కనక తెలుగుభాష కూడా ఆధునిక భాషగా మారడానికి ప్రయత్నిస్తున్న భాషే.

ఆధునిక సమాజ జీవన విధానాలన్నింటిలో అవసరమైన మౌఖిక, లిఖిత సమాచార ప్రసరణకు సమర్థమైన వాహికగా పని చేసే భాషే ఆధునిక భాష. 18వ శతాబ్దంలో పారిశ్రామిక విప్లవం పుణ్యమా అని యూరప్ దేశాలు శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి సాధించడం వల్ల అక్కడ ఆర్థికాభివృద్ధి వేగవంతమైంది. వర్ధమాన దేశాలు శతాబ్దాల తరబడి అభివృద్ధి చెందిన దేశాలకు వలసలుగా ఉండిపోయాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత వలస దేశాలు స్వాతంత్ర్యం సంపాదించి

అభివృద్ధి సాధించడానికి ప్రయత్నిస్తున్నాయి. వలస పాలనలో ఈ దేశాలలో అభివృద్ధి కుంటుపడడం వల్ల శాస్త్ర సాంకేతిక రంగాలలో కూడా వెనకబడి పోయాయి. అభివృద్ధి సాధించడం ఈ దేశాల ప్రధాన లక్ష్యమైంది. ఈ క్రమంలోనే ఈ దేశాల భాషను ఆధునీకరించవలసిన అవసరం వచ్చింది.

ఒక సమాజం భాష ఆ సమాజ అవసరాలకు లోబడి విషయ ప్రసారానికి సమర్థమై ఉంటుంది. ఏ సమాజానికైనా, భాషకైనా మౌలిక అవసరాలకోసం విషయ ప్రసార సామర్థ్యం ఉండవచ్చు కాని ఆధునిక శాస్త్ర సాంకేతిక అంశాలు, భావనలు మొదలైన వాటిలో విషయ ప్రసార సామర్థ్యం ఉండదు. తెలుగు సమాజం ఇప్పటికీ వర్ధమాన సమాజమే అయినందువల్ల అభివృద్ధి చెందిన లేదా ఆధునిక దశలో ఉన్న సమాజంలాగా విషయప్రసార సామర్థ్యం ఉండదు. ఒక సమాజంలో ఒక వస్తువో, భావనో లేకపోతే ఆ వస్తువును, భావనను తెలియజేయడానికి ఆ భాషలో తగిన పదాలు ఉండవు. అభివృద్ధి చెందిన సమాజాల భాషలకు ఉన్నట్టు సకల ఆధునిక అవసరాలకు సంబంధించి విషయ ప్రసార సామర్థ్యం ఉండదు. అంటే అభివృద్ధి చెందిన, ఆధునిక సమాజంలో ఉన్న శాస్త్ర సాంకేతిక, ఇతర భావనలను వ్యక్తం చేసే పదజాలం వర్ధమాన సమాజాల భాషలకు ఉండదు. కాని వర్ధమాన దేశాలు అభివృద్ధి చెందిన దేశాల స్థాయికి చేరాలని ప్రయత్నిస్తున్నాయి. ఈ ప్రయత్నం సఫలం కావాలంటే భాష కూడా ఆధునికం కావాలి. అభివృద్ధి చెందిన సమాజాల భాషలో ఏకరూపత ఉంటే అభివృద్ధి చెందుతున్న దేశాల భాషలలో సామాజిక, భాషా పరమైన భిన్నత్వం ఉంటుంది.

అభివృద్ధి చెందుతున్న సమాజాల భాషలు ఆధునికం కావాలంటే వివిధ విజ్ఞాన రంగాలలోని విషయాన్ని వ్యక్తం చేయడంలో ఆ భాష స్వయంసమృద్ధి సాధించి స్వతంత్రత సంపాదించాలి. సకల జీవన రంగాలలో అన్ని అంశాలను సమగ్రంగా వ్యక్తం చేయగలిగే విధంగా భాష పురోగతి సాధించే క్రమమే భాష ఆధునికత. అలాగే అభివృద్ధి చెందిన సమాజాల వారి భాషలో ఉన్న సకల విషయాలను అభివృద్ధి చెందుతున్న భాషలో వ్యక్తం చేయాలంటే అంతరనువదనీయత ఉండాలి. ఉదాహరణకు అభివృద్ధి చెందుతున్న సమాజానికి చెందిన తెలుగుభాష ఎంత అంతరనువదనీయత సాధిస్తే తెలుగు అంత ఆధునిక భాష అయినట్టు.

భాష ఆధునికం కావాలంటే భాష క్రోడీకరణ, భాషా విస్తరణ, భాషా సంస్కరణ అవసరం. లేఖన పద్ధతులను సంస్కరించడం, భాషలో ప్రామాణిక రూపాలను నిర్ణయించడం, వ్యాకరణాలు రాయడం, నిఘంటువులు, సాంకేతికపద కోశాలు సిద్ధం చేయడం, శైలీ పత్రాలు రూపొందించడం ద్వారా ప్రమాణాలను నిర్దేశించడమే భాష క్రోడీకరణ. దీన్నే వ్యవస్థీకరణ కూడా అనవచ్చు. కొత్త సాంకేతిక పదాలు కల్పించి శాస్త్ర సాంకేతిక రంగాలు, ప్రసార సాధనాలు, విద్య మొదలైన రంగాలలో వినియోగించడం భాషా విస్తరణ. దీనివల్ల ఇంతవరకు ఉపయోగించని అనేక రంగాలలో భాషా ప్రయోగం సాధ్యం అవుతుంది. మాండలికాలు, యాసలు అనేక భాషలకు ఉండొచ్చు. తెలుగులో ఇవి దండిగానే ఉన్నాయి. ఒక భాషలో ఉన్న అనేక మాండలిక భేదాల నుంచి ఒక భేదాన్ని ప్రముఖ రచనల ఆధారంగా ఎంచుకుని ప్రామాణీకరిస్తే భాషను సంస్కరించినట్టవుతుంది.

తెలుగు పత్రికాభాష ఒకటిన్నర జిల్లాల భాష అని ఈసడించినా చివరకు దానికే ప్రామాణిక భాషగా ముద్రపడిపోయింది. భాషలో ప్రామాణికత సాధించడానికి ఒకటో రెండో మాండలికాలను ఆధారం చేసుకోవడం అనివార్యం. సామాజిక, ఆర్థిక, రాజకీయ, శాస్త్ర సాంకేతిక రంగాలలో సాధించిన విజయాలే అభివృద్ధికి, ఆధునికతకు చిహ్నం. ఆధునికత అంటే సమకాలీనత కాదు. రాజకీయ, ఆర్థిక రంగాలలో అభివృద్ధి చెందని సమాజాలు సమాకాలీనమైనప్పటికీ ఆధునిక సమాజాలు కావు.

భారత రాజ్యాంగం 22 భాషలను గుర్తించినా అందులో 13 భాషలనే ఆధునిక భాషలుగా భాషా శాస్త్రవేత్తలు గుర్తిస్తారు. అందులో తెలుగు కూడా ఉంది. ఒక రాష్ట్రానికి అధికార భాషగా ఉండడం, విస్తృతమైన సాహిత్యం, ప్రసార మాధ్యమాలు, విద్యా వ్యవస్థలో అమలు, కోటిమందికి పైగా వాడుకభాషగా ఉండడం వంటి ప్రమాణాలతో ఈ 13 భాషలను ఆధునిక భాషలుగా గుర్తించారు. ఆయా భాషా సమాజాల సాంస్కృతిక, సామాజిక, రాజకీయ, భౌగోళిక పరిస్థితులను బట్టి ఒక్కో భాష ఒక్కో రీతిలో అభివృద్ధి చెందుతుంది.

సమాజం ఒక్కో దశను దాటి కొత్త దశకు చేరుకున్నప్పుడు ప్రతి దశలోనూ కొత్త పదజాలం అందుబాటులోకి వస్తుంది. అయితే ఆ పదజాలం మరో భాషకు చెందింది కావచ్చు. ఆ పదజాలాన్ని అభివృద్ధి చెందుతున్న సమాజం తన భాషలో వ్యక్తీకరించడానికి చేసే ప్రయత్నమే భాషాభివృద్ధి లేదా ఆధునీకరణ కృషి అవుతుంది.

పత్రికలు నిర్వహించేదాకా కందుకూరి వీరేశలింగం వ్యావహారిక భాషా ప్రయోజనాన్ని గుర్తించలేదు. వివేకవర్ధని పత్రిక ప్రారంభించినప్పుడు భాష ఎలా ఉండాలో ఇలా నిర్వచించుకున్నారు: "పత్రికా నిర్వహణ చాలా బాధ్యతతో కూడిన కార్యము. భాషా పాటవము, రచనా కౌశలము, భావోద్రేకము వున్న చాలవు. క్రమానుగతములైన సాంప్రదాయాలను, ధారావాహికములైన మర్యాదలను గుర్తింపగల చరిత్ర జ్ఞానము, ప్రజల మనోరథము నిగూఢ చిత్తవృత్తులను పరిక్షించగల విశాల దృష్టి, దేశ భవితవ్యమునుపలక్షింపగల గంభీర విశ్వాసము పత్రికాధిపతులు అలవరచుకొనదగిన లక్షణములు... నేనేర్పరచుకున్న భాషాభివృద్ధి మార్గము తెలుగులో మృదువైన సులభశైలిని సలక్షణమైన వచన రచన చేయుట"

వీరేశలింగం ప్రారంభించిన పనిని తాపీ ధర్మారావు జనవాణి (1936-39) పత్రికలో విస్తృతం చేసి వాడుకభాషకు పట్టం కట్టారు. వ్యావహారిక భాషోద్యమం గిడుగు రామమూర్తి కృషి ఫలితమే అయినా ఆయన లక్ష్య, లక్షణ నిర్దేశం మాత్రమే చేశారు. ఆచరణలో అనుసరించి చూపే అవకాశం ఆయనకు రాలేదు. ఆ పని తాపీ చేసి చూపించారు. "పత్రికలు ముఖ్యంగా ప్రజా సామాన్యం కోసం అన్న మాట మరిచి పోకుండా ఉంటే ఏ భాషలో ఏ స్థాయిలో

వ్రాయాలో చెప్పనక్కరలేదు... కాబట్టి రచయిత తన పాండిత్యం చూపడం కాదు కావలసింది. పాఠకుడు అసందిగ్ధంగా గ్రహించాలి. కాబట్టి నిత్య పరిచయమైన వ్యావహారికమే శరణ్యం కావాలి. వార్తలు, వానిలోని విశేషాలు చెపుతున్నాము గాని పాఠ్య పుస్తకంలోని పాఠం చెప్పడం లేదని జ్ఞప్తిలో ఉంచుకోవాలి. సుబోధకంగా ఉండడమే ప్రథమావశ్యకత. తర్వాతనే శైలీ పదగుంఫన మొదలైనవి," అని తాపీ భావించారు.

ఆ తర్వాత సినిమారంగానికి వెళ్లిన తాపీ అక్కడా వాడుక భాషే ప్రవేశ పెట్టారు. ఇప్పుడు తెలుగు మాధ్యమాలు వాడుతున్న భాష తాపీ పెట్టిన ఒరవడికి కొనసాగింపే. తెలుగు సమాజం ప్రస్తుతం కందుకూరి, తాపీ కాలం నుంచి చాలా దూరమే ప్రయాణించింది కనక ఇప్పుడు మీడియా బహుముఖీనంగా విస్తరిస్తోంది కనక, సమాజం అభివృద్ధి వేగాన్ని అందుకోవడానికి ప్రయత్నిస్తోంది కనక తెలుగుభాషను మరింత ఆధునీకరించవలసిన అగత్యముంది.

తొలినాటి పత్రికా రచయితలు ఆ పనే చేశారు. తెలుగు భాషను ఆధునిక అవసరాలకు అనుగుణంగా మార్చడానికి ఎవరెవరు ఏయే పదాలను కల్పించారో తేల్చడం సులభ సాధ్యం కాదు. కందుకూరి రక్షకభట నిలయం లాంటి మాటలను ప్రచారంలో పెట్టారు. అలీనోద్యమం ప్రారంభం అయినప్పుడు విబంధ విధానం, తటస్థ విధానం, అలీన విధానం అన్న మాటలు వాడారు. చివరకు అలీనోద్యమం లేదా అలీన విధానం అన్న మాట మీడియాలో స్థిరపడింది. 1930-40ల్లో ఉద్ఘాటన, విజ్ఞప్తి, అభ్యర్థన, ద్రవ్యోల్బణం, తీర్మానం, మూజువాణి వంటి మాటలు కల్పించారు. ఆంధ్రపత్రిక నెలకొల్పిన కాశీనాథుని నాగేశ్వరరావు 1938 నాటికి పారిభాషిక పదకోశం తయారుచేశారు. ఆనాటి అవసరాల మేరకు అది ప్రామాణికమైందే కావచ్చు. ఆ తర్వాత ఇంగ్లీషు నుంచి అనేక పారిభాషిక పదాలు వచ్చి పడుతున్నాయి. వీటికి తెలుగు సమానార్థకాలు కూర్చే పని పత్రికా రచయితలు శక్తి మేరకు చేస్తూనే వున్నారు. కొత్త పదాలు వచ్చినప్పుడు వాటికి తెలుగులో సమానార్థకాలు కల్పించాల్సిందే. అయితే ఆ కల్పన ఆ పదాలు వాడుకలోకి వచ్చేట్టుగా ఉండాలి. సుబోధకంగా ఉండాలి. భాషాభివృద్ధిలో, ఆధునీకరణలో పాఠ్య గ్రంథాలు, విద్యాబోధన ఎంత ప్రధానమో మీడియా పాత్ర కూడా అంతే ముఖ్యమైంది. మీడియా ఈ మధ్య ఆధునీకరణ క్రమాన్ని అంతగా పట్టించుకుంటున్నట్టు లేదు. ఇంగ్లీషు మాటలను అలాగే వాడడం ఒక సమస్యైతే సమానార్థాలు కల్పించడంలో విచ్చలవిడితనం, అశాస్త్రీయ విధానం, ఏ పదాలకు సమానార్థకాలు అవసరమో వేటికి అవసరం కాదో గుర్తించకుండా వ్యవహరిస్తోంది. విజ్ఞానాన్ని అందించడంలో మీడియాకు పెద్ద బాధ్యతే ఉంది. పత్రికలు అక్షరాస్యులకే పరిమితం కాని రేడియో, టీవీ, సినిమా నిరక్షరాస్యులకు కూడా ఉపకరిస్తాయి. ఇటీవల పారిశ్రామిక సంస్కృతికి, ఆర్థిక భావనలకు సంబంధించి అనేక కొత్త పదాలు వాడుకలోకి వస్తున్నాయి. వీటికి నూతన పదకల్పన అవసరమే. ఎప్పుడూ పరభాషా పదాలనే వాడితే స్వభాషలో ప్రత్యయాలు మాత్రమే మిగిలి అసలు పదాలు మాయమవుతాయి. పత్రికలు, ఇతర మాధ్యమాలు పెరగడం వల్ల నూతన పద కల్పన ఎక్కువైంది. ఈనాడు వ్యవహార కోశం, తెలుగు విశ్వవిద్యాలయం వారి పత్రికా భాషా నిఘంటువు, విశాలాంధ్ర ప్రచురించిన పత్రికా రచయితల పదకోశం, ప్రెస్ అకాడమీ పత్రికా పదకోశం, వార్త పత్రిక రూపొందించిన పలుకుబడి నూతన పద కల్పనా ప్రయత్నమే. బంద్, రాస్తారోకో, లాక్ ఔట్, ఆయా రాం గయా రాం, కంప్యూటర్, రిట్, ధర్నా లాంటి పదాలు తెలుగు పదాల్లో భాగమైపోయాయి. అన్య భాషాపదాలు కలిసిన మిశ్ర సమాసాలు కూడా వాడుకలోకి వచ్చాయి. రిట్ దాఖలు, ప్రపంచ బ్యాంకు, ఫ్యూడల్ వ్యవస్థ, రేడియో ప్రసంగం, ఎలెక్ట్రానిక్ పరికరాలు, బంగారు మార్కెట్ వంటి మిశ్ర సమాసాలెన్నో వాడుకలో ఉన్నాయి.

ఈ క్రమంలోనే అంతర్జాలం, చరవాణి వంటి పదాలూ కల్పించారు. అంతర్జాలం అన్న పదం ఇంటర్నెట్ అన్న మాటలో ఉన్న భావనను బట్వాడా చేయకపోయినా శ్రవణ సుభగత్వం వల్ల చెలామణిలోకి వచ్చింది. కాని చరవాణి లాంటి పదాలు జనం వాడడం లేదంటే పదకల్పన లోపభూయిష్టంగా ఉన్నట్టే. పద కల్పన ఎంత ముఖ్యమో వాడుక అంతకన్నా ముఖ్యం. నుడికారాల అనువాదంలో పెడధోరణులు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. Storm in the tea cup అంటే యాంత్రికంగా టీ కప్పులో తుపాను అనడం నుడికారంలో ఉన్న అర్థాన్ని, సొగసును త్యాగం చేసినట్టే. పద కల్పనలో మన సంస్కృతి సంప్రదాయాలను దృష్టిలో ఉంచుకోకపోతే అవి పెడార్థాలకు దారితీస్తాయి. Lions share అంటే సింహ భాగం అని పదపదానువాదం చేసినట్టే తప్ప ఇంగ్లీషు నుడికారంలో ఉన్న భావనను అర్థం చేసుకున్నట్టు కాదు. మన సంస్కృతిలో అలాంటి నుడికారాలకు సమానార్థకాలు ఉండకపోవచ్చు కాని భావాన్ని బట్వాడా చేసే సమానార్థక నుడికారాలు ఉంటాయి. ఉన్నాయి. జ్యేష్ఠ భాగం, భీముని పాలు వంటి మాటలు లయన్స్ షేర్‌కు బాగా నప్పుతాయి. నుడికారాలు ఒక జాతి నిర్దిష్టాలు. అన్ని నుడికారాలకు అనువాదం నప్పదు.

మీడియా ప్రభావం జనం మీద ఎక్కువ. ఇది మాండలికాలను వెనక్కు నెడ్తుంది. నిరక్షరాస్యులు కూడా మీడియా ప్రభావం వల్ల అనేక అన్య భాషాపదాలు, ముఖ్యంగా ఇంగ్లీషు పదాలు వాడుతున్నారు. అందువల్ల భాష ఆధునీకరణ ఆషామాషీ వ్యవహారం కాదు. బాధ్యతతో కూడిన కర్తవ్యం.

ఆర్.వి. రామారావు సీనియర్ జర్నలిస్టు. దాదాపు అన్ని తెలుగు దినపత్రికలకు సంపాదకులుగా పనిచేశారు. తెలుగు సంస్కృతి పై వ్యాసాలు, జర్నలిస్టులకు పాఠాలు రాశారు. అనేక గ్రంథాలకు అనువాదకులు. ప్రస్తుతం ఈనాడు జర్నలిజం స్కూల్ ఫాకల్టీ సభ్యులు. నివాసం హైదరాబాద్.

email: rvramrao@yahoo.com

ఎల్లలు దాటే-ఎల్లెడలా వెలిగే తెలుగు

లలిత టి.ఎస్.

ఓ న మః
శి వా యః
సి ద్ధం న మః

- అని నాలుగు పక్కలా పసుపు గౌర్లు పెట్టిన నల్లటి కొత్త పలక మీద తిన్నగా, పొడుగ్గా, బల్-నున్నగా వున్న పాలబలపం పట్టిన నా చేయి పట్టి రామశేషు మేష్టారు రాయించగానే నాలోని పసితనం ఆ అక్షరాల పసిడితనపు భ్రాంతిలో పడిపోయింది.

అప్పటివరకు ఆటపాటలే ఆరుకాలాలుగా సాగిన నాకు ఈ కొత్త అక్షరాలు దిద్దే ఆట బహు బాగా నచ్చింది. పొద్దున్న బళ్లోకి వెళ్లగానే మల్లయ్య మేష్టారు, రామయ్య పంతులుగారు, కోటేశ్వర్రావు మేష్టారు, రామశేషు మేష్టారు అన్ని తరగతుల పిల్లలనీ రెండు వరసల్లో నిలబెట్టి చేయించిన ప్రార్థన-

తల్లీ! నిన్ను దలంచి పుస్తకము చేతం బూనితిన్ నీవు నా
యుల్లం బందున నిల్చి బ్భంభణముగా సుక్తుల్ సుశబ్దంబు శో
భిల్లన్ పల్కుము నాదు వాక్కునను సంప్రీతిన్ జగన్మోహినీ!
ఫుల్లబ్జాక్షీ! సరస్వతీ! భగవతీ! పూర్ణేందు బింబాననా!

అని ఆ చదువుల తల్లి పద్యంతో మొదలు.

ఆ తర్వాత రోజూ మా తెలుగుతల్లికి మల్లెపూదండ పాడాల్సిందే. ఇవి రెండూ అయిన తర్వాతే పాఠాలు.

పొద్దున్న పలకమీద మేష్టారు రాసిచ్చిన అఆలు నున్నగా జుట్టు దువ్వుకుని ముస్తాబైన కళకళలాడే అందమైన సన్నటి మెరుపు తీగల్లాంటి ఆడపిల్లల్లా కనిపించేవి.

వాటిని దీక్షగా దిద్దీ, దిద్దీ - మధ్యాహ్నానికి శ్రద్ధగా పెంచి పెద్ద చేసేశాను - అని మురిసిపోయే సమయానికి అవి ఆట పాటల్లో, అరువు దెబ్బలాటల్లో జుట్టు చెదిరి, కాటుక కంటి హద్దులు దాటి బుగ్గల దాకా పాకిన గడుగ్గాయి అమ్మాయిల్లా తయారయేవి.

ముందు రోజు రాసిచ్చిన నాలుగక్షరాలు గబగబా నేర్చేసుకుంటే మరుసటి రోజు ఇంకొన్ని కొత్తక్షరాలు పోగేసుకోవచ్చని - అలా కూడబెట్టుకున్న అక్షరాలతో కూడబలుక్కుని కనిపించిన కాయితమల్లా చదివేస్తూ ఉంటే కళ్ల ముందు రోజుకో కొత్త బంగారు లోకపు కిటికీ తెరుచుకుంటూ ఉంటుందని తెలిసిపోయింది.

ఇంకేముంది - పరుగాపక చదువుబండి సాగింది.

అచ్చులు, హల్లులు, ఒత్తులు, గుణింతాలు... ఆ...

అక్కడ- ఆ గుణింతాల మలుపు దగ్గర బండి కొత్తదారి పట్టింది.

క-కార అ-కారముల క - క-కార ఆ-కారముల కా

క-కార ఇ-కారముల కి - క-కార ఈ-కారముల కీ

క-కార ఉకారముల కు - క-కార ఊకారముల కూ ... అని గుణింతపు రాగాలు పాడుకుంటూ చిందులేసింది.

అలా - అక్షరాలా - అక్షరాల మాలల్లుతూ మాటలూ, మాటల మూట గట్టి వాక్యాలు - చదవడం, రాయడం వచ్చేసింది - అలా రావడం నచ్చేసింది.

తరగతులు త్వరితగతిన దాటుతుంటే జీవభాష వ్యాకరణం - జనజీవన వ్యవహారం ఒకేలా అనిపించేవి.

అదెలా అంటే -

మాటల మధ్య సంబంధాలు సంధులని
మాటలు చేసే సావాసాలు సమాసాలని
మాటలు చేసుకునే సోకులు అలంకారాలని
మాటలు కట్టుకునే గుంపులు గణాలని
మాటలు పేర్చి (పద్య)మాలలు కూర్చొచ్చని

ఆ మాటకొస్తే మాటకి, మనిషికీ బహు దగ్గర సంబంధముందనీ

మాట కలిపిన మనసు కలుస్తుందని
మాట నేర్పులేని మనిషికి మనసు-చేర్పువుండదని
మాటల గురించి ఇన్ని మంచి మాటలు తెలిశాక

మాట-మనిషి అరమరికలు లేని అమరిక అని ఎరుకయింది.

ఆ ఎరుకతోనే మాట తూలక ఒబ్బిడిగా వాడితే మాట మరింత ఎన్నికగా మన్ని మన్ననిస్తుందని తెలిసింది.

సరి సరి - ఈ మాటల-మాటలతో ఏమారి నా దారి దారి-మళ్లిపోయినట్లుంది.

ఎక్కడ ఆగాను - గుణింతాల దగ్గర కదూ ?! అనగా-అనగా తెలుగు-చదువు అతిశయ రాగపు బాట పట్టింది. హై స్కూల్ చదువులో విభక్తులు, ప్రత్యయాలు నేర్చి సంధులతో సంధి కుదిరింది. సంధులు నేర్వడం లెక్కలు కూడడం ఒకేలా అనిపించేది - రెంటి మీదా మక్కువ మిక్కిలిగా పెరిగింది.

అన్నిటికన్నా త్రిక సంధి మీద ఆదో-ఇదో-ఏదో చెప్పలేని ప్రీతి కలిగింది - అందుకు ముఖ్య కారణం వేటూరి వారి 'కాళింది మడుగున కాళీయుని పడగల ఆబాలగోపాలమాబాలగోపాలుని అచ్చెరువున (ఆ+చెరువున) అచ్చెరువున (ఆశ్చర్యంతో) విచ్చిన కన్నుల జూడ...' అన్న పాటే అని చెప్పడానికి ఎలాంటి మోహమాటమూ లేదు.

తెలుగుబాటలో తొలితొలి దారుల మలుపులు దాటి- సాగే కొద్దీ ఒక్కొక్క మెట్టు నెక్కుతుంటే - కనుల చూపు కాననివీ మినుకు- చూపులకానేవి అయిన మిణుకు లోకాల మజిలీలెన్నో.

ఆ మజిలీలలోనే మొట్టమొదటిసారిగా అందిపుచ్చుకున్నవి అందమైన ముగ్గులా అనిపించే దేవులపల్లి వారి అక్షరాలలో వరవెూయి అనిపించిన నేటిరేయి కవితలు, మనపక్షం కాకపోతేనేమి కురిసేద్దామా అని వెన్నెలలే పరవశించే కృష్ణపక్షపు పాటలు. లోకానికి బాధ పంచిన ఆయన భాష ఆ బాధలో సౌఖ్యాన్నే చూపింది.

అలా సొంతమైంది - క్షరము కాని అక్షరాల సాయంతో నింపుకున్న చదువుల అక్షయ తూణీరం. అమ్మ చెప్పిన 'విద్వాన్ సర్వత్ర పూజ్యతే' అన్న లోకోక్తి పట్టుకుని - జీవితపు సహచరునితో కలిసి - కోటివిద్యల్లో చెరో విద్యా ఎన్నుకుని తెలుగు దేశపు ఎల్లలు దాటి ప్రవాసమొచ్చాము. తెలుగు పాటలకు జిలుగులద్దిన మన-సు-కవి ఆత్రేయ గారన్నట్టు దూరమైన కొలది అనురాగం పెరుగుతుంది కదా! ఏ పని మీదో బయటికి వెళ్లినప్పుడు తెలుగు మాట వినగానే అమ్మ-ఆవకాయ-ఇల్లు ఇత్యాదిగా అ-ఆ-లు జ్ఞప్తికొచ్చి మనసునీ-నోరునీ ఒక్కలా ఊరించేవి.

ఏ రెండు-మూడేళ్లకో వీలు కుదిరి సెలవు చిక్కి కన్నవారిని-మునుపున్న వూరుని చూడడానికి వెళ్లినప్పుడు వస్తూ వస్తూ మూటకట్టుకొచ్చిన కమ్మని కథలుండే-కమ్మలుగల-పుస్తకపు-తాయిలాలెన్నో.

ఈమధ్యే - నలుగురం చేరి కబుర్లాడుకునే వేళ - "ఎండాకాలంలో వడదెబ్బ తగిలిందెవరికో" - అన్న మా మాటలు విని - మా మాటల మేత నందిపుచ్చుకుని తామూ తెలుగు-పులుగులమై ఎగరాలని చూస్తున్న మా వంశవృక్షపు చిగురులు "Was she hit by a వడ? అని అడగ్గానే - ఫక్కుమనే నవ్వుతో బాటు, 'ఫర్వాలేదు - తినిపిస్తున్న తెలుగు-చిగురాకు వగరు - వగరు అంటూ తింటున్నా తీపిరాగమే పలికిస్తోంది - ఇలాగైతే మన తెలుగుకి ఢోకా లేదు - ఎల్లెడలా వెలిగేస్తుంది,' అన్న నమ్మిక కుదిరింది.

ఉపసంహారం

తెలుగు - మన తెలుగు
మాటల వెలిగే - మనదైన వెలుగు
వీనుల విందు - పాటల పసందు
తెలుగు పలుకు అనండి - మీరు వినండి
ఎవరైనా అనగా వింటుంటుండండి
ఇంకెవరో వినగా మీరంటుంటుండండి
తెలుగు అంటుంటే మనం వింటుంటే -
ఎంత బావుంటుందో!
ఇలాగే అంటూ వింటూ వుంటే మన తెలుగు
ఎంతకాలమైనా ఇలా వుంటూనే వుంటుంది
ఇలలో ఎప్పటికీ నిలిచి వుంటుంది -
ఎల్లలు దాటి వెలుగుతుంది - ఎల్లెడలా వెలిగిస్తుంది.

తెలుగు అక్షరాలతో ఆటలు

డా. జాస్తి శివరామకృష్ణ

తెలుగు పదాలతో, అక్షరాలతో తయారుచేసిన పజిల్స్‌ను, వాటి లక్షణాలను బట్టి, వాటి భావనను తెలియచేయటానికి, వివిధ పేర్లతో పిలుస్తారు. అక్షరాలతో ఆటలు, గడి-నుడి, గళ్ల నుడికట్టు, చిక్కుముడి, పదం - పర్యాయపదం, పద చదరంగం, పద ప్రజ్ఞ, పద వినోదం, పదకేళి, పదక్రీడ, పదగారడీ, పదనిసలు, పదబంధం, పదరంగం, పదరసం, పదవిన్యాసం, పదశోధన, పదాల పర్వతం, పద్మవ్యూహం, ప్రహేళికలు, మాటల కొలువు, మాటలతో ఆటలు, శబ్ద చిత్రాలు, సమస్యా పూరణం, నిషిద్ధాక్షరి, న్యస్తాక్షరి, నానార్థాలు- ఈ విధమైన పేర్లతో తెలుగు పజిల్స్, దిన వార మాసపత్రికల్లో, అంతర్జాల బ్లాగ్స్‌లో, సామాజిక మాధ్యమాల్లో, పుస్తకాల్లో కనిపిస్తుంటాయి.

కాలక్షేపానికి, వినోదానికి, విద్యా వికాసానికి, మెదడుకు పదును పెట్టటానికి, పద సంపదను పెంచడానికి, తెలుగు భాషతో తమకు ఎంత సాన్నిహిత్యము ఉందో తెలుసుకోవ టానికి, క్లిష్టమైన సమస్యకు మేధోమథనంతో పరిష్కారాన్ని కనిపెట్టి మానసిక ఆనందాన్ని ఆత్మ విశ్వాసాన్ని పొందటానికి, పిల్లాపెద్దలకు ఏదైనా అంశాన్ని పరోక్షంగా పరిచయం చేయటానికి, కొత్త విషయాలు నేర్చుకొనే ప్రక్రియలో పాఠకులను ప్రత్యక్ష భాగస్వాములుగా చేయటానికి ఈ పజిల్స్ ఉపయోగపడతాయి.

ఈ పజిల్స్‌ను పరిచయము చేస్తూ, భాషాభివృద్ధిలో వాటి ప్రాముఖ్యత గురించి చెబుతూ అద్భుతమైన వ్యాసాలు అజయ్ కుమార్ వారాల (పజిల్ ప్రపంచం, ప్రజా శక్తి, 23 జనవరి 2016), సుధామ (పదాల పదనిసలు, సుధామధురం బ్లాగ్, 20 ఆగస్ట్ 2011) గార్ల నుండి వచ్చాయి.

పజిల్స్, వాటి ఉపయోగాలు గురించి మళ్లీ వల్లెవేయ కుండా, పజిల్స్ రూపకల్పనలో ఉన్న సాధక బాధకాలను గుర్తించటం, ఆ సమస్యల పరిష్కారానికి కొన్ని ప్రతిపాదన లను సూచించటం, నా స్వీయానుభవాలను మీతో పంచు కోవటం ఈ వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశ్యం.

ముందుగా కొన్ని పరిశీలనలు, ఆలోచనల పరంపర!

మొదటి పరిశీలన- అమెరికాలో, బార్న్స్ అండ్ నోబుల్ లాంటి పుస్తకాల షాపుల్లో అడుగుపెట్టిన వెంటనే, ఇంగ్లీష్‌లో word searches, cross-words తదితర పజిల్ పుస్తకాలు పుంఖానుపుంఖాలుగా, బీరువాల నిండా కనపడతాయి.

వాల్‌మార్ట్, సామ్స్ క్లబ్, టార్గెట్, కాస్ట్ కో, క్రూగర్, కబ్ ఫుడ్స్ ఇటువంటి షాపుల్లో, ప్రతి గ్యాస్ స్టేషన్లో- ఈ పజిల్ పుస్తకాలు దర్శనమిస్తుంటాయి. కాని, మన తెలుగు రాష్ట్రాల్లో, ఇటువంటి పుస్తకాలు వేళ్లమీద లెక్కబెట్టగలిగినన్ని మాత్రమే ఉన్నాయి. పుస్తకాల షాపుల్లో తెలుగులో గడి-నుడి, గళ్లనుడికట్టుల మీద పుస్తకాలు కనబడితే అబ్బురపడాల్సిన విషయమే! అంతర్జాలంలో, పత్రికల్లో ఈ పజిల్స్‌కు కొంత ఆదరణ లభిస్తున్నా, పుస్తక రూపేణా ఎందుకు రావటం లేదు?

రెండవ పరిశీలన - అమెరికాలో ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో విద్యాబోధనలో ఈ పజిల్స్ తరుచుగా ఉపయోగిస్తారు. ఉదాహరణకు, ఇక్కడి స్కూలు టీచర్లు 'మార్టిన్ లూథర్ కింగ్ డే' నాడు, తరగతి గదిలో ఉన్న కంప్యూటర్, ఇంటర్నెట్‌లో దొరికే సాంకేతిక వనరులు వాడి, మార్టిన్ లూథర్ కింగ్‌కు సంబంధించిన 10 పదాలతో అప్పటికప్పుడే గడి-నుడి పజిల్ (word search puzzle) చేస్తారు. లేదా 10 సూచనలు, వాటి సమాధానలతో గళ్ల నుడికట్టు (cross-word puzzle) తయారుచేసి, పిల్లలకు ఇస్తారు. ఈ సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్ ద్వారా, తరగతి గది అవసరాలకు అనుగుణంగా, తక్షణమే ఈ పజిల్స్ తయారు చేసుకోగలగటము, ఈ ఇంగ్లీష్ భాషకు, భాషాబోధన చేసే టీచర్స్‌కు ఒక అనుకూలమైన వరం.

ఆ పజిల్స్‌ను, మా పిల్లలు స్కూలు నుండి యింటికి పట్టుకొచ్చినప్పుడు, నాకు కలిగే మొదటి ప్రశ్న. "ఇంగ్లీష్ పదాలతో ఇటువంటి పజిల్స్ చేయటానికి, చాలా సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్, అంతర్జాలంలో ఉచితంగా లభిస్తున్నాయి. భారతీయ భాషల్లో, ముఖ్యంగా తెలుగు భాషలో ఇటువంటి పజిల్స్ తయారుచేయటానికి ఏమైనా వనరులు ఉన్నాయా?" అని!

గూగుల్‌లో, ఈ అంశము మీద చాలాసార్లు వెతికాను. పరిశోధన చేశాను. కనీసం ఒక్క వెబ్ సైట్, ఒక్క సాంకేతిక అవకాశం లేకపోవటం ఆశ్చర్యకరమైన విషయం.

మూడవ పరిశీలన - అమెరికాలోని, మిన్నియాపాలిస్ నగరంలో, స్కూల్ ఆఫ్ ఇండియా ఫర్ లాంగ్వేజెస్ అండ్ కల్చర్ (SILC) అనే లాభాపేక్షలేని ఒక స్వచ్ఛంద పాఠశాలలో, ఇక్కడి పిల్లలకు కొన్ని సంవత్సరాలు తెలుగు పాఠాలు చెప్పాను. బట్టీ పట్టటాలు, మూస విధానాలు, మొద్దు పద్ధతుల్లో పాఠాలు చెప్పటం ఒక పెద్ద నేరంగా ఈ పాఠశాలలో భాషాసేవకులు భావిస్తారు. అక్షరాలు, పదాలతో ఆటలు తయారుచేయటం, పిల్లలతో వాటిని



ఆడించటం తరుచుగా చేస్తుంటాం. ఉదాహరణకు, ఒక తరగతి లో 10 మంది పిల్లలు ఉన్నారనుకుందాం. వారితో 'కూరగాయలు' అంశం మీద బింగో (bingo) ఆట ఆడించాలంటే ఏం చేయాలి? 5×5 గళ్లతో, తెల్లకాగితం మీద గీతలు గీయాలి. వాటిని 10 జెరాక్స్ కాపీలు తీసి పక్కన పెట్టుకోవాలి. 50 కూరగాయల పదాలు ఎంపిక చేసుకోవాలి. ఆ 10 కాగితాల గళ్లల్లో, 25 యాదృచ్ఛిక పదాలను (random words) చేత్తో రాయాలి. అప్పుడుగాని, ఆ బింగో ఆట ఆడటం కుదరదు. కొంతమంది టీచర్లు, ఇటువంటి పజిల్స్ చేయటానికి, రెండు మూడు గంటలు వెచ్చించటం సాధారణమైన విషయం. ఈ సమస్య తెలుగుకే పరిమితం కాదు. హిందీ, మళయాళం, గుజరాతీ, కన్నడ, బెంగాలీ మొదలైన అన్ని భారతీయ భాషలకు, సాంకేతిక వనరుల లేమి అనే సమస్య వర్తిస్తుంది.

ఎంతోమంది భాషా ప్రేమికులు, ప్రపంచవ్యాప్తంగా, ఎన్నో సంస్థలలో, పాఠశాలల్లో, స్వచ్ఛంద సేవకులుగా పనిచేస్తున్నారు. భాషాభివృద్ధికి కృషి చేస్తున్నారు. వారి విలువైన సమయాన్ని వెచ్చిస్తున్నారు. ఈ పజిల్స్‌లాంటి బోధనావనరులను, ఈ సేవకులకు ఉచితంగా ఎలా అందించాలి? వారంతట వారే, పిల్లల వయస్సుకు, తరగతికి, బోధనాంశానికి అనుగుణంగా, త్వరిత గతిన ఈ పజిల్స్ తయారుచేసుకునే వెసులుబాటు ఎలా కల్పించాలి? కొంతకాలంగా నన్ను తొలుస్తున్న ప్రశ్నలివి!

ఈ ప్రశ్నలన్నింటికీ మూల కారణం, తెలుగుభాషలో పజిల్స్ చేయటానికి సరైన సాంకేతిక పరికరాలు (technical tools), అంతర్జాల వనరులు (internet resources) లేకపోవటమే అని పిస్తుంది.

సాఫ్ట్‌వేర్ రంగంలో వృత్తిరీత్యా స్థిరపడటం, మిన్నియాపోలిస్‌లోని, మెట్రోపాలిటన్ స్టేట్ యూనివర్సిటీలో, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రోగ్రామింగ్ కోర్సులను పార్ట్‌టైమ్ ప్రొఫెసర్‌గా బోధించే అవకాశం రావటం, తెలుగులో పజిల్స్ తయారుచేసే సాఫ్ట్ వేర్ ప్రోగ్రాంలను తయారుచేయాలనే గాఢమైన కోరిక ఉండటం- ఈ అవకాశాలన్నీ జోడించి, తెలుగులో పజిల్స్ ఎలా చేయాలనే పరిశోధనాంశం మీద గత 5 సంవత్సరాలుగా పని చేస్తున్నాను. ఈ నేపథ్యంతో, మీతో నా అనుభవాలు కొన్ని ఉదాహరణలతో పంచుకుంటాను.

ఏ పజిల్ చేయాలన్నా, ఎవరి కోసము చేస్తున్నామో, వారి వయస్సు, పరిపక్వతలను పరిగణనలోకి తీసుకోవాలి. భావన (concept), తయారుచేసే ప్రక్రియ (procedural steps)ల్లో సారూప్యత ఉండవచ్చు. కాని, ఏ పదాలను ఎంపిక చేయాలి (మహిళ, వనజదళాయతాక్షి- ఈ రెండు పదాల్లో మొదటి పదం 1 వ తరగతి పిల్లలకు సరిపోతే, రెండవ పదం పెద్దవారికి సరిపోతుంది). ఎంతమేరకు సూచనలు ఇవ్వాలి (ఈ గళ్లల్లో 5 పదాలు దాగి ఉన్నాయి అని పెద్దవారికి చెప్పవచ్చు. కాని చిన్నారులకు, ఆ పదాల పట్టిక కూడా యివ్వాలి). ఎంత పెద్ద పజిల్ చేస్తున్నాము (5×5 గళ్ల నుడికట్టు పిల్లలకు సరిపోతే, 25×25 సైజు పెద్దవారికి సరిపోతుంది), ఎటువంటి పజిల్ చేస్తున్నాం (కొన్ని రకాల పజిల్స్ తేలికగా ఉంటాయి. కొన్ని రకాల పజిల్స్ పరిష్కరించాలంటే జుట్టు పీక్కోవాల్సి వస్తుంది). ఈ అంశాలన్నింటినీ అవలోకనం చేసుకోవాలి.

ఏ కంప్యూటర్ ప్రోగ్రామ్ అయినా, మనం ఇచ్చిన సూచనలను గుడ్డిగా అనుసరిస్తాయి. ఉదాహరణకు, 'సూర్యుడు' అనే పదానికి దాదాపుగా 400 పర్యాయపదాలు (రవి, స్వర్మణి, అరుణకిరణుడు, జలతస్కరుడు మొదలైనవి) ఉన్నాయి. తెలుగు నిఘంటువును, ఈ కంప్యూటర్ ప్రోగ్రామ్‌కు ఇచ్చి, 'సూర్యుడు' పర్యాయపదం తీసుకురమ్మంటే, అది 'రవి'నైనా ఎంపిక చేయవచ్చు. 'జలతస్కరుడు'నైనా ఎంపిక చేయవచ్చు. స్పష్టమైన సూచనలతో పాటు, మనం దానికి ఇస్తున్న పదసంపద కూడా పాఠకుల స్థాయిని బట్టి ఉండాలి. లేదా మనం ఇచ్చే పదకోశానికి అదనపు అర్హతలను, గుణాలను ఆపాదించాలి.

ఈ పజిల్స్ తయారీలో, రూపకర్త మేధోసంపత్తి తప్పక అవసరం అవుతుంది. కంప్యూటర్ ప్రోగ్రామ్స్ నియమిత చర్యలు (routine tasks) చేయటంలో అనుబంధ సహాయాన్ని అందించగలవుగాని, పజిల్ డిజైన్, వాటి నాణ్యత మాత్రం రూపకర్తల అభిరుచి, సంకల్పాల మీదే ఆధారపడి ఉంటుంది.

పజిల్స్ తయారుచేయటం ఒక ఎత్తయితే, వాటిని కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, టాబ్లెట్స్ మీద, ఆడుకునే వెసులుబాటు కల్పించటం మరో ఎత్తు. తెలుగు అక్షరాలను పాఠకులు టైప్ చేసే సామర్థ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం కూడా కలిగిస్తే, ఈ పజిల్స్‌కు పరిపూర్ణత చేకూరుతుంది. వాటికి ప్రజాదరణ లభిస్తుంది.

జాస్తి శివరామకృష్ణ ప్రసాద్ స్కూల్ ఆఫ్ ఇండియా ఫర్ లాంగ్వేజెస్ & కల్చర్ డైరెక్టర్‌గా స్వచ్ఛంద సేవలు అందిస్తున్నారు. మాటలతో ఆటలు అనే తెలుగు పజిల్స్ పుస్తకం, చిన్ననాటి ఆటలతో పుస్తకాలు ప్రచురించారు. ఆధునిక పద్ధతుల ద్వారా తెలుగు నేర్పించటము, తెలుగు పజిల్స్ చేయటానికి సాఫ్ట్‌వేర్ రూపొందించటం తదితర అంశాలపై పరిశోధనలు చేస్తున్నారు. నివాసం మినియాపోలీస్. **email: siva.jasthi@gmail.com**

మన తెలుగు

ఉమ ఉపమాక

She is in 9th Standard and lives in St. Louis.

Telugu. The word itself is instantly recognizable as one of the sweetest languages in the world. We are blessed, as Telugu people, to be able to speak it. The reach of Telugu is not limited to the written language and spoken word. Telugu is not just a language but an encapsulation of thousands of years of culture, traditions and rich heritage. To keep this culture and the language alive, we must learn to speak it, even though we are thousands of miles away from home.

It is inevitable that us, as youth raised in America, will speak English daily, whether it be at school, with friends, and even with parents. However, it is increasingly important to remember to speak this beautiful language, as this is the language we were raised on. Some of my most vivid memories of India include the tastes of various foods, the scent of కొత్తావకాయ, and the sound of a bell ringing in a temple. Moreover, there is one thing they all include; the low, soft cadence of our beautiful language.

Telugu allows us to connect with our loved ones in India. There's nothing quite like the endearments grandparents tell you in Telugu. 'బంగారు కొండ' is something my loving grandmother calls me every time I call her. While the literal translation of this sweet nickname is odd in English, it is immediately understood to be a loving pet name in Telugu. Such endearments are commonplace in our special language, and allow us to understand the true depth of love our relatives have for us.

Understanding Telugu also allows us to understand our arts. Many Telugu children learn Carnatic music or a form of dance. But, more often than not, they fail to understand the meaning behind the intricate hand gestures and eloquent words they express. Without even a basic understanding of what the poetic words in their songs and dances say, they cannot show the true passion and expression required to bring the piece to what it truly has to be. Learning music or dance without knowing the meaning is akin to painting without a muse. By learning Telugu, we enhance our ability to bring any form of art to its true potential. We will also be able to rejoice in the pure bliss that the rich literary works offer. Even though there are various translations to all the epics written in Telugu, there is nothing like reading the original into which the author poured his/her heart out.

Our special language also allows us to relive previous trips to India. Far and few in between, these trips hold special places in our memories. In my case, it has been five years since I have last been to India, and I am eagerly awaiting the next time I can go. Until then, I have my memories of previous trips. These memories would mean nothing without Telugu. From the aforementioned sweet endearments, to even basic conversation with grandparents, all words spoken would be sounds strung together in sequences with no meaning behind them. Telugu is what binds those memories together. It allows us to relive the fleeting time spent there and gives us a sense of understanding about that time.

Telugu is a language I enjoy speaking. Its expressions are innumerable, and the culture behind the language is multifaceted. Telugu is unique, as the grandeur of Telugu literature is nonpareil. Many of the Carnatic songs sung the world over, such as the అన్నమయ్య కీర్తనలు were made centuries ago by Telugu poets. The three facets of Telugu listed above are just a few of an innumerable set of unparalleled qualities that exist within our culture. The key to unlocking the culture is keeping this lovely language alive.

దేశభాష లందు తెలుగు లెస్స

అశోక్ కొత్తమాసు

He is in 7th standard and lives in St. Louis. He likes read books. He loves Telugu and watch lots of Telugu movies.

Telugu language, it is like honey, very sweet to ears and thus it is the sweetest language among others. It has the sugar from Sanskrit and elixir of Tamil, even took from Kannada and thousands of poets adore Telugu and this is the language that shined through out India.Viswa Kavi Rabindranath Tagore is said to have stated that Telugu is the sweetest of all Indian Languages.

Telugu is one language in India whose vocabulary is extensively derived from two great language families of India which together account to languages spoken by 97% of the population, namely Sanskrit (Indo-Aryan) and Dravidian, we proud of.

From my research, most prominent personality I found is Nannayya, of course, rightly known as the Telugu's Aadi Kavi ("First Poet"), for his partial translation of the Sanskrit Mahabharata is the earliest piece of literature we still can read/ have access to. However, I would argue that his greatest contribution to the Telugu language is his Telugu grammar, Andhra Shabdha Chintamani, a set of linguistic rules that defined the language as we know it today, for which he was also given another sobriquet, vaaganu saasanuDu ("The Determiner of Laws For Language") a far greater honour than merely being the First Poet.

Andhra Mahabaratham is the Telugu version of Mahabharatha written by Kavithrayam (Trinity of poets), consisting of Nannayya, Thikkana and Yerrapragada (also Known as Errana).The three poets translated the Mahabharata from Sanskrit into Telugu over the period of 11-14th century AD, and became the idols for all the following poets.

Telugu language is one of the six classical languages of India (others being Sanskrit, Tamil and Kannada, Malayalam, Odia) and the second most spoken language in India. It is one language in India whose vocabulary is extensively derived from two great language families of India which together account to languages spoken by 97% of the population, namely Sanskrit (Indo-Aryan) and Dravidian. The vocabulary of few regions (eg: Telangana) also draws upon Persian-Arabic languages.

It is one of the most difficult languages to master with complexities such as sandhis, samasas and heavily used inflections.Despite Carnatic music being spread over the entire south India, most poet-composers of all the languages often write in Telugu and Sanskrit as they are more "Musical" owing to the vowel-ending property of words in these languages.Telugu film industry is the second biggest of India, next only to Bollywood.

Sri Krishnadevaraya visited his temple in Srikakulam and paid homage to the deity. It was here that Krishnadevaraya wrote the literary classic, Amuktamalyada at the order of the Lord Andhra Vishnu who had said “Des Bhashalandu Telugu Lessa” (Telugu is the greatest among the state’s languages”) and ordered Sri Krishnadevaraya to adopt Telugu as the official language of his province.

Thanks to TANA, for giving me this opportunity.

My experiences with my culture

Bhuvana Sai Vejandla

She is in 7th Standard and lives in St. Louis.

Ever since I was a child my mind has seen and experienced many wonderful things since I go to India every summer. Not only have I learned about my culture in India during my visits, my parents also give me a vivid view of everything that defines our culture.

I usually stay with my mom's mom in her village, and all my relatives would come for a gathering and it is really fun. My grandma passed away when I was 7, but still that love and affection showered by my relatives amazes me. As much as I miss my grandmother, my family fills in her gap. I cherish my relationship with my aunts, uncles and cousins and how loving they are even though we meet once a year. The relationship I see between them and how we all speak in one language and share everything with each other really fascinates me.

Then, there are different festivals that give a glimpse of our culture with a reason for celebration. Like on Ugadi how we make wonderful food and Ugadi pachadi and enjoy it all with our family members celebrating the beginning of Telugu New Year. Diwali is another one; till recently I just thought this festival was about fireworks and lights. But last year I learnt from my parents the whole story about when Rama defeated dark as in evil and Rama was the light as in good and people celebrated this festival by triumphing with lights. Like that every day I learn something new about our culture. I also enjoy the family time that comes with all of this that makes family bonding stronger.

I was surprised when I came to know the telugu we speak eloquently is also different to the actual roots of telugu language. Even when I listen to my foreign language at school it won't be spoken so elaborately and in such detail with meaning of what is being spoken. Not only how telugu is spoken but how it is read and written with so many letters is just amazing. English language with 26 letters sounded simple when I learnt that you have to know 56 letters and beyond to read and write in Telugu.

ఏకసించిన విద్వత్తు...

సాహిత్య, సామాజిక వ్యాసకదంబం



ఈ విభాగంలో...

1.	నా సాహితీయాత్ర	కొలకలూరి ఇనాక్	... 175
2.	తొణకని స్వప్నం	ఓల్గా	... 178
3.	బాలల చిత్రాలలో నా జీవితచిత్రం	అక్కినేని కుటుంబరావు	... 180
4.	సిరివెన్నెలలో విరిసిన 'నంది'వర్ధనాలు	వారణాసి నాగలక్ష్మి	... 182
5.	అవధానంలో సమయస్ఫూర్తి	డా॥ సరాల రామారెడ్డి	... 188
6.	తెలుగువారి జీవనవిధానమే 'మాయాబజార్'	సాయిబ్రహ్మానందం గొర్తి	... 191
7.	నా కథాయానం	డా. పాపినేని శివశంకర్	... 196
8.	మంచి అభిరుచిని మనమే సృష్టించాలి!	మోహనకృష్ణ ఇంద్రగంటి	... 200
9.	ఒక వెలుగు ముచ్చట	పన్నాల సుబ్రహ్మణ్య భట్టు	... 204
10.	స్వప్నయానం	దాసరి అమరేంద్ర	... 209
11.	చిన్న సినిమాలు - పెద్ద లాభాలు	కె.వి.ఎస్. రామారావు	... 214
12.	ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వికసించిన ప్రగతి సాహితీకుసుమాలు	డా. నందిని సిధారెడ్డి	... 220
13.	భారతదేశానికి ప్రజాస్వామ్య సంస్కృతి అత్యవసరం	బాబు గోగినేని	... 223

నా సాహితీయాత్ర

కొకుయూరి ఇనోక్

ఎలా మొదలైందో నాకు గుర్తులేదు కానీ, చదువుకునే రోజుల్నించి కనపడ్డ ఏ పుస్తకాన్నీ వదిలేవాణ్ణి కాదు. అట్లా పాత పుస్తకాల దుకాణంలో ఆంధ్రప్రభ వీక్లీ, ఆంధ్రపత్రిక వీక్లీ, భారతి 1952 నాటి వరకు వెలువడ్డవన్నీ చదివేశాను. ఒక పెళ్లిలో పంచరత్నాలు చదవటానికి జాషువా వస్తున్నాడంటే అందరూ పెళ్లి ఆపి ఎదురుచూస్తున్నారు. ఆయన వచ్చి పంచరత్నాలు చదివాక పెళ్లి ముగిసింది. ఆ పద్యాలు వినడం, అవి అర్థమవడంతో నేనూ పద్యాలు రాయగలనని పించింది. అప్పుడు నేను ఫోర్తుఫారంలో ఉన్నాను. అప్పటికే జాషువా, కరుణశ్రీల కవిత్వం చదివాను. బాల, పాపాయి, చందమామ, బాలమిత్ర పత్రికలకు గేయాలు అవీ పంపేవాణ్ణి వేసేవాళ్లు కారు. నా రచన అలా మొదలైంది.



విభిన్న భావజాలాలు విశ్వసనీయత నుంచే పుడతాయి. మనకు పరిచయం లేనంత మాత్రాన ఒక బతుకు ఉనికిని నమ్మకుండా ఉండకూడదు. అవిశ్వసనీయం అనలేం. నూరేళ్ల క్రితం దాకా ఒక్క భావజాలమే రాజ్యమేలింది. ఆధునిక సాహిత్య విజృంభణంతో అనేక భావజాలాలు పుట్టుకొచ్చాయి. మరుగునపడ్డ తమ ఉనికిని వెలుగులోకి తెచ్చుకోవటానికి చాలా అస్తిత్వ ఉద్యమాలు మేలైన కృషి చేశాయి.

రచయితను కావడం వెనుక...

సంఘంలో ఏదైనా ఇబ్బంది ఉంటే నేనేమీ చేయలేను. ఆ నిస్సహాయత నుంచి నాకు ఏడుపు వస్తుంది. ఏడుస్తూ కూర్చుంటే నన్నెవ్వరూ చూడరు. నవ్వుతూ కనిపించాలి. లోపల ఏడుపు ఉంటుంది. ఏడుపు లోపల దాచుకుని, నవ్వు బయట పెట్టేలా శ్రమించాను. తరువాత చూసినటువంటివన్నీ గుర్తు తెచ్చుకుని ఒంటరిగా ఉండి ఏడుస్తూ బాధపడేవాణ్ణి. దీనికి పరిష్కారం ఎలా అని? ఏం చేయాలి అని? ఏమైనా చేయగలనా అని ఆలోచించేవాణ్ణి. కొట్లాటకు పోవాలంటే నేను కొట్టలేను. తిడదామంటే వాళ్లూ తిట్టగలరు. కనుక సమస్య పరిష్కారానికి రాత సరైన మార్గమనిపించింది. అలా నా ఆవేదనకు అక్షర రూపమిచ్చాను. అప్పుడు హాయిగా ఉండేది, గుండెంతా కడిగేసినట్లుండేది. తృప్తిగా ఉండేది. ఈ తృప్తికోసమే రాశానని చాలాసార్లనిపించింది. నేను ఏడ్చి కథ రాసినా చదివిన పాఠకులు మాత్రం ఏడవరు. ఈ పరిస్థితులు, సమస్యల నుంచి ఎలా బయటపడలా అని చూస్తారు! పీడనకు గురవుతున్నవారికి ధైర్యం చెప్పటమే నా రచనల ఉద్దేశం. 'జీవితం ఉన్నది ఉన్నట్లు చిత్రించు. ఎట్లా వుండాలో చిత్రించు. ఇవాళ ఉన్న ఈ సమస్య రేపటికి ఎట్లా మారుతుందో చిత్రించు.' అని రాస్ కోల్నికో చెకో కథలో అన్నారు. నా రచనల్లో ఉండేది ఇదే. అటువంటి జీవితం ఉంటేగానీ సమాజం, మనుషులు బాగుపడరు.

బడి కళాశాల, విశ్వవిద్యాలయాల్లో చదవటం వల్ల ప్రాచీన సాహిత్యం. నాకు ఇష్టమైన సాహిత్యం చదవటం వల్ల, ఆధునిక సాహిత్యమూ తెలిసి వచ్చాయి. రచన చేసే దశలో రెండూ కుదిరాయి, ప్రధానంగా ఆధునిక

సాహిత్యం. విశ్వవిద్యాలయాల్లో అంతదాకా ఉన్న ప్రాచీన సాహిత్యం స్థానంలో ఆధునిక సాహిత్యం ప్రవేశపెట్టే కృషి చేశాను. నా పట్టుదల కొందరికి కష్టం కలిగించింది. అయినా సాహిత్యానికి న్యాయం చేయక తప్పదనుకొన్నాను. నేను అధ్యాపకుణ్ణి అయన రోజుల్లో తెలుగు అంతా ప్రాచీనమే. ఇప్పుడు చాలావరకు ఆధునికం. నా జీవితకాలంలోనే మార్పు చూడగలగటం నా అదృష్టం.

నా రచనాప్రక్రియలు

మీరు రాసిన ప్రక్రియల్లో మీకు బాగా నచ్చినది ఏ ప్రక్రియ అని చాలామంది అడుగుతుంటారు. అన్ని ప్రక్రియలు ఇష్టమే. ఏదీ అయిష్టం కాదు. కాబట్టి ఫలానాది ఇష్టమని చెప్పలేను. సాహిత్యవేత్తలకు ఏవీ నచ్చుతాయో అవే నాకూ నచ్చుతాడు. నిజానికి, ఒక రచనకు సంఘం హక్కుదారు అయ్యాక, దానిమీద రచయిత పెత్తనం తగ్గిపోతుంది.

మిగతా ప్రక్రియలంతగా అనువాదం ప్రాచుర్యం పొందక పోవడానికి కారణం సృజన సాహిత్యంలో మెలకువలెక్కువ. అనువాద సాహిత్యంలో స్వేచ్ఛ తక్కువ. దానికి ఆదరణ కూడా తక్కువ. అనువాదకుణ్ణి రచయిత స్థాయిలో గుర్తించరు. న్యాయంగా ఈ గుర్తింపు అవసరం. ఇతర భాషల్లోనివి తెలుగులోకి వచ్చినా మన భాషలోనివి ఇతర భాషల్లోకి అనువాదాలుగా వెళ్లడ మనేది తక్కువగానే జరుగుతోంది. అనువాదం అనేది ప్రతి బింబమే కానీ అసలు కాదు. ఎక్కువగా మూల రచయితను గౌర విస్తారు. అనువాద రచయితను అంతగా గౌరవించరు. అనువాదాన్ని కూడా కళగా చేయగలిగే శక్తి వస్తే అది అద్భుతంగా ఉంటుంది. శరత్‌ను తెలుగులోకి తెచ్చినపుడు బాగుంది. ఆంగ్లంలోకి అనువాదం జరిగినపుడు జాగ్రత్తగా చేయలేక పోయారు. అందువల్ల అనువాదకుణ్ణి రెండోస్థాయి సాహిత్యమూర్తి గానే చూస్తున్నారు కానీ మట్టిమనిషిగా చూడట్లేదు. అనువాదకుడు ఆలోచించడం ఏమి ఉండదు. అతను మాటలతో జాగ్రత్తపడాలి. మౌలికమైనటువంటి రచనలో గుణాలు లేకుండా పోతున్నాయి. అందువల్ల చిన్నచూపు కలుగుతుంది. అనువాదకుల్ని గౌరవిస్తే ఇంకా చేయడానికి ఆసక్తి చూపుతారు. ఇటీవలే అనువాదకులకు కాస్త గౌరవం పెరుగుతోంది. సాహిత్య అకాడెమి వారు పురస్కా రాలు కూడా ఇస్తున్నారు.

దళిత సాహిత్యం

దళిత సాహిత్యం మనలోని ఒక సామాజికవర్గానిది. దళిత జీవిత అవగాహనతో సంఘ జీవితం సుఖమయం కావాలి. దళిత సాహిత్యం వాస్తవం చెప్పాలి. కాఠిన్యం తగ్గించాలి. దళితేతరులకు ఆలోచన కలిగించాలి. ఆగ్రహం పెంచకూడదు. అభివ్యక్తిలో అదుపు అవసరం. బాధ నిజమే! దుర్భర పరిస్థితి నిజమే! అది కోపం కలిగించడమూ నిజమే! కోపమే అభివ్యక్తి అయ్యి దళితే తరుల్ని దూరం చేసుకునేకంటే సమస్యను స్పష్టంగా, తీక్షణంగా చెప్పి ఆవతలి మనిషి ఆలోచించేట్టు చేయాలి. ఆలోచిస్తే అర్థమవు తుంది. అర్థమైతే సర్దుబాటు చర్య వస్తుంది. అది సమతౌల్యం తెస్తుంది. ఆకలైనవాడికి కోపం న్యాయమే! కోపం శాంతంగా వుండదు. దళితుల ఆగ్రహ అభివ్యక్తిని దళితేతరులు సంయ మనంతో అర్థం చేసుకోవాలి.

తెలుగులో దళిత సాహిత్యం వల్ల నిఘంటువులెరుగని పదాలు వచ్చాయి. భాష ఎరుగని పలుకుబళ్లు, జాతీయాలు వేదిక లెక్కాయి. అందమైన వాక్యనిర్మాణం వచ్చింది. సంస్కృతం బాగా వచ్చినవాళ్లు తెలుగును సంస్కృతంలాగా రాస్తారు. అలాగే ఇంగ్లీష్ బాగా వచ్చినవాళ్లు కూడా. దళిత రచయితలు, కవులు వాడకట్టు పదాలను తెచ్చి తెలుగుకు కొత్త నెత్తురు వంట బట్టించారు.

సాహిత్యం ఏం చేస్తుంది...

సాహిత్యచరిత్ర పొడుగునా సాహిత్యానికి చాలా పనులు చెప్పారు. చాలా విధులు నిర్దేశించారు. ఇప్పుడు సాంఘిక చైతన్యం, సామాజిక స్పృహ కలిగించాలన్నారు. సాహిత్యం సంఘజీవిని కార్యోన్ముఖం చెయ్యాలని కూడా భావిస్తున్నారు. సాహిత్యం మనో వ్యథ తీరుస్తుంది. నేనింతకాలంగా అంటున్నట్లు సాహిత్యం నా కన్నీటిని కడుగుతుంది. నాలాంటి కన్నీటి వారసుల కళ్లు పరి శుభ్రం కావిస్తుంది. ఆకలి, దారిద్ర్యం, పీడన, వేదనల నుంచి కన్నీరు రాని మనిషిని, సంఘాన్ని సాహిత్యం ప్రసవించే రోజు కోసం నిరీక్షిద్దాం.

విభిన్న భావజాలాలు విశ్వసనీయత నుంచే పుడతాయి. మనకు పరిచయం లేనంత మాత్రాన ఒక బతుకు ఉనికిని నమ్మ కుండా ఉండకూడదు. అవిశ్వసనీయం అనలేం. నూరేళ్ల క్రితం దాకా ఒక్క భావజాలమే రాజ్యమేలింది. ఆధునిక సాహిత్య విజృం భణంతో అనేక భావజాలాలు పుట్టుకొచ్చాయి. మరుగునపడ్డ తమ ఉనికిని వెలుగులోకి తెచ్చుకోవటానికి చాలా అస్తిత్వ ఉద్య మాలు మేలైన కృషి చేశాయి. భిన్నప్రాంతాలు, భిన్న సమస్యలు ముందుకు వచ్చి సంఘం బొడ్లో చెయ్యేసి నిలబెట్టాయి. అనేక విషయాలకు సాహిత్యం ఆలవాలమయినప్పుడు భిన్న భావ జాలాలు అనివార్య ఉత్పత్తులు. పొరల పొరల సమాజంలో పైపొర చదువే చదువు, సాహిత్యమే సాహిత్యం! లోపల్లోపలి పొరల్లోకి ఆంగ్ల విద్య చొచ్చుకుపోయి, కొత్త సాహిత్యం పుట్టినప్పుడు, కొత్త జీవితం పరిచయమైంది. అన్ని పొరల్లోని జీవితం తెలిస్తే సమాజమంతా తెలుస్తుంది. ఇప్పుడు స్త్రీలు, దళితులు, బహుజనులు, గిరిజనులు, మహమ్మదీయుల సాహిత్యం పుష్పించటం వల్ల సమాజంలోని అంతఃస్సాయువుల ఉనికి అంతుబట్టింది. లేకపోతే మనకు మనల్ని గురించీ తెలియకుండా ఉండిపోయేది. ఇన్ని అరల్లోపొరల్లో ఉన్న జీవిత నిజరూపం తెలిస్తే మనుషులు సన్నిహితుల వుతారు. సంఘం స్థితీగతీ అర్థమవుతాయి. అర్థరాహిత్యమే కదా అనర్థాలకు మూలం. మన సమాజం మనకింకా బాగా తెలిసి రావటానికి అన్ని అంతరువుల నుంచి సాహిత్యం పుట్టాలి, పెరగాలి.

మనిషి బలవంతుడైతే అన్నింటినీ తనకు అనుకూలంగా మలచుకొంటాడు. బలవంతులు సాహిత్యాన్ని తమకు అనుకూ లంగా, లాభసాటిగా మార్చుకోవటం మనకు తెలిసిన సంగతే! బల హీనులైన వాళ్లు బలవంతులుగా మారితే సాహిత్య సమవర్తి అవు తుంది. ఈ పుస్తకం ఈ మనిషి ఈ స్వార్థం కోసం రాశాడు అని

తెలిస్తే ఆ స్వార్థం అవుననటమో, కాదనటమో తేలిపోతుంది. ఆ తెలివిడి రావటమే బలహీనులు బలవంతులు కావటమంటే.

ఒకడికి అఫెన్స్, ఇంకొకడికి డిఫెన్స్ ఉందని తెలియాలి. అలా అయితేనే ప్రేమ, ఓర్పు ఏర్పడతాయి. అలాంటి సమన్వయం వస్తేనే సమాజం బాగుపడుతుంది. జాషువా కవిత్వం కొట్టొద్దు, తిట్టొద్దు అని ఉంటే నాది అవతలి వాళ్లను అవసరమైతే భయపెట్టాలనే సందేశంతో ఉంటుంది. పడికట్టు రాళ్లతో బెదర గొట్టేలా రచనలు చేయను. వాటిలో ఆవేదనను మాత్రం తెలుపుతాను. ఏమీ తెలియని వాళ్లకి కూడా నా కథలు అర్థమయ్యేలా ఉంటాయి. ఇక నన్ను దళితవాది, స్త్రీవాది, మైనార్టీవాది అనేకంటే మానవతావాది అనడాన్నే ఇష్టపడతాను.

జానపద సాహిత్యం గురించి...

జానపద సాహిత్యాన్ని పరిశోధనావస్తువుగా తీసుకున్న మొదటివ్యక్తిని దాదాపు నేనే. ఆ సాహిత్యం శాశతత్వం పొందాలంటే దాన్ని భద్రం చేయటం ఒక్కటే మార్గం. రాత, రికార్డు, చలన చిత్రం- ఏదో రూపంలో ఒక్క మనిషి మాత్రమే మాట్లాడే భాష ఉన్నా ఆ మనిషిని భద్రం చేయమని ఐరాస చెప్పింది. ఇంతమంది జీవితాల్లో నిండుగా ఉన్న జానపద విజ్ఞానం పూర్తిగా బతికుండేట్టు చేయగలిగితే దాన్ని ప్రేమించి కాపాడుకొన్నవాళ్లమవుతాం. జానపదుల్లో కూడా విమర్శ చేసే శక్తి ఉంటుంది. జానపదులు రామాయణం గురించి కట్టె కొట్టె తెచ్చె అని వాఖ్యానిస్తారు. అలాగే 'రామాయణం రంకు భారతం బొంకు' వంటి ఒక మాటలో తేల్చి ఆలోచనకందని సారాన్ని చెప్పేస్తారు. తెనాలి రామకృష్ణుడివిగా చెబుతున్న చాలా కథలు జానపదులు అల్లినవే. అలాంటివే శ్రీనాధుడు, పోతనలపై ప్రచారంలో ఉన్న కథలూ. ఇలాంటివి 300 కథలు సేకరించి వాటిల్లో జానపద అంశం ఏమిటి, జానపదుల విమర్శ పద్ధతి ఏమిటి అని వివరించాను. పరిశోధకులు, విమర్శకులు వీటిని తప్పన్నారు. ఎందుకు తప్పు? అనుకొని వాళ్లు రాసిన పుస్తకాల నుంచే వివిధ కథలను తీసుకొని నేను ఈ పుస్తకాన్ని రాశాను. ఇవన్నీ కవుల మాటలు కాదు. జానపదులు విమర్శలను కథలుగా చెబుతారని సాహితీవేత్త బాగ్స్ చెప్పిన ప్రకారం జానపదుల్లో సాహితీవిమర్శ ఉంటుందని రాశాను. అనువాదం చేయాలంటే ఆధునిక దృక్పథం, ఆంగ్లం తెలిసుండాలి. తెలుగులో జానపదుల్లో సాహితీవిమర్శ ఉందన్నది తెలిస్తే ప్రపంచ సాహిత్య చరిత్రలో అది ఒక సంచలనమే.

నా భార్య భాగీరథి పేరిట పరిశోధన గ్రంథాలయం ఏర్పాటు నేను పుట్టిన ఊరు గుంటూరు జిల్లా వేజెండ్లలో ఏర్పాటుచేశాను. ఇది తెలుగు పరిశోధకులకు బాగా ఉపయోగపడుతుంది. పరిశోధకులు ఉండటానికి ఏసీ రూంలున్నాయి. అన్నీ ఉచితం. తెలుగు పరిశోధకులకు అవసరమైన చాలా గ్రంథాలు, ఇంగ్లిష్, సంస్కృతంతోపాటు, వివిధ సామాజిక శాస్త్ర గ్రంథాలు, ఆధునిక సాహిత్యంతో పాటు దాదాపు పదివేల పుస్తకాలున్నాయి.

విశ్వవిద్యాలయాల్లోనూ, వెలుపల కూడా పరిశోధనలు బాగా జరుగుతున్నాయి. మంచి ఫలితాలు వస్తున్నాయి. రాశి బాగా పెరిగింది. కొన్ని సందర్భాల్లో వాసి విషయంలో నిరుత్సాహం కలుగుతుంది. అందరూ అన్నివిధాలా అదే క్రమతతో ఉండాలని ఆశించడం న్యాయమే కానీ ఉంటారనుకోవటం అత్యాశ. ప్రోత్సాహానికి కొదవలేదు. వనరులకు ఇబ్బంది లేదు. నిధుల కొరతాలేదు. కష్టపడేవాళ్లే కావాలి. పట్టుదల, కృషి, దీక్ష పెంచుకొని గొప్ప ఫలితాలు సాధించి, గుర్తింపు తెచ్చుకొని, గౌరవం పొంది, సమాజంలో తలెత్తుకొనే స్థితి పొందమని, తలదించుకొనే పరిశోధన చేయవద్దని చాలా చెప్పాలని అనిపిస్తుంది. కానీ అసలు సిసలు పరిశోధకులు బద్ధకంకణులు. వాళ్లకు తిరుగులేదు. అలాంటి వాళ్లూ ఉన్నారు.

రచనల్లో తెలుగుదనం

నా రచనల్లో శీర్షికలన్నీ తెలుగులోనే ఉంటాయి. ఉదాహరణకు కన్నీటి గొంతు, ఊరబావి, తలలేనోడు, కాకి, ఆకలి. ఇలా శీర్షికల్లో మాత్రమే కాదు, రచనలో కూడా సామాన్యుల తెలుగు మాటలే వాడతాను. అలాంటి వాక్యాలే నాకిష్టం. ఆంగ్లం, సంస్కృతం చదువుకొన్నాక, తెలుగులో వాటి వాడకం వీలైనంత మేర తగ్గించడానికే సంసిద్ధం అయ్యాను. మరీ భీష్మ ప్రతిజ్ఞ కాదు. తప్పనిసరి పరిస్థితుల్లో ఈ అభివ్యక్తులుంటాయి. కానీ ఆడం బరంగా వాటిని వాడుకోను, నాలో బాల్యంలో విన్న పదాలు, వాక్యాలు, భాష వీలైనంత ఏరివిగా వాడటానికే ఇష్టపడతాను.

తెలుగు భాష- గ్రాంధికం నుంచి వ్యావహారికం నుంచి, మాండలికం దాకా, మనిషి మాటదాకా వచ్చింది. మేలే. ప్రసార మాధ్యమాల్లో కలగాపులగం భాష పాచిపట్టి కంపుకొట్టే దుస్థితి తొలగితే బాగుణ్ను.

ఆధునిక పరికరాలు, విజ్ఞానశాస్త్రాల పదజాలం తెలుగులో లేనందువల్ల ఇతర భాషల నుంచి తీసుకున్నందువల్ల హాని కలగదు కానీ, భాష అభివృద్ధి జరగదు. ఒక వస్తువు పుడితే, ఉదాహరణకు రాకెట్- ఒక మాట పుడుతుంది, ఈ మాట సొంతం కానప్పుడు అరువైనా బరువు కాదు. భాష పెరుగుతుంది. ఎంత పదజాలం పెరిగితే, భాష అంత సుసంపన్నం అవుతుంది. మనం మన అమ్మభాషను ప్రేమించాలి. తల్లిదండ్రులు పిల్లల్ని మాతృభాష చదివేట్టు చేయాలి. పెద్దల తెలుగులో రాయడం, చదవటం, మాట్లాడటం, ఆలోచించటం అలవాటు చేసుకుంటే పిల్లలు తోవ తప్పరు. ఆంగ్లం నేర్చుకోవాల్సిందే ప్రపంచంతో పోటీ పడాల్సిందే, తెలుగును మానకుండా.

కథ, నవల, నాటకం, విమర్శ, ప్రాచీన సాహిత్యం- ఇలా విభిన్న సాహితీరంగాల్లో అశేష ప్రజ్ఞాపాటవాలు ఉన్న రచయిత కొలకలూరి ఇనాక్. తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం, బొమ్మిడాల పురస్కారం నుండి ఎంతో ప్రతిష్టాత్మకమైన మూర్తిదేవి పురస్కారంతో పాటు తెలుగులో అతికొద్దిమంది రచయితలకు మాత్రమే వచ్చిన పద్మశ్రీ పురస్కారం (2014) వీరికి లభించాయి. దాదాపు 50 గ్రంథాలు రచించారు. నివాసం హైదరాబాద్. email: k.enoch@yahoo.com



తొణకని స్వప్నం

ఓల్గా

ఇది 2017. త్వరలో 2020 రాబోతోంది. వందేళ్ల క్రితం 1917, 1920 సంవత్సరాల ప్రాధాన్యం గుర్తుకు వస్తే ఒళ్లు పులకరిస్తోంది. ఎంత ఉద్విగ్న సందర్భం 1971. ప్రపంచాన్ని కుదిపేసిన ఆ పదిరోజులు మన దేశాన్ని కూడా కుదిపాయి. లెనిన్ గ్రాడ్‌కి లెనిన్ వచ్చినరోజు ప్రపంచ శ్రామికులంతా ఆశగా, ఆనందంగా మహోద్రేకంతో సోవియట్ యూనియన్‌గా అవతరిస్తున్న రష్యా వంక చూసిన రోజులు. 'పుడమి తల్లికి పురుటి నొప్పులు కొత్త సృష్టిని స్ఫురింపించిన రోజులు.' ఆ పురిటి వాసన, ఆ పచ్చి పరిమళం మన తెలుగు సాహిత్యాన్ని తాకి 1920లో రెండు రచనలుగా ప్రసవమైనాయి. సోవియట్ యూనియన్ ఇవాళ ఒక జ్ఞాపకం. కరిగిన స్వప్నం. అదీ రాయాల్సి వస్తుందని తెలిసేనేమో శ్రీశ్రీ పతనమైన సోవియట్ యూనియన్‌ని ఉద్దేశించి రాయకపోయినా ఇప్పటి స్థితిని తలపింపజేసే కవితా వ్యాక్యాలు రాసిపెట్టాడు. 'తొణకిన స్వప్నం; తొలగిన స్వరం' అని.

సరే- పతంజలిశాస్త్రిగారు కుటుంబరావు రాసిన కొల్లేటిజాడలు నవలకు ముందు మాట రాస్తూ 'సమాజానికి మేలు చేసే ప్రయత్నాన్ని లబ్దిదారులే విఫలం చేసుకున్నారన్న మాట' అన్నారు. కొల్లేట్లో జరిగిన సమిష్టి వ్యవసాయం ఆగిపోవటం గురించి బాలగోపాల్‌గారు మానవ స్వభావపు లోతుల్లోకి వెళ్తే తెలుస్తుంది వాళ్లు ఎందుకు విఫలం చేసుకుంటారో అంటారు. సోవియట్ యూనియన్ ఏర్పడినపుడు ఎన్ని ఆలోచనలు రేగాయో, పతనాన్ని గురించీ అన్ని ఆలోచనలు కొనసాగుతున్నాయి. అవి సాహిత్యంలో కొనసాగితే ఎంతో ఉపయోగం. సోవియట్ యూనియన్ ఏర్పడిన మూడేళ్లకు మాలపల్లి (1920) నవల రాశారు ఉన్నవ లక్ష్మీనారాయణ గారు. అందులో బోల్షివిక్ విప్లవాన్ని గురించీ, బోల్షివిక్ సిద్ధాంతాల గురించీ ఎంతో విపులంగా రాశారు. ప్రజలకు ప్రపంచంలో జరిగిన ఒక పెనుమార్పుని పరిచయం చెయ్యటానికి ఆయన సాహిత్యప్రక్రియ అయిన నవలను ఎంచుకున్నారు. ఆయన బోల్షివిక్ సిద్ధాంతాన్ని సమర్థించలేదు. చర్చకు పెట్టాడు. ఐనా ఆ ఆకర్షణ, బోల్షివిక్కుల సూనృత హృదయాలు, వారి త్యాగాలు, వారి ఆదర్శాలు ఆయననెంత ప్రభావితం చేశాయంటే నవలలో తక్కెళ్ల జగ్గడి పాత్రను రక్త మాంసాలతో ప్రవేశపెట్టక తప్పలేదాయనకు.

బానిసత్వంలో మగ్గుతున్న ప్రజలకు అనేక రాజకీయ ఆర్థిక, సామాజిక

బానిసత్వంలో మగ్గుతున్న ప్రజలకు అనేక రాజకీయ ఆర్థిక, సామాజిక కోణాలను పరిచయం చేసిన మాలపల్లి నవల 1920లో రాయటం యాదృచ్ఛికం కాదు. 1917 రష్యా విప్లవం ఆయన మనసులో రేపిన అలజడి, స్వదేశీ ఉద్యమాలు కలగలసి పుట్టిన నవల మాలపల్లి. తొలిసారి సాహిత్య ప్రేమికులు బోల్షివిక్ సిద్ధాంతాలు తెలుసుకునే అవకాశం ఇచ్చిన నవల అది.

కోణాలను పరిచయం చేసిన మాలపల్లి నవల 1920లో రాయటం యాదృచ్ఛికం కాదు. 1917 రష్యా విప్లవం ఆయన మనసులో రేపిన అలజడి, స్వదేశీ ఉద్యమాలు కలగలసి పుట్టిన నవల మాలపల్లి. తొలిసారి సాహిత్య ప్రేమికులు బోల్షివిక్ సిద్ధాంతాలు తెలుసుకునే అవకాశం ఇచ్చిన నవల అది. ఇవాళ అవి తీపి జ్ఞాపకాలు. చేదు వాస్తవాలు. సోవియట్ విప్లవం సంగతలా ఉంచితే మాలపల్లి నవల ఇప్పటికీ కొనసాగుతున్న సామాజిక వాస్తవం. ప్రథమ ఆది ఆంధ్రుల సభ బెజవాడలో జరుపుకుని, వ్యవసాయ కూలీలను సంఘటిన పరుస్తున్న సంగదాసుని భూస్వామి హత్య చేస్తాడు. ఆ హత్య, అది పరిష్కారమైన తీరు, సంగదాసు సమాధి- అన్నీ అంతా ఇప్పటికీ కొనసాగే చేదు నిజాలే!



సోవియట్ యూనియన్ అనే అందమైన వాస్తవాన్ని విఫలం చేసుకున్న ప్రజలు (ఔను అది ప్రపంచ ప్రజలందరి వైఫల్యమే) ప్రతి దేశంలోనూ తిరుగుబాటు దారులపై జరిగే హత్యలు కొనసాగటాన్ని మౌనంగా ఆమోదిస్తున్నారా? ఆమోదించే తత్వం వారికెలా అలవడింది? తక్కెళ్ల జగ్గడు వంటి వారిపై జరిగే దాడులకు సమాజ స్పందన మాలపల్లి రాసిననాటికి, ఇప్పటికి మారిందా? ఎన్నో ప్రశ్నలు- దాదాపు వందేళ్ల క్రితం రాసిన ఆ నవల చదువు తుంటే- మన కళ్ల ముందే జరుగుతున్న మార్పులను ఎట్లా అర్థం చేసుకోవాలో తెలియని మార్పుల సాహిత్యం మాత్రమే పట్టుకో గలుగుతుంది. వర్తమాన పాఠకులకు అర్థం కాకపోయినా భవి ష్యత్తులోనైనా అలాంటి సాహిత్యం దారిదీపంలా ఉపకరిస్తుంది.

సోవియట్ యూనియన్ ఏర్పడటంతోనే కార్మికవర్గ నియం తృత్వంతోపాటు అతి చర్చనీయాంశమైన విషయం స్త్రీ పురుష సంబంధాలు. సోవియట్ యూనియన్ ఏర్పడుతూనే వివాహం-విడాకులకు సంబంధించి పెద్ద ఎత్తున మార్పులు జరిగాయి. కొత్త చట్టాలు ఎన్నో వచ్చాయి. ఎన్ని వచ్చినా కొల్లంటాయ్‌కి లెనిన్‌కీ మధ్య విభేదాలు కొనసాగాయి. కుటుంబం గురించి కొలంతాయ్ పొలిట్‌బ్యూరోలో చర్చపెట్టిన ప్రతిసారీ లెనిన్ అంతకంటే ప్రధాన విషయాలున్నాయని మందలించాడు. కొలంతాయ్ రాసిన 'మూడు తరాలు' కథ వంటి వాటిని దృష్టిలో పెట్టుకునేమో గ్లాసెడు నీళ్ల సిద్ధాంతమంటూ స్త్రీ పురుష సంబంధాలను వాటి తత్వాన్ని లోతుగా చూడ నిరాకరించాడు. అక్కడ ఆ గోడవ లెనిన్, కొల్లం టాయ్‌ల మధ్య స్నేహ పూర్వకంగానైనా జరుగుతున్నపుడే చలం స్త్రీ, శశిరేఖ రాశాడు. శశిరేఖ ప్రేమ మారుతుందనీ, ప్రేమ ఉన్నచోట పెళ్లి ఎందుకని అంటూ సోవియట్ యూనియన్‌లోని లిబరల్ చట్టాల స్ఫూర్తిని అందుకుంది. స్త్రీలో చలం రాసిన అనేక విష యాలు కొలంతాయ్, ఆమె బృందం ఒక రాజకీయ విషయంగా సోవియట్ యూనియన్‌లో చర్చిస్తున్నారు. ప్రపంచం ఆనాడు మంచి విషయాల కోసం దగ్గరైంది. సాహిత్యం కూడా తులనాత్మ కంగా చూసినపుడు ఎంత అంతర్జాతీయతతో ఎంత స్థానికతతో నిండి వుందో ఆనాడు కూడా అనిపిస్తుంది.

ఇవాళ పరిస్థితి చూస్తే 1917కి 2017కి ఎంత తేడానో అంత సామ్యం కూడా ఉంది. ఫాసిస్ట శక్తులు పెరుగుతున్నాయి. నిజమే- కానీ నిరంకు శత్వాలు, నియంతలు పెరిగి పెరిగి విరుగుతారనే విషయం వందేళ్ల క్రితం చరిత్ర నిరూపించింది. సాహిత్యం దానికి వత్తాసుగా నిలబడింది. విఫలమైన సమాజం గురించి దుఃఖించటం కాదు- ఆనాటి ఆ సమాజ నిర్మాణ మహా ప్రయత్నాన్ని మననం చేసుకుంటూ బలం పొందాలి. జారు చక్రవర్తి, హిట్లర్, ముసోలిని, బ్రిటీష్ సామ్రాజ్యం అబ్బా- ఎన్నిటిని, ఎందరిని మట్టి కరిపించారు సామాన్య ప్రజలు అనిపిస్తుంది ఆనాటి చరిత్రను, సాహిత్యాన్నీ మళ్లీ చదివితే. అందువల్ల 2017లో మనం వందేళ్లనాటి చరిత్రను, సాహిత్యాన్ని గానం చెయ్యాలి. హృదయాలు ఉప్పొంగేలా, రక్తాలు రాగాలయ్యేలా!

మళ్లీ చదువుదాం, మళ్లీ మళ్లీ చదువుదాం అమ్మను, మాల పల్లిని, నీలం నోట్‌బుక్‌ని, ప్రజలమనిషిని, మూడు తరాలును శశిరేఖను-

మళ్లీ రచయితలు ఉద్యమిస్తారు కొత్త కథలతో, కవిత్వంతో- ఆశ తప్ప మనకు మిగుల్చుకోటానికి ఏమీలేదు.

ఆ ఆశను చేజార్చుకోకూడదు ఎన్నటికీ!

కవి, కథకులు, వ్యాసకర్త, నవలాకారిణి, ఉద్యమ కార్యకర్త- ఇలా బహుముఖాలుగా విస్తరించిన ఓల్గా తెలుగు నేలపై స్త్రీవాద ఉద్యమం ప్రముఖంగా రావడానికి ప్రధాన కారకులు. కేంద్ర సాహిత్య అకాడెమితో సహా వివిధ ప్రతిష్టాత్మక పురస్కారాలు పొందారు. కొన్ని సినిమాలకు కథలు, స్క్రీన్ ప్లే రాశారు. 2017 తానా సభల అతిథి.

email: lalitapopuri@gmail.com

బాలల చిత్రాలలో నా జీవితచిత్రం

అక్కినేని కుటుంబరావు

'చి'న్న పిల్లల సినిమాలు తెలుగులో లేవండి,' అన్నాను 1990వ దశాబ్దంలో ఒకసారి డి.వి. నరసరాజుగారితో. 'అదేవిటండీ- మన తెలుగులో అన్నీ చిన్న పిల్లల సినిమాలే- పాతాళ భైరవి నుంచీ మీరే సినిమా పేరైనా చెప్పండి, అది చిన్నపిల్లల సినిమా అని నిరూపిస్తాను,' అని కూడా అన్నారు. ఇద్దరం నవ్వుకున్నాం. నిజం అంతేనేమో- ప్రమదరహిత వినోదపు సినిమాలన్నీ 18ఏళ్లలోపు పిల్లల బుద్ధికే అప్పీల్ అయి వాళ్లను వినోద పరుస్తున్నట్లు కనపడుతుంది. 90వ దశాబ్దం నుంచీ శ్రీశ్రీ 'వెర్రివాడా! కుర్రవాడా!' టైపు కుర్రాళ్ల కోసం, వాళ్ల ఉద్రేకాలను రెచ్చగొడుతూ, వాళ్లను మాస్‌గా ఊహిస్తూ తీసిన సినిమాలు ఎక్కువే. ఐతే శ్రీశ్రీలా

'వెర్రివాడా! కుర్రవాడా!
క్షమిస్తావా సహిస్తావా
బుద్ధిమంతులు నీకు చేసిన
దురన్యాయాన్ని-'

అని అడిగే మొనగాడెవడూ లేకపోయాడు సినిమారంగం లోపలా బైటా కూడా.

ఇట్లాంటి పరిస్థితుల్లో చిన్నపిల్లలనూ, వారి చిన్నిచిన్ని ఆశలను, కష్టాలనూ, నవ్వులను, కన్నీళ్లను గౌరవించి ప్రేమించి వారి కోసం సినిమా తియ్యటం ఎంత కష్టం. చిన్నపిల్లలను గౌరవించాలి అని మొత్తుకున్న చలం మాటలు ఎవరికీ ఈవేళ తెలియదు. తెలిసినవాళ్లు కన్వీనియంట్‌గా మర్చిపోయారు. పెద్దల లోనూ పిల్లలు దాగి ఉంటారు. ఎవరి బాల్యం వారి హృదయాలలో జ్ఞాపకపు లోతుల్లో దాగి ఉంటుంది. కాబట్టి పెద్దలూ ఆనందించవచ్చు చిన్న పిల్ల కోసమో, చిన్న పిల్లల గురించో తీసిన సినిమాలు చూసి. కానీ ఇవాళా రేపూ అందరూ వెర్రెక్కిపోయి ఉన్నారు. పెంకుగట్టిపోయి ఉన్నాయి హృదయాలు. పిల్లల లేత మనసులు ఎంత తొరగా పెంకు పట్టిద్దామా అని చూస్తూ టెలివిజన్ల ముందు కూచో బెడుతున్నారు. చాలా ఇష్టంగా వాళ్లకు బోలెడు ప్రేమనిస్తున్నట్లు భావిస్తూ సినిమాలకు తీసుకెళ్తున్నారు. పిల్లల సున్నితమైన ఫీలింగ్స్‌ని ఎంత తొందరగా బండబార్చాలా అని చూస్తున్నారు దయగల తల్లిదండ్రులు. 'లేకపోతే వాళ్లీ ప్రపంచంలో నెగ్గుకురాలేరండీ,' అంటారు బోలెడు బాధ్యతతో.

బాధ్యతగల పౌరులెప్పుడూ
బాధిత పౌరులవుతారని
చరిత్ర మనకు చెబుతూనే ఉంది.
అలాంటి బాధిత బాలల
చిత్ర నిర్మాతలలో, దర్శకులలో
నేనూ ఒకడిని అని చెప్పుకోటానికి
నాకెంతో గర్వంగా ఉంటుంది.

నెమ్మదిగా ఎదగటం, ఆరోగ్యంగా ఎదగటం, ఆలోచిస్తూ ఎదగటం-అవసరం లేదు. ఫాస్ట్ ఫుడ్- నోటికీ, మెదడుకీ, హృదయానికీ కూడా. అది జంక్‌ఫుడ్ కూడా!

ఇట్లాంటి ప్రపంచంలో చిన్నపిల్లల సినిమాలు విరివిగా వస్తాయనీ, వాటిని అందరూ ఆదరిస్తారనీ అనుకోవటం అవివేకం. ఒక నిష్కామకర్మగా, బాధ్యతగల పౌరులుగా చేయవలసి వచ్చింది. బాధ్యతగల పౌరులెప్పుడూ బాధిత పౌరులవుతారని చరిత్ర మనకు చెబుతూనే ఉంది. అలాంటి బాధిత బాలల చిత్ర నిర్మాతలలో, దర్శకులలో నేనూ ఒకడిని అని చెప్పుకోటానికి నాకెంతో గర్వంగా ఉంటుంది.

పిల్లల కళ్లల్లోకి నేరుగా చూడగలను- ఏ నేరభావననూ వారి మనసులోకి చొప్పించాలనే ప్రయత్నం చేయనివాడిగా పిల్లలను ఆనందంగా అక్కున చేర్చుకోగలను. నా అంతరాత్మ శాంతిగా వుంది. అది సినిమా మీడియం నాకిచ్చిన వరం.

ఇలాంటి వరాలు పొందిన అనేకానేకమందిలో నేనూ ఒకడిని అనుకోవటం ఎంతో బాగుంటుంది. బాలలతో వారి లోకంలోకి వెళ్లి సినిమా తీస్తున్నపుడు వాళ్లతో ప్రేమలో పడిపోతాం. వాళ్ల తెలివినీ, శక్తినీ, చురుకుదనాన్నీ బహు ముఖాలుగా దర్శించి ముగ్ధులమవుతాం. భవిష్యత్తు మీద బోలెడు ఆశ పుట్టుకొస్తుంది. ఆ అనుభూతులుల కోసం కూడా మళ్లీమళ్లీ బాలల సినిమాలు తీయాలనిపిస్తుంది.

1990లో 'భద్రం కొడుకో' సినిమా తీసేటపుడు అరవైమంది పిల్లలతో నేనూ, నా స్నేహితులు, మధు అంబాట్, ఇంకా యూనిట్లో అందరం చిన్నపిల్లలమై వాళ్లతో ఆడుకున్నాం. ఆ ఆటలు తల్చుకుంటే ఇంకేం కావాలి జీవితానికి అనిపిస్తుంది. తల, భుజాలు, ఒడి, కాళ్లూ - ఒక్క అంగుళం ఖాళీ లేకుండా ఒళ్లంతా పిల్లలు ఎక్కి కూచుంటే ఎంత అద్భుతంగా ఉంటుందో నాకూ మధు అంబాట్‌కే తెలుసు. పిల్లల సినిమా తీయటం అంటే వారి ప్రేమను పొందటం.

'పాత నగరంలో పసివాడు' సినిమాలో ఐదేళ్ల ఆ చిన్ని పాప నన్ను డైరెక్ట్ చేయటం తల్చుకుని ఇప్పటికీ నేను నవ్వుకునే నవ్వు అతి నిర్మలమైన నవ్వు. అర్ధరాత్రి వేళ, జన సంచారం అంతగా లేని వేళ పిల్లలిద్దరూ చార్మినార్ హుందాతనాన్ని చూసి నివ్వెర పోతున్న క్షణాలను వాళ్లతోపాటు నేనూ అనుభవించాను. మళ్లీ బాలుడనై కొత్తగా చార్మినార్ చూశాను.

'గులాబీలు' తీస్తున్నపుడు పసివాళ్ల మనసులు కఠినత్వానికి ఎక్స్‌పోజ్ అయినపుడు, తామూ కఠినమయ్యే క్రమాన్ని చిత్రీకరించాం. ఇద్దరు చిన్నారి స్నేహితుల మధ్య ఎడాన్ని, కలయికను వర్షిణి, త్రిష అర్థం చేసుకుని నటించిన తీరు తల్చుకుంటే కన్నీళ్లాగవు. పూలతో మాట్లాడుతూ అద్భుతమైన హైకూలు చెప్పే పాప నా హృదయంలో గులాబీ పరిమళాలు నింపింది.

'అమూల్యం' సినిమా చూస్తూ గుమ్మడి వెంకటేశ్వరరావుగారి కళ్ల వెంట అవిరామంగా కన్నీరు వర్షించింది. ఎందుకో నాకూ సరిగా అర్థం కాలేదపుడు. ఎవరి అనుభూతి వారిది కదా అనుకున్నాను. ఇపుడు మళ్లీ చూస్తుంటే నాకూ దుఃఖం వస్తోంది. అనుభవాలు మనసును మెత్తబరిచాయి కాబోలు.

ఏమైనా నా బాలల సినిమాలు చూసుకుంటే నాకు ఆనందమే ఆనందం. అన్నిటికీ జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్రీయ అవార్డులు అందుకున్నానని మాత్రమే కాదు. కైరో బాలల చలన చిత్రోత్సవంలో ప్రదర్శించబడ్డ మొదటి భారతీయ బాలల చిత్రం 'పాతనగరంలో పసివాడు' అని మాత్రమే కాదు, నన్ను నిరంతరం పసితనంలో ఉంచుకోగల పనిలో నేను ఆనందం పొందాను, పొందుతున్నాను.

ఆటలో బాగా దెబ్బలు తగుల్తాయి, రక్తాలు కారుతుంటాయి. నొప్పి కూడా ఎక్కువే- ఐనా నా జట్టులో నేను బాగా ఆడాననే ఉత్సాహంతో పరిగెత్తుకుంటూ వచ్చి అమ్మ పైట చెంగుతో చెమటను, రక్తాన్నీ తుడుచుకుంటూ సంబరపడే బుడ్డాడిలాగా సంబరపడిపోతుంటాను. ఆ అమ్మ సినిమారంగమే. ఆ ఆట చిత్రసీమతోనే. అందుకే సినిమా అంటే నాకెంతో ప్రేమ, గౌరవం. నేనూ ఒక కార్మికుడిని అందులో అనుకుంటూ, సినీ కార్మిక గీతం రాయాలని కలలుకంటూ ఉంటాను.

ఇవి నా అనుభూతులు చిన్నారులతో. పెద్దలతో పడిన చిరాకులు, పరాకులు నాకంత గుర్తుండవు. మతిమరుపు ఎంత అదృష్టమో అనుకుంటాను ఎవరైనా గుర్తు చేస్తే.

చిన్నపిల్లల సినిమాలకి కొత్త కోణాన్ని అందించిన ప్రముఖ దర్శకుడు అక్కినేని కుటుంబరావు కథకుడు, నవలా రచయిత కూడా. రెండు కథాసంపుటాలు, ఐదు నవలలు ప్రచురించారు. నంది పురస్కార గ్రహీత. నివాసం హైదరాబాదు.

email: lalitapopuri@gmail.com

సిరివెన్నెలలో విరిసిన 'నంది'వర్ధనాలు

కారల్లోసి నాగలక్ష్మి

తనను తాను తిట్టుకున్నట్టుగా ఎవరూ తనని తిట్టలేరనీ, తనని తాను మెచ్చుకున్నట్టుగా ఎవరూ తనని మెచ్చుకోలేరనీ చెపుతూ, మనిషిగా ఎదగాలంటే ఎవరిని వారే విమర్శించుకుంటూ సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలని చెప్పే శాస్త్రిగారు నిరంతరం చేసే పని అదే. తనలోని కవిని తాత్వికుడూ, ఆ తాత్వికుణ్ణి మనిషీ డామినేట్ చేస్తాడని చెప్తూ మనిషితనానికే పెద్దపీట వేసే సిరివెన్నెల వ్యక్తిగా ఎంత ఉన్నతులో ఆయన్నెరిగిన వారందరికీ తెలిసిన విషయమే.

వెన్నెలంటే ఎవరికిష్టం ఉండదు? దానికి సిరి కూడా తోడైతే ఆ వైభోగమే వేరు. ఆయనదెంత సిరిగల సాహిత్యం కాకపోతే ప్రతి కవీ కలవరించే, భావుకుడైన ప్రతివ్యక్తీ పలవరించే వెన్నెలనే తన పేరుగా పొందుతారు! తను గీత రచయితగా పనిచేసిన మొదటి సినిమాకే నంది అవార్డు అందుకున్న సిరివెన్నెల ఆ తరువాత ముప్ఫయ్యేళ్లకే మరో పది నందులు గెల్చుకున్నారు. గొప్ప పాటల్ని రాయడమే కాదు వాటిలో వ్యక్తమైన జీవన తాత్వికతనీ, ఔదార్యాన్నీ, సానుకూల దృక్పథాన్నీ, వ్యక్తిత్వ వికాసాన్నీ ఆచరణలో కూడా చూపించే అచ్చమైన కవి శాస్త్రిగారు.

కవి రాతతో పాటు పాటకి దాని సొంత తలరాత కూడా ఉంటుందనీ, ఆ పాట వీధినపడ్డ తరువాతే దాని బతుకేవిటో తెలుస్తుందనీ అంటారాయన. ఏ సన్నివేశానికయినా ఏ సినిమాలోనయినా తన గుండెలోతుల్లోంచి ఉబికి వచ్చే భావధార ఆధారంగానే పాటలు రాసే అరుదైన రచయితల్లో సీతారామశాస్త్రి గారొకరు. లలితమైన సినీగీతాలకి కావ్యగౌరవం తెచ్చిన గీత రచయితల్లో ఆయనది ప్రథమ శ్రేణి. కవి రాసిన సాహిత్యానికి సంగీతం తోడైతే పాటవుతుంది. దానికి దృశ్యం జతై ప్రేక్షకుడికి అందుతుంది. ఫొటోగ్రఫీ రంగం ఎంతో ప్రగతి సాధించిన ఈ రోజుల్లో సాహిత్యం పెద్ద గొప్పగా లేకపోయినా సంగీతం, చిత్రీకరణ అద్భుతంగా కుదిరినపుడు సినిమాలో ఆ పాటలు మనని ఎంతగానో ఆకట్టుకుంటాయి. కానీ సినిమా లేకపోయినా కేవలం గీతంగా కూడా స్వయం పరిపుష్టత గల పాటలు కొన్నే ఉంటాయి. శాస్త్రిగారి పాటలు అలాంటివి.

సన్నివేశానికి కూర్చిన సంగీతానికి తగినట్టుగా పాటని రాసేటపుడు కూడా సందర్భాన్ని బట్టి లలిత లలిత పదగుచ్ఛాలనూ, గంభీర శబ్ద సమూహాలనూ అందమైన నగలో రత్నమాణిక్యాలను శ్రద్ధగా అమర్చినట్టుగా పాటని తీర్చి దిద్దడం ఆయనకలవాటు.

మేం బెంగుళూరులో కొత్తగా కాపురం పెట్టిన రోజులవి. ఎప్పుడు రేడియో పెట్టినా సిరివెన్నెల చిత్రగీతాలు వినిపిస్తూనే ఉండేవి. అయినా చాలదన్నట్టు శర్మగారు ఆ సినిమా గీతాలున్న కాసెట్ కొని తెచ్చారు. విరించినై విరచించితినీ ఈ కవనం- విపంచినై వినిపించితినీ ఈ గీతం... పాట మొదటిసారి

వినిపించగానే అంతవరకూ సంగీతం మీదే ఎక్కువగా ఆధారపడి మనగలిగే సినిమా పాటల మధ్య ఈ పాట విభిన్నంగా, పరిమళ భరితంగా తోచింది. వింటున్నకొద్దీ మధురంగా అనిపించడం, విన్న వెంటనే అర్థంకాని సాహిత్యపు సొగసులు వినగా వినగా అవగతమవడం, సాహిత్యాన్ని అర్థం చేసుకుని వినడం వల్ల మరింత మనోహరంగా తోచడంతో ఈ రచయిత ఎవరా అని పేరు తెలుసుకుని అప్పట్లోనే ఆయన పట్ల అభిమానం పెంచుకున్నాం ఇద్దరం. ఆ పాటకి ఆ సంవత్సరం (1986) గీత రచయితగా సీతారామశాస్త్రిగారు నంది పురస్కారం అందుకున్నారని తెలిసి సంతోషించాం.

ఇక్కడ నా నేపథ్యం గురించి కొంచెం చెప్పాలి. చుట్టూ పొలాలూ మధ్యలో మా ఒంటరి ఇల్లూ. కొద్దిమంది కూలీలని వెంట పెట్టుకుని నాన్నగారు స్వయంగా తోటలోని రాళ్లతో కట్టిన ఇల్లు మాది. వందెకరాల అడవిని పంట పొలంగా మార్చే క్రమంలో వనవాసిగా మారిన నాన్నగారు, ఆయన వెనకే అమ్మా, మామ్మా, తాతగారూ, మేం నలుగురు పిల్లలం. ఏడాదికొకసారి సెలవులివ్వగానే బంధుమిత్రుల పిల్లలందరూ చిలక గుంపులా ఒక్కసారిగా వచ్చి వాలిపోయే ఫలవృక్షం మా తోట.

పంతొమ్మిదేళ్లు ఇరుగూ పొరుగూ అన్న మాటకి అర్థమే తెలియకుండా పెరిగి ఒక్కసారిగా భాగ్యనగరంలో ఎమ్మెస్సీ చదువుకి వచ్చిన నా పరిస్థితి నీటి కొలనులోంచి గట్టుమీద పడ్డ చేపపిల్లలా అయింది. తర్వాత కిడ్నీ కాన్సర్ అనుపత్రిలో వైద్యుడైన శర్మగారితో వివాహం, బెంగుళూరులో కొత్త కాపురం. అందరిలాగే ఆ తర్వాత కొన్నాళ్లకి కొత్త జీవితం అలవాటైంది. అప్పట్లో బాలకృష్ణప్రసాద్‌గారి మధురకంఠంలో అన్నమయ్య కృతులు కాసెట్స్‌గా లభించేవి. చక్కని తల్లికి చాంగుభళా, పలుకు తేనెల తల్లి పవళించెనూ... మొదలైన కృతులు వింటూ ఒకరోజు కొత్తగా తెలవారదేమో స్వామీ... పాట విన్నాను. అన్నమయ్య కృతినే సినిమాలోకి తీసుకున్నారేమో అనుకున్న నాకు తర్వాత తెలిసింది అది శృతిలయలు సినిమాలో సీతారామశాస్త్రిగారు రాసిన పాట అని. సర్వాంగ సుందరమైన ఆ సినిమాలోని ఈ పాటకి ఆ సంవత్సరం (1987) నంది అవార్డ్ లభించింది. వరసగా రెండు సంవత్సరాలు ఒక కొత్త రచయిత పాటలకి ఈ పురస్కారం లభించడం అబ్బురంగా తోచింది. అదే రచయిత రాబోయే కాలంలో ఎన్నో రికార్డులు నెలకొల్పుతారనీ, తన రికార్డులు తానే తిరగరాస్తారనీ అప్పుడు తెలియదుగా.

ఆ తర్వాతి సంవత్సరం స్వర్ణకమలం సినిమా వచ్చింది. అందమైన తారాగణంతో, ప్రతిభావంతుడైన దర్శకుడి సారథ్యంలో యువ హృదయాలను గిలిగింతలు పెట్టేలా, మన సంప్రదాయ కళల పట్ల మక్కువ కలిగేలా తీసిన ఆ ప్రేమకథా కళాచిత్రంలోని పాటల్లో సంగీతమూ, సాహిత్యం ఒకదాన్ని మించి ఒకటి పోటీ పడగా శోభలీనే సోయగాల భానుప్రియ నాట్యం ప్రేక్షకులకి చిరకాలం గుర్తుండిపోయేలా రూపుదిద్దుకుంది.

ఈ సినిమాలో మీనాక్షి ఆశలకీ, ఆమెని అమితంగా ఇష్టపడుతున్న చంద్రం ఆశయాలకీ- నింగికీ నేలకీ ఉన్నంత దూరం. తండ్రి నేర్పిన నృత్యంపట్ల ఆసక్తిగానీ, అభిమానంగానీ లేని మీనాక్షిని ఎలాగైనా అనునయించి ఆమెలో కళపట్ల అంకిత భావం మొలకెత్తించాలని చంద్రం ప్రయత్నం. ఈ రెండు పాత్రల మధ్య సంఘర్షణని ప్రతిబింబిస్తూ, వారి మధ్యనున్న భావ వైరుధ్యాలకి అద్దం పడుతూ రాయాల్సిన మూడు పాటలు రచయిత ప్రతిభకి ఒక సవాలుగా చెప్పుకోవచ్చు. ఒక రచయితగా ఈ సందర్భంలో తానెదుర్కొన్న క్లిష్టతని శాస్త్రిగారే స్వయంగా వివరించారు.

మూడు పాటలూ ఈ రెండు పాత్రల మధ్యే చిత్రీకరించబడేటపుడు, మూడింటిలోనూ మార్పులేని వారి జీవన దృక్పథాలూ, సంఘర్షణలే వ్యక్తమయేటపుడు పునరుక్తి లేకుండా ఏ పాటకి ఆపాటే శభాషనేలా రాయడం శాస్త్రి గారి ప్రతిభ. ఆకాశంలో ఆశల హరివిల్లు..., ఘల్లు ఘల్లుమంటూ మెరుపల్లే తుళ్లు,,,, శివపూజకు చివురించిన సిరిసిరి మువ్వా... వరసగా ఈ మూడు పాటలూ చదివితే ఆయన చేసిన కత్తిమీద సాము మనకర్థమౌతుంది. అలాగే ఏ పాత్రకి ఆ పాత్ర స్వభావం, సంస్కారం ప్రతిఫలించే లాంటి భాషనే రాయడంలో కూడా అద్భుత ప్రతిభ కనపరచారు రచయిత.

ఇక ముచ్చటగా మూడో ఏడాది మూడవ నందిని సీతారామశాస్త్రిగారి ఇంటికి మోసుకొచ్చిన పాట- అందెల రవమిది పదము లదా... ఒక నాట్య కళాకారిణి తనలోని కళాత్మకత జాగృతం కాగా, ధ్యానమగ్నయై నృత్యం చేసినపుడు రవళించే అందెల మధురధ్వని పదములదెలా అవుతుంది? కాదుకదా! అది అంబరమంటిన హృదయానిది! 'అమృతగానమిది పెదవులదా?' ఉహు..అది అమితానందం పొందిన ఎద చేసే సవ్వడి! కళ్లారా ఆమెని తిలకిస్తూ, ఆమెలోని మార్పుని గ్రహించి ముగ్ధుడైన చంద్రం సాగిన సాధన సార్థకమందగ యోగబలముగా యాగఫలముగా బ్రతుకు ప్రణవమై మ్రోగుకదా... అంటూ ఆమె వెంట నడుస్తాడు. ఆమె, మువ్వలు ఉరుముల సవ్వడులై మెలికలు మెరుపుల మెలకువలై మేను హర్షవర్ష మేఘమై మేని విసురు వాయువేగమై... పోగా అంగభంగిమలు గంగపొంగులై హావభావములు నింగిరంగులై రసఝరులు జాలువారేలా సాగే లాస్యలీలని అతడు పులకితుడై తిలకిస్తాడు. శివ పంచాక్షరిని పునర్నిర్వచిస్తాడు. 'భరతమె

నిరతము భాగ్యమ'ని ఆమె గ్రహిస్తుంది. కీలకమైన సన్నివేశాన్ని అయిదు నిముషాల పాటలో ఇమిడ్చిన అక్షరశిల్పి దగ్గరకి నంది నడచి రాకుండా ఎలా ఉంటుంది? ఇంతవరకు సినిమా చరిత్రలో వరసగా మూడేళ్ల పాటు నంది పురస్కారం ఒకే గీత రచయితని వరించినది లేదు.

93 నుంచి 99 వరకు సినీ గీతాలకి ప్రకటించిన నంది పురస్కారాలన్నీ (96, 98లలో ఈ పురస్కారాలు ప్రకటించలేదు) సిరివెన్నెలనే వరించాయి.

1993లో వచ్చిన గాయం సినిమాలో-

సురాజ్యమవలేని స్వరాజ్యమెందుకనీ-
సుఖాన మనలేని వికాసమెందుకనీ-
నిజాన్ని బలికోరే సమాజమెందుకనీ-
అడుగుతోంది అదిగో ఎగిరే భరత పతాకం...

అంటూ శాస్త్రి గారడిగిన ప్రశ్న జనసామాన్యంలో తరచుగా తలెత్తే ఆవేదనకి అక్షరరూపమే. సన్నివేశానికి రాసిన పాటలో భాగాలే అయినా సమకాలీన సమాజంమీద ఎక్కుపెట్టిన తూటాలు. పాటంటే సంగీతంతో మేళవించబడి, సినిమాలోని దృశ్యమాలిక వల్ల పరిపుష్టమయే గేయమే అయినా శాస్త్రిగారికి సంబంధించినంత వరకు అది స్వయంప్రతిపత్తి గల కావ్యమే!

ఆ తర్వాతి సంవత్సరం, అంటే 1994లో సిరివెన్నెల సీతా రామశాస్త్రిగారికి ఉత్తమ గీతరచయితగా నంది పురస్కారం మాత్రమే కాక కళాసాగర్ పురస్కారం, మనస్విని పురస్కారం కూడా తెచ్చిపెట్టిన పాట చిలుకా ఏ తోడు లేక... శుభలగ్నం సినిమా కోసం రాసినది. పాట ఒక్కటీ చదివినా సినిమా కథంతా అర్థమయ్యేంత పస గలిగిన పాట. వివాహబంధం అంటే మూడో మనిషితో పంచుకోలేని అనుబంధమని తెలుసుకోలేక, డబ్బు మీది వ్యామోహంతో తన పసుపుకుంకుమలనే అమ్ముకున్న ఇల్లాలి కథ ఇతివృత్తంగా తీసిన సినిమా శుభలగ్నం.

చిలకా ఏతోడు లేక ఎటేపమ్మ ఒంటరి నడక?-
తెలిసి అడుగేసినావె ఎడారంటి ఆశల వెనక-

మంగళ సూత్రం అంగడి సరుకా, కొనగలవా చేజారాక?-
లాభం ఎంతొచ్చిందమ్మా సౌభాగ్యం చేజారాక?

అనే పల్లవి చదివితే రెండు గీతల్లో బాపూజీ చిత్రాన్ని ఆవిష్కరించిన చిత్రకారుడు గుర్తొస్తాడు. సన్నివేశాన్ని తక్కువపదాల్లో వర్ణించాలన్నా, తక్కువ గీతల్లో చిత్రించాలన్నా అనవసరమైన భాగాలన్నిటిని తొలగించాల్సి వస్తుంది. అత్యంత ప్రాధాన్యత గల విషయాన్ని గుర్తించగల నైపుణ్యం అవసరమవు తుంది. ఆ నైపుణ్యం శాస్త్రిగారి సొంతం. ఎందుకంటే ఆయన గీత రచయిత మాత్రమే కాదు, జ్ఞాని, వేదాంతి కూడా.

బతుకంతా బలి చేసే పేరాశను ప్రేమించావే-
వెలుగుల్నే వెలివేసే కలలోనే జీవించావే-
అమృతమే చెల్లించి ఆ విలువతో హాలాహలం కొన్నావే-
అతితెలివితో కురిసే ఈ కాసుల జడిలో
తడిసి నిరుపేదైనావే

అని తర్వాతి చరణంలో ఆమె ఎన్నుకున్న మార్గంలోని విషాదాన్ని కళ్లకి కట్టిస్తారిలా-

అనురాగం కొనగలిగే ధనముందా లోకంలో?-
మమకారం విలువెంతో మరిచావా సిరిమైకంలో?
ఆనందం కొనలేని ధన రాశితో అనాథగా
మిగిలావే అమవసలో-
తీరా నువు కను తెరిచాక తీరం కనపడదే ఇంకా-
కురిసే కాసుల జడిలో తడిసి నిరుపేద...

అనడం ఎంత భావగర్భితమైన ప్రయోగం! ఎంతటి ధనరాశుల మధ్య నిలబడినా ఆప్యాయతా, అనురాగం అందించే సాహచర్యం లేనపుడు ఆ జీవితం వెలుగులేని అమావాశ్య రాత్రే, సొంతమని చెప్పుకునే వాళ్లు లేని అనాథ బతుకే. ఉద్వేగం, ఉద్రేకం నిండిన సన్నివేశం డిమాండ్ చేయనంతవరకు, శాస్త్రిగారి పాటల నిండా లేలేత పూరేకుల్లాంటి పదాలే కనిపిస్తాయి.

1995లో వచ్చిన శ్రీకారం సినిమా కోసం శాస్త్రి గారు రాసిన

మనసు కాస్త కలతపడితే మందు ఇమ్మని
మరణాన్ని అడగకు-
కనుల నీరు తుడుచువారు ఎవరూ లేరని
చితి ఒడికి చేరకు...

అనే పాట సరళ గంభీరంగా కనిపిస్తూనే ఎంతో స్ఫూర్తి వంతమైన సందేశాన్నిస్తుంది. చిన్న చిన్న కారణాలకే ఆత్మహత్యలకి పాల్పడే యువతకి ఒక మేల్కొలుపు లాంటిదీ గీతం. వేటాడు వేళలో పోరాడాలని ప్రబోధిస్తూ, 'తనువే మోడైనా కూలిపోదు తరువేదైనా' అని గుర్తుచేస్తారు. 'ఊపిరి పోసే స్త్రీ బేలయై నేల కూలితే నేలపై ప్రాణముండద'ని అనునయిస్తారు! రెండో చరణం లో స్త్రీ తనని అణచిపెట్టే వాడిని కాళియై ఎలా కాలికింద అణగ దొక్కాలో చెప్పి, జీవితాన్ని అర్ధంతరంగా ముగించేద్దామను కున్నపుడు 'ఆ ఆయువునే ఆయుధంగా వాడి చూడ'మని రాసిన అయన కలం, కత్తికన్నా వేల రెట్లు పదునైనది కాదని ఎవరన

గలరు? అందుకే మరో నంది ఈశ్వరానుగ్రహమై శాస్త్రిగారిని చేరింది. దీనితో శాస్త్రిగారి రెండో హాట్రిక్ పూర్తయింది.

నక్సలిజం నేపథ్యంగా వచ్చిన సింధూరం సినిమా 1997లో విడుదలయింది. కృష్ణవంశీ దర్శకత్వంలో విడుదలైన ఈ చిత్రం రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డ్‌నీ, ఫిలింఫేర్ అవార్డునీ గెలుచుకుంది. చిత్ర నిర్మాణం పూర్తయి, ప్రీవ్యూ చూసి బయటకు వచ్చిన శాస్త్రిగారిలో పెల్లుబికిన కవితావేశం అర్ధ శతాబ్దపు అజ్ఞానాన్ని స్వతంత్రమందామా... పాటగా రూపొందిందని వినికిడి.

స్వాతంత్ర్యం వచ్చి ఆరు దశాబ్దాలు దాటినా మన రాజకీయాలలోని కుళ్లు ప్రక్షాళన కాలేదు. నాయకుల దృక్పథాలలో ఆదర్శాలకి చోటు దొరకలేదు. 'సమూహక్షేమం పట్టని స్వార్థపు ఇరుకుతనంలో ముడుచుకు పోతూ- మొత్తం దేశం తగలడు తోందని నిజం తెలుసుకోరే!, తెలిసి భుజం కలిపి రారే!' అని చేసే ఆక్రందన దేశం పట్ల ప్రేమా, ప్రస్తుత పరిస్థితుల పట్ల ఆవేదనా ఉన్న ప్రతి వ్యక్తినీ కదిలిస్తుంది. ఏదో ఒక సానుకూలమైన మార్పుకోసం ప్రయత్నించమని పురికొల్పుతుంది. 'ఎవ్వరికోసం ఎవరు ఎవరితో సాగించే సమరం- ఈ చిచ్చుల సింధూరం?' అన్న ప్రశ్న రగిలే జ్వాలై దహిస్తుంది. 'జవాబు చెప్పే బాధ్యత మరచిన జనాల భారతమా! ' అన్న సంబోధన మనని తూటాలా తాకుతుంది.

యువత పోరుబాట పడితే, ధర్మాగ్రహం చట్టవ్యతిరేకమైతే 'తనలో ధైర్యం అడవికి ఇచ్చి, తన ధర్మం చట్టానికి ఇచ్చి, ఆ కలహం చూస్తూ సంఘం శిలలా నిలుచుంటే- నడిచే శవాల సిగలో తురిమిన నెత్తుటి మందారం, ఈ సంధ్యా సింధూరం' అన్న వాక్యం చదివితే ఏ సంగీతపు సహకారం లేకపోయినా శరీరం గగుర్పొడుస్తుంది. లోలోపల ఒక దుఃఖం ఘనీభవిస్తుంది. 'వేకువ వైపా, చీకటిలోకా ఎటు నడిపేవమ్మా, గతి తోచని భారతమా!' అన్న రచయిత ప్రశ్న ప్రతీకాత్మకమై, మనమీదే ఎక్కుపెట్టినట్టని పిస్తుంది. 'శాంతి కపోతపు కుత్తుక తెంచి తెచ్చిన బహుమానం- ఈ రక్తపు సింధూరం' అని చదివితే మనసు కుత్తుక తెగి విలవిల లాడే శాంతి కపోతాన్నిదర్శించక మానదు. 'చూస్తూ ఇంకా నిదురిస్తావా విశాల భారతమా! ఓ విషాద భారతమా!' అంటూ సంధించిన రామబాణం లాంటి ఈ పాటకి, 1997లో నంది పురస్కారం అందినపుడు ప్రేక్షకులంతా, శ్రోతలంతా ఆ నిర్ణయంతో సంపూర్ణంగా ఏకీభవించే ఉంటారు.

1999లో వచ్చిన ప్రేమకథ సినిమా కోసం దేవుడు కరుణిస్తాడనీ, వరములు కురిపిస్తాడనీ నమ్మలేదు... అనే పాటకి శాస్త్రిగారు వరసగా అయిదవ నందిని అందుకున్నారు. ఇది ఆయనకి లభించిన నంది పురస్కారాల్లో ఎనిమిదవది. తరువాత 2005లో చక్రం సినిమాకోసం రాసిన జగమంత కుటుంబం నాది... ఏకాకి జీవితం నాది... పాటకీ, 2008లో గమ్యం సినిమాకి రాసిన ఎంతవరకు ఎందుకొరకు ఇంతపరుగు అని అడక్కు... అనే పాటకీ మరి రెండు నందుల్ని సొంతం చేసుకున్నారు.

జగమంత కుటుంబం నాది ఏకాకి జీవితం నాది-
సంసార సాగరం నాదే సన్యాసం శూన్యం నావే-
కవినై కవితనై భార్యనై భర్తనై-
మల్లెల దారిలో మంచు వీడారిలో
పన్నీటి జయగీతాల కన్నీటి జలపాతాల-
నాతో నేను అనుగమిస్తూ నాతో నేనే రమిస్తూ
వంటరినై అనవరతం కంటున్నాను నిరంతరం
కలల్ని కథల్ని మాటల్ని పాటల్ని రంగుల్ని రంగవల్లుల్ని
కావ్యకన్యల్ని ఆడపిల్లల్ని-
జగమంత కుటుంబం నాది ఏకాకి జీవితం నాది...

అంటూ జలపాతంలా ఉధృతంగా పొంగి ప్రవహించిన ఈ పాట వింటుంటే మహాకవి శ్రీశ్రీ గుర్తుకురాక మానడు. ఈ పాట, శాస్త్రిగారు తన గురించి తానే రాసుకున్న ఆత్మగీతంలా కని పిస్తుంది.

అలాగే ఎంతవరకు ఎందుకొరకు... పాట కూడా శాస్త్రిగారి తాత్వికతనీ, వసుధైక కుటుంబంగా జగమంతా బతకాలనే ఆకాంక్షనీ ప్రతిబింబిస్తుంది. ఎంతవరకు ఎందుకొరకు ఇంత పరుగు అని అడక్కు- గమనమే నీ గమ్యమైతే బాటలోనే బ్రతుకు దొరుకు - ప్రశ్నలోనే బదులు ఉంది గుర్తుపట్టే గుండెనడుగు- అన్న శాస్త్రిగారి సాహిత్యంలో ప్రతి వాక్యమూ తత్వసారమే.

'ప్రపంచం నీలో ఉన్నదని చెప్పేదాక ఆ నిజం తెలుసు కోవా?' అనడిగి 'తెలిస్తే ప్రతీచోట నిన్ను నువ్వే కలుసుకుని పలకరించుకోవా?' అన్న వాక్యాన్ని జతచేయడం చూస్తే నారాయణ సూక్తంలోని 'నీలతోయద మధ్యస్థా... పరమాత్మా వ్యవస్థితః' అన్న శ్లోకం గుర్తొస్తుంది. ప్రతి వ్యక్తి హృదయంలోనూ అదే భగవంతుడు కొలువై ఉన్నపుడు మనుషులంతా ఒకటే అవాలి కదా అన్న ఆలోచన కలుగుతుంది.

కనపడేవెన్నెన్ని కెరటాలు కలగలిపి సముద్రమంటారు -
అడగరే ఒక్కొక్క అల పేరు మనకిలా ఎదురైన ప్రతివారు
మనిషనే సంద్రాన కెరటాలు- పలకరే మనిషి అంటే
ఎవరూ సరిగా చూస్తున్నదా నీ మది-
మదిలో నువ్వే కదా ఉన్నది
చుట్టూ అద్దాలలో విడివిడి రూపాలు నువ్వు కాదంటున్నది

నీ ఊపిరిలో లేదా గాలి- వెలుతురు
నీ చూపుల్లో లేదా మన్ను మిన్ను నీరు
అన్నీ కలిపితే నువ్వే కాదా కాదా...

ఇలా వరసగా శాస్త్రిగారి గేయ సాహిత్యాన్ని చదువుతూ పోతుంటే ఆ గాఢతకి కళ్లు తిరుగుతాయి!

ఈ పాటనే రోజూ వింటూ ఉంటే అదే ఒక వ్యక్తిత్వ వికాస గీతమై మనిషిని తీర్చిదిద్దుతుంది. ఒక స్నేహ సౌభ్రాతృత్వానికి దారితీస్తుంది. ఇంతటి మహోన్నత సాహిత్యం కేవలం తెలుగుకే పరిమితమై పోబట్టి కదా కిందటి సంవత్సరం సాహిత్యంలో నోబెల్ బహుమతి అందుకున్న గేయ రచయిత బాబ్ డైలాన్‌లా మన సిరివెన్నెలకూ ఆ పురస్కారం దక్కే అవకాశం లేకుండా పోయింది?

2013లో వచ్చిన సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాలో మరీ అంతగా... మహా చింతగా... మొహం ముడుచుకోకలా... పాట గమ్మత్తుగా సాగి పెదవులపై నవ్వులు పూయిస్తూనే, హృదయానికొక కొత్త వికాసాన్నందిస్తుంది.

ఎండలను దండిస్తామా? వానలను నిందిస్తామా?
చలిని ఎటో తరిమేస్తామా ఛీ పొమ్మనీ?
కస్సుమని కలహిస్తామా ? ఉస్సురని విలపిస్తామా?
రోజులతో రాజీ పడమా సర్లెమ్మనీ?-
సాటి మనుషులతో మాత్రం సాగనని ఎందుకు పంతం?
పూటకొక పేచీపెడుతూ ఏం సాధిస్తామంటే
ఏం చెపుతాం?...

ఇంత సరదాగా, సరళంగా నేర్పే వ్యక్తిత్వపాఠాలెక్కడ దొరుకుతాయి శాస్త్రిగారి సాహిత్యంలో తప్ప? 'మనుషులనిపించే ఋజువు.. మమతలను పెంచే ఋతువు... మనసులను తెరిచే హితవు... వందేళ్లయినా వాడని చిరునవ్వు' అంటూ వాడని చిరునవ్వుకి సులభమైన సూత్రాలు ఎవరందించగలరు శాస్త్రిగారు తప్ప?

ఇలా నందినందుకున్న పాటలతో పాటుగా ఆనతినీయరా హరా, నా పాట పంచామృతం, భం భం బోలే శంఖం మ్రోగెలే, కొంతమంది ఇంటిపేరు కాదుర గాంధీ, ముసుగు వేయొద్దు మనసు మీద, మేఘాలలో చేరిపొమ్మన్నది, నిగ్గదీసి అడుగు ఈ సిగ్గులేని జనాన్ని, నువ్వెవరైనా నేనెవరైనా, ఏ శ్వాసలో చేరితే, నీతోనే ఆగేనా సంగీతం, తరలి రాద తనే వసంతం, నీ ప్రశ్నలు నీవే ఎవరో బదులివ్వరుగా, రంగేళీ హోలీ హంగామా కేళీ- ఇలా ఎన్నో ఆణిముత్యాల మూటల్ని పాటలుగా శాస్త్రిగారు అందించారు. ఇప్పటికి పదకొండు నంది పురస్కారాలతో పాటు, కళాసాగర్, మనస్విని, కిన్నెర, భరతముని, ఆప్జా, ఫిలిమ్‌ఫేర్, బుల్లితెర అవార్డులెన్నో ఆయన్ని వరించాయి.

రామాయణాన్ని మూడుముక్కల్లో చెప్ప మని అడిగిందెవరో నాకు తెలీదుగాని, సిరివెన్నెల సీతా రామాయణాన్ని మూడు రోజుల్లో వ్యాసంగా రాసివ్వమని అడిగింది మాత్రం వాసిరెడ్డి నవీన్‌గారే. కవిగా ఆయన పది పంక్తుల్లో ఒక పాట రాసిస్తారు గాని ఆయన పాటని విశ్లేషించాలంటే పాటకో పేజీ అయినా కావాలి. అలాంటిది మూడువేల పైచిలుకు పాటలు, శివదర్పణం వంటి ఇంకా ఎన్నో కవితలూ వ్యాసాలూ శ్లోకాలూ రాసిన సిరివెన్నెల గురించి ఒక్క వ్యాసంలో ఇమిడ్చే ప్రయత్నం హాస్యాస్పదం. అయినా 'కొండ అద్దమందు...' అన్నట్టు ఒక చిన్న ప్రయత్నం చేశాను. గత మూడేళ్లుగా నంది అవార్డులు ప్రకటించడం జరగలేదుగాని శాస్త్రిగారు ఈ మూడేళ్లలో సృజించిన పాట లెన్నో ఆ పురస్కారానికే వన్నె తేగలవి ఉన్నాయి. సిరివెన్నెలలో ఆయన పాటల వేణువూదుతుంటే ఆలమందలా నందులెన్నో ఆయన్ని వెతుక్కుంటూ వస్తూనే ఉంటాయి. ఆ గీతామృతం అందుకునే భాగ్యం మనదే.

ఒక గీత రచయితగా తన గీతాలనిండా సురభిళ పద గుచ్ఛాలను కూర్చినా, ఆహ్లాద చంద్రికలను పేర్చినా, ప్రపంచ మంతటా అలముకుంటున్న విద్వేషాన్నీ, అశాంతినీ, మానవ జీవితాలలోని కల్లోలాన్నీ తలచి వేదనలో, శోధనలో మునిగిపోయే మానవతావాది శాస్త్రిగారు. విస్తారమైన పదసంపద, అనర్గళ వాగ్ధారీ ఆయన సొత్తు కావడంతో అవకాశం దొరికినపుడల్లా పాఠకులతో, ప్రేక్షకులతో అంతర్జాలం ద్వారా ముఖాముఖిగా ముచ్చటిస్తూ 'తన కవితాధార తనది మాత్రమే కాదనీ దాన్ని ఆస్వాదించే ప్రతి మనిషిదీ' అని చెప్పి తన టార్గెట్ ఆడియెన్స్‌ని తనదైన ఒక బృందంగా సమకూర్చుకుంటూ, 'మనని మనం సంస్కరించుకుంటూ, ఈ మాలిన్యాన్ని వదిలించుకుంటూ మరొక మెరుగైన ప్రపంచాన్ని నిర్మించుకుందా'మని అభ్యర్థించే ఆశావాది. ఇవాల్టి

సినీ గీత రచయితల్లో అత్యధిక ప్రాధాన్యతని పొందుతున్న రచయితగా పాఠకులతో ఒక ప్రత్యక్ష బంధాన్ని ఏర్పరచుకుంటూ వారితో సంభాషిస్తూ 'ఇది కాదు జీవించే విధానం, దీన్ని మించిన ఉన్నతమైన మానవ జీవన ప్రమాణాలున్నాయి. అక్కడికి పయనమై వెళదాం, ఇంతకన్నా సుహృద్భావ సమన్వితమైన సమాజాన్ని నిర్మించుకుందాం' అని ప్రతిపాదించే వైతాళికుడాయన.

సినిమాకి ఎంత జనాకర్షణ ఉన్నా సినిమా పాట సాహిత్యం పట్ల సాహితీవేత్తలూ, కవుల్లో కొంత చులకనభావం కనపడడం పరిపాటి. గేయ రచయితగా ఎంత పేరు సంపాదించుకున్నా కవులుగా తమని నిరూపించుకోవడానికి వారు ఇతర సాహితీ ప్రక్రియల్లో ప్రయత్నించాల్సి వస్తూ ఉంటుంది. కేవలం సినీగీతాల రచనతోనే ఒక మహోన్నత స్థానాన్ని సంపాదించుకుని, తన ఉనికిని కాపాడుకుంటూ, తను నమ్మిన సిద్ధాంతాల విషయంలో ఏమాత్రం రాజీ పడకుండా తెలుగు సాహిత్యచరిత్రలో ఒక తారాస్థాయికి చేరుకొని అక్కడ దశాబ్దాల తరబడి నిలకడగా నిలబడగలగడం అసాధారణమని చెప్పక తప్పదు.

'కావ్యేషు నాటకం రమ్యం అన్న వాక్యానికి పరిపూర్ణ రూపం సినిమా. అలాంటి సినిమాలో ఒక భాగమైనందుకు ఎప్పుడూ గర్విస్తా'నని చెప్పుకునే సిరివెన్నెల, పాలనీ నీటినీ సులువుగా వేరు చేయగల రాయంచ. ప్రచండతాపాన్ని తానందుకుని సిరివెన్నెలని మనకందించగల చందమామ. తనను తాను తిట్టుకున్నట్టుగా ఎవరూ తనని తిట్టలేరనీ, తనని తాను మెచ్చుకున్నట్టుగా ఎవరూ తనని మెచ్చుకోలేరనీ చెపుతూ, మనిషిగా ఎదగాలంటే ఎవరిని వారే విమర్శించుకుంటూ సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలని చెప్పే శాస్త్రిగారు నిరంతరం చేసే పని అదే. తనలోని కవిని తాత్వికుడూ, ఆ తాత్వికుణ్ని మనిషీ డామినేట్ చేస్తాడని చెప్తూ మనిషితనానికే పెద్దపీట వేసే సిరివెన్నెల వ్యక్తిగా ఎంత ఉన్నతులో ఆయన్నెరిగిన వారందరికీ తెలిసిన విషయమే. దిగజారిన పాత్రల మీద పాటలు రాసేటపుడు కూడా తన విలువలని దిగజారనీయని కవి శాస్త్రి గారు. ఉన్నతమైన తన ప్రమాణాలద్వారా ఆయన సినిమా రంగంలో తన తోటి రచయితలకీ, తన తరవాతి తరాల రచయితలకీ మార్గ నిర్దేశనం చేశారంటే అతిశయోక్తి కాదు.

ఒక సందర్భంలో ఆయన చెప్పిన మాటలు తెలుగు భాష పునర్వైభవానికి దారి తీసే మార్గదర్శక సూత్రాలు కూడా. 'పాల పళ్లు కూడా ఊడని పసిప్రాయంలోనే భారత భాగవతాలూ, భగవద్గీత, ప్రాచీన పద్యవాఙ్మయం, దాశరథీ శతకాది శతకాలూ, భర్తృహరి సుభాషితాలు, అమరకోశం, పెద్దబాలశిక్ష- ఇంకా ఇలాంటి వన్నీ కంఠతా పట్టించిన మన తెలుగింటి విద్యాబోధన-

తరాలు మారుతున్నకొద్దీ ఏ విధంగా 'చిన్న'బోతోందో గమనిస్తే, ఇంట్లో, వీధుల్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో ఇలా అన్నిచోట్లా మన పిల్లలకి ఎలాంటి మాటతీరు అలవడుతుందో అర్థం చేసుకోగలిగితే, క్రమక్రమంగా గ్రంథ పఠనం, అధ్యయనం, వినడంలాంటి కసరత్తు కరువై, దంతాలూ, జిహ్వా, స్వరతంత్రులూ, అన్నీ సత్తువుడిగి, దివ్యభాషా పీయూషాస్వాదనకి అనర్హమై, పలుకులు నత్తినత్తిగా, నంగినంగిగా తయారై, ఆంధ్రభాష ఎలాంటి దుర్దశకి లోనైందో గుర్తిస్తే... ఏ సంపదని కోల్పోతున్నామో తెలుస్తుంది. పండితులు, పెద్దలు, భాషావేత్తలు, విజ్ఞులు, కవులూ ఈ పరిస్థితిని ఉపేక్షిస్తున్నారు.

కేవలం నాదం ద్వారానే ప్రాణనాడుల్ని మీటగలిగే సత్తా వున్న ఆంధ్రవాణిలోని వేదతుల్యమైన నాదమహిమని అలక్ష్యం చేయడం ద్వారా మనం, 'భాషకి అందని భావం లేదు' అనే ఐశ్వర్యాన్ని వదులుకుని, 'ఏ భాషకీ అందనిదే భావం' అని అనుకోవలసిన దారిద్ర్యాన్ని వరిస్తున్నాం. 'అందరికీ అర్థం కావడం' అనే లక్ష్యం కోసం, సినిమా పాట రాన్రానూ ఓ అరవై డెబ్భై మాటలకి పరిమితమైపోతోంది. 'అర్థం కావడం వేరు, అనుభూతికి అందడం వేరు' అని తెలుసుకుంటే 'ఏవో కొన్ని మాటలతోనే నిత్యనైమిత్తిక వ్యవహారాలు నడిచిపోతున్నాయి కదా, ఇంకా అంత విశాలమైన భాషార్ణవం దేనికి? రండి, భాషా సాగరాన్ని ఎండగట్టి ఎడారి చేసేద్దాం' అనుకునే విపరీత ధోరణి మానుకుంటే మనకి అర్థం అయేలా మనకి అందుబాటులోకి వచ్చేలా విలువల శిఖరాల్ని తల వంచమనడం కన్నా గొప్ప విషయాల్ని అర్థం చేసుకునే శక్తి మనకి వశమయ్యేలా అభ్యాసం చేద్దాం' అంటూ చేంబోలు సీతారామ శాస్త్రిగారు, అదే... మన సిరివెన్నెల చేసిన సూచన, భాషద్వారా తన సంస్కృతిని పదిలపరచుకోవాలనుకునే తెలుగు జాతికి సరైనదారి చూపే వెలుగు దివ్వె.

వారణాసి నాగలక్ష్మి కవి, కథకులు, చిత్రకారిణి. రెండు కవితాసంపుటాలు, రెండు కథాసంపుటాలు ప్రచురించారు. సంగీతంలోనూ అభినివేశం ఉంది. నివాసం హైదరాబాద్.

email: varanasi.nagalakshmi@gmail.com

అవధానంలో సమయస్ఫూర్తి

డా॥ నరాల రామారెడ్డి

ఆంధ్ర సాహితీ నందనోద్యానంలో విలక్షణంగా వికసించిన అవధాన పారిజాతం చమత్కార సౌరభాలను విరజిమ్మింది. ప్రపంచ భాషల్లో ఏ భాషలో లేని అవధానం తెలుగు భాషకు అమూల్యమైన ఆభరణం. ఇది తెలుగు జాతికి గర్వకారణం. పర్వతోరణం.

మాన్యులు, మహాపండితులు మాడభూషి వేంకటాచార్యుల మేధలో రూపుదిద్దుకొన్న అష్టావధాన ప్రక్రియ 1854 సంవత్సరంలో ఆంధ్రదేశంలో అవతరించినట్లు విజ్ఞుల అభిప్రాయం. అష్టావధానంలో ఎనిమిది అంశాలు ఉంటాయి. ఇందులో నిషిద్ధాక్షరి, సమస్య, దత్తపది, వర్ణన, న్యస్తాక్షరి, పురాణ పఠనం, అప్రస్తుత ప్రసంగం, ఘంటా గణనం అనే అంశాలతో అష్టావధానం నిర్వహింపబడుతుంది. ఇవి మాత్రమేకాక వ్యస్తాక్షరి, ఆకాశభాషణం, చదరంగం, పుష్పగణనం, వార కథనం వంటి కొన్ని అంశాలను కొందరు అవధానులు స్వీకరిస్తారు.

అవధానం నిర్వహించాలంటే పంచ ధకారాలు అవసరమని అంటారు. ధార, ధారణ, ధిషణ, ధోరణి, ధైర్యం ఇవి పంచధకారాలు. ఇందులో ధార, ధారణ అనే రెండు అంశాలు అవధానికి ఉండవలసిన మౌలిక లక్షణాలు.

పృచ్ఛకుడు అడిగిన ప్రశ్నలకు వేదిక మీద అప్పటికప్పుడు ఆలోచించి ఛందోబద్ధంగా పద్యాన్ని వేగంగా అల్లగలిగి ఉండాలి. ఇదే పద్యధార. పృచ్ఛకుడిచ్చిన సమస్య, దత్తపది మొదలైన అంశాలకు పద్యాలను అల్లటమే కాకుండా, వాటిని అవధానంలో చివరలో జ్ఞాపకం ఉంచుకొని తిరిగి ఒప్పజెప్పాలి. ఇదే ధారణ.

ధారా ధారణలతోపాటు సమస్యలను అర్థవంతంగా, చమత్కారవంతంగా పూరించడానికి, దత్తపదిలో పదాలను ఇతి వృత్తంతో అనుకూలంగా మలచుకోవడానికి అవధానికి ప్రతిభతోపాటు సంస్కృతాంధ్ర భాషల్లో అనర్గళమైన పాండిత్యం ఉండాలి.

అవధానంలో సమస్యాపూరణంలో అవధానికి అనితరసాధ్యమైన సమయస్ఫూర్తి ఉండాలి. ఇదే ధోరణి. పృచ్ఛకుడిచ్చిన సమస్యలో విరుద్ధార్థం తొలగించి

పృచ్ఛకుడిచ్చిన సమస్యను
ఏ ఘట్టంలో పూరిస్తే చమత్కార
వంతంగా ఉంటుంది,
పృచ్ఛకుడడిగిన దత్తపది పదాలను
ఏ ఘట్టంలో వర్ణిస్తే
ఔచిత్యవంతంగా ఉంటుంది
అనేవి నిర్ణయించడంలో
అవధాని జాగ్రత్త వహించాలి.

పరిష్కరించాలి. సమస్యాపూరణంలో కేవలం పూరణమే కాకుండా ఔచిత్యం కూడా ప్రధానం. అలాగే దత్తపది నిర్వహణలో సమయస్ఫూర్తి ఎంతో అవసరం.

పృచ్ఛకుడిచ్చిన సమస్యను ఏ ఘట్టంలో పూరిస్తే చమత్కారవంతంగా ఉంటుంది, పృచ్ఛకుడడిగిన దత్తపది పదాలను ఏ ఘట్టంలో వర్ణిస్తే ఔచిత్యవంతంగా ఉంటుంది అనేవి నిర్ణయించడంలో అవధాని జాగ్రత్త వహించాలి.

ఉదాహరణకు-పృచ్ఛకుడు "భీముని దరిజేరి సీత పెనవేసెకొనెన్" అనే సమస్యను అవధానికి పూరించమని వేదిక మీద ప్రశ్నిస్తాడు. ఈ సమస్యలో 'భీముడు' అనే పదానికి భయంకరుడు అనే అర్థాన్ని తీసుకొని రామునికి విశేషణంగా ప్రయోగించాలి. అంతమాత్రంతో సరిపోదు. పూరణకు సరియైన ఘట్టాన్ని ఎంచుకోవాలి. సమయస్ఫూర్తి ఉన్న అవధాని పంచవటిలో రామలక్ష్మణులను శూర్పణఖ కామించిన ఘట్టాన్ని తీసుకొని ఔచిత్యవంతంగా ఇలా పూరించాలి.

సౌమిత్రి ముక్కు కోయగ
కామిని శూర్పణఖ రూపుగాంచుచు భీతిన్
రాముని నిశాచరనికర
భీముని దరిజేరి సీత పెనవేసికొనెన్

రాక్షసులకు భయంకరుడైన (భీముని) రాముని సీత భయంతో పెనవేసుకొన్నది అని భావం. సీతాకళ్యాణ ఘట్టం తీసుకొంటే 'పెనవేసికొనెన్' అనే మాట సమంజసంగా ఉండదు. నేను చేసిన అవధానాల్లో సమయస్ఫూర్తితో పూరణలు ఎలా సాగాయో వివరిస్తాను.

1972సంవత్సరంలో నెల్లూరు గ్రంథాలయ సంస్థలో జరిగిన అవధానంలో "దుఃఖముగాదె చక్కని వధూటి రతంబు విలాసికోటికిన్" అనే సమస్యను ఇచ్చారు. ఇది జటిలమైన సమస్య. ఇది శతావధాని పిశుపాటి చిదంబర శాస్త్రి గారికి ఇచ్చిన సమస్య. వారు ఏ ఘట్టంలో నాకు తెలియదు. ఈ సమస్యను ఎలా పూరిస్తే ఔచిత్యవంతంగా ఉంటుంది అని ఆలోచించాను. వెంటనే స్ఫురించింది. అప్పుడు నేను రంభారావణ సంవాద ఘట్టాన్ని తీసుకొని పూరించిన పద్యం ఇది.

స్ఫుఃఖరదేవనాథకరవజ్రము ముక్కలు చేసినాడ; రో
చిఃఖుర వాజివల్లన విశీర్ణదిగంతుడ రావణుండ; నం
తఃఖల మన్మథాగ్ని వనితా! దహియించెను; కాదు పొమ్మనన్
దుఃఖముకాదె చక్కని వధూటి రతంబు విలాసికోటికిన్

దుష్కరమైన 'ఃఖ' అనే ప్రాసతో జటిలమైన సమస్యను రావణాసురుని ప్రగల్భభాషణంతో 'విలాసవంతులైన పురుషుల అందమైన అమ్మాయిలతో సంభోగం వద్దని కాదుపొమ్మంటే దుఃఖం కదా' అని పూరించటం జరిగింది. పృచ్ఛకులు పిశుపాటి విశ్వేశ్వరశాస్త్రిగారు 'ఈ క్లిష్ట సమస్యను ఇంత గొప్పగా పూరిస్తారని నేను ఊహించలేదే' అని సభలో నన్ను మనసారా అభినందించారు.

నెల్లూరు అవధానం తర్వాత నాకు గొప్ప పేరు ప్రఖ్యాతులు తెచ్చింది గుంటూరు అవధానం. 1974వ సంవత్సరంలో గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అవధానంలో అధ్యక్షులుగా ఉన్న ఆచార్య యస్.వి.జోగారావుగారు పృచ్ఛకుని ద్వారా అడిగించిన క్లిష్టమైన దత్తపది పూరణ పృచ్ఛకుల ప్రశంసాపాత్రమైంది. వినుకొండ, తరిగొండ, పెనుగొండ, గోలకొండ-ఈ పదాలను ఉపయోగించి మీ ఇష్టం వచ్చిన వృత్తంలో, మీ ఇష్టం వచ్చిన ఇతివృత్తంతో 'గ్రామనామాలు కాకుండా' వర్ణించండి అని అడిగారు. ప్రేమించిన యువతిని వంచించిన ప్రియుడు, ఆమెకు సంజాయిషీ చెప్పుకొనే ఇతివృత్తంతో ఉత్పలమాలా వృత్తంతో పూరించిన పద్యమిది.

కోమలి 'నాదుమాట విను; కొండవలెన్ మన పాలగుండెలన్
ప్రేమ పటిష్టరూమున వెల్లెడియిత్తడి గొండటంచు. నీ
కోమల చిత్తమిమ్ము, పెనుగొండగ దానిని దాచుకొందు, నీ
నామది గోల-కొండవలె నాయన నిల్చిననేమి చేసెదన్?

అలవోకగా నేను పూరించిన ఈ పద్యం జోగారావుగారి ప్రశంసల్ని అందుకొంది.

1970సంవత్సరంలో ఏను బెగళూరులో 5,6 అవధానాలు నిర్వహించినాను. ఎం.ఎల్.గురప్ప చౌదరిగారు హొసూరు నుంచి బెంగళూరుకు పృచ్ఛకులుగా విచ్చేసి దోసె, పూరీ, వడ, సాంబారు పదాలు తీసుకొని పౌరాణికార్థంలో పూరించమన్నారు. ఈ పదాలతో పార్వతీ కళ్యాణ ఘట్టం వర్ణించిన పద్యమిది.

జడలో దోసెడు కొండమల్లికలతో సౌరభ్యముల్ చిమ్మువ
చ్చెడు పూరీతిగ హాస చంద్రికలతో సీమంతసిందూరయై
వడకుంగుబ్బిలి ముద్దుపట్టి యెదుటన్ వాసంతియై నిల్వ, నా
పడతిన్ పత్నిగ స్వీకరించితివి సాంబా! రుద్ర! సర్వేశ్వరా!

ఈవిధంగా నా అవధాన ప్రస్థానంలో నేను నిర్వహించిన అవధానాల్లో పృచ్ఛకులిచ్చిన కొన్ని సమస్యలను, కొన్ని దత్తపదులను ఉదహరిస్తాను.

1985వ సంవత్సరంలో మదనపల్లిలో ఇచ్చిన సమస్య-
'హనుమత్పుత్రుడు భీష్మపుత్రిని వివాహంబాడె దీవింపుడీ'

కనులన్ కజ్జలరేఖ తీర్చి, నొసటన్ కస్తూరి కీలించి, చి
క్కని గండమ్మున చుక్క పెట్టి వధువై కళ్యాణ రూపమ్మునన్
గనిపింపన్ వసుదేవుడాప్తులకు వక్కాణించె, నీ దివ్యదే
హను, మత్పుత్రుడు భీష్మపుత్రిని వివాహంబాడె దీవింపుడీ!

Best Complements From

NATA Atlanta Team

1980 ప్రాంతంలో అనంతపురంలో ఇచ్చిన సమస్య-

'తండ్రికిలేని మీసములు తల్లికి వచ్చెను కూతురేఁ డ్చెరా'

గుండ్రని మోమువాడనుచు కూతురు కూరిమిచూపె, ప్రేమతో
తండ్రి యనుజ్ఞయిచ్చె, ధనదాహము తీరని తల్లిక్రుద్ధయై
తీండ్రపు బుద్ధితోడ పతిదేవుని ధిక్కృతి చేసె, నింటిలో
తల్లికి లేని'మీసములు' తల్లికి వచ్చెను కూతురేఁ డ్చెరా!

1994లో హైదరాబాద్‌లో ఇచ్చిన సమస్య-

"దున్నకు దూడ పుట్టినది దుగ్ధము పిండగ కుండతేగదే"
పిన్నలు పాలులేక దుగసిల్లెడి దుర్గతి తప్పిపోయె సం
పన్నుల యిండ్లకేగు దురవస్థయు నేటికి తీరిపోయె నీ
కన్నుల కోర్కె తీరనికగాంచుము, సేద్యము చాలు, క్షేత్రమున్
దున్నకు; దూడ పుట్టినది దుగ్ధముపిండగకుండతేగదే!

1990 ప్రాంతంలో రాయదుర్గంలో ఇచ్చిన సమస్య-

"జమునను చూడగా విజయశాంతి లభించె జయప్రదమ్ముగన్
సమరము చేయనంచు రభసమ్మున చాపము క్రిందవైచి, సం
భ్రమమున క్రుంగిపోయితివి బంధువులన్ హతమార్చనంచు, నీ
భ్రమలు తొలంగె, నేడు భగవంతుని రూపము నీదు హృత్సరో
జమునను చూడగా విజయ! శాంతి లభించె జయప్రదంబుగన్

ఇంతవరకు నేను చేసిన కొన్ని వందల అవధానాల్లో చమత్కార భరితమైన సమస్యల్ని వివరించాను.

అవధానంలో సమస్య తర్వాత చమత్కారానికి ప్రతీకగా నిలిచే కొన్ని దత్తపదుల్ని వివరిస్తాను. నేను చేసిన అవధానాల్లో పృచ్ఛకులు చిత్రవిచిత్రమైన దత్తపదుల్ని ఇచ్చి నిశితంగా పరీక్షించారు. నేను పూరించిన చమత్కారవంతమైన దత్తపదుల్ని ఉదహరిస్తాను.

నందమూరి తారకరామారావుగారు ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రిగా ఉంటూ విశ్వామిత్ర చలనచిత్రాన్ని నిర్మించే సమయంలో నేను నెల్లూరు టౌన్ హాలులో అష్టావధానం నిర్వహించాను. క్రౌన్, వనీడా, వీడియోకాన్, బుష్ అనే టీవీ కంపెనీల పేర్లతో విశ్వామిత్ర తపోభంగం వర్ణించమని అడిగినప్పుడు చెప్పిన పద్యం-

అవురా! మేనక వక్రమార్గమున శక్రోన్నత్యమున్‌గోరి, స్వ
ర్గవనీడాంబిక శోభదేహమున పొంగన్ నాట్యమున్ జెసె, ప
ల్లవ చిత్తుండయి భ్రాంతిచెంది, తపమెల్లడి వీడియోకాంత! మ
త్సవిధన్ బుష్కల సౌఖ్యమిమ్మనుచు విశ్వామిత్రుడర్థించెరా!

ప్రముఖ సినీ నటులు శ్రీ కొంగర జగ్గయ్యగారి అధ్యక్షతన 1975 సంవత్సరంలో తరుత్తణిలో జరిగిన అవధానంలో ఇంగ్లీషు పదాలతో అందమైన అమ్మాయిని వర్ణించమని కోరగా; రాకెట్లు, జాకెట్లు, పాకెట్లు, లాకెట్లు పదాలతో శార్దూలంలో చెప్పిన పద్యమిది.

రాకెట్లుండును నీదురాకవలనన్ రాకాశరద్రాత్రి, రో
జాకెట్లుండున్ నీ కపోల సుషమా సౌందర్యసౌంధ్యముల్
పాకెట్లున్నను పూలమేడయగు నీ పాదాలు పారాడ, రే
లాకెట్లుండును కోమలాంగి పణ్రయాహ్లాదంబు పండింపవే!

నేను 1965 నుంచి 2016 వరకు ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ; ఢిల్లీ, జెంషెడ్‌పూర్‌లాంటి నగరాల్లో, అమెరికా ప్రధాన నగరాల్లో 50 సంవత్సరాలపాటు కొన్ని వందల అవధానాలు నిర్వహించాను. 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అమెరికా డల్లాస్ నగరంలో ఆరంజి, మ్యాంగో, ఆపిల్, గ్రేపు పదాలతో భాగవతార్థంలో చెప్పమన్నప్పుడు బృందావనంలో బాలకృష్ణని వర్ణిస్తూ చెప్పిన పద్యమిది-

ఆరంబిల్లెడి మౌళిపించ రుచితో ఆస్మేర వక్రంబుతో
ఆ రాగోజ్వల వంశితో జలదరమ్యాంగోద్భవ శ్రీలతో
ఆ రోచిర్మయదివ్యకౌస్తుభముతో ఆపిల్ల గోపెమ్మతో
శ్రీరమ్యండగు బాలకృష్ణుడలరెన్ గ్రేపుల్ దరికి జేరగన్

అవధాన ప్రక్రియలో నిష్ణాతులు. వందలకొద్దీ అష్టావధానాలు, శతావధానాలు నిర్వహించిన ఘనాపాటి. 2013లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హంసా పురస్కారం ప్రదానం చేసింది. నివాసం ప్రొద్దుటూరు. 2017 తానా సభల్లో అష్టావధానం చేస్తున్నారు.

email: rrnarala@yahoo.com

తెలుగువారి జీవనవిధానమే 'మాయాబజార్'

సాయిబ్రహ్మానందం గొర్తి

నేటి మానవ జీవితంలో సినిమా ఒక విడదీయరాని అంతర్భాగం. ఒక దృశ్యం వేయి మాటలకి సమానం అంటారు. సాంకేతిక ప్రగతి అభివృద్ధితో పాటు సినిమా రంగం కూడా పెరిగింది. పలు అంశాలతో కొన్ని వేల సినిమాలు వచ్చుంటాయి ఇప్పటి వరకూ. మిగతా భాషలు మినహాయించి ఒక్క తెలుగులోనే పదివేల పైగా సినిమాలు వచ్చాయి.

ఎన్నో సినిమాలు వచ్చినా వాటిలో కొన్ని సినిమాలే కాలానికి నిలబడతాయి. కొన్ని సినిమాలు మాత్రమే గుర్తుంటాయి. సినిమా అనేది సామూహిక సృజన. దర్శకుడూ, రచయితా, నటులూ, ఫొటోగ్రాఫరూ, సంగీతమూ, ఆహార్యమూ వంటివే కాకుండా ఇంకా ఎన్నో విభాగాలు కలిస్తేనే ఒక సినిమా తయారవుతుంది. ఇవన్నీ సమపాళ్లల్లో కుదిరితేనే ఆ సినిమా అందరినీ అలరిస్తుంది. అన్ని వంటకాలూ అద్భుతంగా కుదిరి గుర్తుండే విందు భోజనం లాంటిదే సినిమా కూడా. అవే కాలానికి నిలబడతాయి. వాటినే సినిమా పరిభాషలో క్లాసిక్స్ అంటారు.

అసలు క్లాసిక్స్ అంటే ఏవిటి? ఏ సినిమాలని క్లాసిక్స్ అంటారు? వాటిలో ఏఏ అంశాలు పరిగణనలోకి తీసుకోవాలి? ఎక్కువ కాలం నడిచిన సినిమానా? ఎక్కువ ప్రజాదరణ పొందిన సినిమానా? ఎక్కువ డబ్బులు గడించిన సినిమానా? ఇలాంటి ప్రశ్నలన్నీ తలెత్తుతాయి. ప్రజాదరణ పొందిన ప్రతీ సినిమా గొప్ప సినిమా కానేరదు. అలాగే సినిమాలో చాలా అంశాలు అద్భుతంగా ఉన్నా ప్రజాదరణ లేకపోవచ్చు. ప్రేక్షకుల ఆదరణా, అభిరుచీ ఒక్కోసారి ఊహకు అందవు.

డెబ్భైయ్యేళ్ల పైబడిన తెలుగు సినిమాచరిత్రలో పాతిక అత్యుత్తమ చిత్రాలు ఎంపిక చేయడం సాహసంతో కూడిన పని. అంతేకాదు, వాటి స్థానం ఎంపిక చెయ్యడం ఇంకాస్త కష్టమైన విషయం. అసలు అత్యుతమ చిత్రం అంటే ఏది? కొలమానాలు ఏవిటి? వీటినే ఇంగ్లీషులో క్లాసిక్స్ అంటారు.

ఏ సినిమానయినా క్లాసిక్ అనడానికి ముఖ్యమైన అంశం 'కాలానికి నిలబడడం.' అంటే కొన్ని తరాలని ఆ సినిమా రంజింపచేయడం. అలాగే ఎన్ని సార్లు చూసినా విసుగు కలగకపోవడం. అత్యున్నత సాంకేతిక విలువలూ, నటీనటుల అద్భుతమైన నటనా, బిగుతైన కథాకథనం (స్క్రీన్ ప్లే), ఇంకా ప్రేక్షకు

ఏ సినిమానయినా క్లాసిక్ అనడానికి ముఖ్యమైన అంశం 'కాలానికి నిలబడడం.' అంటే కొన్ని తరాలని ఆ సినిమా రంజింపచేయడం. అలాగే ఎన్నిసార్లు చూసినా విసుగు కలగకపోవడం. అత్యున్నత సాంకేతిక విలువలూ, నటీనటుల అద్భుతమైన నటనా, బిగుతైన కథాకథనం (స్క్రీన్ ప్లే), ఇంకా ప్రేక్షకు లని చివరివరకూ కట్టి పడేయడం వంటివి కూడా ముఖ్య మైన అంశాలు. ఎంపిక చేసుకున్న కథ కూడా ముఖ్యమే.

లని చివరివరకూ కట్టి పడేయడం వంటివి కూడా ముఖ్య మైన అంశాలు. ఎంపిక చేసుకున్న కథ కూడా ముఖ్యమే. అది ఎటు వంటిదయినా కావచ్చు. అంటే సాంఘికం, ఇతిహాసం, చారిత్రికం, లేదా సైన్స్ ఫిక్షన్, ఇలా ఏదయినా కావచ్చు.

ఇవన్నీ ఒక సినిమాని క్లాసిక్ అనడానికి ఎంచుకునే అంశాలు. స్థూలంగా ఇవీ ప్రమాణాలు.

తెలుగులో వచ్చిన కొన్ని వేల సినిమాల్లో క్లాసిక్స్ అనబడేవి మహా అయితే ఇరవయ్యో, పాతికో ఉండచ్చు. అందులో కొన్ని- *మాలపల్లి, పాతాళ భైరవి, దేవదాసు, బంగారు పాప, మల్లీశ్వరి, మాయాబజార్, మిస్సమ్మ, కన్యాశుల్కం, జగదేకవీరుని కథ, పల్లెటూరు, లవకుశ, అల్లూరి సీతారామరాజు, ముత్యాలముగ్గు, శంకరాభరణం, సాగర సంగమం.* ఇవి కాకుండా మరికొన్ని వుండచ్చు. మరలా వీటిలో అత్యుత్తమమైన చిత్రం ఏదంటే కాస్త కష్టంతో కూడిన పని. సినిమా మొదటి నుండి చివరవరకూ అన్ని అంశాలలో అద్భుతంగా కుదిరి, ఎన్నిసార్లు చూసినా విసుగని పించని సినిమా ఎంపిక చెయ్యడం కష్టమే! అంతేకాదు అది కాలానికి నిలబడాలి. అంటే కొన్ని తరాల ప్రేక్షకులని అలరించాలి.

ఇలాంటి అంశాలన్నీ అద్భుతంగా అమరిన ఏకైక తెలుగు సినిమా *మాయాబజార్.*

అది విడుదలయ్యి అరవయ్యేళ్లు అయ్యింది. ఇవాళ చూసినా ఆ సినిమా కొత్తగానే ఉంటుంది. అంతేకాదు, మొదటిసారి చూసిన వాళ్లని అంతగానే అలరిస్తుంది. దీనికి వయసు భేదం లేదు. ఈ సినిమా క్లాసిక్ అనడానికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. ఇప్పటి వరకూ ఈ సినిమా మీద వందలకొద్దీ వ్యాసాలూ, విశ్లేషణలూ వచ్చాయి. నాకు నచ్చిన అంశాలు ఏవిటీ, ఎందుకు ఈనాటికీ అందర్నీ రంజింపచేస్తోందీ సినిమా అన్నదానిపై నా పరిశీలనలు కొన్ని.

కె.వి రెడ్డి దర్శకత్వంలో, నాగిరెడ్డి, చక్రపాణి నిర్మాతలుగా విజయా వారి బ్యానర్ మీద మార్చి 27, 1957లో ఈ సినిమా విడుదలయ్యింది. సంగీతం ఎస్. రాజేశ్వరరావు, ఘంటసాల నిర్వహించగా, మార్కస్ బార్ట్లే ఫొటోగ్రఫీ చేసారు. హేమాహేమీ లయిన నటులు ఎస్వీ రంగారావూ, సావిత్రి, ఎన్. టీ రామారావూ, నాగేశ్వరరావూ. సి.ఎస్. ఆర్., ప్రధాన పాత్రలుగా కనిపిస్తారు. వీరు కాకుండా గుమ్మడి, రమణారెడ్డి, ముక్కామల, ఆర్ నాగేశ్వరరావు,



ఛాయాదేవి, సూర్యకాంతం, ఋష్యేంద్రమణి వంటి నటీనటులు కూడా ఉన్నారు.

ఈ సినిమాని అజరామరంగా నిర్మించిన ఘనత దర్శకుడు కె.వి.రెడ్డికి దక్కుతుంది. అలాగే ఈ సినిమాకి ఆయువు పట్టు మాటల మాంత్రికుడు పింగళి. సంగీతం వరకూ వస్తే నేటికీ ఈ సినిమాలో పాటలు అందరి నోటా నానుతూనే ఉంటాయి. ఇవి కాకుండా కడుపుబ్బ నవ్వించే హాస్యం, మాయలూ, మంత్రాలూ ఇవన్నీ ఈ సినిమాలో సమపాళ్లల్లో చక్కగా అమరాయి.

కథ వరకూ వస్తే ఈ కథకి మూలం మహాభారతం. బల రాముడూ, రేవతిల కూతురు శశిరేఖ. చెల్లెలు సుభద్రని అర్జునిడి కిచ్చి వివాహం చేస్తారు. సుభద్ర కొడుకు అభిమన్యుణ్ణి శశిరేఖకిచ్చి వివాహం జరిపిస్తానని కృష్ణుడి సమక్షంలో చెల్లెలికి ప్రమాణం చేస్తాడు బలరాముడు. శశిరేఖా, అభిమన్యుడూ కూడా ఒకరి నొకరు ఇష్ట పడతారు. ఈలోగా కౌరవుల మాయాజూదంలో పాండవులు సర్వస్వమూ కోల్పోయి, పాండవులు అరణ్యవాసం వెళితే, సుభద్ర పుట్టింటికి వస్తుంది. పాండవులని కౌరవులు మాయాజూదంలో మోసం చేసారని తెలుసుకొని హస్తినకు వెళతాడు బలరాముడు. అక్కడ బలరాముణ్ణి సత్కరించి, ప్రశంసలతో ముంచెత్తి అతన్ని శాంత పరచి, పనిలో పనిగా శశిరేఖని ధుర్యోధనుడి కొడుకు లక్ష్మణ కుమారుడితో వివాహం జరిపించా లని నిశ్చితార్థం జరిపిస్తారు కౌరవులు. ఈలోగా అక్కడ ద్వైతవనం చేరుకున్న అభిమన్యుడి ద్వారా విషయం తెలుసుకున్న ఘటోత్క చుడు శశిరేఖను తీసుకొచ్చి అభిమన్యుడికిచ్చి వివాహం జరిపి స్తానని తన అనుచరులతో ద్వారకకి వెళతాడు. అక్కడ శశి రేఖా, లక్ష్మణ కుమారుల వివాహ ఏర్పాట్లు జరుగుతూ ఉంటాయి. తన అనుచరులతో అక్కడ నానా రభసా సృష్టించి, మాయా శశి రేఖగా మారి మగ పెళ్లివారిని బెంబేలెత్తిస్తాడు ఘటోత్కచుడు. చివరకి ఈ పెళ్లి పెటాసు చేసి, కౌరవులకి బుద్ధి చెప్పి, అభిమన్యు డికీ, శశిరేఖకీ వివాహం జరిపిస్తాడు ఘటోత్కచుడు. స్థూలంగా ఇదీ కథ. ఇది మహా భారతంలో లేదు. అసలు బలరాముడికీ, రేవతికీ శశిరేఖ అనే కూతురే లేదు. ఈ కథ జానపద వాఙ్మయం లోంచి పుట్టుకొచ్చింది. ఆనోటా ఈనోటా శశిరేఖా పరిణయంగా చెలా మణి అవుతూ వచ్చింది. భారతంలో ఎన్నో ప్రక్షిప్త కథలు న్నాయి. అందులో ఇదీ ఒకటి.

స్థూలంగా ఇదొక పౌరాణిక చిత్రం. కానీ సినిమా చూస్తు న్నంతసేపూ అలా అనిపించదు. సినిమాలో ఘటోత్కచుడి మాయలూ, మంత్రాలతో పెళ్లి పేరు చెప్పి కౌరవులనీ, వారి బంధు వర్గాన్నీ అపాసుపాలు చేయడంలో ఎంతో హాస్యం కనిపిస్తుంది. శశిరేఖా, అభిమన్యుల ప్రేమ కథ. దీనికి ప్రధాన సూత్రధారి ఘటోత్కచుడూ, కృష్ణుడూ. మహాభారతంలో శ్రీకృష్ణుడు ప్రధాన పాత్రధారి. కానీ ఈ కథకి ఘటోత్కచుడు ప్రధాన పాత్రధారి. సినిమా మొత్తం ఇతని చుట్టూనే తిరుగుతుంది. అలా అని మిగతా పాత్రలకి ప్రాముఖ్యత లేదని కాదు. శశిరేఖా, అభిమన్యుడూ

కూడా ముఖ్య పాత్ర ధారులే. వీరు కాకుండా శకునీ, లక్ష్మణ కుమారుడూ ఇలా ప్రాముఖ్యత ఉన్న పాత్రలు కూడా ఉన్నాయి.

ఈ సినిమాలో కృష్ణుడి పాత్ర నిడివి తక్కువ. ఎక్కడ ఎంత అవసరమో అంత వరకే ఉంటుంది. అలాగే కృష్ణుడి పాత్రని ఆకాశానికి ఎత్తేసి మిగిలన పాత్రలని పట్టించుకోవడం కనబడదు. ఇంకా ఈ కథలో పాండవుల ప్రస్తావన వస్తుంది కానీ వారెవరూ కనిపించనే కనిపించరు. నిజానికి ఈ కథని జనరంజకంగా తెరకెక్కించడం అంత సులువు కాదు, ఘటోత్కచునికి ఎన్ని మాయలూ, మంత్రాలూ పెట్టి చూపించినా. పాండవులు లేకుండా ఈ కథ చెప్పడం కష్టం. ఇక్కడే దర్శకుడు కె.వి రెడ్డి ప్రతిభ కనిపిస్తుంది. ఈయనకి తోడైన మాటల రచయిత పింగళీ, కెమేరామెన్ మార్కస్ బార్ట్లే కూడా వారికిచ్చిన బాధ్యతని గొప్పగా నిర్వహించారు.

కథ కౌరవులకీ, పాండవులకీ మధ్య మాయాజూదం జరగక ముందు మొదలవుతుంది. మాయా జూదం తరువాతా ఉంటుంది. పాండవులు జూదంలో ఓడిపోవడమూ, అన్నగారి పంచన సుభద్ర పుట్టింటికి చేరడమూ ఇవన్నీ మాయా జూదం సంఘటన తరువాత జరుగుతాయి. పాండవులు తెరేమీద కనిపించకుండా ఎలా కథని నడిపించాలి? ఇక్కడే కె.వి రెడ్డి తెలివి తేటలు కనిపిస్తాయి. ఇది ఎంతో సులభంగా చూపించేస్తాడు, మూల కథకి భంగం రాకుండా. శశిరేఖా, అభిమన్యుల చిన్నతనంతో సినిమా ప్రారంభించి, బలరాముడు అభిమన్యుడే తన అల్లుడన్న ప్రమాణం సుభద్రకి చేయడం చూపిస్తాడు. అప్పుడే కౌరవుల మాయాజూదం చూపించాలి. అది ఎక్కడో వేరేచోట జరుగుతుంది. అదంతా చూపించాలంటే సినిమా నిడివి చచ్చేటంత అవుతుంది. పైగా ఈ కథ దారి తప్పే ప్రమాదం కూడా ఉంది.

అందుకని కృష్ణుడి చిన్నప్పటి విశేషాలు పాట రూపంలో కృష్ణుడూ, రుక్మిణికి ఒక ప్రదర్శన జరుగుతున్నట్లు చూస్తాడు. పాట చివర్లో కృష్ణుడు పరధ్యానంలోకి వెళ్లి కొంతసేపటికి మామూలు స్థితికి వస్తాడు. ఆ పరధ్యానం ఎందుకంటే అక్కడ ద్రౌపదీ వస్త్రాపహరణం జరిగుతూ ఉంటుంది. ద్రౌపది కృష్ణుణ్ణి మొరపెట్టుకోవడంతో కృష్ణుడు ఆమెను కాపాడడం కోసం వెళతాడు. అతని పరధ్యానం గమనించిన రుక్మిణి ఏమయ్యిందని అడుగుతుంది. అక్కడే మాయా జూదంలో పాండవుల ఓటమి గురించీ, ద్రౌపదీ వస్త్రాపహరణం గురించీ తెలివిగా కృష్ణుడు చేతే చెప్పిస్తాడు దర్శకుడు. ఇదంతా ఒక పాటరూపంలో మూడు నిమిషాల్లో తెరపై చూపిస్తాడు.

మరుక్షణమే సుభద్ర, అభిమన్యుడితో పుట్టింటికి రావడం సీన్ వచ్చేస్తుంది. కథ అభిమన్యుడూ, శశిరేఖలమధ్యకి వచ్చేస్తుంది. వెనువెంటనే బలరాముడు వారి పెళ్లి తిరస్కరించడమూ, అవమానంతో సుభద్ర అక్కడ ఉండలేని పరిస్థితి గ్రహించి కృష్ణుడు ఘటోత్కచుడి నివాసానికి పంపించడమూ చూపించేస్తాడు. ఇదీ కె.వీ రెడ్డి స్క్రీన్‌ప్లే ప్రతిభ.

ఇవి కాకుండా ఈ కథ పౌరాణికమయినా ఏ పాత్రా మనకి అలా అనిపించదు. బలరామున్నీ, సుభద్రనీ, కృష్ణున్నీ, రేవతీ, శశిరేఖాభిమన్యుల్ని చూస్తూంటే మన ఇళ్లల్లో ఓ పెదనాన్ననీ, బాబయ్యనీ అత్తయ్యల్ని చూస్తున్నట్లు ఉంటుంది. మన కుటుంబాల్లో మేనరికం పెళ్లిళ్ల గురించి వింటూనే ఉంటాం. చిన్నప్పుడు మాట ఇచ్చుకొని, పెద్దయ్యాక ఆస్తులూ అవీ పోతే కాదనడం వింటూ ఉంటాం. అందువల్ల బలరాముడూ, కృష్ణుడూ, రేవతీ, సుభద్రా, అభిమన్యుడూ, శశిరేఖా పౌరాణిక పాత్రల్లా కాకుండా మనింట్లో మనమధ్య మసిలే మనుషుల్లాగే అనిపిస్తారు; ఒక్క ఆహార్యం తప్ప. మనకి ఈ పౌరాణిక పాత్రలు మామూలు మనుషుల్లా అనిపించడానికి ప్రధాన కారణం మాటల మాంత్రికుడు పింగళి. ఎక్కడా పెద్ద పెద్ద సంస్కృత సమాసాలూ, బరువైన పెద్ద డైలాగులు లేకుండా- వదినా, మరదళ్ల మధ్య దెప్పి పొడుపులూ, మాటలు తిరిగి అప్పజెప్పడాలూ, వ్యంగ్యాలూ, విసుర్లూ- ఇలా అన్నీ వ్యవహారిక భాషలో ఉంటాయి. వింటూంటే మన ఇళ్లల్లో సంభాషణల్లా ఉంటాయి.

ఉదాహరణకి కొన్ని.- అభిమన్యుడు తన విలు విద్యని శశిరేఖకి ప్రదర్శించాలని ఉవ్విళ్లూరుతాడు. శశిరేఖ నెత్తిమీద పెట్టి ఒక పండుని కొట్టే సమయానికి రేవతి వచ్చి అడ్డుకొని, అభిమన్యుడి విల్లంబులు లాక్కొంటుంది. మరదలు సుభద్ర దగ్గరే ఇది తేలుద్దామని వస్తూండగా, అక్కడ బలరాముడూ, కృష్ణుడూ పాచికలు ఆడుతూ కనిపిస్తారు. రేవతి చేతిలో విల్లంబులు చూసి - "కృష్ణా! చేతిలో ఆ ధనుర్బాణాలు చూస్తూంటే మీ వదిన అపరకాళికా దేవిలా లేదూ?" అంటూ హాస్యమాడతాడు బలరాముడు. ఇలాంటి హాస్యాలు మన ఇళ్లలో తరచూ చూస్తూనే ఉంటాం.

అలాగే అభిమన్యుడూ, శశిరేఖా నౌకావిహారం వెళ్లారని తెలిసి, అది నిజమో కాదో తేలుద్దామని రేవతి బలరాముడితో బయల్దేరుతుంది. అది తెలిసీ కృష్ణుడు వారికంటే ముందు రుక్మిణితో వెళ్లి అభిమన్యుడూ, శశిరేఖల్ని తప్పిస్తాడు. నౌకలో కృష్ణుడూ, రుక్మిణి లని చూసి రేవతి, 'ఈ వయసులో రుక్మిణికి నౌకావిహారం ముచ్చటా?' అని బలరాముడితో అంటుంది. తరువాత రేవతీ, బలరాములు నౌకావిహారం చేస్తూంటే సరిగ్గా రుక్మిణీ అదే

మాటంటుంది. ఇక్కడే స్త్రీల మనస్తత్వాన్ని అద్భుతంగా చూపిస్తాడు. వేంటనే - 'రసపట్టులో తర్కం కూడదు' అని కృష్ణుడి చేత పలికిస్తాడు. మన కుటుంబాల్లో ఆడవాళ్ల మధ్య ఇలాంటి ప్రవర్తనలే చూస్తూ ఉంటాము.

సినిమా మొత్తమూ ఇలాంటి సహజమైన సంభాషణలతోనే సాగుతుంది. అభిమన్యుడు కృష్ణుణ్ణి మావయ్యా అని సంబోధించడమూ, బలరాముడు అభిమన్యుణ్ణి మేనల్లుడని చెప్పడమూ, శశిరేఖ సుభద్రని అత్తయ్యా అని పిలవడమూ, లక్ష్మణ కుమారుణ్ణి పొగిడే భట్రాజులు కౌరవల గురించి చెబుతూ 'బాబాయిలు' అనడమూ, అర్జునుడి గురించి చెబుతూ ఘటోత్కచుడు 'అర్జున బాబాయి' అనడమూ వంటి పిలుపులన్నీ మన ఇళ్లలో మనకి అలవాటైన పిలుపుల్లా ఉంటాయి. సినిమా చివర్లో లక్ష్మణ కుమారుడితో మాయా శశిరేఖ పెళ్లిలో ఘటోత్కచుడి అనుచరుల మాయల వల్ల అందరూ తుమ్ముతారు. 'నీళ్లు కొత్త చేసుంటాయి,' అని కృష్ణుడు అంటే, రేవతి అందుకుంటుంది. అది విని రుక్మిణి 'అవును పాపం,' అని వ్యంగ్యంగా ఎత్తిపొడుస్తుంది. ఇలా ప్రతీ పాత్ర విషయంలోనూ ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. ఇంకా చాలా ఉదాహరణలు ఉన్నాయి.

ఈ సంభాషణలు కాకుండా ఈ సినిమాలో మరో మహత్తరమైన ప్రయోగం ఉంది. అది పెళ్లి. ఈ పెళ్లి వేడుక మొత్తమూ తెలుగువారి పెళ్లి వేడుకే! పద్ధతులూ, ఆచారాలూ, ఆఖరికి పెళ్లి విందూ, వంటకాలూ ఇవన్నీ తరచూ తెలుగు ఇళ్లల్లో కనబడేవే.

సాధారణంగా రామాయణ, భారతాలలో కథల్ని తీసుకొని మన జీవితాలకి అనునయించి కథలు రాయడమూ, సినిమాలుగా తీయడమూ చూస్తూనే ఉంటాం. కానీ ఈ సినిమాలో మన అలవాట్లూ, సాంప్రదాయాలూ, పద్ధతులూ పౌరాణిక పాత్రలకి ఎంతో సహజంగా అన్వయించడం కనిపిస్తుంది. దీన్నే ఇంగ్లీషులో reverse adaptation technique అంటారు. ఈ సినిమాలో మొత్తం పెళ్లి తంతు అంతా తెలుగు పెళ్లే. తెలుగు వారి పద్ధతులూ, ఆచారాలూ ఇవన్నీ భారతంలో కుదించేసారు.

సంభాషణల్లో వాడుక మాటలు ఎలాగో పెళ్లి పద్ధతుల్లోనూ అవే పాటించారు. మగపెళ్లి వారు పెళ్లి విడిదికి రాగానే పెళ్లి కూతురు ఎలా ఉంటుందో చూడాలన్న తహతహ కుటుంబాల్లో ఉంటుంది. ఇక్కడ శశిరేఖని చూడ్డానికి లక్ష్మణ కుమారుడూ, భానుమతే కాదు, శకునీ మిగతా బంధుగణమూ వెళతారు. అలాగే మగ పెళ్లివారు పెళ్లిళ్లలో సదుపాయాలూ సరిగ్గా లేవూ, పట్టించుకోవడం లేదూ, ఆతిథ్యం సరిగా లేదని అయినదానికీ, కానిదానికీ పేర్లూ, వంకలూ పెట్టడం చూస్తూనే ఉంటాం. ఇవన్నీ సినిమాలో చక్కగా ఒదిగిపోయాయి. ఇంకా పెళ్లిలో బాసికం కట్టడం, తెర పట్టడమూ, పాదపీడనం, పెళ్లికొడుకు నిలబడి తాళి కట్టడం ఇవన్నీ ఆనాటి పద్ధతులేనా అనుకునేలా భ్రమించ చేసారు.

అలాగే పెళ్లికి విచ్చేసిన వారికి 'రుమాలు' ఇవ్వడం పూర్వం పెళ్లిళ్లలో తెలుగువారి సాంప్రదాయం. అది కూడా హాస్యం కోసం తెలివిగా వాడుకున్నారు. ఆ రుమాళ్ల కోసం కౌరవ సోదరులు ఎగపడటం హాస్యాన్ని పుట్టిస్తుంది.

ఇహ పెళ్లిలో భోజనం గురించి చెప్పనవసరమే లేదు. వివాహ భోజనంబు పాట నిండా తెలుగు వంటకాలే! బొబ్బట్లూ, గారెలూ, బూరెలూ, చెగోడీలూ, ఆఖరికి గోంగూరని కూడా కౌరవుల కాలం నాటి వంటకం చేసేస్తారు. అలా చేయడం సినిమాలో ఎక్కడా ఎబ్బెట్టుగా అనిపించదు. ఇది కె.వి.రెడ్డి, పింగళిల మేధో చమత్కారం.

అసలు ఈ సినిమా మొదలవ్వడమే శశిరేఖ రజస్వల సందర్భంతో పాటతో మొదలవుతుంది. రజస్వల అన్నది ఎక్కడా పాటలో కనిపించదు. మాటలూ ఉండవు. పుట్టినరోజని కూడా అనుకోవచ్చు కానీ, చూస్తే అదే సందర్భం అని ఖచ్చితంగా తెలుస్తుంది. ఇలాంటి సందర్భాలకి ఇంట్లో ఆడవాళ్లనే పిలుస్తారు. అందుకే అక్కడ సుభద్ర, అభిమన్యుడూ కనిపిస్తారు. అర్జునుడు కనిపించడు. ఇక్కడ పాండవులని, ముఖ్యంగా అర్జునుణ్ణి, తెరపై చూపించే అవకాశం ఉంది. దర్శకుడు ఇక్కడా తెలివిగా దాట వేసాడు. ఇలా ప్రతీ సన్నివేశ నిర్మాణంలోనూ ఎంతో చాకచక్యం కనిపిస్తుంది.

ఈ మాయబజార్ సినిమా ఆరేడు తరాలకి అమితంగా నచ్చడానికి హాస్యమూ, నటనా, మాటలూ, పాటలూ ఒక కారణమయితే, అంతర్లీనంగా తెలుగువారి జీవన విధానాన్ని సినిమాలో జొప్పించడం మరో ప్రధాన కారణం.

ప్రతీ తరంలోనూ పెళ్లిళ్లు ఉంటాయి. చిన్న చిన్న ఆచారాలూ, పద్ధతులూ, సాంప్రదాయాలూ తేడా ఉండచ్చు గాక. కానీ ప్రధాన తంతు రమారమి అందరికీ ఒకటే. అలాగే పెళ్లిళ్లలో తగవులూ, అపార్థాలూ ఎప్పుడూ ఉండనే ఉన్నాయి. అందువల్ల ఏ తరం



వారయినా ఈ సినిమా చూస్తే ఇట్టే సొంతం చేసేసుకుంటారు. తమ జీవితాలకి దగ్గరగా ఉండడం వలన అన్వయం చక్కగా కుదురుతుంది. ఇవి కాకుండా హాస్యం ఎలాగూ ఉంది. పిల్లా, పెద్ద తేడా లేకుండా ఈ సినిమా హాయిగా చూసేయచ్చు. ఒకసారి కాదు, ఎన్నిసార్లు చూసినా విసుగనిపించదు. వీటికి తోడు అద్భుతమైన ఫొటోగ్రఫీ మాయలూ, అలరించే సంగీతమూ ఉన్నాయి. ఇవన్నీ మించి నటీనటులందరి గొప్ప నటనా కౌశలమూ ఉంది. ముఖ్యంగా ఎస్వీయార్, సావిత్రి ఈ సినిమాకి హీరోలు. ఎస్వీ రంగారావుకి అలాంటి పాత్ర కొట్టినపిండి. సావిత్రి మాయా శశిరేఖ గా చేసిన నటన అద్భుతం. చిన్న చిన్న హావభావాలు పలికించడంలో ఆమె చూపించిన నటన అద్భుతమూ, అజరామరమూ.

ఇహ స్క్రీన్ప్లే వరకూ వస్తే ఈ సినిమాలో ఏ ఒక్క అనవసర సన్నివేశమూ కనిపించదు. సినిమా మొత్తం వేగంగా నడుస్తూనే ఉంటుంది. ఈ సినిమాలో చూపించిన అబ్బురపరిచే విషయాలు కూడా కొన్ని ఉన్నాయి. అవి- తలచిన వారిని చూపించే ప్రియదర్శిని, రెండోది సత్యపీఠం. ప్రియదర్శిని ప్రస్తుత లాప్టాప్ అనుకోవచ్చు. అప్పటికే పాశ్చాత్య దేశాల్లో టీవీ వచ్చేసింది. ప్రియదర్శిని అని చక్కటి పేరుపెట్టి సినిమా కథనంలో ఇమిడ్చి చూపించారు. అలాగే సినిమా మొదట్లో కృష్ణుడి తమ్ముడు సాత్యకి ద్వారా ప్రవేశ పెట్టిన సత్యపీఠం చివర్లో శకుని బండారం బయట పెట్టడానికి వాడుకున్నారు. చివర్న ఘటోత్కచుడు మాయలూ అవీ చేస్తాడు కానీ కృష్ణుడు మామూలు వ్యక్తిగానే అంతా చూస్తూ వుంటాడు. అన్నగారి దగ్గర అతి వినయంతో ప్రవర్తించే తమ్ముడిలా కనిపిస్తాడు తప్ప ఎక్కడా దేవుడు అన్న భావనే కలగదు.

ఇవి కాకుండా ఈ సినిమాలో సంభాషణలు కొన్ని తరాలు అందరి నోటా నానుతూనే ఉన్నాయి. 'వెయ్ వీడికో వీరతాడు!', 'ఇదే మామ మన తక్షణ కర్తవ్యం', 'హై హై నాయకా', 'దుసట చసుటతయమూ' వంటి ప్రయోగాలూ ఇన్నేళ్లయినా వాడుకలోనే ఉన్నాయంటేనే పింగళి వారి గొప్పతనం తెలుస్తోంది.

ఈ సినిమాలో కొన్ని పాటలకి వరసలు కట్టాకా సాలూరి రాజేశ్వరరావుకీ, నిర్మాతలకీ విభేదాలు వచ్చి, ఆయన చేయగా మిగిలిన పాటలూ, నేపథ్య సంగీతమూ ఘంటసాల చేసారు. ఈ సినిమాలో ఒక్కో పాటా ఒక ఆణిముత్యం. 'నేవేనా నను తలచినదీ', 'చూపులు కలసిన శుభవేళా', 'లాహిరి లాహిరిలో", 'అహా నా పెళ్లి అంట', 'వివాహ భోజనంబు' ఇలా ప్రతీ పాటా ప్రసిద్ధి చెందినవే. ఇవి ఎంతలా ప్రజల నోళ్లల్లో నానాయంటే, ఈ పాటల పల్లవులతో తెలుగులో సినిమాలు వచ్చాయి. ఇది ఏ సినిమాకీ దక్కని అపూర్వ గౌరవం.



ఈ సినిమాకి మరో గొప్పదనం కూడా ఉంది. పైన చెప్పిన అంశాలన్నీ కన్నుల విందుగా చిత్రీకరించిన ఫొటోగ్రాఫర్ మార్కస్ బార్ట్లే మాయా జాలం మనల్ని కట్టి పడేస్తుంది. సాంకేతిక ప్రగతి అంతగా లేని ఆ రోజుల్లో ఈయన చేసిన కొన్ని ఫొటోగ్రఫిక్ ట్రిక్స్ ఇప్పటికీ ఆశ్చర్యమే. మాయా ద్వారక సెట్టింగు ఇప్పటికీ ఒక అద్భుతం. అలాగే వివాహభోజనంబు పాటలో చూపించిన ట్రిక్ ఫొటోగ్రఫీ; వంగర, బాలకృష్ణ, అల్లు రామలింగయ్యల మధ్య హాస్య సన్నివేశాలలో తివాచీ చుట్టుకు పోవడం, గిర్రున తిరిగే మంచం, అటూ ఇటూ కదిలే తాంబూల పళ్లెం ఇవన్నీ అప్పట్లో ఎలా తీయగలిగారు అన్నది ఊహకే అందవు. ఘటోత్కచుడు పెద్దగా అవడం, పెళ్లివారి విడిది సన్నాహం పాటలో, చెప్పులూ, బెందెలూ ఇవన్నీ కొట్లలో వరసగా అమరడం, ప్రియదర్శినిలో అభిమన్యుణ్ణి చూస్తూ శశిరేఖ పాడే సన్నివేశమూ ఇవన్నీ బార్ట్లే ప్రతిభకి తార్కాణం. తెలుపు నలుగు చిత్రంలో వెన్నెల్లో ఉన్నట్లు భ్రమించేలా తీసిన లాహిరి లాహిరి పాటా ఇవన్నీ మాయాబజార్ సినిమాని మరో మెట్టుపైకి తీసుకెళ్లాయి. సెట్టింగులు వేసిన గోఖలే, కళాధరూ, ఆహార్యం అందించిన భక్తవత్సలం అందరూ తలో చెయ్యీ వేసారు ఈ కళాఖండంలో.

ఎన్నో తరాలకి పసితనంలోనే పరిచయమయ్యే సినిమా మాయాబజార్. అందుకే ఇన్నేళ్లు అంటే అరవయ్యేళ్లు గడిచినా ఈ సినిమా తెలుగువారి హృదయాల్లో చిరకలాంగా నిలిచిపోయింది. ఇలాంటి అద్భుతాలు అరుదుగా జరుగుతాయి.

అందుకే వీటిని క్లాసిక్స్ అంటాం.

ఏ ముహూర్తాన మాయ అని టైటిల్లో తగిలించారో, ఇన్నేళ్లుగా తెలుగువారిని ఈ సినిమా మాయ చేస్తూనే ఉంది. ఉంటుంది కూడా.

కథకుడు, నవలా రచయిత, వ్యాపకర్త అయిన సాయిబ్రహ్మానందం గొర్తి ఒక కథాసంపుటి, ఒక నవల ప్రచురించారు. నివాసం క్యుపర్టినో, కాలిఫోర్నియా. 2017 తానా సభల అతిథి.

email: gorthib@yahoo.com

నా కథాయానం

డా. పాసినేని శివశంకర్

కథైనా, కవిత్వమైనా
ఒక అన్వేషణ. ఇతరులు
కనుగొనని దాన్ని కనుగొనటమే.
సమాజంలో కనపడని
హింసా రూపం ఎట్లా ఉంటుందో
హింస రచన అన్వేషించింది.
ఆధునిక రైతు జీవిత వ్యథని
మట్టిగుండె ఆవిష్కరించింది.
సజీవ వ్యక్తుల్లోని నిర్జీవాంశని
'సజీవ నిర్జీవం' వ్యక్తీకరించింది.

పునాదులు అంత తేలిగ్గా కనబడతాయా? తవ్వుకుంటూ పోవాలి చాలా లోతుకు. అట్లా తవ్వుకుంటూ పోతే అమ్మ ఇళ్లో 'లంకా యాగం', 'బాలనాగమ్మ కథ', 'ఊర్మిళాదేవి నిద్ర' విన్న సంగతులు గుర్తొస్తాయి. ఊళ్లో (నెక్కల్లు) ఆడిన 'కురుక్షేత్రం', 'రామాంజనేయ యుద్ధం', బ్రహ్మంగారి నాటకం, హరి కథలు, బుర్ర కథలు (పిట్ట కథల్తో సహా) తలపుకొస్తాయి. మెట్ల పైర్ల రెపరెపలు, పొగాకు బేరన్ల సందడి, ఊరుమ్మడి బ్రతుకు, మంచి చెడ్డలు మనసులో మెదుల్తాయి. బహుశా ఇట్లాంటివన్నీ ఒక రచయిత రూపొందటంలో ప్రాథమిక పాత్ర నిర్వర్తించి ఉంటాయి. నెక్కల్లు పిల్లాడి బాల్యం లేనిదే శివశంకర్ అనే రచయిత లేడు. ఇంకా చెప్పాలంటే గ్రామీణ బాల్యం ఎవరికైనా పెద్ద సంపద అనుకుంటా. ఆ సంపద పట్టణాలు, నగరాల్లో పుట్టి పెరిగిన వాళ్లకు ఉండనే ఉండదు. అది ప్రకృతితో, కొండా కోనల్తో సామూహిక జీవన విధానంతో, గొడ్డూగోదాతో, పాడిపంటల్తో ఉండే ఘనమైన బంధం, సంబంధం. ఆ నేపథ్యంలో నుంచి ఒక రచయిత పుట్టుక ఎట్లా జరిగిందో కొంచెం చెపుతా.

తూళ్లూరు హైస్కూల్లో ఏడో తరగతిలో ఉండగా పద్యాల జ్ఞాపకశక్తి పోటీ పెట్టారు. ప్రథమ బహుమతిగా 'పిల్లల టాగూరు' అనే పుస్తకం ఇచ్చారు. (అదెవరు రాశారో ఇప్పుడు జ్ఞాపకం లేదు! ఎవరైనా తెల్పితే సంతోషిస్తాను). అది మనసు మీద తొలిముద్ర అయి ఉంటుంది. తొమ్మిదో తరగతిలో 'మారుతీ వ్యాకరణం' చదివి, ఛందస్సు నేర్చుకొని పద్యాలల్లటం మొదలు బెట్టా. ఆ తొలి పద్యం అయితే 'వాయుపుత్రుండు లంకను వేగ జేరె...' (యతి భంగం) ఇప్పటికీ పూర్తికాలేదు! ఎస్ఎస్ఎల్సీలో ఉండగా ఒకనాడు మా హెడ్‌మాస్టర్ సుబ్బారావుగారు వచ్చి "where the mind is without fear, and the head is held high" అనే రవీంద్రుడి గేయం అద్భుతంగా చెప్పారు. అది పెద్ద ముద్ర. ఆ సాయంత్రం ఊళ్లో కొత్తగా పెట్టిన గ్రంథాలయానికి పరిగెత్తి, ఠాగూర్ 'గీతాంజలి' మొత్తం చదివేసి, ఏదో అర్థమైపోయినట్టు గంతులేశా. ఆ గ్రంథాలయం పెద్ద వరం నాకు. అక్కడ చందమామ, యువ మొదలు టాగూర్, శరత్, చిలకమర్తి, గురజాడ, విశ్వనాథ, శ్రీశ్రీ, ఆరుద్ర, దాశరథి, యద్దనపూడి, కోడూరి- ఇల్లా కొన్ని వందల రచనలు చదివి ఉంటా. ఊళ్లో దొరికే డిటెక్టివ్

నవలలు సరేసరి. ఆ దశలో 'చందమామ' నా ఊహా లోకాన్ని విశాలం చెయ్యటంలో ఎంతో సాయపడింది. అప్పుడే తొలి కథ నిరుద్యోగి రాశా. ఇక పద్యాల, వచన కవితలు, నాటికలు, ఏకపాత్రాభినయాలు- అట్లా సాగింది హైస్కూల్ దశలో తొలి రచనా వ్యాసంగం. ఆ పిచ్చి చూసి తోటి పిల్లలంతా మూకుమ్మడిగా 'పిల్ల కవి' అనే బిరుదిచ్చారు!

తొలిదశలోగానీ, మలిదశలోగానీ కథలు, కాకరకాయలు ఇట్లా రాయాలని చెప్పినవాళ్లు లేరు. ప్రాచీన సాహిత్య అధ్యయనంలో, పద్యవిద్యలో గొప్ప గురువులు లభించారు నాకు. ముఖ్యంగా తెనుగులెంక తుమ్మల సీతారామమూర్తి, ఓరుగంటి నీలకంఠశాస్త్రి, నాగళ్ల గురుప్రసాదరావులను (తొలి పంతులుగారు నన్నపనేని అంకినీడుతోపాటుగా) ఎప్పుడూ తలుచుకుంటాను. అయితే కథ, కవిత, విమర్శ- ఈ మూడు శాఖల్లో నాకు నేనే గురువుని, శిష్యుడిని. చదువుకునే రోజుల్లోనే పేర్లులేని కొన్ని కథలు, కవితలు, పద్యం ఖండికలు, నాటకాలు, నవలలు- ఏవేవో రాశాను. అవేవీ గొప్పవి కావు. కాకపోతే ఆ అభ్యాసం బాగా తోడ్పడింది. అదొక కాల్పనిక (రొమాంటిక్) దశ. క్రమక్రమంగా దేశ, విదేశాల సాహిత్య అధ్యయనం నా రచనా శిల్పానికి ఎంతగానో సాయపడింది. గొప్ప చదువరి కాని వాడెప్పుడూ గొప్ప రచయిత అవు తాడనుకోను. కవిత్వం పక్కనబెడితే కల్పనాత్మక సాహిత్యంలో శ్రీపాద, కొడవటిగంటి, మా గోఖలే, రవీంద్రుడు, శరత్, విభూతి భూషణ్, ప్రేమ్‌చంద్, గొగోల్, దొస్తొయెవ్‌స్కీ, హెమింగ్వే మొదలైన రచయితలు నా మీద పెద్ద ప్రభావమే ప్రసరించి ఉంటారు.





మొదటి కథ కలుపు మొక్క 1977లో ప్రజాతంత్రలో వస్తే మొదటి కవిత చైతన్య గీతిక 1980లో ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేక సంచికలో వచ్చింది. నిజానికి 1980 నుంచే రచయితగా అసలు ప్రయాణం. 1983లో ఆంధ్రజ్యోతి వారపత్రికలో వచ్చిన 'హింస రచన'తో బాగా గుర్తింపు వచ్చింది. రావిశాస్త్రి, కాళీపట్నం వంటి పెద్దలు దాన్ని మెచ్చుకున్నారు. 1985లో మా యింటికి వచ్చిన వరవరరావు అది చదివి, 'ఇప్పటిదాకా నేను మంచి కవులు మంచి కథలు రాయలేరని అనుకుంటున్నాను. ఈ పూట ఆ అభిప్రాయం మార్చుకున్నాను,' అన్నారు. అది పెద్ద కాంప్లిమెంట్. అట్లాగే, 'దేవరకొండ బాలగంగాధర తిలక్ తర్వాత కథ, కవిత్వాలను సమాన స్థాయిలో రాస్తున్న రచయిత శివశంకర్,' అని కథాసాహితి ఆవిష్కరణ సభలో మృణాళిని అన్నారు.

కవిత్వమే ఎక్కువ రాశాను. కథలు తక్కువే. మహా అయితే ఒక యాభై ఉంటాయేమో. మీరు రాసిన వాటిల్లో మీకేవి బాగా యిష్టం అని కొంతమంది అడుగుతారు. దానికి జవాబు చెప్పటం కష్టం. బాగా ప్రాచుర్యం పొందినవైతే చెప్పగలను. అందుకు ఒక ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది మట్టి గుండె. ఆధునిక రైతు కథలకి అది మార్గదర్శి అంటారు. పల్లెటూరు దూరమైన గ్రామ ప్రేమికుడి పరాయితనం (alienation) వస్తువు. ఆ కథ 20వ శతాబ్దపు నూరు ఉత్తమ కథల్లో ఒకటిగా గుర్తించబడింది. పిచ్చుకల అంతర్ధానం, పర్యావరణ విధ్వంసం, ఆ క్రమంలో మానవ హృదయ విధ్వంసం వస్తువుగా చివరి పిచ్చిక కథ బాగా ప్రచారమై నాటికగా జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వ అవార్డు కూడా పొందింది.

అట్లాగే సముద్రం తెలుగు కథాశిల్పంలో విలక్షణమైనదిగా పాఠకులు, విమర్శకులు భావించారు. మానవానుబంధాల ప్రేమికుడిగా వస్తు ప్రపంచంలో కథ కూడా నాకిష్టం.

కథైనా, కవిత్వమైనా ఒక అన్వేషణ. ఇతరులు కనుగొనని దాన్ని కనుగొనటమే. సమాజంలో కనపడని హింసారూపం ఎట్లా ఉంటుందో హింస రచన అన్వేషించింది. ఆధునిక రైతు జీవిత వ్యథని మట్టిగుండె ఆవిష్కరించింది. సజీవ వ్యక్తుల్లోని నిర్జీవాంశని 'సజీవ నిర్జీవం' వ్యక్తీకరించింది. అమూర్త భవిష్యత్ నిర్మాణాల కన్న ప్రస్తుతం చాలా ముఖ్యమని ఇప్పుడూ ఇక్కడా చెపుతుంది. ఆధునిక మానవుడి పరాయితనం ప్రదర్శిస్తుంది సగం తెరిచిన తలుపు. శారీరకమైన వదులుతనం కన్న మానసికమైన వదులు తనం చాలా ప్రమాదకరం అంటుంది మనుషులు వదులవుతారు. వర్తమాన సమాజంలో అనైతిక మహా సంపదల పిరమిడ్ నిర్మాణాల అట్టడుగున శూన్యమేమిటో పిరమిడ్ దృశ్యీకరిస్తుంది. ఇవన్నీ శివశంకర్ ప్రత్యేక అన్వేషణలే. ఎంతవరకు ఫలించాయో కథా ప్రేమికులే చెప్పాలి.

బాహ్యప్రపంచమూ ఉంది; అంతఃప్రపంచమూ ఉంటుంది. ముప్పాతిక రచయితలు బాహ్య ప్రపంచావరణలోనే తచ్చాడు తుంటారు. సామాజిక సమస్యల్ని గుర్తించి, వాటిని విశ్లేషించటం, పరిష్కారాలు చూపించటం తమ పవిత్ర బాధ్యత అనుకుంటారు. నీతికీ, కళకీ మధ్య ఉండే సన్నని తెరని గమనించకపోవటమే ఇందుకు కారణం. అనేకానేక ఉద్యమాల ప్రభావాలు రచయితల్ని అట్లా ప్రేరేపిస్తూ వచ్చాయి. ఉద్యమాలకతీతమైన ప్రదేశాలు చాలా ఉన్నాయని నాకర్థమైంది. ఎన్నో ఖాళీల్ని పూరించాల్సి ఉంది. సామాజిక బాహ్యలోకమే కాదు; వైయక్తిక అంతర్లోకమూ వాస్తవమే. ఆ వాస్తవికతని కూడా దర్శించి ప్రదర్శించాలి. వస్తునిష్ఠ (Objectivity), వ్యక్తి నిష్ఠ (Subjectivity) రెండూ అవసరమే. కనుక శివశంకర్ సామాజిక సమస్యల గూర్చి రాసిన చేత్తోనే అంతరంగా సంక్షోభాల గూర్చి కూడా రాశాడు. చింతలతోపు గ్రామీణార్థిక సంక్షోభానికి ప్రతిబింబం. కొండచిలువ నూతన రాజధాని గ్రామాల సమస్యలకు ప్రతిరూపం. (మా ఊరు నెక్కల్లూ రాజధాని గ్రామమే). కాగా, వర్చువల్ రియాలిటీ, ఒక్క వాన కోసం సాఫ్ట్‌వేర్ మానవీ మానవుల అంతర్లోక సంక్లిష్టతకి ప్రతీకలు.

ఒక్కోసారి నా కథల్లో ఆబ్జెక్టివ్, సబ్జెక్టివ్ లక్షణాలు కలగలిసి పోతాయి. చింతలతోపు కథ కృష్ణమూర్తి అనే చిన్న పిల్లాడి వైపు నుంచి సబ్జెక్టివ్‌గా మొదలై గ్రామీణ సంక్షోభం వైపుగా ఆబ్జెక్టివ్‌గా పర్యవసిస్తుంది. వాడూ నేనూ ఏరూ కథ మధ్య వ్యసనంతో నాశనమైన స్నేహితుడితో మొదలై మొత్తం వ్యవస్థవైపు నడుస్తుంది. ఈ క్రమానికి భిన్నంగా మనుషులు వదులవుతారు కథ ఆబ్జెక్టివ్‌గా మొదలై సబ్జెక్టివ్‌గా ముగుస్తుంది.

గాఢమైన ప్రారంభాలు, ముగింపులు నాకిష్టం. వస్తు ప్రపంచంలో కథ, 'బాధలు ప్రపంచమంతటా ఉన్నాయి. హృదయాలు మాత్రం కొందరికే ఉన్నాయి,' అని మొదలవుతుంది. 'ప్రపంచమంతటా కుక్కపిల్లలున్నాయి. పాపలు మాత్రమే అరుదుగా ఉన్నారు,' అని ముగుస్తుంది. 'సముద్రాన్ని ఎక్కడ పారబొయ్యాలి?' అనే సంకేతాత్మక ప్రశ్నతో మొదలవుతుంది సముద్రం. 'కదిలే హృదయమున్నవాడు కన్నతల్లిని మర్చిపోలేడు'- ఇది మట్టిగుండె ప్రారంభం.

సంభాషణలు క్లుప్తంగా, సారవంతంగా ఉండాలనుకుంటా. అనవసరమైన ఒక్క మాటా అందులోఉండగూడదు. ఆ మాట కొస్తే కథ అంతా అనవసరమైన అదనపు వాక్యం ఒక్కటీ ఉండ రాదని నా నిశ్చయం. క్లుప్తతకి అత్యంత ప్రాధాన్యం ఇస్తాను. అయినా, *తుప్పు! తుప్పు!*, అపరాధి కథల్లో అనవసరమై పొడిగింపు ఉందని ఆలస్యంగా తెలుసుకున్నా. అపరాధి నా కథల్లో మిక్కిలి బలహీనమైందంటాడు మిత్రుడు పెనుగొండ లక్ష్మీనారాయణ.

ఏ కథైనా నా మనస్సులో ముందుగానే పూర్తి స్వరూపం పొందదు. మొదట అది కేవలం అస్థిపంజరంగానే ఉంటుంది. రాసే క్రమంలోనే దానికి రక్తమాంసాలు ఏర్పడతాయి. అంతే ఆ కథకు సంబంధించిన పాత్రల స్వరూపస్వభావాలు, సంఘటనలు, సన్నివేశాలు, ఆ మాటకొస్తే ముగింపులు ముందుగానే నా ఆలోచనల్లో స్థిరంగా ఉండవు. రాస్తూండగానే అనుకొన్నవి చాలా మారతాయి. ఒక్కోసారి కథంతా చెప్పాననుకున్నాక ఎట్లా ముగించాలో అర్థంగాదు. సగం తెరిచిన తలుపు కథలో అదే సమస్య ఎదురైంది. అందులో ముఖ్యపాత్ర సగం మూసిన తన గుండె తలుపు తెరుచుకుంటూ మనుషుల్తో, ప్రకృతితో, చివరికి తన నిసర్గ స్వభావంతో మమేకమవుతాడు. ఆ ప్రాసెస్ వర్ణించి నాక ఏం జెయ్యాలో తోచలా. ఆమైన వాణ్ణి దారి పక్క చెరువులో నగ్నంగా దూకించి, నా దారిన నేను పోయా. కథకి ఒక ముగింపు ఇవ్వాల్సి వస్తే అది సాధ్యమైనంత సూచనాత్మకంగా ఉండేట్టు చూస్తా. తర్వాత పాఠకుడు కొంత ఆలోచించాలి. 'స్వేచ్ఛా కథా వ్యవస్థ' అనే నా సూత్రీకరణ అదే. కథ ఓపెన్ ఎండెడ్‌గా ఉండాలి. క్లోజ్డ్ సిస్టమ్ మంచిది కాదు. ఈ ఆలోచనతోనే, 'గొప్ప రచయిత ఎప్పుడూ సగం రచయితే,' అని ప్రతిపాదించాను. మిగిలిన సగాన్ని తన ఆలోచనతో పాఠకుడు పూరించుకోవాలి. అంతా రచయితే చెప్పేస్తే అది 'మంచి' చెత్త కథ అని నా అభిప్రాయం.

కథల్లో ప్రయోగాలు చెయ్యటం నాకిష్టమే. అయితే ప్రయోగాల కోసం కథలు కాదు. వస్తువే ఆ రకమైన ప్రయోగాన్ని డిమాండ్ చేస్తుంది. నా ప్రయోగాలు పారిపోయిన కలతో మొదలయ్యాయి. సమాజంపట్ల అసంతృప్తి, అతి మానసిక ప్రవృత్తిగల యువకుడి కోణం నుంచి ఆ కథ అల్లబడింది. సమాజంలోని అసలైన అసంగతత్వం తెల్పటానికి 'అబ్సర్డ్' టెక్నిక్ తీసుకున్నాను. సమాజం, వ్యక్తులు ఉండాల్సిన విధంగా ఉండకపోవటమే అసంగతత్వం. సామాజిక చైతన్యంలేని వ్యాపార రచయితలు క్రమ క్రమంగా తుప్పుబట్టి పోవటం వాస్తవంగా చూపిస్తుంది *తుప్పు! తుప్పు!* కథ. ముక్కోణపు సంబంధాల్ని ముగ్గురు వ్యక్తుల స్వగతాలుగా చెప్పిన మనుషులు వదులవుతారు కథలో సంకేతాత్మక ప్రత్యేకత ఉందనుకుంటాను. చివరి పిచ్చిక కథలో ఒక రకమైన మేజికల్ రియలిజం. ఈమధ్య రాసిన పిరమిడ్ దృశ్యాలుగా కనబడుతుంది. కథ మొత్తం పిరమిడ్ తాలూకు సింబాలిజం ఆవరిస్తుంది. బహుశా నా కథలన్నిటిలో గొప్ప ప్రయోగం సముద్రం అనిపిస్తుంది. మునిషిలోని జ్ఞానానికి రూపకం సముద్రం. వ్యక్తుల మనోంతరాల్లో పోగుపడిన జ్ఞానసంపద కొనసాగింపు లేకుండా అంతరించిపోవటం ఎందుకనే ప్రశ్నే ఆ కథ. అది తర తరాల ప్రథమ, ఉత్తమ పురుష కథాకథన పద్ధతికి భిన్నంగా మధ్య పురుషలో సాగుతుంది. ఒక వ్యక్తి జ్ఞాపక శకలాలుగా సాగుతుంది. ఆ జ్ఞాపక శకలాలకు వరుస సంఖ్య ఇవ్వటం మరో విలక్షణత.

కవిత మాదిరే కథ గూడా సౌందర్యాత్మకంగా ఉండాలని నా భావన. ఎట్లా సౌందర్యవంతమవుతుంది కథ? ఆద్యంతాల ఏకతలో విశిష్టమైన ముగింపుతో, సాంద్రమైన సంభాషణలతో, సహజత్వంతో, కవితాత్మకతతో, విలక్షణ పాత్రచిత్రణతో, అన్నిటినీమించి రచయిత దార్శనికతతో ఒక కథ అందంగా రూపొందుతుంది. రవీంద్రుడి కాబూలీవాలా అందమైన కథ.

గొగోల్ ఓవర్ కోట్ అందమైన కథ. శ్రీపాద కలుపుమొక్కలు అందమైన కథ. అట్లా నా కథల్లో వస్తు ప్రపంచంలో, సగం తెరిచిన తలుపు, మనుషులు వదులవుతారు, చివరి పిచ్చిక, సముద్రం కథలు సౌందర్యాత్మకంగా రూపొందాయని భావిస్తాను. అందుకు కవితాత్మకత ఎక్కువ తోడ్పడిందేమో.

ఒక్కోసారి చదువు, సంస్కారాలు మనల్ని మనం కాకుండా చేస్తాయి. మరో మనుషులుగా మార్చిడి చేస్తాయి. అందువల్ల అప్పుడప్పుడు మనం పైపై పొరలన్నిటినీ తొలగించుకోవాలి. We have to unlearn . నా చదువు వల్ల నేను నా పల్లెటూరుతనానికి, నిసర్గతకి, సహజ భాషకి, స్థానీయతకీ దూరమయ్యానని ఆలస్యం గా తెలుసుకున్నాను. తెలుసుకున్నాక రచనల్లో మా ఊరికీ, ఊరి భాషకీ, జీవిత మూలాలకి తిరిగి దగ్గర కావటానికి ప్రయత్నించాను. ఆ స్థానీయతను కథల్లో పదిలపరచడానికి మాధవపెద్ది గోఖలే కథలు ఎంతగానో తోడ్పడ్డాయి. అట్లా మట్టిగుండె, చింతల తోపు, సగం తెరిచిన తలుపు కథల్లో గుంటూరు జీవద్భాషని, గ్రామీణతని పట్టుకోవటానికి సఫల ప్రయత్నం చేశాను.

వాదాల కోసమో, ఉద్యమాల కోసమో నేనెప్పుడూ నావికాని రచనలు చెయ్యలేదు. 'స్తబ్దత-చలనం' కవిత్వం మీద విప్లవోద్యమ ప్రభావం ఉంది. కొన్నాళ్లకి నేను తెలుసుకున్న సత్యమేమిటంటే లోపలుండాలిన పదార్థమేదో- అంతో ఇంతో- బయటి నుంచి అప్పు తెచ్చుకోవటం స్వతంత్రతను కోల్పోవటమే అని. మధ్య తరగతి మనస్తత్వంతో విప్లవ కవిత్వం రాయటం సరైన పద్ధతి కాదని, అందులో నాది కాని పదార్థమేదో ఉందని అర్థమైంది. కథల్లో ఆ పని చెయ్యలేదు. నేను మొదట రాసింది దళిత కథే- కలుపుమొక్కలు. అయితే అది నాకెంతో సన్నిహితుడైన మా పాలేరు చిన్నోడి కథే. కనుక అది నా కథే. అట్లాగే సుశీల, వస్తు ప్రపంచంలో, మనుషులు వదులవుతారు స్త్రీల పట్ల ప్రేమతో, వాళ్ల సమస్యల పట్ల సహానుభూతితో రాసినవి. స్త్రీ చైతన్యానికి అవి కొంత చేర్పు అవుతాయి. స్త్రీలపట్ల అమిత గౌరవం గల రచయిత గా ఇంతవరకు ఏ కథలోను నెగటివ్ ఛాయలు గల ఒక్క స్త్రీ పాత్రనీ సృష్టించలేకపోయాను.

వైయక్తిక, సామాజిక సమస్యల్ని చిత్రించేవే కథలు కావు. జీవిత తత్వాన్ని ఆవిష్కరించే లోతైన కథలు- తాత్విక కథలు కూడా రావాలని కోరుకుంటా. తత్వమంటే ఏదో వేదాంతం కాదు. జీవితాన్ని మౌలికంగా దర్శించటం, మౌలిక ప్రాతిపదికల్ని అన్వేషించి, ఆవిష్కరించటం, ఆ దారిలో సరళ రేఖలు వక్రరేఖలూ



పరిశీలించదగింది. పోతే, తెలుగువాళ్లకి ఎంతసేపటికీ సీరియస్‌నెస్ తప్ప హాస్యస్ఫూర్తి తక్కువని నా ఉద్దేశ్యం. కథాసాహితిలో పాతికేళ్లుగా మేం ప్రచురించిన 350పై చిలుకు కథల్లో ముప్పయ్యన్నా హాస్య కథలు లేవు. ఈ ఆలోచనతోనే *తుప్పు!తుప్పు!, అనగానేమి?* కథలు రాశా.

కవిత్వం చేసే ఒకానొక పని మానవానుభూతుల్ని నిర్మలీకరించటం. అట్లాగే కథ చేసే ఒకానొక మంచి పని మానవాలోచనల్ని నిర్మలీకరించటం. అందువల్లనే ఉత్తమ రచనల్ని చదివినప్పుడు మన అంతరంగం అంతో ఇంతో శుభ్రపడుతుంది. కథారచనలో నా అనుభవం ఏమిటంటే ఆయా మానవ ప్రవృత్తుల్ని విశ్లేషించే క్రమంలో, వాటికొక దారితెన్ను ఏర్పరిచే క్రమంలో నా అంతరంగం కూడా ఏదో ఒక మేరకు నిర్మలీకరించబడటం. ప్రతి కవితా ముగిసినాక, ప్రతి కథా ముగిసినాక నేను అంతకుముందు కన్న ప్రక్షాళితం అవుతున్న సంగతి గమనించాను. అంతిమంగా ప్రపంచాన్ని మరింత ప్రేమించగలగటం అది. శ్రీశ్రీ 'కవితా! ఓ కవితా!'లో 'ప్రక్షాళిత మామక పాప పరంపర' అనే గొప్ప సత్యం అనుభవపూర్వకంగా చెప్పాడు. పఠన క్రమంలో, రచనాక్రమంలో సాహిత్యం నా ఆత్మోన్నతికి నేనెన్నుకున్న సాధనం అని అర్థమైంది. లోకాన్నేదో ఉద్ధరించటం లేదు; నన్ను నేను ఉద్ధరించుకోవటం ఇది. బహుశ ఈ రెండో క్రమం అందురు రచయితలకీ అనుభవం కాకపోవచ్చు. రచనాక్రమంలో నేను మరింత మంచి మనిషిగా రూపొందిన మాట వాస్తవం.

మొత్తం మీద నీ కథల సారాంశమేదో చెప్పగలవా అని ఈ 'శివశంకర్'గా నేనే అడుగుతా. అతనిట్లా చెబుతాడు. మనిషి మీద ధనం, అధికారం, అబద్ధం, అహంకారం, ద్రోహం, అసూయ, నిర్దయ-ఎన్నెన్నో పొరలు పేరుకుపోయాయి. జీవితంలోని ఈ అసహజత్వ నిరాకరణే శివశంకర్ సాహిత్య సారాంశం.

కథ, కవిత్వం, విమర్శ, సంపాదకత్వం- ఇలా అన్ని రచనా ప్రక్రియల్లో అందవేసిన చేయి పాపినేని శివశంకర్. నాలుగు కవితాసంపుటాలు, రెండు కథాసంపుటాలు, మూడు వ్యాససంపుటాలు ప్రచురించారు. కథాసాహితి సహ సంపాదకులు. ఇటీవలే వీరి కవితాసంపుటి 'రజనీగంధ'కు ప్రతిష్టాత్మక కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కారం లభించింది. నివాసం గుంటూరు. 2017 తానా సభల అతిథి.

email: papineni22@gmail.com



మంచి అభిరుచిని మనమే సృష్టించాలి!

మోహనకృష్ణ ఇంద్రగంటి

సామాజిక స్పృహతో సినిమా తీయడమంటే ఆర్ట్ సినిమా అనే దురభిప్రాయం ఉంది. అది సరికాదు. సామాజిక స్పృహ అంటే ప్రతి సినిమాలోనూ మీరు ఏదో సోషల్ ఇష్యూ తీసుకొని దాని గురించి ఉపన్యాసాలు దంచమని కాదు. ఎందుకంటే ఉపన్యాసాలకి సినిమా వేదిక కాదు, సినిమా అనేది ఒక కళారూపం. నవలకీ వ్యాసానికీ ఎంత తేడా ఉందో సినిమాకీ ప్రచార కరపత్రానికీ అంతే తేడా ఉంది!

నా దృష్టిలో అతి తక్కువ సాహిత్యంతో సంబంధం వున్న రంగం సినిమా రంగం.

ఈరోజుల్లో సినిమాకీ సాహిత్యానికీ అతి తక్కువ సంబంధం వుంది. ఉండాల్సిన లింక్ ఎప్పుడో తెగిపోయింది. అది ఎందుకు తెగింది అనేది మనం కాస్త ఆలోచించాల్సిన విషయం, చర్చించాల్సిన విషయం. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, చదువుకొని మంచి మంచి సినిమాలు, కొత్త రకమైన సినిమాలు తియ్యాలని, మంచి కథలని సాహిత్యం నుంచి ఆడాప్ట్ చెయ్యాలి అనే ఆదర్శాలతో వచ్చిన నాకు విచిత్రమైన పరిస్థితులు ఎదురయ్యేవి. 'నేను ఎం.ఏ లిటరేచర్ చేశానండీ, ఎం.ఫిల్ చదివానండీ, ఎం.ఎఫ్.ఏ ఫిల్మ్ మేకింగ్‌లో చేశానండీ,' అని చెప్తే చాలామంది నాతో, 'అదేంటండీ ఇంత చదువుకొని మీరు సినిమాల్లోకి ఎందుకొచ్చారు?' అని అడిగేవారు. ఆ ప్రశ్నకు నాకు నవ్వు వచ్చేది.

ఏ ఎం.బి.ఏ చదువుకుంటేనో, ఐ.ఐ.టి చదువుకుంటేనో, ఇంత చదువుకొని ఇంజనీర్లు ఎందుకవుతున్నారండీ, బిజినెస్ ఎందుకు చేస్తున్నారండీ అని బహుశా వారు అడగరేమో ! కానీ 'చదువుకొని సినిమాల్లోకి ఎందుకొచ్చారు?' అని చాలాకాలంగా ఒక ప్రశ్న ఉండేది. కొంతమంది 'మా అబ్బాయి ఎందులోనూ పనికి రావట్లేదండీ, కొంచం మీ దగ్గర పెట్టుకోండి అసిస్టెంట్ డైరెక్టర్ కింద,' అని అడుగుతూ ఉంటారు. ఇలా 'ఎందుకూ పనిరానివాళ్లు సినిమాల్లోకి రావచ్చు, సినిమాలకి చదువు అక్కర్లేదు,' అని ఒక ఇంప్రెషన్ ఏర్పడిపోయింది.

ఇంకా చెప్పాలంటే సినిమా తాలూకు సృజనాత్మకతకి చదువు అక్కర్లేదు, ఒకరకమైన ఆర్టిస్టిక్ మైండ్ ఉంటే సరిపోతుంది' అనే దురభిప్రాయం చాలా కాలంగా సినిమా రంగంలో ఉంది. అయితే ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సింది ఏంటంటే డిగ్రీలకీ సృజనాత్మకతకీ, అంతర్గత సంస్కారానికీ సంబంధం లేదు. మీకొక ఎం.బి.ఏ ఉండడం వల్ల ఎం.ఏ ఉండడం వల్ల లేదా ఐ.ఐ.టి.లో ఏదో డిగ్రీ ఉండడం వల్ల అద్భుతమైన సినిమాలు మీరు తీస్తారని గ్యారంటీ లేదు, అలా అని చెప్పి ఏమీ చదువుకోనివాళ్లు బాగా తీయలేరు అని కూడా లేదు. ఈ పొజిబిలిటీలో నుంచి 'చదువు అక్కర్లేదు' అనే ఒక దురభిప్రాయం పుట్టింది.

విదేశాలకి వెళ్లి చదువుకున్న వాళ్లకి కూడా సాంస్కృతిక విద్య లేకపోవచ్చు. సాహిత్యం గురించి కానీ ఇతర కళల గురించి కానీ ఒక అవగాహన లేకపోవడం, ఆ కళలన్నింటినీ ఎలాగ రంగరిస్తే వాటిలో నుంచి సినిమా అనేది పుడుతుంది అనే విషయాలను ఒక సాంస్కృతికమైన, సామాజికమైన దృష్టిలో నుంచి అర్థం చేసుకొనే సామర్థ్యం లేకపోవడం వల్ల మంచి సినిమా పుట్టదు. దానికీ పెద్ద పెద్ద డిగ్రీలు చదవడానికీ సంబంధం లేదు.

ముఖ్యంగా గత ఇరవై ముప్పై యేళ్లుగా సాహిత్యానికీ సినిమాకీ వున్న సంబంధం తెగిపోవడం వలన మనకి ఒక విధమైన భావదారిద్ర్యం బాగా పెరిగిందని చెప్పొచ్చు. కేవలం సాహిత్యానికీ సినిమాకే కాదు, అసలు జీవితానికీ సాహిత్యానికీ కూడా సంబంధం తగ్గుతూ వచ్చింది. దానికి కొన్ని ప్రధానమైన కారణాలు ఉన్నాయి. సమాజంలోని కళల స్థాయిని బట్టి ఆ సమాజం యొక్క సంస్కృతీ స్థాయిని గుర్తించవచ్చు. అదే కొలమానం అనీ చెప్పొచ్చు . ఒక సాహితీ వాతావరణంతో పాటూ ఇతర కళలు- సంగీతం, చిత్రకళ, నృత్యం, జానపద కళలు- వీటన్నిటికీ, ఆర్థిక, రాజకీయ సామాజిక పరిస్థితులకీ మధ్య ఉండే అవినాభావ సంబంధంలో నుంచి ఒక సాంస్కృతిక వాతావరణం పుడుతుంది. ఆ వాతావరణంలోని చైతన్యమూ, ఆ వాతావరణం సృష్టించే శక్తి నుంచి కళలు తిరిగి తమని తాము పరిపుష్టం చేసుకోగలుగుతాయి. ఇదొక సైకిల్‌లాగా కొనసాగుతుంది.

ఎనభైల నుంచి మన తెలుగు రాష్ట్రాల్లో హ్యూమానిటీస్‌ని సోషల్ సైన్సెస్‌ని స్కూళ్లలోను, కాలేజీ విద్యలోనూ దాదాపుగా లేకుండా చేశాం. అంటే సాహిత్యం, కళలు, చరిత్ర, రాజనీతిశాస్త్రం, సోషియాలజీ, యాంత్రోపాలజీ మనం చదవక్కర్లేదనీ, ఇవన్నీ ఎందుకూ పనికిరానివాళ్లు చదివే సబ్జెక్ట్స్ అనే దురభిప్రాయాన్ని ఏర్పరచాం. పాశ్చాత్య దేశాల్లోని యూనివర్శిటీల్లో ఏవైతే విషయాలను బాగా ఆదరిస్తారో, వాటిని మన ప్రభుత్వాలు అనవసరం అని భావించి అవతలపడేశాయి. కంప్యూటర్ సైన్స్, ఎం.బి.ఏ, సి.ఎ. వంటి చదువులే చదువులని, వెంటనే ఉద్యోగం వచ్చే చదువే ముఖ్యమనీ, మిగతావన్నీ కాలక్షేపం కోసమేనన్న అభిప్రాయానికి సమాజాన్ని తీసుకొచ్చేశాము. కాబట్టి, 'ముందు మంచి ఉద్యోగం చేయండి, ఆ తర్వాత కాలక్షేపం కోసం కథలు రాసుకోండి, పెయింటింగ్ వేసుకోండి, నాటకాలు ఆడుకోండి ఫర్వాలేదు,' అనే ఒక అభిప్రాయం బలపడిపోయింది. ఇలా కళలకు ఆఖరి స్థానం ఇవ్వడంవల్ల సమాజం పట్ల, సాహిత్యం పట్ల అవగాహన కొరవడింది. నిజానికి వ్యక్తులకీ వ్యక్తులకీ సమాజానికీ మధ్య వారధి సాహిత్యమూ, కళలూ మాత్రమే.

మన ప్రపంచాన్ని మనం అర్థం చేసుకోవడానికి ఈ కళలన్నీ ఉపయోగపడతాయి. ఎప్పుడైతే ఆ సంబంధం తెగిపోయిందో, ఎప్పుడైతే ఆ విలువలు మెటీరియలిజం, ఇండివిడ్యువలిజం ద్వారా

కబళించబడ్డాయో, అప్పుడు జీవితానికీ సాహిత్యానికీ మధ్య ఒక రప్చర్ వచ్చేసింది. అది సినిమారంగానికి కూడా పాకింది. దానితో మన సినిమారంగం పూర్తిగా వ్యాపారాత్మకమైన సినిమావైపు వెళ్లిపోయింది. ఇప్పుడు సినిమా అంటే కేవలం పక్కా వ్యాపారం. 'ఏది అతి త్వరగా, అతి తక్కువ శ్రమతో, అత్యంత ఎక్కువ డబ్బులు సంపాదించగలదో అది సినిమా,' అని ఒక అభిప్రాయం ఏర్పడింది. 'ప్రేక్షకులు చూస్తున్నారు కాబట్టి మేము తీస్తున్నామండీ' అనే ఆర్గ్యుమెంట్ నా దృష్టిలో తప్పు. ఎందుకంటే ప్రేక్షకుడికి ఒక అజెండా ఉండదు, వాళ్లు చూపించిందే చూస్తారు. పదే పదే చూపించిందే వాళ్ల అభిరుచి కింద మారుతుంది. కాబట్టి ఈ అభిరుచిని సృష్టించేది కళాకారులు. ఆ అభిరుచిని సృష్టించే కళాకారుల అంతర్గత సంస్కారం మళ్లీ ఈ సమాజం యొక్క సాంస్కృతిక స్థాయి మీద ఆధారపడి ఉంటుంది. సో, ఇట్స్ లైక్ ఎ సైకిల్!

సామాజిక స్పృహతో సినిమా తీయడమంటే ఆర్ట్ సినిమా అనే దురభిప్రాయం ఉంది. అది సరికాదు. సామాజిక స్పృహ అంటే ప్రతి సినిమాలోనూ మీరు ఏదో సోషల్ ఇష్యూ తీసుకొని దాని గురించి ఉపన్యాసాలు దంచమని కాదు. ఎందుకంటే ఉపన్యాసాలకి సినిమా వేదిక కాదు, సినిమా అనేది ఒక కళారూపం. నవలకీ వ్యాసానికీ ఎంత తేడా ఉందో సినిమాకీ ప్రచార కరపత్రానికీ అంతే తేడా ఉంది!

తన చుట్టూ ఉన్న సాంస్కృతిక రాజకీయ ఆర్థిక వాతావరణాన్ని జీర్ణించుకొని తన సృజనాత్మకతలో నుంచి వడకట్టి తన కళారూపం ద్వారా జీవితానుభవాన్ని వ్యక్తపరచడం అనేది కళాకారులు చేసే పని. అది పెయింటింగ్ ద్వారా అవొచ్చు. సినిమా అవొచ్చు, నాటకం కావొచ్చు, పాట రాయడం కావొచ్చు, కవిత రాయడం కావొచ్చు!

దీనికి సాంస్కృతిక వాతావరణం ఆలంబనగా ఉండాలి. అలా లేనప్పుడు, ఈ అన్ని రంగాల మధ్య సంబంధం లేనప్పుడు ఆరోగ్యకరమైన, అర్థవంతమైన కళ పుట్టే అవకాశం చాలా తక్కువ వుంటుంది. సినిమాకీ సాహిత్యానికీ మధ్యలో అదే జరిగింది. ఆ రప్చర్ రావడం వలన ఉత్తేజపూరితమైన సాంస్కృతిక వాతావరణం నుంచి మంచి సినిమాలు పుట్టే అవకాశం లేకుండాపోయింది.

ఎప్పుడైతే టెలివిజన్ వచ్చి చదవడాన్ని చంపేసిందో, సినిమా వ్యాపారాత్మకం అయిందో అప్పుడే సాహిత్యానికీ జీవితానికీ సంబంధం తెగిపోయింది. బి.ఎన్ రెడ్డిగారి, కె.వి. రెడ్డిగారి కాలంలో గొప్ప గొప్ప రచయితలు సినిమారంగంలో పని శారు. పాలగుమ్మి పద్మరాజుగారు, కృష్ణ శాస్త్రిగారు, శ్రీశ్రీగారు, డి.వి. నరసరాజు గారు వంటి రచయితలు సాహిత్యాన్ని చదువుకున్నారు, సాహిత్యం నుంచి కథల్ని ఆడాప్ట్ చేశారు. ఆనాడు వాళ్లే సినిమా రచయితలు కూడా.

కె.వి. రెడ్డిగారి 'పెద్దమనుషులు' హెన్రిక్ ఇబ్సెన్ రాసిన 'పిల్లర్స్ ఆఫ్ సొసైటి' అనే నాటకం నుంచి స్ఫూర్తి పొంది రాసిన స్క్రిప్ట్ అనీ, అలాగే మల్లీశ్వరి బుచ్చిబాబుగారి 'రాయలవారి కరుణ కృత్యం' స్ఫూర్తితో తీశారని చాలామందికి తెలీదు. జార్జి ఇలియట్ రాసిన సైలస్ మార్నర్ అనే ఆంగ్ల నవలని బి.ఎన్. రెడ్డి గారు అడాప్ట్ చేసి, బంగారుపాప సినిమా తీశారు. మన కన్యా శుల్కం నాటకం ఎలాగూ ఉంది. ఎంతోమంది గొప్ప రచయితలు, రచయిత్రులు ఉన్న మన తెలుగు సాహిత్యం నుంచి కథలను సినిమాలకు ఎందుకు అడాప్ట్ చేయట్లేదు అనేది నాకు ఎప్పుడూ ఆశ్చర్యం కలిగించే విషయం.

నా దృష్టిలో బెంగాల్‌లో టాగోర్ ఎంత పెద్ద రచయితో తెలుగులో చలం కూడా అంత పెద్ద రచయిత. అలాంటి రచయిత కథల్లో నుంచి ఒక్క కథని కూడా మనం అడాప్ట్ చేయలేదు ఇప్పటి వరకూ. 2004లో 'దోషగుణం' కథకి రైట్స్ తీసుకోవడానికి వెళ్లినప్పుడు చలంగారి కూతురు సౌరీస్‌గారు ఆశ్చర్యపోయారు.

చలంగారే కాదు మీరు ఏ రచయితనైనా తీసుకోండి. కొడవటిగంటి కుటుంబరావుగారు, బుచ్చిబాబు, తిలక్, రావిశాస్త్రి, కాళీపట్నం రామారావు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, సమకాలీన రచయితల్లో గోపిని కరుణాకర్, మహమ్మద్ ఖదీర్‌బాబు- ఇలా చాలామంది రచయితల కథలని మనం అడాప్ట్ చేసుకొని వాటిని సినిమాలుగా తీయగలిగే అవకాశం ఉంది. లేదా ఆ రచయితలకి సినిమారంగంతో ఒక విధమైన లింక్ ఏర్పడితే సినిమారంగపు ఆలోచనాధోరణి మారే అవకాశం ఎక్కువ ఉంది. డెబ్భైల్లో ఎనభైల్లో పాపులర్ సాహిత్యం నుంచే మన సినిమాలు వచ్చాయి. యద్దనపూడి సులోచనారాణి, మాదిరెడ్డి సులోచన, కోడూరు కౌసల్యాదేవి, ఆర్.సంధ్యాదేవి, యండమూరి వీరేంద్రనాథ్, మల్లాది వెంకట కృష్ణమూర్తి- ఇలా వీళ్లందరి నవలలు సినిమాలుగా తీసినప్పుడు అవన్నీ విజయవంతమయ్యాయి.

రాను రాను ఎనభైల కొచ్చేసరికి స్కూళ్లలో తెలుగు చదువుకోవడం తగ్గింది. ఇంగ్లీష్ మీడియం పిచ్చి వ్యాపించింది. నెమ్మదిగా టెలివిజన్ వచ్చింది. సీరియళ్లు పెరిగాయి. చదవడం అనే అలవాటు పక్కకి వెళ్లిపోయింది. తర్వాత ఈ సాంకేతిక విప్లవంలో వీడియో గేములు, ఫేసుబుక్కులూ, ట్విట్టర్లూ ఎక్కువై పోయి మనకి ఏకాంతంలో పుస్తకం చదవడం, ఒక పెయింటింగ్‌ని ఆస్వాదించడం లేదా ఒక నాటకాన్ని చూడడమో, నృత్య ప్రదర్శ

నని చూడడమో వంటి అలవాట్లన్నీ పోయాయి. నెమ్మదిగా సమాజం నుంచే కనుమరుగవుతున్నాయి. ఆ స్థానాన్ని పూర్తిగా సినిమా, టెలివిజనూ ఆక్రమించుకున్నాయి. పోనీ అలా అనుకున్నా సాహిత్యం నుంచి సినిమాలు తీస్తున్నారా, లేదా సాహితీ విలువలు సినిమాల్లో మనకేమన్నా కనబడుతున్నాయా అంటే లేదనే సమాధానం వస్తుంది.

మరొక విచిత్రం స్థితి ఏమిటంటే సాహిత్యం అనేది ఎంత కనబడకుండా ఉంటే సినిమాకి అంత మంచిది అన్న అభిప్రాయం కూడా కలిగినవాళ్లు, చెప్పినవాళ్లూ సినిమారంగంలో కొంతమంది ఉన్నారు. 'సాహితీ విలువలు అనవసరమండీ సినిమా కథకి', 'సినిమా కథ వేరు, దాన్ని నిర్మించే విధానం వేరు' ఇలాంటి అభిప్రాయాలు చాలానే ఉన్నాయి. సినిమా కథని నిర్మించే విధానం వేరన్నదానిలో కొంత వరకూ నిజముంది కానీ దానిని సాహిత్యం నుంచి దూరంగా నెట్టేయాల్సిన అవసరం ఉందనేది మాత్రం చాలా చాలా తప్పుడు అభిప్రాయం. సాహితీ విలువలతో కూడిన ఒక వాక్యం, సంభాషణ, పాట వంటివి సినిమాల్లో కొరవడ్డాయి. ఇవన్నీ కమర్షియల్‌గా సాధ్యం కాదు అనే ఒక అభిప్రాయం కూడా ప్రబలంగా ఉంది. సాహితీ విలువలు అనేది ఒక నెగెటివ్ క్వాలిటీ అయిపోవడం వలన కూడా మనకి ఉన్నతమైన స్థాయిలో ఉండే సినిమాలు రావట్లేదు.

మనం ఏ జోనర్ తీసినా- హారర్, పొలిటికల్ థ్రిల్లర్స్, రొమాంటిక్ థ్రిల్లర్స్, ఫార్సికల్ కామెడీ, మర్డర్ మిస్టరీస్- ఇలా ఏదైనా సినిమా ఏ రకం అనేదానికి సంబంధం లేకుండా సాహితీ విలువలు ఉండొచ్చు. ఆగథా క్రిస్టీ మర్డర్ మిస్టరీస్ రాసింది కానీ గొప్ప సాహితీ విలువలు దానిలో ఉంటాయి. ఆర్థర్ కానన్ డాయల్ రాసిన 'షెర్లాక్ హోమ్స్' గొప్ప రచన. అలాగే పి.జి.ఉ డ్ హౌస్ రాసిన హాస్యంలో గొప్ప రచన ఉంటుంది. సో, సాహిత్యానికీ జోనర్‌కీ సంబంధం లేదు. అలాగే సినిమా ఏ జోనర్‌లో మీరు తీసినా

దాన్లో గొప్ప సాహితీ విలువలు చూపించగలిగే ఎబిలిటీ మన కుండాలి.

ఇప్పుడు కూడా తమిళంలో, మళయాళంలో, కన్నడలో కొంతవరకూ, హిందీలో సాహిత్యం నుంచి కథలు తీసుకొని వాళ్లు సినిమాలు తీస్తున్నారు. మనకు అది లేదు, ఎందుకు లేదు? ఎందుకంటే సినిమాలు తీసే చాలామందికి సాహిత్యం అసలు తెలీదు. గొప్ప రచయితలు ఎవరని వాళ్లని అడగండి వాళ్లకి తెలీదు. సమకాలీన సాహిత్యం, గొప్ప పుస్తకాలూ, క్లాసికల్ లిటరేచర్ చదువుతారా అంటే అసలు లేరని మనం అనలేం కానీ కొద్దిమందే ఉన్నారు. వేరే భాషల సినిమాలు చూసి మనం ఆ ఐడియాలను ఎలా తీసుకోవాలి అని చూస్తున్నామే తప్ప, సాహిత్యం నుంచి ఏవైనా మంచి కథలు తీసుకోవచ్చా అని చూడట్లేదు. అది ట్రెడిషినల్ లిటరేచర్ అవ్వొచ్చు లేదా సమకాలీన సాహిత్యం కావొచ్చు. అసలు ఆ పోకడలు లేకపోవడం వల్ల ఇప్పుడు మనకు ఈ పరిస్థితి వచ్చిందని నేను అనుకుంటున్నాను.

ఐజన్‌స్టైయిన్ అనే గొప్ప ఫిల్మ్ డైరెక్టర్ సినిమాల్లోకి వచ్చిన కొన్ని టెక్నిక్స్ సాహిత్యం నుంచి వచ్చాయి అని రాశాడు. డి.డబ్ల్యు. గ్రిఫిత్ పార్లెల్ కటింగ్ అనేది కనిపెట్టాడు. అంటే ఒక సన్నివేశం జరుగుతుండగా వేరే ఒక సన్నివేశాన్ని దానితోపాటూ చూపించడం. ఇప్పుడు మన సినిమాల్లో మనకు ఇది బాగా అలవాటైపోయింది. ఉదాహరణకి హీరోయిన్‌ని కిడ్నాప్ చేసుకొని తీసుకొని వెళ్లిపోతూ ఉంటారు, అక్కడ హీరోకి ఆ విషయం తెలిసి బయల్దేరుతాడు. సో, ఇక్కడ ఇది కొంత అది కొంత చూపించడం ద్వారా కథలో టెంపోని, ప్రేక్షకుల్లో ఆసక్తిని టెన్షన్‌ని పెంచే టెక్నిక్ పార్లల్ కటింగ్. అది నిజానికి చార్ల్స్ డికెన్స్ నుంచీ బహుశా గ్రిఫిత్ నేర్చుకున్నాడేమో అని ఐజన్‌స్టైయిన్ ప్రతిపాదించాడు. ఎందుకంటే డికెన్స్ రాసిన శైలిలో అది ఉంది. దానికొక ఉదాహరణ కూడా ఇస్తాడు ఆ వ్యాసంలో. వంటింట్లో కెటిల్‌లో నీళ్లు మరుగుతూ ఉంటాయి, బయట ఒక సంభాషణ జరుగుతూ ఉంటుంది. వేరే గదిలో జరిగే సంభాషణకీ అక్కడ కెటిల్‌లో నీళ్లు మరగడానికీ మధ్యలో ఇంటర్ కట్ చేస్తూ ఉంటాడు డికెన్స్. అదే సినిమా ఆడాప్ట్ చేసుకుంది అని ఐజన్‌స్టైయిన్ అన్నాడు.

సినిమా అన్ని కళల యొక్క సమాగమం. అంటే పెయింటింగ్, సాహిత్యం, ఫోటోగ్రఫీ, సంగీతం, నృత్యం, డ్రామా ఇవన్నీ కలిసి సినిమా తయారయ్యింది. కేవలం సాహిత్యమే కాదు వీట

న్నింటిలో దేని నుంచి లింక్ తెగిపోయినా సినిమా పుష్టిగా ఉండే అవకాశం లేదు. అయితే సినిమాలో సాహిత్యం ఎక్కువ ప్రధాన పాత్ర పోషిస్తుంది. అది స్క్రీన్ ప్లే కానివ్వండి, డైలాగులు కానివ్వండి, కథ పరంగా కానివ్వండి- ఎప్పుడైతే ఆ పాత్ర లేదో సినిమా కళ క్రమంగా క్షీణించిపోతుంది.

తమిళంలోను, మలయాళంలోను ఫిల్మ్ మేకర్స్ పనిగట్టుకొని దాన్ని బాగుచేసే పని చేస్తున్నారు. మళ్లీ అలాంటి ఒక స్ఫూర్తితో యువ దర్శకులు రచయితలూ ముందుకొచ్చి తెలుగులో పూనుకుని ఆ గాప్‌ని పూడ్చితే తప్ప మనకి అర్థవంతమైన, ఆరోగ్యవంతమైన సినిమాలు వస్తాయని నేను అనుకోవట్లేదు.

ఇప్పుడు తక్షణ అవసరం ఏమిటంటే, సినిమారంగంలో సాహితీ విలువలున్న సినిమాలని మనం వృద్ధి చెందేలా చెయ్యాలి. సాహిత్యానికీ సినిమాకీ నా దృష్టిలో ఒక ఇరవై యేళ్లుగా తెగిపోయిన లింక్‌ని మళ్లీ పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని నేను భావిస్తున్నాను.

హనుమత్ శాస్త్రి, శ్రీకాంతశర్మ వంటి సాహిత్యకారుల కుటుంబం నుంచి వచ్చిన ఇంద్రగంటి మోహనకృష్ణ కొత్త తరం దర్శకుల్లో ఒకరు. సాహిత్యానికి, సినిమాకి ఉన్న సంబంధాన్ని కొనసాగిస్తున్న అతికొద్దిమంది దర్శకుల్లో ఒకరు. గ్రహణం, అష్టాచమ్మా, గోల్కొండ హైస్కూల్, జంటిల్‌మన్ వంటి సినిమాలకు దర్శకులు. నివాసం హైదరాబాద్.

email: mokris@gmail.com

ఒక వెలుగు ముచ్చట

పన్నాల సుబ్రహ్మణ్య భట్టు

సంగీత శ్రవణం కంటకప్రాయం కాదని జీవితమంతా తానే ఒక పాటై వెన్నెలబాటను సిద్ధంచేశారు. ఎంతోమంది యువశ్రోతలకు కీర్తనల కావల, సంగీతానికి ఆవల ఒక ఎరుకను, మత్తును ఇవ్వగలిగారు. అది చాలు. సంగీతం తోనే జీవించినవారు చాలామంది ఉన్నారు. సంగీతం కోసమే బ్రతికి, సంగీతానికి ఆవల ఉన్న మౌనగీతం కోసం వెతుకులాడినవారు బాలమురళి ఒక్కరే. అందుకే ఆయన వేలాది శ్రోతలకు అంత సమీపబంధువు కాగలిగారు.

ప్రదర్శన కళల చరిత్ర చాలా చిత్రమైంది. సంగీత ప్రదర్శనలో బాలమురళిది ఒక అపూర్వమైన స్థానం. ఒక్కొక్క కళకి ఒకొక్కరు వచ్చి అనుభవించి, సాధించి, శ్రోతలని మైమరిపించి వెళ్లిపోతూ ఉంటారు. అలా వెళ్లిపోయిన వారంతా మొదలుపెట్టిన నాటి నుండి చివరిదాకా శ్రోతల స్మృతిపథంలో మెరుస్తూనే ఉండేవారు అరుదు. కర్నాటక సంగీతం వినే విశాల ప్రపంచంలో బాలమురళీకృష్ణ అలాటి అరుదైన కళాకారులలో మొదటివాడు, చివరివాడూ కావచ్చు.

ఆయన సంగీతం వింటున్నప్పుడూ, విననప్పుడూ కూడా విన్న వారందరికీ- రసికులకి, అరసికులకీ, పెద్ద విద్వాంసులకీ చిట్టి చిలకలకీ ఆయన ఒక 'కాంషియన్స్'గా నిలిచారు. - ఒక వీడని 'హృదయపు ఎరుక'గా నిలిచారు. మేలుబంతి విద్వాంసులకి చిత్రమైన కల్పనతో కూడిన, ఎవరూ అక్కడ ఇది వరకు సంచరించని బుద్ధిగత హృదయపు ఎరుకగా కనబడ్డారు. అందుకే ఆయన ముందుతరం విద్వాంసులకీ, ప్రక్కవాయిద్యాలవారికీ ఆయన పట్ల అంత సంగీత గౌరవం కుదిరింది. సరే మామూలు సంగీత అభిమానులకి ఆయన గొంతు సవరించుకొనడం నుండి తిల్లానా వరకు ఆనంద మంగళ స్నానమే. ఆయన కచేరీ ఆరంభం కాక మునుపే సభామందిరం నిండిపోతుంది. చంటి పిల్లల్ని ఎత్తుకుంటూ, నిలబడుతూ కచేరీ వినే దంపతులకి లెక్కే ఉండదు. ఆయన మందిరం విడిచి వెళ్లేదాకా ఆ శ్రోతలు అలాగే ఉంటారు. అంతకు ముందు ఎవరి కచేరీ వినని శ్రోత కూడా, బాలమురళి కచేరీ వినకుండా ఉండడు. పండుగకి వచ్చిన కొత్త అల్లుడికి, కూతురికీ ఆయన కచేరీ ఒక పిక్నిక్ స్పాట్. మామగారిచ్చే సాంస్కృతిక మర్యాద. కచేరీలు వినడం తగ్గించుకున్న మోకాళ్ల ముసలి శ్రోతలకి చివరి కోరిక.

సినిమాలకి అభిమానుల సంఖ్య తగ్గిందేమో కాని, బాలమురళికి అభిమానుల సంఖ్య పెరుగుతూనే నడిచింది. అదీ బాలమురళి పవర్. ఆయన ఆకర్షణకి మొదలే కాని, అంతూ, చివర లేదు. అదే ఆయనకి జీవించిన కాలమంతా పట్టిన అదృష్టం. ఎన్నిసార్లు విన్నా, ఇన్నివేల మంది ఇంకా వినాలని

కోరుకుంటూనే వుంటారు. అదీ ఆయన శ్రోతలందరికీ తన పాట ద్వారా బదిలీ చేసిన సంగీత భావానుభవ స్మరణ. ఈ బదిలీ చేయగలగటంలోనే ఉన్నది రహస్యం. అనేక మంది విద్వాంసులు దక్షిణాది ప్రాంతాలలో పాడినంతసేపూ ఈ శాస్త్రంలోని కీలక రుచులనీ, పాటలోని నాదానుభవాన్ని, రాగంలోని రంజక గుణాన్ని బదిలీ చేస్తూనే వచ్చారు. అందుకే గొప్పవారయ్యారు. కాని శ్రోత లని కలుపుకొని తన అనుభవాన్ని శ్రోతలకి సతతం అలా బదిలీ చేయగలిగిన వ్యక్తి ఒక్క బాలమురళే. కొన్ని రాగాలు తన అనుభవాన్ని అందించలేకపోతే, అలా అందించే సాహిత్యాలని రాసుకున్నాడు. పాడుకున్నాడు. శ్రోతలకందించాడు. విన్న శ్రోతలు ప్రతిమాట, ప్రతి సంగీతపు పోటూ, దాటూ, నోటూ విని ఆనందించారు.

ఆయనను ప్రత్యేక వ్యక్తిగా నిలబెట్టింది- సాహిత్య భావాననుస్మరణని ప్రేక్షకులకు బదిలీ చేయడంలో ఆయన కొనసాగించిన విలక్షణ రీతి. దానికి ఆయన ఎంచుకున్నది మొదటినుండీ అలవాటయిన లలిత సంగీత రచనా ప్రసరణ ధర్మం. దీనికి మూలబీజాలు రెండు. 'కనిపించునా గతము నాలో...' అనే లలితగీతం. శివరామారావుగారి పాటనుకుంటాను నేను మొదటి రోజులలో రేడియోలో పాడిన తొలిపాట' అని నాకు పాడి వినిపించారు. రెండోది ఆ వరుసలో అని కాదు రజనిగారు మద్రాసులో రికార్డుచేసి పాడినది మళ్లీ బాలమురళి, గోపాలరత్నం చేత పాడించారు. 'మన ప్రేమ....సత్యసౌందర్య సీమలలో ప్రభవించి ప్రభవించి' అని వస్తుంది. 'కల్లోలినీ తరంగములన్ ' అని ఇంకో విడుతగా పదం ముప్పిరిగొంటుంది.

వందలాది గీతాలు ఆ తరువాత వచ్చినవి సరేసరి. ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో ఆయన లలిత సంగీత ప్రయోక్తగా పని చేసినప్పటి పాటలు ఎన్నో కాలగర్భంలో కలిసిపోయినా, ఆయన సాహిత్య భావ ప్రకటన లక్ష్యానికి రుజువుగా నిలిచాయి. 'లలిత సంగీతం పాటకి సమకూర్చడంలో నేను రజనిగారి నుండి ఎంతో గ్రహించాను.' అని బాలమురళి ఒకసారి చెప్పారు. వాటిలో శబ్దరామణీయకతని ప్రకటించే సంగీత కల్పనలు పాట భావానికి అనుగుణంగా, నాటకీయంగా, భావస్ఫోరకంగా అందించే సృజన ధర్మప్రకటనలో బాలమురళి పరాకాష్ఠను సాధించారు. సంగీత కల్పనలు ఇద్దరివీ వేరు వేరుదారులు కాని బాలమురళి మాటల ఒదుగును సంగీతంలో తురిమినట్లు, ఊగించినట్లు, విశాల మైదానాలలో విహరింపచేసినట్లు మరొకరు చేయలేదు. ఈయన సొంతంగా పాటలు రాయగలిగే క్రమం కూడా ఈ వెదుకులాట లోంచి పుట్టినదే.

ఒకసారి విజయవాడ స్టూడియోలోనే ఒకపాట రికార్డు చేసారు. నేనూ ఉన్నాను. ఏహోయి, హోయి. నీ హొయలు రేయి పున్నమి వెన్నెలలు...' ఆయన రచించిన, బాగా ప్రచారంలో ఉన్న పాటే. ప్రక్కనే రేడియోలో రికార్డింగుకి వయొలిన్ ఎవరో ఆయనకు వాయిస్తున్నారు. రేడియో ఉద్యోగి కాదు. పెళ్లికూతురిని వెంటబెట్టుకుని వస్తున్న ముత్తయిదువులా వయొలిన్ సాకుతూ ఉంటుంది. దానికే వ్యక్తిత్వం ఇస్తూ చిన్న సోలో రిలీఫ్ కూడా వాయించాలి. తెలియక కాదు కాని వయొలిన్ విద్వాంసుడు ఆ మాటల్లో మునిగేటంతగా విరామాన్ని సుఖంగా ఉపయోగించుకొని వయొలిన్ వాయించలేకపోతున్నాడు. చిన్నగా నవ్వుతూ బాల మురళి ఆయన వయొలిన్‌ను తన చేతిలోకి తీసుకొని వాయించి చూపించి నవ్వారు. ఆ వయొలిన్ విద్వాంసుడు చాలా ఆనందించాడు. ఆయన వాయించినట్లే వాయించాడు.

రేడియో సంగీతంలో ఉండే వనరులు చాలా కొద్ది. పరిమిత వాద్యాల వినియోగంవల్ల ఆ పాట రక్తికి కావలసిన వాటిలో అధిక భాగాన్ని గొంతే ఇవ్వగలగాలి. కాకువు, ఎరుక, ముగ్ధత్వం తల్లీనత, లాలస, ముంపు ఇవన్నీ గాయకుని గళమే అందించాలి. వెతకాలి ప్రక్కప్రక్కన పొదగగలగాలి. అప్పుడే ఆ పాటకి వ్యక్తిత్వం వస్తుంది. ప్రక్కన ప్రేరణగా నిలబడే వాద్యసహకారం, అంఫైర్‌లా, చెలికాడిలా, తోడిపెళ్లికూతురిలా, తల్లిలా పరిసరాలు సమకూరుస్తుంది. వాద్యఘోష పాటని కబళించని కాలంలో లలిత సంగీతం ఆ విధంగా రాజ్యమేలింది, మళ్లు కట్టుకుంది, నందనవనమై విరగ బూసింది. అలా పూయించిన పూలని బాలమురళి విరగ దులిపేశారు.

ఒక గొంతు నిలపగల సహజ వ్యక్తిత్వానికి మించి ఏదో చెప్పలేని వ్యక్తిత్వం పాటకి కల్గించినవారు బాలమురళి. ఈ వ్యక్తిత్వ రాసిక్యం తరువాత తరువాత ఆయన కచేరీలలో పాడే పాటలకి కూడా వెన్నాడుతూ వచ్చింది కనుకనే ఆయన కచేరీలకు కూడా ఆ పరిమళం అబ్బింది. ఉదాహరణకు ఆయన 'ఎంత ముద్దా, ఎంత సొగసూ' అని ఒక కీర్తనని ముందుకు తెచ్చి చాలాకాలం పాడుతూ ఉండేవారు. అలాగే ఆయన బాగా ప్రచారం చేసినది 'దేవాదిదేవ శ్రీవాసుదేవా' అనే కీర్తన ఉంది. అనేక కీర్తనలలో ఆయన వైభవం ఒలకపోసినట్లుగానే ఈ కీర్తనలో వున్న నాటకీయ ఓజస్సును, పలుకుతీరునూ పెంచినది ఆయన లలితగీత స్పర్శలో సాధించిన వెచ్చతనాన్ని ప్రసరణ చేయగల

ప్రతిభే. అందుకే ఆయన ఏం పాడినా, ఆ విలక్షణతతో గగుర్పాటు చెందుతాం. మురిసిపోతాం. సంగీతం ఎక్కువ తెలియక పోయినా పదే పదే స్మరించుకుంటాం. అందుకే సంగీత వేదిక మీద ఆయన అన్ని దశాబ్దాలు నిలబడగలిగారు. ఈ మధ్యనే ఒకసారి నాతో మాట్లాడ్తూ ఆమెరికాలో 'నగుమోమూ' మూడు వందల సార్లు పాడవలసి వచ్చింది అన్నారు.

ఆయన దగ్గిర నేను అనలేదు కానీ నాకు అర్థమయ్యింది. ఆ కీర్తనలో గల నాటకీయ వింజామర శ్రోతలకు అన్ని గాలులతో సేదదీర్చి ఉంటుంది కనుకనే అక్కడి శ్రోతలు అలా కోరుకొని ఉంటారు. సరే ఆయన అభేరి ఎన్ని వందలసార్లు విన్నా ఇంకా ఏదో మిగిలిపోయి వుంటుంది కదా! అన్ని అవకాశాలనూ తరచి తరచి చూసి సాధించే గుణం ఆయన రాగప్రస్తారంలో వుంటుంది. ఆయన ఇంటర్వ్యూలలో ఆకర్షించాలని చిరుకోరికతో, 'నాకు రాగం ఎదురుగా కూర్చుంటుంది అది రాగసుందరి' అంటారు కానీ అది భక్తిప్రపత్తులతో ఆరాధించే దైవీమూర్తి కాదు. ఆయనకి రాగం, ఆయన్ను ఆయన శుద్ధి పరచుకొనే లేపనం, క్రీడ తానే పెట్టుకొన్న ప్రమాణాలతో ఊగే డోలిక. పాడిన కీర్తనల ద్వారా బాలమురళి ప్రతిభను స్మరించుకోవాలంటే శ్రోతలు అందరికీ ఆత్మకథలు తయారవుతాయి. అంతటి విస్తారమైన సామ్రాజ్యాన్ని ఆయన జయించుకుంటూ అశ్వమేధం చేశారు. ఖండాంతారాలలో, దేశంలో, గుర్రాన్ని స్వాధీనం చేసుకొనే లవకుశుల రాజరికపు అంశం ఏదో ఆయన రాగాన్ని ఆలపించినపుడల్లా నాకు కనబడుతూ ఉంటుంది. పరమయోగులు చెప్పిన యోగి రహస్యమేదో కొన్ని రాగాల ప్రస్తారంలో విశదమయినట్లు విశ్రాంతిగా లాలించినట్లుంటుంది. 'అమ్మా నే కోరినవరమిమ్మా, నీ అభిమాన కుమారుడి నమ్మా' అనే ఓ కీర్తన పాడుతుంటారు. ఆయనదే 'పుట్టగానే మురళిగానము పట్టనిచ్చి' అని శకలం ఉంటుంది. అందులోని నాటకీయత ఆప్యాయానికీ, అనురాగానికే కాదు, భక్తికి అవతల ఉన్న ఏదో సందేశం కోసం వెంపరలాడుతూ ఉంటుంది. ఒకసారి ఇతర విద్వాంసులతో తంజావూరు బృహదీశ్వరాలయంలో తిరుగుతున్నాం. 'కానడలో గొప్పగా కీర్తన రాశారండీ బాలమురళి' అన్నాను కూడా ఉన్న ఆయనతో. ఆ విశ్రాంత స్థలంలో తిరుగాడుతూ ఆయన "ఆ రాసిన రోజున నేను బాలమురళితోనే ఉన్నాను. ఒక్కొక్క పరిక్రమ చేస్తూ ఒక్కొక్క చరణం పాడారు. అంతా పదినిముషాలు పట్టలేదు," అని 'బృహదీశ్వర మహాదేవ' పాడి వినిపించారు ఆ విద్వాంసుడు. అయిదువందల మందికి పైగా నర్తకీమణులు నాట్యం చేసేవారట. బాలమురళి కీర్తనే నృత్యం చేస్తున్నట్లు గొప్ప బృంద నర్తకులు ఆ విరామాలతో తన్మయతతో బాలమురళి భావాలకు అడుగువేస్తున్నట్లుగానూ ఉంటుంది. శ్రోతల మనసులో కీర్తన ఇమిడిపోవటం అంటే ఇదే.

గురువు బరువు, అతితక్కువగా పడిన గాయకుడు ఆయన. అనేక కారణాల వల్ల, చిన్నప్పుడే ఎన్నో సంగీత కచేరీల సందడిలో ఏమి గురువు వద్ద నేర్చుకున్నారో ఆయన పాటలో గురువు బాణీని వెతకలేము. ఆయన సమకాలికులైన తెలుగు విద్వాంసులలోనూ, అటు తమిళ సంగీత విద్మన్మణులలోనూ గురువుల ఆనవాలు చిక్కుతుంది. పాడేవారికి అందరికీ అంతర్నేత్రాలుంటాయి. అవి ఎల్లవేళలా రాగాలలో కూరుకున్న పచ్చినిబంధనలనూ, తాను తన గొంతుతో వాటిని ప్రయోగించే రూపస్పర్శలు ఎటు పోతున్నవా అని అవలోకించడానికే నిమగ్నమవుతాయి. ఒక్క బాలమురళికే ఈ అంతర్నేత్రాలు ఎవరూ ఊహించని వేగంతో ఆనంద నివేదనంతో బాటు అలభ్యరాగచలిత కాంతులను, సునిశిత శస్త్రఘాతాల్లాంటి ప్రమాదాలను దాటుకుంటూ వీరవిహారం చేయించేవిగా పనిచేస్తాయి. ఎంత జాగ్రత్తగా పరిశీలించినా ఇదివరకు పాడిన రీతిలో రాగాన్ని ఆలపించని రుచి ఆయనది

చిక్కు లెక్కలు కావాలంటే చిక్కు నడకలు, జారుడు స్వరాలు కావాలంటే జారుడు స్వరాలు, ప్రమాదస్థాయిలు తప్పించుకుంటూ శ్రోతలనే ప్రమాదంలో పడవేసి తను తేరుకుంటూ 'సూపరు సుఖప్రయాణం' చేయించగల చిత్రమైన రాగ చోదకుడు బాలమురళి. అందుకే శ్రోతలకు అంత ప్రీతిపాత్రంగా ఆయన పాత్ర నడిచింది.

ఆయన విస్తరించిన రాగంలో కీర్తనల వికసనంలో ఈ పునుగు పరిమళం ఎక్కడినుంచి వచ్చిందో ఆయనకే తెలియదేమో. సువాసనలకి మూలాలను వెతకటం అనవసరం. ఇలా ఉంటుందని చెప్పగలగడం కూడా కష్టమే. సంగీత పరివేశ కల్పనల తటిల్లతలను పట్టలేం. జీవికకు అందరూ సంగీతాన్ని ఉపాసిస్తారు కాని శ్రోతలని బాలమురళి సంగీతాన్ని ఉపాసించేలా చేశాడు. శ్రోతలని సంగీతంతో ఉన్మీలితులుగా చేశాడు. శ్రోతలు ఉబ్బిపోయారన్నమాట.

సంగీతాన్ని సాధించిన క్రమంలో అందించి ఆనందపరచిన వారు చాలామంది ఉన్నారు. సంగీతంలో ఓలలాడించినవారు చాలామంది ఉన్నారు. చౌకగా చెప్పుకోవాలంటే సంగీతాన్ని బాలమురళి శ్రోతలకి లేపనంగా రాయలేదు. మాయని మచ్చగా ముద్రించి వెళ్లిపోయారు. బాలమురళి ఒక్కడికే సంగీతంతోపాటు సాహిత్యం ప్రధానం. మిగిలినవారికి సాహిత్యం ఒక వాహిక, ఒక నావ, రైలుపట్టా. ఆయనకి అక్షరం ప్రతీదీ ఒక స్వరస్థానం, పలుకు భావాంబరం, కీర్తన పాఠమంతా ఒక సాహిత్య కుసుమాయుధం. ఆయనకి సంగీతం ఒక పూలసజ్జ. మిగిలినవారికి కీర్తన-పూలను మోసుకెళ్లే సాహిత్య సజ్జ ఆకారం, ఈ భేదాన్ని బాలమురళి తొలిరోజుల నుండీ దృష్టిలో పెట్టుకునే తన ప్రదర్శన యాత్రను సాగించాడు.

అసౌకర్యంగా కనబడినపుడు స్వరాక్షరాలతో ఎన్నో రచనలు చేసి వినిపించాడు. కీర్తన ఏ భాషలోనైనా అర్థాన్ని అవధరించేదిగా, భావాన్ని సంవహనం చేసేదిగా మాత్రమే ఆయనకు కనబడేది. ఆయన పాడిన సదాశివబ్రహ్మేంద్ర కీర్తనలనీ ఇతరులు పాడిన

కీర్తనలనూ ఒకసారి వినిచూడండి. ఆయన వెలువరించిన సాహిత్య పారమ్యం, సంగీత స్పృహ వేరు. ఇతరుల సంగీత రంగ రింపు, నివేదన స్థాయి వేరు.

చాలా తొలి రోజుల్లో భక్తిరంజనిలో భజన ఒకటి పాడారు. సూర్‌దాస్ భజనేమో! 'మత్‌కర్ మోహతూ మత్‌కర్' అని వచ్చి-ఆంఖ్ దియే హరిదర్శన్ కరనేకో...' అని వస్తుంది. మీరు గ్రుడ్డివారై పోతారు. సంగీతంలో ఈదులాడుతారు. మాటలు మీకే అర్థమయి మీరూ ప్రార్థన పంక్తిలో చేరి పోతారు. అదీ ఉన్మీలనం అంటే... ఇంకా సహాయం కావాలంటే బృందగానానికి ఎలా డివిజన్ పెట్టాలో చెప్పే ప్రయోగ రంగదాసు కీర్తనలు, ఏమీ సేతురాలింగా - వీటిని గుర్తుచేసుకుంటే చాలు. వ్యక్తి, బృంద, సంగీత చేలాంచల ప్రతిష్ఠల విభాగ రమణీయతను-సంగీత ప్రయోక్తగా బాలమురళి చేసినట్లు మరొకరు చేయలేదు.

బృందగొంతుకలే శృతిగా-తంబుర వెనుక వేస్తున్నట్లు వినిపిస్తూ-ఒక పాటల పేటికను అభినవ కార్యక్రమంగా ఆకాశ వాణి వార్షిక పోటీలకు మద్రాసు కేంద్రంనుండి బాలమురళి పంపించారు. బహుమతి వచ్చింది సరే. ఆ కార్యక్రమం మొదటి నుండి చివరివరకూ ఏదో తెలియని సన్నద్ధతను కల్పించి కట్టిపడ వేస్తుంది.

బాలమురళి రంగంలోకి దిగినపుడు తెలుగునాట ఒక్క ద్వారంవారే బహుళ జనాదరణ పొందిన వాదకులు. అటువైపు దక్షిణాదిన జి.యన్. బాలసుబ్రహ్మణ్యం, అరియకుడిల హవా నడుస్తోంది. వాళ్లకి విఫలమైన కచేరీ ఉండేదికాదు. వాళ్లు శ్రోతలున్న సముదాయాన్ని బట్టి కీర్తనలనీ రాగాలనీ ఎంచుకొని పాడేవారు. వివిధ రక్తిరాగాలను గానం చేసేవారు. అరియకుడి ఎంతోమంది మంచివారి కీర్తనలను మాలగా అల్లి కచేరీలో యువతరానికి అందించేవారు.

కచేరీ చివర రంజకంగా ఉండే పదాలు, ఇతర అంశాలను జోడించేవారు. అలా కట్టిపడేసేలా కచేరీ నమూనా తయారు చేసింది అరియకుడి. తన సొంత కీర్తన ఒకటి చివరలో జోడించి దానిని చిత్రంగా పెంచుకుంటూ ఆ కీర్తనకి శ్రోతలను పెంచుకునే పద్ధతి జి.యన్.బి.ది. బాలమురళి ఈ ఇద్దరి దృక్పథాన్ని అవగతం చేసుకొని తన కచేరీకి ఆకారం తెచ్చుకొని వారిలాగే మొదటి నుంచీ రంజకంగా కచేరీని నిర్వహించే ఆలోచనకు వచ్చారని నాకు తోస్తుంది.

అరియకుడి స్వరకల్పనలతో రాగానికి ఒక అంతిమ తీర్పుగా పువ్వులు గుచ్చితే, బాలమురళి మధ్యమధ్యన తన గొంతు కల్పించే అద్భుత విన్యాసాలకి స్థాయీగత భేదాల అలంకరణలను గుచ్చుతూ రాగంలో ఎవరూ అంతవరకూ అందించని నవచైతన్యపు ద్రుతిని అందిస్తూ సాగారు అని నాకు తోస్తున్నది. దీనికితోడు రాగంలోని సౌందర్య ద్యుతి ఒక్కొక్కరికి ఒకవిధంగా దర్శన మిస్తుంది. గాయకుడు అతనికి తోచిన రీతిలో వాటిని శ్రోతలకు

అందించే ప్రయత్నంలో సౌందర్యభావనా ప్రసరణని వాయిదా వేస్తూవుంటాడు. దానికి అతనికి అబ్బిన శిక్షణా, గాత్రసౌలభ్యం వివేచనను నేర్పుతాయి.

బాలమురళికి మాత్రం రాగం విప్పే తరుణంలో అందం తోచినదంటే- ఇక ఆగి, వేచిచూడడంలేదు. వెంటనే ఆనందపు వెల్లువను పట్టి అందించి, అలా ఆనందిస్తూ ఆనందింపచేయడమే పని. అంతటి తక్షణ ఛాయాగ్రాహకుడు ఆయన. రాగం అనే ఫలకంమీద అందరు విద్వాంసులూ శిల్పులే. లతలు చెక్కినవారే విరామచంద్రికలు అద్దేవారే.

ఒక్క బాలమురళికే ఆ రాగంలోని మెటల్, ద్రవ్యస్థితి, ఆకర్షక లంబాలు, ఆనందపు కోణాలు తెలుసు. ప్లాస్టిక్ రాగాన్ని లోహంలా చెక్కని పాలరాతిలా, దారుని బంగారంలా చూసి వాటి మీద తన గొంతు అనే ఉలితో, రాగధర్మంతో త్రిడి శిల్పాకృతులను అందించగల నేర్పు ఉంది. అదే ఆయన రాగశిల్ప రమణీయత. అందుకే ఇన్ని దశాబ్దాలుగా ఆయన ఖ్యాతి నిలబడింది.

సంగీత సౌందర్యాన్వేషణలో తన సైనికులను తానే పోషించే దశ వచ్చిన తర్వాత గాయకులు సాధారణంగా చేసేది ఏమీ వుండదు. కాని బాలమురళి తన సైనికులను ఒక మాంత్రిక వైవిధ్యం వైపు త్రిప్పగలిగాడు. ఆ వైవిధ్యం కీర్తనల అంతస్సారం వైపు ఉపరితల నునుపు వైపు మాత్రమే కాకుండా సంగీత రహస్య మందిరాల వైపు కూడా త్రిప్పగలిగిన ఈ సేనానాయకుడి నేర్పు. అది దక్షిణాది ఇతర విద్వాంసులకెవరికీ అబ్బలేదు.

ఒక ప్రాథమిక ప్రశ్నకి జవాబుగా ఆయన దశాబ్దాల

జనరంజక కృషి సాగింది. సంపూర్ణ సంగీత కళాభిజ్ఞతకి శ్రోతలను సిద్ధం చేయడం ఆ లక్ష్యం. ఇతరులవలె రాగం చెట్టుకొమ్మల్లో కూర్చుని ఆ గుబురుపచ్చని ఆకులలో దోబూచులాడటం, కుప్పి గంతులు వేయడం, ఆకాశానికి అర్రులు చాచామని ఆనందించటం ఆయనకు నచ్చలేదు. ప్రతి కదలిక చైతన్యభరితమని, ప్రతి గెంతు ఒక ప్రవేశ దరువని చెప్పదలిచారు.

అనేక నిష్క్రమణ ద్వారాల ఆకర్షింపబడి, అంతులేని విన్యాసాలకు విరమించడం తగదు అని చెప్పదలచుకున్నాడు. అందుకే ఆయన రాగంలో తన గొంతుపలికిన ప్రతి ప్రవేశ దరువునూ దాని శక్తితీర ఆనందవర్ధకం చేశాడు. ప్రతి నిష్క్రమణ ద్వారాన్ని వదలక వదలక పరికించాడు. సత్యభామ లేఖలోని అర్థాలను వివరించే నర్తకిలా, అలా విన్యాసాలను ప్రకటిస్తూనే వచ్చాడు. అదీ ఆయన ప్రత్యేకత. ఇటువంటి బుద్ధిగత విశ్లేషణ లేనిదే , అందరి రాగప్రస్తారణకు భిన్నంగా తన రాగం ఉండదని తెలుసుకున్నాడు.

అర్థంలేని క్లిష్టత లేకుండా పాడటం సాధించిన గాయకుడు, చటుక్కున రాగంలో ద్రవీ భూతగణం, భాష్పకణ పరిణామ దశ ఒకే దశలో తారాడుతాయని తెలుసుకొని నిత్య విజ్ఞానిలా అన్వేషణ సాగించాడు. అంతిమదశగా తిల్లానాలు రచించాడు. సమస్త బాలమురళి విజ్ఞాన, ఆనంద, మేధోజనిత కృషికి ఆయన తిల్లానాలు తార్కాణాలుగా నిలుస్తాయి. సంగీత, లయ, భావరీత్యా ఆయా తిల్లానాలు అనేక అల్లికల పరమసోపానాలు. అవి తెరిచే నిష్క్రమణ ద్వారాలు అన్ని ఇన్నీ కావు. నర్తకుల నుండి, మృదంగ కళాకారులవరకు అవి శల్యపరీక్షా పత్రాలు. గాయకుల ఆనందరూప సాక్షాత్కారానికి తెరిచిన ద్వారాలు. అవి కాల్పనికోద్యమ కవిత్వపు జాడలలో రావటం మరొక విశేషం, అవి ఆలయస్వాముల దరిచేర డానికి కాదు. ఆలయ పరమాత్మునికావల చేర్చే క్లిష్టతర సంగీతయోగ సోపానాలు.

వాటి భావాల తిర్యగ్రేఖలు గాయకుడిని విరామంలో సంధించి మృదంగం వాడిని సంశయంలో బంధించి శ్రోతల వదనాలను మురిపిస్తాయి. రాగాల బిగి వదలని సందేశాలతో వినేవారిని ముచ్చటలతో ఊగులాడిస్తాయి. బాలమురళి ఎంతటి సంగీత శ్రమైక పథికుడో, గంభీర లయగ్రాహియో, ఆయనది ఎంతటి అనంతరంజక సార్వభౌమమో క్షణంసేపు తిల్లానా వింటే

చాలు. మీకు తెలిసిపోతుంది. 'ఎన్ని చెప్పండి! మీ తిల్లానాల గొప్పతనం అంతా ఇంతా కాదు' అని ఒకసారి నేను ఆయనతోనే అన్నాను. దానిలోని విశేషాలు చెప్పకుండా, 'ఏముంది వాటిలో! మామూలే, ప్రత్యేకత ఏముంది?' అని కొట్టిపారేశారు. ఎదుటి వారిని అలా నిరాస్త్రం చేయడం ఆయనకు అలవాటే.

ఆయనలో మంచి చరిత్ర పరిశోధకుడున్నాడు. 72 మేళ కర్తలలోనూ ఎన్నో అపురూప రాగాలు నిలబడగలవని తోచి కీర్తనలు రాశారు. ఆ విధంగా కర్ణాటక సంగీతంలో ఉన్న ఒక లోటు పూరించారు. తనకొక, తన గొంతుకొక, తన పద్ధతి రాగాన్వేషణ కొక విహార స్థలాన్ని సృష్టించుకున్నారు. అందులోకి అందరినీ ఆహ్వానించారు. బుద్ధిగత విశ్లేషణతతో అనేక నంది వర్ధనాలను సృష్టించి చేతులు కట్టుకొని వినండి అని నిలబడ్డారు. సంగీత శ్రవణం కంటకప్రాయం కాదని జీవితమంతా తానే ఒక పాటై వెన్నెలబాటను సిద్ధం చేశారు.

ఎంతోమంది యువశ్రోతలకు కీర్తనల కావల, సంగీతానికి ఆవల ఒక ఎరుకను, మత్తును ఇవ్వగలిగారు. అది చాలు. సంగీతం తోనే జీవించినవారు చాలామంది ఉన్నారు. సంగీతం కోసమే బ్రతికి, సంగీతానికి ఆవల ఉన్న మౌనగీతం కోసం వెతుకులాడిన వారు బాలమురళి ఒక్కరే.

అందుకే ఆయన వేలాది శ్రోతలకు అంత సమీపబంధువు కాగలిగారు.

సంగీత, సాహిత్యరంగాలలో అపరిమితమైన అనుభవం, అభినివేశం ఉన్న పన్నాల సుబ్రహ్మణ్య భట్టు చాలాకాలం ఆకాశవాణిలో ఉద్యోగం చేసి పదవీ విరమణానంతరం విజయవాడలో నివాసం ఉంటున్నారు.

Ph.: 0866-2475120

స్వప్నయానం

దొసరి అమరేంద్ర

ఎప్పటిదో కోరిక - ఓసారి అమెరికా వెళ్లిరావాలని.

గత ముప్పై, నలభై ఏళ్లలో మూడు నాలుగుసార్లు అవకాశాలు చివరిదాకా వచ్చి చెయ్యిజారిపోయాయి. సమయమూ సందర్భమూ 2015 వేసవిలో కలిసి వచ్చాయి. మా పాప అపూర్వ గ్రాడ్యుయేషన్ ఉత్సవం.. డరమ్, డ్యూక్ యూనివర్సిటీ, నార్త్‌కరోలినా.

రిటైరయిన నాకు సమయపు సమస్యలేదుగాబట్టి ఒక్క గ్రాడ్యుయేషన్ ఉత్సవం చూడటమేగాకుండా మొత్తం దేశమంతా తిరగాలని సంకల్పించాను. జూలై నెలలో జరిగే తానా కన్వెన్షన్‌ను చూసుకొని కొన్ని కొన్ని రోజులు మిత్రులతో చికాగో, డెట్రాయిట్‌లలో గడిపి జూలై ఇరవయ్యో తారీఖు నుంచి ఓ ఏభైరోజులపాటు-విమానమన్నది ఎక్కకుండా-దేశపు నాలుగు మూలలూ చూసి రావాలని ప్రణాళిక వేసాను. అందులో ప్రథమ పాదం చికాగో నుంచి శాన్‌ఫ్రాన్‌సిస్కో వరకూ రైలు ప్రయాణం. 2500మైళ్లు. ఏభై నాలుగు గంటలు.

★ ★ ★

ఏమ్‌ట్రాక్ రైలు బండి. బాగా ముందే కొనుక్కొన్నాను గాబట్టి 190 డాలర్లకే టికెట్టు.

'కాలిఫోర్నియా జెఫిర్' అన్నది మా రైలు పేరు. చికాగోలో మధ్యాన్నం రెండింటికి బయల్దేరి డెన్వర్, సాల్ట్‌లేక్ సిటీ, శాక్రిమెంటో నగరాల మీదుగా ఏడు రాష్ట్రాలూ, రెండు మహానదులూ, రెండు పర్వత శ్రేణులూ, రెండు టైమ్ జోన్‌లూ అధిగమించి మూడోరోజు సాయంత్రానికి శాన్‌ఫ్రాన్సిస్కో శివార్లలోని ఎమిరివిల్ స్టేషను చేరుతుందీ యాత్రా స్పెషల్ రైలు బండి.

2015 జూలై 20 మధ్యాహ్నం బండెక్కాను.

అంతగా బరువులేని బ్యాక్‌ప్యాకూ, చెక్రాల మీద దొర్లిపోయే చిన్నపాటి సూట్‌కేసు-లగేజ్ బాదరబందీ పెద్దగాలేదు.

ఓ ఆరోగ్యవంతమయిన పాతిక ముప్పై ఏళ్ల యువతి మా కంపార్టుమెంటు కండక్టరు. స్నేహంగా పలకరించి, నా టికెట్టును పరకాయించి నా సీట్లో నన్ను చేర్చారావిడ. అయినా నిరాశ. విండో సీటుకాదు నాది. అడిగాను. చూస్తానన్నారా కండక్టరు.

కాలిఫోర్నియా జెఫిర్ రైల్లో
చికాగో నుంచి శాన్‌ఫ్రాన్సిస్కో వరకు
2500 మైళ్లు, 7 రాష్ట్రాలు,
రెండు మహానదులు,
రెండు పర్వత శ్రేణులు,
రెండు టైమ్ జోన్లు దాటి
54 గంటల సుదీర్ఘ ప్రయాణం...

'యంత్రభూతములు'అని శ్రీశ్రీ వేటిల్ని దృష్టిలో పెట్టుకుని అన్నాడోగానీ అమెరికా రైలుబళ్లకా విశేషణం బాగా సరిపోతుంది. రెండంతస్థుల రైలు పెట్టెలు, లోహం కరిగించి పట్టాలమీద పోతపోసినట్టుగా ఉండే వాటి రూపురేఖలు, మెరిసిపోయే అల్యూమినియం రంగు కంపార్టుమెంట్లు - యంత్ర భూతం అన్న మాట నిజమేకానీ ఇవి భయపెట్టని భూతాలు. స్నేహం విరజల్లే భూతాలు.

రెండున్నర రోజులపాటు నాకు ఇల్లూవాకిలీ ఆ రైలే!

★ ★ ★

కిటికీ పక్క సీటావిడను మాటల్లో పెట్టాను. తనది మూడు గంటల ప్రయాణమేనట-మిసిసిపి ఒడ్డున్న ఉన్న బర్లింగ్‌టన్ వరకూ. నా యాత్రికుని వాలకం వెంటనే పసిగట్టేసారావిడ. ఎంతో దయగా తన కిటికీ సీటు నాకిచ్చేసారు! హిస్టరీ ప్రొఫెసరట. హుందాగా, గౌరవం ఉట్టిపడేలా ఉన్నారు. ఆత్మీయంగా ముచ్చట్లు. నాకూ చరిత్ర అంటే ఆసక్తి- అమెరికా అంతర్యుద్ధం గురించి నా ప్రశ్నలు, ఆమె జవాబులు.

ఓ గంట గడిచాక మెల్లగా రైలుబండి పరిశోధనకు బయల్దేరాను.

రెండు కాంటిన్లున్నాయన్నారు. ఒక ప్లెక్సీ గ్లాసు పైకప్పుగా గల అబ్జర్వేషను హాలు ఉందన్నారు- అవి ఎక్కడున్నాయో ఎలా ఉన్నాయో చూసి వద్దామని బయల్దేరాను.

క్యాంటిన్ నెంబర్ 1 నిజానికో ఫాస్ట్‌ఫుడ్ జాయింటు. కాఫీ, టీ, కూల్‌డ్రింకులు, బర్గర్లు, పిజ్జాలు, కప్‌నూడిళ్లూ- వాటిల్ని ఎంతో స్నేహంగా అందించే మరో భారీకాయపు వనిత. ఒక్క కాఫీ తాగగానే తెలిసిపోయింది- 'ఈవిడ నా స్నేహితురాలు' అని.

మళ్లా నా సీటులోకి వెళ్లి అంది వచ్చిన కిటికీ సీటుకు కళ్లు అప్పగించేసాను.

చికాగో నగరమూ, దాని శివారు పట్టణాలూ ఎప్పుడో దాటి పోయాయి. కిటికీకి అవతల కనుచూపు మేరదాకా పచ్చని పొలాలు. గగనం నిండా వెండి మేఘాలు. ఏదో పట్నం వస్తోన్న ఛాయలు. నదీజలాల వాసన. హిస్టరీ ప్రొఫెసరుగారు బండి దిగే సన్నాహాలు- బర్లింగ్‌టన్ నగరమట. మిసిసిపి నది పక్కనేనట. ఇల్లినాయ్ రాష్ట్రానికీ అయోవా రాష్ట్రానికీ సరిహద్దట ఈ నది.

మిస్సౌరీ-మిసిసిపి... హైస్కూలు పాఠాలనాటిది కదా వాటితో నా అనుబంధం!! రెండువేల మూడువందల మైళ్ల పొడవున అమెరికా దేశపు ఉత్తర దక్షిణ దిక్కులను కలుపుకుంటూ, పది రాష్ట్రాలను పావనం చేస్తూ, మరో ఇరవై పాతిక రాష్ట్రాల జలవాహినులను తమలో నింపుకొంటూ, దారిపొడవునా ఒండ్రు మట్టిని పంచుకొంటూ, తాము ప్రవహించిన దారినంతా పాడి పంటలతో నింపుతూ- గంగ అయినా మిసిసిపి అయినా అప్పటికీ ఇప్పటికీ మనిషికి జీవనాధారాలు నదులే గదా! ఏదో మంత్రం వేసినట్టుగా ఆ నదికేసి చూస్తూ ఉండిపోయాను. ఆరాధన. ఫొటోలు తీసుకోవాలని కూడా స్ఫురణ కలగని మైమరపు.

బండి తీరుతెన్నులు అర్థమయ్యాయి.

ఇందులో రెండే వర్గాలు. ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్లు, స్లీపర్ బెర్తులు.

నే ఎక్కింది చైర్‌కార్లో. అంటే ఏభై నాలుగు గంటలూ కూర్చునే ప్రయాణం చెయ్యాలన్నమాట. గుండె గుభేలుమన్నా- మా పెట్టెలో సగం కూడా సీట్లు నిండిలేవని తెలిసివచ్చి ధీమా. రెండు సీట్లలో నడుం వాల్చే అవకాశం ఉందన్న అవగాహన. రైలు ముందు ముందుకు సాగే కొద్దీ కంపార్టుమెంటు పలచబడింది. ఇరవైమంది పట్టే మా సెక్షన్లో నలుగురయిదుగురమే మిగిలాం.

★ ★ ★

ఈసారి అబ్జర్వేషన్ హాలు వెదుక్కుంటూ బయల్దేరాను.

చూడగానే సంతోషంతో మతిపోయింది.

ఒక కంపార్టుమెంటులో పై అంతస్తులో మామూలు సీట్లు తీసేసి, అటూ ఇటూ ముప్పై నలభైమంది కూర్చోడానికి వీలుగా కిటికీల పక్కన బారుగా సోఫాల్లాంటి సీట్లు అమర్చి, నేల నుంచి పైకప్పు వరకూ పారదర్శకంగా ఉండే కిటికీలను అమర్చి, పైకప్పు మీద కూడా అదే బాణీ ప్లెక్సీ గ్లాసు తాపడం చేసి- వారెవ్వా, ఇదేగదా స్వప్నయానమంటే!!

అటూ ఇటూ పచ్చదనం. పైన ఎర్రబడుతోన్న నీలాకాశం. హాల్లో మాత్రం ఎవరి దృశ్యవీక్షణంలో వాళ్లు. కొంతమంది పుస్తకాలు చదువుతూ- ఇదేం బాగోలేదనిపించింది.

ఒక్కొక్కరినీ పరకాయిస్తూ అటూ ఇటూ నడిచాను. కొంత మందితో కళ్ల పలకరింపులు. ఒకరిద్దరు పెదాల కదలికలతో హలోలు... ఓ చివర ఇద్దరు మధ్యవయస్కులు. వెంటనే అర్థమయింది వీళ్లూ నాలాగే మాటల మనిషి కోసం ఎదురుచూస్తున్నారని- మాట కలిపాను. షేక్‌హాండ్ సరేసరి.

"ఏ వూరు?' 'పారిస్.'

'ఎన్నాళ్లు?' 'రెండు నెలలు'.

'ఇప్పుడు ఎక్కడిదాకా?"

'శాన్‌ఫ్రాన్సిస్కో."

'ఆ తర్వాత?'

'రూట్ 66'

భాష రాకపోయినా మంచి స్నేహశీలత ఉన్న వాళ్లుగాబట్టి- ప్రయాణశీలత కూడా పుష్కలంగా ఉందిగాబట్టి కబుర్లే కబుర్లు.

'రూట్ 66' వాళ్ల జీవితాశయమట. ఇదే మొదటిసారట అమెరికా రావటం. శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి దేశపు చివరికొస శాంతామోనికా దాకా వెళ్లి, కారు అద్దెకు తీసుకుని 2500 మైళ్లూ, ఏడెనిమిది రాష్ట్రాలూ ప్రయాణం చేసి తిరిగి చికాగో చేరతారట.

'రూట్ 66' తొంభై ఏళ్ల క్రితం రూపొందించబడిన రాజ మార్గం. ఇప్పటి ఇంటర్‌స్టేట్ హైవే వ్యవస్థ 1950లలో ఏర్పడక ముందు ఇది దేశపు ప్రాక్‌పశ్చిమ ప్రాంతాల వారధిగా, సాంస్కృతిక సంపదగా, కీలక ఆర్థిక అంశంగా- అమెరికా జీవితంలో విడదీయరాని భాగంగా కొనసాగింది. కొత్త 'ఐవే' వ్యవస్థ వచ్చాక కూడా ఓ పాతిక ముప్పై ఏళ్లు స్వతంత్ర రహదారిగా మనుగడ సాగించింది. 1985లో అమెరికా నేషనల్ హైవే సిస్టం నుంచి అధికారికంగా తొలగించబడినా ఇంకా మెట్లుమెట్లుగా బిట్లు బిట్లుగా- 'హిస్టారిక్ రూట్ 66' అంటూనో, 'స్టేట్ రూట్ 66' అంటూనో మిగిలి ఉండి సాహసికులకూ, ఉత్సాహవంతులకూ ఉత్తేజం కలిగిస్తూనే ఉంది.

అదిగో ఆ రూట్ 66లో ఈ ఫ్రెంచి యాత్రికద్వయం వెళ్లబోతోంది. అసూయ పుట్టదూ? పుట్టింది. ఆ మాటే చెప్పాను.

★ ★ ★

సాయంత్రం ఏడు దాటింది. చీకట్లు కమ్మేసాయి. అబ్జర్వేషన్ హాలు ఖాళీ అయిపోయింది. అయినా, పదిన్నర ప్రాంతంలో రైలు అయోవాదాటి, మిస్సౌరీ నది దాటి నెబ్రాస్కా రాష్ట్రంలో ప్రవేశిస్తుందని టైమ్ టేబుల్ చెపుతోంది. మిసిసిపిని చూసిన కళ్లతోనే మిస్సౌరీని చూద్దామని నా సంకల్పం. మా స్నేహితురాలి దగ్గరకు వెళ్లి ఓ కప్ నూడిల్స్ అందుకొని, నేను తెచ్చుకొన్న తినుబండారాలతో కలగలిపి- డిన్నరు. కాఫీ.

నా ఎదుటిసీట్లో అమ్మాయి ఏకాగ్రతతో రంగురంగుల బొమ్మలు వేస్తూ కనిపించింది. పాతికేళ్లు ఉండొచ్చనిపించింది. నాదో నమ్మకం: పాటలు పాడేవాళ్లూ, బొమ్మలు వేసేవాళ్లూ మంచివాళ్లూ, స్నేహశీలురూ అయి ఉంటారని... పలకరించాను. స్పందించింది.

సైన్యంలో పనిచేసిందట. పాతికనుకొన్నానుగానీ ముప్పై రెండట. యుద్ధం చూసిందట. మానసికంగా గాయపడింది గాబోలు- పదవీ విరమణ. వదిలేసిన బొమ్మలతో మళ్లా సాహచర్యం. అడిగితే మనసు విప్పేదేగానీ ఎందుకో కదపాలనిపించలేదు. 'ఒక బొమ్మ ఇస్తావా?' అంటే సంతోషంగా ఇచ్చింది. మర్నాటి ఉదయం డెన్వర్‌లో బండి దిగిపోయింది.

★ ★ ★

అబ్జర్వేషన్ హాలు తెల్లవారకముందే నన్ను పట్టిలాగేసింది. తెల్లవారుఝాము నాలుగ్గంటలకే తొలి వెలుగులు కనిపించసాగాయి.

బండి కొలరాడో రాష్ట్రంలోకి అడుగుపెట్టింది. సెంట్రల్ టైమ్ జోన్ నుంచి మౌంటెన్ టైమ్ జోన్‌లోకి వచ్చింది. ఇక్కడి టైము చికాగో కన్నా ఒక గంట వెనుక. మరో రోజు గడిచి మర్నాటి ఉదయం నెవాడా చేరినపుడు పసిఫిక్ టైమ్ జోన్ అట. మరో గంట వెనుక. చికాగో నుంచి అటు తూర్పున న్యూయార్క్ వెళితే ఈస్టర్న్ టైమ్‌జోన్. గంట ముందు.

బండి శరవేగంతో సాగిపోతోంది. విశాలమైన మైదాన సీమ. చిరుజల్లులు. చిన్నచిన్న గుట్టలు. పచ్చిక మేసే గొర్రెల మందలు. ఏడున్నర ప్రాంతంలో డెన్వర్ స్టేషను. చికాగో నుంచి వెయ్యి మైళ్లు దాటి వచ్చాం. ఏడు లక్షల పెద్దపట్నం డెన్వర్. కొలరాడో రాష్ట్ర రాజధాని. రాకీ పర్వతశ్రేణికి కేంద్ర బిందువు. టైటానిక్ ప్రమాదం నుంచి ప్రాణాలతో బటపడిన మోలీ బ్రౌన్ అన్న ఆవిడ ఇక్కడే ఉండేవారట. పరిసరాల్లోనే రాకీ మౌంటెన్ నేషనల్ పార్కు.

1752లో ఎవరో యూరోపియన్ పెద్దమనిషి దూరం నుంచి ఈ పర్వతాలను చూసి 'ఏమిటివీ? రాళ్ల గుట్టల్లా ఉన్నాయ్!' అన్నాడట. అలా ఈ పర్వతశ్రేణికి 'రాకీస్' అన్న పేరు స్థిరపడింది. ఉత్తరాన కెనడా నుంచి దక్షిణాన న్యూమెక్సికో రాష్ట్రందాకా మూడు వేల మైళ్ల నిడివీ, నూటేభై రెండొందల మైళ్ల వెడల్పూ, పధ్నాలుగు

వేల అడుగుల ఎత్తున ఉండే ఎల్బర్ట్ శిఖరంలాంటి ప్రదేశాలూ, పదికిలో మీటర్ల నిడివి గల మొఘెట్ టన్నల్, రెండు గంటలు ప్రయాణం చేస్తే తొమ్మిది వేల అడుగుల ఎత్తున 'వింటర్ పార్క్', మధ్యలో కొలరాడో గోర్ అన్న అరవైమైళ్ల ఉపపర్వత శ్రేణి- గొప్ప దృశ్యాలు, గొప్పగొప్ప దృశ్యాలు. హాల్లో కుడివేపున కూర్చోవాలో, ఎడమవేపునో అన్న నిరంతర మీమాంస. ఒకేసారి దేవుళ్లలా నాలుగు రూపాలు ధరించి కిందా పైనా, కుడీ ఎడమ చూడాలన్న ఆత్రం. తాపత్రయం.

హఠాత్తుగా వర్షం. కిటికీల మీద ముత్యాల ధారలు. సరాలు... ఏవేవో చిరునదులు... ఆకాశంలో తెల్లగా నీలంగా గాఢంగా మబ్బులు... ఏదో పట్నం... మధ్యాన్నం రెండు. గ్లెన్‌వుడ్ స్ప్రింగ్స్ పట్టణం. కొలరాడో నది... నది వెంబడే మైళ్లకొద్దీ రైలు పరుగు... ఇది కదా స్వప్నయానం అంటే!!

★ ★ ★

'దిగిపోతున్నారా?' వాళ్ల సన్నాహాలు చూసి కొంచెం దిగులుగా అడిగానా పాడవాటి చురుకైన నడివయసు యువతిని.

'అవును. నిన్నట్నించీ నిన్ను గమనిస్తున్నాను. పలకరిద్దామంటే మహా బిజీగా ఉన్నావాయె,' కొంచెం నిష్ఠూరం ఆవిడ పలకరింపులో.

మా అబ్జర్వేషన్ హాలు పక్కనున్న రెగ్యులర్ అప్పర్ టయిర్లో వీళ్ల బృందం చికాగో నుంచి ప్రయాణం చేస్తోంది. అంతా కలిసి పాతిక ముప్ఫైమంది.

'ఉమ్మడి కుటుంబమా?'

'కాదు, ఉమ్మడి కమ్యూనిటీ. ఆమిష్ బృందాల గురించి వినలేదా?'

విన్నాను. వీళ్లది జర్మను మూలమట. ఆధునికతకు- ముఖ్యంగా యంత్రనాగరికతకు దూరంగా ఉండే సంప్రదాయ క్రిష్టియన్ కుటుంబాలివి. ఒక్కో జంటకూ ఆరేడుగురు పిల్లలు చాలా సామాన్యమట. అమెరికా అంతటా విస్తరించిన ఈ తెగలో సుమారు మూడు లక్షలమంది ఉన్నారట.

వాళ్లు మిగతావాళ్లతో అంతగా కలవరని విన్నానుగానీ ఈవిడ చాలా స్నేహంగా మాట్లాడింది. ముందే పలకరించి ఉండి ఉండాలని వాపోయింది. 'గ్రాండ్ జంక్షన్' అన్న స్టేషన్లో దిగిపోయారంతా. పేరూ ఊరూ అడగబుద్ధవలేదు. ఓ విలక్షణ వ్యక్తి. పేరెందుకూ?

★ ★ ★

అయిదు దాటేసింది. రెండవ సాయంసంధ్యా సమయం.

ఒకరోజు గడిచేసరికి హాల్లోని ప్రయాణికులంతా పాత చుట్టాల్లా పలకరించుకోవడం మొదలెట్టారు. అనేకానేక దేశాల వారు, జాతులవారు. యూరోపియన్లు, జపనీయులు, ఆఫ్రికన్లు, స్కాట్లెండ్, ఫ్రెంచ్, ఇండియన్... ఎల్లలులేని స్నేహ భావన.

ఓ స్కాట్లెండ్ మధ్యవయస్కుడితోనూ, మరో ఆస్ట్రేలియా పెద్దావిడతోనూ ఎలా జరిగిందోగానీ సాహిత్యం మాటల కేంద్ర బిందువయింది. పరస్పర భాషా సాహిత్యాల పరిచయాలు. సంతోషాలు, సంవేదనలు. గబుక్కున గుర్తొచ్చి నా దగ్గర ఉన్న 'ఆత్మీయమ్' పుస్తకంలోని మునిపల్లె రాజుగారి 'మహాబోధి ఛాయలో...' ఇంగ్లీషు అనువాదం చదవమని ఇచ్చాను. ఇద్దరూ చాలా ఇష్టంగా చదివి- దాని గురించి మాట్లాడారు.

ఈ సందడి గమనించిన ఇద్దరు జపాను యువతులు వచ్చి మాట కలిపారు. మాటలు మామూలుగానే సాగినా నాదైన బాణీలో 'మధ్య తరగతి వాళ్ల సమస్యలు... స్వకపోల కల్పితాలు. అంచేత పరిష్కారాలు వాళ్లే వెతుక్కోవాలి.' 'మన ప్రాముఖ్యతలు మనకు స్పష్టంగా తెలిస్తే జీవితం అతి సరళం' లాంటి గొప్ప గొప్ప మాటల్ని అలవోకగా ప్రవచించాను. చూస్తే వాళ్ల మొహాల్లో స్నేహభావన స్థానంలో 'ఆరాధనా దృష్టి' కనిపించి భయం వేసింది. సంభాషణను హైకూలూ బషోలూ నుంచి తప్పించి కురుసోవా సినిమాల మీదకు మళ్లించాను.

★ ★ ★

రెండో క్యాంటిన్ పెద్ద మనుషుల క్యాంటీను!

టేబుళ్లు, కత్తులు, ఫోర్కులు, నాప్‌కీన్లు... అంతా డిగ్నిటీ, డిగ్నిటీ!



ఓసారి ఆ అనుభవమూ పొందాలనిపించింది. సీటు బుక్ చేశాను.

మరో నడివయసు అమెరికన్ దంపతులతో కలిపి నాకు టేబుల్ ఇచ్చారు. పరిచయాలు. అతనో లాయరు, ఆవిడ రియల్ ఎస్టేటు. వాళ్ల కోటూబూటుల్లో కోట్లు కనిపిస్తోన్నా మాటల్లో 'మనిషి తనం' కూడా కనిపించి సంతోషపెట్టింది. 'ఒక్క భోజ నానికి నలభై డాలర్లా' అని మనసు మూలిగినా- గొప్ప అనుభవం, వాళ్లతో.

★ ★ ★

రాత్రి తొమ్మిది దాటేసింది. బండి ఉటా రాష్ట్రంలో-ప్రోవో పట్నం మీదుగా, ఉత్తర వాహినిగా... తెల్లారేసరికి నెవడా రాష్ట్రం. ఎడారి... సూర్యోదయం.

ఇసుకతిన్నెలు కాదుగానీ గడ్డితప్ప చెట్టూచేమా ఎదగని చవిటిపర్రల్లో, కొండల నేపథ్యంలో రెండు గంటలు- బాగా తెల్లారి పోయింది. రెనో అన్న ఊరు. మా హోలు స్పీకర్లలో ఆ ప్రాంతం గురించి వివరాలు చెప్పడం మొదలయింది. అదో నాలుగయిదు గంటలు శాక్రిమాంటో దాకా కొనసాగింది.

మేం చేరుకొన్నది 'సియెర్రా నెవాడా' పర్వతశ్రేణి. అది అమెరికా ఖండాల వెన్నెముక అట. అంటార్కిటికా నుంచి దక్షిణ అమెరికా వరకూ నాలుగువేల మైళ్లు వ్యాపించి ఉన్న పర్వత శృంఖలాలలో ఈ సియెర్రా నెవాడా ఒక భాగమట. పదికోట్ల సంవత్సరాల క్రితపు హిమనదులు అక్కడి గ్రానైట్ శిలలను చెక్కగా చెక్కగా ఏర్పడిన చక్కని పర్వత శ్రేణి అట. పధ్నాలుగువేల అడుగుల ఎత్తయిన విట్నీ శిఖరం, ఈ పర్వతశ్రేణి పశ్చిమ పాదాల దగ్గర- కాలిఫోర్నియా వేపున- పంథొమ్మిదో శతాబ్దపు నలభైలలో జరిగిన గోల్డ్‌రష్- బంగారం వేట, అక్కడి యశోమైట్ లోయ, టాహో బృహత్ సరోవరం, స్టానిస్‌లస్ నేషనల్ పార్క్... మాటల్లో 'ట్రకీ' అన్న పట్నం. అప్పటికే రైలు మళ్లా కొండలెక్కేసి అయిదారువేల అడుగుల ఎత్తున ప్రయాణం చేస్తోంది.

ట్రకీ దాటీదాటగానే రైలు బండి పదిహేను ఇరవై నిమిషాల పాటు ఒక చక్కని చెరువుపక్కగా సాగింది. 'టాహో సరస్సు అనుకొన్నాగానీ బహుశా అది డోవర్ సరోవరం అయి ఉండాలి,' అన్నాడో సహ ప్రయాణీకుడు. ట్రకీ పట్నంలోనే ఓ నది కనిపించింది- టాహో సరస్సునూ 120 మైళ్ల ఉత్తరాన ఉన్న పిరమిడ్ సరస్సునూ అనుసంధానించే 'ట్రకీ రివర్' అట ఆ నది.

ట్రకీ దాటాకా బండి ఆసక్తికరమైన ప్రదేశాలను తడుముతూ వెళ్లింది. క్రిస్టల్ లేక్, యుబా పాస్, ఎమిగ్రెంట్ గాప్, బ్లూ కాన్యన్ (శిలాఖాతం), సీక్రెట్ టౌన్, క్లిప్పర్ గాప్.. రోజ్‌విల్ పట్నం.

కాలిఫోర్నియా రాష్ట్రపు రాజధాని శాక్రిమెంటో మరో గంట న్నరలో వచ్చింది. ముచ్చటైన ఊరు. ఏవో రెండు నదులు... అప్పటికే రెండువేల మూడు వందల మైళ్లు గడిచాయి. మరో వందమైళ్లు దాటితే గమ్యం!!

సాయంత్రం నాలుగు ప్రాంతంలో మార్టినెజ్ అన్న ఊరు. కార్క్వినెజ్ అన్న జలసంధి దాటుకొని సముద్ర జలాల వెంబడే శాన్‌పాబ్లో అఖాతం దాటుకొని-అయిదున్నరకు శాన్‌ఫ్రాన్సిస్కో శివార్లలోని ఎమిరివిల్ చేరాం. బండి అక్కడి దాకానే!

నేను వెళ్లవలసింది సన్నీవేల్. బండి మారాలి. నా హోతలు కె. గీత, కె. వరలక్ష్మిలు- అప్పటికే ఫోన్ల ద్వారా వివరాలు అందించేస్తున్నారు.

బండి మారి వాళ్ల స్టేషను దగ్గర దిగేసరికి ఎనిమిది దాటింది. మనసు రైలు బండిని దాటుకొని గోల్డెన్ గేట్ బ్రిడ్జి మీదుగా తెలుగు సాహితీ మిత్రుల మీదకు మళ్లసాగింది.

ప్రకృతి అయినా, సాహిత్యమైనా యాత్రికునికి ఒక్కటే గదూ!

తెలుగు సాహిత్యంలో యాత్రాస్మృతులను రాయడంలో ప్రత్యేక ముద్ర కనబరచిన దాసరి అమరేంద్ర కథకుడు, వ్యాసకర్త కూడా. నిరంతర పథికుడు. నాలుగు యాత్రాకథనాలు, ఒక కథాసంపుటి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి మరో కథాసంపుటి ప్రచురించారు. నివాసం న్యూఢిల్లీ. email: damarendra53@gmail.com

చిన్న సినిమాలు - పెద్ద లాభాలు

కె.వి.ఎస్. రామారావు

అన్ని కాలాల్లోను నిలబడగలిగే చిన్న సినిమాలు ప్రేమకథా చిత్రాలు. ఐతే ఇవి అప్పటి యువత నాడిని చక్కగా పట్టుకోగలిగి తేనే విజయం సాధించగలవ్. ఎందుకంటే ఒక రకంగా చూస్తే తెలుగు సినిమాలన్నీ ప్రేమకథాచిత్రాలే, పెద్దవి కాని చిన్నవి కాని. మరి మిగిలిన వాటికన్న వేరేగా కనిపించాలంటే ప్రేక్షకుల్లో చాలా ఎక్కువ శాతం వున్న యువకులకి వాళ్ల జీవితాల్లో కనపడుతున్న సమస్యలు, సంఘటనలు, అలవాట్లు, కోరికలు, ఆశయాల్ని ప్రతిబింబించాలి. అలాటి సినిమాలకి విజయావకాశాలు ఎక్కువ.

ఈమధ్య విజయం సాధించిన చిన్న తెలుగు సినిమాల గురించి తానా సావనీర్‌కి ఓ వ్యాసం రాస్తే బావుంటుందని వాసిరెడ్డి నవీన్‌గారు సూచిస్తే ఈ వంకతోనైనా కొన్ని కొత్త తెలుగు సినిమాలు చూడొచ్చు, పెద్ద కష్టంలేని పని కదా రాసేద్దాం లే అనుకున్నా. తీరా మొదలెట్టే సరికి ఎన్నో సందేహాలు- అసలు చిన్న సినిమా అంటే ఏమిటి? చిన్న సినిమాకి విజయం అంటే ఏమిటి? ఇప్పుడు విజయవంతమైన చిన్న సినిమాలకి, ఇదివరకు విజయవంతమైన చిన్న సినిమాలకి పోలికలు, వ్యత్యాసాలు ఏమిటి? ఏ గుణాలుంటే చిన్న సినిమాలు విజయవంతమౌతాయి? మామూలుగా వినపడే మాట, 'సినిమాకి కథే ప్రాణం, అందునా చిన్న సినిమాలు మంచి కథ లేకపోతే ఆడవు,' నిజమేనా? విజయం సాధించే హాలివుడ్ చిన్న సినిమాలకి తెలుగు చిన్న సినిమాలకి ఏవన్నా పోలికలున్నాయా? చిన్న సినిమాల విజయం మీద ప్రపంచీకరణ ప్రభావం ఎంత వుండొచ్చు? తెలుగు ప్రేక్షకుల్లో మార్పులు విజయవంతమయే చిన్న సినిమాల మీద ఎలాటి ప్రభావం చూపుతున్నయ్? ఇలా తీగలాగితే డొంకంతా కదలటం మొదలయ్యింది.

ఈమధ్య వచ్చిన వాటిలో ఏవి జనం మెచ్చిన చిన్న సినిమాల్లో నాకు తెలిసిన కొన్ని సినిమాలు ఇవి- ఉయ్యాలా-జంపాలా, పెళ్లిచూపులు, కుమారి *21F*, సప్తగిరి ఎక్స్‌ప్రెస్, కృష్ణగాడి వీరప్రేమ గాథ, నా బంగారు తల్లి, పూర్ణ. నాకు కలిగిన చాలా సందేహాల్ని తీర్చటానికి ఈ సినిమాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఇక ఈ సందేహాల్ని ఒక్కొటొక్కటే పరిశీలిద్దాం -

చిన్న సినిమా అంటే ఏమిటి?

చిన్న బడ్జెట్‌తో, చాలాభాగం అనామక నటీనటుల్తో తీసే వాటిని చిన్న సినిమాలనొచ్చనుకుంటాను. బడ్జెట్ ఒక్కటే చిన్నదైతే చాలదు - హాలివుడ్‌లో పెద్ద పెద్ద (అంటే మామూలుగా బోలెడంత పారితోషికాలు తీసుకునే) నటీనటులు అనేక కారణాల వల్ల చిన్న సినిమాల్లో అప్రధాన పాత్రల్ని పోషించటం సర్వసాధారణం. వీటిని 'కేమియో' రోల్స్ అంటారు. తెలుగులో హీరోల విషయంలో ఇలాటివి చాలా తక్కువ కాని చిరపరిచితులైన కేరక్టర్ ఏక్టర్స్ చెదురుమదురుగా చిన్న తెలుగు సినిమాల్లో కూడ కనిపిస్తుంటారు. ముఖ్య

పాత్రలు మాత్రం అనామకులో కాకుంటే 'చిన్న హీరో'లో అయుంటారు. పైన చెప్పిన సినిమాల్లో ఒక్క నాని తప్ప మిగిలిన హీరోలెవరూ ఎక్కువ సినిమాల్లో ఇంతకు ముందు వున్నవారు కారు. హీరోయిన్లందరికి ఇవే తొలి సినిమాలనుకుంటాను. సాంకేతిక రంగాల్లో వారూ ఎక్కువమంది తొలిగా పరిచయ మౌతున్న వాళ్లే. బడ్జెట్ చిన్నదిగా వుండటానికి ఇవన్నీ కారణాలు కావొచ్చు కాని ఇవే కారణాలు కావు. ఉదాహరణకి అందరూ కొత్త నటీనటుల్తో, చిన్న చిన్న సెట్టింగుల్తో మహాభారతాన్ని తీశారను కోండి, కథనంలోనో సంభాషణల్లోనో ఎంతో కొత్తదనం, ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించే మరేదైనా అంశం వుంటే తప్ప జనం చూడరు. ఎప్పుడో వచ్చిన దాన వీర శూర కర్ణ విషయం ఇలాటిదే. ఒక వంక భారీ ఖర్చుతో కురుక్షేత్రం తీస్తుంటే దానికి పోటీగా ముఖ్య పాత్రలన్నీ తనూ తన కొడుకులు మిత్రులతో వేయించి సాంకేతి కంగా నాసిరకంగా వున్నా కేవలం దుర్యోధన పాత్రలో చెప్పిన డైలాగుల వల్ల సినిమాని పెద్ద హిట్ చేసుకున్నాడు ఎన్టీఆర్. ఆ సినిమాకి బడ్జెట్ చిన్నది, ఐనా నటీనటులు అనామకులు కారు కనక దాన్ని చిన్న సినిమా కింద లెక్కవెయ్యలేం.

పూర్వకాలంలో పేరులేని తారలతో సినిమాలు తీసిన పేరున్న దర్శకులుండేవారు. ఆదుర్తి సుబ్బారావుగారు కన్నెమనసులు, తేనెమనసులు వగైరా సినిమాలతో ఇలాటి ప్రయోగాలు కొన్ని చేశారు. తర్వాత దాసరి నారాయణరావుగారు కొంతకాలం పాటు అలాటి సినిమాలే తీసి గొప్ప విజయాల్ని సాధించారు. అతని మొదటి సినిమా తాత-మనవడు తప్పకుండా పెద్ద లాభాలు తెచ్చిన చిన్న సినిమానే. ఐతే, తర్వాత్తర్వాత అతను తీసిన వాటిని కూడ చిన్న సినిమాలుగా లెక్కెయ్యాలా అనేది అడగదగ్గ ప్రశ్న. తారలతో పాటు ఒక సినిమాకు సంబంధించిన ముఖ్యులెవరూ (అంటే డైరెక్టర్, ప్రొడ్యూసర్. మ్యూజిక్ డైరెక్టర్ లాంటి వాళ్లు) లబ్ధప్రతిష్టులు కాకపోతేనే ఆ సినిమాని చిన్న సినిమాగా లెక్కవెయ్యటం సమంజసం కావొచ్చు. ఎందుకంటే, సినిమాలో పస లేకపోయినా దానికి అనుసంధానంగా వున్న పెద్దవారి పేరు మూలాన అది బాగా ఆడే అవకాశాలు కొంతైనా ఉన్నాయి కనక. ఐతే, దాసరి నారాయణరావు విషయంలో, అనామకుడి నుంచి ఎప్పుడు పెద్ద పేరున్న వాడిగా మారాడనేది కూడ ఆలోచించదగ్గ విషయమే. అతనొక్కడే కాదు, అందరు దర్శకులు, తారలు, మిగిలిన వాళ్ల విషయంలో కూడ ఇది ఆలోచించదగ్గ విషయం. అంటే, సినిమా ఎలాటిదైనా సరే, ఎప్పుడూ కేవలం ఒక వ్యక్తి పేరు వల్ల దానికి చెప్పుకోదగ్గ కలెక్షన్ వస్తుందో అప్పట్నుంచి ఆ వ్యక్తికి సంబంధం వున్న సినిమాలు చిన్న సినిమాలు కాకుండా పోతాయి.

విజయవంతమైన చిన్న సినిమా అంటే ఏమిటి?

బడ్జెట్ పరంగా చిన్న సినిమాలు ఒక మాదిరిగా ఆడితే చాలు, కొంత లాభం సంపాయించటానికి. ఐతే అది చాలదు దాన్ని విజయవంతమైన సినిమాగా లెక్కవెయ్యటానికి. నాకనిపించేది జనం విస్తుపోయేంతగా, ఊహించని రీతిలో ఆడితేనే చిన్న సినిమాల్ని విజయవంతమైనవిగా చూస్తారని. ఎప్పటివో ఐన శంకరాభరణం, ముత్యాల ముగ్గు లాటివి ఇందుకు extreme examples. ఐతే అన్నీ వాటి స్థాయి విజయాలు కాలేవు, కావా లనుకోవటం అత్యాశ కూడ. కాని ఊహించని రీతిలో విజయం సాధించటం ముఖ్యం అనుకుంటాను.

ఐతే, మార్కెటింగ్ విపరీతంగా జరుగుతున్న ఈ రోజుల్లో కూడ ఇది అన్వయిస్తుందా అన్న ప్రశ్న వస్తుంది. కాకపోతే, మనం నిర్వచించుకున్న ప్రకారం చూస్తే చిన్న సినిమాలకి మార్కెటింగ్ పెద్దగా వుండటం సాధ్యం కాదు. పెద్దగా మార్కెటింగ్ జరిగితే అది చిన్న సినిమా కాకుండా పోతుందన్న మాట - బడ్జెట్ పరంగానూ, పేరున్న వారితో సంబంధం విషయంలోనూ.

మొత్తం మీద, పేరున్న వారితో సంబంధం లేకుండా, పెద్దగా మార్కెటింగ్ లేకుండా, చాలావరకు ఆనోటా-ఈనోటా పాకి సాధించే విజయాన్ని మాత్రమే ఊహించని విజయంగా అను కోవచ్చు.

పాత, కొత్త చిన్న సినిమాలు. పోలికలు, వ్యత్యాసాలు

నేను పైన చెప్పిన లిస్ట్‌లోవి ఎక్కువ భాగం 2016లో వచ్చినవి గనుక దానికి ముప్పై ఏళ్లక్రితం, అంటే 1986లో వచ్చిన, బాగా ఆడిన చిన్న సినిమాలతో పోల్చి చూద్దాం. 1986 ఎందుకు, మరే సంవత్సరమైనా కావొచ్చు కదా అంటే, అందుకు ప్రత్యేక కారణం ఏమీ లేదు. మూడు దశాబ్దాలైతే స్పష్టమైన పోలికలు, వ్యత్యాసాలు కనిపించేంత దూరం, అంతే. దూరం ఎక్కువ లేకపోతే బాగా ఆడిన పాత సినిమాల ప్రభావం కొత్త వాటి మీద పడే అవకాశం ఎక్కువ కనుక (ఈప్రభావం ఎలాటిదైనా కావొచ్చు - అంటే పాత వాటిని అనుసరించొచ్చు లేదా వాటికి వ్యతిరేక ధోరణిని అవలంబించొచ్చు, లేదా కొంత అనుసరణా కొంత వ్యతిరేకతా ఉండొచ్చు) ముప్పై ఏళ్లైతే అలాటి అవకాశానికి తావుండదు - కొత్తగా సినిమాలు తీసేవాళ్లు అంతదూరం వెనక్కెళ్లి వాటిచేత ప్రభావితులు కావటానికి అవకాశం బాగా తక్కువ.

మరి 1986లో వచ్చిన సినిమాలేవో, వాటిలో బాగా ఆడిన చిన్న సినిమాలేవో గుర్తించటం ఎలా? వెబ్ మీద ఎన్నో సైట్లలో 1986లో వచ్చిన సినిమాల వివరాలున్నయ్ కాని ఒక దానికి మరో దానికి చెప్పుకోదగ్గ తేడాలు కూడా ఉన్నయ్. అంటే, వీటిలో ఏ పట్టిక కూడా పూర్తిగా ప్రామాణికం కాకపోవచ్చు. Wikipediaలో పట్టిక మరీ అధ్వాన్నంగా వుంది. అన్నిట్లోకి కొంత నమ్మదగింది allbestsongs.comలో దొరికింది. దాన్లో వున్న సినిమాల హీరోలని గుర్తించి దాన్ని బట్టి వాటిలో చిన్న సినిమాలేవో నిర్ణయించటం జరిగింది. ఇంక వాటిలో బాగా ఆడినవి ఏవి? అప్పటి బాక్సాఫీస్ వివరాలు ఇప్పుడు వెబ్‌మీద ఎక్కడా అందుబాట్లో లేవు. అందువల్ల తెలిసిన వాళ్ల సినిమా పరిజ్ఞానం మీద, నాకు తెలిసిన వివరాల మీద ఆధారపడాల్సొచ్చింది. ఈ ఆధారాల ప్రకారం 1986లో బాగా ఆడిన చిన్న సినిమాలు- ఆలాపన, అరుణ కిరణం, మా పల్లెలో గోపాలుడు, పడమటి సంధ్యారాగం. (ఈ పట్టికలో వున్న

సినిమాలన్నీ 1986లోనే వచ్చినవని చెప్పలేంగాని దానికి కొంచెం అటూ ఇటూగా వచ్చినవని మాత్రం తప్పకుండా చెప్పొచ్చు.) మరో విషయం - ఇక్కడ మన అవసరం తీరటానికి అవి సరిగ్గా 1986 లో వచ్చినవే అయుండక్కర్లేదు కూడా.

ఈ సినిమాలలో నటించిన వారు కొందరు ఆ తర్వాత పెద్ద తారలయ్యారు కాని అప్పటికి వారు అంత పెద్దవారు కారు. అలాగే, దర్శకులు కూడ తర్వాత పేరు తెచ్చుకున్నవారే కాని అప్పటికింకా అంత పెద్దవారు కారని నేననుకుంటున్నా. వీటిలో రెండు - *ఆలాపన, అరుణ కిరణం* - ఒకరకంగా అంతకుముందు ఒకటి రెండేళ్ల క్రితం వచ్చి బాగా పేరు తెచ్చుకున్న సినిమాలకి అనుసరణలు- *అరుణ కిరణం*, ప్రతిఘటన విజయాన్ని అనుసరిస్తే, *ఆలాపన* అదే దర్శకుడు అంతకుముందు తీసిన *సితార*, అన్వేషణల ఒరవడిలో, దక్షిణభారతాన్ని ఊపేస్తున్న ఇళయరాజా సంగీత సహకారం, భానుప్రియ నాట్యకౌశలం ఆలంబనగా వచ్చింది. ఐతే ప్రతిఘటనకు, అరుణ కిరణానికి కథాపరంగా, సమస్య తీవ్రత విషయంలో, ప్రేక్షకుల అనుభవాలకి దగ్గరగా వుండటంలో ఎన్నో వ్యత్యాసాలున్నయ్. అందువల్ల *అరుణ కిరణం*, ప్రతిఘటన లాటి విజయాన్ని సాధించలేదు. ఇక మా పల్లెలో గోపాలుడు, *పడమటి సంధ్యారాగం* రెండూ విలక్షణమైన సినిమాలు. మా పల్లెలో గోపాలుడు వివాహబంధం హద్దుల్ని చూపటానికి చేసిన ప్రయత్నం. *పడమటి సంధ్యారాగం* అమెరికాకు వచ్చిన తొలితరం వారికి, వాళ్లు ఊహించలేనంత కొత్త స్వేచ్ఛతో అమెరికాలోనే పెరుగుతున్న వాళ్ల పిల్లలకి ఉన్న భావాల అంతరాన్ని, అది జీర్ణించుకోలేని పెద్దల బాధని చూపించటానికి చేసిన ప్రయత్నం. ఐతే మా పల్లెలో గోపాలుడులో హీరోయిన్ భర్త పరమ నీచుడిగా, *పడమటి సంధ్యారాగం*లో హీరోయిన్ భర్త శ్వేత జాతీయుడైనా హిందూ సంప్రదాయవాదిగా చూపబడటం సంఘంలో గూడుకట్టుకున్న ఆచారాల హద్దుల్ని కేవలం కనపడీ కనపడనట్టుగా మాత్రమే కదిలించే ప్రయత్నాలుగా చూడొచ్చు. *అరుణ కిరణం* కూడ చాలవరకు అలాటి దారినే అనుసరిస్తుంది. *ఆలాపన* మాత్రం సాంఘిక సమస్యల జోలికి వెళ్లకుండా సంగీత నాట్యాల మీద, దర్శకుడు వంశీకే సొంతమైన విచిత్ర పాత్రల చిత్రణ వల్లా విజయవంతమైంది.

మొత్తం మీద, ఈ నాలుగింట్లో మూడు సాంఘిక సమస్యల్ని ఎత్తిచూపితే ఒకటి కళాత్మకతకి ప్రాధాన్యత ఇచ్చిన సినిమా. అప్పటికి అవి కొంత కొత్తదనాన్ని, కథనంలో కొంత సృజనాత్మకతని చూపించినయ్. ఐతే, వీటిలో ఏ ఒక్క సినిమా దర్శకులకి ఇది తొలి సినిమా కాదు.

2016 ప్రాంతాల్లో విజయవంతమైన చిన్న సినిమాల దర్శకులు దాదాపుగా అందరూ కొత్తవారే కావటం విశేషం. దీనికి ఒక కారణం ఏమంటే - ముప్పై ఏళ్ల నాడు చిన్న సినిమాల నుంచి పెద్ద సినిమాల స్థాయికి ఎదగటానికి దర్శకులకి కొంత సమయం పడితే, ఇప్పుడు ఒకట్రెండు చిన్న సినిమాల్తో విజయం సాధించిన దర్శకులు పెద్ద సినిమాలు తీసెయ్యగలగటం అనిపిస్తుంది. దీనివల్ల చిన్న సినిమా అంటే దాని దర్శకుడు (దర్శకురాళ్లు ఇప్పటికీ ఒకరిద్దరికి మించి లేకపోవటం ఒక దౌర్భాగ్యం) కొత్తవాడో లేక అప్పటివరకు పెద్ద హిట్ కొట్టలేకపోయిన 'వర్ధమాన' దర్శకుడో అయి తీరుతున్నాడు.

నాకు ఆశ్చర్యం కలిగించిన ఒక విషయం ఏమంటే, ఇప్పటి చిన్న చిత్రాల దర్శకులు, సాంకేతిక సిబ్బంది కొత్తవాళ్లైనా టెక్నాలజీలో గట్టివారై వుంటారనుకున్న నా ఊహ నిజం కాకపోవటం. మొబైల్‌ఫోన్ తో ముచ్చటైన సినిమాలు తియ్యగలిగే ఈ రోజుల్లో సాంకేతికంగా చాలా హీనస్థితిలో వున్నయ్ ఇప్పటి విజయవంతమైన చిన్న సినిమాలు. దీనికి కేవలం బడ్జెట్ మాత్రమే కారణం కాకూడదు, ప్రతిభ కూడా లోపించింది. సినిమా తియ్యాలన్న ఆవేశం తప్ప సరిగా తియ్యగలిగిన సాధన వీళ్లలో కనిపించటం లేదు. ఇది విచారించదగ్గ విషయం.

ఐతే, ఇన్ని అవకతవకలున్న చిన్న సినిమాల్ని కూడ ప్రేక్షకులు ఆదరిస్తున్నారంటే, 'పెద్ద సినిమాలు' ఎంత దౌర్భాగ్యస్థితిలో వున్నాయో అర్థం చేసుకోవచ్చు. వాటికి ఏ మాత్రం alternative కనిపించినా ఆదరించటానికి జనం సిద్ధంగా వున్నారన్న మాట. సామాన్య జనజీవనంతో పెద్ద సినిమాలు సంబంధాలు పూర్తిగా తెంచేసుకుని వాటి సొంత ఊహాప్రపంచంలో విహరిస్తూ సినీ ప్రేక్షకులెవరూ ఊహించుకోలేని పాత్రల్ని, వాళ్ల సమస్యల్ని, గురించి సానుభూతి చూపమని ప్రేక్షకుణ్ణి బలవంతపెడుతుంటే వేరే దిక్కు లేక చచ్చినట్టు వాటిని చూస్తున్నారు తప్ప ఏమాత్రం ఒక మోస్తరుగా వున్న మామూలు మనుషుల కథలు కనిపించినా చూస్తారని ఇది ఋజువు చేస్తుంది.

2016 ప్రాంతాల్లో విజయవంతమైన చిన్న సినిమాల్లో కథా కథనాలలో అన్నిట్లోకి మెరుగైన సినిమా పెళ్లిచూపులు. యువతని బాగా ఆకట్టుకునే అంశాలు, యువతరం జీవనవిధానం మీద మంచిపట్టు ఇందులో కనిపిస్తయ్. పెళ్లిచూపుల్లో పాత బాయ్ ఫ్రెండ్స్, గర్ల్ ఫ్రెండ్స్ గురించి ఒకరికొకరు ధైర్యంగా చెప్పుకోవటం, అదో పెద్ద విషయమేమీ కాదని ప్రేక్షకులు ఈ సినిమాని బాగా చూడటం శుభపరిణామాలు. తనకీ పెళ్లి ఇష్టం లేదని అమ్మాయి ముందుగానే చెప్పెయ్యటంతో కథాపరంగా కూడ ఇది నమ్మదగిన

అంశం. చివరకు హీరో హీరోయిన్లు ఇద్దరూ వాళ్లకి ఇష్టమైన బిజినెస్ లో స్థిరపడటం సంతృప్తికరమైన ముగింపు. సాంకేతికంగా చెప్పుకోవలసినవి ఏమీ లేకపోయినా మరీ ఘోరంగా కూడ లేదీ సినిమా. కమర్షియల్ హంగులు చేరకుండా జాగ్రత్తపడ్డారు కూడా. ఉదాహరణకి పాటలన్నీ బేక్‌గ్రౌండ్‌లోనే సాగుతయ్. ఎవరూ హఠాత్తుగా లంకించుకుని గెంతులేస్తూ పాటందుకోరు. ఐతే, నటనపరంగా కొంచెం ప్రతిభ వున్నట్టు కనిపించిన హీరోయిన్ బాయ్‌ఫ్రెండ్‌ది చాలా చిన్న పాత్ర. మిగిలిన వాళ్ల నటన గురించి మాట్లాడక పోవటమే మంచిది (తండ్రుల పాత్రలు వేసినవాళ్లు కొంత అనుభవం వున్నవాళ్లు, వాళ్ల పరిధుల్లో బాగానే చేశారు).

2016లో విజయవంతమైన చిన్న సినిమాల్తో పోలిస్తే, కుమారి 21F సాహసవంతమైన ప్రయత్నమనే చెప్పొచ్చు. ఇందులో హీరోయిన్ పూర్వకథలో prostitute. హీరో మనస్ఫూర్తిగా ప్రేమించి పెళ్లి చేసుకుంటాడు. ఇలాటి సినిమాలు ఇదివరకు కూడా కొన్ని వచ్చినయ్. ఐతే వాటిలో సామాన్యంగా సమాజం విలన్‌గా వుండేది. చుట్టుపక్కల వాళ్లంతా వాళ్లని మానసికంగా నానావిధాలుగా హింసించేవారు. ఆ ఆటుపోట్లకి తట్టుకుని నిలబడి ప్రేమని విజయవంతం చేసుకోవటంతో కథలు ముగిసేవి. ఇక్కడ అలాటి దేమీ లేదు. ఎవరికీ ఏమీ పట్టినట్టు కనిపించదు. మారుతున్న సమాజపు విలువల్ని, నగరజీవితాన్ని బాగానే పట్టుకుందీ సినిమా. ఐతే ఇది *The girl next door* అనే హాలివుడ్ సినిమాకి అనుకరణ. ఆ సినిమాలో హీరోయిన్ porn star ఐతే సెన్సారు పక్షంగా ఇక్కడ prostituteగా చేశారు. మొత్తానికి హాలివుడ్ సినిమాల్ని అను 'వధించే' చాలా ప్రయత్నాల్లా కాకుండా దీన్ని కొంత సమర్థవంతంగానే నిర్వహించారు. హాలివుడ్ సినిమాకి అనుకరణ అనిపించకుండా తీశారు. సాంకేతికంగా కూడ ఈ సినిమా పరవాలేదు. ఐతే కమర్షియల్ సినిమాల మూస నించి మాత్రం బయటపడలేక పోయారు. కమర్షియల్ సినిమాల హంగులు దీన్లో కూడ చాలానే కనపడతయ్- ఐటం సాంగ్స్‌తో సహా. కొసమెరుపుగా హీరోయిన్ని రేప్ చేసిన తన మిత్రుల్ని హీరో బంధించి వుంచి హింసించటం అస్వభావికమే ఐనా చిరునవ్వు తెప్పించక మానదు.

వింతేమిటంటే, *The girl next door* పెద్దగా విజయవంతమైన సినిమా కాదు. అలాటిదాన్ని తీసుకుని తెలుగులో తియ్యటం సాహసమే. ఇందుకు కారణం తెలుగు సినిమా ప్రేక్షకుల్లో వచ్చిన మార్పులని నా ఉద్దేశ్యం. అందుకే ఏదో విధంగా మిగిలిన వాటన్నటి కంటే వేరేగా ఉండటానికి చేసే ప్రయత్నంలో అబ్బాయిల్ని గిలిగింతలు పెట్టే కథని ఎన్నుకుని తీసిన కుమారి *21F* విజయం సాధించింది.

కృష్ణగాడి వీరప్రేమగాథ నాని ఎప్పట్నుంచో చేస్తున్న పాత్ర లాటి పాత్రనే అదే తరహాలో, సరదా సంఘటనల్లో చూపించిన సినిమా. అదివరకు అలా మొదలైంది కాని, పిల్ల జమిందారు కాని, ఇంకా వెనక్కి వెళ్తే అష్టా చెమ్మా కాని అన్నీ ఇలాటి సినిమాలే (ఒక్క ఈగలో మాత్రం కొంచెం విలక్షణత వున్నది). అదివరకు రాజేంద్రప్రసాద్, నరేష్‌లు చేసిన చాలా పాత్రల్లాటి పాత్రలే ఇవి (కాలానుగుణంగా వచ్చిన మార్పుల్ని లెక్కలోకి తీసుకుంటే). అల్లరి నరేష్ మరీ సిల్లీ పాత్రలు చేసి కొద్దికాలంలోనే ఇక చాలు బాబోయ్ అని ప్రేక్షకుల్ని పరిగెత్తిస్తే నాని మాత్రం కొంత హద్దుల్లో వుండి తన 'బ్రాండ్' కాపాడుకుంటూ వస్తున్నాడు ఇప్పటివరకు.

సరదా సినిమాలకి ఆదరణ బాగా వుంటుందని ఇదివరకు జంధ్యాల, రేలంగి నరసింహారావు, ఇ.వి.వి. సత్యనారాయణ, ఎస్వీ కృష్ణారెడ్డి, వంశీ మొదలైన వాళ్లు చూపించారు. బాలచందర్ కూడ అద్భుతమైన సరదా చిత్రాలు తీసి విజయాలు సాధించాడు. ఈ మధ్య కాలంలో మారుతి నేటితరం యువతీయువకుల అభిరుచుల్ని ప్రతిబింబిస్తూ కొన్ని సరదా సినిమాలు తీసి మంచి విజయాల్నే చూశాడు. సామాన్యంగా సరదా చిత్రాలు ఎప్పుడూ ఆదరణ పొందటానికే అవకాశం ఎక్కువ. కాకుంటే అలాటి సినిమాలు తియ్యటమే కష్టం. ఆ విధంగా నాని అదృష్టవంతుడు- అతనికి దొరికిన చాలా సినిమాలు సమర్థంగా తీసిన సరదా సినిమాలు.

సప్తగిరి ఎక్స్‌ప్రెస్ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. ఇంత చెత్త సినిమాని కూడా బాగానే చూశారంటే తెలుగు ప్రేక్షకులు ఎంతో కొంత వైవిధ్యం వున్న సినిమాల కోసం ఎంత మొహం వాచి వున్నారో తెలుస్తుంది. నాకనిపిస్తున్నది ఈ చిత్రవిజయానికి ఏకైక కారణం దీని హీరో చాలా సామాన్యుడు కావటం, ప్రేక్షకులు నిత్యజీవితంలో చూసే విలన్లని అతను తన జిత్తుల్తో చిత్తు చెయ్యటం అని. అంతకుమించి ఈ సినిమాలో ఏమీ లేదు- ఎన్నోసార్లు చూసి విసుగెత్తిన పాత కథ, నీరస కథనం, మచ్చుకైనా కనపడని సాంకేతిక విలువలు.

ఈ సందర్భంగా హీరోలైన కమెడియన్ల గురించి కొన్ని మాటలు. 70ల తొలిరోజుల్లో చలం హీరోగా కొన్ని విజయవంతమైన సినిమాలొచ్చినయ్. వాటిల్లో చివరిది బుల్లెమ్మ - బుల్లోడు అనేది. ఒక విషయంలో దానికి, సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌కి ఒక పోలిక వుంది - ఒక సామాన్యుడు సరదా సరదాగా విలన్లని చిత్తు చెయ్యటం. ఐతే ఆ తర్వాత చలం హీరోగా ఏ సినిమా కూడ ఆడలేదు. హీరోలయే చాలామంది కమెడియన్లకి ఇదే జరిగింది- ఇప్పటి సునీల్ వరకు. అమాయక హీరో, పెద్ద హీరోల్లా విలన్లని వీరశౌర్య ప్రదర్శనతో కాకుండా కేవలం అమాయకపు బుద్ధి బలంతో చిత్తుచెయ్యటం (బుద్ధిబలం కూడ సీరియస్‌గా వుండ కూడదు - అది కూడ పెద్ద హీరోలకే చెందుతుంది), సినిమా చివరి దాకా తన్నులు తింటూ చివర్లో విధిలేక విలన్ల మీద ఎదురు తిరగటం- ఇలాటివి హీరోలుగా మారే కమెడియన్లకి పనిచేసే సినిసూత్రాలు. వాళ్లూ పెద్ద హీరోల్లాటి పనులు చేస్తామంటే జనం చూడరు. అలాగని ఒకే ఫార్ములాతో ఎన్ని సినిమాలని తీస్తారు? ఎంతో దూరం ఎందుకు- అల్లరి నరేష్‌ని చూడండి. సునీల్ పరిస్థితి అలాటిదే కదా! ఆలీ ఒక్కడే తెలివిగా రెండు గుర్రాల స్వారీ చేసి బతికి బట్ట కట్టగలిగాడు. ఐతే అతను హీరోగా వున్న అతి తక్కువ సినిమాలు హిట్ కావటం, అలా ఐనప్పుడు ఆ క్రెడిట్ దర్శకుడికే

దక్కటం, హీరోగా వేస్తున్నప్పుడు కూడ కమెడియన్‌గా కొన సాగటం అతని విజయ రహస్యాలనుకుంటాను.

విజయవంతమయే చిన్న సినిమాల లక్షణాలు

ఎప్పుడూ సినిమాలలో ఒక ప్రధాన ప్రవంతి వుంటుంది. ఇది పెద్ద సినిమాల దారి. కొద్దికాలానికి అన్ని పెద్ద సినిమాలు ఒకేలా అనిపించటం మొదలౌతుంది. ప్రేక్షకులకి ఊపిరి సలపని స్థితి కలుగుతుంది. చిన్న సినిమాలకు అది బాగా అనుకూలమైన సమయం. ఒక కొత్త రకం సినిమాలకి జాగా ఏర్పడుతుంది. ఒకప్పుడు క్రైం త్రిల్లర్లు, కౌబాయ్ సినిమాలు అలా వచ్చినవే. సామాజిక సమస్యల మీదికి తనదైన విలక్షణ శైలిలో మలుపు తిప్పాడు దాసరి నారాయణరావు. ఆ తర్వాత యండమూరి నవలల్లో ఒక కొత్త రకం హీరో అవతరించాడు. దానికి చిరంజీవి తెర మీద రూపం అయ్యాడు. ఆ దార్లో కొంతకాలం నడిచింది తెలుగు సినిమా. దానికి సమాంతరంగా సరదా సినిమాలు తీస్తూ రేలంగి, ఇ.వి.వి. లాటి వాళ్లు విజయాలు చూశారు. ఆ తర్వాత యువతరం కథల మీద దృష్టి పడింది. చిత్రం నుంచి మొన్న మొన్నటి హేపీ డేస్ లాటి చిన్నసినిమాలు అద్భుత విజయాల్ని సాధించినయ్. తర్వాత హారర్ ఒక పిల్లకాలవగా ఎదిగింది. అదివరక్కూడ అప్పుడప్పుడు హారర్ సినిమాలు వచ్చినా ఈ కొత్తతరం హారర్ హాలీవుడ్ (దీనికి ప్రేరణ జాపనీస్ హారర్), ఇంకా ఇతర దేశాల హారర్ నమూనాలకి అనుసరణ, భారతీయం కాదు. రెంటికీ సమన్వయం కూర్చటానికి ప్రయత్నించినవీ లేకపోలేదు గాని ఒరిజినాలిటీ లేక చాలా భాగం హారర్ సినిమాలు ఎందుకూ కాకుండా పోయినయ్.

అన్ని కాలాల్లోను నిలబడగలిగే చిన్న సినిమాలు ప్రేమకథా చిత్రాలు. ఐతే ఇవి అప్పటి యువత నాడిని చక్కగా పట్టుకోగలిగితేనే విజయం సాధించగలవ్. ఎందుకంటే ఒక రకంగా చూస్తే తెలుగు సినిమాలన్నీ ప్రేమకథాచిత్రాలే, పెద్దవి కాని చిన్నవి కాని. మరి మిగిలిన వాటికన్న వేరేగా కనిపించాలంటే ప్రేక్షకుల్లో చాలా ఎక్కువ శాతం వున్న యువకులకి వాళ్ల జీవితాల్లో కనపడుతున్న సమస్యలు, సంఘటనలు, అలవాట్లు, కోరికలు, ఆశయాల్ని ప్రతిబింబించాలి. అలాటి సినిమాలకి విజయావకాశాలు ఎక్కువ. 2016 పట్టికలో వున్న వినోదప్రధాన చిత్రాలు ఈ కోవలోకి వస్తయ్, ఒక్క సప్తగిరి ఎక్స్‌ప్రెస్ తప్ప.

ఇక ఈ పట్టికలో వున్న అవార్డ్ సినిమాలు నా బంగారు తల్లి, పూర్ణ. వీటిని ఎక్కువమంది చూసి వుంటారని నేననుకోను. కాని వాటి నిజాయితీ వల్ల మంచి పేరు తెచ్చుకున్నయ్, అవార్డులు పొందినయ్. బహుశ ఆర్థికంగా కూడ విజయవంతమై వుండొచ్చు- వీటికయే ఖర్చు చాలా తక్కువ గనుక కొద్దిమంది చూసినా లాభాలు వచ్చే అవకాశం ఎక్కువ. ఒక వర్గం ప్రేక్షకులు కావాలని వెళ్లి ఇలాటి సినిమాల్ని చూస్తారు కూడ. ఐతే ఇలాటి సినిమాలు తీసేవాళ్లు లాభాల కోసం వీటిని తియ్యరు. అది ఒక సామాజిక బాధ్యతగా తీస్తారు. ఎన్నో కష్టాలకోర్చి సాధిస్తారు. అలాటి వాళ్లని అభినందించాలి, సహకారాన్నందించాలి.

చిన్న సినిమాలకి కథే ప్రాణం?

కథలేని సినిమా వుండదు. అది మామూలు ప్రేక్షకులకి అర్థం కాకపోవచ్చు, అప్పుడప్పుడు (చాలాసార్లు?) చిత్రదర్శకుడికి కూడ అంతుచిక్కకపోవచ్చు. మరి, 'కథే ప్రాణం' అంటే ఏమిటి? నాకని పించేది, కథ కన్నా ఒక సినిమాకి కథనం ముఖ్యం అని. ఎందు కంటే, మంచి సినిమా ప్రేక్షకుణ్ణి కట్టిపడేస్తుంది. ఒకసారి చూడటం మొదలుపెడ్తే, అదయేవరకు మరో విషయం ఆలోచించుకో నివ్వదు. ఉదాహరణకి చాలా యాక్షన్ సినిమాల కథ సామాన్యంగా రెండు మూడు వాక్యాల్లో చెప్పెయ్యొచ్చు. Fast & Furious seriesలో ఇటీవల వచ్చినవి, John Wick series, Taken series, ఇలాటి వాటికి కథనమే ముఖ్యం, కథ కాదు. ప్రేక్షకుణ్ణి తనతో పాటు ఈడ్చుకెళ్లి ఏం జరుగుతుందో చూడటం తప్ప ఎందుకు జరుగుతుందో అడిగే అవకాశం ఇవ్వకపోవటం వాటి ముఖ్య లక్షణం. మరోవంక చాలా తాపీగా, కదిలీకదల్నట్టుగా కదిలే కథనాలు కూడ ఉంటయ్. La la land, Arrival 2016లో విజయవంతమైన అలాటి సినిమాలు. తెలుగులో ఇలాటి సినిమాలు కనిపించవు. నిజానికి ఎలాటి కథకి ఏయే సందర్భాల్లో ఎలాటి కథనవేగం వుండాలో తెలిసిన తెలుగు దర్శకులు ఇప్పుడున్నారా అని నా అనుమానం.

మన పట్టికలో వున్న సినిమాల్లో పెళ్లిచూపులు, కృష్ణగాడి వీరప్రేమగాథ మంచి వేగం వున్న కథనాలు. ఐతే పెళ్లిచూపులులో అక్కడక్కడ సంఘటనలకి, వేగానికి సరైన పొంతన కుదరని లోపం స్పష్టంగానే కనిపిస్తుంది. కృష్ణగాడి వీరప్రేమగాథ చక్కటి వేగాన్ని మొదట్నుంచి చివరివరకు చూపిస్తుంది. కుమారి *21F* కథనం విషయంలో చాలాచోట్ల తడబాటు పడింది. సప్తగిరి ఎక్స్‌ప్రెస్ ఈ విషయంలోనూ వెనకే. పట్టికలోని అవార్డ్ చిత్రాలకీ ఈ లోపం వుందిగానీ వాటి బలమైన పాత్రలు ఆ లోపాన్ని పట్టించుకోనివ్వవు. కథే సినిమాకి ప్రాణం ఐతే పూర్ణ, నా బంగారు తల్లి ఆర్థికంగా కూడ గొప్ప విజయాల్ని సాధించేవి. ప్రేక్షకులకి కావల్సింది ముందుగా వినోదం, ఆ తర్వాతే కథ. వినోదం నిరంతరాయంగా వుండటానికి కథనం ప్రధానం.

హాలివుడ్ చిన్న సినిమాలు - తెలుగు చిన్న సినిమాలు

హాలివుడ్ చిన్న సినిమాలు ఎక్కువ భాగం హారర్, కామెడీ

సినిమాలు. తెలుగులో ఈ మధ్య హారర్ సినిమాలు వస్తున్నయ్ కాని ప్రేక్షకాదరణ పొందుతున్నవి చాలాకొద్ది. ఎందుకంటే ఇవి హాలివుడ్, హిందీ హారర్ సినిమాల్తో పోటీపడలేవు. వీటిలో ఒరిజినాలిటీ కనపడదు. కొంచెం వేరేగా వున్న *గీతాంజలి, ఎక్కడికి పోతావు చిన్నవాడ* లాటివి లాభాల బాటలో నడిస్తే, ఎక్కణ్ణుంచో అరువు తెచ్చుకున్న కథలు బోల్తా పడుతున్నయ్. ఇక కామెడీ విషయంలో మంచి కామెడీ సినిమాలు తియ్యగలిగే దర్శకులు చాలాకొద్దిమంది. 2016లో వచ్చిన తెలుగు కామెడీల్లో పట్టుమని పదినిమిషాలు నవ్వించగలిగింది ఒక్కటీ కనిపించలేదు నాకు. ఇదివరలో హాలివుడ్ సినిమాలు ఎక్కువమందికి అందుబాట్లో వుండేవి కావు గనక తెలుగులోకి వాటిని కొద్ది మార్పుల్తో దిగుమతి చేసుకుంటే అప్పుడప్పుడు హిట్లు తగిలేవు. ఇప్పుడలా కాదుగదా, ఎవరైనా ఎలాటి సినిమానైనా వెబ్ మీద చూడొచ్చు. అంచేత తెలుగు సమాజానికి విలక్షణమైన సినిమాల్ని అందించాలంటే ఎంతో పరిశీలన, పరిశోధన కావాలి. లేదా బాహుబలిలా వందల కోట్లు ఖర్చుపెట్టి సంభ్రమాశ్చార్యాలు కలిగించే fantasy సినిమాలు తియ్యాలి. నిజానికి ఇప్పుడు హాలీవుడ్‌లో జరుగుతున్నది కూడా ఇదే- 2016లో వచ్చిన సినిమాల్లో ఎక్కువ వసూళ్లు సాధించినవన్నీ fantasy సినిమాలే, భారీ బడ్జెట్లతో తీసినవే. ఐతే భారీబడ్జెట్లతో తీసినవన్నీ విజయాలు సాధించవు. వందల మిలియన్ల ఖర్చు పెట్టి పదుల మిలియన్ల వసూళ్లు పొందిన సినిమాలు చాలానే వున్నయ్. మనం మాట్టాడుతున్నది ముఖ్యంగా చిన్న సినిమాల గురించి గనక వీటికీ సూత్రం వర్తించదు. హాలీవుడ్ చిన్న సినిమాలంటే హారర్, కామెడీ, లేదా అవార్డ్ సినిమాలు. అవార్డ్ సినిమాలు ఎందుకంటే, 'ఈ సినిమాలో చేస్తే ఆస్కార్ అవార్డ్ నామినేషన్ వస్తుంది,' అన్న నమ్మకంతో చాలామంది పేరున్న తారలు చిన్న పారితోషికాలతో వాటిలో పనిచేస్తారు. మనకు అవార్డులంటే ఏమీ విలువలేదు గనక పెద్దతారలు అలాటిపనులు చెయ్యరు. ఒకవేళ చేసినా ఒక్కసారి ప్రయత్నించి దానికి ఫలితం దక్కకపోతే లెంపలేసుకుని మళ్లీ ఆ చాయలకి పోరు. *స్వయంకృషి, రుద్రవీణ* లాటి సినిమాల్తో చిరంజీవి ఒకప్పుడు ఇలాటి ప్రయత్నం చేశాడు కాని అవి కమర్షియల్ సక్సెస్ కాలేదని అంతటితో మానేశాడు. ఆ తర్వాత పెద్ద హీరోలు ఇంకెవరూ అలాటి అఘాయిత్యం చేసినట్టు లేరు.

ముగింపు

చిన్న సినిమాలు తియ్యటం తేలిక. ఇప్పుడున్న పరిస్థితుల్లో థియేటర్లో వెయ్యటమే కష్టం. ఆ తర్వాత వాటిని ప్రేక్షకులు చూడటం ఇంకా కష్టం. బడ్జెట్లు ఎంత చిన్నవైనా లాభాలు సంపాయించే చిన్న సినిమాల శాతం కూడ చాలా చిన్నదే.

మంచి చిన్న సినిమాలకోసం ప్రేక్షకులు ఎప్పుడూ ఎదురు చూస్తూనే వుంటారు. ఐతే, వాళ్లని నిరాశ పరిచే వాళ్లే గాని వాళ్ల నాడి పట్టుకుని సరైన సినిమాల్ని అందించేవాళ్లు చాలా కొద్దిమంది. ఇందుక్కారణం ప్రతిభ లేకపోవటం, ప్రతిభ వుంటే ఓపిక లేక పోవటం. తొలి సినిమా హిట్టైతే మలి సినిమాని కూడ అంతే జాగ్రత్తగా శ్రద్ధగా తియ్యగలిగే వాళ్లు కొద్దిమందే. పూరి జగన్నాథ్ నుంచి శేఖర్ కమ్ముల వరకు ఎందరో అలా అలిసిపోయిన వాళ్లు మనక్కనిపిస్తారు. ఐతే కనీసం తొలిసినిమానైనా గట్టిగా తియ్యలేకపోవటానికి ప్రతిభ లేదా అనుభవరాహిత్యం కారణాలని నేననుకుంటాను. ఒక్కసారి గత పదేళ్లలో విజయవంతమైన చిన్న సినిమాలని పరిశోధించి అవి ఎందుకు విజయవంతమయాయో మూలకారణాలు గ్రహించగలిగే ప్రతిభ వున్న ఏ రచయిత లేదా దర్శకుడైనా విజయం సాధించే అవకాశాలు బాగా వున్న ఒక చిన్న సినిమాని కనీసం తియ్యగలడని నా ఉద్దేశం.

ప్రపంచీకరణతో గత పదేళ్లుగా యువ తెలుగు ప్రేక్షకుల్లో గణనీయమైన మార్పులొచ్చినయ్. వెబ్ మూలాన ఎక్కడి సినిమాలైనా చూడటానికి అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంలో, ఎక్కడి సినిమాల్నో కాపీ కొట్టి తేలిగ్గా పేరూ, డబ్బూ కొట్టేద్దామనుకుంటే కుదరదు. చాలా శ్రమ, కొత్తతరం ప్రేక్షకుల జీవన, భావనా విధానాల మీద మంచి పట్టు వుంటే తప్ప విజయవంతమయే చిన్న సినిమాలు తియ్యటం కుదరదు. కొత్తదనం కోసం చకోరపక్షుల్లా ఎదురుచూస్తున్న ప్రేక్షకులకి అది అందించాల్సిన బాధ్యత దర్శకులదీ, నిర్మాతలది. పెద్ద మూస సినిమాల సుత్తిపోట్ల నుంచి వాళ్లని అప్పుడప్పుడైనా రక్షించే మంచి చిన్న సినిమాలు భారీగా వస్తాయని ఆశిద్దాం. లేకుంటే తెలుగు సినిమాలు కూడ అనేక ఇతర భాషాచిత్రాల బాటలోనే కనుమరుగు కాక తప్పదు.

కె.వి.ఎన్. రామారావు ఈమాట వెబ్ పత్రిక వ్యవస్థాపకుల్లో ఒకరు. దాదాపు ఎనిమిది సంవత్సరాలు దానికి సంపాదకత్వం వహించారు. ఎప్పుడన్నా కథలు, కవితలు రాస్తుంటారు. సాహిత్య విమర్శ వీరికి అభిమాన ప్రక్రియ. సినిమాల మీద సునిశితమైన సమీక్షావ్యాసాలు రాస్తుంటారు. కాలిఫోర్నియా రాష్ట్రం శాన్‌రామోన్‌లో నివాసం.
email: kvsramarao@gmail.com

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వికసించిన

ప్రగతి సాహితీకుసుమాలు

డా. నందిని సిధారెడ్డి

విశ్వవిద్యాలయాన్ని ఏ నిజాం ప్రారంభించాడో ఆ నిజాంనే నిలదీసిన కవి దాశరథి. ప్రజలపట్ల దాశరథికున్న భావోద్వేగ సంబంధమే ఆ అక్షరాలకు ప్రేరణ.

'ఓ నిజాం పిశాచమా, కానరాడు
నిన్ను బోలిన రాజు మాకెన్నడేని తీగలను
తెంపి అగ్నిలో దింపినావు.
నా తెలంగాణ కోటి రత్నాలవీణ'

అనే పంక్తులు ప్రతిధ్వనించని తెలంగాణ ఊరులేదు. తెలంగాణ బాధలు, నొప్పి ప్రకటించకుండా దాశరథి ఊరుకోలేదు.

తెలంగాణ సమాజాన్ని వెనుకబాటుతనంలోంచి వెలుగులోకి నడిపించింది ఉస్మానియా విశ్వవిద్యాలయమే. 3 నుంచి 6 శాతం అక్షరాస్యత మాత్రమే వున్న ప్రాంతానికి విద్యాపరిమళాలందించి, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక చైతన్యాలు రంగరించి ఉత్తేజపరిచింది ఉస్మానియా విశ్వవిద్యాలయమే. వంద సంవత్సరాలపాటు నిరంతరంగా విశిష్టసేవలందించి చరిత్రకు కొత్త ద్వారాలు తెరిచిన ఈ విశ్వవిద్యాలయం తానే చరిత్రగా మారి ఉత్సవం చేసుకుంటున్నది. విదేశీ భాష పదఘట్టనల కింద పడి నలిగిపోతున్న ఒక దేశీభాషకు పట్టంకట్టి, ఉర్దూభాషలో బోధన, పాఠ్యాంశాలు, ప్రపంచ జ్ఞాన పరిమళాలు అనువదించి పంచిన ఉస్మానియా విశ్వవిద్యాలయం భారతదేశంలోనే కొత్త ప్రయోగం. విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ స్వాగతించిన భాషా ప్రయోగానికి బాసటగా బాటలు వేసింది ఉస్మానియా విశ్వవిద్యాలయం. సంస్థాన పరిపాలనలో ప్రారంభించబడినా సమకాల పరిస్థితులన్నిటినీ సమాదరించింది. వివిధ భాషలకు, సాహిత్యాలకు సముచిత స్థానం కల్పించి కాలానుగుణమైన కదలికలకు అక్షర దర్పణంగా రాణించింది.

ఉస్మానియా విశ్వవిద్యాలయ స్థాపనకు 1917లో ఫర్మానా జారీ చేసిన నిజాం ఏడోరాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ స్వయంగా కవి. ఉర్దూలో ఓ మాదిరి కవిత్వం రాయడంతోపాటు కవిత్వంపట్ల, కవులపట్ల అభిమానం కలిగి ఉండే వాడట. అట్లాగే-ఈ విశ్వవిద్యాలయానికి ఇవ్వబడిన ఇరవై ఐదు వందల ఎకరాల నేల స్వంతదారు మహాలఖాబాయి చందా స్వయంగా ఉర్దూ కవయిత్రి. కవిత్వ, సంగీత, నాట్యాల అభినివేశం ఆమె విశిష్టత. ఈ విశ్వవిద్యాలయం నూతన ప్రయోగాలను దేశాభిమానంతో ఆహ్వానించి ఆదరించింది. తెలుగు శాఖను ప్రారంభించిన సమయాన విశ్వకవి టాగోర్ కోరిక మేరకు మొదటి శాఖాధ్యక్షుడిగా రాయప్రోలు సుబ్బారావు నియమితుడైనాడు. అప్పటికే తెలుగులో భావకవిత్వాన్ని ప్రారంభించి, అనుయాయులను సృష్టించుకున్న సుప్రసిద్ధుడాయన. అట్లా మొదలైంది ఒక కవిత్వ పరంపర. ఒక సాహిత్య సమావరణం. ప్రాచీన సంప్రదాయ సాహిత్య పరిమళాలను వెదజల్లుతూనే

సరికొత్త సాహిత్య ప్రయోగాలకు నెలవుగా నిలిచి, ఆగామియుగ సందేశాలను బలంగా వీచింది, వినిపించిదీ ఉస్మానియా విశ్వ విద్యాలయం.

ఉర్దూ భాష నుంచి పట్టాపుచ్చుకొని, షేక్‌స్పియర్ ఇంగ్లీషు నాటకాలను ప్రదర్శించి తెలంగాణ మహోద్యమాన్ని గానం చేసిన కవి మగ్దూం మొహియుద్దీన్ .'యే జంగ్ హై జంగే ఆజాదీ' అని పాడుతూ, ప్రజల్ని మేల్కొలుపుతూ, సిటీ కళాశాల ఉపన్యాకుడి ఉద్యోగాన్ని వదిలిపెట్టి జాతిపోరాటంలో మమేకమైన మగ్దూం కవిగా, నాయుడిగా యోధుడిగా కొత్త దారులు నిర్మించాడు. 'చమ్‌లీకే మండువాతలేమే' ఆయన రచించిన సుప్రసిద్ధ గేయం దృశ్యరూపకంగా సహృదయులను ఆకట్టుకున్నది. అదే దారిలో తెలంగాణ రైతాంగ విమోచనోద్యమాన్ని అక్షరాలతో ఉడుకెత్తించిన కవి దాశరథి. దాశరథి ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల నుంచి తెలుగు, ఆంగ్ల సాహిత్యాలతో (డబుల్ లిటరేచర్) డిగ్రీ పూర్తి చేశాడు. విశ్వవిద్యాలయాన్ని ఏ నిజాం ప్రారంభించాడో ఆ నిజాంనే నిలదీసిన కవి దాశరథి. ప్రజలపట్ల దాశరథికున్న భావోద్వేగ సంబంధమే ఆ అక్షరాలకు ప్రేరణ. "ఓ నిజాం పిశాచమా, కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడేని తీగలను తెంపి అగ్నిలో దింపినావు. నా తెలంగాణ కోటి రత్నాలవీణ" అనే పంక్తులు ప్రతిధ్వనించని తెలంగాణ ఊరులేదు. తెలంగాణ బాధలు, నొప్పి ప్రకటించకుండా దాశరథి ఊరుకోలేదు. సురవరం ప్రతాపరెడ్డి, వట్టికోట ఆళ్వారుస్వామి, కాళోజి, పివి నరసింహారావు వంటి సాహితీవేత్తలు అనవరతం యూనివర్శిటీ చైతన్యాలను ప్రేరిపిస్తూ నడిచినవారే. తెలుగు చరిత్ర, సంస్కృతులకు నిలువెత్తు దర్పణం ఖండవల్లి లక్ష్మీరంజనం ఇక్కడి ఆచార్యుడే. పద్యకవి పల్లా దుర్గయ్య, సంప్రదాయ విమర్శకులు దివాకర్ల వెంకటావధాని విశ్వవిద్యాలయంలో తీర్చిదిద్దుకున్న ఆచార్యులే.



మఖ్దూమ్ మొహియుద్దీన్

విశ్వవిద్యాలయానికి, తెలంగాణకు జ్ఞానపీఠం సాధించి పెట్టిన డాక్టర్ సి. నారాయణరెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పూచిన విద్యాకుసుమమే. విద్యార్థిగా వుంటూనే తెలగు సాహిత్య పరిమళాలను నలుదిసలా వెదజల్లి, పరిశోధన పూర్తి చేసుకుని ఆచార్యుడిగా బోధనలందించి, కవి శిష్యుల్ని అపరిమితంగా పొందిన కవి సినారె. సినిమా పాటలు రాస్తున్న దశలో పాటలు రాస్తావా? పాఠాలు చెబుతావా? అని వీసీ అడిగితే 'పాఠాలూ చెబుతాను, పాటలూ రాస్తాను' అని గంభీరంగా పలికి, ఆచరించి చూపిన నారాయణ రెడ్డి విద్యాలయ తెలుగు శాఖకు నిజంగా ఎస్సెట్. ఉస్మానియా విశ్వ

రాయప్రోలు సుబ్బారావు



దాశరథి కృష్ణమాచార్యులు

విద్యాలయం నుంచి నేర్చుకున్న అక్షర ప్రపంచాన్ని విప్లవోద్యమ ప్రచారంతో హోరెత్తించిన కవి పెండ్యాల వరవరరావు, నెహ్రూ సోషలిజం మీద విశ్వాసంతో కవిత్వం అల్లిన దశలో క్యాంపస్‌లో హాస్టల్‌లో సాహిత్యాధ్యయనం, అనంతర సామాజిక చలనాల పయనం వరవరరావును వివిగా విప్లవకవిగా వికసింపజేశాయి. తరువాతి తరంలో సుప్రసిద్ధ కవిగా రాణించిన తెలుగు విద్యార్థి డాక్టర్ ఎన్. గోపి 'తంగెడు పూలు' కవిగా, 'వేమన' పరిశోధకుడిగా గోపీకి విశిష్టమైన గుర్తింపు వుంది. కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతిని ఉస్మానియా తెలుగుశాఖకు ఇచ్చిన కవి. తెలుగు విశ్వవిద్యాలయం వీసీగా రాణించారు. సుప్రసిద్ధ కథకుడిగా, కవిగా, సైన్స్ రచయితగా పేరు పొందిన డాక్టర్ దేవరాజు మహారాజు ఉస్మానియా విశ్వవిద్యాలయం జువాలజీ విద్యార్థి, పరిశోధకుడు. మొదటిసారిగా తెలంగాణ భాష ప్రయోగిస్తూ 'గుడిసె-గుండె' రాశాడు. మరొక కథకుడు 'సదానంద్ శారద' వాణిజ్య శాస్త్రంలో పీజీ చేశారు. నవలా రచయిత, కథకుడు పాలకోడేటి సత్యనారాయణరావు క్యాంపస్ చెక్కిన రచయితే.

నవలా రచనలో సైతం ఉస్మానియా విశ్వవిద్యాలయానికో ప్రత్యేకత వున్నది. 'అంపశయ్య నవీన్'గా ఖ్యాతిపొందిన నవీన్ ఆర్ట్స్ కళాశాలో ఆర్థికశాస్త్రం చదువుకొన్నాడు. హాస్టల్ విద్యార్థిగా జీవించాడు. అపుడు కదిలిన ఆలోచనే చైతన్య స్రవంతి. విద్యార్థి ఒకరోజు జీవితంలోని అనుభవాలను మనసుకు హత్తుకునే శైలిలో రచించటం, నవలకు వొచ్చిన ఆదరణ క్రమంగా రచయితను 'అంపశయ్య నవీన్'గా గుర్తింప జేశాయి. ఎన్నో మంచి నవలలు రాసినా నవీన్ ప్రత్యేకత 'అంపశయ్యే'. ఆ అనుభవం ఇచ్చినది యూనివర్శిటీ హాస్టలే. మరొక

డా॥ సి. నారాయణరెడ్డి

తెలుగు ప్రముఖ నవలా రచయిత వడ్డెర చండీదాస్ ఈ యూనివర్శిటీలోనే అధ్యయనం చేశాడు. ఆర్ట్స్ కళాశాలలో తత్వశాస్త్రం పీజీ చదువుతున్నప్పుడు కలిగిన అనుభవాలను 'అనుక్షణికం' నవలగా రచించాడు. విభిన్న మనస్తత్వాలకు, రాజకీయ దృక్పథాలకు, ఘర్షణలకు అది దర్పణం. మా తరం నుంచి మంచి నవలా రచయితగా ఎదిగింది వసంతరావు దేశ్‌పాండే. తెలుగుశాఖ నుంచి పీజీ, ఎం.ఫిల్, పీహెచ్‌డి పూర్తి చేశాడు. వసంతరావు ఇంద్రవెల్లి ఆదివాసీ జీవిత పోరాటాలను చిత్రించిన 'అడవి' నవల చాలా ఆదరణ పొందింది. ఊరు, భూమి గుండ్రంగా వుంది తదితరమైన ఆరు నవలలు ఆయన రచించారు.

అంకురిస్తున్న ఉద్యమాల మీద ఎమర్జెన్సీ ఇనుపపాదం మోపిన కాలంలో- 1976లో నేను ఆర్ట్స్ కళాశాల పీజీ తెలుగులో ప్రవేశించాను. నిశ్శబ్దం రాజ్యమేలుతున్నా కవిత్వంలో వికసించిన వాళ్లం. ప్రఖ్యాత రచయిత్రి మృణాళిని, సుప్రసిద్ధ కవి గుడిహాళం రఘునాథం, ఎమ్మెల్‌లో నా సహాధ్యాయులు. ప్రముఖ కవి శివారెడ్డి గారితో సాహచర్యం. రఘునాథం నేనూ పోటీపడి కవిత్వం సృష్టించేది. మా తర్వాతి జూనియర్స్ బ్యాచ్ మంచి సాహిత్య బృందం. నాళేశ్వరం శంకరం, వసంతరావు దేశ్‌పాండే, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, ఎస్వీ సత్యనారాయణ, మర్రి విజయరావు ఇత్యాదులు. ఆ తర్వాతి బ్యాచ్‌లో కందుకూరి శ్రీరాములు, లా కాలేజీలో జింబో, ఇంజినీరింగ్ కాలేజీలో శివకుమార్, లైబ్రరీ సైన్స్‌లో వారాల ఆనంద్, జర్నలిజం కోర్స్‌లో సలంద్ర, తత్వ శాస్త్రంలో అంబటి సురేంద్రరాజు తదనంతరం తెలుగుశాఖలో జయప్రభ, ఐలేని గిరి, చారి, లక్ష్మారెడ్డి, గుంటూరు ఏసుపాదంలతో మంచి కవితరం క్యాంపస్ వాతావరణంలోకి కదిలి వచ్చింది. ఎప్పటికప్పుడు సామాజిక దృక్పథాలతో ఉద్యమాలు పిడికిళ్లు బిగిస్తున్న చైతన్యాలు క్యాంపస్‌లో కదంతొక్కేవి. అంతే బాధ్యతగా అక్షర చైతన్యాలు కరచాలనం చేస్తున్న సందర్భాలు. ఉస్మానియాలో వున్న రచయితలంతా సంఘంగా ఏర్పడితే బాగుంటుందని సలంద్ర సలహా ఇచ్చాడు. అందర్నీ సమీకరించి, ఆలోచన పంచితే ఏర్పడిందే 'ఉస్మానియా యూనివర్శిటీ రైటర్స్ సర్కిల్.' 1971-80 దశాబ్దంలో కాలం కదలికలను కవిత్వంలో రికార్డు చేసిన సంకలనం 'ఈతరం యుద్ధ కవిత'. అది అప్పట్లో మంచి సంచలనం. అంతకుముందే క్యాంపస్‌లో ఉస్మానియా విశ్వవిద్యాలయ రచయితల సంఘం ఉండేది. అప్పటి విద్యార్థి రచయితల కథల సంకలనాన్ని ఎమెస్కో బుక్స్ ప్రచురించింది. తెలుగుసాహిత్య రంగంలో తలెత్తిన అవకతవకలను నిరసిస్తూ అజ్ఞాత కలాలతో 'దాడి' బులిటెన్లు ప్రచురించినం. క్యాంపస్ అందించిన భావ పరంపరే ఆ కరపత్రం. అనంతరం ప్రజ్వరిల్లిన అస్థిత్వవాదాల్లో స్త్రీవాద కవిత్వానికి జయప్రభ, దళితవాద కవిత్వానికి సలంద్ర ప్రతీకలుగా ఎదిగారు.

తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి కీలక భాగస్వామ్యం అందించిన క్యాంపసే మలి దశ తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి వలసిన చైతన్యాన్ని, నాయకత్వాన్ని అందించింది. ఉస్మానియా క్యాంపస్‌లో ఉదయించిన కిరణమా, వీర తెలంగాణమా... పాట రచనలో అభినయ శ్రీనివాస్‌కు ప్రేరణ రేకెత్తించింది ఉస్మానియా విశ్వవిద్యాలయమే. సాహిత్య విమర్శలో యూనివర్సిటీది విశేషమైన పాత్ర. పరిశోధనల రూపంలో సాగిన కృషి ప్రత్యేకంగా పరిశీలించదగిందే. తెలుగు సాహిత్య విమర్శకు ప్రతీకగా నిలిచిన చేకూరి రామారావు భాషాశాస్త్ర శాఖలో రూపు దిద్దుకున్నవాడే. తెలుగులో 'చేరాతలు' అందరినీ ఆలోచింపజేశాయి. మరొక ప్రముఖ విమర్శకుడు జీవీ సుబ్రహ్మణ్యం- సంప్రదాయ, ఆధునిక విమర్శలను సమన్వయం చేశాడు. పి. యశోదారెడ్డి, ఎస్వీ రామారావు, సంపత్‌కుమార తెలుగు విమర్శలో గణనీయమైన కృషి చేశారు. తెలుగు సాహిత్యంలో తెలంగాణ స్ఫూర్తితో సాహిత్యంలోని అన్ని ప్రక్రియలను సంపద్వతం చేసింది ఉస్మానియా విశ్వవిద్యాలయం.

పల్లెతనాన్ని తనలో నింపుకున్న కవి. అదే తన కవిత్వంగా ముప్పై సంవత్సరాలుగా ఆరు సంపుటాలుగా విస్తరించింది. రెండు వ్యాస సంపుటాలు, పాటలు, కథల పుస్తకం ప్రచురించారు. వివిధ సామాజిక ఉద్యమాల్లో క్రియాశీలంగా పనిచేశారు. ఇటీవలే సమగ్ర కవితాసంపుటి ప్రచురించారు. నివాసం హైదరాబాద్. 'నాగేటి చాల్లల్ల నా తెలంగాణ పాటకి నంది పురస్కారం లభించింది. ఇటీవలే కొత్తగా ఏర్పడిన తెలంగాణ సాహిత్య అకాడెమికి అధ్యక్షులుగా నియమితులయ్యారు. email: nandinisr56@gmail.com

భారత దేశానికి ప్రజాస్వామ్య సంస్కృతి అత్యవసరం

బాబు గోగినేని

మనిషి కేంద్రంగా సమాజ నిర్మాణం,
వాస్తవాల ఆధారంగా విశ్వం యొక్క
అవగాహన మొదలయ్యాయి.
కళ వస్తువు కూడా మారింది,
దేవుళ్ల కథల కంటే ఎక్కువ మనుషుల
జీవితం లోని వృత్తాంతాలే చిత్రకళకి,
నాటకానికి వస్తువుగా మారాయి.
మానవ విలువలు పెరగడంతో
మనుష్యుల సమానత్వం,
వారి హక్కుల గురించి
ఒక అవగాహన మొదలయ్యింది.
అలాంటి సమాజానికి
రాజకీయ వ్యవస్థగా ప్రజాస్వామ్యం
ఆవిర్భవించింది.

మన గొప్పలు

ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యం మనదేనని, శాస్త్రవేత్తలు, సాంకేతిక రంగంలో తర్ఫీదు పొందినవారి సంఖ్యలో ప్రపంచంలోనే మన దేశం అగ్రగామిగా ఉన్నదని, మనది శాంతి కాముక దేశం అనీ, జాతిపిత, శాంతి ప్రవక్త, గాంధీజీ అడుగుజాడలలోనే దేశం నడుస్తున్నదని, మన దేశం వేగంగా ముందుకు అడుగులు వేస్తున్నదని, ఒక సూపర్ పవర్‌గా అవతరిస్తున్నదని... ఇంకా ఇలాంటి వెన్నో విషయాల గురించి మేధావుల దగ్గర నుండి పిల్లల వరకు గొప్పలుగా చెప్పుకోవడం మనం అందరమూ రోజూ చూస్తూ ఉన్నదే. మరి ఇది నిజమైతే, మన దేశంలో దరిదాపులుగా 40 కోట్ల మంది నిరక్షరాస్యులు, 22 కోట్ల మంది అస్పృశ్యులు, 16 కోట్లమంది బాల కార్మికులు ఉన్న విషయము అబద్ధమా? 22 కోట్లంటే జర్మనీ, ఫ్రాన్స్, ఇంగ్లాండ్, నార్వే, స్వీడన్, బెల్జియం దేశాల మొత్తం జనాభా అంత!

అవునూ, ఎక్కడైనా ఏ దేశంలోనైనా, ఇంత దారుణమైన వివక్షకు గురవుతున్న ఇంతమంది మహిళలు ఉన్నారా? మళ్లీ మహిళలు దేవతలు అని చెప్పుకోవడం! దేవతలుగా భావిస్తున్నారు సరే, కాని మనుషులుగా ఎప్పుడు చూడడం మొదలుపెడతారో!

నైతికత పునాది మీద స్థాపించబడింది అనుకునే మన దేశం, గాంధీగారి స్ఫూర్తితో నిజాయితీతో దేశాన్ని నడుపుతామని తరచూ రాజకీయనాయకులు ప్రతిజ్ఞా చేసే మన దేశం, మరి అవినీతి విషయంలో పాకిస్తాన్, బంగ్లాదేశ్, నైజీరియాల సరసన ఎలా ఉంది?

శాంతి కాముకురాలైన మన దేశం అని గౌతమ బుద్ధుడిని, గాంధీగారిని ఎప్పుడూ తలుచుకునే దేశం మనది. మరి మన దేశం ప్రపంచంలో అందరికన్నా ఎక్కువ ఆయుధాలను దిగుమతి ఎందుకు చేసుకుంటుంది?

చెప్పినదానికి, చేస్తున్నదానికి ఉన్న వ్యత్యాసం, వైరుధ్యం మన దేశ భక్తులకు ఎందుకు కానరాదో! ప్రజలకే కాదు, వారి నాయకులకు కూడా ఈ స్పృహ ఉన్నట్లు కనిపించదు! మన దేశం జన్మువులోనే అహింస ఉన్నదని చెప్పడం వరకు బాగానే ఉన్నది కాని, అహింస గురించి తెలియని దేశాలలో కంటే ఎక్కువ ఇక్కడ ఇన్ని నేరాలు జరుగుతున్నాయి ఏమిటి? ఐక్యరాజ్యసమితిలో భారత

దేశం యొక్క ప్రాముఖ్యత, అక్కడ మన రాజకీయ దృక్పథం అందరికీ తెలియచేసి వారిని ఒప్పించడంలో ఉన్నదా, లేక యోగా నేర్చుకోమని సలహా ఇవ్వడంలో ఉన్నదా?

ఎప్పుడో ప్రపంచంలోని జ్ఞానమంతా ఇక్కడే పుట్టింది, ఆటం బాంబు లాంటి బ్రహ్మాస్త్రం నుండి విమానాల దాకా అంతా మన దేశంలోనే కనుగొన్నాము అని డంబాలు పలికే మన దేశంలో ఇన్ని మూఢ నమ్మకాలు ఎలా ఉన్నాయి? భూమి గుండ్రంగా ఉన్నది అని తెలిసి కూడా బల్లపరుపు భూమి, కులాల ఆధారంగా ఉన్న వాస్తులాంటి దిక్కులేని శాస్త్రాన్ని చదువుకున్నవారిని, రాజకీయ నాయకులు ఎందుకు ఆశ్రయిస్తున్నారు?

వానలు పడాలి అని పూజలు, యాగాలు, కప్పల పెళ్లిళ్లు చేసే వారు చాలామంది విద్యావంతులే. వీరు స్కూల్ పరీక్షలో వానలు ఎలా పడతాయి అనే ప్రశ్నకు ఏ సమాధానం వ్రాసి పాసయ్యారు? ఒకపక్క matter cannot be created nor destroyed అని చెపుతున్న శాస్త్రవేత్తలు, సైన్సు టీచర్లు విభూతి 'సృష్టిస్తూ' ప్రజలను మోసం చేస్తున్న బాబాల కాళ్ల దగ్గర ఎందుకు తచ్చట్లాడుతున్నారు?

గత 1000 సంవత్సరాలలో ఈ విశ్వం గురించి కొత్త విషయాలు మన దేశంలో ఏమైనా ఆవిష్కరించామా? ప్రపంచంలో ప్రతి ఆరుగురిలో ఒకరు నివసిస్తున్న భారతదేశానికి ఎన్ని నోబెల్ బహుమతులు వచ్చాయి గత 100 సంవత్సరాలలో? దీనికి కారణాలు ఏమిటి?

మన చట్ట సభలు ఈరోజు ఇంత మంది నేరచరిత్ర గలిగిన వారికి నిలయంగా మారినా కూడా, పార్టీ స్వామ్యం మనహక్కులను, మన స్వేచ్ఛను హరించి వేస్తూంటే కూడా మనల్ని మనం ప్రజాస్వామ్యం అని పిలుచుకోవటములో అర్థం ఉన్నదా?

మన దేశంలో కొంతమంది ఐటి రంగంలో రాణిస్తూ ఉన్నప్పటికీ స్థూలంగా దేశ పరిస్థితి దారుణంగా ఉన్నది అని ప్రత్యేకంగా చెప్పుకోనవసరం లేదు. మనతోపాటు అభివృద్ధి వైపుకు ప్రయాణం మొదలు పెట్టిన మిగతా దేశాలు మనలను ఎక్కడో వెనక వదిలి వేసి ముందుకు వెళ్లిపోతున్నాయి. మనమేమో అపోహలతో, అబద్దాలతో కాలక్షేపం చేస్తున్నాం!

సరే మనము ఇప్పుడు ఇక్కడ ఉన్నాము. మరి ఇప్పటికైనా ఒక జాతిగా, ఒక దేశంగా ఆధునికత వైపు, ప్రజాస్వామ్య సమాజం వైపుకు ముందుకు వెళ్లాలంటే ఏమి చేయాలి?

ఆధునికత, ప్రజాస్వామ్యం

ముందుగా ఆధునికత అంటే, ప్రజాస్వామ్యం అంటే ఏమిటో మనము అర్థం చేసుకోవాలి.

ప్రజాస్వామ్యమంటే ఏమిటి?

ప్రజాస్వామ్య విలువలంటే ఏమిటి?

ప్రజాస్వామ్యం అంటే ప్రజలు స్వాములుగా ఉన్న వ్యవస్థ అని అర్థం. ఈ అర్థం వెనుక మనిషి గురించి ఒక అవగాహన, కొన్ని అంచనాలు ఉన్నాయి. చాలా చరిత్ర ఉన్నది!

మనిషే కేంద్రం

ప్రజాస్వామ్య వ్యవస్థ రాక ముందు ప్రజల జీవితాలను రాజులు, జమీందారులు, మతాధికారులు శాసించేవారు. వారి నిర్ణయాలే అందరికీ నిర్దేశకాలు. రాజులు దైవాంశతో పుట్టారనీ, ప్రజలను పాలించడము వారి జన్మహక్కు అనీ, మతమంటే దేవుని ఆజ్ఞలు ప్రజలకు తెలియచేసేది అనీ, ఈ అధికారుల ఆదేశాలను పాటించడమే ప్రజల బాధ్యత అని ఒక అవగాహన ఉండేది.

ఆ సమాజాలలో ప్రజలకు సమానత్వం లేదు, స్వేచ్ఛ లేదు; వారికి ఈ జీవితం ముగిసిన తరువాత పరలోకంలో స్వర్గాన్ని అందుకోవడానికి అర్రులు చాచడమే పని.

ఈ పరిస్థితులలో యూరప్‌లో కొన్ని వందల సంవత్సరాల క్రితం, అప్పటికి 2000 సం క్రితమే ఫరిడవిల్లిన ప్రాచీన గ్రీకునాగరికతకు లాగా, మతాల పట్ల, తమ నమ్మకాల పట్ల క్రిటికల్ అప్రోచ్ అవలంబించుకుంటూ, విశ్వం యొక్క రహస్యాలు పవిత్ర గ్రంధాలలో ఉండే అవకాశం లేదని గుర్తించి, కొత్త ప్రక్రియలతో, కొత్త ఉత్సాహంతో విశ్వం గురించి పరిశోధన చేయడము మొదలు పెట్టారు కొంతమంది. Da Vinci, Bruno, Copernicus, Galileo, Servitusలతో మొదలయ్యింది మానవాళి ఈ సాహస గాథ.

వీరందరూ నాస్తికులు కాకపోవచ్చు కాని, వారి దృష్టిలో, వారి దృక్పథంలో, సమాజానికి కేంద్రం దేవుడు కాని రాజు కాని కాదు. వారు మనిషి కేంద్రంగా ఉన్న సమాజం గురించి ఆలోచించడము మొదలుపెట్టారు. అందుకే వారిని మానవ వాదులుగా గుర్తిస్తాము.

పునర్వికాసం

అలా మనిషి కేంద్రంగా సమాజ నిర్మాణం, వాస్తవాల ఆధారంగా విశ్వం యొక్క అవగాహన మొదలయ్యాయి. కళ వస్తువు కూడా మారింది, దేవుళ్ల కథల కంటే ఎక్కువ మనుషుల జీవితంలోని వృత్తాంతాలే చిత్రకళకి, నాటకానికి వస్తువుగా మారాయి. మానవ విలువలు పెరగడంతో మనుష్యుల సమానత్వం, వారి హక్కుల గురించి ఒక అవగాహన మొదలయ్యింది. అలాంటి సమాజానికి రాజకీయ వ్యవస్థగా ప్రజాస్వామ్యం ఆవిర్భవించింది.

పునర్వికాసోద్యమం - అంటే renaissanceగా మొదలయ్యి, స్వేచ్ఛాపిపాసతో ప్రాణం పోసుకొని, ఆ సాంస్కృతిక అభివృద్ధి పునాదుల మీద దాదాపు 400 సంవత్సరాల కాలంలో ఆవిర్భవించింది యూరోప్‌లోని ప్రజాస్వామిక సమాజం. ప్రజలు తమ జీవితాల విషయంలో, తమ సమాజాల విషయంలో తమ నిర్ణయాలు తామే తీసుకునే సామర్థ్యం కలిగి ఉన్నారు అనీ, వారికి తమ భవితను తామే నిర్ణయించుకునే హక్కు, బాధ్యత ఉందని గుర్తిస్తుంది ప్రజాస్వామ్యం. అలాగే నియంతృత్వం బదులు స్వేచ్ఛ; అసమానత్వం స్థానంలో సమానత్వం; మనుషులందరూ తమ సమాజంలో భాగస్వాములు అని, కుటుంబ సభ్యులుగా భావించే సౌభాతృత్వం ప్రతిపాదిస్తుంది.

ఏవరినీ final authorityగా ప్రజాస్వామ్యం ఒప్పుకోదు; అందరినీ ప్రశ్నించే స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి మౌలికం. అందరూ సమానులే అని ప్రతిపాదించడమే కాదు, ప్రత్యక్షంగా చూపిస్తుంది

కూడా! మనుషులందరూ సమానులు కాబట్టే అందరికీ ఓటు హక్కు ఉంటుంది; ప్రతి ఒక్కరికీ ఒక్క ఓటు మాత్రమే వుంటుంది. సైన్సు కూడా స్వేచ్ఛ మీద ఆధారపడి ఉంటుంది. సైన్సు ప్రశ్న మీద ఆధారపడుతుంది. సైన్సు లేనిదే ప్రజాస్వామ్యం ఉండదు, ఉండలేదు. మనుషులంతా ఒక్కటే అని నిజానికి నిరూపించింది సైన్సు మతం కాదు. మానవవాదం లేనిదే ఈ రెండు ఉండవు! ఎందుకంటే వీటి అన్నిటి విలువలు ఒక్కటే!

అందుకే ఇలా ఉన్నాము

మనమందరము దేవుని బిడ్డలము అని చెప్పే ఏ మతమూ మనుషులందరూ సమానము అని చెప్పలేదు. ఎప్పుడైనా పొరబాటున మనదంతా ఒక విశ్వ కుటుంబం అని ఒక మతం చెప్పినా, ఆ కుటుంబంలో ఆ కులం వారికే, ఆ మతం వారికే స్థానం!

అందరూ సోదరులే అని చెప్పినా, సోదరీమణుల గురించి చెప్పలేదు ఇంకొక మతం! ఇంకొక మతం అయితే మనమందరమూ పాపంలో పుట్టాము అని చెప్పింది. ఏదీ, ఆ విషయాన్ని అప్పుడే పుట్టిన అమాయకంగా ఉన్న, పాలుకారుతున్న బుగ్గలతో ఉన్న పసిబిడ్డని చేతిలో పెట్టుకుని ఆ మాట చెప్పమనండి!

మరి ఇంత వెనుకబడిన భావాలతో, మనిషి హుందాతనాన్ని గుర్తించని మతాల ఆధారంగా సమాజాలు నిర్మిస్తే సౌదీ అరేబియా లాగానో, ఇరాన్‌లాగానో, పాకిస్తాన్‌లాగానో మన పరిస్థితి కూడా మారే ప్రమాదం ఉంది. కాబట్టే మళ్లీ మన దేశాన్ని హిందు దేశంగా పరిగణించాలి అని ఒక కొత్త ఉద్యమం మొదలవుతుంటే అందరూ ఆందోళన చెందాలి. ఎందుకంటే దేశానికి మతమే పునాదిగా చేసుకున్న ముస్లిందేశాల పరిస్థితులు మనం చూస్తున్నాం కనక.

రాజకీయ ప్రక్రియ మాత్రమే కాదు

ప్రజాస్వామ్యమంటే ఒక రాజకీయ ప్రక్రియ అనీ, ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఓట్లు లెక్కపెడితే ప్రజాస్వామ్యం ఫరిడవిల్లుతుందని అనుకోవడము రివాజు అయిపొయింది మనదేశంలో. కాని ప్రజాస్వామ్యవిలువలు లేని సమాజంలో ప్రజాస్వామ్య ప్రక్రియ మెజారిటీ నియంతృత్వం స్థాపించడానికే పనికి వస్తుంది.

ప్రజాస్వామ్యం అంటే మెజారిటి పాలన కాదు, ప్రజాస్వామ్యమంటే స్వేచ్ఛ ఆధారంగా, స్వేచ్ఛకోసం మనం అందరికోసం ఏర్పర్చుకున్న విలువలున్న వ్యవస్థ అని అర్థం చేసుకోకపోతే అది నియంతృత్వమే అవుతుంది కదా! ఇప్పుడు జరుగుతున్నది కూడా అదే! మన ఎన్నికలలో గెలవడము అంటే first-past-the-post పద్ధతిలో 20% ఓట్లు వచ్చినవారు గెలిచినట్లు పరిగణింపబడతారు. మరి ఓట్లు వేసిన మిగతావారి ప్రాతినిధ్యం ఎలా? దామాషా పద్ధతి లేకపోతే పరిస్థితి ఎప్పటికీ ఇలాగే ఉంటుంది. ఇదే కాకుండా ప్రజాస్వామ్యం, పార్టీస్వామ్యంగా మారిపోయిన కారణంగా ప్రజలు నిజంగా పార్టీల కుతంత్రాలకు బందీ అయిపోయారు. తత్వవేత్త ఎం.ఎన్. రాయ్ చెప్పినట్లు మనకు కావల్సింది పార్టీస్వామ్యంకాదు, వికేంద్రీకరించబడిన ఒక సంఘటిత ప్రజాస్వామ్యం కావాలి. ప్రజలు స్వాములుగా ఉండేదే ప్రజాస్వామ్యం. పార్టీల అధీనంలో ఉండే వ్యవస్థ పార్టీస్వామ్యమే కానీ ప్రజాస్వామ్యం కానేరదు.

అసమానత్వం పెచ్చరిల్లిపోతున్న నిచ్చనమెట్ల కుల సమాజం, మనుషులకు కాకుండా కులాలకి, ఉద్యోగాలకి పెళ్లిళ్లు చేస్తున్న సమాజం, తమ సొంత అభివృద్ధి కంటే ఎక్కువ ప్రాధాన్యత కులానికి, భాషకీ ఇస్తూ నడుస్తున్న సమాజం మనది.

మనిషిని మనిషిగా గుర్తించలేనప్పుడు, అటువంటి మనుషులే ఎక్కువగా ఉన్నప్పుడు అది మానవ సమాజం ఎలా అవుతుంది? అక్కడ మానవ విలువలు ఎలా ఉంటాయి? అందుకనే చిన్నపిల్లలు బాల కార్మికులుగా ఉంటే మనం చలించం. ఇంకా మనమే అటువంటి బాల కార్మికులను వారితో బానిసత్వం చేయిస్తున్నవారి వల్లే వారు ఇంకా ఆ మాత్రం అలా ఉన్నారని, లేకపోతే ఆ పిల్లలని ఎవరు చూసుకుంటారు అని ధైర్యంగా అడుగుతాము.

ప్రగతి అంటే?

ప్రగతి అంటే మనం మనకు ఉన్న జ్ఞానం ఆధారంగా మన నమ్మకాలను, మన నడవడికను అనుసంధానం చేసుకోవడమే. ఆధునిక జ్ఞానం, ఆధునిక విలువలను వల్లెవేయడమే కాదు, వాటికి అనుగుణంగా మనం నడుచుకోవాలి. మనం మెచ్చుకుంటున్న భావాలను నిజజీవితంలో మన నడవడికలో చూపించాలి. అప్పుడే మనం ఆధునికులమవుతాము. అందుకనే మనము మూఢ నమ్మకాలను వీడాలి, సైన్సును ఆహ్వానించాలి.

ప్రపంచంలో అగ్రగాములుగా ఉన్న అన్ని దేశాలలో జీవితం పట్ల, సమాజంపట్ల, మానవ విలువల పట్ల ఇటువంటి అవగాహన ఇప్పుడు ఉన్నది. వారిలాగే ఆలోచించే, జీవించే, అవకాశం మన కందరికీ ఉన్నది. అలా చేయడానికి మన మత సంస్కృతి అని, మన దేశ సంస్కృతి అని గందరగోళ పడక, సైన్సు, ప్రజాస్వామ్యం ప్రతిపాదిస్తున్న మానవ సంస్కృతిని అలవరుచుకోవాలి. ఇలా చేయడం ఇప్పుడన్నా మనము మొదలుపెడితే కొన్ని వందల సంవత్సరాలకు మన దేశం కూడా బాగుపడుతుంది. దానికి మార్గం ప్రజాస్వామ్యం, సైన్సు మాత్రమే చూపించగలుగుతాయి. అప్పుడే మనమంతా గర్వపడే భారతదేశం మనకు దక్కుతుంది.

ఆలోచనాశీలి, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా బలమైన ఉద్యమాన్ని నిర్మిస్తున్న కార్యశీలుడు. ఇండియన్ హ్యూమనిస్ట్స్ అసోసియేషన్, ఇండియన్ రేషనలిస్ట్ అసోసియేషన్స్‌లో చురుకైన కార్యనిర్వాహక పాత్ర పోషిస్తున్నారు. నివాసం హైదరాబాద్.

US WIDE FINANCIAL
★★★★

$1,000 off your closing costs
when you purchase or refinance.
contact us for further details.

- no application fees
- competitive rates
- loan status updates
- available 24/7
- no PMI required
- quick closing
- no closing cost loans
- instant rate quote
- upfront lender

Call us anytime at 314.222.0150
Visit us at www.uswidefinancial.com
contact@uswidefinancial.com • 2200 Westport Plaza Drive, Suite 301, St. Louis 63146
NMLS#192116

Heartfulness
Through meditation, joy

Experience Heartfulness

"Feel the lightness and joy of our true nature and achieve a lasting sense of overall well-being."

www.Heartfulness.org

With best compliments from
Chandra Sekhar, Vijaya, Alaya,
Sri Harsha and Vaidehi Koneru.

OTSI
IT Services and Solutions Company

Serving our Client's since 1999.

Object Technology Solution, Inc.
6363 College Blvd., Suite 230
Overland Park, Kansas 66211.
www.otsi-usa.com

We are proud to sponsor
Telugu Association of North America

21st National Conference
May, 26-28, 2017
America's Center,
701 Convention Plaza, St. Louis, MO 63101

విరిసిన వసంతం...

కథలు • కవితలు

ఈ విభాగంలో...

కథలు

1.	అతడి బాధ	సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి	... 229
2.	మరో స్వేచ్ఛ	యాజి	... 236
3.	బొమ్మ	ఎం.ఎస్.కె. కృష్ణజ్యోతి	... 243
4.	తారుమారు తకరారు	తాడికొండ కె. శివకుమార శర్మ	... 248
5.	అతడి ముఖచిత్రం	విమల	... 256
6.	దూరం...?	ఆయాచితం స్పందన	... 264
7.	నూటొకటో మార్కు	జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి	... 272
8.	మరియా... ఈ నేల నీది కాదు	రాధిక	... 278
9.	కూసింత చోటు	మోహిత	... 284
10.	తెల్ల తాచు	అరిపిరాల సత్యప్రసాద్	... 288
11.	విశాల హృదయం	స్మిత గుంటుపల్లి	... 293

కవితలు

1.	ఉరితీత	కె. శివారెడ్డి	... 234
2.	కాసింత స్పృహతో...	కవి యాకూబ్	... 235
3.	సముద్ర స్నానం	విస్సకోట రవిశంకర్	... 242
4.	ఊరిగాలి	నందిని సిధారెడ్డి	... 247
5.	వర్షం	రవి వీరెల్లి	... 254
6.	వందనోటు	ఇంద్రాణి పాలపర్తి	... 255
7.	వదలి వెళ్లడం...	స్వామి వెంకటయోగి	... 262
8.	లోపల	దర్భశయనం శ్రీనివాసాచార్య	... 263
9.	నిద్రాభంగం	వైదేహి శశిధర్	... 268
10.	పరిమళం దొంగిలించారు	ఆశారాజు	... 269
11.	మూడు తుడుపు కవితలు	వేలూరి వెంకటేశ్వరరావు	... 270
12.	మనం నడిచిన బాటల్లో	తమ్మినేని యదుకుల భూషణ్	... 277
12.	కలగంటున్నాను	శిఖామణి	... 283
13.	ఈ రాత్రి	బాలసుధాకర మౌళి	... 287
14.	కొలతల్లో...	మెర్సీ మార్గరెట్	... 292
15.	గతము ప్రస్తుతము	సుశ్రీ	... 296

అతడి బాధ

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

వెలగచెట్టు కింది బిడువులో వున్న తల్లికోడి మెడ పైకెత్తి గాల్లోకి చూస్తూ పిల్లల్ని హెచ్చరిస్తోంది. పిచ్చుక బుర్రుమని ఎగిరినా 'కొక్కొక్...' మంటూ తను అరవటం, పిల్లలు జాగ్రత్తపడటం కనిపిస్తూ వుంది. మిద్దె పంచెలో కూచుని వార్తాపత్రిక తిరగేస్తూ ఓ కన్ను అటువైపు వేసి వుంచాను. ఇంటి ముందరి వేపచెట్టు కింది అరుగు మీద పులిజూదం ఆడే జనాల సవాళ్లు, ఎగతాళి మాటలు జోరుగా వినిపిస్తున్నాయి.

కాలం చాలా భారంగా పుష్యమాసం ముంగిట్లోకి నడిచి వచ్చింది. కరువు బరువు అడుగు ముందుకు పడనీయటం లేదు. అది వానకు తడుస్తూ, చలికి వణుకుతూ ఆర్ద్రంగా వచ్చి వుంటే- కళ్లాల నిండా పండు మిరపల తివాచీలతో, మిద్దెల పైన ఎండబోసిన అలసంద పెసరగాయలతో, వరిపంట కళ్లాలతో, ముదరొచ్చిన చింత గెలలతో పల్లెలు ఘనంగా స్వాగతం చెప్పి వుండేవి. కరువును వెంటబెట్టుకొచ్చింది కాబట్టి- బీడు భూములు, పూపముల్లులు, పల్లేరు కాయలు, భూతరాకాశులు పరచిన దారులు దిక్కయ్యాయి. సగం పూర్ల జనం కడుపు చేత బట్టుకొని నగరాలకు వలసలు పోగా మిగిలిన ముసలీ ముతకా అరుగుల మీద ఆటలతో పొద్దుపుచ్చుకొంటున్నారు.

పత్రిక నిండా నక్సలైట్ల ఎన్‌కౌంటర్ వార్త. ఎక్కడో రాష్ట్ర సరిహద్దుల్లో ఎదురు కాల్పుల్లో చనిపోయారని పోలీసు పెద్దల ప్రకటన.

పేపర్ మూసేసి ఈజీ ఛైర్‌లో వెనక్కి వాలి కళ్లు మూసుకొన్నాను.

ఉన్నట్టుండి కోడి అరుపులూ, ఆ వెనకే ఇందిర 'హోయ్... హూయ్...' అంటూ పక్షుల్ని బెదరగొట్టే అదిలింపులు.

ఉలిక్కిపడి నిటారుగా అయి అటుకేసి చూశాను.

పోరు అరుపులు అరుస్తూ గాల్లోకి ఎగిరి కాకిని వెంబడిస్తూ వుంది తల్లికోడి.

ప్రమాదాన్ని పసిగట్టిన ఇందిర బెదిరింపు కేకలతో అటుకేసి వెళ్లటంతో రెండవ కాకి చెట్టుకొమ్మల్లోంచే కపటపు చూపులు చూస్తూ వుంది.

ఈలోపు తల్లికోడి వచ్చి పిల్లల ముందు వాలి, తన రెక్కల విసుర్లకు దూరంగా ఎగిరిపడిన పిల్లల్ని దగ్గరకు చేర్చుకొంటూ వుంది.

ఓవైపు వెలగచెట్టు, మరోవైపు వేపచెట్టు, మధ్యలో టెంకాయ చెట్లు పందిరి కట్టినట్టు పెరిగి వుండటం వల్ల బిడువులోని కోడి పిల్లల మీద గద్దలు దాడిజేసే పరిస్థితి లేదుగాని కాకులపోడు తప్పటంలేదు.

కాకులు మహా టక్కరివి. కూడబలుక్కొని జంటగా వచ్చి దాడి చేస్తాయి. పిల్లల కావరంతో కన్ను మిన్ను గానక ఒక కాకిని తల్లికోడి వెంబడించగా, రెండవ కాకి వచ్చి ఓ పిల్లను నోట కరుచుకుపోతుంది.

వీటి కంటే ప్రమాదకరమైంది. పాలువ ఉండటానికి పావురమంత కూడా కనిపించదు. చెట్లకొమ్మల చివర్లదాకా వచ్చి అక్కన్నించి తుపాకిగుండులా అత్యంత వేగంగా దూసుకొచ్చి కోడిపిల్లను తన్నుకుపోతుంది. దాన్ని ఆపటం ఎవ్వరి తరమూ కాదు. చెట్లకొమ్మల్లోని పిచ్చుకల్ని సైతం వేటాడేంత నేర్పరి అది.

కాకుల క్రూరత్వాన్నీ, తల్లికోడి చేతగానితనాన్నీ గొణుక్కొంటూ ఇంట్లోకి వచ్చింది ఇందిర.

"రవ్వంత కోడిపిల్లల్ను కనిపెట్టుకోనుండు సామీ!" చెబుతూ లోపలికి వెళ్లింది.

సెలవురోజు వస్తే నాకిది అదనపు బాధ్యత.

ఈ సంఘటనలన్నీ సర్వసాధారణం కాబట్టి అరుగుమీది వాళ్లెవరూ తలెత్తి కూడా చూడలేదు. ఆటల్లోంచి బైటకు రాలేదు.

కొంతసేపయింతర్వాత వాళ్ల వద్ద నుంచి నాకు పిలుపులు మొదలయ్యాయి.

పులుల్ని నిలువరించలేక పోతున్నారు కాబోలు.

నేను వెళ్లగానే తావిచ్చి మేకల రాళ్లు నా చేతిలో పోశారు.

మంచి మంచి ఎత్తులతో మేకల్ని చాకచక్యంగా నడిపించి, పులుల్ని కట్టేయడంలో నేర్పరిని కాబట్టి నాకిక్కడ గౌరవం.

ఆట మొదలైంది.

ఎనభై ఐదేళ్ల సెవ్వన్న వచ్చి ఆటవద్ద నిల్చున్నాడు.

ఆటలోకి కళ్లు చికిలించి చూస్తున్నాడు.

అతనెప్పుడూ మేకలవైపే. పులుల్ని కట్టేశామంటే చాలు- ఓ పొడిదగ్గు దగ్గి, బొడుగరచి, మీసం వద్ద చెయ్యేసి, 'చూడు మా దెబ్బ' అన్నట్లుగా కళ్లెగరేస్తాడు. ఆ హావభావాల్ని చూస్తే చాలు పులుల్ని జరిపే రామయ్యకు ఒళ్లుమంట.

"ఎవురో ఆడితే యికిలియ్యడం గాదు- నువ్వు కట్టేజ్జూరా మొగోనివైతే," అంటూ సవాల్ చేస్తాడు ఉక్రోషం పట్టలేక.

"నీ పాసుగుల్ల గదబ్బే! నీ పాయాన నల్లమల కొండల్లో పెద్ద పులుల్తో కలబడ్తాన్నె... యీ రాల్లపులులు ఒక లెక్కా?" అంటాడు సెవ్వన్న.

ఇద్దరి సవాళ్లు అందరికీ నవ్వు తెప్పిస్తుంటాయి.

రెండవ ఆట మొదలైంది.

వేటరాళ్లల్లోనే పులుల్ని ఇబ్బందిపెట్టాను.

"మా రెడ్డితో ఆడే మొగోనివా?" అంటున్నాడు సెవ్వన్న.

అంతలో 'థోయ్... థోయ్...' అంటూ జంతువుల్ని బెదిరించే శబ్దాలతో ఇందిర అదిలింపులు వినిపించి ఉలికిపాటుగా వెలగచెట్టు కేసి చూశాను.

రెండు రెక్కల్ని బుట్టలాగా పొంగించి, ఈకల్ని నిటారుగా చేసి 'కొక్కొక్కొ...' అని భీతావహంగా అరుస్తూ తల్లికోడి తన పిల్లల మీదకు రాబోతూ వున్న కుక్కను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతూ వుంది. సుడిగాలికి తిరిగే ఎండుటాకుల్లా కాళ్ల చుట్టూ బుర్రుబుర్రున పరువెడుతూ వున్న బుల్లి పిల్లల్ని వెనక్కి నెడుతూ తను ముందు నిలబడే ప్రయత్నంలో- సమర్థుడైన కూతగాడు కబడ్డి ఆట ఆడినట్లుగా విన్యాసాలు చేస్తోంది. అట్లని ధైర్యంగా కుక్కను ఎదుర్కోలేకపోతోంది- అది నోట కరచి చంపేస్తుందని.

వెంటనే నేలకు వంగి చేతికి దొరికిన రాతిని పట్టుకొని తావత్రయంతో గట్టిగా కేకేస్తూ కుక్కకేసి విసిరాను. "తిరుక్కోండ్రా- దీన్నియ్యాలనేల బడగొట్టాల..." అంటూ ఇంకో రాతిని అందుకొన్నాను.

అరుగు మీంచి కిందకు దిగి రాళ్లు తీసికొని ముందుకొచ్చారు ఇద్దరు మనుషులు.

మూడువైపుల ప్రహారీ గోడ వుంది. నాలుగవ వైపు దారిని మేము అడ్డగించాము.

కుక్క బెదరి ఇటు రాబోయి- పరిస్థితి అర్థమై వెనక్కి తిరిగి, అటు ఇటు జురుకుల్లాడి చివరకు చావు తెగింపుతో ఐదడుగుల ప్రహరీగోడను బోర్లించి వున్న గంప ఆసరాగా ఎగిరి అవతల దూకి కుయ్యోమంటూ పారిపోయింది.

మమ్మల్ని చూసి పకపక నవ్వాడు సెవ్వన్న.

"మీకు దొరుకుతాదా రెడ్డే?" అన్నాడు. "యేడాది నుంచి చూస్తాండ... పుట్టిన కోడిపిల్లనల్లా ఎంటాడి తింటాంది. ఒక్క మొగోనికి కూడా సుక్కుమన్లే... రొవ్వొంతన్నా పొర్సం రాలే... కుక్కను సంపలేకుండారు..." ఈసడింపుగా అన్నాడు.

"ఇన్ని మాటలు మాట్లాడ్తవే... నువ్వు సంపగూడదా? నువ్వు మొగోనివి గాదా?" రామయ్య అన్నాడు.

"సూస్చాండు- ఎప్పటికైనా దాన్ని నేనే సంపాల," సెవ్వన్న అన్నాడు మీసం దువ్వుతూ.

కోడిపిల్లను పోగొట్టుకొన్నపుడల్లా సాయంత్రం గొణుగుళ్లతో కూడిన ఇందిర వేదనలో కుక్క అరాచకత్వాన్ని వూహించుకొంటు న్నానే గాని యీరోజు ప్రత్యక్షంగా చూశాను. ఇందిర స్థానంలో నిలబడి ఆలోచిస్తే నాక్కూడా శోకంతో బాటు కుక్క మీద కోపం ముంచుకొచ్చింది.

గతంలో కుక్కలెప్పుడూ ఇంటి కోళ్లను తినేటివి కాదు.

కోళ్లనే కాదు- గొర్లదొడ్డి వద్ద గూళ్ల కింది గొర్రెపిల్లల్ని కూడా కొరికి చంపుతున్నాయిట. నాలుగైదు కుక్కలు కలిసి ఒంటరి గొర్రెనో, మేకనో నేల పడదొబ్బి పొట్ట చీల్చుతున్నాయిట. గొల్లలు కూడా వాపోతున్నారు.

ఊరక్కుల్లో యీ హింసా ప్రవృత్తి ఎట్లా ప్రవేశించిందో అర్థం కావటం లేదు.

ఉదయం ఎనిమిది గంటల సమయాన బడికి వెళుతూ వున్న నాకు కుంటకట్ట మీద ఎదురయ్యాడు సెవ్వన్న. చేతిలో నల్లటి పాలిథిన్ సంచి వేలాడేసుకొస్తున్నాడు.

బండిని ఆపి ఏమిటన్నట్లుగా చూశాను.

చిన్నగా నవ్వాడు అతను. "తెస్సాండ... ఆ కుక్కను సంపంది వొదిలేదిలే... కటికంగడి కాడ కోడి పొట్ట పేగులు కసురూ తెస్సాండ... గులికెల మందు కలిపి పెడ్తా. ఠారుమని సావాల. ఇన్నోజులూ ఎందుకులే అనుకున్నే... పాపమని వొదిలిపెట్టినా... నా కోడిపిల్లల్నే... వంద పిల్లల్ను తినింటాది... వంద... సంపితే పాపమా?" చివర ప్రశ్నతో నాకేసి సూటిగా చూశాడు.

సమాధానంగా చిన్నగా నవ్వుతూ బండి కదిలించి ముందుకు సాగాను.

సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఉత్సాహంగా కనిపించాడు సెవ్వన్న. ప్రహరీగోడకు ఆనుకొని నిలబడి, "రెడ్డే!" అని నన్ను సంబోధిస్తూ అరుగు వైపు తిరిగి గట్టిగా దగ్గాడు. రామయ్య ఇటువైపు చూడగానే ఔడు గరచి మీసం మెలేసి, "సంపినా దొరా! పైటేలకే దాని పీడ వొగదెంచినా..." అన్నాడు బిగ్గరగా. "కోడి పేగులకు గులికెల మందు పాడుబాయి గడ్డన పెట్టినా. ఎప్పుడు తినిందో ఏమో... జెయిగాడు సెప్పె... వాగులోబడి తనకలాడ్తాన్నెదంట... యీ వీధికి పట్టిన పీడ వొగదెంచినా... సంపినా..." అన్నాడు.

రామయ్య నవ్వుకొంటున్నాడు.

నాక్కూడా సంతోషం కలిగింది.

మనస్సు తేలికబడింది.

ఎన్ని కోడిపిల్లల్ని తినిందనీ అది! మొండిగా దూసుకుపోయి తల్లికోడిని లెక్కజేయకుండా రెండు మూడు పిల్లల్ని ఒకేసారి నోట కరుచుకొని పోతుంది.

ఇరవైరోజులకు పైగా గుడ్లు పెట్టటం, ఇరవై ఒక్కరోజులు పొదగటం, పిల్లల్ని లేపటం, పదిరోజుల్లోనే కుక్క నోటబెట్టటం...

గుడ్లు పెట్టేందుకు తావులు కల్పించాలి. పెట్టిన గుడ్డును ఏ రోజు కారోజు బానల్లోనో, ఫ్రిజుల్లోనో దాచాలి. కోడి పొదుగుకు రాగానే పాత గంపలో చెత్త చెదారం వేసి పొత్తిళ్లు తయారుచేసి గుడ్లన్నీ దానిమీద పేర్చి కోడిని అందులో పొదగబెట్టాలి.

గుడ్లను గంపలో పొందించేటపుడు ఇందిర హడావిడి చూడాలి. పాడి తయారుచేసిన తర్వాత నన్ను రమ్మంటుంది. నా చేత్తో గుడ్లు పొదిగిస్తే పిల్లల్ని బాగా లేపుతుందిట కోడి. నేను కాదనలేక గుడ్లన్నిటినీ గంపలో పేరుస్తాను.

పిల్లల్ని లేపింతర్వాత గుడ్ల పెంకుల్ని ఏరివేసి, పిగలని గుడ్లను చెవికాడ వూపి, లోపల పిల్ల అరుపు వినిపిస్తుందేమోనని పరిశీలించి, లొడలొడ వూగితే అది మురిగిపోయిన గుడ్డుగా లెక్కేసి పక్కన పడేసి... అదో లోకం ఆమెకు. అట్లా ఏడాది పొడవునా పిల్లల్ని లేపించటం... కుక్క నోటబెట్టటం... చాలా బాధగా వుండేది.

గ్రామస్తులు అనేవాళ్లు, "నీకెందుకమ్మా యీ గొడవంతా! ఉద్యోగస్తులయి వుండీ యీ కోళ్ల సాకడం, గొడ్ల మేపడం అవ సరమా!" అని.

నేను కూడా చాలాసార్లు ఆ మాటతోనే ఇందిరను పొడిచి వుంటానుగాని- మాంసం కోసమో, అమ్మి సొమ్ము చేసికొనేందుకో ఆమె కోళ్లను సాకటం లేదనే విషయం నాకెప్పుడో తెలుసు.

పిల్లలంతా చదువులకు వెళ్లిపోయిన తర్వాత ఇంటి దగ్గర ఒంటరితనాన్ని పోగొట్టుకొనేందుకు తనకో ప్రత్యేక లోకం సృష్టించుకొనే క్రమంలో యీ కోళ్ల సాకటం ఒకటి ఏర్పడింది. మనుషులతో మాట్లాడినట్టే వాటితో మాట్లాడుతుంది. బుజ్జ గిస్తుంది, గద్దిస్తుంది, పిలుస్తుంది. తరుముతుంది, జాగ్రత్తలు చెబుతుంది. వాటిల్లో ఒకదానిగా మారిపోవాలని చూస్తుంది.

కోళ్లను అంత గాఢంగా ప్రేమించే ఆమెకు కుక్క మీద అంతులేని కసి ఏర్పడటం సహజం... ఆమె వల్ల నాకు కూడా.

సెవ్వన్న పుణ్యాన ఇప్పుడా బాధ తీరింది.

కాటికి కాళ్లు చాచే వయస్సులో ముసిలోని పట్టుదల నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తూ వుంది.

చీకటి పడిన తర్వాత సెవ్వన్న వచ్చాడు. "దొరా!" అంటూ కర్ర వూతేసుకొని. జాగ్రత్తకోసం తప్ప నడక సహాయానికి కాదు కర్ర.

"పాపంలో పడేట్టుండానే..." అన్నాడు.

"ఏమీ?" అడిగాను.

"ముందన్నా చెప్పలే జెయిగాడు... ఇప్పుడనె... పిల్లల తల్లెంట అది... నిన్ననో మొన్ననో యీనుకొన్నెదంట... పిల్లలు కండ్లుగూడా తెర్సలేదంట... పాడుబాయి గెట్టిన కంప సెట్లల్లో రోంత దిబ్బ వున్నే... దాంట్లో పాది జేసుకొని యీనుకొన్నెదంట... అదంటే దుర్మార్గురాలు... సంపినా పాపంలే... పిల్లలెట్టా?" అంటూ జయన్న ఇంటికేసి కదిలాడు.

నేను చూస్తూ వుండిపోయాను.

కొంతసేపయింతర్వాత వెనుదిరిగి వచ్చి, "పలకలే నా కొడుకు... కుక్కపిల్లల్ని తీసి గంపకిందన్నా బెయ్యమన్నే... వేరే కుక్కలు చూస్తే కొరికి సంపుతయి. రేత్తిర్లు పందికొక్కుల

కండ్లబన్నే కొరుకుతాయి... ఎట్ట జెయ్యాలబ్బా?...'' అంటూ గొణుక్కొంటూ ఇంటికెళ్లాడు.

నేను కూడా కొంత అయోమయంలో పడ్డానుగాని అరుగు మీద కూచున్న తర్వాత మరచిపోయాను.

ఇంకా ఎవ్వరూ అరుగు వద్దకు రాలేదు.

తిండి తినిగాని రారు.

''సందాకవలమమ్మా!'' అంటూ భిక్షగత్తెలు ఇల్లిల్లూ తిరుగుతున్నారు.

టీవీల ముందున్న ఆడవాళ్లు ఇళ్లల్లోంచి బైటకు రాలేదుగాని వీధి కుక్కలు మాత్రం గయ్యిన మొరుగుతూ వాళ్లను ఇబ్బంది పెడుతున్నాయి.

అర్ధగంటసేపు కూడా గడవకుండానే తిరిగి అరుగు వద్దకు వచ్చాడు సెవ్వన్న.

అరుగు మీద పిర్ర మోపాడు.

రెండు నిమిషాలు కూడా కుదురుగా కూచోలేదు. లేచి నిల్చుని, "ఎట్టజెయ్యాల దొరా!" అన్నాడు నాకేసి తిరిగి. "ఈ పాయాన నా మెడకు సుట్టుకుండెనే..." అంటూ బాధపడ్డాడు. "ఆ నా కొడుకు జయిగాడు పలకడంలే... ఇంగొకనితో అయ్యే పని గాదు అది... ఆ ఎలితావు లోతావు వానికే తెలుసు. వానింటికాడి పాడుబాయి మరుగు..."

"ఈ జామున ఎవురికైనా కష్టమేలే... చీకటి గదా!" అన్నాను.

"చార్జింగ్ లైట్లుండేదేం రెడ్డే..." చెప్పాడు.

అంతలో జయన్న గొంతు వినిపించి, "ఒరే నాయినా జయన్నా!'' అంటూ అటుకేసి నడిచాడు. ''నీకు పున్నెముంటాదిరా... ఆ కుక్కపిల్లల్ను బైటికి తీసకరారా! గంపకింద బేజ్జాంరా..." అన్నాడు.

"ఏందిబ్బా వాటెను సాకేది! వాటెమ్మ దొంగనాకడకల్ది. ఎన్ని కోడిపిల్లల్ను తిన్నెదో లెక్కలే... బిడ్డలు మాత్రం పసవర్లయి తాయా!... సావనీలే..." అంటూ వెళ్లిపోయాడు.

"ఎట్టజెయ్యాలబ్బా! యిడ్సిపెడ్తే బతకవే... నా సేతులారా నేనే సంపితి... నా బాధ నా కసి అమ్మను సంపితే- పసిపిల్లల్ను నేనే సంపితి,'' అంటూ ఇంటికేసి నడిచాడు సెవ్వన్న.

అతని బాధ నాకు అర్థమవుతూ వుంది.

అర్థం కానిదల్లా- వూరకుక్కల్లో యీ హింసా ప్రవృత్తి, వేట మనస్తత్వం ఎట్లా ప్రవేశించిందా అని.

ఆ విషయాన్నే సెవ్వన్నను అడిగాను తిరిగి రాగానే.

"తిండి దొరక్కనే..." వెంటనే చెప్పాడు అతను.

నేను కొంత అయోమయంగా చూశాను.

"పదేండ్ల కిందటి దాకా ఇంటికొక కుక్కను పెంచుకుంటాం టిమి. అది ఇంటికి కావిలుంటాండె. చేలకాడికి తోడొస్చాండె. గొర్లున్నోడంతా రొండు కుక్కల్నన్నా పెంచుకొంటాండె. నక్కలు తోడేల్ల బాధ నుంచి అవి తప్పిస్చాండె. ఇప్పుడు కుక్కల్ను సాకే వాల్లేరీ? పారిగోడలు కట్టుకొని గేట్లు బిగించుకొని కుక్కల్ని ఇంట్లేకి రానియ్యకపోయిరి. తిండి తినేప్పుడు కుక్క వాకిట్లేకి వొచ్చి తొంగి సూస్చాండే. ఒక్క పిడచన్నా బేస్చాంటిమి. ఇప్పుడది వాకిట్లేకి వచ్చేదానికి లేకపాయె. కొట్టాలు గుడిసెలు వున్నెప్పుడయితే మనుసుల్లేనెప్పుడు తడికెల వాకిలి కొరికి ఇంట్లో జొరబడి కుండల్లో కూడు తినిపోతాండె... నక్కలు తోడేల్లు కులనాశినమై పోయినాంక గొల్లోల్లు కూడా కుక్కల్ను సాకడం సాలించిరి. వేట మరిగిన కుక్కలు యాడ వూరుకుంటాయి. పెద్దనక్కలు తోడేండ్ల బదులు కుక్కలే గొర్రెల్ను యాటాడబట్టినయి. మాసులిప్పుడు గేట్లు బిగించుకొని కుక్కల్ను ఇంట్లేకి రానియ్యకపోడమే కాకుండా చెంబు పట్టుకొని దాంకకు పొయ్యేది కూడా లేకపాయె. అంతా ఇంట్లోనే కానిస్చాండిరి. అవి ఎట్ట బతకాల? వూరకుక్కలు కోల్లను తినబట్టినయి. గొర్లకాడి కుక్కలు గొర్రెపిల్లల్ను, గొర్లను గూడా సంపబట్టినయి రాబోయే కాలంలో కుక్కలే నక్కలు తోడేల్ల మాదిరి మారిపోతాయేమో!'' చెప్పాడు.

అతని విశ్లేషణ నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

ఆది మానవుడి నుండి ఇప్పటిదాకా కుక్కల్ని మచ్చిక జేసికొని సాగిన మనిషి ప్రయాణం కాస్తా ఇప్పుడు కుక్కల్ని తన నుంచి దూరం చేసికొనే దిశగా సాగుతోంది. టౌన్లలో, కొన్ని పల్లెల్లో కుక్కల్ని విషప్రయోగంతో సామూహికంగా చంపుతూ వున్న వార్తల్ని వింటున్నాం. భవిష్యత్తులో మనిషి కుక్కల్ని సంపూర్ణంగా గ్రామాల్లోంచి తరిమివేయగలడేమో! అవి కూడా జనావాసాల్ని వదలి క్రూరజంతువులుగా మారతాయేమో! మెడకు గొలుసులతో, ప్రహరీ లోపల కుయ్యి కుయ్యిమనే సీమకుక్కలే రేపటి తరం కుక్కలుగా చెలామణి అవుతాయేమో!

తిండి తిని ఒకరొకరుగా అరుగు వద్దకు వస్తున్నారు జనం.

అరుగు మీద కూచుని లోకాభిరామాయణాలు మొదలెట్టారు.

ఇంటిదాకా వెళ్లి తిరిగి వచ్చాడు సెవ్వన్న.

ఇంటి వద్ద అతని పానం నిలువనట్టుంది.

" కాలానికి ముసిలోడు పాలెగాడబ్బా! అంత మాయదారి కుక్కను దెబ్బకు సంపిండు..." సూరయ్య అన్నాడు.

"ఏం పాలెగానితనమో తీ... దానికి నేదరి పిల్లలుండాయంట. కండ్లు గూడా తెర్వని పిల్లలు... పాపం జుట్టుకొనె..." సెవ్వన్న అన్నాడు.

"సిన్నప్పుడు పిల్లిని జంపి పాపం సుట్టుకొంటాదని బయపడి దాని సెవ్వు కాల్చుకొని తిన్నెవంటనే... నిన్ను సెవ్వన్న అనేది అందుకే నంటనే...?" సూరయ్య ఎకసక్కెంగా అన్నాడు.

"అంటే... ఇప్పుడు ముసిలోడు కుక్కసెవులు తినాల్నా?" అని సుబ్బయ్య అనటంతో అందరూ పకపక నవ్వారు.

వాళ్ల వ్యంగ్యాన్ని భరించలేకపోయాడు కాబోలు. "దాని పిల్లల్ను కోసక తింటేగాని నాకు పాపం పోదు..." అని కొంత బాధతో మరికొంత రోషంతో అంటూ అక్కన్నించి వెళ్లిపోయాడు.

మరికొంతసేపు యవ్వారం తర్వాత చలి ఎక్కువ కావటంతో ఒకరొక్కరే అరుగు దిగి ఇళ్లకు వెళుతున్నారు.

నేను కూడా ఇంట్లోకెళ్లి టీవీ ముందు కూచున్నాను.

ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన వారి తల్లిదండ్రులు, పెళ్లాం పిల్లలు గగ్గోలు పెట్టే దృశ్యాలు మళ్లీ మళ్లీ ప్రసారమవుతున్నాయి.

పట్టుకొని కాల్చి చంపిన పోలీసుల మీద కేసు నమోదు చేయాలనీ, చనిపోయినవారి కుటుంబాలకు ఆర్థిక సహాయంచేసి ఆదుకోవాలనీ ప్రజాసంఘాలు ఆందోళన చేస్తున్నాయి.

"రెడ్డే!... ఓ రెడ్డే!" బైట్నించి పిలుపు.

పంచలోకి నడిచాను.

గేటువద్ద సెవ్వన్న.

"బాయిగడ్డ మీది కంపసెట్లల్లోంచి కుక్కపిల్లల అరుపులు నీకు యినబల్లేదా సామీ?" అడిగాడు.

కొంత నిశితంగా చెవులు రిక్కించి విన్నాను.

అటువంటి శబ్దాలేవీ వినబడలేదు.

"కుయ్యో కుయ్యోమంటూ వాటి అరుపులు సెవుల్లో గుయ్యిమంటా మోగుతండాయి. పండుకుంటే కండ్లు మూతలు పడ్డలే దొరా!" అన్నాడు.

అతనికేసి తదేకంగా చూశాను. అతని బాధ నాకు అర్థమవుతూ వుంది. అర్థం కానిదల్లా- అతని కోపాన్నీ, కసినీ, కుక్కను చంపాలనే క్రూరత్వాన్నీ అతనిలాగే అనుభూతించిన నాకు, అనాధలైన కుక్కపిల్లల పట్ల అతనిలో పొంగివచ్చే కారుణ్యాన్ని అతనిలాగే ఎందుకు అనుభూతించలేకపోతున్నాను- అని.

నేనే కాదు- అరుగు వద్ద జనాలందరు కూడా.

సెవ్వన్నను వెంటేసుకొని జయన్న ఇంటివద్ద కెళ్లాను.

"ఒరే జయన్నా!" లైటేసి పిల్చాను.

రెండు పిలుపుల తర్వాత పలికాడు.

"ఏం సారూ?" అంటూ వచ్చాడు.

"ఇదో యీ టార్చిలైటుతో పోయి ఆ కుక్కపిల్లల్ను పట్టకరా పో," చెప్పాను.

"ముసిలోడు ముసిలోడు గాదబ్బా!" గొణుక్కొంటూ లైటు తీసికొన్నాడు వాడు.

పది నిమిషాల తర్వాత నాలుగు కుక్కపిల్లల్ని రెండు గబ్బిళ్లతో పట్టుకొని వచ్చాడు.

వాడి చంకలోని లైటును నేను అందుకొన్నాను.

"వాటెను గంపకింద చెయ్యి నాయినా! పున్నెముంటాది," సెవ్వన్న చెప్పాడు.

"నాకు పున్నెమొద్దు పాపమొద్దు. ఆ పజ్జెప్పగాకు..." గయ్ మన్నాడు వాడు.

కర్రను చంకలో యిరికించుకొని కుక్కపిల్లల్ని అందుకొన్నాడు సెవ్వన్న.

"ఇగ నాకు నిద్దరొస్తాది దొరా!" అంటూ తన ఇంటికేసి కదిలాడు.

అరుగు వద్ద నిల్చుని అతను వెళ్లిన దిశకేసే చీకట్లోకి చూస్తూ వుంటే ఉన్నట్టుండి నా ఒళ్లంతా జలదరించింది. కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగి జలజల రాలాయి.

'ముసిలోడా ఓ ముసిలోడా! పాతకాలపు ముసిలోడా! పురాతన మానవుడా! గుండె తడారని మనిషీ! ఎద్దుల్ని పెద్దకొడుకులుగా, బర్రెల్ని ఆడబిడ్డలుగా, పిల్లుల్ని చంటిపిల్లలుగా, కుక్కల్ని ఆత్మబంధువులుగా, చెట్లను దేవతామూర్తులుగా చూసికొనే తరానికి చెందిన ముసిలోడా! మా గుండెలు తడారి ఎడారిగా మారాయి తండ్రీ!' ఎదలో ఘోష మొదలైంది.

రాత్రంతా సరిగ్గా నిద్రపట్టలేదు నాకు.

ఉదయం ఆలస్యంగా లేచాను.

సెవ్వన్న గుర్తొచ్చి అతని ఇంటి వద్దకు నడిచాను.

మిద్దెగోడకు ఆనించి నిలేసిన వారపాకలో తడికల గోడల నడుమన నేలమీద కాళ్లు బారజాపి కూచుని, నాలుగు పిల్లలూ ఒడిలో పాకుతూ పాలకోసం వెంపర్లాడుతూ వుండగా, ఒక్కోదాన్ని జాగ్రత్తగా పట్టుకని పాలసీసా పీకను నోట్లో పెట్టి పాలు తాపుతున్నాడు సెవ్వన్న.

అప్పుడే ఈనుకొన్న నలుగురు పిల్లల తల్లిలా వున్నాడు.

"పొద్దున్లేసినాన్నుంచీ ఆకలో ఆకలో అని ఒకటే మొత్తుకోలు... పాలు కొనక్కొచ్చినా," చెప్పాడు. "ఉండే నీ పాడుగానూ... దాన్ని తాగనీ... మీ యమ్మకున్నెట్టు దండిగా రొమ్ములేడ తేవాల?" అంటూ కుక్కపిల్లల్ని సముదాయిస్తూ, "యిదో... యీ సీసా పాల పీకె గొల్లోల్ల నడిగి యిప్పించకొచ్చినా... ఇంగో సీసన్నా లేకుంటే నా పానాలు తీసేట్టుండాయి," అంటూ మరొక పిల్లకు పీకను అందించాడు.

మళ్లీ నా కళ్లల్లో నీళ్ళూరి గుడ్లనిండా కమ్మి అక్కడి దృశ్యం మసకబార జొచ్చింది.

సాయంత్రం బడి నుంచి ఇంటికి తిరిగొచ్చేసరికి సెవ్వన్నకు తోడుగా ఇందిర కూచుని పిల్లలకు పాలు తాగిస్తూ కనిపించింది.

మరో వారంరోజులకు ఆ వీధి ఆడవాళ్లందరూ వాటికి తల్లులయ్యారు.

టీవీ వార్తల్లో ప్రజాసంఘాల ఆందోళనలు జరుగుతూనే వున్నాయి- ప్రభుత్వం చంపేసిన తీవ్రవాదుల కుటుంబాల్ని ఆదుకోవాలని, నష్టపరిహారం అందించాలని.

ఆందోళనల్ని కూడా లాఠీలు కర్కశంగా అణచివేస్తున్నాయి.

ఈ విషయంలో ప్రభుత్వం కన్నా మా సెవ్వన్న మేలేమో!

యాభై పైగా కథలు రాశారు. నాలుగు కథా సంపుటాలు, ఐదు నవలలు ప్రచురించారు. గతంలో ఆటా నవలల పోటీలో 'వీరి కాడి' నవలకి, చతుర నిర్వహించిన పోటీలో 'చినుకు సవ్వడి' నవలకి, ఇప్పుడు తానా నిర్వహించిన నవలల పోటీలో 'ఒంటరి' నవలకి బహుమతులు లభించాయి. నివాసం బాలరాజుపల్లె, కడప జిల్లా.

email: sannapureddy12@gmail.com

ఉలితీత

కె. శివారెడ్డి



అన్నింటికీ సిద్ధంగా వుండు
విరిగి పడుతున్న కొండల మధ్య నడుస్తున్నాం
అకస్మాత్తుగా తెగిపోతున్న దారుల్లో సంచరిస్తున్నాం
అవతలికి చేరతామో లేదో
తెలియని నదుల్లో ఈదుతున్నాం
చూపు ఎంత మట్టుకు వ్యాపిస్తే అంత
చేయి ఎంత మట్టుకు చాస్తే, అంతే-
హద్దు లేనట్టుండే హద్దు వుంది
న్యాయమనిపించే అన్యాయముంది
రేయి లాంటి పగలు వుంది
పగలు లాంటి రేయీ వుంది
ఇరుదరుల్ని రెండు చేతుల్తో పట్టుకుని
నదిని, కత్తిలా కోసుకెళ్లే మొనగాడెవడు
నికరంగా నిలవని నది కాయితమ్మీద
నాలుగు లైన్లు ఎవడు రాస్తాడు
ఎవడు ఎప్పుడు ఏం చేస్తాడో తెలయని తావులో
అన్నింటికి సిద్ధమయి వుందాం
మనల్ని మనకి పరిచయం చేసే
కార్యక్రమమేదో మొదలయ్యింది
కొరత వేసిన కొయ్యలోంచి
శ్రీనాథుడు మాట్లాడతాడా
శివారెడ్డి మాట్లాడతాడా
కొరతల్లేని చెప్పే కొలువు కూటమిలో
లోలోపల నిన్ను ఉరితీసే
కార్యక్రమం మొదలయిన వేళలో
అన్నింటికీ సిద్ధమయి ఉందాం-

సీనియర్ కవి. గత యాభై ఏళ్లుగా నిరంతరాయంగా కవిత్వం రాస్తూనే ఉన్నారు. యువ కవులను ప్రోత్సహిస్తున్నారు. కేంద్ర సాహిత్య అకాడెమితో సహా వివిధ ప్రతిష్టాత్మక పురస్కారాలు పొందారు. 2001లో తానా సాహితీ సమావేశాలకు అతిథిగా హాజరయ్యారు. దాదాపు 15 కవితాసంపుటాలు, రెండు సమగ్ర సంకలనాలు ప్రచురించారు. నివాసం హైదరాబాదు.

కాసింత స్పృహకో...

కవి యాకూబ్

సన్నని దారి
ఎక్కడినుండి ఎక్కడికో
కనుక్కునేంత సమయం లేదు
రాత్రుల్లో సంచారం
మరీ ముఖ్యంగా కలల్లో, కలవరింతలలో
ముళ్ళు పరుచుకున్న మార్గంలో
అక్కడక్కడా కొన్ని పూలు,
పలకరింపులు , అంతకుమించి వెక్కిరింతలు.

గడియారం విసిగిస్తుంది
కాలెండర్ లోలోపల ఏడుస్తుంది
అబద్దం అద్దంలా వేలాడుతుంది
దారీతెన్నూ లేదు
బొమ్మల ముఖాల్లో అమ్మలు కూసింత దయతో, ఎవర్నీ శపించలేని కనికరంతో

చిగురుటాకు దేహాన్ని తొలుచుకుంటూ
లోపలివేర్లను వెదుక్కుంది
అడవులు ఎర్రని రక్తంతో పచ్చబడుతున్నయ్
మొలవని మొక్కల పక్కనే మొలవని కళేబరాలు

సన్నటి దారి
మూసుకుపోతోంది తనలోకి...

❖

ఆ పిదప ఒక తలుపు తెరుచుకుని కొన్ని దారుల్ని
కాళ్ళవైపుకి విసురుతాయి.
కొన్నిచోట్ల కొత్తగా మొలిచిన అడుగులు నోళ్ళుతెరుచుకుని
అరుస్తాయి, కరుస్తాయి.
నిద్రలేమిలాంటిఇ కొత్తవ్యాధి
ఇళ్లలోకి దూరి దేహాలను శవాలుగా సంబోధిస్తుంది.
ఎవరూ ఎవరికీ ఎంతకీ పలకరు, వినపడరు.
అదేమిటో- ఎక్కడిదో శ్లోకం మళ్ళీ మళ్ళీ
చెవుల్లోకి సీసంలా ప్రవహిస్తుంటుంది.
ఫినిష్
ఎవ్రీథింగ్ గోయింగ్ టు ఫినిష్
తలుపులు మూసుకుంటున్నాయి, దారులు చెరిగిపోతున్నాయి.
ఒకే ఒక దారి, అందరూ ఇక అటువైపే నడవాలి.
అటువేపే చూడాలి
అటువైపే...

ప్రముఖ కవి, అనేకమంది యువ కవులను ప్రోత్సహిస్తూ కవి సంగమం నిర్వహిస్తున్నారు. నాలుగు కవితా సంపుటాలు, రెండు వ్యాస సంపుటాలు ప్రచురించారు. వివిధ ప్రతిష్టాత్మక పురస్కారాలు లభించాయి. నివాసం హైదరాబాద్. *2017 తానా సభల అతిథి.*
email: kaviyakoob62@gmail.com

మరో స్వేచ్ఛ

యాజి

"నీక్కాబోయేవాడు ఎలా ఉండాలే?" అరకిలో మీటరు జాగ్ వల్ల కలిగిన ఆయాసంతో బరువుగా ఊపిరి పీలుస్తూ అడిగింది సుజాత.

మూడు కిలోమీటర్ల దూరాన్ని సునాయాసంగా పరిగెత్తి, సుజాత అలసట వల్ల ఆగిన స్వేచ్ఛ, దానికి బదులిస్తూ, "నావి చాలా చిన్న కోర్కెలే... అతడు బయట ప్రపంచానికి కాన్ఫిడెంట్, ఆర్టిక్యులేట్, మెచ్యూర్ పర్సనాలిటీని, నా ఎదుట మాత్రం ఒక చిన్నపిల్లాడిలాగా నా ఒడిలో ఒదిగిపోయే మెంటాలిటీ కలిగి ఉండాలి."

"ఊ... ఇంకా?"

"పదునైన సెన్స్ ఆఫ్ హ్యూమర్, కంటతడి చూపించటానికి భయపడని నైజం, ఒక మంచి సోషల్ సర్కిల్, నాకంటే ఈ ప్రపంచంలో తనకెవ్వరూ ఎక్కువ కాదన్నట్లుండే స్వభావం, ఆర్ట్స్ అంటే ఆసక్తి, కావాలనిపించినప్పుడల్లా నాకు ఆసరా ఇచ్చే భుజం... ఇలా ఏవో చిన్న చిన్న లక్షణాలుంటే చాలే! మిగిలినవాటితో నేను సర్దుకు పోతా..." అంటూ ఒక చిలిపినవ్వుతో ముగించేసింది స్వేచ్ఛ.

"నీకు చిన్నప్పుడు మీ అనాధశరణాలయంలో ఏమి నేర్పించారో కానీ... బాగానే ఎక్కింది... పిచ్చి! నీకు కావాల్సిన ఈ లక్షణాలు ఒకడిలో ఉన్నాయంటే... వాడికి స్ప్లిట్ పర్సనాలిటీ డిజార్డర్ ఉందన్నమాటే!" తేల్చేసింది సుజాత.

కొంచెం సీరియస్‌గానే, "నేను పెరిగిన చిన్నప్పటి వాతావరణం వల్లే కావచ్చు... నాకు అందరి ఆడపిల్లలలాగా ఆలోచించటం రాదే... నాలో ఎందుకో, ఈ మేల్ డామినేటెడ్ సొసైటీ ఏర్పర్చిన రూల్స్ అన్నీ చెరిపేసి, ఒక మగాడికున్న స్వాతంత్ర్యాన్నీ, బాధ్యతలేనితనాన్నీ అనుభవించెయ్యాలని అనిపిస్తూ ఉంటుంది. కరణేషు, భోజ్యేషు, శయనేషు, నా బొందేషు అంటూ స్త్రీల నించి రకరకాలుగా ఎక్సెపెక్ట్ చేసేవాళ్లనించి, ఆ మాత్రం లక్షణాలు ఆశించడం తప్పుకాదనుకుంటాను?" సంధించింది, స్వేచ్ఛ.

"ఆశించటం తప్పు కాదు కానీ... ఆచరించటం నీ వల్ల కాదే. నీకు రాసిపెట్టి ఉన్నవాడు ఎదురైనప్పుడు, లక్షణాలు లెక్కెట్టటానికి నీ మెదడు పని చేయదు. మనసు మాత్రమే పని కట్టుకొని నిన్ను పడేస్తుంది... అతడి ప్రేమలో"

"అదీ చూద్దాం... ఆఫీసుకి టైం అవుతోంది. ఈరోజు మన బ్యాంక్‌లో ఎవరో కొత్త ఎంప్లాయీ జాయిన్ అవుతున్నాడు... ఇన్వెస్టెమెంట్స్ సెక్టర్ లీడ్ కాబట్టి, అతడిని నేనే రిసీవ్ చేసుకోవాలన్నాడు బాస్," జాగ్ చేసుకుంటూ తన అపార్ట్‌మెంట్ వైపు మళ్లింది స్వేచ్ఛ.

★ ★ ★

"సూర్య..."

"స్వేచ్ఛ..."

"చాలా అందమైన పేరు..."

"పేరొక్కటేనా?"

"ఇప్పుడే కదా కలిసింది... ఇంకా ఏమేం నచ్చాయో అప్పుడే చెప్పేస్తే బాగోదేమోనని..."

"నాట్ బ్యాడ్... కొత్తగా జాయిన్ అవుతున్నారంటే, ఎవరో ఫ్రెషర్, ర్యాగింగ్ చెయ్యచ్చనుకున్నాను... కాన్ఫరెన్స్ రూమ్, దిస్ వే."

★ ★ ★

"మొదటిరోజు కాబట్టి, ఈరోజు మీ లంచ్‌కి కుడా, నేను పే చేస్తున్నాను."

"థాంక్ యూ...ఇందాక ట్రైనింగ్ లో, మన బ్యాంక్ ఇన్వెస్ట్ మెంట్స్ గురించి కొన్ని డౌట్స్ ఉన్నాయి... మీతో క్లియర్ చేసుకోవాలి."

"సారీ సూర్యా... లంచ్ టైంలో వర్క్ విషయాలు అస్సలు మాట్లాడను..."

"వెరీ గుడ్... పర్సనల్ విషయాలు మాట్లాడుకొని ఒకరి నొకరు తెలుసుకోవచ్చన్న మాట."

"పరిచయాలు పెంచుకోవాలని చాలా తొందరగా ఉన్నట్టుందే... మన వర్క్ మ్యాటర్ చాలా కాన్ఫిడెన్షియల్... ఇలా పబ్లిక్‌లో మాట్లాడకూడదు అని."

"ఆ... ఒకే. సేఫ్ సైడ్ కి పర్సనల్ మ్యాటర్సే బెటర్... నేను ఇంజనీరింగ్ వరంగల్‌లో చేసాను. యం.బి.ఎ, ఐ.ఐ.యం అహ్మదాబాద్‌లో. మా నాన్నగారు..."

సూర్య చెప్పినదంతా విని, స్వేచ్ఛ, "మీకు కళలంటే ఆసక్తి ఉందా?"

"మీరు మళ్లీ ర్యాగింగ్ మొదలెట్టేశారు..."

"లేదు... సీరియస్‌గానే అడుగుతున్నాను... సాహిత్యం, సంగీతం, నాట్యం- ఇలాంటివి," చిరునవ్వును, పంటితో బిగిస్తూ.

"నాకు అంత పాండిత్యం లేదు... రహమాన్, సీతారామశాస్త్రి, ప్రభుదేవా నా ఫేవరెట్స్. నవలలు ఎక్కువ ఇంగ్లీష్‌వే చదువుతాను."

"అర్థం అయ్యింది. ఇక వెళ్దామా?" తన లంచ్ ట్రే తీసుకొని లేచింది, స్వేచ్ఛ.

"అయ్యో... నా గురించి అంతా చెప్పను కాని... మీ గురించి తెలుసుకోటానికి టైం సరిపోలేదు."

"ఫర్లేదు..ముందు ముందు చాలా టైం ఉంటుంది. ఒకే డివిజన్‌లో ఉన్నాం కదా..."

★ ★ ★

"బై స్వేచ్ఛ..." అంటూ పార్కింగ్ వైపు నడుస్తున్న సూర్యాని చూసింది, సుజాత.

"వావ్... చాలా హ్యాండ్సంగా ఉన్నాడే, మీ కొత్త కుర్రాడు."

"నాట్ బ్యాడ్... వెరీ షార్ప్ ఫెలో."

"మరింకేం... ఇంక కౌంటింగ్ మొదలెట్టు, నీక్కావల్సిన లక్షణాలు..."

"నువ్వే చెప్పావు కదా... మెదడు ఆగిపోతుంది... అది, ఇదీ అని... అంత సీన్ ఉన్నప్పుడు చూద్దాం."

★ ★ ★

"మనం కలిసిన ఈ నాలుగు నెలల్లో, వర్క్‌లోను, బయటా నీతో స్పెండ్ చేసినంత టైం ఇప్పటి వరకూ ఏ అమ్మాయితోనూ చెయ్యలేదు తెల్సా!" సినిమా హాల్లో, పక్కనే కూర్చొన్న స్వేచ్ఛతో అనేశాడు, సూర్య.

"నిన్ను ఇంత కాలం భరించిన అమ్మాయి ఎవరూ లేరంటావ్... అంతేనా?" కొంటెగా బదులిచ్చింది స్వేచ్ఛ.

"జోకద్దు. ఎన్నో విషయాలు పంచుకొన్నాం. నేనెప్పుడూ చెప్పకపోయినా, నువ్వంటే నాకు పిచ్చ పిచ్చ ఇష్టం అని నీకు తెలిసే ఉంటుంది. నువ్వే నా గురించి ఏమనుకుంటున్నావో, నాకు క్లారిటీ రావట్లే!" సీరియస్‌గానే అడిగేశాడు సూర్య.

"నీ పైన ఇష్టాన్ని నేను చెప్తేగానీ తెలుసుకోలేనంటావ్? నీతో పాటు సినిమాలు, షికార్లు లాంటివి చేసినా నీకు అనుమానమేనంటావ్? అందుకే నువ్వు నాకు చాలా చాలా నచ్చావ్!" తేరుకొనేలోగా, ఒక్కసారి సూర్య పెదాలను తన పెదాలతో లిప్తపాటు తడి చేసింది స్వేచ్ఛ. సినిమా మొదలయ్యింది.

"మనవాళ్లు ఎప్పటికీ మారరు. ఇద్దరు హీరోయిన్లకీ ఆ తొడ కొట్టే హీరోనే కావాలి. వాళ్లకంటూ వ్యక్తిత్వాలు ఉండవు. వాళ్ల జీవితాశయం ఆ హీరోని పెళ్లిచేసుకోవటమే. నాన్‌సెన్స్," పరమ చిరాగ్గా ఉంది స్వేచ్ఛకి.

"టేక్ ఇట్ ఈజీ. అది ప్రతి ఒక్కడి మేల్ ఫ్యాంటసీ! నిజ జీవితంలో సాధ్యపడదు కనక, అలా సినిమాలో చూసుకొని థ్రిల్ అవ్వటమే. మనం సినిమాకి వచ్చేది, మన బోరు కొట్టిన జీవితాలను మర్చిపోయి కాస్సేపు అల్లా ఊహా ప్రపంచంలో తిరిగొద్దామనే కదా?"

"అదే ఊహా ప్రపంచంలో హీరోయిన్‌కి ఇద్దరు హీరోలను పెట్టి, ఒక పాట పెట్టి, ఆ హీరోయిన్‌ని ఇద్దరి చేతా డాన్స్ చేయించ రెందుకని?"

"చాలా చీప్‌గా ఉంటుంది కాబట్టి. స్త్రీ జాతినే అవమానించి నట్లవుతుంది. మన సంస్కృతిలో స్త్రీ ఒక ప్రేమమయీ, కరుణా మూర్తీ, సహనశీలి..." ఆవేశంతో అరిచేశాడు, సూర్య.

"మరి మగాడు అవేవి కాదా? ఈ ముళ్ల కిరీటాలూ, బంధాలు అన్నీ మాకేనా? మగాడి చేసే తప్పుని, క్షమించో లేక చూసి చూడనట్లు పోయే ఈ సమాజం, ఆడది అదే తప్పు చేస్తే, అంతే క్షమ చూపించకలిగినప్పుడే అసలైన సమానత్వం."

"అయ్య బాబోయ్! నీకు వైన్ ఎక్కువైనట్లుంది. నిన్ను త్వరగా ఇంటి దగ్గర డ్రాప్ చెయ్యకపోతే, నువ్వు, నీ పిచ్చి ధియరీతో నాకు పిచ్చెక్కించేస్తావ్!" హడావిడిగా లేచాడు సూర్య.

"అఫ్ఖర్లేదు, నేను ఆటోలో వెళ్లగలను..."

"ఈ టైం లోనా?" అని అడుగుతున్న సూర్యాని పట్టించు కోకుండా బయటకు నడచింది స్వేచ్ఛ.

★ ★ ★

"నేను కోరినవన్నీ ఉన్నాయా అంటే... లేవనే చెప్పాలి. నిజం గానే అన్నీ కావాలా అని ఆలోచించి నిర్ణయం తీసుకోవటానికి ఇంత సమయం పట్టింది," సంజాయిషీ ఇస్తున్నట్లుగా, సుజాతతో అన్నది స్వేచ్ఛ.

"అదేదో పెద్ద తప్పైనట్లు అలా నానుస్తూ చెప్తావెందుకు? వెరీ హ్యాపీ ఫర్ యు!" అంటూ గట్టిగా హగ్ చేసింది సుజాత.

"ఎంత వరకూ వెళ్లారేంటి? హద్దులు దాటేశారా?" బిగించిన హగ్‌ని విడుస్తూ క్యాజువల్‌గా అడిగేసింది సుజాత.

"లేదే... అతను ఆ విషయాల్లో కొద్దిగా స్లోనే. ఆఫీసులో కలిసి ఉన్నా, ఎప్పుడూ పనిమీద ధ్యాసే. వర్క్‌లో అన్నీ వెంటనే నేర్చేసు కోవాలని తెగ తొందరపడిపోతూ ఉంటాడు. బయట మాత్రం, రొమాంటిక్‌గానే మాట్లాడతాడు కానీ, ముద్దుకు మించి ముందుకెళ్లడు, అదీ చొరవ చేసి నేను మొదలెట్టిన తరవాతే..." అంటూ నిజాయితీగా బదులిచ్చింది స్వేచ్ఛ.

"మరీ మంచాడిలా ఉన్నాడే... నీకు సూట్ అవ్వడేమో," అంటూ ఒక నవ్వు నవ్వేసి, స్వేచ్ఛ ఉత్తుత్తి ఆగ్రహాన్ని పట్టించు కోకుండా తన ఆఫీసు వైపు మళ్లింది సుజాత.

★ ★ ★

"కమాన్ సూర్యా, ఇంత హటాత్తుగా జాబ్ మారాల్సిన అవసరం ఏముంది?" కొంత చిరాగ్గానే అడిగింది స్వేచ్ఛ.

"వాళ్ల ఫారిన్ ఇన్వెస్ట్మెంట్ డివిజన్‌కి లీడ్ రోల్ ఆఫర్ చేశారు. ఇంకొక బాడ్ న్యూస్ కూడా..." నెమ్మదిగా నసిగాడు సూర్య.

"ఏంటి? నిన్ను అండమాన్ బ్రాంచ్‌లో జాయిన్ అవ్వ మన్నారా? శుభం. రోజూ ఫేస్‌బుక్‌లో చాట్ చేస్తూ ఏడాదికొకసారి కలుస్తూ ఉండచ్చు."

"స్లీజ్... మరీ అంత కోపమా... అండమాన్ కాదు కానీ ఒక మూడు నెలలు అమెరికా వెళ్లమన్నారు, ట్రైనింగ్ కోసం. రోజూ కాల్స్, చాటింగ్... ఇట్టే గడిచిపోతాయి," అంటూ తన చేతులను స్వేచ్ఛ చుట్టూ వేసి, ఆమెను ముద్దులతో ముంచేత్తేశాడు సూర్య. వాళ్ల అందమైన ఏకాంతాన్ని భగ్నం చెయ్యటానికా అన్నట్లు, సూర్య సెల్ ఫోను మ్రోగటం మొదలెట్టింది. కాలర్ ఐ.డి. 'తేజ' అని చూపిస్తోంది.

"తీస్కో... మీ ఫ్రెండు ఎప్పుడూ మంచి టైం చూసి కాల్ చేస్తూ ఉంటాడు," అని చురకేసి లోపలి కెళ్లింది స్వేచ్ఛ. కాసేపాగి బయటకు వచ్చిన స్వేచ్ఛకి సూర్య ఏదో పరధ్యానంగా కనపడ్డాడు. తేజ, సూర్యా చిన్నప్పటినిండీ మంచి స్నేహితులు. వారానికొక సారైనా మాట్లాడుకోందే వీళ్లకి తోచదని స్వేచ్ఛకి తెలుసు.

"ఏమంటున్నాడు తేజ?" అంటూ సూర్య పక్కన కూర్చోంది స్వేచ్ఛ.

"ఐ.టి సెక్యూరిటీ లీడ్‌గా ఒక మల్టీ నేషనల్‌లో హైదరా బాద్‌లోనే జాబ్ వచ్చింది వీడికి. నెక్స్ట్ వీక్లో ఇక్కడికి వచ్చేస్తు న్నాడు వాడు. కానీ నేను అమెరికా వెళ్లాల్సింది కుడా అదే టైంలో. అదే ఏం చెయ్యలా అని ఆలోచిస్తున్నా."

"అతడేం చిన్నపిల్లాడు కాదుగా, నువ్వు వర్రీ అవ్వటానికి. ముందు మన గురించి ఆలోచించు..." అంది స్వేచ్ఛ టాపిక్ డైవర్ట్ చెయ్యటానికి ప్రయత్నిస్తూ.

"అదికాదురా. వాడికి ఊరు పెద్దగా తెలీదు. వాడిని నా అపార్ట్‌మెంట్‌లోనే ఉండమంటాను. వాడికి కొంచెం సిటీ చూపించి సెటిల్ అవ్వటానికి నువ్వే సాయం చెయ్యాలి..." అంటూ అభ్యర్థిం చాడు సూర్య.

"నీ గర్ల్ ఫ్రెండ్ని నువ్వు, నా ఫ్రెండ్‌ని చూస్కో అని అప్ప గిస్తున్న నీ నమ్మకానికి జోహార్లు అర్పించాలో లేక నీ అమాయ కత్వాన్ని తిట్టాలో డిసైడ్ చేసుకోలేకపోతున్నాను..." రాని కోపం నటిస్తూ అడిగింది స్వేచ్ఛ.

★ ★ ★

"బై... స్వీట్ హార్ట్..." అంటూ పెదాల పై ఒక ముద్దిచ్చేసి సెక్యూరిటీ వైపు నడిచాడు సూర్య.

"ఏంటీ... అంత డ్రైగా కిస్ చేసి వెళ్లిపోయాడు... వాడికి మొహమాటం ఎక్కువనుకుంటా..." చాలా క్యాజువల్‌గా అడిగాడు తేజ.

కొద్దిగా ఎరుపెక్కిన చెక్కిళ్లతో, "నీకస్సలు సిగ్గులేదన్న విషయం చెప్పాడు సూర్య... కానీ ఇంత లొడ లొడా వసపిట్టలాగా వాగుతూనే ఉంటావన్న విషయం మాత్రం దాచాడు. ఇంటి నించి ఎయిర్‌పోర్ట్ దాకా త్రోవ పొడవునా నాన్‌స్టాప్‌గా... నీకసలు అలసట రాదా?" సిగ్గు, విసుగు, కోపం అన్నీ మేళవించిన స్వరంతో అడిగింది స్వేచ్ఛ.

"నీకు కొంచెం కోపం ఎక్కువే అని చెప్పాడు సూర్య... కానీ ఆ కోపంలో నువ్వెంత అందంగా ఉంటావో చెప్పటం మాత్రం దాచాడు." తడుముకోకుండా తేజ.

జవాబు ఇవ్వకుండా పార్కింగ్ లాట్‌లో కార్ వైపు దారి తీసింది స్వేచ్ఛ. కార్లో పిచ్చ సీరియస్‌గా మొహం పెట్టుకొని కూర్చొని ఉన్నాడు తేజ. ఆ నిశ్శబ్ద వాతావరణం కలగజేసే ఇబ్బందిని తట్టుకోలేక స్వేచ్ఛ రేడియో ఆన్ చేసింది. 'కయీ బార్ యూహి దేఖా హై... యే జో మన్‌కి సీమ రేఖా హై... మన్ యూ బెహెక్తే లగ్తా హై...' అంటూ ముఖేష్ తియ్యని గళంతో పాడుతున్నాడు. పాటను చక్కగా ఆస్వాదిస్తూ స్టీరింగు వీల్ మీద వేళ్లతో తాళం వేస్తూ డ్రైవ్ చేస్తున్న స్వేచ్ఛ, తరువాతి పాట, 'షీలా... షీలా కీ జవానీ...' అని రావటంతో రేడియో ఆపేసింది.

"I'm too sexy for you, మై తేరే హాత్ నా ఆనీ... అంత మంచి పాట... ఎందుకు ఆపేశావ్?" నవ్వుతూ అడిగాడు తేజ.

"నీ టేస్టుకి తగ్గట్టే ఉంది ఆ పాట కూడా."

"నా టేస్టుకి చాలా పెద్ద రేంజ్. ఇంతకు ముందు నువ్వు అంతగా ఎంజాయ్ చేశావే, ఆ పాట గురించి తెలుసా నీకు?"

"మంచి పాట... ముఖేష్ పాట... అంత తెలిస్తే చాలు."

"ఆ పాటకి నేషనల్ అవార్డు వచ్చింది ముఖేష్‌కి. రజనీగంధ సినిమాలోది. సినిమాలో ఆ పాట నేపధ్యం గురించి తెలిస్తే ఇంకా ఎంజాయ్ చేసేదానివేమో!" వస్తున్న చిరునవ్వును పంటితో బిగిస్తూ అన్నాడు, తేజ.

"ఎందుకంట?" కొంచెం అనుమాదాస్పదంగా అడిగింది స్వేచ్ఛ.

"తన బాయ్ ఫ్రెండ్ వేరే ఊరికి వెళ్తే, తన పాత స్నేహితుడిని రిసీవ్ చేసుకొని, కారులో వెళ్తూ, ఆ స్నేహితుడి వైపు, ఆకర్షితురాలవుతున్న మనస్సుని ఉద్దేశింది పాడుకున్న పాట అది..." ఈ సారి, గట్టిగా నవ్వేస్తూ అనేశాడు, తేజ.

స్వేచ్ఛ కుడా అతడి నవ్వులో శ్రీతి కలిపింది.

"నువ్వు అందరి అమ్మాయిలతో కలవంగానే ఇలాగే ఫ్లర్ట్ చేస్తావా?"

"అందరితో కాదు. అందమైన, నేను అందుకోలేని అమ్మాయిలతో మాత్రమే... నువ్వు నా ఫ్రెండుతో ఆల్రెడీ బుక్ అయిపోయావు కాబట్టి, మనిద్దరి మధ్య ఎలాంటి ఛాన్స్ లేదు కాబట్టి... నీతో డైరెక్ట్ ఫ్లర్టింగ్ అన్నమాట. ఒకవేళ నేను ఎవరైనా అమ్మాయిని పటాయించాలంటే మాత్రం నా నైజాన్ని దాచి, బుద్ధిగా ప్రవర్తించేవాడిని," వివరించి చెప్పాడు తేజ.

"నీ నిజాయితీ... నీ పొజిషన్ మీద నీకున్న అవగాహన, నీలో నాకు నచ్చేసిన అంశాలు. నాతో బుద్ధిగా కాకుండా, కావలసినంత ఫ్లర్టింగ్ చేసుకో," అంటూ నవ్వేసింది స్వేచ్ఛ.

"నువ్వదే మాట మీదుండు... రేపు సాయంత్రం డేట్‌కి వెళ్దామా?" తన అపార్ట్‌మెంట్ దగ్గర కారు దిగిన తరవాత అన్నాడు తేజ.

"నో... థ్యాంక్ యూ. నిన్ను రోజూ భరించాలంటే కొంచెం కష్టమే."

"అదీ చూద్దాం... రేపు నాతో ఎలా రాకుండా ఉండగలవో. నీ విల్ పవర్‌కి టెస్ట్ అన్నమాట," కవ్విస్తూ అన్నాడు తేజ.

"నీకు అంత సీన్ లేదు..." అంటూ విండో రోల్ చేసుకొని డ్రైవ్ చేసుకొంటూ వెళ్లిపోయింది స్వేచ్ఛ.

★ ★ ★

"నేను రానని చెప్పాను కదా... నాకు చాలా పనులున్నాయి. నా ఆఫీస్‌కి వచ్చి చాలా టైం వేస్ట్ చేసుకొన్నావు," మందలింపు ధోరణిలో చెప్పింది స్వేచ్ఛ.

"ఓకే... నా దగ్గరో ఎక్స్‌ట్రా టికెట్ ఉంది ఈ మ్యూజిక్ కాన్సర్ట్‌కి. ఏం చేస్తాం మరి... ముఖ్యమైన పనులున్నప్పుడు వదులుకోలేం కదా..." అంటూ తన దగ్గర ఉన్న టికెట్‌ను చూపించాడు తేజ.

బాలమురళీకృష్ణ, జాకీర్ హుస్సేన్, హరిప్రసాద్ చౌరాసియా జుగల్బందీ. "యూ...ఈవిల్, ఈవిల్ మాన్... ఒక్క టూ మినిట్స్‌లో వచ్చేస్తాను," అని చెప్పి లోపలి పరిగెత్తింది, స్వేచ్ఛ.

హిందుస్తానీ, కర్నాటక రాగాలలో తేజ పరిజ్ఞానాన్ని చూసి చకితురాలయ్యింది స్వేచ్ఛ. సాహిత్యంలో కుడా విశ్వనాధుడి నించీ నేటి తరం రచయితల వరకూ అతడి విశ్లేషణాత్మక అభిప్రాయాలు, అతడి అభిరుచులు కూడా ఒకింత ఆకట్టుకున్నాయి స్వేచ్ఛని. వీకెండ్ సాయంత్రాలన్నీ ఇలాంటి డేట్స్‌తోను, తదనంతరం డిన్నర్స్, కొన్నిసార్లు రాత్రి మొత్తం కొనసాగిపోయే చర్చలతోను రెండు నెలలు ఇట్టే గడచిపోయాయి.

★ ★ ★

"చలాన్ని ఈ సమాజం అర్థం చేసుకోలేదు. ఎప్పటికీ!" నిర్లిప్తతతో అన్నాడు తేజ, 'మైదానం' చదువుతున్న స్వేచ్ఛతో.

"అర్థం చేసుకోవాలని ఆయన వ్రాయలేదోమో? తన చుట్టూ ఉన్న సమాజంలోని స్త్రీల అణచివేతను, యాంత్రిక సంసారాలు

కొనసాగిస్తున్న జీవితాలలోని ప్రేమరాహిత్యాన్నీ, వీటినన్నిటినీ చూసి కోపం వచ్చి ఆవేశంతో వ్రాసేడేమో అనిపిస్తుంది నాకైతే.''

"ఏమో, నాకు రాజేశ్వరి పాత్ర చాలా ఇష్టం. భలే స్వేచ్ఛగా ప్రవర్తిస్తూ ఉంటుంది.''

"ఇంట్రెస్టింగ్! నాకైతే చలం తాను ద్వేషించే పితృస్వామ్య భావజాలం నించి తానే బయటపడలేక, స్త్రీ స్వేచ్ఛని కూడా పురుష కోణం నించే చూశాడనిపిస్తుంది. రాజేశ్వరి మొదట మొగుడికి, తర్వాత ప్రియుడికి బానిసగా ఉండిపోతుంది. ఆ రాజేశ్వరే నీకు నిజ జీవితంలో ఎదురుపడితే ఏం చేస్తావు, తేజా?''

"నేను అందరిలాగా ఆలోచించను. నేను రాజేశ్వరి బోల్డ్‌నెస్‌ని ఇష్టపడతాను. తనే కాదు, చలం సృష్టించిన స్త్రీలందరినీ ఆరాధిస్తాను.''

"మన చర్చ రాత్రంతా కూర్చొన్నా తేలదు. లేట్ అయిపోయింది. నువ్వలా సోఫా మీద పడుకో ఈ రాత్రికి. ప్రొద్దున మాట్లాడుకుందాం,'' అంటూ తన బెడ్ రూమ్ వైపుకు నడిచింది స్వేచ్ఛ.

★ ★ ★

"నువ్వేం చేస్తున్నావో నీకేమైనా తెలుస్తోందా?'' సీరియస్‌గా అడిగింది సుజాత.

"నువ్వనుకుంటున్నలాంటిదేమి లేదు... తేజాకి, నాకు అభిరుచులు బాగా కలిశాయి. అతనితో ఉన్నప్పుడు సమయం ఎలా గడిచిపోతుందో అస్సలు తెలీదు. అతనితో మాట్లాడకపోతే మాత్రం ఏదో వెలితిగా ఉంటుంది,'' అంటూ సిన్సియర్‌గా సమాధానం ఇచ్చింది స్వేచ్ఛ.

"రోజూ మాట్లాడుతున్న నీకు తెలియకపోవచ్చేమోగానీ... మాకు మాత్రం అతని కళ్లల్లో నీతో మాట్లాడుతున్నప్పుడు కనపడే మెరుపు, ఆత్మీయత, బాడీ లాంగ్వేజ్ చూస్తుంటే, స్నేహం కంటే ప్రేమే ఎక్కువగా కనపడుతోంది.''

"నీకు అతని గురించి తెలియదు... మా ఇద్దరికీ, మా రిలేషన్ గురించి మంచి క్లారిటీ ఉంది.''

"ఐ హోప్ సో! మేము కన్విన్స్ కాకపోయినా నష్టం లేదు... మిమ్మల్ని మీరు వంచించుకోకపోతే చాలు,'' అంటూ తన పని అయిపోయినట్లుగా లేచి, ఆలోచనలోకి నెట్టిన స్వేచ్ఛను వదిలేసి, క్యాంటీన్ బయటకు నడచింది సుజాత.

★ ★ ★

సాయంత్రం డాన్స్ ప్రోగ్రాం ముగిసిన తరువాత, స్వేచ్ఛ అపార్ట్‌మెంట్‌కి చేరుకున్నారు ఇద్దరూ. స్వేచ్ఛ ఇద్దరికీ వైన్ ఇచ్చి, ఒక్క అరగంటలో డిన్నర్ సిద్ధం చేస్తానంటూ కిచెన్ లోపలికి వెళ్లింది. సోఫా మీద వదిలేసిన స్వేచ్ఛ ఆఫీస్ ల్యాప్‌టాప్ తీసుకొని కీబోర్డ్ మీద టకటకా టైప్ చెయ్యటం ప్రారంభించాడు తేజ.

"ఔను తేజ... ఈ మధ్య ఏమిటి నాతో ఫ్లర్టింగ్ తగ్గించేసావు... ఐ యాం మిస్సింగ్ మై ఓల్డ్ తేజా...'' అంటూ కిచెన్ నించే ప్రశ్నించింది స్వేచ్ఛ.

"నాకు నిజంగానే అలా చెయ్యాలనిపించట్లేదు... ఎందుకో అనిపించట్లేదో తెలుసుకోవాలంటే కుడా భయమేస్తోంది.''

మాటలలోని తీవ్రతని పసిగట్టినా, ముఖకవళికలని గమనించే అవకాశం లేకపోవటం వల్ల ఒక్కక్షణం గుగుర్పాటు చెందిన గుండెను సంభాలించుకొని, స్వేచ్ఛ, "జోక్ చెయ్యద్దు తేజా... నీ మనసులో ఏముందో చెప్పు...'' అన్నది. తేజ నెమ్మదిగా నడచి వచ్చి, ఆమె చెయ్యి పట్టుకొని, లివింగ్ రూమ్‌లో ఉన్న సోఫా దగ్గరకి తీసుకొచ్చాడు. ఆమె ల్యాప్‌టాప్ తెరచి చూపించాడు. హార్ట్ షేప్‌లో బెలూన్స్ ఎగురుతున్నాయి. "స్వేచ్ఛ.. I love your name... I love your confidence... I love your presence... I love everything about you... కానీ నీకు ఐ లవ్ యూ అని చెప్పటానికి మాత్రం భయపడుతున్నాను. కొన్నిసార్లు కొన్ని భావాలు వ్యక్తపరచటానికి ఒక జీవిత కాలం పడుతుందేమో కదా?''

ఊహించని ఈ సంఘటనతో ఒక్కసారిగా ఆశ్చర్యపడింది స్వేచ్ఛ. ప్రతిస్పందనకి తావివ్వకుండా, స్వేచ్ఛని తన బాహువులలో బంధించాడు తేజ. స్వేచ్ఛ పెదవులపై తన పెదవులతో ముద్ర వేశాడు. మొదట ప్రతిఘటించినా ఆమె పెదవులూ విడిపోయి అతనికి పూర్తి సహకారాన్ని అందించాయి. స్వేచ్ఛ మొబైల్ రింగుతో మళ్లీ మామూలు ప్రపంచంలోకి వచ్చారిద్దరూ. సూర్య నించి కాల్.

సూర్య ఎంతో ఉత్సాహంగా "గుడ్ న్యూస్... నేను అనుకున్నదాని కంటే ముందుగా పని ముగించుకొని వచ్చేస్తున్నాను. రేపే ల్యాండ్ అవుతున్నాను.''

"లేదు, సూర్యా... ఇప్పటికే చాలా ఆలస్యమైపోయింది! రేపు కలుద్దాం,'' అని చెప్పి స్వేచ్ఛ ఫోన్ కట్ చేసింది.

★ ★ ★

స్వేచ్ఛ, సూర్య, తేజ- ముగ్గురూ గుడిలో కలుసుకున్నారు. స్వేచ్ఛ ముందర మాట్లాడటం మొదలెట్టింది.

"మీ ఇద్దరిలో ఎవ్వరినీ నేను తప్పుపట్టటం లేదు. ఇద్దరికీ చేరువై నేనే ఈ పరిస్థితికి బాధ్యురాలిని. మీరు ఒకరి కోసం ఒకరు త్యాగాలు చేసుకోవటం నాకస్సలు ఇష్టం లేదు. అలా అని మీ ఇద్దరిలో నేను ఎవ్వరినీ వదలుకోలేను. దానికి ఒక్కటే మార్గం...''

"ఏమిటది?'' అన్న ప్రశ్నార్థకమైన చూపుతో ఇద్దరూ స్వేచ్ఛ వైపు చూశారు.

"మన మధ్య ఈ 'ప్రేమ' అనే జంజాటాన్ని తీసేస్తే, మన ముగ్గురం మంచి స్నేహితుల్లాగా ఉండిపోవచ్చు.''

"ఫ్యూచర్ సంగతేమిటి?'' అంటూ సూర్య ప్రశ్నిస్తే, "ఇది మరీ తొక్కలో తెలుగు సినిమాలా ఉంది,'' అంటూ తేజ తనదైన శైలిలో స్పందించాడు.

"మనకి జోడైన వాళ్లు మనకు తగలకపోరు. ప్రేమ ఒక్కసారే కలగదు అనటానికి వేరే ఋజువులక్కర్లేదనుకుంటాను?" ఒక రకమైన నిర్లిప్తతతో పలికింది స్వేచ్ఛ.

"తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దు. గుళ్లోకెళ్లి దర్శనం చేసుకొని, వీకెండ్ అంతా ప్రశాంతంగా ఆలోచించుకొని ఒక నిర్ణయాని కొద్దాం," అని ప్రపోజ్ చేసాడు సూర్య.

శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, అలమేలు మంగా సమేతుడై కొలువున్న ఆలయంలో స్వేచ్ఛ ప్రసాదం తీసుకొంటూ, భక్తి శ్రద్ధలతో మ్రొక్కుతున్న సూర్యా, తేజాలను గమనించసాగింది.

★ ★ ★

"ఎవరో ఒకరిని ఎంచుకుంటావనుకుంటే, ఇలా జరిగిం దేంటే?", బాధపడుతూ అడిగింది సుజాత.

"అలా జరగటమే రైట్ అనిపించింది నాకు, నో రిగ్రెట్స్!"

"ఏం జరిగిందో చెప్పవే? నువ్వంటే పడిచచ్చే ఆ ఇద్దరూ అంత హటాత్తుగా నువ్వద్దనుకొని ఎందుకు బ్రేక్ అప్ చేసు కున్నారు?"

"చాలా సింపుల్. ఎక్కడికైనా దూరంగా వెళ్లిపోయి, ఈ సమాజం ఏర్పరిచిన రూల్స్ అన్నీ చెరిపేసుకొని, ముగ్గురం కలి సుండి, మన రూల్స్ మనమే రాసుకుందాం అని ప్రపోజ్ చేశాను!"

"నీకేమైనా మతిపోయిందా?"

"కరెక్ట్, ఇదే ప్రశ్న అడిగారిద్దరూ. సూర్య, నాకేసి ఆ సమయంలో చూసిన ఆ లుక్ నేనెప్పటికీ మర్చిపోలేను. నేను తనను ప్రేమించి, మోసం చేసి, తన ఫ్రెండుతోనే మళ్లీ ప్రేమలో పడటాన్ని కూడా పెద్ద హృదయంతో క్షమించగలిగాడు గానీ, నా ఈ దిగజారుడుతనాన్ని మటుకూ సహించలేననేశాడు."

"మరి, నీ ప్రపోజల్ విని మురిసిపోయి ముద్దెడతాడను కున్నావా?"

"మరీ అంత అమాయకురాలిని కాను. చలాన్ని దేవుడిలా భావించే తేజ అయినా నేను చెప్పింది విని, కొంచెంసేపైనా ఆలోచించి తిరస్కరిస్తాడనుకున్నాను. ఏ మాత్రం సమయం వృధా చెయ్యలేదు. తనకు ఒకేనేగానీ, తన కుటుంబం మాత్రం సామూ హికంగా గంగలో దూకి చచ్చిపోతారని, నేను అనాథని కాబట్టే, నేను ఇలా బరితెగించి ఆలోచిస్తున్నానని అనేశాడు."

"ఆసలు నువ్వు ఏ పరిణామం ఊహించి ఈ ప్రశ్న అడిగావు? తప్పంతా నీలో పెట్టుకొని, నువ్వే వంచింపబడ్డదానిలా మాట్లాడుతున్నావే?"

"నువ్వే చెప్పావు, ప్రేమ ఎంత బలమైనదో. ఆ ఇద్దరితో ప్రేమలో పడి నేను తప్పు చేసానని అనుకోవటం లేదు. నేనిలాంటి ప్రపోజల్ పెడితే ఇద్దరూ నన్ను వదిలేస్తారని తెలిసే అడిగాను. కానీ ఏ మూలనో ఒక్క రవ్వంత ఆశ ఉండింది. తేజ, నేను ఎంత మానసికక్షోభ అనుభవించిన తరువాత ఈ మాట అడిగుంటానో అని ఆలోచించి, సూర్య తిరస్కరించిన తరువాతైనా నన్ను దగ్గరకి తీసుకుంటాడేమోనని. అతడూ అందరిలాంటి మగాడే అనిపించు కున్నాడు."

"మన సమాజం ఇంత లోతుగా నీ మానసికస్థితిని విశ్లేషించి నిన్ను అర్థం చేసుకుంటుందనుకోవటం నీ మూర్ఖత్వం. అందుకు మగాళ్ల నెందుకు తిడతావు? ఏ ఆడదీ కూడా నీ పట్ల సాను భూతిని చూపించదు. ఇంతకూ ఇప్పుడు ఏమి చేద్దామనుకుంటు న్నావు?"

"ఎవ్వరి ప్రేమకూ నోచుకోకుండా పెరిగిన నేను, జీవితంలో నిజంగా నేను ఎవ్వరినీ ప్రేమించలేనేమో అన్న భయంతో పెరిగాను. అలాంటిది ఇద్దరితో ప్రేమలో పడ్డాను. ప్రేమించగలను అని నేర్చు కున్నాను. నాకిక భయం లేదు. సమాజం గురించి కూడా ఎంతో విలువైన పాఠం నేర్చుకున్నాను. దానికి ఎదురీత నేను చెయ్యను. నాకవసరం లేదు. ఆ అమాయకపు స్వేచ్ఛను కనికరం లేకుండా గొంతు నొక్కి చంపేస్తాను. అందరూ అమోదించగల స్వేచ్ఛగానే మారి ఎవరితోనైనా సెటిల్ అయ్యి, బుద్ధిగా నా జీవితం గడిపే స్తాను," అంటూ ఇక చెప్పడానికి ఏమీ లేదనట్లుగా, అలసిపోయి అస్తమిస్తున్న సూర్యుణ్ణి కళ్లార్పకుండా చూస్తూ, తన చెంపలపై ధారాళంగా ప్రవహిస్తున్న కన్నీరుని తుడుచుకొనే ప్రయత్నం కూడా చెయ్యకుండా కూర్చోండిపోయింది స్వేచ్ఛ.

వీరి అసలు పేరు సోమయాజుల శివకుమార్. వీరి మొదటి కథ పగడమల్లెలు. అర డజను కథలు రాశారు. నివాసం పాలో ఆల్టో, కాలిఫోర్నియా.

email: syaji0@gmail.com

సముద్ర స్నానం

విన్నకోట రవిశంకర్

ఎటు చూసినా తెల్లదనం
తెల్లటి ఎండ
తెలతెల్లని ఇసుక
యుద్ధవిమానాల లాఘవంతో
క్రమబద్ధంగా ఎగిరే
సముద్రపక్షుల మెడల కింద దాగిన
చురుకైన తెల్ల కాంతి శకలాలు

దారుఢ్యం, ఆరోగ్యం నిండి
ఆనందంతో తడిసిన తెల్ల శరీరాలు
మిలమిల మెరిసే భుజాలు
రంగు రంగుల త్రిభుజాలు

తన భూమిపుత్రుల్ని ఆహ్వానిస్తూ
ముందుకు వచ్చిన సముద్రం
చిరునవ్వుల తెల్ల తోరణం కడుతుంది
బలిసిన ఒక కెరటం కొండచిలువలా
తనవైపు వచ్చిన వాళ్లని ఆటగా మింగి
మళ్లీ వదిలి పెడుతుంది

యుగయుగాలుగా ఎన్ని బాల్యాల్ని చూసిందో
అయినా అలుపురాని వృద్ధ సముద్రం
దరి చేరిన చిన్న పిల్లలతో
సరదాగా ఆడుకుంటుంది
తెల్లంచు జరీచీర కట్టిన నిత్య యౌవని సముద్రం
తన కౌగిలి నందుకోమని సాహసుల్ని సవాలు చేస్తుంది

జానెడంత ఎత్తు లేడు వీడు...
బుడిబుడి అడుగులతో నేలని
బుల్లి బకెట్టుతో సముద్రాన్ని
కొలవటానికి తయారయాడు
తదేక దృష్టితో రెండుసార్లు ముంచి
తల మీద పోసుకున్నాడు
సకల మానవ కోటికీ దానితో
సముద్ర స్నానమయింది

విన్నకోట రవిశంకర్ అమలాపురంలో పుట్టి, కాకినాడ, వరంగల్‌లలో చదివి సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్‌గా అమెరికాలో స్థిరపడ్డారు. పుస్తకాలు చదవడం, కవితలు, వ్యాసాలు రాయటం వ్యాపకాలు. కుండీలో మర్రిచెట్టు, వేసవివాన కవితాసంకలనాలు ప్రశంసలు పొందాయి. భార్య శ్రీకళ, పాప హిమబిందులతో కొలంబియా సౌత్ కెరొలినాలో నివాసం.

బొమ్మ

ఎం.ఎస్.కె. కృష్ణజ్యోతి

'హలా లాల హు ల ల హు లాల నచ్చానా...' రాజేష్‌గాడి ఫోన్‌లోంచి తమన్నా పిలిచింది. మోషేకి తమన్నా అంటే ఇష్టం. అందుకే 'నచ్చావూ' అంటూ ఒక్క దూకు దూకాడు కాలవ అవతలికి. కాలవంటే అలాంటి ఇలాంటి కాలవ కాదు. పాలెంలో పారే స్వచ్ఛమైన ఆరడుగుల మురిక్కాలవ. పాస్టరుగారు చెప్తుంటే విన్నాడు, అప్పుడెప్పుడో మోషే పేరుతోనే ఒకడుండే వాడంట. అతనికి సముద్రం చీలిపోయి దారి ఇచ్చిందంట. తనకి మాత్రం ఇంత చిన్న కాలవ కూడా దారి ఇవ్వట్లేదు. కాలవ అవతలకి రోజూ దూకి పోవలసివస్తోంది. నిజానికి అరుగు దగ్గిరికి పోవాలంటే కాలవ దూకే పోనక్కర్లేదు. కాస్త అవతల పక్క వున్న చిన్న కట్ట మీద నడిచి కూడా పోవచ్చు. కానీ కాలవ అవతల తమన్నా వుందని తెలిస్తే తను ప్రభాస్ అయిపోతాడు. కాబట్టి రూలు ప్రకారం దూకే వెళ్లాలి. అందుకే దూకేస్తాడు. మడమకి కొద్దిగా బురద అంటుకుంది. తమన్నా కోసం ఆ కొంచం బురదని లెక్కచెయ్యడు. లెక్కచేస్తే తమన్నాని చూడ్డం కుదరదు.

మోషేకి ఇప్పుడిప్పుడే మీసం మొలస్తుంది. మెత్తని మొహం బరకైపోతుంది. కీచుగా వుండే గొంతు బొంగురై పోయింది. సాయం కాలానికి గోలీలాట కాడకి పోడం మీద ఇష్టం తగ్గింది. లుంగీ కట్టి సెంటరు దగ్గర అరుగుమీద

మొగ పిల్లకాయలు యవ్వారాలు మాట్టాడతంటే ఆళ్లతో కలవాలని చూస్తన్నాడు. ముఖ్యంగా జానెడు పొడుగున్న ఫోనుతో, పాలెం మొత్తానికే హీరోలాగా పోజుకొట్టే రాజేషు సావాసం కోసం తహ తహలాడిపోతన్నాడు.

"చూబిచ్చరా ఒక్కసారి," మోషే బతిమిలాడాడు.

"చార్జింగ్ అయిపోద్ది," రాజేషు నిర్లక్ష్యంగా చెప్పి ఫోను జేబులో పెట్టేయ్యబోయాడు.

"ఇప్పుడే చూసి ఇచ్చేస్తా. ఒక్కసారికి అయిపోదులేరా," మోషే గోజారాడు.

రాజేష్ ఫోన్లో ఎన్ని బొమ్మలు వుంటాయో! అందర్లోకి తనకి తమన్నానే నచ్చుద్ది! భలే డ్రెస్సులు వేస్తది. తెల్లగా వుంటది. బైట ఇంకా చాలా తెల్లగా వుంటదంట. తెలుపు మరీ ఎక్కువైపోయి ఆ పిల్లకి నల్ల మేకప్ వేస్తారంట. చాలామంది హీరోయిన్ల బొమ్మలు. కొన్ని వందల బొమ్మలు. బొమ్మలకోసం, పాటలకోసం రోజూ రాజేషుని బతిమిలాడతాడు. రాజేష్‌గాడు అలా చూబెట్టి ఇలా లాగేసుకుంటాడు. మోషే ఇంట్లో కూడా ఓ ఫోనుంది. అది దాని చుట్టూ వున్న రబ్బరు బాండ్ వల్ల ఒక ఫోనుగా కనబడతది. ఆ బాండ్ తీసేస్తే రెండు ప్లాస్టిక్ ముక్కలుగా విడిపోద్ది. తన దగ్గిరా రాజేశుకిలాగా పెద్ద ఫోనుంటే బాగుండు. ఇవాళా రేపూ మోషేకి ఇదే ఆశ. కానీ ఎలా? రాజేషుగాడు ఆరు నెల్లు చెన్నైలో కక్కుస్ దొడ్ల దగ్గిర గబ్బు చాకిరీ చేసి సంపాయించిన డబ్బులతో కొన్నాడా ఫోను.

'నా గ్గూడా చెన్నైలో మావో, చిన్నాయనో ఉండుంటే నేను కూడా చెన్నైలో కక్కుస్ దొడ్ల పన్లో చేరి జేబునిండా చిల్లర డబ్బులు పోగేసేవాన్ని,' కక్కుస్ దొడ్ల కాడ జనాలు చిల్లర డబ్బులు కాకుండా నోట్లు ఇచ్చి పోతన్నట్టు ఊహిచ్చుకున్నాడు.

'చేతిలో ఫోను పట్టుకుని బులుగు జీన్స్, ఎర్రచొక్కా తొడుక్కుని బూట్లేసుకుని పాలెంలో నడిస్తే? అప్పుడే అనుకోకుండా తమన్నా కారేసుకుని పాలెం వేపు వస్తే!' వేరే లోకంలోకి జారిపోయాడు.

"ఆహా, అలా కాదు. తను చెన్నై వెళ్లాలి. పెద్ద రోడ్డు మీద నడస్తా పోతంటే తమన్నా కార్లో వెళతా తనని చూసి కారు ఆపి తన స్టయిల్ని మెచ్చుకుని కారెక్కిచ్చుకోవాలి,' తనలో తనే గొణుక్కుంటా చిన్నగా నవ్వుకున్నాడు.

'ఎలాగైనా డబ్బులు సంపాయించాలి. ఎమ్మిటే ఫోన్ కొనాలి. రాజేషు ఫోను లాంటిది కొనాలి. షాపులో కొత్త ఫోను కాపోయినా పర్లేదు. తిప్ప కాడ దొంగ ఫోన్లు కుప్పలు తెప్పలు దొరుకుతాయి. తన ఈడు వుండే కొంతమంది పిలకాయలు సిటీల్లో కొట్టుకొచ్చి, వొచ్చిన రేటుకి దొంగ వస్తువులు అమ్మేస్తారు. పెట్టుబడి లేని యాపారం. తను కూడా తిప్పలో పుట్టుంటే బాగుండేది. పోనీ చెన్నైలో కాకపోయినా తిప్పలో చుట్టాలు ఉండుంటే బాగుండేది. రాజేశుగాడు అక్కడే తెచ్చాడు. గట్టిగా రెండు వేలు పట్టుకెలితే కోరిన ఫోను తెచ్చుకోవచ్చు. రానూ పోనూ చార్జీలికి ఇంకో యాభై కావాలి,' ఎడతెరిపి లేని ఆలోచన.

ఇంటికెళ్లి బట్టల గూట్లో ఎనక మూల ఎతికాడు. మొన్ననే డెబ్భై రూపాయలు పెట్టాడు. ఇప్పుడు చూస్తే ఇరవై వున్నాయి. గుమ్మం బైటికి చూశాడు. మట్టి దోవ మీదే ఐదారుగురు ఆడోళ్లు గుండ్రంగా కూచుని బారా అష్టా ఆడతన్నారు. మోషే తల్లి రత్తమ్మ కూడా ఆడ్నే వుంది. పాలెంలో కూలి పనులు లేని రోజుల్లో కొంతమంది ఆడోళ్లు ఇళ్లల్లో పాచిపనికి చేరితే కొంత మంది ఆడోళ్లు తెల్లారి పనులు పూర్తికాగానే పాలెం సందులో రోడ్డు వారగా బారా అష్ట ఆటలో మునిగుంటారు. కూలిపనుల్లో సంపాయించిన డబ్బులు అటూ ఇటూ మారతాయి. ఆటకి ఇరవై రూపాయలు. డబ్బులు ఎటుపోయాయో మోషేకి తెలిసిపోయింది.

"అమా, ఇక్కడ డబ్బులు పెట్టాను ఎయ్యే?" కేకేశాడు.

"ఏమో. నాకు తెలవదు. ఎలక ఎత్తుకు పొయ్యుంటది."

ఇంకిప్పుడు అరిచి గీ పెట్టినా లాబం లేదు. చిన్నగా రత్తమ్మ పక్కన చేరాడు. ఆట మజ్జలో వుంది కాబట్టి డబ్బుల కోసం గొడవ చెయ్యడం దండగ. రత్తమ్మ పట్టిచ్చుకోదు. ఆటయ్యాక నాలుగు డబ్బులు లాబంగాన వొస్తే అప్పుడు పోయిన వాటికన్నా పెచ్చు పెరుక్కోవొచ్చు.

ఆటలో మునిగి పోయిన ఆడోళ్లు పరాచికాలు ఆడతా, నవ్వతా, కంగారుపడతా, మజ్జ మజ్జ ఏదాంతం మాట్టాడతా వున్నారు. కాసేపు కూచున్నాక మోషేకిసుగు పుట్టింది. గుడ్డి చుక్కమ్మ గుడిసె దగ్గిరికి వెళ్లాడు.

నిన్న మొన్నటిదాకా గుడ్డి చుక్కమ్మ దగ్గర ఎప్పుడు కావాలంటే అప్పుడు వుజ్జోగం దొరికేది. వుజ్జోగం అంటే, చుక్కమ్మ అడుక్కోడానికి వెళితే మోషే ఆమెకి తోడుగా చెయ్యి పట్టుకుని వీధులు తిప్పేవాడు. పిర్రల కాడ బద్దలైపోయిన నిక్కరు, మాసిపోయిన చొక్కా, ఎండిపోయిన డొక్కతో మోషే; లోపలిపోయిన బుగ్గలు, ముడతలు పడిన తోలు, చింపిరి జుట్టుతో చుక్కమ్మ.

అయ్యా, బాబూ అని మోషే జనాల్ని పీడిచ్చేవోడు. చుక్కమ్మ గుడ్డిదాన్ని దరమం చెయ్యండని అరస్తా వుండేది. దానం చెయ్యాలని లేకపోయినా, ఈ అవతారాలని వదిలించుకోవాలని జనాలు ఎంతోకంత చిల్లర పడేసి తప్పుకు పోయేవాళ్లు. సాయంకాలానికి మోషేకి ముప్పై రూపాయలు ఇస్తది. రెండు మూడురోజులకి ఆటితో నేల ఆటకి సినిమాలకి పోయి, ఆట మజ్జలో తమ్సప్ తాగుతాడు.

చాలారోజులుగా చుక్కమ్మ మోషేని పిలవడం లేదు. ఇప్పుడు ఆడు కొంచం పెద్దోడు అయ్యేప్పటికి ఆడిని చూసి ఎవరూ చిల్లర వెయ్యడం లేదు. బిజ్నెస్ డౌన్ అయిపోతందని చుక్కమ్మ మోషేని మానిపించి పాలెంలోనే వేరే బొట్టికాయగాడికి పాట్నర్‌షిప్ ఇచ్చింది.

"అవ్వా, ఇవాళ నీ కూడా నన్ను తీసకపోవా."

మోషే ఎంతైనా చుక్కమ్మకి పాత పాట్నర్. ఒకమాదిరి అదిగా, చాలా చాలా ఇదిగా అడిగేప్పటికి చుక్కమ్మ కాదనలేక పోయింది. బిజ్నెస్ అయిపోయిన తరవాత పాలెం వీధి మలుపు తిరిగే ముందరే రోడ్డు పక్కన సుజాత కాడ చుక్కమ్మని వొదిలి పోవాలి. అక్కడ సుజాత సయిగ్గా కల్లు కేనులు తెచ్చి రెండు బొంత రాళ్లమీద పెట్టుకుని కూచుంటది. తలనిండా నూనె పెట్టి, జుట్టు రేగకుండా పిన్నులు పెట్టి, నుడుటని పెద్ద బొట్టు పెట్టి గుళ్లో పోలేరమ్మ వున్నట్టుంటది సుజాత. కల్లు తాగడానికి వచ్చినోళ్లు వాళ్లెందుకొచ్చారో ఆ పని మటుకూ చూసుకు పోతారు. సామాన్యంగా కళ్లు ఎత్తి వేరేలాగా ఆమెని చూడరు. చూస్తే రక్తం కక్కుకుని సచ్చిపోతామేమో అన్నట్టు బయం బయంగా ఉంటారు. ఎందుకో ఎపవిడూ లేనిది ఇవాళ మోషే సుజాత వొంక చూశాడు. తమన్నా అంత తెల్లంగా కాపోయినా బానే వుందనిపిచ్చింది. కానీ, జుట్టు విరబోసి లిప్‌టిక్ రాసి ఫోటో తీసినా సుజాత సినిమా యాక్టర్ లాగైతే ఉండనే వుండదనుకున్నాడు!

"ఏందిరోయ్, ఆమనే చూస్తన్నావు? కల్లు తాగతావా ఏందీ?" సుజాత ఉరిమింది. మోషే బిత్తరపోయాడు. ఒద్దన్నట్టు తలాడిచ్చాడు. సుజాత దగ్గరికి ఆడోళ్లు కూడా కల్లు తాగను వస్తారు. నలుగురు పోగు అయ్యి కల్లుచుక్క గొంతు దిగంగానే చుక్కమ్మ మీటింగు మొదులుపెట్టుద్ది. డబ్బులు బాగా వొచ్చిన రోజు మీటింగులో,

"యియ్యాళ వూరిలో దరమం పొంగి పొరిలి పోయిన్దిమే. ఇంకా పోయ్. దరమ దేవతని కొంగున చిల్లరగా కట్టేసుకుని, ఈ దరమతల్లి కాడ కల్లు తాగొచ్చాను," అంటది

డబ్బులు పెద్దగా రాలని రోజు సుజాత కాడ అరువుకి కళ్లు పోబిచ్చుకుని,

"దేవుడు గుడ్డిదాన్ని చేశాడు, వొయసు ముసిలిదాన్ని చేసింది. అందుకే రూపాయి చిల్లరెయ్యడానికి ఊర్లో ఏ దొంగ నాబట్టకీ చేతులే రాలా. దరమం తప్పిపోయింది. పాపం పెరిగి పోతా వుంది. చూస్తా వుండు, బూమి బద్దలైపోద్ది," అని అడల్తా వుంటది!

ఇవాళ మోషే అసిస్టెంట్‌గా వెళ్లినా కూడా, కల్లుకి డబ్బులు చాలనంతగా ఊరు ధర్మం తప్పలేదు. అందుకే చుక్కమ్మ ఉషారుగా వుంది. మోషేకి ముప్పైకి తోడు ఇంకో పది ఇచ్చింది. ఇంకా డబ్బులు పోగేయ్యాలి. ఎంత పోగేయ్యాలి అంటే అతను చప్పున చెప్పలేడు. మరి బడికి సరిగా వెళ్లి నాలుగు లెక్కలు నేర్చింది లేదాయే. ఎలిమెంట్రీ బళ్లో నించి పేరు హైస్కూలులో పడింది కానీ పొట్టలో అక్షరం ముక్క పడలేదు. ఎప్పుడేనా ఇంటి దగ్గర ఆడుకోడానికి ఎవరూ దొరక్కపోతే బడికెళ్లేవాడు. వెళ్లిన రోజు తెలుగు టీచరూ, ఇంగ్లీషు టీచరూ నాలుగు తిట్లు తిట్టి, రెండు తన్ని, తన దగ్గర లేని ఒక్కగానొక్క నోటు పుస్తకం కోసం అదే పనిగా సతాయిస్తా వుండేప్పటికి విసుగు పుట్టి మొత్తానికి బడి ముగిచ్చాడు.

ఇంటికొచ్చేప్పటికి పొయ్యిమీద చాపలు పులుసు. మసి గుడ్డతో మూత తీసి చూశాడు. అటిక నిండుగా పులుసు కళ్లకి ఇంపుగా ఉడుకుతా వుంది. మోషే నాన్న శీనయ్య పెద్ద చేపలు తెచ్చినట్టున్నాడు. వారం ముందు సిటీకి కూలికి వెళ్లాడు. నాలుగు డబ్బులు కళ్లపడ్డట్టు వున్నాయి. అలాంటప్పుడు ఇంట్లో అందరికీ తిన్నంత చేపల కూర, శీనయ్యకి తాగినంత నాటుసారా. పాలెంలో ఇలా బోలెడు ఇళ్లల్లో జరుగుద్ది. మర్నాడు మెతుక్కు లేక చచ్చిపోయే పరిస్థితి వస్తదన్నా సంపాయించిన కూలి డబ్బులు రెండో రోజు కోసం దాపెట్టే 'దురాచారం' అక్కడ మొదట్నించీ లేదు!

రత్తమ్మ, మొగుడు చాపలు తెచ్చినందుకు కుశాలైంది. పైగా ఇవాళ బారా అష్టలో ఓ వంద రూపాయలు కళ్ల చూసింది. వంట అయ్యాక శుభ్రంగా స్నానం చేసి మెత్తటి చీర కట్టింది. పక్కింట్లో సన్నజాజి తీగె నుంచి మొగ్గలు కోసి జానెడు దండ కట్టింది. మొహానికి పోడరు పూసుకుంది. నాలుగు డబ్బులు కళ్లబడ్డ ఏరోజైన రత్తమ్మ ఇలాగే రెడీ అవ్వుద్ది!

కంచాలు కడిగి చేపల పులుసు ముక్కలు అందరికీ తలా ఒకటి వేసి అన్నాలు వడ్డించింది. మొగుడికీ మాత్రం రెండు ముక్కలు ఎక్కువేసింది. తను కూడా గిన్నెలో అంత వేడన్నమేసుకుంది.

"ఏందీమే? ఇవాళ బొమ్మలా తయారయ్యావు?" పెళ్లాం వొంక కళ్లెగరేసి చూస్తా అడిగాడు. శీనయ్య అప్పటికే కొద్దిగా తాగి వున్నాడు. రత్తమ్మ మారు పలకలేదు. శీనయ్య తింటన్నంత సేపూ ఏదో ఒకటి మోటుగా మాట్టాడతానే వున్నాడు. మోషే కన్నా చిన్న పిల్లలు ఇద్దరూ చేపలో ముళ్లు ఏరుకుంటా, కండ తింటా ఉషారుగా వున్నారు. మోషే మాత్రం తలొంచుకుని తింటానే శీనయ్య మాటలు వింటన్నాడు. కాసేపాగి చిన్నగా తలెత్తి తల్లి మొహం వంక చూశాడు. అమ్మ, నాన్నని కళ్లతో అదిలిస్తుంది. అయినా నాన్న పట్టిచ్చుకోడంలేదు.

అన్నం తింటం అయిపోవచ్చేప్పటికి చినమామ వచ్చాడు. రత్తమ్మ తమ్ముడికి డబ్బాలో చేపముక్కలు, పులుసేసి ఇచ్చింది. పిల్లల్ని అందర్నీ మామతో కూడా అమ్మమ్మ ఇంటికి పొమ్మంది. అమ్మమ్మది కాలనీ ఇల్లు. ఓ గది, బైట పంచ. అమ్మమ్మ పిల్లల కోసం పంచలో చాపలు పరిచింది. చిన్నోళ్లు పదినిమిషాల్లో నిద్ర పోయారు. మోషే మామ పక్కన చేరాడు. మామ దగ్గర రాజేషు ఫోను కన్నా పెద్ద ఫోనుంది. మరి మామ మోషే కన్నానే కాదు, రాజేశుకన్నా కూడా ఒకటి రెండేళ్లు పెద్దోడే.

"మామా, తమన్నా ఉందా నీ ఫోనులో?" మోషే బోర్లా పడుకొని కాళ్లాడిస్తా మామని అడిగాడు.

"తమన్నా ఎందుకురా?" మామ కొత్త సిన్మా పాటలు వెతకతన్నాడు

"నేను తమన్నా ఫాన్స్. చూస్తానికి. తమన్నా పాటలు పెట్టు మావా."

"తమన్నా ఎందుకు? ఇంకా చాలామంది కొత్త హీరోయిన్లు వచ్చారు కదా. కొత్తయి చూడు."

"తమన్నాని పెట్టు మావా. తమన్నా తెల్లగా బాగుంటది."

మామ మోషే వంక తేరిపారా చూశాడు. తెల్లపిల్ల కావాలా? అని అడిగి చిన్నగా నవ్వాడు. పాటలు ఆపేశాడు. బొమ్మలు పెట్టాడు. ఆ బొమ్మల్లో ఒకటి కూడా తమన్నా బొమ్మ కాదు. అవి తమన్నా కన్నా తెల్లగా వున్న అమ్మాయిల బొమ్మలు. రకరకాల బొమ్మలు. అవ్వన్నీ తనకి తెల్సిన సినిమాబొమ్మలు కాదు. వేరే ఏవో 'బొమ్మలు'! వాటిని చూసి మోషే తెల్లబోయాడు. మొహం మీద దుప్పటి కప్పేసుకున్నాడు. కానీ మళ్లీ నిదానంగా దుప్పటి తీశాడు. చూడాలంటే భయమేస్తుంది, కానీ మళ్లీ చూడాలనిపిస్తుంది. రాత్రి మోషేకి సరిగా నిద్ర పట్టలేదు. కాసేపు కలత నిద్రలో కూడా ఏవేవో కలలొచ్చాయి. కలల్నిండా ఆ అమ్మాయిలూ చుట్టూతా చేరినట్టూ, తమన్నా వొచ్చి కావలిచ్చుకుని ముద్దు పెట్టినట్టూ, ఇంకా...! తెల్లారి లేచేప్పటికి కళ్లు ఎర్రగా చింతనిప్పుల్లా మండతా వున్నాయి. తెల్లారి ఇంటికి పోయేప్పుడు అమ్మమ్మ ముగ్గురికీ నాష్టా కొనుక్కొమ్మని ముప్పై రూపాయలు ఇచ్చింది. అమ్మమ్మ డబ్బులిచ్చినట్టు తమ్ముళ్లు చూళ్లేదు. మోషే ఆనందంగా డబ్బులు జేబులో వేసేసుకున్నాడు.

ఇంటికి వొచ్చేప్పటికి శీనయ్య గుర్రుపెట్టి నిద్రపోతానే వున్నాడు. రత్తమ్మ నీళ్లకి వెళ్లింది. పాలెంలో ఒక మంచినీళ్ల పంపు వుందిగానీ జనాలు ఎక్కువ. అందుకే రత్తమ్మ నీళ్ల కోసం దూరం వెళ్లుద్ది. చిన్న పిల్లలిద్దరూ రత్తమ్మ కోసం రోడ్డు మీద వెతుక్కుంటా ఎదురెళ్లారు. మోషే జేబులో యాభై గూట్లో బట్టల కింద పెట్టబోతూ ఆగాడు. అక్కడ పెడితే నిమిషంలో అమ్మ మాయం చేసేస్తది. ఏవైనా, ఎంతైనా జేబులోనే దాచుకోవాలి. చిల్లులేవైనా వున్నాయేమో అని జేబులు తడిమాడు. లేవు. తృప్తిగా నిట్టూర్చాడు. ఇంతలోకి గూట్లో హఠాత్తుగా నాన్న చొక్కా కనబడింది. రాత్రేసుకున్న చొక్కా అది. చుట్టి గూట్లోకి విసిరేసినట్టుగా వుంది. జేబు మాత్రం పైకి కనబడుతుంది. వాటిల్లోంచి పచ్చగా రూపాయలు బైటికి తొంగి చూస్తున్నాయి. వారం సంపాదనలో జల్సా చేసిన సొమ్ము పోగా మిగిలినవి. చప్పున అందులోంచి కొంత డబ్బులు తీసి తన నిక్కరుజేబులోకి తోశాడు. గబాగబా బైటికి వచ్చేశాడు.

"నాన జేబులో డబ్బులు తగ్గాయంటన్నాడు. నువ్వేవైనా చూసావురా?" తర్వాత రత్తమ్మకి కొడుకు మీద అనుమానం వొచ్చి గట్టిగా గదిమింది.

"నాకేం తెల్సు? ఏడ పారేసుకున్నాడో. లేక ఏ ఎలక ఎత్తక పోయిందో," మోషే ఆదర్లేదు, బెదర్లేదు.

సాయంకాలం చీకటి పడతందనంగా రాజేషు రోజుట్లాగే గట్టు మీద కూచుని కనబడ్డాడు. ఒక్కడే కూచుని ఏదో ఆలోచిస్తన్నాడు. మోషే ఎప్పట్లాగే బురద గుంట మీంచి దూకాడు. ఈసారి బురద కొంచం కూడా కాలికి అంటకుండా దూకగలిగితే తను ఫోను తప్పకుండా కొంటాడు అనుకున్నాడు మనసులో. నిజంగానే ఎప్పుడూ దూకిన దానికన్నా అడుగు దూరం దూకగలిగాడు! గట్టు మీద రాజేషు పక్కనే కూలబడి తన దగ్గరున్న డబ్బులన్నీ తీసి లెక్కెట్టాడు. ఎనిమిది వందల తొంభై రూపాయలు. మొత్తం రాజేషు వైపుకు తోశాడు.

"ఈ డబ్బులికి నీ ఫోనంతది కాపోయిన రొంత చిన్నదైనా దొరుకదా తిప్పలో?" దొరుకుద్ది అనే మాట కోసం ఆత్రంగా చూశాడు. ఆ ఒక్కమాట వినబడితే ఎమ్మిటే తిప్ప ఆటో ఎక్కేయ్యడానికి రెడీగా ఉన్నాడు. రాజేషు డబ్బులొంక, మోషే వొంకా చూశాడు. డబ్బులు తీసుకుని అతను కూడా లెక్కట్టాడు. తన ఫోను తీసి మోషే చేతిలో పెట్టాడు. మోషేకి ఏం అర్థంకాలేదు.

"చెన్నై పోతన్నా. చార్జీలికి డబ్బులు కావాలి. ఫోనులో ఉత్త బొమ్మలు కాదు, ఈసారి నిజం బొమ్మలే చూసొస్తా. నా ఫోను తీసేస్కో" రాజేషు మాటలకి సంతోషంతో మోషేకి నోటమాట రాలేదు. చప్పున ఫోను తీసుకున్నాడు. ప్రేమగా దాన్ని తడిమాడు. రాజేషు వొంక కృతజ్ఞతగా చూశాడు. ఊహించని ఈ చొక బేరానికి తబ్బిబ్బయ్యాడు. ఎమ్మిటే మామ దగ్గిరికి వెళ్లాలి. మామ ఫోనులో బొమ్మలు ఇందులోకి ఎక్కిచ్చాలి. గిరుక్కున వెనక్కి తిరిగి ఎప్పట్లాగే కాలవ మీంచి దూకాడు.

కానీ అదేంటో మాయ, ఏం తట్టుకుందో మసక సాయం కాలపు వెలుగులో అర్థంకాలేదు గానీ పాపం, మోషే మురిగ్గుంటలో అడ్డంగా పడిపోయాడు.

ఇటీవలే కథలు రాయటం ప్రారంభించిన ఎం.ఎస్.కె. కృష్ణజ్యోతి అనతి కాలంలోనే 20 కథల దాకా రాశారు. నివాసం కావలి, నెల్లూరు జిల్లా.

mskkrishnajyothi@gmail.com

ఊరిగాలి

నందిని సిధారెడ్డి

తలపిస్తున్న
వేలిగోరు తీసి అక్కడ నాటుతాను
శరీర గ్రీష్మ భారమంతా
అది మోస్తది
రాత్రి ఎనిమిది దాటినా
ఎండ కాస్తున్న ఫ్రిస్కో
నా నివ్వేర

నేలమీద దిద్దినట్టు పచ్చిక
చీకటిని మోసుకొస్తూ
సన్నని సొరకాంతులు పూస్తున్న
నిశ్శబ్ద వీధుల్లో
మన మాటలే

అడుగులు ఆగినప్పుడు
నిన్నూ నన్నూ వదలి
జ్ఞాపకాలు నడిచిపోతాయి
ఇక్కడైనా మనమాటలే
ఊరిగాలి
ఖండాలు దాటి
పరిమళిస్తుంటది
చెక్క ఇండ్ల మధ్య అయినా
హృదయాలు భద్రంగానే వున్నయి
డాలర్ల నడుమ అయినా
ఆత్మలు అలిసిపోకుండా మెరుస్తున్నయి

మరమనుషులనుకుంటాం
పొడి మాటలనుకుంటాం గానీ
ఎక్కడైనా
మనిషిని చూడగానే
మనిషి తడిసిపోతాడు
దీర్ఘకాల మౌనసమాధి నుంచి
తనను లోతుగా తవ్వుకుంటాడు
మాట వినగానే
ప్రాణం లేచి వచ్చినట్టు
మనిషి కొత్త చిగురుతో
కళకళలాడుతుంటాడు
డల్లాస్ ఉల్లాసం
డబిల్‌పుర గడబిడ
ఏదైనా మనిషే

పల్లెతనాన్ని తనలో నింపుకున్న కవి. అదే తన కవిత్వంగా ముప్పై సంవత్సరాలుగా ఆరు సంపుటాలుగా విస్తరించింది. రెండు వ్యాస సంపుటాలు, పాటలు, కథల పుస్తకం ప్రచురించారు. వివిధ సామాజిక ఉద్యమాల్లో క్రియాశీలంగా పనిచేశారు. ఇటీవలే సమగ్ర కవితాసంపుటి ప్రచురించారు. నివాసం హైదరాబాద్. 'నాగేటి చాల్లల్ల నా తెలంగాణ పాటకి నంది పురస్కారం లభించింది. ఇటీవలే కొత్తగా ఏర్పడిన తెలంగాణ సాహిత్య అకాడెమికి అధ్యక్షులుగా నియమితులయ్యారు.
email: nandinisr56@gmail.com

తారుమారు తకరారు

కొండకొండు కె. శివకుమార శర్మ

శివయ్యకి చేరిన వార్త ఇంకెవరి చెవినయినా పడుంటే వాళ్లు వెంటనే, "గుడిని మింగిన దొంగలెవరు?" అన్న హెడ్‌లైన్‌లన్నీ టీవీలో బ్రేకింగ్ న్యూస్‌లో తాటికాయంత అక్షరాలతో ఊహించుకునేవాళ్లు. ('గుడిలో దేవుణ్ణి మింగిన దొంగ లెవరు?' అన్న హెడ్‌లైన్‌లో ఒక పదం ఎక్స్‌ట్రా పడదూ, మరి?) శివయ్య అలాకాదు- వార్తకి ప్రాధాన్యతనిచ్చే మనిషి. అందుకని అతను ఇంకా క్లుప్తంగా, 'తిరుపతి వెంకన్న మాయం,' అని రిపోర్టిచ్చాడు.

"నీకేమయినా మతిపోయిందా?" హుంకరించాడు అతని ఎడిటర్ హైదరాబాదునించీ.

"పరిస్థితి అల్లకల్లోలంగా వున్నదిక్కడ," అంటూ శివయ్య సెల్‌ఫోన్‌లో ఫోటోలని తీసి పంపాడు. ఐ ఫోన్‌లో ఫేస్‌టైమ్ ఫీచర్ని ఉపయోగిస్తూ వీడియోలని కూడా పంపాడు. తిరుపతి గుడి ముందర జనం అవాక్కై నిలబడిపోయారని అనడానికి లేకుండా అడ్డు ఆపు లేకుండా మాట్లాడుతూనే వున్నారు. శివయ్య చేతిలో పెద్ద వీడియో కెమేరా వుండుంటే అందరూ అందులోకి మాట్లాడ్డానికి పోటీపడేవాళ్లుగానీ, అతని దగ్గర వున్నది ఉత్త మొబైలే అవడంతో, అతన్ని ఎవరూ పట్టించుకోవడంలేదు.

గుడి బయట నిలబడ్డవాళ్లు ఎవరో పెద్ద కుట్రపన్నుతున్నారన్నారు. 'సర్వదర్శనం' క్యూలో అప్పటికే ఇరవై నాలుగ్గంటలకి పైగా వేచి వున్నవాళ్లూ, ఎన్నో ఏళ్లనించీ వున్న మొక్కులని తీర్చుకోవడానికి అప్పటిదాకా అవకాశం చిక్కనివాళ్లూ దాన్ని ఎవరో పుట్టించిన పుకారుగా భావించి లైన్లో తమ పొజిషన్ని వదిలి వెళ్లడానికి ఒప్పుకోవడంలేదు.

మీడియా ముందుకి పోలీసు మందీమార్బలంతో వచ్చిన ఈవోకి నోటమాట పెగల్లేదు. ఆయన కళ్లమ్మట నీళ్లు ధారగా కారిపోతున్నాయి. ఆయన పక్కన నిలబడ్డ ఆలయ ప్రధాన పూజారి జానకీరామాచార్యులుగారు నిలువెల్లా వణికిపోతున్నారు. ఆ వణుకుని ఆపడానికన్నట్టుగా రెండు చేతివేళ్లనీ పెనవేసి, ముందుకు పెట్టిన చేతులని, వాటికి తగిలించబోయే బేడీలు గుర్తొచ్చాయో ఏమో, వెంటనే విడదీసి, చేతులని కిందకు వేళ్లాడేశారు.

ఈవో చేత్తో మైకు పట్టుకుని పెదాలని కదిలించాడుగానీ, ఆయన గొంతులోంచి మాటలు పెగలకపోవడంవల్లనో లేక ఆయన ఏమన్నాగానీ అక్కడ తాండవమాడుతున్న గందరగోళం వల్లనో ఆయన ఏమన్నాడో ఎవరికీ వినిపించలేదు. మొత్తానికి ధైర్యాన్ని సమకూర్చుకొని ఆయన మైకుమీద రెండుసార్లు చేత్తో తడితే అయిన శబ్దానికి జనాల సవ్వడి కొద్దిగా సద్దుమణిగింది.

"నేనేం... పాపం... చేశానో... ఏ... ఈవో... కలలోకూడా ... ఊహించలేదు," అని ఆగాడు.

"మీ సంగతట్లా వుంచండి. గుళ్లో దేవుడున్నాడా, లేడా?" టెన్షన్ని తట్టుకోలేని ఒక విలేఖరి పెద్దగా అరిచాడు.

"గుళ్లో దేవుడున్నాడు, ఎక్కడికీ పోలేదని తప్పించుకుంటారేమో, గర్భగుళ్లో వెంకన్న విగ్రహం వున్నదా, లేదా?" శివయ్య ప్రశ్నించాడు. వార్త ముందుగా చేరినవాళ్లలో అతనొకడు గనుక ముందుగా అక్కడికి జేరి స్టేజీకి దగ్గరగా చోటు దొరికించుకున్నాడు. అక్కడికి చేరిన టీవీ కెమేరాలు శివయ్య మొహాన్ని క్లియర్‌గా చూపకపోయినా అతని ప్రశ్నని స్పష్టంగా రికార్డ్ చేసేసరికి ఆ రోజంతా ఆ ప్రశ్నని ప్రతీ ఛానెల్లో ఎన్ని వేలసార్లు రిపీట్ చేశారో అతని కుటుంబసభ్యులు లెక్కించలేకపోయారు. అతను మీడియా స్టార్ అయిపోయాడు. 'అంతా వెంకన్న దయ,' అన్నాడతను జీవితాంతమూను. అతను ఆ వార్తని విన్నప్పుడు ఎక్కడ ఎలా వున్నదీ అన్ని టీవీ ఇంటర్వ్యూల్లోనూ వివరిస్తూనే వున్నాడు. 'వెంకన్న మాయమయినప్పుడు మీరు ఎప్పుడు ఎక్కడ ఎలా వున్నారో, ఏం చేస్తున్నారో మాకు ఫోన్‌చేసి చెప్పండి,' అని టీవీ చానెల్స్ ప్రకటించేసరికి ఫోన్ లైన్లన్నీ బిజీ అయిపోయి ఎవరికీ అత్యవసర పరిస్థితుల్లో గూడా లైన్లు కలవకుండా వుండేలా పరిస్థితి తయారయ్యింది. తరువాత వాళ్లు ఎస్సెమ్మెసులని పంపితే చాలని ప్రకటించారు.

శివయ్య వేసిన ప్రశ్నని తట్టుకోలేకపోయాడో, లేక యాభయ్యేళ్లపాటు తిన్న నేతి, తీపి పదార్థాల చలువవల్లనో టిటిడి ఈవో మీడియా ముందర ఇంకొక్క మాటకూడా మాట్లాడకుండా కూలిపోయాడు.

"ఏం నటన! జవాబు చెప్పకుండా తప్పించుకుందామని చూస్తున్నారు!!" అని అరిచాడో విలేఖరి. అక్కడున్న ఆలయ కార్యకర్తలు, అధికారులందరికీ ముచ్చెమటలు పోశాయి.

ఆ తరువాత, "మామీదే లాఠీఛార్జీ చేస్తారా?" అని ఆగ్రహించారు విలేఖర్లు. "హార్ట్ ఎటాక్లు వచ్చినవాళ్లని ఆసుపత్రికి తరలించనీకుండా అడ్డుపడుతుంటే ప్రాణాలని కాపాడ్డంకోసం అంతకంటే మార్గం కనిపించలేదు," అన్నారు పోలీసులు ఆ తరువాత కోర్టులో, ఓ పదేళ్ల తరువాత కేసు హియరింగుకి వచ్చినప్పుడు.

గుళ్లో తాము చూస్తుండగానే విగ్రహం అదృశ్యం అయిందని చెప్పినవాళ్లు టిటిడి సంస్థకి చెందనివాళ్లు కొందరున్నారుగానీ, వాళ్లా సమయంలో నిజంగా అక్కడున్నారో లేదో నిర్ధారించలేక వాళ్ల మాటల నెవరూ పట్టించుకోలేదు. దానికి, విగ్రహం అదృశ్యమవగానే అక్కడవున్న భక్తులనందరినీ బయటకు తరిమేసి గర్భగుడి తలుపులని మూసేసి ఆ చుట్టుపక్కలకి ఎవరినీ రాకుండా చెయ్యడం ఒక కారణం. కొంతమంది పూజార్లూ, ఆలయ అధికారులూ గుళ్లోకి వెళ్లి తలుపులేసుకోవడం- విగ్రహం మాయమయ్యిందంటే నమ్మని ప్రజలేం చేస్తారోననే భయంవల్ల ఇంకొక కారణం. పరిస్థితి అదుపులోకివచ్చి, సీనియర్ ప్రభుత్వ అధికారుల, రక్షణ బలగాల, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి సమక్షంలో ఆ తలుపులు తీయించడానికి దాదాపు ఆరుగంటలు పట్టింది. తలుపులు తెరిచినప్పుడు వీడియో కవరేజీ వుండాలన్నది మీడియా. 'గర్భగుళ్లో వీడియో ఒప్పుకోం,' అన్నారు అధికారులు. 'అక్కడ విగ్రహం వున్నప్పటి సంగతి అది,' అని వాదించింది మీడియా. 'తలుపు తీసేసరికి విగ్రహం కనిపిస్తే అది ఆగమశాస్త్రాల ఉల్లంఘన అవుతుంది?' అన్నారు జవాబుని రెడీగా పెట్టుకున్న అధికారులు.

వీడియోలూ, కెమేరాలూ లేకుండా గుడితలుపులు తీసిన తరువాత, ఆవేదనతో కూడిన గోవింద నామసంకీర్తనతో అక్కడ వెంకన్న విగ్రహం లేదని నిర్ధారణ చేసేసరికి తిరుపతిలో స్థిర నివాస మేర్పరచుకొన్న ఉద్యోగులూ, హోటళ్లవాళ్లూ, కాటేజీలు నడిపేవాళ్లూ, పూలూ, పళ్లూ, సావనీర్లూ అమ్మేవాళ్లూ- రెండుమాటల్లో చెప్పాలంటే తిరుపతి ప్రజలంతా- 'మా గతేం కావా'లని గుండెలు బాదుకున్నారు. వీడియో ఫుటేజ్ ద్వారా గుడిగోపురం చెక్కుచెదరకుండా వున్నదని నిర్ధారణ అయిన తరువాత ఏదో సొరంగం ద్వారా ఆ విగ్రహాన్ని తరలించి వుంటారన్న నిర్ణయానికి ప్రజలంతా వచ్చారని టీవీ చానెళ్లు నిర్వహించిన ఒపీనియన్ పోల్లో తేలింది. వీలయినంతవరకూ ఆలయానికీ, ఆలయప్రాంగణానికీ ఎక్కువ హాని జరక్కుండా, తప్పనిసరి పరిస్థితుల్లో, తప్పకాలని పరిమితంగా మాత్రమే ఆలయం చుట్టుపక్కల జరిగేలా చేస్తూ ఇన్వెస్టిగేషన్ చెయ్యడానికి అమెరికాలోని పేరున్న కంపెనీలని పిలవడానికి ప్రభుత్వం నిర్ణయించుకొంది.

★ ★ ★

దేవుడున్నాడనేకన్నా లేడని నిర్ధారించుకోవడమే తేలిక అన్న నిర్ణయానికి వెళ్లే దారిలో పరమేశ్వరశాస్త్రిగారు ఆఖరుమెట్టు మీదున్నారు. అవడానికి అమరావతిలో, అమరేశ్వరాలయంలో ప్రధాన

అర్చకుడే! పట్టుబట్టి కొడుకు జ్యోతిర్లింగశాస్త్రినికూడా వైదిక మార్గంలో నడిపించినవాడే! కానీ, మనవళ్ల విషయంలోమాత్రం, 'ఇంగ్లీషు చదువు మాత్రమే'ననే కొడుకు మాటలకి అడ్డుచెప్పలేక పోతున్నారు. కూతురి పెళ్లికి చేసిన అప్పులు తీరకుండానే భార్యకి వైద్యఖర్చులు! గుంటూరు పెద్దాసుపత్రికి తీసుకెడితే, ఎన్నారై హాస్పిటల్‌కి తీసుకెళ్లమన్నారు. అంత డబ్బు ఆయనవద్ద లేదు. ఆలయానికివచ్చే భక్తులా, సంవత్సరానికొకసారి వచ్చే మహాశివ రాత్రికి పోటెత్తుతారుగానీ, మిగతా సమయాల్లో ఉన్న వూరు జనం తప్ప ఆ దేవుడి మొహం చూడ్డానికి పెద్దగా ఎవరూ రారు. గుళ్లన్నీ దేవాదాయ, ధర్మాదాయ శాఖకి చెందడంతో ఏదో కొంత జీతం ప్రభుత్వం నుంచే వస్తుందిగానీ అది పెద్దగా చెప్పుకోదగిందేమీ కాదు. ప్రతిరోజూ కొన్ని పూజలూ, అభిషేకాలూ ఒక నిర్ణీత సమయానికి జరిపేటప్పుడు స్పెషల్ దర్శనం టిక్కెట్లని అమ్మే ప్రభుత్వ ఉద్యోగి ఆ టిక్కెట్లని అమ్మడానికి గైరుహాజరయితే అప్పుడు ఆ డబ్బుని పంచుకొనే అవకాశం పూజార్లకి దొరుకుతుంది, అంతే.

గుడికి వారానికొకసారయినా వచ్చే నారాయణ అంటే ఆయనకి అభిమానం. 'శీఘ్రమేవ కల్యాణ ప్రాప్తిరస్తు,' అని ముందుగా దీవించి, 'నీ సోదరుడిలాగా నీకూ మంచిరోజు వస్తుంది ఆ పరమేశ్వరుని దయవల్ల,' అని శాస్త్రిగారంటూంటారు అతనితో. కవలల్లో ఒకళ్లకి ఉపాధి దొరకడం, ఇంకొకళ్లు ఏమీలేక వీధులం బడి తిరగడం ఆయనకి కొద్దిగా ఆశ్చర్యకరమయిన విషయమే. 'ఆ శివయ్య అనుగ్రహంతో ఈ బండి ఓడ అవకపోదు సార్!' అంటూంటాడు నారాయణ. అతను కూడా శాస్త్రిగారి భార్య ఆరోగ్యం గూర్చి వాకబు చేస్తూనే వుంటాడు. మామూలురోజుల్లో గుడికి అతనొచ్చేవేళకి పెద్దగా భక్తులెవరూ వుండరు.

ఆరోజూ అలాంటి మామూలురోజే- శాస్త్రిగారు నారాయణకి తీర్థమిస్తున్నప్పుడు అతను పుచ్చుకుంటూ కళ్లెత్తి జూసి, "ఏడు కొండలవాడా, వెంకటరమణా, గోవిందా, గోవిందా!" అనేప్పటి ముందు క్షణం దాకా. ఆ నామసంకీర్తన విన్న మరుక్షణం, ఇతని కేమిటి ఇవాళ కొద్దిగా పిచ్చిపట్టినట్లుంది అనుకుంటూ ఆయన ముందుకి చూస్తే, నారాయణేగాక అక్కడున్న ఇంకో ఇద్దరు ముగ్గురు అపరిచితులు కూడా సంభ్రమాశ్చర్యాలతో గుళ్లో విగ్రహాన్ని చూస్తూ నిలబడడం కనిపించింది. శాస్త్రిగారు వెనక్కి తిరిగిచూసి, 'హర హరా!' అంటూ మూర్ఛపోయారు.

★ ★ ★

"మీరు శివలింగం మాయమై ఆ స్థానంలో వెంకన్న విగ్రహం ప్రత్యక్షమవడాన్ని చూశామంటారు!" అడిగారు టీవీ యాంకర్లు అదేపనిగా. "అవునండీ," అన్నాడు నారాయణ ఆ దృశ్యాన్ని పదేపదే గుర్తుచేసుకొంటూ.

"అప్పటికి మీకు తిరుపతిలో వెంకన్న విగ్రహం మాయమయిందన్న సంగతి తెలియదా?" నమ్మశక్యం కాలేదెవరికీ.

"మా సోదరుడు చెప్పేవాడేమో తెలియదుగానీ, వాడు తిరుపతి వార్తని వాడి ఎడిటర్‌కీ, టీవీ ఛానెళ్లకీ తెలియజెయ్యడంలో బిజీగా వున్నాడుగదా! పైగా, మాయమయిన ఆరుగంటల తరువాత ఆ విషయాన్ని ప్రభుత్వం ధృవీకరించేవరకూ అక్కడేం



జరుగుతోందన్నది ఊహాగానంగానే మిగిలిపోయిందిగదా!'' అన్నాడు నారాయణ. ఇప్పుడతను, 'దేవుని లీలని ప్రత్యక్షంగా చూసినవాడు'గా అందరి నోళ్లల్లో నానుతున్నాడు.

★ ★ ★

అమరేశ్వరాలయంలో వెంకన్న విగ్రహం చేరడాన్ని నారాయణ చూసినప్పటి తరువాతి సంఘటనలన్నీ చకచకా జరిగిపోయాయి. ముందస్తుగా అమరావతిలోవున్న జనాభా అంతా ఆలయానికి వెళ్లి రోజంతా క్యూలో మళ్లీ మళ్లీ నిలబడి వెంకన్న దర్శనం చేసుకున్నారు. సెల్‌ఫోన్లని ఉపయోగించి చుట్టపక్కాల కందరికీ ఆ వార్తని చేరవేశారు.

''మామూలుగా అయితే ఇక్కడ పూలకీ, పూలమాలలకీ అంత గిరాకీ వుండదు. శివుడికి కావలసినవి ఒక్క బిల్వదళాలే గదా! ఇక్కడ వెంకన్న కోసం పూలకి షార్టేజీ వచ్చింది,'' అన్నాడు నారాయణ ఇంటర్వ్యూలల్లో.

'తిరుపతిలో వెంకన్న విగ్రహం మాయం,' అన్నంత వేగంగా, 'అమరావతిలో వెంకన్న వెలిశాడు,' అన్న వార్త పాకకపోవడానికి కారణం, 'దేవుడున్నాడని ప్రజలు సాధారణంగా పూర్తిగా నమ్మకపోవడమే,'నన్నాడు నారాయణ. ''తిరుపతిలోవున్నంత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అమరావతిలో లేదుగదండీ, పీఏ సిస్టం కూడా అంతంత మాత్రమేనాయె. ఇంక వీడియో కవరేజ్ అంటారా- ఎన్నిమార్లు మీరు అమరావతి నుండి ప్రత్యక్షప్రసారాలని చూశారో ఒకసారి గుర్తుచేసుకోండి,'' అన్నాడు శివయ్య. ఎంతయినా విలేఖరి గాబట్టి కొద్దిగా లాజిక్కుని ఉపయోగించాడు. ముందుగా శివయ్య టీవీ ఛానెళ్లలోకెక్కినా తరువాత వచ్చిన నారాయణని చూసిన వాళ్లు, ''ఇదేమిటి, ఇతణ్ణి తిరుపతినుంచీ వచ్చే కవరేజీలో చూశాం గదా, ఇప్పుడు అమరావతి నుండీ కనిపిస్తున్నాడేంటి?'' అని కొందరు ఆశ్చర్యపోతే, ''వెంకన్న తనతోబాటు ఇతణ్ణిగూడా తీసుకెళ్లాడా?'' అన్నారు కొందరు కొంటెగాళ్లు.

''మా తాతగారి పేరు శివన్నారాయణ. అబ్బాయి పుడితే ఆయన పేరు పెడదామనుకొన్నార్ట మా నాన్నగారు. కవలలం పుట్టేసరికి ఆయన్ని మాకు ఇలా పంచారు,'' అన్నారు శివయ్య, నారాయణ కలిసి ఒకే ఛానెల్లో ఇంటర్వ్యూ ఇస్తున్నప్పుడు. ఇద్దరూ ఒకే పోలికతో వుండడం శివయ్యకి అచ్చొచ్చింది. లేకపోతే, అతణ్ణి పట్టించుకునేవాళ్లెవరూ వుండేవారు కారు. దేవుని లీల చూసిన వాడితో పోలిస్తే దాన్ని విన్నవాడికి ఎంత సోదరుడయినాగానీ ఏ మాత్రం విలువనివ్వగలరు ప్రజలు?

''అమరావతిలో వెంకన్న వెలిశాడనే వార్త ఇంగువలాగా గుప్పుమన్నదిగానీ, తిరుపతిలో వెంకన్న స్థానంలో అమరేశ్వరుడు వెలిసిన వార్తని మనిషికి కప్పపిల్ల పుట్టినట్టుగా మొదట దాచివుంచీ, తరువాత అదేమంత విశేషంగా కాకుండా నీరసంగా తెలియ పరచిన టిటిడి అధికారుల ప్రవర్తన శోచనీయం! వాళ్ల నీరసంలో అక్కడ పాతాళానికి పడబోతున్న రాబడి స్పష్టంగా దర్శన మిచ్చింది!!'' అన్నాడు శివయ్య.

అమరావతిలోనూ, తిరుపతిలోనూ కూడా పెద్ద సమస్య ఎదురైంది- ఎక్కడి పూజ ఎలా జరపాలా అని. పరమేశ్వరశాస్త్రిగారికి ఊహ తెలిసినప్పటినించీ చేస్తున్న శివుడి పూజలు శివుడికే చెయ్యాలని వుందిగానీ, అలాగని ఆ జంగమదేవర వెంట వెళ్లాలని మాత్రం అనిపించలేదు లేదు- అదిగూడా బూడిద బంగారంగా మారబోతున్న సూచనలు ప్రస్ఫుటంగా కనిపిస్తుండగా! పైగా, అది ఆ శివుని కటాక్షం వల్లనే ఇలా జరిగిందనుకొని ఆయన తృప్తిపడ్డారుకూడా!

''మా వెంకన్నకి ఏ క్షణాన ఏ పూజ జరపాలో తెలిసినవాళ్లం, వాటిని మేము చెయ్యాల్సిందే,''నని పట్టుబట్టారు టిటిడి పూజార్లు జానకీరామాచార్యులవారి ఆధ్వర్యాన. చేతికందివచ్చిన సిరిని కాలదన్నరాదన్న నిశ్చయానికొచ్చిన అమరేశ్వరుని గుడి పూజారులు మాత్రం, 'అవేవో మేమే చేస్తా'మన్నారు. ''మీకు క్రవుడ్ కంట్రోల్ తెలియదు. దానికి కావలసిన ఆర్గనైజేషన్ మాకుంది. మేం మా సిబ్బందితో దిగుతా,'' మన్నారు టిటిడి కార్యకర్తలు. ''రెండ్రోజులు చేసేసరికి అదే అలవాటవుతుంది. అయినా మీరూ దాన్ని అంచెలవారీగా నేర్చుకున్నదేగదా!''నని తీసిపారేశారు అమరావతి అధికార్లు.

టిటిడి అధికార్లూ, పూజారులూ కలిసి కోర్టులో కేసువేశారు- అమరావతిలోవున్నాగానీ వెంకన్నకి పూజలు మునుపటివలెనే టిటిడి పూజారులే చెయ్యాలంటూ; అధికారులేమో, తమ పొజిషన్లు గుడి నిర్దేశించినవికాక ప్రభుత్వ ఆధీనంలోవుండడంవల్ల అమరావతిలోని వెంకన్న కార్యకలాపాలకి తామే బాధ్యులమనీను! అమరేశ్వరాలయపు అధికారులు దానికేమీ తీసిపోకుండా వెంకన్న ఇప్పుడు తమ గుడిలో వున్నందున టిటిడి సొమ్ముని వెంకన్న సేవలకే వినియోగించేలా ఉత్తర్వులనిమ్మని కోర్టుకు విన్నవించారు. అంతటితో ఆగకుండా, గుడి ప్రాంగణాన్నంతటినీ గుళ్లో వుంటున్న వెంకన్నకి తగినట్లుగా మార్చాలని నిర్ణయించారు. అయితే, ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ వాళ్లు దాన్ని అడ్డుకుని, ఎన్నో వందల సంవత్సరాల చరిత్రవున్న ఆ ఆలయాన్ని మార్చరాదని ఉత్తర్వులని ఇవ్వాలని కోర్టుని కోరారు.

కోర్టులో ఇంకొన్ని కేసులు కూడా నమోదయ్యాయి. వాటిలో చెప్పుకోదగ్గవి, విభూతిరేఖలు నుదుటన పెట్టుకొని వెంకన్న సేవలు చేస్తున్నామంటూ ఆగమశాస్త్రాలని ఉల్లంఘిస్తున్నారని, ఈ అపచారాన్ని తక్షణమే ఆపివెయ్యాలని కొందరు స్వామీజీలు వేసిన దొకటి. శివుడి విగ్రహం తిరుపతిలో తేలడం వెంకన్నకి జరుగుతున్న సేవలమీద శివుడికి కన్నుకుట్టడంవల్ల- అందుకని, కోర్టు కలిపించుకుని శివుణ్ణీ, వెంకన్ననీ యథాస్థానాలకి పంపించాలని కొందరు కొంటెగాళ్లు వేసినది ఇంకొకటి.

దేవాదాయ, ధర్మాదాయ శాఖవారు మాత్రం గుండెలమీది భారం తొలగిపోయిందని హాయిగా నిద్రపోయారు- మొత్తమ్మీద వెంకన్న రాబడి ఇంకా ఆంధ్రప్రదేశ్‌కే పరిమితమయినందుకు. ఈ వెంకన్నే ఏ పరాయిరాష్ట్రానికో వెళ్లుంటే ఎంత నష్టమొచ్చేది!

ఏ వీడియో కవరేజీ లేకపోయినాగానీ, కళ్లారా చూసిన భక్తులూ, మీడియా ప్రతినిధులూ, రాజకీయ నాయకులూ అందరూ అమరావతిలో వున్నది వెంకన్ననని నిర్ధారించిన తరువాత ఇటు గుంటూరునించీ, అటు మంగళగిరినించీ ప్రజలు వెల్లువలాగా అమరావతి మీద దిగేసరికి ఆ రెండువైపుల నుండీ అమరావతి వెళ్లే దారులు ఆయా ఊళ్ల నుండే స్తంభించిపోయాయి. ఆగకుండా దూసుకు వెళ్లినవి మాత్రం రియల్ ఎస్టేట్ ధరలూ, లావాదేవీలూను. అవి అమరావతికి మాత్రమే పరిమితం గాకుండా చుట్టుపక్కల 40 కిలోమీటర్ల దూరంలో వున్న ప్రాంతాలకి కూడా సునామీలాగా విస్తరించాయి. ఇలా కొన్ని వారాలు గడిచేసరికి వెంకన్నమాయ ఒకటి రెండురోజులు మాత్రమే వుంటుందేమో, వేచిచూద్దాం అని ఊరుకున్న ప్రభుత్వానికి ఇక బరిలోకి దిగక తప్పలేదు. అమరావతికి చేరే మార్గాలని ఆరులేన్లున్న టోల్ రోడ్డుగా విస్తరించాలన్న హెచ్.ఎన్. ఎస్. అన్న ప్రైవేట్ రంగ సంస్థ ప్రతిపాదనకి యుద్ధ ప్రాతిపదికన తలాడించింది. ఆ దారికి రెండువైపులా ఎన్నో దశాబ్దాలుగా కాపలా కాస్తున్న చింతచెట్లని ఆ బాధ్యతనించేగాక వాటినే సంపూర్ణంగా తొలగించింది.

టిటిడి అధికార్లూ, పూజార్లూ వేసిన కేసు కోర్టు పరిశీలనకి వచ్చేసరికి రెండేళ్లు పట్టింది. అప్పటికి టిటిడి పూజార్లు వెంకన్న వెంటే మేముంటామంటూ అమరావతిలోని పూజార్లకి అసిస్టెంట్లు గా చేరిపోయారు. భక్తుల సంఖ్యలోమాత్రం, తిరుపతిలోని అమరేశ్వరుడికి అమరావతిలోని పూర్వవైభవమే వచ్చింది. అందుకని టిటిడి అధికార్లు తిరుపతికి రావడానికి భక్తులని ప్రోత్సహించడాన్ని ఉద్యోగవిధిగా నిర్దేశించి ప్రతి ఊరి బస్‌స్టాపుల్లోనూ, రైల్వేస్టేషన్ల లోనూ ఆఫీసులనిపెట్టి, ఉద్యోగులకి ఉపాధులని కల్పించారు. అయితే, అలివేలుమంగనీ, బీబీనాంచారమ్మనీ కొలవడానికి ముందు జనమూ, ఆ తరువాత ఆ వెంకన్నా రాకపోతారా అన్న ఆశ వారికింకా వుంది.

శివయ్య, వెంకన్నల పొజీషన్లు తారుమారయిన రెండేళ్లయిన తరువాత కోర్టు పరిస్థితిని సమీక్షించి, అమరావతిలోని వెంకన్నకి, ప్రజలు మెచ్చేలా మునుపటి పూజలే జరుగుతున్నాయి కాబట్టి తాము వేరే నిర్ణయమివ్వక్కర్లేదని తేల్చిచెప్పింది. గుడి ఆర్కిటెక్చర్‌కి ఎటువంటి మార్పులూ, చేర్పులూ చెయ్యకూడదన్న ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ వాళ్ల వాదనతో ఏకీభవించింది. అందువల్ల అమరావతి గుడిప్రాంగణంలో అడుగుపెట్టినవాళ్లకి అది ఇంకా శివాలయం లాగానే కనిపిస్తుంది. నుదుటిమీద అడ్డంగా విభూతిరేఖలను పెట్టుకున్న వాళ్లు వెంకన్న సేవలు చెయ్యరాదన్న స్వామీజీల వాదనని కోర్టు త్రోసిపుచ్చింది. శివుణ్ణీ, వెంకన్ననీ యథాస్థానాలకి పంపించాలని కేసు వేసిన కొంటెగాళ్లకి, మొదటి మార్పిడిలో తమకి ప్రమేయం లేనందువల్ల ఇందులో తాము కల్పించుకోలేమని చెప్పింది. పైగా, అమరావతిలో వుంటున్నాగానీ ఆ వెంకన్నవైపే పరుగెత్తుతున్నారు తప్ప, తిరుపతిలో వుంటున్నాగానీ ఆ అమరేశ్వరుని దగ్గరకి ఇదివరకటిలాగానే ఏ కొద్దిమందో తప్ప వెళ్లడం లేదుగదా అని జవాబిచ్చింది. ఇప్పుడు వెంకన్న అమరావతిలో వున్నాడు గనుక టిటిడి వనరులని అక్కడ వినియోగించాలన్న అమరేశ్వరాలయపు అధికార్లకి, ఆ వనరులు టిటిడి పేరుమీద వున్నయిగానీ వెంకన్న పేరుమీద లేవుగనుక అది కుదరదని జవాబిచ్చింది.

ప్రతీ టీవీ ఛానెల్లోనూ, 'ఇవాళ ఏ గుళ్లో విగ్రహాలు ఆ గుళ్లోనే వున్నాయి,' అంటూ ప్రభాత వార్తలని ప్రసారం చెయ్యడం రివాజుగా మారింది. దానికి జతగా, నారాయణకి అదే, శివయ్య సోదరునికి ఒక పీఠాన్నేర్పరచి, దానికి జతగా అతనికి గుడి కూడా కట్టించే ప్రతిపాదనకి ప్రపంచం నలుమూలలనుండీ ఎంత విశేష స్పందన వస్తోందో, ఆ రోజుదాకా చేరిన డబ్బెంతో కూడా చెప్పడం చేరింది. పొద్దున్నే టీవీ ఛానెళ్లల్లో విగ్రహాల ఉనికిని తెలియ జేస్తున్నదీ, ఆ పీఠ నిర్మాణాన్ని దగ్గరుండి పర్యవేక్షిస్తున్నదీ మరెవరో కాదు, అతని సహోదరుడు శివయ్యే!

పరమేశ్వరశాస్త్రిగారి కిప్పుడు భార్య ఆరోగ్యం గూర్చిగానీ, మనవడి చదువు గూర్చిగానీ చింతించడానికి తీరికేలేదు. ఆయన భార్య ఆరోగ్యం సంగతి ఎన్నారై హాస్పిటల్ వాళ్లు ఇంటికొచ్చల్లా చూసుకుంటున్నారు, వచ్చినప్పుడల్లా అవలీలగా ఆ వెంకన్న దర్శనం చేసుకుని తిరిగివెడుతున్నారు. జ్యోతిర్లింగశాస్త్రి, కొడుక్కి వేదాగమశాస్త్రాలని బోధించడానికి తీరికలేక అవుట్ సోర్సింగ్‌కి ఇచ్చాడు.

'అంగట్లో అన్నీవున్నాయ్, అల్లుడి నోట్లో,' అన్న సామెత నిజమో, కాదో తేల్చుకునేందుకు నారాయణకి అవకాశమే దొరకలేదు. ముందసలు అల్లుడవడానికి అవకాశమేదీ? దేవుని లీల చూసిన తరువాత అతణ్ణి దేవుడంతటివాడిగా గుడికట్టి, కొలుద్దామనుకునేవాళ్లు నారాయణ పెళ్లిచేసుకుని సంసార లంపటలో పడుతుంటే అడ్డుపడకుండా చూస్తూ ఎలా ఊరు కుంటారు?

★ ★ ★

"ఏమిటి స్వామీ, ఈ అల్లరి?" అని ప్రశ్నించాడు బ్రహ్మ మానసపుత్రుడు తన తాతగారిని.

"కుబేరుని అప్పు తీర్చడంకోసం," అని జవాబిచ్చాడాయన.

"కలికాలంలో- ముఖ్యంగా గత యాభయ్యేళ్లుగా తిరుపతిని దర్శించే భక్తుల సంఖ్యా, వాళ్లు చదివించే ముడుపుల విలువా

గూడా అధికమవుతున్నాయిగదా స్వామీ? అప్పుని ఇంకా త్వరగా తీర్చేద్దామనుకుంటున్నారా?'' అన్నాడా పట్టువదలని త్రిలోక సంచారి.

''మొన్నీమధ్య కుబేరునితో ఈ అప్పు గూర్చి చర్చించాను. అది తీరడానికి నెలనెలా భక్తులు సమర్పిస్తున్న ద్రవ్యం వడ్డీని తీర్చడానికిగూడా సరిపోవట్లేదుట!''

''అదెలా స్వామీ?''

''నాకూ మొదట అంతుపట్టలేదు. అప్పుడేదో పెళ్లి హడావుడిలో, అప్పు పత్రాలమీద ఏం రాసివున్నదో సరిగ్గా చదవ కుండానే సంతకం పెట్టినందుకు ఇప్పుడనుభవిస్తున్నాను. ఆ వడ్డీని నేను సామాన్యవడ్డీ అనుకున్నా. కాదుట! కుబేరుడు ఆ పత్రాలు చూపిస్తేగానీ నమ్మలా. వాటిమీద అది చక్రవడ్డీ అని రాసున్నది!!''

''శివ శివా!'' అని ముందు చెవులు మూసుకుని ఆ తరువాత వెంటనే నోరునొక్కుకున్నాడు నారదుడు.

''కుబేరుడు ఆ వార్త నా చెవిన వెయ్యగానే నా నోట్లోంచి వచ్చిన మాటలుకూడా అవే! ఇంక జాగుచేస్తే లాభంలేదని అర్థమైన తరువాత ఈ ఇక్కట్టునించీ బయటపడడానికి మార్గం స్ఫురించింది. అది, ఇప్పటికన్నా అధికంగా రాబడిని పెంచాలంటే ఆ చెల్లించే జనాభా సంఖ్యని అమితంగా పెంచడం! అలా చెయ్యడం, చోటు మార్పిడివల్లనే సాధ్యమయింది. ఇప్పుడు చూడు. అంతకు ముందు తిరుపతివైపు అడుగుకూడా వెయ్యనివాళ్లు పరుగులమీద అమరావతికి ఎలా వెడుతున్నారో!''

''మరి, వేరే ఏదో కొండని వెదుక్కోకుండా పాపం, ఆ పరమశివుణ్ణి స్థానభ్రంశం చెయ్యడమెందుకని?''

''జనాభా ఎవరూ లేనిచోటికి మారితే, ముందర నన్ను అక్కడ కనుక్కోవడానికి సమయం పడుతుంది. పైగా, నన్నక్కడ ఎవరయినా చూసినా, రాతివిగ్రహమేనని కొట్టిపారేసి, అసలు పట్టించుకోకపోయే అవకాశముంది. అంతా నిర్ధారణ అయి, భక్తులకి కావలసిన వసతులని సమకూర్చి, వాళ్లు ఇప్పటిలాంటి సంఖ్యలో వచ్చేలా చేసేసరికి పుణ్యకాలం కాస్తా మించిపోతుంది. ఎందుకంటే, ఈ జాప్యం జరుగుతున్న సమయంలో నేను కట్టవలసిన వడ్డీ సెలవు తీసుకోదుగదా!''

''అర్థమయింది స్వామీ! కానీ, ఒక సందేహం మిగిలిపోయింది. అదే, ఆ శివుణ్ణి స్థానభ్రంశం చెయ్యడంగూర్చి-''

''శివుని గుళ్లల్లో కూడా పెద్ద గుడినేకదా ఎన్నుకున్నాను? భక్తుల తాకిడిని తట్టుకోవడానికి గుడి ప్రాంగణం చుట్టూ ఏర్పాట్లు కొత్తగా కావలసివస్తయ్ గానీ, గుడి ప్రాంగణంలో మార్పులేమీ అవసరంలేదు. గుడిగోపురానికి బంగారు తాపడం ఒక్కటే కొద్దిగా సమకూర్చవలసింది. దాన్ని నా భక్తులు అతి త్వరలోనే నెరవేరుస్తారన్న నమ్మకం నాకుంది. పైగా, నేనక్కడున్నంతకాలం అది శివుని గుడిలాగానే వుంచేలాగా ఏర్పాటుచేశాగదా!''

''అంటే...'' అని ఆగి నారదుడు చిరునవ్వు నవ్వాడు.

''మరే! నా రాకవల్ల, ఇప్పటి అమరేశ్వరాలయంలాగా తరువాత, కళాకాంతులని కోల్పోతున్న ద్రాక్షారామంలోని భీమేశ్వరాలయం, శ్రీకాళహస్తిలోని కాళహస్తీశ్వరుని ఆలయం, అరుణాచలంలోని అరుణాచలేశ్వరుని ఆలయం- అంతకుముందరి వైభవాలని మించిపోయేలా హంగులని సంతరించుకుంటాయి.''

''మరి, మీరు మళ్లీ తిరుపతిలో అడుగుపెట్టరా స్వామీ?''

''ఎంత మాటన్నావ్ నారదా! ఆ అలమేలుమంగనీ, బీబీ నాంచారినీ వదిలి నేను మాత్రం ఎన్నాళ్లుండగలను? పైగా, ఆ ఆలయ ప్రాంగణం తన వైభవాన్ని పోగొట్టుకోవడానికి వాళ్లెలా ఒప్పుకుంటారనుకున్నావ్?''

''స్వామీ, నాదో చిన్న సందేహం. పూరీలోని జగన్నాథుని ఆలయమో, శ్రీరంగంలోని ఆ రంగనాథుని ఆలయమో, మీ మాటల్లో చోటుచేసుకోలేదేమిటి?''

''నా సోదరిని కలిసి, ఆమెతో ముచ్చటించి చాలాకాలమైంది మనవడా. అందుకు!'' అన్నాడు ఆ రమాపతి.

''కనకాంగి! రమాపతి సోదరీ! కరుణించవే కాత్యాయనీ!!

నన్ను గన్న తల్లి! నా భాగ్యమా! నారాయణీ! ధర్మాంబికే!!''

నారదుడు ఆనందంగా త్యాగరాజ కీర్తనని అందుకున్నాడు.

(ఆస్తికులకుగానీ, నాస్తికులకుగానీ: వెంకన్నా, అమరేశ్వరుడూ, నారదుడూ మాత్రం నా కల్పనలు కావు. -రచయిత)

పుట్టింది, చదివింది గుంటూర్‌లో. ఐఐటి మద్రాస్‌లో బి.టెక్ చేశాక రట్జెర్స్ యూనివర్సిటీ, న్యూజెర్సీలో మాస్టర్స్, పిహెచ్.డి. చేశారు. భార్య మల్లిక, పిల్లలు విరించి, మహతిలతో ఇరవయ్యేళ్లుగా వాషింగ్టన్ డి.సి. దగ్గర్లో ఉంటున్నారు. ముప్ఫైకి పైగా కథలు రాశారు. కొన్ని కథలు బహుమతులు అందుకొన్నాయి. నటించడం, కర్ణాటక సంగీతం పాడడం అభిరుచులు.

email: tksksarma@gmail.com

వర్షం

రవి వీరెల్లి

గొప్పెడు గోర్వెచ్చటి ప్రేమను గటగటా తాగు
నీటిచిదుపల చెంపల్ని వాయించే
చిలిపి స్లిప్పర్స్ తొడుక్కో
పొద్దున్న ఆకాశం విచ్చుకున్నట్టు
స్వేదరంధ్రాలన్నీటినీ తెరిచిపెట్టు
నీకు తెలిసిన ఆ ఏడురంగుల్ని
పుట్టపురాగ మరుచిపో
నిలువనీయని ఇంద్రియాలను
వచ్చిపొయ్యే గాలికి వదిలెయ్యి
పెయ్యి తుడుచుకున్నాక తువ్వాల దులిపినట్టు
మనసుని ఓసారి జాడించు
ముఖ్యంగా ఆ మూలకున్న చెత్తిర్ని
అస్సలే మందలియ్యకు
అగడువడ్డట్టు వెలుగునడుక్కునే
కంటిచిప్పల్ని మూలకు బోర్లించి
కలల మడుగులో ఓడనడిపే చిన్నపిల్లోడి
కంటిచూపుని అరువు తెచ్చుకో

అదిగో
ముత్యపు నీటి బిందెల్ని మోసుకుంటూ
అడ్డదార్లో ఆయాసపడుకుంటూ అదొస్తుంది చూసావా-
దానికిపుడు
దేహాన్ని కాయితప్పడవగా చేసుకుని
లొంగిపో.

రవి వీరెల్లి పుట్టింది కరీంనగర్ జిల్లాలోని ఆముదాలపల్లి గ్రామం. 2012లో 'దూప' కవితాసంకలనాన్ని ప్రచురించారు. వాకిలి అంతర్జాల పత్రిక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం వర్జీనియాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు.

email: ravinder.verelly@gmail.com

మింటు నించి
కొత్త నోటు
లోకంలో
చలామణికి
వచ్చింది

ముసలి
పాత నోట్ల వంక
హేళనగా నవ్వింది

ఆదరాలు
గౌరవాలు
పొంది
పొంగిపోయింది.

హుండీల్లో
సొరుగుల్లో
జోబీల్లో
దూకింది

బస్సుల్లో
అంగడిలో
చిరు చెమటల
అరచేతుల్లో

పోపుల పెట్టిల్లో
టీ అమ్మే కొట్టుల్లో
చేపల మార్కెట్టుల్లో

పడీ పడీ
తిరిగింది.

తళుకు బెళుకు
తగ్గాక
అంచు కొంత
చిరిగాక

రంగు
మాసిపోయాక
మెత్తబడ్డ
నోట్ల నడుమ
చేరి ఎంతో
వగచింది.

ముసలి నోట్లు,

నవ్వలేదు
ఏ కొంచెము

వందంటే
వందేలే
విలువ ఏమి
తగ్గదులే

చలామణీ
పోయాక
ఏ అనామిక
ప్రేమికుడో
దాస్తాడులే
భద్రంగా

మామూలే ఇది
అందరికీ
నడుము వాల్చు
కాసేపు
ఎటు పోతామో
రేపు
కలిసుందాం
కాసేపు

అన్యాయవి
అనునయంగ.

వంద నోటు

ఇంద్రాణి పాలపర్తి

అమెరికాలో ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసిన పాలపర్తి ఇంద్రాణి 'వానకు తడిసిన పువ్వాకటి', 'అడవి దారిలో గాలిపాట' కవితా సంకలనాలు, 'ఆ' నవల ప్రచురించారు. ప్రస్తుత నివాసం మారిస్‌విల్లే, నార్త్ కరోలినా.

email: ipalaparthy@gmail.com

కథ

అతడి ముఖచిత్రం

రిమ్ల

అందమైన లతలు, పూలు, పౌరాణిక చిత్రాలతో గాఢమైన రంగులతో ఉన్న కలంకారీ చీరెను వంటికి చుట్టుకుని ఎడమ చేతిని పూర్తిగా, కొంగుపైన వున్న చిత్రాలు కనపడేలా చాచి, వయ్యారంగా నిలబడింది మయూరి. కెమేరాలు క్లిక్‌మనే చప్పుడు కొత్తగా ఉందామెకి. తిరుపతి కొండ దగ్గరి పచ్చటి అడవులు, జలపాతాలు, ఘాట్ రోడ్డు మలుపులు, లోయలు, ఉదయాస్తమయాల అద్భుత రంగుల నీడల మధ్య నిలబడ్డ మయూరి ప్రకృతిలో భాగంగా సహజంగా కనపడుతోంది, లాప్ టాప్‌లో ఆమె చిత్రాలని చూస్తుంటే.

"యు సిల్లీ ఫేస్ లెస్ ఉమెన్. ఎంత అందంగా ఉన్నావో తెలుసా," అన్నాడు కెమేరామెన్ ఉమాశంకర్.

"నువ్వు ఒప్పుకుంటే నిన్నో టాప్ మోడల్‌ని చేసే బాధ్యత నాది. హే గర్ల్ కం విత్ మి," అని చేయి చాచాడు తుషార్‌వర్మ నవ్వుతూ.

కలంకారీ కళాకారులు శ్రీకాంతాచారి, గురవయ్య తాత, పరశురాములు, మస్తానమ్మ అంతా, " పాప సినిమా స్టార్‌లా, ఎంత చక్కగా వుందో," అని తెగ పొగిడారు.

"నేనిట్లా ఈ డాక్యుమెంటరీలో నటించానని తెలిస్తే మా ఇంట్లోవాళ్లు చంపేస్తారు. నా ముఖం కనపడదుగా," అంది కళ్లు వెడల్పుగా చేసి భయం నటిస్తూ మయూరి.

తలమీద చేయి పెట్టుకొని. "బిలీవ్ మి. నువ్వేమీ భయ పడాల్సిన అవసరం లేదు. ఇదేమీ సినిమా కాదు. మీ ఊర్లో ఎవరికీ ఈ డాక్యుమెంటరీ చూసే అవకాశం పొరపాటున కూడా రాదు. ఒకవేళ చూసినా నీ శరీరమే తప్ప నీ మొఖం దీనిలో ఎవరికీ కన పడదు. అంచేత నువ్వు కొంచం కూడా ఆందోళన పడాల్సిన అవసరం లేదు," అన్నాడు తుషార్‌వర్మ .

తుషార్‌కి కలంకారీ కళ గొప్పతనాన్ని చూపటమే లక్ష్యం కానీ, తనని చూపటం కాదన్న సంగతి వెంటనే అర్థమైంది మయూరికి.

హైదరాబాద్ నిఫ్ట్‌లో ఆఖరి సంవత్సరం చదువుతోంది మయూరి. శ్రీకాళహస్తిలో చేతిపనుల కళాకారులతో కలంకారీ చిత్రాలు, తోలుబొమ్మలు తయారుచేయించి, మార్కెటింగ్ చేసే ఇంద్రధనుష్ అనే ఒక స్వచ్ఛంద సంస్థలో మూడునెలల పాటు ఇంటర్న్‌షిప్ చేసేందుకు తన ఫీల్డ్‌వర్క్‌లో భాగంగా వెళ్లింది మయూరి. అప్పుడు పరిచయమయ్యాడు ఆమెకి తుషార్‌వర్మ. అతను ఫిలింమేకర్, చిత్రకారుడే కాకుండా ఒక ఎడ్వర్టైజ్‌మెంట్ కంపెనీలో భాగస్వామి కూడా. కలంకారీ చిత్రకళ మీద డాక్యు మెంటరీ ఫిలిం తీసేందుకు తన టీమ్‌తో ఢిల్లీ నుంచి వచ్చాడు. పనిలో పనిగా తనకు కావలసిన సమాచారం సేకరించుకునేందుకు కూడా వీలవుతుందని అనిపించి, అతను అడగ్గానే అతనికి అనువాదకురాలిగా సహాయపడేందుకు ఒప్పుకుంది మయూరి. సరదాగా రకరకాల కలంకారీ దుస్తులకే మోడల్‌గా కనపడింది.

ఆ మూడునాలుగు నెలల పరిచయంలో వారిద్దరి మధ్యా స్నేహం కుదిరింది. ఆ తరువాత కూడా ఆ డాక్యుమెంటరీ పోస్ట్ ప్రొడక్షన్ పనుల కోసం చాలాసార్లు వాళ్లు కలుసుకోవాల్సి వచ్చింది. అతను మయూరితో అనేక విషయాలు మాట్లాడేవాడు. ఆ మాట్లాడే తీరుని, అతడి విషయ పరిజ్ఞానాన్ని ఆశ్చర్యంగా చూసేది మయూరి. ఆలా ఆ పరిచయం పెరిగి, చదువు ముగియగానే, మయూరి అతని సలహాతో ఢిల్లీలో మాస్టర్స్ చేసేందుకు సిద్ధ మైంది. అందుకు ప్రిపేర్ అవుతూనే, ఢిల్లీలో గుడ్‌ఎర్త్ సంస్థలో కొన్ని నెలలు అనుభవం కోసం పనిచేయటం మొదలుపెట్టింది.

★ ★ ★

తుషార్‌వర్మను కలిసి, గ్రేటర్ కైలాస్ దాటి, పరోమిత ఇంటికి వస్తుంటే మయూరికి ఎంతో శాంతంగా, నిమ్మళంగా అనిపిం చింది. చిన్న చిరునవ్వు ఆమె పెదవులపై వచ్చివాలింది.

"మనం పొందటం సంగతి అలా ఉంచు, మొదట మనం వదులుకోవల్సినవి ఏమిటో తెలుసుకోవడం కూడా చాలా కష్టం. తెలిసినా, వదలలేకపోవడం మరింత దుర్భరం. ప్రేమకి, బాని సత్వానికీ మధ్య తేడా తెలీదు చాలామందికి. ప్రేమని మనం భ్రమ పడి దానికోసం జీవితంలో మనం వదులుకోకూడనివి అనేకం వదులుకుంటాం కదా," అంది పరోమిత ఒకరోజు మయూరితో. ఈ మాటలు అర్థంకావటానికి మయూరికి చాలాకాలం పట్టింది.

ఎందుకొచ్చాడు అతను తన జీవితంలోకి అంతలా చొచ్చు కొని? ఏదోతెలియని ఆకర్షణ, అయిస్కాంతంలా పట్టి లాక్కెడితే, ఎటు పోతున్నదో తెలీక, నడి సముద్రంలో తెరచాపలేని నావలా కొట్టుకుపోయి, ఏ తెలియని తీరాలకో చేరి, అలసి, దిక్కుతోచక నిలబడ్డప్పుడు చేయందించిన స్నేహితురాలు పరోమితానే.

కాలింగ్ బెల్ చప్పుడు వినిపించినట్లు లేదు. కాస్సేపటికి గానీ తలుపు తెరవలేదు పరోమిత. మోకాళ్లు దాటని స్లీవ్‌లెస్ నైట్ గౌన్‌లో వుంది.

మయూరి ఏదో అనబోతే, "బాల్కనీలో మొక్కలకు నీళ్లు పోస్తున్నా. వినపడలేదు," అంటూ కళ్లు ఎగరేస్తూ తల పక్కకు తిప్పింది. మంద్రస్వరంతో అక్కడ ట్రేసీ పాడుతోంది.

ఆమె ఏదో అడగబోయే అంతలో, "ఒక్క నిముషం. స్నానం చేసి వస్తాను," అని గెస్ట్‌రూంలోకి వెళ్లింది మయూరి.

తను వచ్చేసరికి డైనింగ్ టేబుల్ భోజనానికి సిద్ధం చేసి, "లెట్ అజ్ సెలబ్రేట్ యువర్ లిబరేషన్," అని మయూరిని చూడగానే నవ్వుతూ పరోమిత గట్టిగా అరిచింది.

"గొడవ పడ్డావా?"

"లేదు. నేను వెళ్లేసరికి వాళ్ల ఇంట్లో చాలామంది ఉన్నారు. ఇల్లు ఖాళీ చేసానని, తాళంచెవులు ఇచ్చేందుకు వచ్చానన్నాను. నిర్వాంతపోయాడు గురుడు. నీకోసం ఒక బహుమతి అంటూ నే వేసిన అతని చిత్రాన్ని అతనికి ఇచ్చాను. ఆ ప్యాకెట్‌ని ఆత్రంగా విప్పబోతుంటే అతని భార్య, 'క్యాహై' అని దూరం నుండి రాబో యింది. నేను నెమ్మదిగా నీకోసం మాత్రమే అని చెప్పి వచ్చేసాను. ఆ తరువాత ఏం జరిగిందో నాకు తెలీదు," అంది.

"వత్తిగిల్లి పడుకున్న అతని నగ్న శరీరపు బొమ్మ అది పారో. మొఖం ఉండాల్సిన చోట పురుషుడి రహస్య అవయవం వేసాను. అతని సమ్మోహక చిరునవ్వు, నుదిటి మీదకు అల్లరిగా వాలే వెంట్రుకలు, కలల కోసం వెతుకుతున్నట్లుండే ఆ పెద్ద కళ్లు, చివరికి అట్లా రూపాంతరం చెందుతాయని నేను అనుకోలేదు," అంది మయూరి.

"యా యా, ఐ సా ఇట్," అంటూ పారో విరబడి నవ్వి,

"తమ మొఖాలను అట్లా మారకుండా తమను తాము కాపాడుకునే మగాళ్లు చాలా తక్కువనుకుంటాను. పాత జానపద కథలలో లాగా దివ్యశక్తితో వాడు రాజకుమారుడా లేక మాంత్రి కుడా అని తెలిసిపోయేలా ఆడవాళ్లకి కూడా ఏదైనా దివ్యశక్తి వచ్చి, ఈ పురుషుడి మొఖం మొఖంగానే ఉందా లేక అవయ వంగా మారిందా అని తెలుసుకోగలిగితే బావుండును. నువ్వు ఇంతటి బాధ అనుభవించకుండా బయటపడేదానివి కదా!" అంది.

రాత్రి గదిలో నిద్రపట్టక, బాల్కనీ ఉయ్యాల బల్లపై పడు కుంది మయూరి. చంద్రుడిని చూసి, ఈరోజు పౌర్ణమిలా ఉంది అనుకుంది. తుషార్‌వర్మతో తన సంబంధం కూడా అలానే ఒక వెలుగు వెలిగి క్షీణించటం గుర్తుకు వచ్చిందామెకి.

★ ★ ★

ఢిల్లీ వచ్చాక మయూరి తుషార్‌వర్మతో కలసి రాజస్థాన్ కచ్ ప్రాంతపు హస్తకళల ప్రాజెక్ట్ లో పనిచేస్తున్న సమయంలో వారిద్దరి మధ్యా సాన్నిహిత్యం బాగా పెరిగింది.

వచ్చిన కొత్తలో కొన్ని నెలలపాటు హాస్టల్‌లో వున్నా, ఆ తరువాత ద్వారకా సెక్టార్ పదకుండులో తుషార్ వాళ్ల బంధువుల అపార్ట్‌మెంట్‌లోకి మారింది. అంతకుముందు అక్కడ అతని పుస్తకాల లైబ్రెరీ, స్టూడియో వుండేవి. ముందు గదులలో అతని సామాన్లు కొన్ని ఇంకా అలానే ఉన్నాయి. కాగా అతని ఆఫీసు మాత్రం అక్కడి నుండి మారింది. అతను నోయిడాలో తల్లి దండ్రులు, బాబాయిలతో కలిసి జాయింట్ ఫ్యామిలితో ఉంటా డని, వాళ్లకి ఏవో వ్యాపారాలు ఉన్నాయని మాత్రం తెలుసు మయూరికి. అతను ఎప్పుడూ మయూరిని తన ఇంటికి రమ్మని అడిగేవాడు కాదు.

ఒకసారి అతని వ్యక్తిగత వివరాలు ఏవో అడగబోతే అతను కాస్త చిరాకు పడటంతో మయూరి మరెప్పుడూ ఆ ప్రస్థావన తేలేదు. పైగా, 'నీకు నేను ముఖ్యమా, లేక నా కుటుంబ నేపధ్యం ముఖ్యమా?' అని సూటిగా అడగటంతో అమెకే తను మరీ సంకు చితంగా ఆలోచిస్తున్నానా అని అనిపించి మధనపడింది.

చివరికి అతనే తనకు ముఖ్యం అనుకుంది మయూరి. అతను ముఖ్యమని అనుకున్నాక అతని కోసం ఎదురుచూడటం, అతను మెల్లిగా ఆమె అలోచనలను ఆక్రమించటం మొదలెట్టాడు. ఆమెపట్ల ప్రత్యేక శ్రద్ధ కనపరిచేవాడతను. అతనికి జ్వరం వచ్చిందని తెలిసి మయూరి బాధపడితే,

"రాత్ యూ దిల్ మే తెరీ ఖోయీ హుయీ యాద్ ఆయీ
జైసే వీరానే మే చుపే్క సే బహార్ ఆజాయే
జైసే సహారన్ మే హొలెసే చలే బాద్-ఇ-నసీం
జైసే బీమార్ కో బెవజా కరార్ ఆజాయే" అంటూ షాయరీ వినిపించాడు. .

అది విని ఆమె అతడ్ని మొదటిసారి ముద్దుపెట్టుకుంది. అతను ఆమెని కౌగలించుకుని, "నిన్ను ప్రేమించకుండా ఉండటం అసాధ్యం," అని గుసగుసగా అన్నాడు. ఆ మాట ఆమెకి సంతోషం కలిగించింది. అతను, "ఉయార్ క్రాసింగ్ ద బౌండరీస్," అని నవ్వాడు. ఆమె అతని పక్కనే కూర్చుని, అతని భుజంపై తల వాల్చి, "సో వాట్," అంది.

ఏం ఉంది ఆ దాటరాని గోడలకి ఆవల. చీకటి అగాధాలా? సుగంధభరితమైన పూలవనాలా? మోహపూరిత మరోలోకాలా, గాఢ వాంఛా పరిష్వంగాలా, విశ్వాసరాహిత్య వంచనలా, అచంచల నమ్మకాలా... ముప్పిరిగొన్న ఆలోచనల నుండి తేరుకొన్నదానిలా తలఎత్తి, "నువ్వు నాకు కావాలనిపిస్తోంది. నీతో కలిసి ఉన్నప్పుడు నాకు చాలా శాంతిగా, హాయిగా ఉంటుంది. నువ్వు నా దగ్గర లేనప్పుడు దిగులుగా, భయంగా ఉంటుంది. నిన్ను గురించిన ఆలోచనలు ఎప్పుడూ నన్ను వెన్నంటే ఉంటాయి. ఇది ప్రేమే నేమో',' అంది.

మయూరి చేతిగాజులను కదిలిస్తూ వింటున్న అతను ఏమీ మాట్లాడలేదు. దీర్ఘంగా నిట్టూర్చి నిలబడి,

"నీతో ఎటాచ్‌మెంట్ చాలా ఎక్కువైపోతూ ఉంది నాకు," అన్నాడు.

ఒక వర్షాకాలపు సాయంత్రం ఎడతెగకుండా కురుస్తున్న జల్లుల మధ్య తుషార్ ఆమె ఇంటికి వచ్చాడు. చాలాసేపు వాళ్లిద్దరూ కలిసి పనిచేసుకుంటూ ఉండిపోయారు.

"ఇప్పుడేం వంట చేస్తావ్. నీ కోసం ఏమైనా తెచ్చి పెడతాను," అన్నాడు తుషార్.

"నువ్వు కూడా ఇక్కడే తినేయచ్చు కదా," అందామె.

పని ఉన్నప్పుడు తుషార్, అతని టీమ్ సభ్యులు అక్కడే ఉండిపోవడం అలవాటే. అట్లాగే తుషార్‌ని ఈ వర్షంలో నోయిడా దాకా ఏం పోతావ్ ఉండి పొమ్మనింది మయూరి.

కుర్చీలో కూర్చున్న మయూరి దగ్గరికి వచ్చి, నేల మీద కూర్చుని ఆమె వడిలో తల పెట్టుకుని కళ్లు మూసుకున్నాడు తుషార్. ఆమె అతని తల నిమిరి దయగా నుదిటిపై ముద్దు పెట్టు కుంది. మాటలు అక్షరలేని, ఇద్దరు మనుష్యుల మధ్య అనాదిగా ఉండే ఒక పురాస్పర్శ వాళ్లని నెమ్మదిగా చుట్టుకుంది.

వాళ్లిద్దరి మధ్యా హద్దులు చెరిగిపోయిన ఆ వర్షపు రాత్రి ముగిసి, వెలుతురు కమ్ముకుంటున్న వేళ, అతను పక్క మీది నుండి లేవబోతుంటే, అతని చేయి పట్టుకుని, "ఒక పురుషుడి నగ్న శరీరాన్ని చూడటం నాకు ఇదే మొదటిసారి," అందామె. అతను నవ్వుతూ చేయి విడిపించుకుని దుస్తులు వేసుకున్నాడు.

అవ్వాల్టి అద్భుత అనుభవం తరువాత, వాళ్లిద్దరూ వారిదైన ఏకాంతాన్ని సృష్టించుకునేందుకు ప్రయత్నించారు. ఒకసారి పని మీద కార్లో ఢిల్లీ నుండి జైపూర్ పోతున్నప్పుడు ఆడిగింది మయూరి.

"తుషార్ మనం పెళ్లి చేసుకుందామా," అని.

"ఏం ఇట్లా బాగానే ఉన్నాం కదా మనం," అన్నాడు అమెకేసి తల తిప్పకుండా.

మయూరికి ఏం అనాలో తోచలేదు.

"బాగాలేమని కాదు. మనం పెళ్లి చేసుకుంటే ఇల్లూ, పిల్లలూ, మనకంటూ ఒక జీవితం..." అంటూ ఆగిపోయింది మయూరి.

ఒక్కక్షణం ఆగి, "ఎందుకిలా ఆలోచిస్తారు మీ ఆడవాళ్లు? ఒక బంధంలోకి వస్తే బంధించేయాలని అనుకుంటారెందుకు?" అన్నాడు.

"మనిద్దరికీ ఒకరంటే ఒకరికి ఇష్టం, ప్రేమా ఉన్నాయి. మన ఆలోచనలు, అభిప్రాయాలు దాదాపు ఒకేలా ఉంటాయి. ఇద్దరం కలిసి జీవించేందుకు ఇవి చాలవా? అది బంధించటమంటే ఎలా?" అంది మయూరి ఉక్రోషంగా.

"చాలవు. ఇప్పుడొద్దులే. మరోసారి మాట్లాడుకుందాం మనం," అన్నాడు తుషార్ సంభాషణ తుంచేస్తూ.

అతని పొడిపొడి మాటలు లోలోన ముల్లులా గుచ్చుకున్న ట్లనిపించింది మయూరికి.

ఈ సంభాషణ తరువాత అంతులేని ఆనందం స్థానంలో మెల్లిగా అమె లోపల భయం చోటు చేసుకోవడం మొదలైంది. అతనితో జీవించాలన్న కోరిక, ఆ కోరిక తీరదేమోనన్న సంశయం, మయూరిని అశాంతికి గురిచేసింది. ఇది తాత్కాలిక సంబంధమని అతను, జీవితాంతం కలిసి ఉంటామని తనూ అనుకుంటున్నట్లు ఆమెకి అనిపించేది. అతను ఆ రిలేషన్‌షిప్ గురించి, రేపటి పర్యవసానం గురించీ మాట్లాడేందుకు ఇష్టపడేవాడు కాదు. మయూరిలో మునుపు వుండే స్థిమితం పోయింది. తను ఒకప్పటి తనలా లేనన్న ఎరుక ఒక్కోసారి అమెకి కలిగేది. మనసును స్థిరంగా, శాంతంగా ఉంచుకోవాలని, తన ఊహలు, భయాల నుండి బయటపడాలని అనుకునేది. మళ్లీ అదంతా తాత్కాలికమే అయి, వాళ్ల మధ్య చిన్న పెద్దా తగాదాలు మొదలై, తానొక వలయంలో చిక్కుకున్నదానిలా అల్లాడేది మయూరి.

అలాంటి స్థితిలో ఆమె ఉండగా, "నీ దగ్గరేదో ఆనందంగా గడపవచ్చనుకుంటే, నన్ను చాలా విసిగిస్తున్నావ్. నాకసలు నిన్ను కలవాలనిపించటం లేదు," అన్నాడు తుషార్.

"అయితే నీకు ఎంటర్‌టైన్‌మెంట్ ఇచ్చేదాన్నన్న మాట నేను. నీకు నేను ఆనందం కలిగించగలిగించాలి, కానీ నాకు ఆనందం కలిగించేందుకు నువ్వు ఏం చేయాలో నీకు అవసరం లేదు కదా?" అంది మయూరి.

"ఏంచేయాలి? నిన్ను పెళ్లి చేసుకోవాలి. అంతేకదా? ఇద్దరు మనుష్యుల మధ్య శారీరక సంబంధం ఏర్పడినంత మాత్రాన, వాళ్లు పెళ్లిళ్లు చేసుకోవాలని అంటే, ఒకొక్కరికీ ఎన్నేసి పెళ్లిళ్లు జరిగేవో ఈ లోకంలో. నాక్కూడా ఏ రెండో మూడో జరిగేవి. నువ్వు మన మధ్య శారీరక సంబంధం ఉంది కాబట్టి, దాని లాజికల్ కంక్లూజన్ పెళ్లే అని అనుకుంటున్నావేమో. నేను అలా అనుకోవడం లేదు. నేను ఈ చర్యలో మన రెండు శరీరాలు, అఫ్‌కోర్స్ నీ భాషలో రెండు హృదయాలు సుఖాన్ని అనుభవించాయను కుంటున్నాను. ఇంతకన్నా ఎక్కువ ఆశించకు, ఆలోచించకు," అన్నాడు తుషార్.

మయూరి కళ్లు కన్నీటితో తడిసాయి. అతను ఆమె పక్కన కూర్చుని ఆమె కన్నీళ్లు తుడిచి గుండెలకు హత్తుకుని తల నిమిరాడు. అతని పరిచిత స్పర్శ, ఆ దగ్గరితనం కల్లోలంగా ఉన్న ఆమె మనసును శాంతపరిచాయి. ఇలా మాట్లాడే అతన్ని దూరం పెట్టాలని చాలాసార్లు అనిపించినా ఏదో తెలియని అశక్తత అమెని ఆవరించేది. అతని చేతులు ఆమె శరీరంపై పాకినప్పుడు వారించబోయి, అతన్ని గట్టిగా ఆపలేక ఒకపరి సుఖము, ఒకపరి దుఃఖము రెండూ కలగలిసిన ఓపలేని మానసిక, శారీరక స్థితిలో ఆమె మిగిలింది. అతను ఆమె శరీరంపై మెల్లిగా ఆధిక్యత సాధించే వాడు. దానిని ఆమె నిశ్శబ్దంగా ఒప్పుకుంది.

మంచం ఒక చివరికి జరిగి , వెంటనే నిద్రలోకి జారిపోయిన అతడ్ని చూస్తూ ఉంటే ఆమెకి ఎందుకో అతన్ని చిత్రించాలన్న కోరిక కలిగింది. నెమ్మదిగా లేచి రాత్రి దుస్తులు వేసుకుని, పక్క గదిలో కెళ్లి డ్రాయింగ్ పుస్తకం, పెన్సిల్ తీసుకుని అతని చిత్రాన్ని గీయడం మొదలెట్టింది. అతను దాదాపు నగ్నంగా ఓ పక్కకి వత్తిగిల్లి, ఒక కాలు కొంచం మడుచుకొని పడుకొని వున్నాడు. స్కెచ్ పూర్తిచేసి తెల్లవారుఝామున ఆమె హాల్లోనే సోఫాలో పడుకుని నిద్రపోయింది. తుషార్ ఉదయమే వెళ్లిపోయాడు.

క్రమంగా కలిసినప్పుడు మాటలను పంచుకోవడంకన్నా, దేహాలు సంభాషించుకోవడం వారిమధ్య ఎక్కువ కావడం మొదలైంది.

ఏం ఆశించి తాను తుషార్ని ఇంకా కాదనలేక పోతుందో, ఏ మోహపాశంలో చిక్కుని తాను బయటకు రాలేకపోతుందో



అసలు తన స్థితి ఏమిటో తనకే అర్థం కానట్లనిపించేది మయూరికి.

ఎవరితోనన్నా మాట్లాడితే బాగుండుననిపించి, పరోమితకి ఫోన్ చేసింది.

"ఖాన్ మార్కెట్‌కి వస్తావా? నా పనైపోయాక ఎటైనా వెడదాం," అంది మయూరి.

"నాక్కాస్త షాపింగ్ పని ఉంది. తోడొస్తావా?" అంది పరోమిత.

" మా గుడ్ ఎర్త్‌కే రారాదూ? నీ పని అవుతుంది, మనం కలిసే వెళ్లవచ్చు."

" ఆ హైఎండ్ షాపులకు వెళ్లేంత సీన్ లేదులే కానీ, నువ్వు ఆరుగంటలకల్లా, దిల్లీ హత్ దగ్గరికి వచ్చేయ్. అక్కడి నుండి ఎటైనా వెడదాం," అంది పరోమిత.

టైమ్స్ ఆఫ్ ఇండియాలో రిపోర్టర్ పరోమిత. కళలు, సాహిత్యం, సినిమాల గురించి రాస్తూ ఉంటుంది. నిజానికి తుషార్ ద్వారానే ఆమె పరిచయం అయినా, చాలా త్వరగానే వాళ్లిద్దరూ మంచి మిత్రులయ్యారు.

మయూరి కన్నా ఐదారేళ్లు పెద్దది. బెంగాలీ. "రసగుల్లాలు, రవీంద్రుడు, కాళీమాత, కమ్యూనిజము," అంటూ తుషార్ ఏడిపించబోయినా, "ఛోడ్‌దో యార్. నేను ఇంటర్‌నేషనల్," అంటూ నవ్వేసేది.

షాపింగ్ పూర్తయ్యాక ఇద్దరూ పరోమిత ఇంటికే చేరుకున్నారు. రాత్రి డిన్నర్ ఆర్డర్ చేసాక, రెండు కాళ్లు టీపాయ్ మీద చాపుకుని కూర్చుని సిగిరెట్ పొగని రింగులు రింగులుగా వదులుతూ, "చెప్పు," అంది పరోమిత.

తనకీ, తుషార్‌కీ మధ్య తలెత్తుతున్న విభేదాల గురించి చెప్పింది మయూరి.

"పారో! నేనతన్ని గాఢంగా ప్రేమించాక, అతను నా జీవితంలో భాగమని అనుకున్నాక, మనసుకీ శరీరానికీ మధ్య అంతరాలు కృత్రిమం అనిపించింది నాకు. మేం కలిసే ఉంటామనుకున్నాను నేను. ఇతను నావాడు అనుకున్నాక రెండు శరీరాల కలయిక పెళ్లికి ముందా, తరువాతా అన్నదానికి అర్థం ఏమన్నా ఉందా? వాట్ ఈస్ మ్యారేజ్. జస్ట్ అది ఒక తంతు. అది ఒక ఒప్పందం. అంతే కదా? అది ఎప్పుడైతే ఏంటి?"

"ఆగాగు. ఎప్పుడైతే ఏంటా? కన్య, కన్యాదానం అన్నారు. అవును అది కాంటాక్ట్, చాలా నిబంధనలున్నాయి. మగాడి అధికారం, ఆస్థి, వంశమూ నిలబడ్డ పునాది ఆడదాని శరీరం కదా! పెళ్లి ద్వారా దొరికే శరీరాలు వాడికి చాలకే కదా బయట వాడు వేశ్యావ్యవస్థని తయారు చేసుకున్నాడు. ఇప్పుడు ప్రేమిస్తున్నామనుకునే నీలాంటి చదువుకున్న, అందమైన ఆడవాళ్లు దొరుకుతున్నారు మగవాళ్లకి. నువ్వది కాస్త ముందో వెనకో అది పెళ్లి ఒప్పందానికి దారి తీయాలనుకుంటున్నావు. ఒక సబ్జెక్ట్‌లో పరీక్ష రాసి, మరో సబ్జెక్ట్‌లో మార్కుల కోసం చూస్తే కుదరదు," అంది పరోమిత.

మయూరికి కోపం వచ్చింది. "పెళ్లిలాగే ప్రేమలు కూడా కాల్కులేట్‌గా జరిగే ఒప్పందాలా. అన్ని ప్లాన్‌లు వేసుకుని ఎవరూ ప్రేమించరు. నేను తుషార్‌ని అట్లా ప్రేమించలేదు," అంది.

" నిజమే మయూరి. ప్రేమలైనా, పెళ్లిళ్లు అయినా అలా ఉండకూడదు. కానీ ఉంటున్నాయి. నీకేం తెలుసు తుషార్ గురించి. అతని ప్రపంచం నిన్ను దాటి ఎంతుందో నీకు తెలుసా? అతనొక చిత్రకారుడుగా, ఫిలిమ్ మేకర్‌గానే నీకు తెలుసు. అతని తల్లిదండ్రులు,అతని కుటుంబం, వాళ్ల వ్యాపారాల గురించి నీకేం తెలుసు. అతనిలాంటి వాళ్లకి, తెలివైన, ఆధునిక స్త్రీల సాంగత్యం కావాలి. అదీ షార్ట్ టైం రిలేషన్ షిప్స్. అదేదో బాధ్యత, బరువూ కానంతవరకూ. వారి ఇతర ప్రపంచానికి నీతో స్నేహం ఒక న్యూసెన్స్ కానంతవరకూ. నువ్వు అది అర్థం చేసుకుంటే అతని ఎంటర్‌టైన్‌మెంట్‌కి నువ్వు పనికి వస్తావ్. ఆ నువ్వు కూడా ఆ పరిమితుల్లోనే ఎంటర్‌టైన్‌మెంట్ పొందవచ్చు," అంది.

"నేను అట్లా అనుకోలేదు. అతన్ని నిజంగా ప్రేమించాను. పెళ్లి చేసుకోవాలని అనుకున్నాను. అతనికి నామీద కన్నా నా శరీరంపైనే ఎక్కువ ఆసక్తి ఉందనిపిస్తోందీ మధ్య. ఈ మాట అతనితో ఒకసారి వ్యక్తంచేస్తే, కొందరు మగవాళ్లు వాళ్ల ప్రేమని ఇలానే వ్యక్తం చేస్తారన్నాడు. నా మనసుకు బాధ కలిగినా అతడి చర్యని ఎదిరించబోతే అతనిపట్ల నాకు ప్రేమ ఉందని అతను అర్థం చేసుకుంటాడనుకున్నా," అంది మయూరి.

"యు ఫూల్! మనం ఇప్పుడిప్పుడే మారిటల్ రేప్ గురించి మాట్లాడుతున్నాం. కనీసం దీని గురించి కొందరన్నా అర్థం చేసుకుంటున్నారు. ఇలాంటి ప్రేమలలో, రిలేషన్ షిప్స్‌లో కూడా రేప్స్ ఉంటాయని అంటే ఎవరికి పట్టింది. సమాజ నియమాలను ఉల్లంఘించావు కాబట్టి నీకు అలానే జరగాలని అంటారు. మరీ మొరటుగా చెప్పానా? నీపట్ల అతని ప్రవర్తన కొన్ని సందర్భాల్లో నచ్చటం లేదన్నవ్ కదా! చాలామంది మగవాళ్లకి ప్రేమకీ, సెక్సువల్ యాక్ట్‌కీ, లేదా ప్రేమపూర్వక సెక్సువల్ యాక్ట్‌కీ మధ్య తేడాలు, సంబంధం తెలీవనుకుంటాను. వీటన్నింటికన్నా ముఖ్యం- నీతో రిలేషన్‌లో ఉన్న వ్యక్తి నీ శరీరం పట్లా , నీ అభిప్రాయాల పట్లా మర్యాదగా, గౌరవంగా ఉంటున్నాడా అన్నది. అలా లేని ఏ సంబంధమైనా నిలబడటం కష్టం. అన్‌లెస్ నువ్వో ఆత్మగౌరవం లేని బానిసవైతే తప్పా. నువ్వేమిటో నువ్వే తెలుసుకో," మరో సిగిరెట్ ముట్టిస్తూ నవ్వుతూ అంది పరోమితా.

"నీ దగ్గరకి వస్తే నాకేదో సలహా ఇస్తావనుకుంటే, మరింత కన్‌ఫ్యూజ్ చేసావ్. నేను కాస్త స్థిమితంగా ఆలోచించుకుంటాను," అంది మయూరి.

★ ★ ★

తుషార్ తనకి పెళ్లి కుదిరిందని చెప్పినరోజు చిత్రంగా మయూరికి అది తట్టుకోలేనంత బాధాకరమైన విషయంగా అనిపించ లేదు. తమ మధ్య మానసిక దూరం పెరిగిన సంగతి, తన మనసు గట్టిబడుతున్న సంగతి చాలాకాలంగా అర్థమవుతూనే ఉంది.

"నేను మా ఊరికి వెడతాను," అంది మయూరి.

"వద్దు. ఈ పెళ్లి నేను కాదనలేను. మా కుటుంబ వ్యాపారాలకి ఇది అవసరం. నువ్వు ఎక్కడికీ వెళ్లద్దు. నీదీ నాదీ ఒక ప్రత్యేక బంధం."

"ఈ బంధానికి నువ్వేదన్నా పేరు పెట్టగలవా? ఇప్పుడు చేసుకుంటున్న పెళ్లికి ముందు నుండీ నేనీమెతో ఒక ప్రత్యేక బంధంలో ఉన్నానని, నన్ను నీ ప్రపంచంలోకి తీసుకు వెళ్లగలవా? నీతో కలిసి నడుస్తున్న నా మొఖాన్ని అందరికీ నేను చూపగలను. అలాగే నా ప్రపంచంలోకి నువ్వు నీ మొఖంతో రాగలవా? వస్తావో రావో తెలియని నీకోసం, నువ్వు నాకోసం చివరిదాకా ఉంటావో లేవో తెలియని బంధాన్ని పట్టుకుని నేను జీవితాంతం ఎదురు చూడాలా? ఇలాగే ఉండాలా? ఎంత స్వార్థపరులు మీ మగవాళ్లు."

ఒక్కసారిగా దుఃఖం కట్టలు తెంచుకుంది మయూరికి. అతను ఆమెను దగ్గరికి తీసుకోబోతే విదిలించి కొట్టి, దూరంగా జరిగి, "ఏం తెలుసు నీకు. ఏ స్పర్శ ఎలాంటిదో ఏం తెలుసు నీకు? శరీర సుఖం అంతే కదా! నీ కోసం నేను దుఃఖపడ్డ రాత్రుల అంతం అట్లా ముగిసి..." పూడుకుపోయిన గొంతుతో ఆ పైన ఆమె మాట్లాడలేకపోయింది.

అతనికి కోపం వచ్చింది. "అంతకన్నా ఏం వుంది మన మధ్య? అసలు ఎవరి మధ్యన్నా?" అని తుషార్ విసురుగా వెళ్లిపోయాడు.

అతను వెళ్లిపోయాక కళ్లు తుడుచుకుని, నెమ్మదిగా లేచి మొఖం కడుక్కుని, కాఫీ కలుపుకుని చీకటి పడుతుండగా బాల్కనీలో కూర్చుని ఒక్కగుక్క వేడిగా తాగాక, బాగా ఆకలి పించి వంటింట్లోకెళ్లి డబ్బాలు వెతుక్కొని కారప్పూస, మైసూర్ పాక్ తెచ్చుకుని తింది. కొందరిళ్లలో శవాన్ని సాగనంపాక తీపి పెడతారని అమ్మ చెప్పటం గుర్తొచ్చి చిన్నగా నవ్వొచ్చింది మయూరికి.

ఈ బంధంపోతుందేమోననే కదా నేను భయపడింది. పోతే మాత్రం ఏం అని మనసు గట్టి చేసుకోలేక పోయింది. అది ప్రేమ తగ్గుతున్న వట్టి శరీరబంధంగా రూపాంతరం చేందుతున్నా, దాన్ని అర్థంకానట్లు పక్కకు నెట్టి, భ్రమల లోకంలో బతకబోయి ఎప్పటికప్పుడు గాయపడి... తల విదిలించుకుని, తనకు తెలీకుండానే, "బస్ బాబా బస్," అని గట్టిగా అనింది.

పరోమితాకి ఫోన్ చేసి, జరిగింది క్లుప్తంగా చెప్పి, "మా ఊరెళ్లిపోతాను. ఇక్కడ ఒక్కరోజు కూడా నాకు ఉండాలని లేదు," అంది.

వెంటనే పరోమిత వచ్చి మయూరిని తన ఇంటికి తీసుకు వెళ్లింది.

"ఏం బంధాలు ఇవి మయూరీ. ఉన్నంతకాలం పోతుందేమో, లేకపోతే ఉండలేమోనన్న భయం. అసలు పోతేనేకదా తెలిసేది. వదిలేసి ఉండగలమని తేలేది. ఎందుకు వెడతానంటావ్, ఇంత మంచి ఉద్యోగాన్ని వదులుకుని. ఇలాంటి ప్రేమల కోసం అల మటించటం కన్నా మనం చేయగల పనులు చాలానే ఉన్నాయి," అంది.

పరోమిత కొంతకాలం తనతో పాటే ఉండమని అడిగితే, ద్వారకాలో తను ఉంటున్న ఇల్లు ఖాళీచేసి సామాన్లు తీసుకు వచ్చేసింది. సర్దుతూ ఉంటే కనిపించింది మయూరికి, తాను గీసిన తుషార్‌వర్మ మొఖం లేని నగ్నచిత్రం.

ఆ చిత్రం గీసినరోజు తనకు కలిగిన మానసిక కల్లోలం ఆమెకి గుర్తుంది. స్త్రీల శరీరాలతో మగవాడికి ఉండే సంబంధాలలో ఆమెకి మొఖం ఉండాలో లేదో అతడే నిర్ణయిస్తాడా? స్త్రీలవలే పురుషుల నగ్న శరీరాలు కూడా ఒకే తీరుగా ఉంటాయి కదా? అతడి మొఖాన్ని ఎలా ఉండాలో అతడే నిర్ణయించుకోగలడు కదా! తన అనుభవంలోకి వచ్చిన ఫేస్ లెస్ మగవాడి ముఖచిత్రం గీసే స్వేచ్ఛ ఆడవాళ్లకి దొరికితే అతనికి ఎలాంటి ముఖాన్ని ఆమె ఇస్తుంది. ఆ బొమ్మ గీసిన తరువాత అనేక నెలలుగా తనలో సుళ్లు తిరుగుతున్న ఆలోచనకి మయూరి ఒక రూపం ఇచ్చింది. అతని మొఖాన్ని ఇప్పుడు గీసింది.

పూర్తయిన ఆ బొమ్మ చూసాక, పరోమిత, "దీన్ని మోసే భారం నీకెందుకు, పడేయ్. లేదంటే నీకు ధైర్యం ఉంటే అతని చిత్రం అతనికే ఇచ్చేయ్," అంది.

ఖాళీ చేసిన ఇంటి తాళాల్ని, ఆ చిత్రాన్ని పట్టుకుని తుషార్ ఇంటికి అలా వెళ్లివచ్చింది మయూరి.

పొద్దుటే పారో రవీంద్రుడి గీతం,

"ఎక్కడ మనస్సు నిర్భయంగా ఉంటుందో
ఎక్కడ మానవుడు సగర్వంగా తల ఎత్తుకు తిరుగుతాడో..."

పాడుతూ ఇంట్లో పని చేసుకుంటోంది. ఒక్క నిముషం విన్నాక, రాత్రి బాల్కనీలో తను పడుకున్న చోటు నుండి లేస్తూ మయూరి, "ఎక్కడ స్త్రీలు తమ తలలను తామే చేసుకుని సగర్వంగా తిరుగుతారో..." అనగానే పరోమిత, "ఎక్కడ పురుషుని తలలు ఎటువంటివని స్త్రీలు గ్రహించగలుగుతారో..." అంది.

అప్పుడు వాళ్లిద్దరికీ గట్టిగా నవ్వొచ్చింది.

'అడవి ఉప్పొంగిన రాత్రి' కవిగా మంచి పేరున్న విమల గత నాలుగేళ్లుగా కథలు కూడా రాస్తున్నారు. 'కొన్ని నక్షత్రాలు-కాసిని కన్నీళ్లు' కథాసంపుటి ప్రచురించారు. వివిధ సామాజిక ఉద్యమాల్లో క్రియాశీలంగా పాల్గొంటున్నారు.

email: vimalamorthala@gmail.com

వదలి వెళ్లడం...

స్వామి వెంకటయోగి

మనుషులు వదలి వెళ్లడం దుర్భరం.
దగ్గరైన మనుషులు
హటాత్తుగా వదిలివెళ్లడం
మోయలేని ఒక భారం.

వదిలి వెళ్లుతూ మనుషులు,
యే ఖాళీలూ కూడా నింపలేని
ఒక శూన్యం వదిలి పోతరు.

మాటలో, చూపులో,
కరచాలనాలో,
ఆలింగనాలో,
అసలేమీ లేని మౌనమో...

ఆత్మీయతకు అలవాటు పడినంక
హటాత్తుగా మనుషులు వెళ్లిపోతే
కనీసం ఖాళీ కూడా మిగలదు.

మనుషుల మధ్య యేదీ లేదనుకున్న చోట కూడా,
ప్రతి ఖాళీలోనూ
నిశ్శబ్దంగా పలికే మనిషితనముంటుంది.
దాటలేని కన్నీటి దూరాలనూ,
యెంత మాట్లాడినా తీరని వెతలనూ,
మనుషులు చాలాసార్లు
నిశ్శబ్దంగానే ఖాళీలతోనే మాట్లాడుకుంటరు.

యెన్నో ప్రపంచాలను
మనకు తోడుగా చుట్టివచ్చి,
వెచ్చని తడి కండ్లపై వెలుగు సంతకం చేసినవాళ్లు
యెవరైనా,
వెళ్లిపోతే మిగిలేవి...
పూడ్చలేని ఖాళీలూ
నింపలేని జాగలే.

మనుషులు ఉన్నపళంగా
వదిలేసి వెళ్లిపోవడమంటే,
యేకాంతంలో
మనమూ, నీడా
శూన్యమై
కలిసిపోవడమే.

మెదక్ జిల్లాలో పుట్టి, హైదరాబాద్‌లో చదివి, కొంతకాలం అక్కడే ఉద్యోగం చేసి, సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్‌గా అమెరికాలో స్థిరపడ్డారు శ్రీ స్వామి వెంకటయోగి. రెండు కవితా సంకలనాలు- కల్లోల కలల మేఘం, సందుక ప్రచురించారు. భార్య విద్య, ఇద్దరు అమ్మాయిలతో ప్రిన్స్‌టన్‌లో నివాసం.
email: sannapureddy12@gmail.com

లోపలి

దర్భశయనం శ్రీనివాసాచార్య

ఎవరూ పలకరించలేదనుకున్న నాడూ నిశ్శబ్దం
లేదు
లోపల మిక్కిలి పలకరింపులు పాతవి మాగినవి
దట్టమైనవి దగ్గరైనవి ఎప్పటి కాలాల్నో వెంట తెచ్చుకుని
ఇష్టపూర్తిగా పరుచుకున్నవి చారెడంత తలాన్ని విశాల
మైదానాలుగా మలచినవి, లోపల మిక్కిలి...

లేదు నిశ్శబ్దం, కానీ
వుంది కూడా, లోపలి పలకరింపుల్లో మెత్తగా ఇమిడిపోయి-
ఏమీ లేదు, లోపల అడవొకటి లేచినట్లు, గాలికి మోహపడి
వూగుతున్నట్లు-

మాటలు మొలకలై పొదలై తీగలై మానులై అల్లుకుపోయి
విస్తరిల్లి పరవశ వేళల్లో పూల సుకుమారాల్ని విడుదల చేస్తూ
వీస్తూ ఆ పక్కనే సాగుతున్న మలుపుల వాగులోకి ఒకట్రెండు
కొమ్మల్ని వాల్చుతూ తడుస్తూ తడి పాటల్ని పాడుకుంటూ-
మాటల పలకరింపులు రాలిపోక మొలకలై పొదలై...
పాడుకుంటూ-

ఒక్కన్నే, చేతుల్లో భుజాల మీదా ఏమీలేదు, కానీ ఖాళీగా
తేలిపోక, కాక, నిండైన సందడి సామాగ్రితో కదుల్తూ, లోపలి
మూలాన-

నక్షత్ర సైన్యంతో పొంగే నింగిలా, కోట్ల చెట్ల అక్షౌహిణుల
బలగంతో ధీర చిత్త ఐన ధరణిలా, ఒక్కన్నే బహుళ ఉత్సవాల
అంతరంగ సమృద్ధి సంపదతో, దారిలో పలుముద్రలవుతూ,
ఒక్కన్నే , కాకపోతే బహుళ సంపదతో-

ఎందరెందరి పలకరింపుల కూడలి లోపలి స్థలి, ఇవాళ
కొత్తగా ఎవరూ పలకరించకపోనీ, కానీ, లేదు నిశ్శబ్దం,
వుంది, పలు ఆత్మీయాల ఆసరాల మోహరింపు సవ్వడి, లోన-

నేనంటే ఇప్పుడూ, ఇవాళనే కాదు, నిన్నామొన్నా
అంతకు మునుపూ ఆ ముందూ, అమ్మ గర్భంలో ఆమె
మెత్తని నిశ్శబ్దపు వాత్సల్యపు పలకరింపును చవినేసుకున్న
నాటి నా చిరుప్రాణపు తొలిరోజు కూడా!

దర్భశయనం శ్రీనివాసాచార్య వరంగల్ జిల్లాలో పుట్టారు. కవి, విమర్శకుడు. ఎనిమిది కవితాసంపుటాలు, ఒక విమర్శనా వ్యాస సంపుటి ప్రచురించారు. కవిత వార్షిక సంకలనాలకు సహ సంపాదకులు. ఆంధ్ర బ్యాంక్‌లో ఉద్యోగం. నివాసం హైదరాబాద్.
email:darbhasayanam@yahoo.co.in



దూరం...?

ఆయాచితం స్పందన

మా ఇల్లు అమ్మేస్తున్నారంట. మా బంధువుల దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. మా ఇల్లు ఎలా ఉందో ఇప్పుడు, ఎన్నో సంవత్సరాలు అయ్యింది చూసి. చివరిసారిగా మా పెద్దన్నయ్య చనిపోయినప్పుడు వెళ్లాను. అయినా ఎంతసేపు, పొద్దున వెళ్లి రాత్రికి తిరిగి వచ్చేసాను. అది కూడా పదిహేనేళ్లు పైనే అయిపోయింది. ఇప్పుడు అక్కడ మా అత్తయ్య పిల్లలు, వాళ్ల కుటుంబం, మా పెద్దన్నయ్య ఉంటున్నారు.

మా నాన్నకు నేను, అన్నయ్య, తమ్ముడు ముగ్గురు పిల్లలం. నా చిన్నప్పుడు మాది ఉమ్మడి కుటుంబం. నానమ్మ తాతయ్య, మేము, మా అత్తయ్య, వాళ్ల పిల్లలు అందరం కలిసి ఒకే ఇంట్లో ఉండేవాళ్లం. మా అత్తయ్యకు చిన్న వయసులోనే భర్త చనిపోయాడు. అందుకని మా నాన్న తన చెల్లెల్ని మా ఇంటికే తీసుకొచ్చారు. అత్తయ్యకు ఇద్దరు అబ్బాయిలు కృష్ణమోహన్, రామ్మోహన్. ఇంటిల్లిపాదికి నేనొక్కదాన్నే అమ్మాయినని నన్ను చాలా అపురూపంగా చూసుకునేవారు. ఎంతో గారాబం చేసేవారు. నా విషయంలో అందరూ చాలా శ్రద్ధ తీసుకునేవారు. నాకంటూ ఒక ప్రత్యేక గది ఉండేది. దానికి ఆ రోజుల్లోనే మా నాన్న అటాచ్డ్ బాత్రూం కట్టించారు. నా గది అంటే నాకు చాలా ఇష్టం. ఎక్కువసేపు అక్కడే ఉండేదాన్ని. నా కోసం మా నాన్న నా గదిలో ఒక పెద్ద నిలువుటద్దాన్ని పెట్టించారు. దాని ముందు గంటలు గంటలు నన్ను నేను చూసుకుంటూ నా లంగాను బొంగరంగా తిప్పుతూ గడిపేసేదాన్ని.

తాతయ్య, నానమ్మలు ఊరిలో ఉన్న ధనవంతులలో ఒకరు. మా కుటుంబమంతా చీరలు నేసేవారు. అది వంశ పారపర్యంగా వచ్చిందంట. నా చిన్నప్పుడే మా తాతయ్య నేయడం మానేసారు. కళ్లు సరిగ్గా కనిపించటం లేదు. చేతులు

వణుకుతున్నా యని అనేవారు. కానీ, ఎవరికైనా పెళ్లి కుదిరితే మాత్రం ఆ అమ్మాయి తరపు నుంచి తానే స్వయంగా దగ్గరుండి నేయించే వారు. మా తాతయ్య మగ్గం వేస్తే పోగు కూడా అటు ఇటు తేడా రాదని మా నానమ్మ గర్వంగా చెప్పేది. మా నాన్న, పెద్దన్నయ్య అదే పని చేసేవారు. చుట్టుప్రక్కల కనీసం మూడు, నాలుగు గ్రామాలు అంతా మా దగ్గరే చీరలు నేయించేవారు. గుడిలో సీతారాముల కళ్యాణానికి కూడా సీతమ్మ వారికి మా ఇంటి నుంచే చీర వెళ్లేది.

ఎవరో తలుపులు కొట్టడంతో మళ్లీ ఈ లోకంలోకి వచ్చాను. ఎదురుగా తమ్ముడు.

"అక్కా ఉత్తరం వచ్చిందా?"

"ఆ వచ్చింది... రారా లోపలికి."

తమ్ముడు సరాసరి వంటింట్లోకి వెళ్లాడు. "అక్కా కొంచం అల్లం టీ పెట్టు!" అని చెప్పి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాడు. చిన్నగా నవ్వి పొయ్యి దగ్గరికి వెళ్లాను.

లండన్లో బయట దొరికేది టీ కాదు. టీ నీళ్లు అని మా తమ్ముడు ఎప్పుడూ తిడతాడు. ఇక్కడ పెద్ద కప్పునిండా నీళ్లు ఉడకబెట్టి అందులో ఒక టీ బాగ్ పడేసి పై నుంచి ఒక్క చుక్క పాలు పోస్తారు. ఆ ఖర్మనే టీ అంటారు. లండన్లో నలభై ఏళ్ల నుంచి ఉంటున్నాను. ఇక్కడ వస్త్రధారణ, భాష, హావభావాలు అన్నీ అలవాటైనా టీ మాత్రం అలవాటు కాలేదు. నా టీ నేనే ఓపిగ్గా చేసుకుంటాను- చక్కగా అల్లం వేసి, పాలు పోసి, మరిగించి.

"ఎందుకు అమ్ముతున్నారంటారా?" తమ్ముడిని అడిగాను.

"దాని కోసమే వెంకట్తో మాట్లాడాను అక్కా ఇల్లు శిథిలావ్యవస్థకు వచ్చిందంట. దాని రిపేర్లకు భారీగా ఖర్చు అవుతుందని వెంకట్ చెప్పాడు. వాడి జీవితమే అంతంత మాత్రం. అంత పెట్టుకోలేనంటున్నాడు పాపం. పెద్ద ఇల్లు కదా! అమ్మితే మంచి ధర వస్తుంది. అందరూ తలా కొంత పంచుకుని ఎవరి అవసరాలకు వారు వాడుకుంటారట."

"ఎవరుంటున్నారు ఇప్పుడు ఆ ఇంట్లో?" గుర్తు చేసుకుంటూ అడిగాను.

"వెంకట్కి ఇద్దరు పిల్లలు. మన అత్తయ్య ఇద్దరి కొడుకులు, వాళ్ల పిల్లలు. వాళ్లు కూడా పెద్దగా అయిపోయారట. పెళ్లిళ్లు చేయాలి, పై చదువులు... ఇలా చాలా బాధ్యతలు.

"ఏమో అక్కా! నాకు ఇల్లు అమ్మేయడం కరెక్టనిపిస్తోంది. మనం అక్కడికి ఎప్పుడు వెళతామో, అసలు మళ్లీ వెళతామో లేదో కూడా తెలియదు. కనీసం వాళ్లకైనా ఉపయోగపడుతుంది కదా!"

నేను ఆలోచిస్తూ అవునని తలాడించాను.

"మరి ఎప్పుడు అమ్ముతారంట?"

" పేపర్లు పంపించాడు. వాటి పై సంతకం చాలు, మనం వెళ్లాల్సిన పని కూడా లేదు."

"అమ్మకుండా ఎంతోకొంత పంపిద్దామా!" అడిగాను.

తమ్ముడు నిరుత్సాహంగా నిట్టూర్చాడు. "చాలాసార్లే పంపించాను అక్కా. కానీ, కొంత డబ్బు సరిపోదు. వంద ఏళ్ల క్రితం ఇల్లు. మొత్తం మరమ్మత్తు చేయించాలి. చాలా ఖర్చు. చివరికి అంత కష్టపడి చేయించాక మనము పోయి ఉండలేము.

"సరే! ఆఫీస్కి లేటవుతుంది వస్తాను" హడావిడిగా వెళ్లిపోయాడు. వెళుతూ కొన్ని పేపర్లు నా చేతిలో పెట్టాడు.

పేపర్లు అటు, ఇటు తిరగేస్తూ వచ్చి సోఫాలో కూర్చున్నాను.

నా చిన్ననాటి ఇల్లు, నేను ఆడుకున్న ఇల్లు. నేను, నా తమ్ముడు, అన్నయ్య సంతోషం పంచుకున్న ఇల్లు. అమ్మతో దెబ్బలు తిన్న ఇల్లు, నాన్న మీద అలిగిన ఇల్లు. రోజుకు రోజులు గడిపిన నా గది. నా గది బయట కిటికీ వెనుక ఒక చిన్న వేప చెట్టు నాటాను. అది సరిగ్గా నా కిటికీ ఎత్తు వరకు పెరిగింది. కిటికీ బయట దాని విచ్చుకున్న కొమ్మలతో అటూ ఇటూ ఊగుతూ ఎవరో మనిషి నిల్చొని ఉన్నట్లు ఉండేది. దానితో చెప్పని రహస్యాలు లేవు. నాకు పద్దెనిమిదేళ్లకే పెళ్లయిపోయింది. నా అత్తగారిది మా ఊరే కానీ, బెంగుళూరులో స్థిరపడిపోయారు. నా భర్త డాక్టర్ ఎఫ్.ఆర్.సి.ఎస్. చదవడానికి నలభై ఏళ్ల క్రితమే లండన్కు వచ్చి, ఇక్కడే స్థిరపడిపోయాము. నేను వచ్చిన కొన్ని సంవత్సరాలకు మా తమ్ముడిని పిలిచాను. నాకు, నా తమ్ముడికి పదకొండేళ్ల తేడా. నేను లండన్ రావడం వాడిపై చదువులకు బాగా ఉపయోగపడింది. వాడు కూడా ఇక్కడే స్థిరపడిపోయాడు. నాకు ఇద్దరు ఆడపిల్లలు. ఇక్కడ పుట్టి, పెరిగిన భారతీయుల్ని పెళ్లి చేసుకున్నారు. వాళ్లకి పిల్లలు. మా తమ్ముడు బ్రిటన్ అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. వాడికి ఇద్దరు పిల్లలు. లండన్లో మాకొక చిన్న ప్రపంచం ఏర్పడింది. ఇప్పుడు అదే పూర్తి ప్రపంచం అయిపోయింది.

ఈ రోజుల్లో రాకపోకలు ఎక్కువైనాయి. కానీ, ఆ రోజుల్లో మూడు సంవత్సరాలకు ఇండియా వెళితే గొప్ప. ఒకవేళ వెళ్లినా బెంగళూరులోనే ఉండిపోయేదాన్ని. ఎయిర్పోర్ట్ సౌకర్యం అక్కడే ఉండేది. అమ్మ, నాన్న అన్నయ్య, నానమ్మ నన్ను చూడటానికి అక్కడికే వచ్చేవారు. తాతయ్య నా పెళ్లికి ముందే పోయారు. ఇక నాకు ఊరు అవసరమే ఉండేది కాదు.

నెమ్మదిగా ఒకళ్ల తరువాత ఒకరు చనిపోయారు. ముందుగా మా అమ్మ, నాన్న, తరువాత నానమ్మ, అన్నయ్య. ఇక రెండేళ్ల కిందట మావారు కూడా అదేదారి పట్టారు. దురదృష్టమంటే అన్నయ్యదే. పాపం కనీసం యాభై ఏళ్లు కూడా నిండలేదు. అన్నయ్య చనిపోయేటప్పటికి ఆయన కొడుకు వెంకట్కి కనీసం ఇరవై ఏళ్లు కూడా ఉంటాయో, ఉండవో? చూస్తూండగానే అన్నయ్య చనిపోయి పదిహేనేళ్లు దాటిపోయింది. అంతకుముందు అప్పుడో, ఇప్పుడో ఊరితో మాటలు ఉండేవి. ఇప్పుడు ఆ సంబంధం కూడా తెగిపోయింది. మా తమ్ముడు అప్పుడప్పుడు ఫోన్ చేసి విషయాలు తెలుసుకుంటాడు. అవి నా చెవిన వేస్తూ ఉంటాడు.

ఇప్పుడు ఇక్కడ భారతీయులు చాలామందే ఉన్నారు. తెలుగువారు కూడా చాలా ఎక్కువే. కొత్త కొత్త తెలుగు సంస్థలు మొదలైనాయి. ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు అవుతున్నాయి. నాకు కూడా చాలామందే పరిచయమయ్యారు. ఎంతోమంది స్నేహితులు ఉన్నారు. వాళ్లు అప్పుడప్పుడు వచ్చే పిల్లలు, మన వాళ్లు అసలు మన దేశానికి దూరమయ్యామనే ఆలోచనే రాదు. అయినా ఏదో అసంతృప్తి, నిర్లిప్తత, ఏదో కొరత.

రెండు రోజుల తరువాత తమ్ముడు నా దగ్గరకు వచ్చాడు. సంతకాలు చేసిన పేపర్లు వాడికి ఇచ్చాను.

"ఏంటక్కా బాధపడుతున్నావా?"

వేలాడిపోయిన నా ముఖం చూసి అడిగాడు. "లేదురా! బాధ అంటే బాధ కాదు. కానీ, ఎందుకో బెంగగా ఉంది. ఎంతయినా మన చిన్ననాటి ఇల్లు కదా!"

"అవును!" వాడూ తలాడించాడు.

"నాకు కుదిరితే, అమ్మేసే ముందు వెళ్లి చూద్దామని అనుకున్నా కానీ, కుదిరేటట్లు లేదు. ఏం చేద్దాం?" మెల్లగా నిట్టూర్చాడు.

"అక్కా! నువ్వెనా వెళ్లి చూసిరా రాదు," వాడు కొంచెం మొహమాట పడుతూ అడిగాడు.

ఒక్క నిమిషం నేను ఆలోచనలో పడ్డాను. నిజమే, చెప్పుకో దగ్గ బాధ్యతలు ఏమీలేవు. ఇప్పుడు రోజుకో ఫ్లైట్ హైదరాబాద్‌కి. వెళ్లి రెండు వారాలు ఉండి వచ్చేయొచ్చు. ఎక్కడ పడితే అక్కడ కార్లు, ఆటోలు అన్ని సౌకర్యాలు ఉన్నాయట. మా అమ్మ తరపున చుట్టాలు కొంతమంది హైదరాబాద్‌లో ఉన్నారు. మా పిన్ని, మామయ్య పిల్లలు. కావాలంటే వాళ్ల దగ్గర ఉండొచ్చు. ఆలోచనలు ప్రణాళికరూపంలో పరిగెడుతున్నాయి.

"సరే రా! వెళతాను!" ఉన్న ఫళాన అనేశాను. తమ్ముడు నా అంగీకారాన్ని కాసేపు నమ్మలేకపోయాడు.

"వెళతావా? నిజంగా వెళతావా? తప్పకుండా వెళతావా?" ఇలా రకరకాలుగా అడిగాడు. వాడి సంతోషానికి అవధులు లేవు. నాకూ సంతోషంగానే ఉంది. ఇన్నేళ్ల తరువాత హైదరాబాద్‌కు ప్రయాణం.

హైదరాబాద్ చేరగానే మా బంధువులు ఏర్పాటు చేసిన కారులో సరాసరి మా ఊరికి బయలుదేరాను. హైదరాబాద్ నుంచి మా ఊరికి నాలుగు గంటలు ప్రయాణం. మధ్యలో భోజనాలనీ, టీలనీ అయిదు గంటలు పట్టింది. చేరేటప్పటికి నాలుగు కావస్తుంది. ఊరిలోకి వెళుతుంటే ఎందుకో తెలియదు సన్నని అలజడి. సంతోషమో, భయమో అర్థం కావటంలేదు. ఊరు గుర్తుపట్ట లేనంత కాకపోయినా చాలావరకు మారిపోయింది. రోడ్లు పడ్డాయి, వీధి దీపాలు వచ్చాయి, పెద్ద పెద్ద దుకాణాలు. రద్దీ పెరిగి పోయింది. బయటికి తల పెట్టి చూసాను. అన్నీ కొత్త మొఖాలే. వీధుల్ని గుర్తుచేసుకుంటూ, ఇంటికి వెళ్లాను. పెద్ద స్థలం మధ్యలో పెంకుటిల్లు. అంతకు ముందు ప్రహారి గోడ, దానికి గేటు ఉండేవి. ఇప్పుడు కూలిపోయినట్టుంది. తలుపులు తెరిచే ఉన్నాయి. నా కోసమే ఎదురు చూస్తున్నారు అనుకుంటూ, లోపలికి తొంగి చూస్తూ దగ్గరకు వెళ్లాను. నన్ను గమనించి లోపలి నుండి ఒక అమ్మాయి బయటకు వచ్చింది.

"మీరూ..." అనుమానంగా అడిగింది.

"నేను...! రాఘవయ్య కూతుర్ని లండన్ నుంచి...!

"పెద్దమ్మా..." గట్టిగా ఒక అరుపు అరిచింది.

"మేమంతా నీకోసమే చూస్తున్నాము!"

''అమ్మా నాన్నా, మామయ్యా... అందరూ రండి... పెద్దమ్మ వచ్చేసింది." పెద్ద కేక వేసి నా వైపు తిరిగి, "నేను మీ అత్తయ్య చిన్న కొడుకు రాంమోహన్ చిన్న కూతుర్ని. మీరు నన్ను చూడ లేదు. ఎందుకంటే నేను అప్పుడు ఇంకా పుట్టలేదు." గట్టిగా నవ్వింది.

అందరూ హడావిడిగా బయటకు వచ్చారు.

చాలాసేపు ఎన్నో మాట్లాడారు. మంచీ చెడూ అన్ని విషయాలు అడిగారు. వాళ్ల కష్టాలు చెప్పుకున్నారు. మా అన్నయ్య కొడుకు, మా బావలు ఉమ్మడిగా ఇంకా చీరలే నేస్తున్నారు. కాని, ఇప్పుడు కాటన్ చీరలు కొనేదెవరు? ఇప్పడంతా ఫ్యాన్సీ పట్టు చీరలు ఎక్కువైనాయి. చీరలు నేసేవారి సంఖ్య కూడా బాగా పెరిగి పోయింది. పెద్ద పెద్ద షాపింగ్ సెంటర్లు, వాళ్ల హోల్‌సేల్ ధర తగ్గింపులు ముందు ఈ చిన్న చిన్న వ్యాపారాలు, వారి బ్రతుకులు చితికిపోయాయి. ఇల్లు అమ్మిన డబ్బుతో కొంచెం పెద్ద ఎత్తున చీరల వ్యాపారం మొదలుపెడదామని వీళ్ల ఆలోచన. చెప్తున్నంత సేపూ నేను ఎక్కడ ఇల్లు అమ్మనివ్వకుండా అడ్డుపడతానోనన్న భయం వాళ్ల కళ్లల్లో స్పష్టంగా కనిపించింది.

కాసేపటికి భోజనాలు అయ్యాయి. నా కోసమని ప్రత్యేకంగా ఒక గదిని శుభ్రం చేసి ఉంచారు. సమయం తేడా వల్ల కావచ్చు, రాత్రి నిద్రపట్టలేదు. మెల్లగా ఇల్లంతా చూడటం మొదలుపెట్టాను. ఇల్లు ఒక భాగం బాగా కూలిపోయింది. పెద్ద వాన పడితే నీళ్లు ఇంట్లోకొస్తాయి కూడా. కానీ, ఇల్లు చాలా పెద్దది కావటం వల్ల మరోవైపు వాడుకుంటున్నారు. గోడల నిండా పగుళ్లు వచ్చేసాయి. పగుళ్ల నుంచి చిన్న చిన్న మొక్కలు కూడా మొలిచాయి. మెల్లగా నా గదివైపు వెళ్లాను. తలుపు తెరిచి చూసి నా కళ్లను నేనే నమ్మ లేకపోయాను. నా గది మొత్తం మారిపోయింది, గుర్తుపట్ట లేనంతగా. లైటు వేయడానికి ప్రయత్నించాను, వెలుగటంలేదు. మొబైల్లో లైట్ పెట్టి నాలుగు వైపులా చూసాను. గది మొత్తం బూజు పట్టేసింది. పూర్తిగా లోపలికి వెళ్లే దారి లేదు. పాత సామాన్లు ఇష్ట మొచ్చినట్లు పడి ఉన్నాయి. కిటికీవైపు లైటు వేసాను. బయట వేపచెట్టు మొదలు కనిపిస్తోంది. చెట్టు పెద్దదయిపోయింది.

వచ్చి మూడు రోజులు అవుతుంది. రోజు ముందుకు జరగడం లేదు. లండన్‌కు వెళ్లిన కొత్తలో ఎలా ఉండేదో ఇప్పుడు అచ్చం అలాగే ఉంది. దేనికీ లోటు ఉండదు. కానీ, మాట్లాడే వారే ఉండరు. అందరూ పలుకరిస్తారు కానీ, ఆ పలకరింపులో స్నేహం, ఆత్మీయత కనిపించవు. సదుపాయాలు ఉంటాయి కానీ, స్వేచ్ఛ ఉండదు. ఇక్కడా నా పరిస్థితి అంతే. అందరూ ఎవరి పనుల్లో వారు. సమయానికి కాఫీ, టిఫిను పంపిస్తారు. మర్యాదలు చేస్తారు. అంతే! అంతవరకే. ఇక్కడ కూడా నాకు అదే అసంతృప్తి, నిర్లిప్తత.

మరుసటిరోజు నేనే చొరవ తీసుకొని వంట గదివైపు వెళ్లాను. వెంకట్ భార్య తన అత్త మీద, మా అత్తయ్య కోడలు తన అత్త మీద ఏదో చెప్పుకుంటూ, తిట్టుకుంటున్నారు. చిన్నగా నవ్వుకుని లోపలికి వెళ్లాను. నన్ను చూసి ఇద్దరు ఠక్కున మాట మార్చేసారు. నాతో ఏదో పొడిపొడిగా మాట్లాడి బయటపడ్డారు. తరువాత మామూలే. అంతా అంటీ అంటనట్టే!

మరో రెండు రోజులు ఇలా గడిచాయి. ఇంకా పదిరోజులు ఉండాలా?! అబ్బా...! నాకు విసుగు వచ్చేసింది. ఏం తోచటం

లేదు. మరుసటిరోజు ఆ వీధి ఆడవాళ్లంతా ఆవకాయ పెడదామని ఇంటికి వచ్చారు. నేను పని ముగించుకుని పెరట్లోకి వెళ్లాను. చాలామందే ఉన్నారు. నన్ను చూసి ఆశ్చర్యంతో, 'ఎవరు...?' గుర్తు చేసుకుంటూ అడిగారు.

" రాఘవయ్య కూతుర్ని" సమాధానం.

"ఫారెన్లో ఉంటున్నావు కదా?!" ఇంకొకరు అడిగారు.

"అవును! లండన్‌లో..." అంటూ వచ్చి కూర్చున్నాను.

అందరూ ప్రశ్నల వర్షం మొదలుపెట్టారు. ఉన్నట్టుండి మా అత్తయ్య తన చిన్న కోడలి మీద విరుచుకుపడింది.

"ఏటు చూస్తున్నావే... ఇన్ని సంవత్సరాలు అవుతున్నా ఎంత నూనె కలపాలో తెలియదా?" అంటూ ఇంకా నాలుగు తిట్లు తిట్టింది.

కాస్సేపు అందరూ నిశ్శబ్దం అయిపోయారు. నేనే ఏదో మాటలు కలుపుదామని, "పచ్చడి బాగా కుదిరింది అనుకుంటాను, చూద్దాం" అంటూ చేయి కడుక్కొని పచ్చడిలో పెట్టా. అంతే! 'అయ్యో తడిచేయి,' అని మా అత్తయ్య కేక వేసింది. అందరూ నావైపు తిరిగారు! క్షణంపాటు వణుకు వచ్చింది. తప్పు చేసినదానిలా తల దించుకున్నాను. ఎన్ని తిట్లు పడతాయో అని అనుకున్నాను. కానీ, అత్తయ్య నావైపు ఒక్కక్షణం చూసి ఫక్కున నవ్వింది.

"లండన్ వెళ్లి అంతా మరిచిపోయావా?!" నవ్వుతూ అంది. అందరూ శృతి కలిపారు. ఈ హడావిడిలో మరో రెండు రోజులు గడిచాయి.

ఎలాగో అలా మిగిలిన రోజులు గడిపేసాను. ఇక మరుసటి రోజే ప్రయాణం. ఆరోజు మా ఊరి గుడి చూసొద్దామని బయలు దేరాను. గుడికి వెళ్లే దారిలో ఒక వాగు వస్తుంది. మొత్తం పాకురు పట్టేసి ఉంది. నా చిన్నప్పుడు నీళ్లు ఎంత స్వచ్ఛంగా ఉండేవో. ప్రతిబింబం కనిపించేది. దాన్ని చూస్తూ గుడి చేరాను. వెళ్లేటప్పటికీ పూజారి గుడి మూసేస్తున్నారు. ఆయన్ని చూస్తూనే గుర్తుపట్టాను.

దగ్గరకు వెళ్లి, "బాగున్నారా?" అని ఆప్యాయంగా అన్నాను.

"మీరూ...!" పూజారి అడిగారు అనుమానంగా.

"నేను రాఘవయ్య కూతుర్ని. లండన్ నుండి వచ్చాను!"

'ఓ! నువ్వా అమ్మా... బాగున్నావా ఎన్ని రోజులైంది వచ్చి," సంతోషంగా అడిగారు.

మాట్లాడుతూ వచ్చి గుడి మెట్లమీద కూర్చున్నాము. "నీకు గుర్తుందా అమ్మా... నీ పెళ్లి మా నాన్నే చేసారు." అంటూ ఆయన ఎన్నో విషయాలు చెబుతున్నారు. అంతలో మా పక్కనే ఉన్న చిన్న బాబు ఏడవడం మొదలుపెట్టాడు.

"ఎందుకేడుస్తున్నావురా...!" ముద్దొచ్చి అడిగాను.

"నా బొమ్మ విరిగిపోయింది," అన్నాడు.

"ఇంకోటి కొనిస్తాలే!" ఊరడించాను.

"ఊహు.! నాకిదే కావాలి. ఇది నాది. ఇంకోటి వద్దు," అన్నాడు మారాం చేస్తూ.

పూజారి వాడిని చూసి గట్టిగా నవ్వారు.

"వీడిని చూస్తే నువ్వే గుర్తిస్తున్నావమ్మా...!"

"పెళ్లి అప్పగింతలప్పుడు నువ్వు కూడా అంతే. అందరినీ వదిలేసి, మీ ఇంటి వెనుక ఉన్న వేపచెట్టుని, నీ గదిలో ఉన్న నిలువు టద్దాన్ని కౌగిలించుకొని ఎంతసేపు ఏడ్చావో. మేమంతా నిన్ను చూసి ఎంత నవ్వామో. మీ అత్తగారు ఇంకోటి కొనిస్తాను అంటే, ఇదిగో ఇదే సమాధానం ఇచ్చావు!"

ఆ తరువాత ఆయన ఏం మాట్లాడారో ఒక్క ముక్క వినిపించలేదు. కాలి కింద నేల కదిలినట్టయ్యింది. అప్పుడు అంత ఏడ్చాను. ఇప్పుడు కనీసం బాధ కూడా అనిపించడంలేదు. ఎందుకనీ?! అప్పుడు, జీవం లేని ప్రతి వస్తువు కూడా నాది అనుకునే దాన్ని. ఇప్పుడు నా కుటుంబంతో సహా ఏదీ నాకు సంబంధం లేదని అనుకుంటున్నాను. నేను ఎంత మారిపోయాను. నేను దూరం వెళ్లిపోయి వీళ్లంతా నన్ను కలుపుకోలేదనుకున్నాను. నేను మారిపోయి, ఊరు గుర్తుపట్టలేదని అనుకుంటున్నాను.

ఒక్కసారైనా అది నాది అనుకొని ఉంటే, ఆ కోడళ్లు చెప్పుకునే రహస్యాల్లో నేను ఉండేదాన్ని. మా అత్త చొరవగా తిట్టే తిట్లల్లో నేను ఉండేదాన్ని. కష్టసుఖాలు పంచుకుంటాననే నమ్మకంలో నేను ఉండేదాన్ని. కానీ, నేను ఎక్కడా లేను.

అన్నీ గుర్తుపట్టలేనంత మారిపోయాయి అనుకున్నా. వాస్తవానికి నా గది నన్ను గుర్తుపట్టలేదు. కాసేపు ఉండి సేద తీర్చుకుని పోయే బాటసారి అని నా చెట్టు నన్ను పలుకరించలేదు. ఎవరో అనుకొని వాగు నా ప్రతిబింబాన్ని నాకు చూపించలేదు.

లేదు నేను అలా జరగనీయను. ఎప్పటికీ జరగనీయను అనుకున్నా స్థిరంగా. నా ఊరిని నన్ను మరచిపోనివ్వను. ఇవి నావి, ఊరు నాది, నా సొంతం, నా అస్తిత్వం. ఏ పరిస్థితుల్లోనూ నా ఇంటిని వదలను, అమ్మేను. తమ్ముడికి చెప్పి డబ్బు పంపించమంటా.

వీళ్ల వ్యాపారానికి ఎంత కావాలో సహాయం చేస్తాను. ఎంత ఖర్చయినా నా ఇంటిని బాగుచేయించుకుంటాను. సంతోషంలో అడుగులు వేగంగా పడుతున్నాయి. ఆ వేగానికి కళ్లలో నీళ్లు నిలువకుండా జారిపోతున్నాయి. ఇన్నాళ్లు నేను ఏది కోల్పోయానో అర్థమై మనసు తృప్తిగా అనిపించింది. అవును నేను కోల్పోయింది నన్ను. కానీ ఇప్పుడు అందరికీ నన్ను నేను గుర్తు చేస్తాను. నా గదితో, నా చెట్టుతో ఈ మట్టితో మళ్లీ స్నేహం చేస్తాను. నా ఊరికి నన్ను నేనుగా మళ్లీ పరిచయం చేసుకుంటాను.

"నేను రాజేశ్వరీని! మాది ఈ ఊరే!"

గత పన్నెండేళ్లుగా తెలుగు నేలకు దూరంగా లండన్‌లో ఉంటున్న ఆయాచితం స్పందన రాసిన తొలి కథ ఇది. ఇటీవలే ఒక నవల కూడా రాశారు.

email: spandana1812@yahoo.com

నిద్రాభంగం

వైదేహి శశిధర్

ఒక్కసారిగా మెలకువ వస్తుంది
మంద్రంగా హాయిగా సాగుతున్న జలతరంగిణి
వాయిద్యం ఉన్నట్లుండి ఆగిపోతుంది

అలల అలజడి కూడా లేకుండా
మౌనంగా పారే ఓ సెలయేటి పాట
అంతలోనే మూగపోతుంది

దట్టమైన అరణ్యాల లోతుల్లో
ఏ మారుమూలో నిగూఢంగా దాగి
ఓ రాకుమారి ఏకాగ్రతతో నేస్తున్న
పల్చని పట్టుదారం చటుక్కున తెగిపోతుంది

సాటిన్ పరదాల్లా గదంతా కమ్ముకున్న చీకటి తెరలు
క్రమక్రమంగా పల్చబడతాయి
దృశ్యాదృశ్యంగా తారాడే రాత్రి దీపపు సన్నని వెలుగు రేఖలు
మినుకు మినుకున అశాంతిగా ఎర్రని కళ్లల్లో
గుచ్చుకుంటాయి

స్తబ్దమైన నిశ్శబ్దం ఊపిరాడనట్లుఅసహనంగా
గది మూలలో మునివేళ్ల మీద నిలబడుతుంది
కిటికీ బయట బంధించబడ్డ
ఈదురు గాలి చలికి అస్పష్టంగా వణుకుతుంది

మిగిలిపోయిన రాత్రంతా
నేను ఇలాగే తెగిన సితార్ తంత్రుల్ని
ముడేయాలని ప్రయత్నిస్తూ గడిపేస్తాను

అంతలోనే
తూర్పుకన్య తెల్లని నవ్వు తెరలు
ఆకాశమంతా ముగ్గు రేకులై విచ్చుకుంటాయి

డా॥ వైదేహి శశిధర్ స్వస్థలం, వైద్యవిద్యాభ్యాసం ఆంధ్ర మెడికల్ కాలేజీ, విశాఖపట్నం. వృత్తి ఫిజీషియన్. కుటుంబంతో కలిసి న్యూజెర్సీలో ప్రస్తుత నివాసం. తెలుగు, ఇంగ్లీషు భాషలలో కవిత్వం వ్రాస్తుంటారు. నిద్రిత నగరం, పునశ్చరణం సంకలనాలు వెలువరించారు. నిద్రితనగరం ఇస్మాయిల్ అవార్డు అందుకుంది. కవిత్వం, సాహిత్యం, సంగీతం అభిమాన విషయాలు. email:vaidehisasidhar@gmail.com

పరిమళం దొంగిలించారు

ఆశారాజు

దొంగతనం జరిగింది
నాకు భంగపాటు కలిగింది
ఎంత సఖ్త్ కాపలా పెట్టినా
ఇంటి మీద దాడి జరిగింది

మూసిన తలుపులు మూసినట్టే వున్నాయి
పెట్టిన కిటికీలు పెట్టినట్టే వున్నాయి
ఎట్లా జరిగిందో ఏమో
గొళ్లెం ఘళ్లు మనలేదు
దర్వాజా కిర్రు మనలేదు
తెల్లవారకముందే
పెద్ద దొమ్మి మాత్రం జరిగింది

అడుగులో అడుగేసుకొంటూ
అడుగడుగూ వెదికి చూశాను
బీరువాలో సర్దిన డబ్బులు
ఒక్కటీ పక్కకు జరిగిపోలేదు
మేకుకు తగిలించిన బట్టలు
జారిపోయి కింద పడిపోలేదు
ఇల్లేమో కొల్లగొట్టబడింది

పైసా ద్వేషం స్వార్థం
ఖతర్నాక్ రాకాసులు
ఏ బంధాలనైనా విడదీసే
ఇనుపగొళ్ల పంజాలు

ఇన్నాళ్లు లోకమంతా తిరిగి
ఇరుగు పొరుగులకు తెలియకుండా
కొంత విలువైన నిధిని తెచ్చాను
కనిపించని ఈ కలల వెల్తురు
కనికరం లేని వాళ్లకెలా తెలిసిందో
అందుకే అదునుచూసి బెదరగొట్టి
బందిపోట్లు కన్నా భిన్నంగా కన్నమేశారు
మనుషుల్ని కలపడానికి
దాచుకొన్న పరిమళాన్ని
దారుణంగా దోచుకెళ్లారు

దొంగతనం జరిగింది
నా ఇల్లిప్పుడు
అత్తర్ వొలకబోసిన
ఉత్త సీసాలా మిగిలింది

ప్రఖ్యాత ఉర్దూ షాయర్ 'డా. రహత్ ఇందూరి'గారి
ఒక షేర్ ఆధారంగా

హైదరాబాదును నిత్యం తన కవిత్వంతో శ్వాసించే ఆశారాజు ఇంతవరకూ 18 కవితా సంపుటాలు వెలువరించారు. రెండు సంపుటాలు కన్నడంలోకి అనువాదమయ్యాయి. కొన్ని కవితలు ఇంగ్లీషు, హిందీ, తమిళంలోకి అనువాదమయ్యాయి. నివాసం హైదరాబాదు. email: asharaju.poet@gmail.com

మూడు తుడుపు కవితలు

వేలూరి వేంకటేశ్వరరావు

నేను స్వయంగా కవిత్వం రాయలేనన్న విచారం ఏ ఒక్కరికీ ఉండనక్కరలేదు. వాడెవడో కవిత్వం రాసేస్తున్నాడన్న ఆక్రోశమూ ఉండనక్కరలేదు. ఎవరో రాసిన వచనమో, పద్యాలో తీసుకొని, అక్కడక్కడ కొన్ని పదాలు (నీ మటుకు నీకు అవి శుష్కపదాలే!), అవసరమయితే కొన్ని పూర్తి వాక్యాలు కూడా 'కత్తిరించి', లేదా 'చెరిపేసి' మిగిలిన మాటలని ఉన్నపట్టాన ఇంచక్క పొందుపరచటం 'Erasure Poetry' అంటారు. (పద్యాలతో ఈ పని సాధించటం కొంచెం కష్టం; అభ్యాసం చేస్తే ఈ పని అసాధ్యం మాత్రం కాదు.) దీన్ని మనం తెలుగులో తుడుపు కవిత్వం అని అందాము. ఈ ప్రక్రియ పాశ్చాత్యదేశాల్లో మామూలే! ఇటువంటి కవిత్వం ప్రచురించి ప్రోత్సహించే అచ్చు పత్రికలు, అంతర్జాల పత్రికలూ కూడా ఉన్నాయి. తెలుగులో ఇది కొత్త ప్రక్రియేనని చెప్పవచ్చు.

సాధారణంగా ఈ ప్రక్రియలో మూలార్థం పూర్తిగా మారదు. కానీ, అలా కాకూడదని నిర్దిష్టమైన నిబంధనలు ఏవీలేవు. ఒక్కొక్కసారి, మూలాన్ని పూర్తిగా వ్యతిరేకించే అర్థం కూడా రావచ్చు. అయితే ఒకేఒక్క సూత్రం పాటించడం అవసరం. మార్పు చెయ్యబడ్డ ప్రతిదీ 'కవిత'లా కనపడాలి. చదివితే కవితలా వినపడాలి. అంతే!

'ఈనాడు' మన తెలుగునాట విరివిగా అమ్ముడు పోతున్న దినపత్రిక. ఆ పత్రికలో వచ్చిన సంపాదకీయాలు ఎంతమంది శ్రద్ధగా చదివి స్పందిస్తారో నామటుకు నాకు తెలియదు. అయితే, కొన్ని సంపాదకీయాలలో ప్రభుత్వం, రాజకీయ నాయకులు, భాషాభిమానులు, దేశాభిమానులూ 'ఇలా చేయాలి; అలా చేయాలి,' అని దేశాభివృద్ధికి, భాషాభివృద్ధికీ, పరిపాలనాభివృద్ధికీ (ఇది క్రమాలంకారం కాదు!) రాసే 'నీతి' బోధనలు గా ఉంటాయి. నీతులు చెప్పటం ఎవరికిమాత్రం చేతకాదు? ఆచరణలో ఈ నీతులన్నీ వమ్మే అవుతాయని మనకే కాదు; ఆ రాసేవాళ్లకి కూడా తెలుసు.

ఈ సంవత్సరం (2017) ఫిబ్రవరి 22, 23, 25 తారీకుల్లో వచ్చిన మూడు 'ఈనాడు' సంపాదకీయాలు తీసుకొని, వాటి ఆధారంగా తయరుచేసిన ఈ క్రింది మూడు తుడుపు కవితలు మీకోసం...

ఈ మూడు తుడుపు కవితలూ ఎవరినో ఎద్దేవా చెయ్యటానికి రాశానని ఎవరన్నా నా మీద అభాండం వేస్తే, వారి పాపాన వారే పోతారు.

అమ్మ భాషకు అందలమేదీ?

'ప్రతి భాషా ఓ దేవాలయమే.
కొలువై ఉండేది మాట్లాడే వారి ఆత్మే'
తరంతరం నిరంతరంగా ఓ సజీవ స్రవంతి
జాతికి అస్తిత్వ పతాక, ఆత్మగౌరవ ప్రతీక.

ఎందరెందరో మహామహుల
మది దోచుకొన్న తెలుగు నుడికారం
తెలుగు నేలపై మమకారం
కొరవడింది.

అమ్మభాష అంపశయ్య పైకి
ఎక్కడ వేసిన గొంగడి అక్కడే.

భాషా అధ్యయనం అభివృద్ధి నిమిత్తం
మాతృభాషాభిమానులు ఆవేదన
కేంద్రం నుంచి ఏటా వంద కోట్ల రూపాయలు!

భావితరాలకు వెలుగుబాట
తెలుగును తీర్చిదిద్దాలన్న తపన

అమ్మభాషను తేజోవంతం చెయ్యడానికి
నిధుల కొరత ఎక్కడుంది?

పదో తరగతి దాకా తమిళాన్ని బోధించాలని
తమిళనాడు చట్టం,
ఒకటో తరగతి నుంచి ఆంగ్ల మాధ్యమంలో బోధన
మొదలుపెట్టే యత్నాలు ఇక్కడ.

ఇళ్లలో భాషలోనే పిల్లలకు చదువు
ఆంగ్లభాషపై అనుచిత మోజు.
భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు
నాందీవాచకం పలికిన తెలుగునాట-
అమ్మభాషకు అనాదరణ.
అమ్మభాషను అందలం ఎక్కించాలి,
నుడికారపు తలకట్టు తీవితో!

ధనస్వామ్యం ఉక్కుపాదం

ఏటా రెండున్నర కోట్ల కొత్త ఓటర్లు
భారతావని- నిశ్చయంగా
ప్రజాస్వామ్య మేరునగం.

ప్రజాతంత్ర క్రతువు దశ
దేశీయంగా జనస్వామ్యం
మేడిపండు చందం.

నేరం, రాజకీయం అద్వైతసిద్ధి
ఎన్నికల తతంగం ఎండమావి.
ఎన్నికల్లో అభ్యర్థుల
ప్రలోభాల జాతరలో
జనస్వామ్యాన్ని
ధనస్వామ్యంగా
దిగజార్చిన పార్టీలే అన్నీ!

ఓటర్లకు చీరలు సారెలు,
బంగారు ముక్కుపుడకలు,
వెండి భరిణెలు, మద్యం,
మాదక ద్రవ్యాలు, నగదు
చాపకింద నీరులా!

ఇండియాలో ఎన్నికలంటే
ధనస్వామ్య దాదాగిరి.
విషంలో పుట్టిన పురుగుకు
విషమే ఆహారమైనట్లు
'నలుపు'ను 'తెలుపు' చేసే
వాహకాలుగా ఏజెంట్లు,
గూండాతండాలను ఉసిగొలిపి
అరాచక ధోరణులు.

ఓట్ల కొనుగోళ్ల దందా
భారత దేశ ఎన్నికలలో
విషపూరిత కశ్మలాన్ని
ప్రక్షాళన చేసేందుకు
పూనిక వహించాలిప్పుడు!

అతిసర్వత్ర వర్జయేత్

కూడు గుడ్డ నీడ,
మందికి అవి అందలేదు.
అందినవాటితో
మనిషి తృప్తి చెందనూ లేదు.

పాతరేసిన సిరిసంపదలు ఉన్నా-
మితములేక ధనంబు
నవనిధులు, సంపాదించాలనుకుంటాడు, మనిషి.
కుబేరుణ్ని మించిపోవాలని,
తొమ్మిది పాతరల్ ధనము
గలదటంచు గర్వించు.

లెక్క ఇడరాని రొక్కంబులు
కూడబెట్టిన సంపన్నులు ఎందరో!
పదకొండు పాదరేఖలు
పదహలరేఖలు' ఉంటే కుబేరుణ్ని మించిపోతారట!

మించిపోయిన మాత్రాన చాలదన్నారు.
పరమశివుడు వస్త్రాలకు నోచుకోకుంటే,
కుబేరుడు సంపన్నుడని ఎలా?

సంపదల సార్థకత పెంచుకోవడంలో కాదు,
పంచుకోవడంలో ఉంటుందని,

సుష్ఠుగా భోంచేయడం మనిషికి భోగం.
భోగాలు తీరాక ధనాన్నంతటినీ దానధర్మాలకు.

దాన పరోపకారగుణ ధన్యత
చిత్తములో లేనివారు వివేకశూన్యులు.

దాన ధర్మాదులు ప్రదర్శన కోసం కాదన్నది తీర్మానం.
'శుభ్రతను ఆచారం నేర్పుతుంది,
సభ్యతను సంప్రదాయం అలవరుస్తుంది'
భోగం దానం- ధనానికి చెందిన ఆచార సంప్రదాయాలు.
ఆచారాల పేరుతో డబ్బు ఖర్చు- అపచారం అపరాధం.

'ధనమువలనను ధర్మంబు' కాకుండా
'ధనమువలనను గర్వంబు' కావడం విచారకరం!

అరవై ఏళ్లుగా అమెరికాలో ఉంటున్న వేలూరి వెంకటేశ్వరరావు యాభై పైగా కథలు రాసి రెండు కథాసంపుటాలు ప్రచురించారు. న్యూక్లియర్ సైంటిస్ట్ అయిన వీరు ఎన్నో సాహిత్య వ్యాసాలు రాశారు. ఒరియా తెలిసిన వీరు సౌభాగ్య మిశ్ర కవిత్వాన్ని తెలుగులో అనుసృజన చేశారు. జార్జియాలోని అట్లాంటా దగ్గరి దులుత్‌లో నివాసం.
email: vrveluri@gmail.com



నూటొకటో మార్కు

జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి

"మావాడు రానురానూ పెద్ద వేస్టుబాడీలా తయారౌతున్నాడు."

"అంత కానిపనేం చేశాడు?"

"ఒకటా రెండా అన్నీ పనికిమాలిన పనులే."

"ఒక తండ్రిగా నీకు వాడిమీద ఇలాంటి అభిప్రాయం ఉండటం మంచిది కాదు."

"వినేవాడు దొరికితే నేనూ చెబుతానిలాంటి సవాలక్ష సూక్తులు. ఏదైనా తనదాకా వస్తేగానీ తెలీదు."

"మీ తండ్రీ కొడుకుల గొడవలోకి నన్ను లాగద్దు. నీకు చెప్పాలనిపిస్తే చెప్పు లేకపోతే మానెయ్."

"లక్షల్లక్షలు పోసి మెడిసిన్ చదివిస్తున్నదెందుకు? వాడి భవిష్యత్తు కోసమే కదా?"

"అలా నువ్వనుకోవడంలో నీ తప్పేం లేదు ఎందుకంటే చదివించేప్పుడు తల్లిదండ్రులందరూ అలాగే అనుకుంటారు. కానీ, తమ అభిప్రాయం తప్పని అర్థమయ్యేసరికి జీవితం వాళ్ల చేతుల్లోంచీ జారిపోతుంది."

"తల్లిదండ్రుల ఆశలూ ఆశయాల గురించి ఇంకెప్పుడైనా మాట్లాడుకోవచ్చుగానీ ముందు వాడిని సరిదిద్దడానికి ఏం చెయ్యాలనే దాని గురించి ఆలోచించు."

"సరే చెప్పు. ఏమిటి వాడి ప్రాబ్లం? బాగా చదవట్లేదా మంచి మార్కులు తెచ్చుకోవడం లేదా చదివిందాన్ని అర్థం చేసుకోవట్లేదా లేక చదివింది గుర్తుండట్లేదా?"

"అవన్నీ ఓకేగానీ ఒకటే పెద్ద ప్రాబ్లం."

"అవన్నీ ఓకే అయితే ఇంకా ప్రాబ్లం ఏముంటుంది? కొంపదీసి గాళ్ ఫ్రెండ్స్‌తో తిరగడం లవ్వులో పడ్డం లాంటి ప్రాబ్లమ్సా ఏంటి?"

"అబ్బే అలాంటిదేం లేదు"

"పోనీ అబద్దాలు చెప్పడం, క్లాసులు ఎగ్గొట్టడం... సినిమాలూ షికార్లూ..."

"ఊహూ"

"మరింకేంట్రా అంత పెద్ద ప్రాబ్లం?"

"వీడికి వందకి వంద మార్కులు రావలసింది. కానీ తొంభై తొమ్మిదే వచ్చాయి"

"కేవలం ఒకే ఒక్క మార్కు తగ్గినందుకు నువ్వంతగా హైరానా పడి వాడి గురించి లేనిపోనివి ఊహించుకుని ఇంత దూరం పరిగెత్తుకు రావాల్సిన అవసరం ఉందంటావా?"

"రేయ్ నీలాంటివాడి దగ్గరకి పెర్సనల్‌గా మాట్లాడ్డానికి అప్పాయింట్‌మెంట్ తీసుకుని మరీ వచ్చానంటే అవసరం లేకుండానే వస్తానంటావా."

"అయితే చెప్పు ఆ ఒక్క మార్కూ కూడా వెయ్యమని నన్ను రికమెండ్ చెయ్యమంటావా?"

"వెటకారాలొద్దు. వాడికా ఒక మార్కూ తగ్గడానికి కారణం ఏమిటో బోధపడటం లేదు."

"ఇది మరీ బాగుందిరోయ్. వాడిని ఒక్కమాట అడిగితే సరిపోయేదానికి రెండురోజుల ముందే అప్పాయింట్‌మెంట్ తీసుకుని కన్సల్టేషన్ ఫీజు కట్టి మరీ మన స్నేహాన్ని అవమానించాలంటావా చెప్పు?"

"సారీరా నిన్ను బాధపెట్టడం నా ఉద్దేశం కాదు. ప్రొఫెషన్ ప్రొఫెషనే ఫ్రెండ్‌షిప్ ఫ్రెండ్‌షిప్పే. అందుకే అప్పాయింట్‌మెంట్ తీసుకున్నానుగానీ నాకు మరో ఉద్దేశం లేదు."

"సర్లే విషయం చెప్పు."

"వాడు పరీక్షలో కావాలనే ఓ ప్రశ్నకి సమాధానం రాయలేదు."

"అంటే వాడికి సమాధానం తెలిసుండకపోవచ్చు కదా?"

"కాదు, వాడికి సమాధానం తెలిసినా రాయలేదు."

"ఎందుకు ?"

"అదే నాకూ అర్థం కావట్లేదు."

"వాడికి సమాధానం తెలుసనేది నీ అభిప్రాయమేనా లేక వాడికి నిజంగా సమాధానం తెలుసనడానికి నీ దగ్గర ప్రూఫేమైనా ఉందా ?"

"ప్రూఫ్ ఉంది. అంతకు ముందురోజు దాని ఆన్సర్ నాకు చెప్పాడు."

"పరీక్ష హాల్లో గుర్తు రాలేదేమో...!"

"అదీ అడిగాను. గుర్తున్నాసరే కావాలనే రాయలేదని చెప్పాడు."

"అందుక్కారణం ఏమిటో వాణ్ణే అడగితే సరిపోయేదిగా"

"అడిగాను. "

"అయినా చెప్పలేదా?"

"చెప్పనంటున్నాడు."

"ఎందుకు?"

"అదే నాకూ అర్థం కావడం లేదు"

"అయితే ఇది చాలా సీరియస్ ప్రాబ్లమే. ఈ ఒక్క సమస్యేనా ఇంకా ఏవైనా సమస్యలున్నాయా...?"

"ఎందుకులేవు? ఆలోచిస్తే చాలా సమస్యలే ఉన్నాయి. అడ్డమైన విషయాల్నీ అవసరానికి మించి పట్టించుకుంటాడు."

"అలా పట్టించుకోవడం వల్ల ఎప్పుడైనా ప్రాబ్లమ్స్‌లో పడ్డాడా...?"

"ప్రాబ్లమ్స్ రాలేదుకదా అని బంగారంలాంటి టైమ్‌ని వేస్టు చేసుకుంటూంటే చూస్తూ ఊరుకోలేం కదా?"

"ఓకే... ఏదైనా ఒక సమస్యకి సంబంధించిన ఉదాహరణ చెబుతావా ?"

"వీణ అని ఓ అమ్మాయుంది. ఒకబ్బాయిని ప్రేమించింది. దాదాపు రెండేళ్లపాటు అష్టకష్టాలూ పడి కులాంతర వివాహానికి తల్లిదండ్రుల్ని ఒప్పించింది. సరిగ్గా పెళ్లి రేపనగా యాక్సిడెంటైంది. ఆ కుర్రాడు పోయాడు. ఈ వీణకి పిచ్చెక్కింది. నా కర్మానికి వీడినా పిచ్చాసుపత్రికి తీసికెళ్లారు. అక్కడ ఆ అమ్మాయిని చూశాడు. ఆమె గురించి తెలుసుకుని వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలనుకున్నాడు. అందుకే ప్రేమని ప్రేమతోనే జయించడం కోసం ఆ అమ్మాయిని అక్కా అని ప్రేమగా పిలిచాడు. తనూ అంతే ఆప్యాయంగా స్పందించింది. వీడి పిలుపు ఆ అమ్మాయి గుండెల్ని ఎంతగా కదిలించిందోగానీ వీడినీ తమ్ముడూ అంటూ అంతే ప్రేమగా పిలుస్తుంది. వీడేం చెప్పినా వింటుంది. ఆ అమ్మాయి ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది."

"గ్రేట్. ఇంత చిన్న వయసులోనే అంత మంచి విజయం సాధించినందుకు గర్వపడ్డం మానేసి అలా ఏడుస్తావేం?"

"ఏం విజయమో ఏమో. ఇరవైనాలుగ్గంటలూ అక్కా అక్కా అంటూ వీడు. తమ్ముడూ తమ్ముడూ అంటూ ఆ అమ్మాయి ఫోన్ల మీద ఫోన్లు. ఆ అమ్మాయి ఫోనొస్తే ఆనందం. రాకపోతే ఆందోళన. ఆ అమ్మాయి పిచ్చి పూర్తిగా తగ్గేలోగా వీడెక్కడ పిచ్చెక్కిపోతాడో అని భయంగా ఉంది. లేకపోతే ఆన్సర్ తెలిసికూడా పరీక్షలో రాయకపోవడం ఏమిటి ?"

"అంతేనా చెప్పాల్సిన కంప్లైంట్లింకా ఏమైనా ఉన్నాయా...?"

"ఎందుకు లేవు ? వీడి ఫ్రెండొకడున్నాడు. వాడు టీవీలో క్విజ్ ప్రోగ్రాంకి వెళ్లి యాభై లక్షలు సంపాదించుకొచ్చాడు. వాడు చెప్పలేకపోయిన ఆ కోటిరూపాయల ప్రశ్నకి ఆన్సర్ కూడా వీడు సులభంగా చెప్పెయ్యగలడు. ఆ ప్రోగ్రాంలో పాల్గొనడానికి వీళ్ల క్లాసులో అందరూ ప్రయత్నించారుగానీ వీడు మాత్రం ట్రై

చెయ్యలేదు. వీడు పార్టిసిపేట్ చేస్తే తప్పకుండా కోటి సంపాదించ గలడు. ఇంతవరకూ ఆ క్విజ్ లో అడిగిన ప్రశ్నలన్నింటి సమా ధానాలూ వీడికి స్పష్టంగా తెలుసు. అయినా సరే వెళ్లమంటే వెళ్లడు. అందులో పాల్గొంటే పేరుకి పేరు డబ్బుకి డబ్బు వద్దన్నా లెక్కలే నంత ప్రచారం. పెద్ద పెద్ద అయ్యేయెస్‌లు కూడా అందులో అవకాశం కోసం పడి చస్తూంటే వీడు సామర్థ్యం ఉండి కూడా అవకాశం కోసం ప్రయత్నించట్లేదు"

"ఎందుకు ప్రయత్నించట్లేదో అడగలేదా?"

"ఎందుకడగలేదు? జ్ఞానాన్ని దానం చెయ్యాలేగానీ కాష్ చేసుకోకూడదంటాడు. ఆ పేరూ ప్రచారాల్తో ఎవరేం సాధించారో చెప్పమంటాడు."

"అదీ పాయింటేగా...?"

"నువ్వొకడివి అదీ పాయింటేనంట. ఆ ప్రోగ్రాంలో ఎంతో మంది వాళ్లు గెలుచుకున్నదాంట్లో సగానికి పైగా సమాజసేవకి వినియోగిస్తామని చెప్పారు తెలుసా"

"మరి అలా చెప్పినవాళ్లలో ఎంతమంది ఏయే సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టారో తెలుసుకున్నావా?"

"రేయ్ నువ్వు కూడా వాడిలాగే మాట్లాడతావేంట్రా?"

"అంటే వాడూ నిన్ను అదే అడిగాడన్నమాట."

"అవును. దానికి సమాధానం చెప్పడం మనవల్ల కాదు."

"కరెక్ట్ మనవల్ల కాదు. ఎందుకంటే మనం కేవలం వందంటే వందే మార్కుల చదువుల చట్రంలో బిగుసుకుపోయిన మూర్ఖులం. అందుకే ఎంత గొప్పజ్ఞానినైనా కేవలం ఆ వంద మార్కులతోనే కొలుస్తాం. అందుకే వందో మార్కు రానందుకు ఇలా గిలగిల్లాడిపోతున్నాం. ఆ చట్రం దాటలేనందుకే మనిద్దరం మంచి ఫ్రెండ్సయినా ఫీజు ఎగ్గొట్టకుండా కన్సల్టేషన్‌కి రావడం దగ్గరే మన నిజాయితీ ఆగిపోయింది. అంతకు మించి ముందుకు వెళ్లడం లేదు."

"అదీ నిజమే కావచ్చు. కానీ చదువు గురించి నువ్వింత దారుణంగా మాట్లాడ్డం నాకు నచ్చలేదు. అయినా నేను వచ్చింది విద్యావిధానం గురించి చర్చించడానిక్కాదు."

"వాడు సమాధానం తెలిసి కూడా రాయకపోవడానికి కారణం ఏమిటో కనుక్కోవడానికి."

"వాడిని ఎన్ని విధాలుగా అడిగినా సమాధానం చెప్పట్లేదు. దాటేస్తున్నాడు."

"ఒక్క క్లూని కూడా సంపాదించలేకపోయావా?"

"క్లూ అవునో కాదో తెలీదుగానీ వాడు సమాధానం తెలిసినా రాయకపోవడానికి కారణం వాడు మాత్రం కాదని అర్థమైంది. వాడితో వచ్చిన చిక్కే ఇది. చెప్పాలనుకున్నది ఏదో ఒక విధంగా చెప్పి తీరుతాడు. చెప్పకూడదనుకుంటే మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పడు."



"అది తనలోని సంకల్పబలానికి నిదర్శనం"

"వాడి సంకల్పబలం నా ఆందోళనకి కారణం కాకూడదు కదా?"

"మరి దీనిగురించి మా చెల్లెలితో మాట్లాడావా?"

"తను కూడా తెలుసుకోవడానికి ఎంతో ప్రయత్నించింది. కానీ సమాధానం రాలేదు. నాకు చెప్పకపోతే పోయాడు కనీసం మీ చెల్లెలికైనా చెప్పచ్చుకదా?"

"అసలు సమస్య మొదలైందే ఆమె దగ్గర కదా?"

"అంటే మా ఆవిడ నాకంటే ముందే నీ దగ్గరకి వచ్చిందా ఏంటి?"

"లేదు. నేనే ఆవిడ దగ్గరకెళ్లాను. ఉదయం మీ పక్కవీధిలో పనుంటే అటువైపొచ్చాను. ఎలాగూ అంత దూరం వచ్చానుకదా అని మీ ఇంటికొచ్చాను. అప్పటికే నువ్వాఫీసుకెళ్లిపోయావు. మాటల సందర్భంలో విషయం ప్రస్తావనకొచ్చింది."

"ఆవిడేమంది ?"

"తనూ నీలాగే.., వాడు తనతో మాట్లాడ్డం లేదని కంప్లైంటిచ్చింది"

"మరి సొల్యూషన్ దొరికిందా ?"

"దొరికింది. మీవాడు మా చెల్లెలితో మాట్లాడకపోవడానికి కారణం ఎవరో కాదు, స్వయంగా ఆవిడే."

"మా ఆవిడా? నో ఛాన్స్. వాడికి తనంటే ప్రాణం."

"కేవలం ప్రాణం మాత్రమే కాదు. వాడికి తన తల్లంటే విపరీతమైన గౌరవం కూడా. తల్లిని తనెప్పుడూ స్నేహితురాల్లాగానే చూశాడు. అలాంటి స్నేహితురాలు తనకోసం కేవలం తనని గెలిపించడం కోసం మరొకర్ని ఓడించడాన్ని సహించలేకపోయాడు. అందుకే ఆవిడతో మాట్లాడ్డం మానేశాడు."

"కొడుకుని గెలిపించడం కోసం ఇంకొకళ్లని ఓడించాల్సిన అవసరం ఏముంటుంది? ఒకర్ని గెలిపించడానిగ్గానీ ఓడించడానిగ్గానీ ఇది ఆట కాదు. పరీక్ష. ఇందులో కాపీలూ గట్రా అందించి ఎవర్నైనా గెలిపించవచ్చేమోగానీ వచ్చిన ఆన్సర్ రాయ కుండా చేసి ఓడించడం ఎంతమాత్రం సాధ్యం కాదు."

"విషయం తెలియక ముందు నేనూ అలాగే అనుకున్నాను. తెలిశాక తిన్న షాక్ మామూల్ది కాదు."

"నువ్వే షాకయ్యావంటే విషయం ఈజీ మేటర్ అయ్యుండదు."

"కరెక్ట్. ఇది చాలా డిఫికల్ట్ ప్రాబ్లం. అందుకే విషయాన్ని కనిపెట్టడానికి నేను మీవాడిని ఇంటికి పిలిపించాల్సి వచ్చింది."

"ఇంతకీ ఏం జరిగింది ?"

"ఆరోజు.., అంటే వాడు వందోమార్కు ఆన్సర్ చెయ్యకుండా వదిలేసినరోజు ఇన్విజిలేటర్‌గా వచ్చింది వాళ్లమ్మే. వీడు పరీక్ష రాస్తుంటే కనీసం వాడి దగ్గరక్కూడా వెళ్లలేదు. ఏం రాస్తున్నాడో గమనించలేదు. కనీసం పేపర్ ఈజీగా ఉందో టఫ్‌గా ఉందో కూడా అడగలేదు"

"అలాంటివి అడగాలని కోరుకునే రకం కాదు వాడు. కాబట్టీ తల్లి తనకి హెల్ప్ చెయ్యలేదని మాట్లాడ్డం మానేసేంతగా ఫీలయ్యే సమస్యే లేదు."

"కరెక్ట్. అతని సమస్య వాళ్లమ్మ వాడిని పట్టించుకోకపోవడం కాదు. ఆరోజు పరీక్ష రాస్తున్న సమయంలో మీవాడి క్లాస్‌మేట్ పరీక్ష రాస్తూ ఏదో అనుమానం వచ్చి ఇన్విజిలేటర్‌గా వెళ్లిన మా చెల్లెమ్మని అడిగాడు. అతను అడిగీ అడగ్గానే దాని ఆన్సర్ చెప్పేసింది. అదీ సమస్య."

"నో... తనక్కాకుండా వేరేవాళ్లకి ఆన్సర్ చెప్పినందుకు అలిగే రకం కాదు వాడు."

"మరెందుకు అలిగి ఉంటాడంటావు?"

"అదే నాకూ అర్థం కావడం లేదు"

"ఎందుకంటే అది కరెక్టాన్సర్ కాదు. రాంగాన్సర్."

"వాడికి రాంగాన్సర్ చెబితే వీడెందుకు బాధపడాలి? వాళ్లమ్మని శత్రువుగా ఎందుకు చూడాలి?"

"ఎందుకంటే ఆ స్టూడెంట్ కూడా మీవాడితో సమానమైన తెలివితేటలున్నవాడు. కాబట్టీ వాడికంటే తన కొడుకే ఎక్కువ మార్కులు సంపాదించాలనే ఉద్దేశంతోనే వాళ్లమ్మ రాంగాన్సర్ చెప్పి వాడికి మార్కులు తక్కువొచ్చేలా చేసిందని మీవాడి అనుమానం. ఆ అనుమానంతో చూడ్డంవల్లే వాడికి తన కన్నతల్లి అపరాధిలా కనపడింది."

"తనలా చేసి ఉండదు. తన కొడుక్కి క్లాసు ఫస్టు రావాలని కోరుకునేదేగానీ తన కొడుక్కి హండ్రడ్ పర్సెంట్ రావడం కోసం మరో తల్లి బిడ్డకి అన్యాయం చేసేంత దుర్మార్గపు ఊహ కూడా రాదు తనకి."

"కానీ మీవాడికా అనుమానం కలిగినమాట వాస్తవం. అలా కలగడానికి కారణం మీరెప్పుడూ వాడితో కేవలం మార్కుల గురించి తప్ప మరోదాని గురించి ఎప్పుడూ మాట్లాడకపోవడం. ఇక్కడికొచ్చాక కూడా ముందు నువ్వు మార్కుల గురించి మాట్లాడావే తప్ప వాడి మనఃస్థితి గురించి మాట్లాడలేదు. అందుక్కారణం కేవలం మీకు మాత్రమే కాదు, విద్యార్థుల తల్లిదండ్రులందరికీ చదువంటే మార్కులేననే దురభిప్రాయం ఉండటం."

"పాఠాలు తరవాత చెప్పచ్చుగానీ ముందు వాడికి వాళ్లమ్మ మీద ఏర్పడిన దురభిప్రాయాన్ని పోగొట్టడానికి ఏం చేశావో చెప్పు."

"నిజానికి ఏం చెయ్యాలనేది నాకూ అర్థం కాలేదు. విషయం పరీక్షకి సంబంధించింది. కాబట్టీ నాకో అనుమానం వచ్చింది. దాన్ని నివృత్తి చేసుకోవాలనిపించింది. అందుకే వాళ్లిద్దరినీ ఒకే చోట కూర్చోపెట్టి సేమ్ క్వశ్చన్ పేపర్ ఇచ్చి ఆన్సర్ చేయించాను. అందులో మీవాడికి వందకి వంద మార్కులు వచ్చాయి."

"నేను చెప్పలా... వాడు జెమ్. హండ్రెడ్ పర్సెంట్ గ్యారెంటీ. ఇంతకీ మీ చెల్లెలికెన్నొచ్చాయి? కనీసం సిక్స్‌టీ పర్సెంటైనా వచ్చాయా?"

"ఈ మొగుళ్లెప్పుడూ ఇంతేరా భార్యల తెలివితేటల్ని చచ్చినా ఒప్పుకోరు."

"ఇంతకీ తనకెన్ని మార్కులొచ్చాయో చెప్పరా?"

"తొంభై తొమ్మిది."

"ఏంటి నిజంగానే ?"

"ఆవిడ డీల్ చేసే సబ్జెక్టదే కదరా. అందులో ఆవిడకి హండ్రెడ్ పర్సెంట్ రావాలి. కానీ మీవాడికి వచ్చింది."

"కొడుక్కి తనకంటే ఎక్కువ మార్కులు రావడం ఏ తల్లికైనా బలే బాగుంటుంది కదూ?"

"అవును. అది చాలా థ్రిల్లింగ్ ఎక్స్ పీరియెన్స్. ఏ ఒక్కరికో గానీ ఇలాంటి ఎక్స్ పీరియన్స్ లభించదు. కానీ దురదృష్టం ఏమిటంటే ఆవిడ తన నిజాయితీని నిరూపించుకోవడం కోసం కన్న కొడుకుతో కూర్చుని పరీక్ష రాసే పరిస్థితి రావడం మాత్రం దారుణం."

"ఇంతకీ నువ్వా పరీక్ష ఎందుకు రాయించావు?"

"మా చెల్లెలి నిజాయితీని నిరూపించడానికి నాకంత కంటే మార్గం కనపడలేదు. మా చెల్లెలు ఏ ప్రశ్నయితే తప్పు సమా ధానం చెప్పిందని మీవాడు భావించాడో ఆ ప్రశ్నకి సమాధానం మీవాడు రాసింది కరెక్ట్. మా చెల్లెలు రాసింది రాంగ్."

"వాడు తప్పు రాసే ప్రసక్తే లేదు. అయినా మా ఆవిడ తప్పు రాయడం ఏంట్రా కామెడీ కాకపోతే."

"తప్పెందుకు రాశావమ్మా అంటే తెల్లమొహం వేసింది. ఆ తరవాత తనకే అనుమానం వచ్చి టెక్ట్ పుస్తకం తెచ్చి రిఫర్ చేసి చెప్పింది. ఆవిడ ఆన్సర్ రైటేనట. టెక్ట్ బుక్కులోనే తప్పు దొర్లిందట."

"అంటే వీడికి తొంభైతొమ్మిదీ దానికి వందా వచ్చాయన్న మాట."

"ఎస్ ఇప్పుడు చెప్పు. మా చెల్లెలు ఎక్కువా నీ కొడు కెక్కువా."

"మీ చెల్లెలే ఎక్కువగానీ... ఈ పరీక్ష వల్ల నువ్వు సాధించిం దేముంది?"

"మా చెల్లెలు మీవాడి ఫ్రెండుకి కావాలని రాంగాన్సర్ చెప్ప లేదని తేలింది. వెంటనే తను చేసిన పొరపాటు మీవాడికి అర్థ మైంది. ఆ వెంటనే తను అపార్థం చేసుకున్నందుకు తల్లికి క్షమాపణ చెప్పాడు. ఇంతకన్నా ఏం కావాలి."

"అదీ వాడి సంస్కారం. ఎంతైనా నా కొడుక్కదా?"

"చేసిన తప్పుని వెంటనే ఒప్పుకోవడానికి ఎంతో ధైర్యం కావాలి."

"ఆ ధైర్యం వాడి రక్తంలోనే ఉంది."

"ఉంటే వాడికి ఆ వందో మార్కు రాలేదని ఇంతగా మధన పడేవాడివీ కాదు. నా దగ్గరకి వచ్చే పరిస్థితి తెచ్చుకునేవాడివీ కాదు. ఒక్కసారి ఆ మార్కుల చట్రంలోంచీ బయటకి వచ్చి ఆలోచించి చెప్పు. వాడికిప్పుడా వందో మార్కు అవసరమంటావా?"

"అవసరం లేదు. ఎందుకంటే వాడు సంపాదించుకున్నది నూట ఒకటో మార్కు. నువ్వందాకా అన్నావు చూడు, కొడుకుని గెలిపించడం కోసం కావాలనే సమాధానం తప్పు చెప్పిందని వాడు భావించాడని. వాడలా భావించడం వల్ల మీ చెల్లితో మాట్లాడక పోవడం మా ఇద్దరికీ ఎంతో బాధ కలిగించిన మాట నిజమే కావచ్చు. కానీ మేం పడ్డ బాధ కంటే వాడనుభవించిన మథనం గొప్పది. మనం దాన్ని కొనసాగించనివ్వాలి. ఒకవేళ నువ్వు పరీక్ష రాయించి ఉండకపోతే టెక్ట్ బుక్కులోని పొరపాటు గురించి తెలిసేదీ కాదు, తల్లిపట్ల వాడిలో ఏర్పడిన దురభిప్రాయం తొలిగేదీ కాదు. నాకు ఆశ్చర్యం కలిగిస్తున్నది ఏమిటంటే వాడికి సమా ధానం తెలిసినా రాయకుండా వదిలెయ్యడం ద్వారా చూపిన పరిణతి ఉంది చూడు అదే వాడు సంపాదించుకున్న నూట ఒకటో మార్కు.

"ఎస్... అది వాడిని రాబోయే సమాజానికి ఒక రోల్ మోడల్‌గా రూపొందిస్తుంది."

పశ్చిమ గోదావరి జిల్లాలో పుట్టి మదనపల్లెకి వలసవెళ్లి కొంతకాలం అక్కడే స్థిరపడి, ఆ మాండలికంలోనే కథలు, నవలలు రాసిన బొస్సవిత్తుల శ్రీరామచంద్రమూర్తి రెండు కథాసంపుటాలు, రెండు నవలలు ప్రచురించారు. ఆటా నవలలో పోటీలో 'వలసదేవర' నవలకి ప్రథమ బహుమతి లభించింది. నివాసం హైదరాబాద్.

email: murthyjsr62@gmail.com

మనం నడిచిన బాటల్లో

తమ్మినేని యదుకుల భూషణ్

అద్దం మీద ఎండ పడుతుంది
పాత రేడియో మీద కప్పిన గుడ్డ
కాళ్లు మొహం శుభ్రంగా కడుక్కుని
సంచి పట్ట మీద కొంచెంసేపు నిలబడి,
తీరుబాటుగా మొహం కాళ్లు తుడుచుకొని,
బాచిపట్టు వేసుకొని భోజనానికి కూచుంటావు,
అమ్మ వడ్డనకు వంకలు పెడుతూ ముగిస్తావు

అలవాటు చొప్పున అరటిపండు తిని
బలంగా తొక్కను గిరవాటు వేస్తావు కొమ్మల్లోకి
హాయిగా పంచ బనియన్‌లో నడుం వాల్చి
మరోసారి పేపరు చదువుకొంటూ కునుకు తీసి
పొద్దు గూకగ ముందే లేచి, అరగంట తలదువ్వి
నడిచి వస్తావు నాలుగయిదు మైళ్లు

మెట్ల మీద పెద్దగా నీ చెప్పుల చప్పుడు
అక్కయ్యలతో హాయిగా కబుర్లు
పగలూ సాయంత్రం రాత్రి
ఇంటా, బయటా కలియదిరిగి
పనులన్నీ చక్కబెట్టే నీవు-

ఆఖరి పాఠం ఇదేనని
మాట వరుసకైనా చెప్పకుండా
హఠాత్తుగా ఊపిరి విడిచి
నవ్వులు మాటలు లక్ష నక్షత్రాలు
వెంటబెట్టకు వెళ్లిపోతే
మనం నడిచిన బాటల్లో మిగిలి
ఇంత అంధకారంలో నాకేం పని
అని తరచూ నిన్నే తలచుకుంటాను

తమ్మినేని యదుకుల భూషణ్ కవితలు, కథలు, విమర్శలు రాసినా కవిగా ప్రసిద్ధులు. నిళ్ళబ్దంలో నీ నవ్వులు కవితాసంకలనం ప్రచురించారు. రాయలసీమలో జన్మించిన వీరు కొన్నాళ్లు సింగపూర్‌లో పనిచేసి ప్రస్తుతం న్యూజెర్సీలో సోమర్‌సెట్‌లో ఉంటున్నారు.
email: thammineni13@gmail.com



మరియా ... ఈ నేల నీది కాదు

రాధిక

ఇంకా రాలేదు. ఎంత సేపు ఎదురుచూడాలో. తానే చాలా ముందు వచ్చినట్టుంది .

నాగుపాము తన పడగతో లోకాన్నంతటినీ కప్పేసినట్టు అంతా చిమ్మచీకటిగా వుంది. ఇంత చిక్కని చీకటిని ఇంతకుముందు ఎప్పుడూ చూసినట్టులేదు. గాలికి కదిలే నది అలల చప్పుడు తప్ప కంటికి ఏమీ కనబడటం లేదు.

ఆకాశంలో చుక్కలు చీకటిని తరిమెయ్యటానికి శ్రమ పడుతున్నాయి. చీకటిని పారద్రోలలేక అవి ఎప్పుడూ ఓడిపోతూనే వున్నాయి.

ఈ మాటే శ్వేతతో అంటే అలా ఎందుకు అనుకుంటావు. నాకైతే ఓడిపోయి ప్రపంచాన్ని చీకటిలోకి తోసేయ్యకుండా, అలుపెరగని పోరాటం చేస్తున్నాయి అనిపిస్తుంది. ఏదో ఒక రోజు గెలుస్తాయి, అనేది.

మళ్లీ ఆకాశం వైపు చూసింది. చుక్కల వెలుగుతో ఆకాశం మెరిసిపోతోంది.

"అమ్మా నేనొస్తాను. నువ్వు ఎగరటం మర్చిపొయినట్టున్నావు. ఎక్కడో దాచిపెట్టిన రెక్కలు విప్పుకుని నాతో రావడానికి సిద్ధంగా వుండు. నువ్వు చూడాలనుకున్న లోకాలను చూపిస్తాను," అని చెప్పింది.

రోజూ నది ఒడ్డుకు రావటం, ఎదురుచూడటం , అమ్మా నిన్న రాలేక పోయానమ్మా, ఇవాళ తప్పకుండా వస్తాను, అని శ్వేత చెప్పటం.

ఎప్పుడు వస్తుందో ... ఎంతకాలమో ఈ ఎదురుచూపులు.

శ్వేత వస్తే ఎలా గుర్తుపట్టటం. ఇంత చిమ్మ చీకటిలో... వుహు కాదు.

శ్వేత వస్తుంటే ఇంత నిశ్శబ్దం, చీకటి వుండవు. శ్వేత రావటం ఒక సంబరం.

శ్వేత స్పర్శ తగిలితే ప్రపంచాన్నంతా ఆక్రమించిన చీకటి పారిపోతుంది. ఆ చుక్కలకి విజయం అందిస్తుంది శ్వేత.

ఇంత గుబులుగా వుండదు అప్పుడు. కాలంతో పనిలేకుండా అడవిపూల పరిమళం ఆకాశాన్నంతా నింపివేస్తుంది.

మధురమైన పాటని నది అలలు మోసుకొస్తాయి.

కన్ను పొడిచినా కానరాని చీకటిలో, ఆ నది పైన దూరంగా ఎక్కడో అద్భుతమైన చిన్న కాంతిరేఖ... వస్తున్నట్టుంది.

మనసంతా ఉప్పొంగి పోయింది ఆమెకి. శ్వేత మోసుకొచ్చే మధురమైన పాట పరిమళం నిలవనీయకుంది.

తాను కుడా ఎదురుగా వెళితే తొందరగా శ్వేతని చేరుకోవచ్చు. కాని ఎలా వెళ్లటం. ఎదురుగా అనంతమైన చీకటి. భయపెడుతున్న నది.

"నువ్వు ఎగరగలవమ్మా.. వచ్చెయ్యి" ఎక్కడి నుంచో శ్వేత పిలుస్తోంది.

ఎగరగలనా... ప్రయత్నించాలి... ఇప్పుడు కాకపోతే ఇక ఎప్పటికీ ఎగరలేను... ఎగరాలి

అయ్యో నేను ఎగరలేకపోతున్నాను. భరించలేని కాంతి నా రెక్కలని కాలుస్తుంది... శ్వేతా... శ్వేతా...

కళ్లని గుచ్చుతున్న కాంతికి కళ్లు తెరిచింది చంద్రలత. రవి ఆమె చెయ్యి గట్టిగా పట్టుకుని విసుగ్గా కోపంగా చూస్తున్నాడు. రవి చెయ్యి పట్టుకున్న చోట మంటగా వుండటంతో రవి చేతిని నెమ్మదిగా వదిలించుకునే ప్రయత్నం చేసింది చంద్రలత. ఇంకాస్త గట్టిగా పట్టుకున్నాడు రవి.

"ఒక్కరోజు తాళం వెయ్యటం మరచిపోతే చాలు, రాత్రంతా తిరణాలే," గొణిగినట్టు అనిపించినా పెద్దగానే అంది వర్ధనమ్మ. వాళ్లిద్దరి చూపులు తప్పించుకుని ఎదురుగా వున్న గోడవైపు చూపు తిప్పింది చంద్రలత. గోడ ఖాళీగా ఎండిపోయినట్టు వుంది. ఇంతకుముందు అక్కడ వున్న శ్వేత ఫోటోలు అన్నీ తీసేశారు. ఖాళీ గోడను చూడగానే దుఖం వచ్చింది చంద్రలతకు. వీళ్లు నాకు ఇష్టం లేదు, ఏదో ఒక రోజు వీళ్లని వదిలేసి నేను శ్వేత దగ్గరకు వెళ్లిపోతాను అనుకుంది.

రవి చెయ్యి విడిపించుకుని బెడ్‌రూమ్‌లోకి వెళ్లి పడుకుంది. రవి వచ్చి అటుతిరిగి తల చేతితో పట్టుకుని కూర్చున్నాడు.

'ఏమి ఆలోచిస్తున్నాడో, శ్వేత దగ్గరకు వెళ్లకుండా ఎలా ఆపాలి అనుకుంటున్నాడేమో,' తలపట్టుకుని కూర్చున్న రవిని చూస్తూ అనుకుంది చంద్రలత.

"మావయ్యా లైట్ ఆపెయ్యవా, నిద్రపోతాను," చెప్పింది. రవి ఆమెకు మేనమామ.

"రేపు కాలేజీకి వెళ్లకు," చెప్పాడు రవి.

ఇంట్లో ఉండాలా... ఆ ఆలోచనకే ఉక్కిరిబిక్కిరి అయిపోయింది. వూరి దగ్గర నుంచి రవి తమ్ముళ్లు వస్తారు, ఏవో ఆస్తుల పంపకాల గురించి మాట్లాడుకోవటానికి. వాళ్లందరూ వున్నప్పుడు ఆ ఇల్లు పరాయిదిలాగా, తానెవరో వాళ్లకి సంబంధించని వ్యక్తిలాగా అనిపిస్తుంది చంద్రలతకి. అందరూ వదినా అని ఏంటో మర్యాద గానే వున్నట్టు అనిపిస్తుంది, కానీ వాళ్ల సమక్షంలో కనబడని సంకెళ్లతో బంధించిన భావన వస్తుంది. కాలేజీకి వెళితే పిల్లలతో గడపొచ్చు. చైతన్య ట్రైనింగ్ నుంచి వస్తుంది. ఇంట్లో వుంటే సమూహంలో ఒంటరితనం. కాలేజీకి వెళ్లాలి అనుకుంది.

"వెళతాను మావయ్యా... ఎగ్జామ్స్ దగ్గరకు వస్తున్నాయి.. సిలబస్ పూర్తి చెయ్యాలి... వంట చేసి వెళతాను. సాయంత్రం తొందరగా వస్తాను."

ఏమీ మాట్లాడలేదు రవి. ఇంతకు ముందు చుట్టాలు వచ్చినప్పుడు కాలేజీకి వెళతాను అంటే రవి, వర్ధనమ్మ చాలా గొడవ చేసేవాళ్లు. మర్యాద తెలియదని, ఉద్యోగానికి పంపటమే తప్పు అయిందని మాట్లాడేవాళ్లు. ఈమధ్య ఏమీ అనటం లేదు ఎందుకో అనుకుంది చంద్రలత.

చైతన్య గుర్తుకొచ్చింది. చైతన్య కళ్లు శ్వేత కళ్లలాగే వుంటాయి. పెద్దవి కాదు, కాని చిక్కని కనురెప్పలు, అద్భుత లోకాలలో తేలియాడుతున్నట్టు వుండే కళ్లు. ప్రతి మనిషినీ ప్రేమించే గుణం చైతన్యది శ్వేతలాగే.

"మనిషి మనసు ఐస్‌బర్గ్ లాంటిది, బయటకు కనబడేది చిన్న ముక్క మాత్రమే, అంతా లోపలే వుంటుంది," అంటుంది చైతన్య. సైకాలజీ చెప్తుంది. ఉద్యోగంలో చేరి కొద్దిరోజులే అయింది.

ఎప్పుడూ పుస్తకాలు చదువుతూ వుంటుంది. ఎవరి గురించీ చెడు మాట్లాడదు.

కాలేజీకి వెళితే చైతన్యతో శ్వేత గురించి మాట్లాడుకోవచ్చు అనుకుంది చంద్రలత.

"హాయ్ మేడం, హలో సర్" కాలేజీ లోపలి అడుగుపెట్టగానే చిరునవ్వుతో పలకరించింది చైతన్య,

రవి రోజూ చంద్రలతని దింపి, సాయంత్రం వచ్చి తీసుకుని వెళుతున్నాడు.

"ఏమి సర్, మేడంని ఎవరైనా ఎత్తుకుపోతారని భయమా," సరదాగా అడిగింది ఒకసారి చైతన్య.

"ఇంతకుముందు తనే వచ్చేదిగా, ఈమధ్య తన ఆరోగ్యం బాగుండటం లేదు, అందుకే..." సంజాయిషీగా చెప్పాడు రవి.

''ఇక్కడ దిగిపోతాను మావయ్య, చైతన్యతో కలిసి వెళతాను,'' రవితో చెప్పి కారు దిగింది చంద్రలత.

కాలేజీ ఎంట్రన్స్ నుంచి మెయిన్ బిల్డింగ్ వరకు యెల్లో బెల్స్ పూలు పరుచుకుని వున్నాయి. చిక్కని పచ్చని చెట్లతో చుట్టూరా ఆకుపచ్చదనం అల్లుకున్నట్టు వుంది.

"మామయ్య అంటారు... మేనమామా?'' అడిగింది చైతన్య చాలాసార్లు చంద్రలత, రవిని మావయ్య అని పిలవటం విని వుంది.

"వూఁ"

"మేనమామను చేసుకున్నారా," చదువుకుని కుడా ఇంత మూర్ఖంగా ఉంటారా అన్నట్టు అడిగింది.

శ్వేత కూడా ఇలాగే అడిగింది ఒకసారి, జీవితం మీద కాస్త అవగాహన వచ్చిన తరువాత.

"ఏంటమ్మా... ఎలా చేసుకున్నావు నాన్ననిలా. వయసు తేడా వుంది కదా ఇద్దరికి. ఇష్టంగానే చేసుకున్నావా."

ఇప్పటిదాకా ఎవరూ అడగలేదు. పెళ్లి చేసేటప్పుడు అమ్మా, నాన్న అడగవలసిన ప్రశ్న, కనీసం కట్టుకునే వాడైనా అడగలేదు. ఇప్పుడు కూతురు అడుగుతుంది. ఎంత పెద్దది అయిపోయింది. మురిపెంగా అనిపించింది చంద్రలతకు.

"ఒక్కతే కూతురు. ఆస్తి అంతా పరాయివాళ్లకు పొయ్యమంటావా, అయినా మీ అమ్మకి వచ్చిన లోటు ఏంటే. దానిని కాలు కింద పెట్టకుండా చూసుకున్నాడు మీనాన్న," అక్కడే వున్న వర్ధనమ్మ వుక్రోషంగా చెప్పింది శ్వేతతో.

"అమ్మమ్మా కాలు కింద పెట్టకుండా చూసుకోవటం కాదు కావలసింది. నడిచేవాళ్లను నడవకుండా, పరిగెత్తాలనుకునే వాళ్లను పరిగెత్తకుండా చెయ్యటమా బాగా చూసుకోవటమంటే?" శాంతంగానే అడిగింది శ్వేత.

"పన్నెత్తి ఒక్క మాట కూడా అనలేదు మీ అమ్మని."

"నాన్న మగవాడు, అధికారి, అరవాల్సిన అవసరం లేదు, ఒక కంటిచూపో, ఒక పెదవి విరుపో చాలు అమ్మని కంట్రోల్ చెయ్యటానికి," చెప్పింది శ్వేత.

"అమ్మా నువ్వు చెప్పు. నువ్వెందుకు చేసుకున్నావు ఈ పెళ్లి. ఇష్టంగానే చేసుకున్నావా," ఆరోజు రాత్రి నది వొడ్డున కూర్చున్నప్పుడు మళ్లీ అడిగింది శ్వేత.

నది ఒడ్డునే గుడి వుంటుంది. పగలు వచ్చిపోయే భక్తులతో గోలగా వున్నా రాత్రి అయ్యేసరికి అంతా ప్రశాంతంగా వుంటుంది. అప్పుడప్పుడు ఇద్దరూ అక్కడికి వచ్చి కూర్చుని కబుర్లు చెప్పుకుంటారు. వెన్నెల రాత్రులలో మసకగా కనిపించే నది చుట్టూ వుండే కొండలు, నీళ్లలో పడి మెరిసే వెన్నెల వెలుగులు ఇద్దరికీ ఇష్టం.

"పెళ్లి గురించి అప్పుడు నాకేమి తెలియదు. నాకు బాగా చదువుకోవాలని, సైన్సెస్‌లో రీసెర్చ్ చెయ్యాలని వుండేది. ప్రపంచమంతా తిరగాలని చాలా కోరికగా వుండేది. పేపర్లలో వచ్చే అమెజాన్ నది ఫోటోలు, ఆఫ్రికా అడవుల ఫోటోలు అన్నీ కట్ చేసుకుని దాచుకునేదాన్ని. ఎప్పటికైనా అవన్నీ చూడాలనుకునే దాన్ని. టెన్త్‌క్లాస్‌లో స్కూల్ ఫస్ట్ వచ్చాను. పెళ్లి చేస్తానన్నారు. వద్దని ఏడ్చాను, అలిగాను. మీ నాన్న నాగుపాము పుట్ట దగ్గరికి వెళ్లి నాకోసం మొగలి పువ్వు తెచ్చేవాడు, తిరునాళ్లలో భుజాల మీద ఎక్కించుకుని తిప్పేవాడు. ఇన్ని చేసాడు కదా. అందుకని పెళ్లి ఆపగలడేమో అని నాన్నకు కూడా చెప్పాను పెళ్లి వద్దని. ఎవరూ నా మాట వినలేదు. తిండి కూడా మానేసాను. పెళ్లి అయిన తరువాత చదువుకోవచ్చులే అనేవారు, నా బాధని పట్టించుకోలేదు. పెళ్లి తరువాత నేను కోరుకున్నది చదవలేకపోయాను, చెయ్యలేకపోయాను." ఇప్పటికి చాన్నాళ్లు అయినా అప్పటి గాయం తాలూకు నొప్పి ఇంకా చంద్రలత గొంతులో తొంగి చూసింది.

ఇద్దరూ కాసేపు మౌనంగా ఉండిపోయారు.

"అమ్మా ఎవరినైనా ప్రేమించావా పెళ్లికి ముందు," అడిగింది శ్వేత.

రాము గుర్తుకువచ్చాడు చంద్రలతకు.

అది ప్రేమ కాదేమో... చిన్నవయసు, కాని రాముని చూస్తుంటే బాగుండేది... రాము ఆలోచనలు చుట్టుముట్టాయి చంద్రలతని. చాలాసార్లు రాము గుర్తు వచ్చేవాడు చంద్రలతకు. మధురమైన భావన మనసును చుట్టేలోపే వేడి గాలి ముఖానికి కొట్టినట్టు వాతలు తేలిన రాము బుగ్గలు గుర్తు వచ్చి మనసు ముడుచుకుపోయేది.

ఇప్పుడు ఎందుకు అడిగింది శ్వేత? ఈ ఆలోచన రావడం తోటే శ్వేత వైపు చూసింది చంద్రలత. మరియా గురించి ఎక్కువ చెబుతుంది ఈమధ్య. ఇక్కడికి వచ్చినప్పుడు కూడా అతనితో ఎప్పుడూ చాట్‌లోనే వుంటుంది. అతన్ని ప్రేమించిందా. భయంగా వుంది అలా అనుకుంటే చంద్రలతకు.

ఒకసారి వీడియో కాల్‌లో మరియాని పరిచయం చేసింది శ్వేత. ముచ్చటగా వున్నాడు. ఎప్పటినుంచో తెలిసిన మనిషిలా అనిపించాడు చంద్రలతకు.

"అసలు పేరు మౌర్య. స్కూల్‌లో టీచర్ పెట్టాడట ఆ పేరు. మరియా అమ్మా, నాన్న చదువుకోలేదు. ఆ పేరు పలకటం రాక మౌర్య కాస్త మరియా అయిపోయింది. తనకి కుడా మరియా అని పిలిపించుకోవటమే ఇష్టం," అని చెప్పింది అప్పుడు, శ్వేత మరియాని పరిచయం చేస్తూ. తరువాత చాలాసార్లు చంద్రలతతో మాట్లాడాడు మరియా.

"శ్వేతా... మరియాని ప్రేమిస్తున్నావా," అడుగుదామా వద్దా అను కుంటూ అడిగింది .

దగ్గరకు వచ్చి భుజం పై తల పెట్టుకుంది శ్వేత. ఏమీ మాట్లాడలేదు. మాట్లాడవలసిన అవసరం కలగలేదు. అర్థమయింది చంద్రలతకు. తనని చూసి నవ్వినందుకే దెబ్బలు తిన్న రాము గుర్తుకువచ్చాడు ఆమెకి.

"శ్వేతా వద్దు రా. నీకు, మీ నాన్న, బాబాయిల ప్రేమ మాత్రమే తెలుసు. వాళ్లకి ఇంకో రూపం వుంది. అది నువ్వు చూడలేదు. నీకు, మరియాకు ప్రమాదం. నా మాట విను," తను ఎందుకు భయపడుతోందో, శ్వేతకు ఎలా చెబితే అర్థం అవుతుందో అర్థం కావడం లేదు చంద్రలతకు. భయం ఒళ్లంతా పాకింది. శ్వేతని వంశానికి ఒకటే ఆడపిల్ల అని గారాబంగా చూస్తారు మరుదులు, మరిది కొడుకులు.

ఇప్పటికీ వూరి పైన పెత్తనం మరుదులు, మరిది కొడుకు లదే. పాలేరు పంపు ముట్టుకున్నాడని పేడ వేసి కడిగిన అత్త గుర్తుకు వచ్చింది. రవి బిజినెస్ కోసం టౌన్‌కి రావడం, ఆ తరు వాత కొద్ది కాలానికి చంద్రలతకి అదే ఊరిలో వుద్యోగం రావడంతో కాస్త వూపిరి పిల్చుకోగలిగింది చంద్రలత.

"ఎందుకమ్మా భయపడతావు. ప్రపంచం చాలా మారింది. చూడు... అమ్మమ్మ చదువుకోలేదు. నువ్వు చదువుకున్నావు. వుద్యోగం చేస్తున్నావు. నిన్ను పెళ్లి కాకుండా వూరు దాటనివ్వలేదు. నన్ను చూడు. ఎంత దూరం వెళ్లానో... ఎక్కడ జాబ్ చేస్తున్నానో," వుత్సాహంగా చెప్పింది శ్వేత.

"ఏమ్మారిందే ప్రపంచం. టెక్నాలజీ పెరిగితే ప్రపంచం మారి నట్టా. అమ్మమ్మ ప్రపంచం చిన్నది. నాది కొంచెం పెద్దది. నీది ఇంకొంచెం పెద్దది. హద్దులు నిర్ణయించుకునే హక్కు మనకు లేదు. ఎవరో నిర్ణయిస్తారు. నీకు స్వేచ్ఛ ఉన్నట్టే అనిపిస్తుంది. ఆ హద్దుల్లో నువ్వు ఉన్నంత వరకే మీ నాన్న, బాబాయి, అన్నల ప్రేమలు. ఆ హద్దు దాటటానికి ప్రయత్నిస్తే ఈ ప్రేమలు ఎంత బూటకమో నీకు అర్థం అవుతాయి. నువ్వు మరియా ఇద్దరూ ప్రమాదంలో పడతారు. వద్దు ఇదంతా," వూపిరి ఆడనట్టుగా వుంది చంద్రలతకు.

శ్వేత ఏమీ మాట్లాడలేదు. ఏదో ఆలోచనలో మునిగిపో యింది.

"శ్వేతా... నువ్వు పుట్టిన తరువాతే నేను జీవించటం మొదలు పెట్టాను. నీకేమైనా అయితే..."

ఆమె దుఖం శ్వేతను తాకినట్టుంది.

"అమ్మా... ప్లీజ్... భయపడకు... ఏమీకాదు..."

నల్లటి ఆకాశంలో వ్యర్థమైన కాంతితో చుక్కలు మెరుస్తు న్నాయి.

"మీరు ఎప్పుడూ ఏదో ఆలోచనలలోకి కూరుకుపోతుం టారు," చైతన్య అడిగింది.

"వుహు ఏమీలేదు," కంగారుపడింది చంద్రలత. "శ్వేత గుర్తుకు వస్తే... నువ్వు అడిగినట్టే అడిగేది శ్వేత, మామని ఎందుకు చేసుకున్నావు అని, అది గుర్తు వచ్చి," చెప్పింది.

"ఇప్పుడు ఎక్కడ వుంది శ్వేత."

కొద్దిసేపు గుర్తు తెచ్చుకోవటానికి ప్రయత్నించింది ఆమె. ఆలోచనల వత్తిడికి ముఖం అంతా కందిపోయింది.

"ఏమో... వూఁ... కానీ ....తను వచ్చి నన్ను తీసుకునివెళ్లి నాకు ఇష్టమైన ప్రదేశాలు చూపిస్తానంది. శ్వేత రావటం మా వాళ్లకి ఎవరికీ ఇష్టం లేదు. కానీ నేను శ్వేత దగ్గరకు వెళ్లిపోతాను." తను ఏమి చెప్పిందో తనకే అర్థం కాకుండా తడబడుతూ గందర గోళంగా మాట్లాడింది చంద్రలత.

"ఎందుకు ఇష్టం లేదు మీవాళ్లకి" అడిగింది చైతన్య.

"ఏమో, అందుకే ఎవరికీ తెలియకుండా వస్తానంది. నేను ఎదురుచూస్తూ వున్నాను. తను రాకపోతే నేనే వెళ్లిపోతాను." సాలోచనగా చూసింది చైతన్య

"హాయ్ మేడం మీ క్లాసుకి టైం అయినట్టుంది" ఆ రోజు ఆలస్యం అయింది చంద్రలతకు. కాలేజీ లోపలికి రాగానే ఎదురొచ్చింది చైతన్య.

"మెలుకువ రాలేదు," సంజాయిషీగా చెప్పింది చంద్రలత.

"సరే, మీరు వెళ్లండి, నేను కాసేపు సార్‌తో మాట్లాడతాను. సార్ ఒక్క నిమిషం," వెళ్లిపోబోతున్న రవిని పిలిచింది.

"ఏం మాట్లాడతావ్," ఆశ్చర్యపోతూ అడిగింది చంద్రలత.

"మీరు వెళ్లండి, స్టూడెంట్స్ మీ కోసం వెయిట్ చేస్తుంటారు, మీ క్లాసు అంటే వాళ్లకు చాలా ఇష్టం కదా," చంద్రలతని అక్కడి నుంచి పంపించింది చైతన్య.

ఏం మాట్లాడుతుంది మావయ్యతో, ఏముంది మాట్లాడ టానికి, ఇంతకుముందు పెద్దగా మాట్లాడింది కూడా లేదు. శ్వేత గురించి అడుగుతుందా?ఈ ఆలోచనలతో క్లాసులో వున్నా ఏకాగ్రత కుదరలేదు చంద్రలతకు.

చైతన్య ఏదో సీరియస్సుగా చెప్పటం, రవి తల అడ్డంగా వూపడం క్లాసురూమ్‌లో నుంచి కనబడుతూ వుంది.

డిస్కషన్ అయిపోయినట్టుంది. చైతన్య స్టాఫ్‌రూమ్ వైపు వెళ్లింది.

ఏమి జరిగివుంటుంది. నాతో మాట్లాడలేనివి, మావయ్యతో ఏమి వుంటాయి. చంద్రలతకు అర్థం కావడంలేదు. క్లాసులో ఉండలేకపోయింది.

"ఐ విల్ బి బ్యాక్ విత్ ఇన్ ఫ్యూ మినిట్స్" స్టూడెంట్స్‌కి చెప్పి స్టాఫ్‌రూమ్ వైపు నడిచింది. ఈ టైంలో ఒకరిద్దరు తప్ప వుండరు స్టాఫ్‌రూమ్‌లో. క్లాసురూమ్స్‌లో నుంచి వినబడుతున్న లెక్చర్ తప్ప కారిడార్స్ అన్నీ నిశ్శబ్దంగా వున్నాయి.

చంద్రలత స్టాఫ్‌రూమ్ దగ్గరకు వచ్చేసరికి చైతన్య గొంతు వినబడుతుంది. లోపలికి అడుగుపెట్టబోయి ఆగింది చంద్రలత.

"ఎంత చెప్పినా వినలేదు, ఉత్త ఫ్యూడల్ లాగా వున్నాడు" కోపంగా వుంది చైతన్య గొంతు.

"ఏమన్నారు ఆయన" సుభాష్ గొంతులాగా వుంది అను కుంది చంద్రలత.

"ఆమె బాగానే వుంది. డాక్టర్ దగ్గరకు అవసరం లేదు అన్నాడు. ఎంత చెప్పినా ఒప్పించలేకపోయాను. అతను చెప్పింది నిజమా? నువ్వు చెప్పు. నాకంటే ముందు నుంచి ఇక్కడ వున్నావు కదా మేడం ఎప్పుడూ ఇలాగే ఉండేవారా," చైతన్య అడిగింది.

చాటుగా వినటం మర్యాద కాదు లోపలికి వెళ్లాలి అను కంటూనే ఆగిపోయింది చంద్రలత.

"సైకలాజికల్‌గా కొంచెం వీక్‌గా అనిపించేవారు. లైఫ్‌లో ఏమైనా డిస్టర్బెన్స్ ఉందేమో అనుకునేవాడిని. మూడ్ వేరియేషన్స్ చాలా ఉండేవి. ఒక్కోసారి బాగా చిరాగ్గా, ఒక్కోసారి చాలా

ప్రేమగా. అయితే ఇప్పుడు వున్నట్టు కాదు. కూతురు చనిపోయిన తరువాత ఆమె పరిస్థితి బాగా దిగజారిపోయింది. నిజానికీ, భ్రమకు తేడా తెలియడం లేదు ఆమెకి.''

ఎవరి గురించి మాట్లాడుకుంటున్నారు, నా గురించేనా, ఇలా మాట్లాడుతున్నారేంటి అంతా అయోమయంగా వుంది చంద్ర లతకు వాళ్ల మాటలు వింటుంటే.

''కూతురితో బాగా అటాచ్‌మెంట్. మా అమ్మాయి నా ఫ్రెండ్ అని చెప్పేవారు. ఆ అమ్మాయి హాలిడేస్‌కి వచ్చినప్పుడు ఇద్దరూ వెళ్లి నది దగ్గర కూర్చునేవాళ్లు. వాళ్లిద్దరికీ బాగా ఇష్టమైన స్పాట్ అది. ఇప్పుడు కూడా మేడం అర్ధరాత్రి నది దగ్గరకు వెళుతుందట. అన్నీ తాళాలు వేసి పడుకోవలసి వస్తుంది, పొరపాటున తాళం వెయ్యటం మర్చిపోతే నది దగ్గరకు వెళ్లి కూర్చుంటుంది అని చెప్పారు వాళ్ల అమ్మ ఒకసారి కనబడినప్పుడు'' ఎవరో చెప్తున్నారు. ఎవరు చెబుతున్నారో అర్థం చేసుకోలేకపోతుంది చంద్రలత. వాళ్ల మాటలు ఆమెని కృంగదీస్తున్నాయి.

''చాలా రోజుల వరకు శ్వేత బతికే వుందని నమ్మాను. మేడం భ్రమలో వుందనుకోలేదు. ఎలా జరిగింది అసలు,'' చైతన్య అడిగింది.

'శ్వేత... వీళ్లు శ్వేత గురించి మాట్లాడుతున్నారు. ఎందుకు చైతన్య ఇలా మాట్లాడుతుంది. శ్వేత చనిపోయిందంటున్నారు, శ్వేత చనిపోయిందా... లేదు బతికే వుంది... వీళ్లకి మావయ్య ఏదో చెప్పాడు. మావయ్య మాటలు నమ్మారు. చివరికి చైతన్య కూడా...' అఘాతంలో పడిపోతున్నట్టు వుంది చంద్రలతకు వాళ్ల మాటలు వింటుంటే.

''అందరికీ యాక్సిడెంట్‌లో చనిపోయింది అని చెప్పారు. మేడంకి కూడా అదే చెప్పారు. మేము కూడా నమ్మాం. మేడం ఎలా తట్టుకుంటారో అని భయపడ్డాం. మేడం అసలు ఏడవ లేదట. మేము వెళ్లినప్పుడు పర్వాలేదు మీరు బాధపడకండి, శ్వేత కొంచెం ముందు వెళ్లిపోయింది, మనందరం తరువాత వెళతాం అంతే అని మమ్మల్ని ఓదార్చింది. ఈమె ఏమైపోతుందా అని చాలా భయం వేసింది మా అందరికి. ఒక్క కన్నీటిచుక్క కూడా రాలేదు ఆమె కంటి నుంచి. కొద్దిరోజులకి శ్వేత బతికే వుంది, వచ్చి తనని తీసుకువెళుతుంది అనే భ్రమలోకి వెళ్లిపోయింది.''

''శ్వేత ఆక్సిడెంట్లో కాదా చనిపోయింది,'' చైతన్య అడిగింది.

'' కాదు. నా స్టూడెంట్ వాళ్ల నాన్నది మేడం వాళ్ల ఊరే. అతను చెప్పాడు ఏమి జరిగిందో. శ్వేత, మరియా అని ఒక ట్రైబ్‌ని ప్రేమించి ఎవరికీ చెప్పకుండా పెళ్లి చేసుకుంది. ఎలా తెలిసిందో వీళ్లకి తెలిసింది. నమ్మకంగా అబద్దాలు చెప్పి ఊరికి తీసుకెళ్లారు ఇద్దరినీ. శ్వేతని కట్టేసి ఆమె కళ్లముందే మరియాని అత్యంత ఘోరంగా హింసించి చంపేశారు. అది తట్టుకోలేక శ్వేత ఆత్మహత్య చేసుకుంది. అందరికీ మాత్రం యాక్సిడెంట్లో చనిపోయింది అని చెప్పారు.''

ప్రతి అణువు కాలిపోతున్నంత బాధతో విలవిలలాడి పోయింది చంద్రలత ఆ మాటలు వింటూ. బలమైన చేతులతో ఎవరో గుండెని చిదిమేస్తున్నట్టు వుంది.

శ్వేత చనిపోయిందా... మరియాని చంపేసారా... వుహు... కాదు శ్వేత చనిపోలేదు. లేదు... నేను శ్వేత దగ్గరకు వెళ్లిపోవాలి.

అయ్యో ఇంత దుర్మార్గమా... పసివాళ్లు... అయ్యో... ఎందుకు ఈ ప్రేమలు... జీవితం కంటే విలువైనవా... శ్వేతా ప్రేమను వదిలేస్తే ఇద్దరూ దక్కేవాళ్లు... మరియా... నీ వంటిని ఛిద్రం చేస్తుంటే ఎంత నరకం అనుభవించి ఉంటావు... మీ అమ్మ నీకోసం ఇంకా వెతుకుతూనే వుంటుంది కదా... నువ్వు వస్తావు అని ఎంత ఆశగా చూస్తుంటుందో. ఆమె కనబడిన వాళ్లందరిని నీ గురించి అడుగుతూ వుంటుంది కదా... కొడుకు కనబడక ఆమె ప్రాణం అల్లాడిపోతూ ఉంటుంది. శ్వేతా నా మాట వినక పోతివే... ఇద్దరు అమ్మలని అన్యాయం చేసావే.

శ్వేత నీ పైనే ప్రాణం నిలుపుకుని బతుకుతున్నాను, నువ్వే లేకపోతే నా బతుకెందుకు.

కుప్పకూలిపోయింది చంద్రలత.

''హార్ట్ ఎటాక్‌లాగా వుంది, 108కి ఫోన్ చెయ్యండి,'' చంద్రలత పడిపోయిన చప్పుడు విని బయటకు వచ్చిన చైతన్య కంగారుగా సుభాష్‌తో చెప్పింది.

''మేడం మేడం...'' గుండెల మీద వత్తుతూ తడుతూ చంద్ర లతని కాపాడటానికి ప్రయత్నించింది చైతన్య.

''వద్దు... నాకు బతకాలని లేదు... శ్వేతా... నీతోనే నేను కూడా పుట్టాను... ఈ బతుకు ఇప్పుడు నాకు వద్దు... మరియా ఎందుకు పుట్టావు ఇక్కడ... ఇది మరుభూమి... పచ్చని చెట్టుని బతక నివ్వరు... మరియా... ఇది నీ నేల కాదు...

ఇటీవలే కథలు రాయడం ప్రారంభించిన బోడపాటి హరితాదేవి కలం పేరు రాధిక. పది కథలు ప్రచురించారు. నివాసం నెల్లూరు.
email: harithabdevi@gmail.com

కలగంటున్నాను

శిఖామణి

కలగంటున్నాను
ఒకటా రెండా శిలాసదృశ్యమైన
ఏడు దశాబ్దాల నుండి
కలగంటున్నాను
భూమికీ ఆకాశానికీ నీటికీ
సరిహద్దు రేఖలు గీచినట్టు
మనిషికీ మనిషికీ మధ్య
ఎన్ని ఆంక్షల ముళ్ల కంచెలు.
కులమనీ, లింగం అనీ
ఒకటారెండా ఎన్నెన్ని శాఖోపశాఖలు
శాఖాచంక్రమణాల అగడ్తలు
అందరం ఒక తల్లి బిడ్డలమే
అందరం ఒక తాను గుడ్డలమే
నీకేమో తల్లిపాలు
నాకేమో పోతపాలా?
నీ వొంటి మీద
రాజసంగా కులికే కులం చొక్కా
నాకే కురచై బొడ్డు పైకెక్కి
ఎందుకు వెక్కిరిస్తోంది?
ఎవరి గాయం చిమ్మిన
రక్తం అయినా ఎరుపే
ఏ కాలికి గొప్పు తగిలినా
అరిచేది అమ్మా అనే
అయినా శతాబ్దాలుగా నా విస్తరి
ఊరికి దూరంగా విసిరేశారు
కలగంటున్నాను
ఒకటా రెండా శిలాసదృశ్యమైన
ఏడు దశాబ్దాల నుండి
కలగంటున్నాను
జాతీయతను
మనసు నిండానే కాదు
రక్తం అణువణువునా నింపుకున్నాను
జాతి జెండాను నా గుడిసె మీదే కాదు
నన్ను నేను జెండా కరనుజేసుకుని
ఎరగేసుకున్నాను.
శిరసెత్తి వందనం చేస్తున్నప్పుడు
సర్వాంగీణ శరీరమూ
పులకిత హర్ష రోమాంచితమయ్యేది
వివక్షతల వడగళ్ల జడివాన ముంచెత్తినా
అవమానాల సర్పబంధనాలు
కాళ్లను చుట్టుముట్టినా
నాలో నుండే
రోహిత్‌లూ, మధుకర్‌లూ
ఖండిత శిస్సులై రాలిపడినా
గుండెను దిటవుచేసుకుని
గుట్టుగా గుప్పిట పట్టి నిలబడ్డాను
నాలుగు కాళ్ల పశువును పూజించండి
కానీ, రెండు కాళ్ల మనిషిని కూడా ప్రేమించండి
ఎక్కడెక్కడో
ఆకాశమంత ఎత్తున
విగ్రహాలు నిర్మిస్తున్నారని విన్నప్పుడు
ఏడు తాళ్ల నిలువున
మువ్వన్నెల పతాకాలను
ఎగరేస్తున్నారని విన్నప్పుడు
ఇదిగో ఇప్పుడు
ఈ మట్టిచేతుల మనిషి కూడా
తలెత్తుకు నిలబడాలనీ
ఆకాశమే ఆత్మగౌరవంగా
రెపరెపలాడాలనీ
కలగంటున్నాను

గత ముప్పై ఏళ్లుగా కవిత్వం రాస్తున్న శిఖామణి తొమ్మిది కవితాసంపుటాలు, నాలుగు వ్యాససంపుటాలు ప్రచురించారు. కవిత్వంలో వివిధ ప్రతిష్టాత్మక పురస్కారాలు పొందారు. యానాం నుంచి వెలువడుతున్న 'కవిసంధ్య' పత్రిక నిర్వాహక సంపాదకులు. నివాసం హైదరాబాద్.

email: kavisikhamani1956@gmail.com

కూసింత చోటు

మోహన

హఠాత్తుగా తల ఎత్తిన అతని దృష్టి ఒక హోర్డింగ్ మీద పడింది. ఈ తెలుగువాళ్లకి సహనం మామూలుగా లేదుగా! "Natural remedy for hair growth" అని ఆంగ్లంలో ఉన్న వాక్యం పక్కనే తెలుగులో 'ప్రకృతి సహకరించే అందపు జుట్టు' అని తెలుగులో రాసుంది. దాని కింద ముందు, తరువాత అని ఒక బట్టతల బాబువి ఫోటోషాప్ చేసిన రెండు ఫోటోలు, ఎర్రరంగులో ఉన్న నూనె సీసా కేవలం కొంతకే అని ఓ టోల్ ఫ్రీ నంబర్. ఇంత ప్రజ్ఞావంతమైన అనువాదాన్ని అతను ఎప్పుడూ చూసి ఉండకపోవటం చేత చటుక్కున జేబులోంచి ఫోన్ తీసి ఫోటో తీసి ఒక ప్రముఖ తెలుగు దినపత్రికకు అప్పటికప్పుడే ఫోన్లోనే ఈమెయిల్ చేసేద్దాం అన్నంత కోపం వచ్చింది. గ్రీన్ లైట్ మరో ముప్పై సెకన్లలో పడుతుందనగా వాహనాలు కదలసాగాయి. దాంతో బలవంతంగా తన ఆవేశాన్ని నిగ్రహించుకొని ఇంజన్ స్టార్ట్ చేశాడు.

గేర్ మారుస్తూ మణికట్టుకున్న పాత గడియారాన్ని చూశాడు. ఐదుంబావు. టైం లేదు, ఎలా అయినాసరే ఒక అరగంటలో చేరుకోవాలి. ఈలోపు చేరుకోలేకపోతే...? వెనక నుంచి ఒకటే హారన్ల మోత. మళ్లీ ఆవేశం. గ్రీన్ లైట్ పడ్డాక బండి తీయక అక్కడే కాపురం చేస్తారా ఏంటి? ఆగి చావలేరు వెధవలు. చిరాకుపడ్డాడు.

కూడలి దాటాక బండ్ల ఉద్ధారాలు తగ్గి కొంచెం మంచి గాలి వీచసాగింది. గుండెల నిండా గాలి పీల్చుకుందామని ప్రయత్నించాడు. నాలా నుంచి వచ్చిన దుర్గంధం అతని ఊపిరితిత్తుల్లోకి చేరి వికారాన్ని కలిగించి వాంతిలా బయటకు ఉరికింది. లెఫ్ట్ నుంచి ఓవర్‌టేక్ చేసిన ఓ బైక్ మెరుపులా మాయమైంది. ఇంకా నయం, వాడి మీదగానీ పడుంటే?

అయినా ఆ వేగం చూస్తే వాడి కొంపలు అంటుకున్నట్టే ఉంది. తనకంటేనా? వైరాగ్యం, నైరాశ్యం కలిసిన నవ్వు- అతనికి మాత్రమే సాధ్యమయ్యే నవ్వు నొకదాన్ని నవ్వాడు. అది గమనించటానికి ఎవరికీ టైం లేదేమో, పాలోమని వెళ్లిపోతున్నారు.

మరీ ఇంత సున్నితమైతే ఎలా? తల్లి ఎన్నిసార్లు అనేది ఈ మాటని! అబ్బాయి అంటే రఫ్ అండ్ టఫ్‌గా ఉండాలని ఆమె బలంగా నమ్మింది. ఏ విషయానికైనా ఆడవాళ్లు ప్రతిస్పందించే తీరుకి పూర్తిగా వ్యతిరేకంగా, భిన్నంగా ఉండటమే పురుష లక్షణం అని నూరిపోసింది.

టైం చూశాడు. ఐదూ పదహారు. పదహారూ ప్రాయంలో నాకొక గర్ల్ ఫ్రెండ్ కావాలి... స్త్రీ సహజమైన మమతాసూయలతో తల్లికామె నచ్చలేదు. ఇంకెవ్వరూ అతనికి నచ్చలేదు. ఎండిపోయిన నీళ్లగ్లాసులో చారికలు కట్టినట్టు ఏవో జ్ఞాపకాలు. తల్లి ఎంత చక్కగా పెంచింది తనని. పట్టాలు తప్పని గూడ్సు బండిలా పొడవుగా అందంగా మంచివాడిగా బరువు మోసేవాడిలా.

వికారం తగ్గేట్టు లేదు. తన వాంతికింత చోటిచ్చి ఆదరించిన రోడ్డుకి కృతజ్ఞత చెప్పి నెమ్మదిగా బయలుదేరాడు. ఎదురుగా బైక్ మీద ఒక జంట. ఆలుమగలు అవునో కాదో. నవ్వుకున్నాడు. కలిసున్న ఏ ఇద్దర్ని చూసినా ఈ ప్రశ్న మదిలో మెలగటం అతనికి కొత్తేమీ కాదు. ఆమె పట్టుచీరకు నప్పేట్లు కొప్పునిండా చేమంతి పూలు. కబుర్లు చెప్పుకుంటూ వెళ్తున్న వాళ్లిద్దరి ముఖాలు చూడాలనిపించింది. కొంచెం వేగంగా ఎడమ నుంచి క్రాస్ చేశాడు. కర్పూర వీటికామోద సమాకర్ష ద్విగంతరా.

అతనికి తెలిసిన పెళ్లి భోజనం పప్పన్నం, కిళ్లీ, కర్పూరం కడ్డీ. మానవుడు వాసనా బలం గలిగినవాడు. జన్మజన్మల వాసన కుడివైపు అరేబియన్ దర్బార్ నుంచి వస్తున్న పేగులు కాలుతున్న వాసన కన్నా దుర్భరమైంది. ఎందుకీవేళ ఇంత ఆలోచిస్తున్నాడు? 'మనువు' నుంచి వచ్చిన వాడు మానవుడా? 'మనువు' ద్వారా పేగు తెంచుకున్న వాడు మానవుడా? అసలు తనకి ఇన్ని విషయాలు ఎలా తెలుస్తున్నాయని అతని మీద అతనికే ఆశ్చర్యం వేసింది.

ఎదురుగా మరో రెడ్ సిగ్నల్. చచ్చినట్టు ఆగాల్సి వచ్చింది. బైకులు కార్లు బస్సులు స్టాప్ లైన్ దాటకుండా చక్కగా సర్దుకుంటున్నాయి. భూమ్మీద నాగరికతలన్నీ చక్కగా నదుల ఒడ్డున సర్దుకున్నట్టు. సమయం చూసి సందు చూసి వేరే వాళ్ల స్థలాన్ని కబ్జా చేసినట్టు బైకులు చాకచక్యంగా మున్ముందుకు దూరుతుంటే ముందుకుగాని వెనక్కుగాని వెళ్లలేని నిస్సహాయ స్థితిలో ఏమీ చేయలేని ముసలి స్థల యజమానిలా కార్లు నిలబడిపోతున్నాయి. ఈ నూట ఇరవై సెకన్లలోనే చోటు కోసం ఇంత గొడవైతే జీవిత పర్యంతం ఎన్నో గొడవలుండటంలో తప్పు లేదనిపించింది అతనికి. బాబాయి చేసింది సరైనదే.

ఆకుపచ్చ పడ్డా ట్రాఫిక్ పోలీస్ వెళ్లనివ్వడం లేదు. అటువైపు నుంచి అంబులెన్సు. అందులో ఇద్దరు మనుషులు ఎదురెదురుగా కూర్చొని లోపలి వైపు కిందకు చూస్తున్నారు. బొయ్యి బొయ్యిమని చప్పుడు చేసే సైరెన్. అసలు ఆ చప్పుడుకే పేషెంట్ సగం చస్తాడేమో అనిపిస్తుంది. అతను ఎప్పుడు అంబులెన్సును చూసినా 'ఈ ప్రాణాన్ని కాపాడు దేవుడా' అని ఒకసారైనా అనుకుంటాడు. చిన్నప్పుడు చదివిన కథ ప్రభావం అది. ప్రార్థనలు ఆయుష్షును పెంచుతాయని చావుకి భయపడే ప్రతివాడూ అనుకుంటాడు. ఆక్సిజన్ సిలిండర్ లేని దీనస్థితిలో ఉన్న ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో పది లక్షలు పోసి కొన్న తండ్రి శవంతో ఆ రోజు అంబులెన్సులో ఇలానే ఆ ఇద్దరి స్థానంలో తానూ తల్లీ. అప్పుడు ముక్కోటి దేవత లని ప్రార్థించానని తర్వాత తల్లి చెప్పింది. ఈ విషయంలో హిందూ ధర్మం మనిషికి చాలా ఛాయిస్‌ని ఇచ్చింది. అతను ఏ ఆప్షన్ సెలెక్ట్ చేసుకోవాలో తెలియక 'దేవుడా' అనబడే ఒకే ఒక దేవుణ్ణి ప్రార్థించాడు.

హార్న్ కొట్టీ కొట్టీ విసుక్కుని చేమంతి కొప్పు అతన్ని దాటుకుని ముందు ఇరుక్కుంది. ఆ విసురుకి చేమంతి రెక్క ఒకటి రాలి కుందన్ల మెరుపుల లోనెక్ బ్లౌజ్ మధ్య కావిరంగులో కాంతులీనుతున్న ఆమె వీపు మీద పడింది. అతని కుడిబుగ్గ మీద నుంచి ఒక కన్నీటిచుక్క రాలి చేతిమీద పడింది. ఉలిక్కిపడి విదిలించాడు. టైం ఐదూ ఇరవై. నింపాదిగా ట్రాఫిక్ పోలీస్ దగ్గరకు వెళ్లి అతన్ని అభినందించాడు. మంచికింకా ఈ లోకంలో చోటుందని చాటావన్నాడు. పోలీస్ మొహమాటానికి ముందు సిగ్గుపడ్డా తర్వాత కాలరెగరేశాడు.

పెట్రోల్, డీజిల్ వాహనాలను నడిపినట్టు నమ్మకం మనిషిని నడిపిస్తుంది. ఒకోసారి పరిగెత్తిస్తుంది కూడా. ఎంత దూరం ఆ ప్రయాణం? ఎక్కడికి అది? సంకల్పబలం అనేది హనుమంతుణ్ణి దక్షిణ సముద్రం దాటించినట్టు మనిషిని ఎత్తి గిరవాటు వేయ గలుగుతుంది. ఇదంతా లక్ష్యం అంటూ ఒకటి ఏడిపినప్పుడు. చుక్కాని లేని నావలా చాలా జీవితాలు ఉంటాయి కదూ. నడకా లేక నడిపించేవారూ లేక. బతుక్కి గమ్యం లేకపోతే ఏమి? కర్మ యోగం ఉందిగా.

పొడవాటి ఇనుప కడ్డీలు కట్టగట్టి తీసుకెళ్తున్న ట్రాలీ. పసుపు రంగు ట్రాలీ కనపడిందిగాని సంజె చీకట్లో చువ్వలు కనపడలేదు. చాల దగ్గరికొచ్చాక బండి పక్కకు తిప్పాడు. త్రుటిలో ఘోరం తప్పింది. ట్రాలీ కుడివైపు అద్దం పగిలింది. గుండె లబాలబా కొట్టుకున్న ట్రాలీవాడు కిందకు దిగి తిట్లు అందుకున్నాడు. అతను 'సారీ భయ్యా' అనంటూ వాలెట్ తీసి ఐదువందలు ఇచ్చాడు. పర్సు జేబులో పెట్టుకుంటూ వాచీ వంక చూసుకున్నాడు. ఐదు ఇరవై ఐదు. సరిగ్గా ఐదైదు నిమిషాలకు చూసుకుంటున్నానే అనుకొని నవ్వుకున్నాడు.

ఇదేమీ పట్టనట్టు వెళ్లిపోయినాయి ఇతర వాహనాలు. ఛ ఛ వాహనాలు వెళ్లవు. మనము తీసుకెళ్తే వెళ్తాయి. యంత్రాలవి. వాటిలో కూర్చునేదీ యంత్రాలే. దెబ్బ తిన్న మనుషులకు వాటిలో చోటుండదు. ఎందుకంటే దెబ్బ తగిలితే బుద్ధి వికసిస్తుంది. ఆ వెంటనే హృదయం విచ్చుకుంటుంది. ఈ రెండూ కాసులు రాల్చలేవు. సమయమే ధనం. ధనానికి ఇనప్పెట్టెలో చోటుంటుంది.

హృదయమే లేనప్పుడు బుద్ధే లేనప్పుడు సమయానికింక చోటెక్కడ? అందుకే కదిలిపోతుంటుంది.

కదిలే కాలం గురించి ఆలోచిస్తూ తను కదలకుండా ఉండిపోతే ఎలా? అరగంటలో చేరుకోవాలనుకుని మొదలుపెట్టాడు. కాలంతో పోటీపడి గెలిచిన మొనగాడు ఇంకా పుట్టలేదు. అరవై దాటినా ఎనభై దాటుతున్నా... అది వయసైనా వేగమైనా.

ఏదో పెళ్లి ఊరేగింపులా ఉంది. ఆ వైభవం చూడు. గుర్రాల రథం. ధగధగలాడే విద్యుద్దీపాలు. మిలమిలలాడే ముఖాలూ బట్టలూ. పెళపెళలాడే వయసు. తర్వాత్తర్వాత వీళ్లే కళవెళ పోతారని ఎవ్వరికీ తెలియనట్టు అసలా అవకాశమే లేనట్టూ డప్పులు డాన్సులు. ఎందుకింత ఉత్సాహం? తనకెందుకింత నిరుత్సాహం అనుకొని తల విదిల్చాడు.

వాంతి బైకూ, చేమంతి కొప్పు, కడ్డీల ట్రాలీ అన్నీ ఆగిపోయినాయి. ఎంత వేగ ప్రవాహమైనా కట్ట కడితే ఆగినట్టు, కులాసాగా సాగిపోతున్న జీవితం మూడు ముళ్ల కట్ట దగ్గర ఆగాల్సిందేనని తల్లి చెప్పింది. కలిసి ప్రవహిస్తాయి అనుకున్న రెండు పాయలూ దేని దారిన అది పారాయి. అవి కలిసిన కొద్ది దూరంలోనే అందమైన దీవి ఏర్పడింది స్థిరంగా. ఆ దీవిని వదిలి రాక తప్పలేదు అతనికి. ఎప్పుడో దాటేసిన మజిలీ అది.

ఇప్పుడు ఇది దాటాలంటే ఆలస్యమయేలా ఉంది. దగ్గరి దారి కోసం అటూ ఇటూ చూశాడు. ఫ్లై ఓవర్ ఎక్కితే మళ్లీ దిగి చుట్టూ తిరిగి వెళ్లాలి. తప్పదు. ఎలాగో చోటు చేసుకొని చిన్నగా ఫ్లై ఓవర్ అంచుకి చేరుకున్నాడు. తాము చూస్తున్న వినోదానికి ఆటంకం కలిగిస్తున్న అతని మీద చిర్రుబుర్రులాడుతూనే కదిలారు అడ్డంగా ఉన్నవాళ్లు.

ఫ్లైఓవర్ మీద ప్రయాణం అతనికిష్టం. ఈ బేవార్సు లోకానికి పైన అంతెత్తునున్నట్టు భ్రమపడటమంటే మోజు. ఎందుకనో ఎక్కువమంది ఈ ఎత్తుదాకా రారు. వచ్చినా ఆ ఎత్తులో ఎక్కువసేపు నిలవలేరు. నిలుపుకోలేరు అనాలేమో కదా?

చెయ్యెత్తు మనిషి ఆమె. జీన్స్, టీ-షర్ట్ ఆమె యూనిఫామ్. షర్ట్ తియ్యకుండా బ్రా విప్పి తీసెయ్యగలదు. ఎంతోమంది తత్తర పడే ఈ ఫీట్‌ను ఆమె అవలీలగా చేసేసేది. అదే బాస్‌కి నచ్చడంతో ప్రమోషన్ ఇచ్చాడు. ముందు బ్రా వాడిన ఆమె తరువాత బ్రెయిన్ వాడటం మొదలుపెట్టి ఎంతో ఎత్తుకి ఎదిగింది. దాంతో పోటీదారులు ఆమెకు స్వర్గంలో చోటు చేశారు. అప్సరసలు స్వర్గంలోనే కదా మరి ఉండాలి! ఆమెకు కంపెనీ ఇచ్చిన ఫ్లాట్‌ని ఖాళీ చేయటానికి వచ్చిన చెల్లెలు అక్క బట్టలన్నిటినీ అనాథ శరణాలయంలో ఇచ్చేసింది. ఆమె చూడకుండా తస్కరించిన ఒక నల్లటి లేస్ బ్రా ఇంకా అతని అండర్ వేర్ల మధ్య గర్వంగా ఉందంటే అతని మనసులో ఆమెకెంత చోటుందో తెలీడంలా?

ఇంకా పది కిలోమీటర్లు ఉంది. టైం పది నిముషాలే ఉంది. లాస్ట్ ఓవర్, సిక్స్ రన్స్ ఫర్ విక్టరీ అన్నట్టు. ఆడగలడా? 'నేను సెంచరీ నాటవుట్' అని పిలిచి పిలిచి చెప్పే ఎదురింటాయన సిక్స్‌టీకే బౌల్డ్ కాలా? వజ్రదేహుడైన పక్కింటాయన కాలి చిటికెన వేలికి సెప్టిక్ అయి వొళ్లంతా ఇన్ఫెక్షన్ వచ్చిపోలా? చివరిదాకా వచ్చి ఆఖరి అడుగులో కుప్పకూలిపోవటం వింతనుకుంటాం. చావుకి చోటుండదని అనుకుంటాం. అరబ్బు షేకూ ఒంటె కథ లాగా, వస్తే చోటంతా దానిదే.

ఎన్నో అనుకున్నాడు దారిలో చేద్దామని. వీలైతే ఒక ప్లేట్ భోజనం, కుదిరితే నాలుగు కప్పుల చాయ్, ఇంకా వీలైతే ఒక దమ్ము- ఊహూ ఏవీ కుదరలా. తన ప్రయాణంలో వాటికి ఓ గౌరవ ప్రదమైన చోటుని కల్పించాలనుకున్నాడు. చలించని సమయంతో సమానంగా వెళ్లాలంటే తను చలించకూడదనుకుని వాటిని మరచిపోయాడు. అయినా ఏమిటో లేటయిపోయింది. కాల్ చేస్తుంటే మిత్రులు జవాబే ఇవ్వటం లేదు. ఏమైపోయారంతా?

ఆఫీస్‌లో ఆరింటికి పంచ్ చేయాలి. లేకపోతే సగంరోజు జీతం దండగ. ఈ నిరామయ నిర్వికల్ప సంకల్పంతో ఐదింటికే బయలుదేరాడు. ఫ్యూయల్ రెడ్‌లో పడిన సంగతి నిన్న చూసుకోలేదు. పెట్రోల్ బంక్ దగ్గర స్వైపింగ్ మెషిన్ పని చెయ్యలేదని పది నిముషాలు మింగాడు పిలగాడు. కోపాన్ని మింగలేకా కక్కలేకా కదిలాడు అతను.

చేరుకునేసరికి ఐదు యాభై తొమ్మిది. సంతోషంతో చల్లటి ఏసీ వాతావరణంలోకి అడుగుపెట్టాడు. విజయగర్వంతో పంచ్ చేసి, మొబైల్ ఫోన్‌ని లాకర్లో పెట్టి వచ్చి తన సీట్లో కూర్చున్నాడు. అప్పటికే అంతా పనిలో మునిగిపోయారు నిజంగా పనున్నట్టు, పని చేస్తున్నట్టు. ఏదో తేడా ఉందే అనుకుంటున్నాడు. ఇంతలో బాస్ పిలిచాడు ఇంటర్‌కంలో. నిస్సంకోచంగా వెళ్లాడు.

"ఇప్పుడు టైం ఎంతైందో తెలుసా?"

"ఆరూ ఒకటి."

"ఎనిమిది ఇరవై," రెట్టించి అన్నాడు.

"ఆర్యూ జోకింగ్?" అందరు తెలుగువాళ్లలాగే ఎమోషన్‌లో ఇంగ్లీష్ మాట్లాడాడు.

"చెక్," అని అధికారి తన మొబైల్ని, గోడ మీద గడియారాన్ని, డెస్క్‌టాప్‌ని, చేతికున్న వాచీని చూపించాడు. ఇన్ని ఆధారాలనీ తలదన్నే ఆధారం తన పాత వాచీ వంక చూశాడు అతను. ఐదు యాభై తొమ్మిది దగ్గర ఆగిపోయింది అది, యుద్ధంలో అమితంగా గాయపడ్డ గుర్రం పరిగెత్తకపోయినా కుంటుకుంటూ నడిచి తన రౌతును మాత్రం క్షేమంగా ఇంటికిచేర్చి ప్రాణాలు వదిలినట్టు.

ఇటీవలే కథాప్రపంచంలోకి ప్రవేశించిన కొత్త కెరటం మోహిత. రెండేళ్లలో అరడజను కథలు రాశారు. కొన్ని కథల్ని ఇతర భాషల నుంచి అనువదించారు. నివాసం హైదరాబాదు.

email: kaundinya.mohita08@gmail.com

ఈ రాత్రి...

బాలసుధాకర మౌళి



ఈ రాత్రిని పాడను
గాయాల రాత్రి, కన్నీళ్ల రాత్రి
ఎక్కడో ఏ ఆదివాసీ గ్రామంలోనో
ఒక కల భగ్నమై
మట్టి అంతఃపొరల్లోంచి
విషాదం వాసన వేస్తున్న రాత్రి
ఈ రాత్రిని పాడను

గడ్చిరౌలిలో
ఒక పావురం రెక్క తెగిపడుతుంది
ఈశాన్యం నేలపై
ఒక నిరసన స్వరం త్రుంచివేయబడుతుంది

కాశ్మీర్ లోయలో
ఒక ఆజాదీ దేహం తూట్లు తూట్లు పడుతుంది
ఈ రాత్రిని
ఈ విషాద గాయాల కన్నీళ్ల రాత్రిని పాడను

యూనివర్శిటీ ప్రాంగణంలో
ఒక నెలవంక
ఎర్రగా పుష్పిస్తుంది
సూర్యోదయానికి
వెలుతురు ఆచూకీ లేకుండా పోతుంది

ఏ ఊరి చివరిలోంచో
ఒక వివస్త్ర స్త్రీ గొంతుక మూగగా వినిపిస్తుంది
ఏ వీధి చీకటి మలుపులోంచో
ఒక నిర్భాగ్యుని మూలుగు తెరలుతెరలుగా వ్యాపిస్తుంది
ఈ రాత్రిని
ఈ కన్నీళ్ల గాయాల విషాద రాత్రిని పాడను

నేను
ఆకలితో, కన్నీళ్లతో
కడుపారా కళ్లారా దుఃఖించి
మరోసారి, మరోసారి
క్రూరత్వం కోరలకు చిక్కిన
ఈ దేశం
శ్రమబిందువుని, తీరని వెతని

ఒక నాలుగు కాళ్ల జంతువు ముందు
చేతులు కట్టుకుని నిల్చొని
నాపై శిరఃఖండనం
అమలుజరపబడుతున్న
అనాగరికుడ్ని
వెలివేయబడిన అనాది ఆదిమ శబ్దాన్ని

ఈ రాత్రి నేను పాడుతాను
హృదయంతోనూ, రక్తంతోనూ
పాడినంతవరకూ
ఊపిరి ఆగినంతవరకూ
పాడుతూనే పాడుతూనే
పాడుతూనే వుంటాను

29 ఏళ్లకే రెండు కవితాసంపుటాలు, రెండు ప్రతిష్టాత్మక పురస్కారాలు పొందిన కొత్త కవితావీచిక బాలసుధాకర మౌళి. నివాసం పోరాం గ్రామం, విజయనగరం జిల్లా. email: champaavathi@gmail.com

తెల్ల తాచు

అరిపిరాల సత్యప్రసాద్

ఎర్రపంచె గుర్తుకొచ్చింది విశ్వనాథానికి.

'ఎందుకు కట్టుకోవు నాన్నా,' అంటాడు శేఖరం. పన్నెండేళ్లు లేని పిల్లవాడికి తను ఎందుకు కట్టుకోకూడదో చెప్పినా అర్థం కాదు. 'ఆచార్లుగారు కట్టుకుంటే ఎంత బాగుంటుందో,' అంటుంది వాడి అక్క ప్రియంవద.

ఆయనతో తనకి వంతేమిటి? మంత్రం నోరు తిరిగినవాడు. చక్రాలేసి జాతకం చెప్పే నేర్పు వున్నవాడు. మరి తనో?

అరటి ఆకు దొన్నెలోకి గుచ్చిన దర్భపుల్ల వేలికి గుచ్చుకోని విరిగింది.

"మడిబట్ట ఆరేశారుట. స్నానం చేసి సిద్ధమైతే మొదలుపెడదాం. రావుగారు కూడా వస్తున్నానని ఫోన్ చేశారు," గోపాలకృష్ణ పిలుపుతో తేరుకోని దొన్నెలు, పవిత్రాలు లెక్క చూసుకోని లేచాడు.

కడుపులో వికారంగా వుంది. అప్పటికే మూడు కాఫీలు పడ్డాయి. అయినా ప్రాణం నిలబడటం లేదు. ఇంకో కాఫీ అడిగే ధైర్యం లేదు. వంటగదిలో నుంచి వస్తున్న వంటల వాసనకి మరింత చిరాకుగా వుంది.

"అట్లా లంఖణాలు చెయ్యకోపోతే ఉదయాన్నే రెండిడ్డెనలు తినేసి రావచ్చు కదా," అంటాడు గోపాలకృష్ణ. తద్దినం పెట్టిస్తున్న యజమానిని మోసం చెయ్యడానికి మనస్కరించదు విశ్వనాథానికి.

నీళ్లు కుమ్మరించుకోని ఆరేసిన పంచె అందుకున్నాడు. బాగా పాతబడిన పంచె. అంచు రంగు అరచేతి పొడవు పైకి పాకింది. చిన్న చిరుగు కూడా కనిపించింది. తప్పేదేముంది? ఇచ్చింది కట్టుకోవాలి అనుకుంటూ సిద్ధమయ్యాడు.

పన్నెండున్నర దాటింది. రావుగారింట్లో ఎప్పుడూ ఆలస్యమే. తద్దినానికి కూడా శెలవు పెట్టడాయన. ఉదయం ఆఫీసుకి వెళ్లినట్లే వెళ్లి లంచ్‌టైమ్‌లో వస్తాడు. వచ్చిన దగ్గర్నుంచి, 'త్వరగా త్వరగా,' అంటూ ఒకటే హడావిడి. 'సాయంత్రం మళ్లీ ఆఫీస్‌కి వెళ్లాలి,' అంటాడు.

మొదటి భోక్తగా ఎవరో కొత్తాయన. గోపాలకృష్ణగారి తాలూకమో ఆయనతో తప్ప మాట్లాడట్లేదు. మనిషి పల్చగా వున్నాడు. రంగు అదీ బాగానే వున్నాడు. మంచి అంచున్న కొత్త పంచె కట్టుకున్నాడు. ఈ పనికి అలా వుంటే చెల్లదని ఇంకా తెలియనట్లుంది.

ఒకప్పుడు విశ్వనాథం కూడా అలాగే వుండేవాడు. తద్దినాలు, మాసికాలు, శ్రాద్ధకర్మలు, శని దానాలు ఒకటేమిటి అన్ని అశుభాలలో నిలబడ్డాడు. దాని ప్రభావం ఒంటి మీద, ఇంటి మీద కూడా వుందని స్పష్టంగా తెలుసతనికి.

'ఇప్పుడనేముందిలే ఎన్ని సంవత్సరాల నుంచో... నాన్న కూడా ఇదే పని చేశాడాయే,' అనుకున్నాడు.

తండ్రి శివయ్య జ్ఞాపకం వచ్చాడు. ఆయనకూడా ఇలాగే తద్దినం భోజనాలు చేసి ఇబ్బంది పడేవాడు. రాత్రంతా పొట్ట పట్టుకొని కూర్చునేవాడు. కనీసం ఆయనకు మంత్రం చెప్పడం అన్నా వచ్చు. అపరకర్మలు, తద్దినాలకు మాత్రమే వెళ్లేవాడు. పెళ్లిమంత్రాలతో సహా నేర్చుకున్నాడు కానీ, ఆంబోతుకి అచ్చేసినట్లు ఆయనకి తద్దినం బ్రాహ్మడని పేరు తగిలించారు. ఇక ఆ పనులకు తప్ప వేరే పనులకు పిలిచేవారు కాదు. కుటుంబం చాలా కష్టాలు పడింది. మొదట్లో రాజమండ్రిలో వుండేవాళ్లు. రోజూ గోదావరి స్టేషన్‌కు వెళ్లి ట్రైన్ వచ్చీరాగానే పెట్టె పెట్టె మధ్య పరిగెడుతూ, 'అపరకర్మలు చేయించాలా బాబూ,' అంటూ అరుస్తూ తిరిగేవాడు. ప్లాట్ ఫారం మీద శెనక్కాయల అరుపులకీ, ఆయన అరుపులకి పెద్ద తేడా కనపడేది కాదు.

ఓసారి శివయ్య తోటి విశ్వనాథం కూడా వెళ్లాడు. పది పన్నెండు ఏళ్లు వుంటాయేమో అప్పుడు. తండ్రి ప్లాట్‌ఫారమ్ మొత్తం ఆశగా పరిగెత్తడం చూసి సాయం చేయాలనిపించింది.

''బాబూ పిండప్రదానం చేయిస్తారా? అపరకర్మలు చేయిస్తారా?'' అని అరుస్తూ తనూ పరిగెట్టాడు. ఆమడ దూరంలో అటూ ఇటూ పరుగెడుతున్న శివయ్య ఆ దృశ్యం చూసి ఆగిపోయాడు. పరుగులు పెడుతూ వచ్చి విశ్వనాథం గూబ అదిరేలా ఒక్కటి కొట్టాడు.

"వెధవకానా... ఫో ఇంటికి ఫో... దరిద్రప్పీనుగా," అంటూ అరిచాడు. ముందు బిత్తరపోయి, ఆ తరువాత నొప్పి తెలిసి ఏడుస్తూ ఇంటికి పరుగెత్తాడు. తరువాత ఆలోచిస్తే అర్థం అయ్యింది. తాను నడిచిన నిప్పుల గుండంలోకి విశ్వనాథం రాకూడదని ఆయన తపన. ఎవరు ఎలా తలచినా విధి ఇంకోలా నడిపించింది.

అదే వారసత్వం విశ్వనాథానికి కూడా వచ్చింది. అయితే తండ్రి శివయ్య ఎంత చెప్పినా మంత్రం మాత్రం పట్టుబడలేదు. దాంతో శివయ్యగారి శిష్యుడు గోపాలకృష్ణ దగ్గరే పనివాడుగా చేరాడు. ఎక్కడ అశుభం జరిగినా ముందు గోపాలకృష్ణకే తెలుస్తుంది. మంత్రం ఆయనే చెప్తాడు. ఫోన్ చేస్తే భోక్తగానో, వాహకుడిగానో వెళ్లాలి. ఇప్పుడు ఈ తద్దినం సంగతి కూడా అతనే చెప్పాడు.

"ఏమయ్యా విశ్వనాథం అలా కూర్చోనే కలలు కంటుంటావా ఏం? పాదప్రక్షాళన చెయ్యాలి. పెరట్లోకి నడువ్," గోపాలకృష్ణ అరిచినంత పని చెయ్యడంతో తేరుకోని రెండో పవిత్రం, నువ్వులు అందుకోని యజమాని రావుగారి వెంటే నడిచాడు.

ఈ మధ్య ఇలా ఎక్కడపడితే ఆలోచించడం ఎక్కువైపోయింది. ఎప్పుడూ అదే ఎర్రపంచె కనిపిస్తుంటుంది. పడుకుంటే తెల్ల తాచు కల ఒకటి. రాత్రి కూడా వచ్చింది. పొట్ట మీద ఎక్కి ఎడమ భుజం మీదుగా వీపు మీదకు జారే తెల్ల తాచు కల. అది కాటు వేస్తుందేమోనన్న భయంతో కదలకుండా వుంటాడు. అది అలా నడుము చుట్టూ తిరిగి మళ్లీ పొట్ట మీదుగా భుజం మీదకు పాకుతుంది. మెలుకవ వచ్చేదాకా అలాగే జారుతూ వుంటుంది...

"పిలుస్తున్నారు," వీపు మీద తట్టి చెప్పాడు మొదటి భోక్త. బోర్లించిన దొన్నె పక్క నుంచి తప్పుకొని లోపలికి నడిచాడు.

ఎర్రపంచె నిజంగా చాలా బాగుంటుంది. ఎప్పుడో పిల్ల సమర్తాడినప్పుడు బావమరిది పెట్టాడు. ఖరీదు ఎక్కువే వుంటుంది. వాడికి అంత తాహతెక్కడిది? వాడి సంపాదనంతా కొబ్బరి చిప్పలు, ఖర్జూరాలు, వక్కలు, ఆకులు. ఇంటి నిండా అవే. వాడికీ గుళ్లో ఎవరో పెట్టి వుంటారు. అది తెచ్చి నా ముఖాన కొట్టాడు.

అది కడితే ఆ రోజుతో తన సంపాదనంతా తగలబడిపోయినట్లే. చేజేతులా నోటికి అందుతున్న కూడుని కాలదన్నినట్లే.

నెత్తిన నువ్వులు పడ్డాయి. ఇప్పుడు విశ్వనాథం విశ్వనాథం కాదు. రావుగారి తల్లి, ఆమె అత్తగారు, ఆమె అత్తగారి అత్తగారు. వసు రుద్ర ఆదిత్య రూపాలలో. శారదమ్మ, పద్మావతమ్మ, సుబ్బాయమ్మ. ఆ ముగ్గురూ ఏ లోకంలో వున్నా అతను తినే భోజనంతోనే వాళ్ల కడుపు నిండుతుంది. తద్దినం భోజనానికి కూర్చున్న ప్రతిసారీ అనుకుంటాడు- ఆ ముగ్గురు పార్వతి, ప్రియంవద, శేఖరం అయితే ఎంత బాగుంటుందని. తాను ఒక్కడు భోజనం చేస్తే ఇంట్లో వాళ్ల కడుపు కూడా నిండే విధానం వుంటే బాగుండేది.

వడ్డన పూర్తైంది. రావుగారు నిలబడి నమస్కరించి ఆలస్యమైంది, భోజనం చెయ్యండంటూ ప్రకటించాడు. మూడు దాటిందని అప్పుడే గుర్తించాడు విశ్వనాథం.

పిండాలు పెట్టారు. మూడింటి మీదా పసుపు కుంకుమ పూలు చల్లారు.

'ముగ్గురూ అదృష్టవంతులే. పసుపు కుంకుమలతో పోయారు,' అనుకున్నాడు విశ్వనాథం. తన తల్లి తద్దినంలో నల్లటి నువ్వులు తప్ప ఏ రంగూ వుండని తెల్లటి పిండాలు పెట్టడం గుర్తు కొచ్చింది. తల్లి గుర్తుకొచ్చింది. చాలా కష్టాలు పడిందామె. ఆమె అని ఏముందిలే, ఆ ఇంట్లో అడుగుపెట్టిన ప్రతి ఆడమనిషి కష్టాలు పడాల్సిందే. మగవాళ్లు తద్దినమనో, కర్మలనో ఎక్కడో ఒకచోట కడుపుకి ఇంత అన్నం తినేవాళ్లు. తెచ్చిన కాస్త డబ్బు, దానాలు పట్టిన పప్పు ఉప్పులతో సర్దుకు బతికేది ఆడవాళ్లు.

తండ్రి తడిగుడ్డలతో మడి కట్టి కట్టి నుమోనియా వచ్చి పోయాడు. అప్పటికి విశ్వనాథానికి పదిహేనేళ్లు కూడా లేవు.

అక్కడ వుండలేక మహాలక్ష్మమ్మ పిల్లాణ్ణి తీసుకోని గుంటూరు చేరింది. బ్రాడీపేట శివాలయంలో ఆమె అక్క భర్త పూజారి. ఆయన్ను బతిమిలాడుకుంటే వంటలు చేయడానికి కుదిర్చి పెట్టేవాడు.

నెత్తిన జుట్టు వున్న విధవరాలు తద్దినం వంటకి పనికిరాదని తండ్రి పోయిన మూడేళ్లకు శిరోముండనం చేయించుకుందామె. సంప్రదాయం అంటే ఆమెకి కూడా గౌరవమే. కాకపోతే సాంప్రదాయం కోసం కాకుండా పొట్టకూటి కోసం అలా చేయాల్సి రావడం ఆమెను అతలాకుతలం చేసేసింది. విశ్వనాథం తల్లిని అలా చూడలేక ఎన్నో రాత్రులు భోరుభోరున ఏడ్చాడు. ఆ దుఃఖంలో నుంచే ఎలాగైనా సంపాదించాలన్న ఆలోచన పుట్టింది. శనిదానాలతో అతని సంపాదన ప్రారంభం అయ్యింది. మొదటి సారి నువ్వులు మోసుకొచ్చినందుకు మహాలక్ష్మమ్మ అతన్ని చావ గొట్టింది. ఆ దెబ్బలూ, ఆ రోజు గోదావరి స్టేషన్లో తండ్రి కొట్టిన దెబ్బలు ఒకేలా అనిపించాయి విశ్వనాథానికి. కుటుంబ అవసరాలకి సరిపోయేంతలా ఏనాడు సంపాదించలేకపోయాడు. మహాలక్ష్మమ్మ చివరిరోజు వరకూ వంటలు చేస్తూనే పోయింది.

పిండాలకు అందరూ దండాలు పెట్టారు.

రావుగారు హడావిడి మరీ ఎక్కువైంది. ఆఫీసుకి టైమ్ అయ్యింది వడ్డించమంటూ అరుస్తున్నాడు. గోపాలకృష్ణ చదువుతున్న అభిశ్రవణ మంత్రాలను ఆపాడు. "చిన్న తంతు మిగిలింది వుండండి రావుగారు. భోక్తలు తృప్తిగా తిన్నామని ప్రకటించిన తరువాత, ఇంకా పదార్థాలు మిగిలిపోయాయి కాబట్టి వీటిని ఏం చెయ్యమంటారు అని వాళ్లని మీరు అడగాలి. వారు మీరు, మీ బంధువులు కలిసి భుజించమని చెప్తే కానీ మీరు తినకూడదు," అంటూ మంత్రోక్తంగా ఆ పని మొదలుపెట్టాడు.

మిగిలింది మాకివ్వండి తీసుకెళ్తాం అంటే ఏం చేస్తాడో? నాలుగు గారెలు తీసుకెళ్తే పిల్లా, పిల్లాడన్నా తింటారు కదా!

"ఇదిగో మాలోకం విశ్వనాథం. తృప్తాస్మా అనవయ్యా..."

"తృప్తాస్మా."

★ ★ ★

ఇంటికి వెళ్లబుద్దెయ్యలేదు విశ్వనాథానికి. శివాలయం చేరి నాగేంద్రుడి చెట్టుపక్క వేపచెట్టు నీడలో కూర్చున్నాడు. ఓ గంట గంటన్నరకి శంకరశాస్త్రి వచ్చి కూర్చున్నాడు. తెల్ల తాచు కల గురించి చెప్పాడతనికి.

"ఇంకేముంది ఆ నాగేంద్రుడే దర్శనమిస్తున్నాడు. ఆయనకి కాస్త పాలు పోసి నూగుచిమ్మిడి పెట్టవయ్యా. నేను శాంతి జరిపిస్తాను," అన్నాడు. విశ్వనాథం నవ్వి ఊరుకున్నాడు.

"ఏమిటయ్యా అలా నవ్వుతావు? నీ కూతురికి జాతకంలో కుజదోషం వుందా? నీ జాతకంలో కాలసర్ప దోషం సరేసరి. ఇంకా ఏం కావాలేం. అందుకు కాదూ నీ బతుకు ఇట్టా ఏడ్చింది. నా మాట విని సర్పశాంతి జరిపించవయ్యా."

"అంతేనంటావా శాస్త్రులూ," అడిగాడు సగం నమ్మకం కుదిరాక. మిగిలిన సగం నమ్మకం కలిగిలించడం పెద్ద కష్టం కాలేదు శంకరశాస్త్రికి. తద్దినం భోక్తగా చేతికందిన సంభావన అతని చేతిలో పోశాడు విశ్వనాథం.

శంకరశాస్త్రి లేచి, "రేపు వచ్చే చవితిరోజు పెట్టుకుందాం కార్యక్రమం. పిల్లల్ని, మీ ఆవిడని తీసుకోని రా," అంటూ గుళ్లోకి వెళ్లిపోయి తన కార్యక్రమాలు మొదలుపెట్టాడు.

విశ్వనాథం అక్కడే కూర్చున్నాడు. అప్పటిదాకా పంచె దోపుకున్న చోట ఎత్తుగా తగిలిన ఆరొందలు లేకపోవటంతో ఏదో వెలితిగా అనిపించింది. అయినా తప్పదు. ఈ శాంతితో పిల్ల పెళ్లికి, పిల్లాడి చదువుకి ఇబ్బంది లేకుండా పోతే అదే పదివేలు. కనీసం వాడన్నా ఈ శ్రాద్ధకర్మలకు దూరంగా ఉంటే ఈ జన్మకి ఇంక కోరుకునేది ఏదీలేదు. నాగేంద్రుడి పుట్టవైపు నమస్కారం చేశాడు.

చీకట్లు ముసురుకోని గుళ్లో వున్న నాలుగు దీపాలు వెలిగాక కూడా ఇంటికి వెళ్ల బుద్దెయ్యలేదు. వచ్చేపోయే వాళ్లను గమనిస్తూ వుండిపోయాడు. ఎర్రచీర కట్టుకోని వచ్చినావిడని చూశాక మళ్లీ ఎర్ర పంచె గుర్తుకొచ్చింది. అది కట్టుకునే యోగం తనకు ఎలాగూ లేదు. నేను చస్తే కూడా తెల్ల చిరుగుల పంచే కడతారు. అనుకున్నాడు. తల విదిలించి ఇంటి దారి పట్టాడు.

★ ★ ★

"మన సత్యం పెళ్లట. మీకేమన్నా తెలిసిందా?" అడిగింది పార్వతి ఆయన ఇంట్లోకి అడుపెడుతుండగానే.

విశ్వనాథం తల ఊపి ఊరుకున్నాడు. జాగ్రత్తగా వెతికితే భార్య అన్న మాటల్లో వ్యంగ్యమో వెటకారమో కనపడుతుందని అతనికి తెలిసినా ఆ ప్రయత్నం అనవసరం అనుకున్నాడు.

"మనం ఏమన్నా కానివాళ్లమా? స్వయానా మీ పెదనాన్నగారి మనవడే కదా కనీసం మీకు చెప్పాలని కూడా అనిపించలేదా మీ అన్నయ్యగారికి?" అంది నిష్ఠూరం ధ్వనించాలన్న ప్రయత్నం ప్రత్యేకంగా చేస్తూ.

"ఎవరు చెప్పారు?" అన్నాడు విశ్వనాథం భుజానికి వున్న కండువాని గోడకి కొట్టిన మేకుకి తగిలిస్తూ. ఆ మేకుకి తగిలించిన రెండు సంవత్సరాల క్రితం కేలండర్ మీద వున్న లక్ష్మీదేవి అభయహస్తాన్ని ఎప్పటిలాగే ఆ కండువా కప్పేసింది.

"మన సరోజనమ్మ లేదూ... ఆవిడని మాట్లాడుకున్నారట వ్రతం రోజు వంటకి. వచ్చేవారమే పెళ్లి," చెప్పిందామె అతని సమాధానం కోసం ఎదురుచూస్తున్నట్లుగా.

"కార్డు వేసే వుంటారులేవే. రేపో మాపో వస్తుందిలే," అన్నాడు అతను. అది నిజం అన్న భావన కన్నా నిజం అయితే బాగుండు అన్న ధ్వని వుంది అతని సమాధానంలో.

"మీవాళ్ల మీద ఎంత నమ్మకమో! ఒక్క మాట పడనీరు కదా," అంది అస్త్రసన్యాసం చేస్తూ.

"నిన్నెవరు ఆపారు. అనదల్చుకుంటే ఒక్క మాటేమీ వంద మాటలను. వద్దన్నానా?" విశ్వనాథం గొంతులో కాస్త చిరాకు కనపడేసరికి వదిలేసిన అస్త్రాలని మళ్లీ అందుకుంది పార్వతి.

"మరేం... మాట అనడానికి మీ సంపాదనేమన్నా ఖర్చైపోతోందా. పెదనాన్న కొడుకైనా, ఆ రాఘవేంద్ర చుట్టూ అన్నయ్య అన్నయ్య అంటూ తిరిగితిరి. ఆఖరుకి మనమ్మాయి సమర్తాడి నప్పుడు కూడా ఇంటికి పొయ్యి మరీ పిలిచొచ్చామే... కనీసం

ఆపాటి ఆలోచన వుండద్దు ఆయనగారికి? డబ్బులేకపోయే సరికి కనీసం కళ్లకి కూడా ఆనట్లేదు మనం,'' ఈసారి తీవ్రత ఎక్కువ వడంతో విశ్వనాధం సమాధానం చెప్పక తప్పలేదు.

"తెలుసుగా ఆ సంగతి? మళ్లీ అడుగుతావే? నేను చేసే పనులు తెలియదా నీకు? శవాలు, తద్దినాలు, శనిదానాలు... మన సంగతి తెలిసీ మనల్ని పిలుస్తారని ఎలా అనుకుంటున్నావు,'' అన్నాడు.

ఆ సమాధానం ఆమెకు తెలిసిందే. అయినా అతను అంత సూటిగా చెప్తాడనీ, ఆ విషయాన్ని అంత తేలిగ్గా తీసుకుంటాడనీ ఆమె ఊహించలేదు. ఇంక మాట్లాడటానికి ఏమీ లేదని అర్థం అయ్యింది.

"బియ్యం పడేద్దునా?'' అంది.

"వద్దు. రావుగారింట్లో తద్దినం ఆలస్యం అయ్యింది. భోజనాలయ్యేసరికి నాలుగు. ఆకలి లేదు,'' అన్నాడు.

"మీకు షుగర్ వుంది. అంత ఆలస్యంగా భోజనం చేస్తే ఎలా?'' అందామె.

"మన చేతుల్లో వుందట్నే? భోక్తగా వెళ్లాక తప్పుతుందా?'' అన్నాడు మంచం మీద నడుం వాలుస్తూ. ఆమె సమధానం చెప్పకుండా లోపలికి వెళ్లిపోయింది.

ఆమె షుగర్ సంగతి జ్ఞాపకం చేయడంతో ఆరోజు తను తిన్న తీపి పదార్థాలన్నీ జ్ఞాపకానికి వచ్చాయి. రవ్వలడ్డు అంటే రావు గారి తల్లిగారికి చాలా ఇష్టమేమో, ఒకటికి నాలుగుసార్లు వడ్డించారు. చివరగా అరటిపండు ఒకటి.

"ఇదిగో, ఆ షుగర్ మాత్తర్లు రెండు తీసుకురా, ఆ చేత్తోనే మంచినీళ్లు కూడా,'' అన్నాడు విశ్వనాధం.

"ఏమిటి? మళ్లీ స్వీట్లుగానీ తిన్నారా?'' అంది మందులు, నీళ్లు అందిస్తూ.

"తప్పలేదే... తద్దినంలో భోక్తగా కూచున్నాక బాగా తినకపోతే వాళ్లకి తృప్తి వుండదు. మళ్లీ పిలిచి చావరు,'' అన్నాడు సంజాయిషీగా. రెండు మాత్రలు వేసుకోని నీళ్లు తాగి చెంబు ఆమె చేతిలో పెట్టాడు.

"ఆరోగ్యం జాగ్రత్త. మిమ్మల్ని నమ్ముకోని ఇక్కడో మూడు బతుకులు వున్నాయి. మర్చిపోకండి,'' అంటూ వంటింట్లోకి నడిచిందామె.

"ఏమౌతుంది. ఇవాళ చస్తే రేపటికి రెండు,'' అన్నాడతను మళ్లీ మంచం మీదకు ఒరుగుతూ.

"ఛ... ఆపండా పాడు మాటలు. అసురసంధ్య వేళ...'' ఆమె ఇంకేదో అనబోతుంటే విశ్వనాధం సెల్‌ఫోన్ మోగింది.

ఫోన్ తీసి చూశాడు. ఫోన్ పైన అద్దం పగిలిపోయి వుండటంతో ఎవరో తెలియలేదు. అరిగిపోయిన బటన్‌ని బలంగా నొక్కి "హలో'' అన్నాడు. ఓ నిముషం మాట్లాడి పెట్టేశాడు.

"రేపటికి వాహకుడి అవతారం. గాంధీనగర్‌లో ఎవరో పోయార్ట,'' అన్నాడు క్లుప్తంగా.

ఆమె ఆయన వైపు ఓ క్షణం చూసి వెళ్లిపోయింది. ఆ చూపులోనే కాస్త నిరసన, ఇంకాస్త నిరాశ వున్నాయన్న సంగతి విశ్వనాధానికి అర్థం అయ్యింది. అయినా మారు చెప్పలేదు. మంచం మీద మళ్లీ పడుకున్నాడు కానీ నిద్ర పట్టలేదు. కడుపులో ఏదో వికారంగా వుంది. వేళకాని వేళ భోజనం. అది కూడా మామూలుగా తినేదాని కన్నా ఎక్కువ తినడం. నాలుగు కూరలు, నాలుగు పచ్చళ్లు, గారెలు, రవ్వలడ్డు ఒకప్పుడు మూడు వాయల గారెలు తినేవాడు. భోక్త అంటే ఇలా తినాలని చెప్పుకునేవారు. అలా తింటాడన్న కారణంతోనే ఇప్పటికీ పిలుస్తుంటారు. అందుకే అంతలా తినడం తప్పడంలేదు. వయసు మీద పడుతుండటంతో కొంచెం కష్టంగా వుంటోంది. కళ్లు మూసుకోని పడుకున్నాడు. మళ్లీ తెల్లతాచు కల వస్తుందేమోనని భయం భయంగా వున్నాడు.

పక్కనే గడప దగ్గర చాప పరుచుకోని పార్వతి పడుకుందన్న సంగతి విశ్వనాథానికి అర్థం అవుతూనే వుంది. ఆమె ఏమీ తినలేదని కూడా తెలుసు. ఒక పూట మానేస్తే ఇంకో పూటకు వుంటుందని ఆమె అనుకుంటోందనీ తెలుసు. అడిగితే పక్కింట్లో సరోజనమ్మ ఎక్కడో వంట చేసి వస్తూ గారెలు, భక్ష్యాలు తెస్తే తిన్నాని చెప్తుందనీ తెలుసు. అన్నీ తెలిసి అడగటం ఎందుకని నిద్ర నటిస్తూ ఊరుకున్నాడు విశ్వానాథం. ఆయన నిద్ర నిజం కాదనీ, అతని మనసులో ఆలోచనలు తిరుగుతుంటాయనీ ఆమెకు తెలుసు. అందుకే ఆమె మాట్లాడదు.

"అమ్మా ఆకలేస్తోందే'' శేఖరం వాళ్లమ్మతో అనడం విన బడింది.

"మ్...! నాన్నగారు లేస్తారు. ఈరోజు సంభావన తెచ్చుంటారు. రేపు పొంగలి చేసి పెడతా సరేనా,'' పార్వతి మాటలు విన పడుతుండగా విశ్వనాధం కళ్లో తెల్లతాచు అతని మీద నుంచి జారి కింద పడింది.

"లక్ష్మిగారింట్లో నందికేశుల నోముకి వెళ్తానంటే వద్దన్నావు. ఆ ఉండ్రాళ్లయినా తిని వచ్చేవాడ్ని.''

తెల్లతాచు శేఖరం వైపు పాకడం తెలిసినా కదలలేక ఉండిపోయాడు విశ్వనాధం. భుజం మీద తెల్లతాచు కాటు వేసిన చోటు నుంచి రక్తం స్రవిస్తోంది.

డెబ్భైకి పైగా కథలు రాశారు. 'ఊహాచిత్రం' కథాసంపుటి, మరో ముగ్గురు రచయితలతో కలిసి 'నాలుగు నాలుగుల పదహారు' కథాసంకలనం వెలువరించారు. నివాసం హైదరాబాద్.

email: satyaonline@gmail.com

కొలతల్లో...

మెర్సీ మార్గరెట్

దూరాన్ని
మాటలూ,
పాటలు
అటూ ఇటూ తచ్చాడుతూ తిరిగే చూపులూ
కొలుస్తాయంటావు నువ్వు
కాదు గాంధీ నవ్వులద్దబడిన కాగితమూ
లెక్కేస్తుందంటాను నేను

విరిగిన బల్ల చుట్టూ
నాలుగు అతిశయోల్లాస కబుర్ల
అవిటి నిరీక్షణలో
మూతవేయని కుతకుతల శబ్దపు
మనస్థావరంలో
లెఫ్ట్ రైట్ పదాల కవాతులో
పదం పదానికీ రంగు రుచి చిక్కదనం
కొరిలేషన్ వెతుక్కుంటుందంటావు నువ్వు
తారులాంటి ఆలోచనలపై అంకెలు వేస్తుంటాన్నేను

చేతిలో చతురస్రాకారపు పలక
ప్రపంచదేహాన్ని నగ్నంగా చూపిస్తుంటే
రంగురంగుల గాగుల్స్ తో ఉదయాస్తమయాలను
అరచేతుల్లోకొంపుకొని
అక్క నుంచి
కాగితపు గీతల వేళ్ల పైకే తర్జుమా చేస్తు
సీరియల్ లైట్లలా అభిప్రాయాల్ని
మెడలో వేసుకు తిరగాలనుకోవడంలో
ఎన్నెన్ని కొలతలో
బల్బు బల్బుకీ రంగుల సాంద్రత
అవిభాజ్యమైందంటావు నువ్వు
కాదూ ప్రతీదానికి
స్టాండర్డ్ డీవియేషన్ ఉంటుందంటాను నేను

కాలం
ముంజేతికి వేలాడుతుంటే
సారం కోల్పోయిన భావమేదో
అసంపూర్ణ ఊహలశకలాల్ని కుప్పనూర్చుతూ
రెక్కలొచ్చి ఎగిరిపోయిన కవితల దూరాల్ని ఊహిస్తూ
ఏ సెంటీగ్రేడ్ హీట్తోనో లెక్కించబడుతూ ఆవిరవుతుంటే
కొలతలు బాధిస్తాయంటాను నేను
కాదు
కొలతలు మన పరిమితుల్ని పెంచుతాయంటావ్ నువ్వు..!

ఇటీవల కాలంలో విస్తృతంగా కవిత్వం రాస్తున్న మెర్సీ మార్గరెట్ నల్గొండ జిల్లాలో పుట్టారు. ఒక కవితాసంపుటి ప్రచురించారు. నివాసం హైదరాబాద్.
email: mercydachiever@gmail.com

విశాల హృదయం

స్మిత గుంటుపల్లి

తెల్లవారుఝామున నాలుగు గంటలకి మంచి నిద్రలో ఉండగా ఫోన్ రింగ్‌కి మెలకువ వచ్చింది. ఈ టైంలో ఫోన్ చేసేవాళ్లు ఎవరు, పొరపాటున ఇండియా నుంచి ఎవరన్నా చేశారేమో అనుకుంటూ ఫోన్ తీసి, లిఫ్ట్ చేసే లోపు కట్ అయ్యింది. నెంబర్ చూస్తే ఇండియా నుంచే కానీ తెలియని నెంబర్. మనకి చికాగోలో టైం ఇప్పుడు నాలుగు అయ్యిందంటే, ఇండియాలో మధ్యాహ్నం. ఇది ఎవరి నెంబర్ అయి ఉంటుంది అని అనుకుంటూ ఉండగానే whats appలో మెసేజ్ వచ్చింది. ఇండియాలో ఉండే మా ఫ్రెండ్ సుధ నుంచి. 'వసుంధర- మెసేజ్ చూసుకుంటే ఒకసారి కాల్ చెయ్యి' అని.

సుధ నా చిన్ననాటి స్నేహితురాలు, ఇంటర్మీడియట్ వరకు పక్క పక్క ఇళ్లలో ఉండేవాళ్లము. నేను డిగ్రీ అయ్యాక పెళ్లి చేసుకుని అమెరికా వచ్చేసాను. సుధ డిగ్రీ తర్వాత పెళ్లి చేసుకుని ఇండియాలోనే వుంది. కానీ మా ఇద్దరి మధ్య స్నేహం ఇన్లాండ్ లెటర్ నుంచి whatsapp మెసేజ్‌ల దాకా కొనసాగుతూనే ఉంది. ఒకసారి కాలంలో వెనక్కి ప్రయాణం చేసి లేట్ 90'స్ లోకి చూస్తే, అంటే facebook ,whatsappలు లేని మునుపు, ఇండియాలో సెల్‌ఫోన్ ప్రభంజనం మొదలు కాక ముందు రోజుల్లో, ఈ టైంలో ఫోన్ అంటే వినకూడనిది ఏమన్నా వినవలసివస్తుందేమో అని భయం ఉండేది కానీ ఇప్పుడు, మనకి అయినా రెస్ట్ ఉంటుందేమో కానీ ఫోన్‌కి మాత్రం రెస్ట్ లేదు.

ఇండియా నుంచి కాల్ చేసింది కూడా సుధనే ఏమో అని అనుకుంటూ సుధకి ఫోన్ చేశాను. ఫస్ట్ రింగ్‌కి ఫోన్ ఎత్తిన సుధ, హలోకి హలో బదులు ఈ మధ్య సమీరతో ఏమన్నా మాట్లాడావా అని అడిగింది. తన మాట ఎందుకో

కంగారుగా ఉంది. సమీర, సుధ ఒక్కగానొక్క కూతురు. మాస్టర్స్ చెయ్యటానికి అమెరికా వచ్చింది. ఇప్పుడు మాస్టర్స్ అయిపోయి కన్సల్టెన్సీలో జాయిన్ అయ్యి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉంది.

"కాల్ చేశాను సుధా, వారం క్రితం కాబోలు- ఫోన్ లిఫ్ట్ చెయ్యలేదు కానీ 'మార్కెటింగ్ నడుస్తూ వుంది, కాల్స్ ఏమి రావట్లేదు ఆంటీ' అని మెసేజ్ పెట్టింది. ఏమి జరిగింది, కంగారు పడ్తున్నట్లున్నావు?" అని అడిగాను.

"ఏమి అమెరికానో ఏమో వద్దన్నా వినకుండా వెళ్లింది. నీకు అమెరికానే వెళ్లాలి అంటే పెళ్లి చేసి పంపిస్తాము అని నేను, వాళ్ల నాన్న మరీ మరీ చెప్పాము. కష్టపడి ఎగ్జామ్స్ రాసి అడ్మిషన్ తెచ్చుకున్నానమ్మా... ప్లీజ్ పంపించండి అంటూ వచ్చింది," అని గద్గద స్వరంతో చెప్తుంటే నాలో కంగారు మొదలయ్యింది.

"ఇప్పుడు అయిపోయినవన్నీ ఎందుకు? ఏమి జరిగింది అసలు?" అని అడిగాను.

"నిన్నంతా ఫోన్ చెయ్యలేదు వసూ. రోజూ పొద్దున్న, సాయంత్రం కాల్ చేసే అమ్మాయి కాల్ చెయ్యలేదు. మేము చేసినా లిఫ్ట్ చెయ్యట్లేదు, మెసేజ్‌లకి రిప్లై లేదు. ఈ మధ్య జాబ్ రాలేదని టెన్షన్ పడుతుంది. అక్కడ దగ్గరగా ఉన్నావు, అక్కడివి నీకు అర్థం అవుతాయి అని నీకేమన్నా చెప్పిందేమో అన్నట్లు చేశాను. జాబ్ ఎప్పుడు వస్తుందో ఏంటో అంటూ మాట్లాడింది మొన్న చేసినప్పుడు. Depressedగా ఉంటుందేమో అని భయంగా ఉంది. జాబ్ రాకపోతే ఏమి, ఇక్కడ బ్రతకలేమా ఏంటి? అమెరికానే దేశమా ఇక్కడికి వచ్చేయొచ్చు కదా," అంటూ సుధ మాట్లాడుతూనే వుంది.

ఇంతలో నేను అందుకొని, "నువ్వు ఏవేవో ఊహించుకుని అనవసరంగా కంగారు పడొద్దు. నేను ఒక సారి సమీరతో మాట్లాడి అసలు విషయం ఏంటో కనుక్కుంటాను. జాబ్ వచ్చేవరకు వచ్చి ఇక్కడ వుండమంటాను. నేనున్నాను కదా," అని చెప్పి ఫోన్ పెట్టేసాను.

సుధ నోట వెంట వచ్చిన depressed అనే మాటతో ఏదో ఆలోచిస్తూ ఉండగానే మా వారు మనోహర్, 'ఎవరు పొద్దున్నే ఫోన్- Is everything OK?' అని అడిగితే జరిగినదంతా చెప్పాను.

సరిగ్గా వారం రోజుల క్రితం నాకు మనోహర్‌కి సమీర టాపిక్ వచ్చి చిన్న డిస్కషన్ జరిగింది.

అది ఎలా మొదలైందంటే, "ఈ మధ్య సమీరతో ఏమన్నా మాట్లాడావా" అని మనోహర్ నన్ను అడిగిన ప్రశ్నతో.

"లేదు, తను కూడా చెయ్యలేదు," అన్న నా సమాధానంకి, "ఒకసారి నువ్వే కాల్ చెయ్యాల్సింది," అన్న మనోహర్‌తో, "ఎందుకు? అవసరం వున్నప్పుడు మాత్రమే కాల్ చేసేవాళ్లకి చేసినా చెయ్యకపోయినా ఫర్లేదు," అని వెంటనే సమాధానం రెడీగా ఉన్నట్లు చెప్పాను.



"చిన్న అమ్మాయి కదా, మనం పెద్ద వాళ్లము ఈ దేశంలో 25 ఏళ్లుగా ఉంటున్నాము. మీ ఫ్రెండ్‌కి నీకెందుకు మేము ఇక్కడ ఉన్నాం అని భరోసా కూడా ఇచ్చావు కదా," అన్న మాటలకి నాకు ఎక్కడలేని కోపం తన్నుకు వచ్చింది.

"భలే చెప్తున్నారు మనోహర్ మీరు, 'GRE /TOEFL ఎప్పుడు రాయాలి ఆంటీ? మీ దగ్గరలో ఏమన్నా యూనివర్సిటీస్ వున్నాయా? మీ హెల్ప్ కావాలి ఆంటీ అమ్మని నాన్నని ఒప్పించ టానికి,' అని ఇండియా వెళ్తే నాకు ఊపిరి ఆడనివ్వకుండా మాట్లాడిన అమ్మాయి సమీర. తాను అడిగినట్లుగానే సుధ వాళ్లని ఒప్పించాను. 2 గంటల దూరంలో వున్న యూనివర్సిటీలోనే అడ్మిషన్ వచ్చి, వీసా కూడా వచ్చి అమెరికా వచ్చింది అదీ మన ఇంటికే. రూమ్‌లోకి కావాల్సినవన్నీ, కిచెన్ అండ్ స్టేషనరీతో సహా అన్నీ మనమే కొనిపెట్టి వెళ్లి దించి వచ్చాము. నా బెస్ట్ ఫ్రెండ్ కూతురికి ఆ మాత్రం చెయ్యలేనా అని. మన మొబైల్ ప్లాన్‌లో జాయిన్ చేసి ఫోన్ కూడా తీసి ఇచ్చాము. సెలవులకి, వీకెండ్స్‌కి ఫ్రెండ్స్‌తో ఎప్పుడు వచ్చినా రెడ్ కార్పెట్ ట్రీట్‌మెంట్- హాస్టల్ నుంచి ఇంటికి వచ్చినట్లు. వచ్చినప్పుడు కూడా 24 గంటలు ఫోన్‌తోనే తప్ప ఒక మాట మంతి లేకపోయినా ఈ కాలం పిల్లలే అలా ఉన్నారు అనుకుని సర్ది చెప్పుకునేదాన్ని. మీరన్నట్లు ఆ పెద్దరికంతోనే తను ఫోన్ చేసినా చెయ్యకపోయినా అన్నీ బాగోగులు కనుక్కుంటూ నేనే కాల్ చేస్తూ ఉండేదాన్ని.

'Greencard ఉన్నవాళ్లు సైన్ చేస్తే ఇక్కడ స్టూడెంట్ లోన్ తక్కువ ఇంట్రెస్ట్‌కి వస్తుంది అంట ఆంటీ మీరు సైన్ చేసి హెల్ప్ చేస్తే ఇండియాలో ఏమి బర్డెన్స్ ఉండవు అమ్మవాళ్లకి,' అని నన్ను అడిగితే వెళ్లి పేపర్ వర్క్ అంతా ఫిల్ చేసి సైన్ చేసి వచ్చాను. రెండు నెలలు లోన్ పేమెంట్ కట్టలేదు అని నాకు మెసేజ్ వస్తే నేను కాల్ చేసి ఏమన్నా ఇబ్బంది పడ్తున్నావా? అంతా బానే వుందా? అని నేను సున్నితంగా అడిగితే- 'మా కష్టాలు మీకేమి తెలుస్తాయి ఆంటీ మీరు అమెరికా వచ్చినప్పుడు ఉన్నంత ఈజీ కాదు ఇప్పుడు' అని మాట్లాడిన అమ్మాయితో నాకు మళ్లీ ఫోన్ చెయ్యాలని అనిపించలేదు. ఆ తర్వాత గ్రాడ్యుయేషన్ అయ్యింది అని కానీ, కెరీర్ ప్లాన్ ఇది అని కానీ కనీసం ఫోన్ కూడా లేదు. మూడు నెలలు అయ్యింది,' అని నా ఉక్రోషం అంతా మనోహర్ ముందు బయట పెట్టాను.

"అంటే నువ్వు తన నుంచి ఏమన్నా ఎక్స్‌పెక్ట్ చేస్తూ అవన్నీ చేశావా? లేదా మీ ఫ్రెండ్ కోసం మన బాధ్యతగా చేశావా ఇప్పు డైనా మన బాధ్యతగా కనుక్కోవాలి కదా," అన్న మనోహర్‌తో, "మీ అంత 'విశాల హృదయం' నాకు లేదు," అని నేను వ్యంగంగా మాట్లాడితే 'ప్లీజ్ గ్రో అప్' అన్నట్లు మనోహర్ నన్ను చూసిన చూపు ఆరోజు ఆలోచించుకునేలా చేసింది.

సుధ కోసం ఆరోజు సమీర బిహేవియర్‌ని పట్టించుకో కుండా ఉండలేనా అని వెంటనే కాల్ చేశాను కానీ లిఫ్ట్ చెయ్యలేదు - మెసేజ్ రూపంలో రిప్లై అయితే ఇచ్చింది.

ఇప్పుడు మళ్లీ సుధ ఫోన్ కాల్‌తో ఆ డిస్కషన్ అంతా గుర్తొచ్చింది. నేను సమీరకి కాల్ చేసి కూడా వారం అయ్యింది కదా, మళ్లీ కాల్ చేసి చూస్తాను. ఇప్పుడు అయినా ఫోన్ లిఫ్ట్ చేస్తుందో లేదో అనుకుంటూనే చేశాను.

ఈ సారి ఫోన్ లిఫ్ట్ చేసిన సమీర, "హలో ఆంటీ- ఎలా వున్నారు?" అంటే,

"నువ్వు ఎలా ఉన్నావు? జాబ్ సెర్చ్ ఎలా ఉంది?"అని అడిగాను.

"ఇంటర్వ్యూ కాల్స్ ఏమి రావట్లేదు, చాలా లోన్లీగా వుంటుంది. మీకు కాల్ చేద్దాం అనుకున్నా కానీ మీతో నేను ప్రవర్తించిన తీరు నాకే సిగ్గనిపించి చెయ్యలేదు," అంటే,

"ఇప్పుడు నీకే అర్థం అయ్యింది కదా మనిషి, మాట విలువ. ఇంకా అంత కన్నా ఏమి కావాలి. లోన్లీగా ఫీల్ అవుతూ అక్కడే ఎందుకు ఉన్నావు? నీకు ఎప్పుడు రావాలనిపించిన వచ్చేసెయ్యి. నీ మార్కెటింగ్ ఇక్కడ నుంచి కూడా కుదురుతుందేమో కనుక్కో. అమ్మవాళ్లతో ఫోన్ చేసి మాట్లాడుతున్నావా? జాబ్ అదే వస్తుం దిలే, నువ్వు ఫోన్ చెయ్యకపోతే వాళ్లు కంగారుపడతారు కదా. మాట్లాడుతూ ఉండు," అని చెప్పి ఫోన్ పెట్టేసాను.

సమీర విషయంలో మనోహర్‌తో నేను దేశాన్ని ఉద్ధరిస్తు న్నట్లుగా మాట్లాడాను. అహం తలకెక్కితే విజ్ఞత కోల్పోవటం అంటే ఇదేనేమో. ఇప్పటికైనా ఆ 'నేను, నాది, గుర్తింపు' అనే ఫోబియాలో నుంచి బయటకు వచ్చి చిన్న బేసిక్ వాల్యూస్ అండ్ ప్రిన్సిపుల్స్ గుర్తు వచ్చినందుకు ఆనందంగా అనిపించింది. అలాగే మనోహర్ లాంటి 'విశాల హృదయం' వున్న మనిషికి అర్థాంగి అయినందుకు ఒకింత గర్వంగా అనిపించింది.

2017 తానా సభల నిర్వహణలో చురుకైన పాత్ర పోసిస్తున్న స్మిత గుంటుపల్లి భావుకత నిండిన రచయిత్రి కూడా. నివాసం సెయింట్ లూయిస్.
email: guntupallis@gmail.com

గతము ప్రస్తుతము

సుశ్రీ

పూర్వము గ్రామఫోను రికార్డులు ఉండేవట. త్రేతాయుగంలో ఋషులు వేల సంవత్సరాలు బ్రతికేవారట. ఒకప్పుడు పిల్లలు గురుకులములలో అతి తక్కువ కాలములోనే ఎంతో ఆధ్యాత్మిక జ్ఞానము పొందేవారట. ఈ 'అట' కబుర్లు చాలా సందర్భములలో అతిశయముగా తోచటం సహజం. అలాగే నేటికి ప్రస్తుతమైనది, రేపటికి గతమౌతుంది. గతమునకు ప్రస్తుతానికి ఉన్న తేడా తెలియజేసే చిరు ప్రయత్నమే ఇది.

గతము ప్రస్తుతమ్ము గమనించి చూచిన
మంచి పనులనెల్ల మరచిపోయి
నీది నాదియనుచు నిలకడయే లేక
పరుగులిడుట తగదు ప్రతినిముషము!

గతము:

చద్ది కూడు తింటు చక్కగా ఆడుచు
చెట్టు పుట్టలందు చేలయందు
గోటిబిల్ల కబడి కోతికొమ్మచ్చియు
ఆడుకొంటిమపుడు అదుపులేక!

ఎండ రేగినపుడు ఎంచక్క యిళ్లలో
అష్టచమ్మ లాట అరుగుమీద
వంటవార్పులాట వైకుంటపాళియు
ఆడుకొనుచు గడిపె పాడుకొనుచు!

ఆట మర్మమనగ ఆనాడె తెలిసెను
గేలి చేయకుండ గెలిచినపుడు
ఓడినప్పుడైన ఓర్పుగా మనుటయు
కర్మ ధ్యాన మబ్బె కష్ట పడక!
నిజము మాటలాడు నిర్భీతిగా నుండు
నేటిపనులు నేడె నెఱపుమనుచు
పొరుగువారితోడ పొత్తుగా ఉండనే
గురువుగారి మాట గౌరవిస్తు!

గాలిపటము కూర్చి గగన సీమనుయేలి
బుజ్జియాకు తోడ బూరజేసి
కాగితపు పడవలు కాలువను వదలి
ఏడు పెంకులాట ఎంత బాగు!

గంటి బొన్న కంకి గజనిమ్మ మామిడి
చెరకు అరటి దుంప శనగ పప్పు
తాటి ముంజులున్ను తిలపప్పు ఉండలు
పాత జ్ఞాపకాలు పదిలమెపుడు!

ఊట బావి నీరు ఊరిలో సెలయేరు
రావి చెట్టు నీడ రచ్చ బండ
తోలు బొమ్మలాట తిరణాల సందడి
పంటచేల తోడ పసిడి పల్లె!
ఒకరికొకరు తోడు ఒక్క కుటుంబమో
ఒక్క తాట నడచి ఓర్మితోను
కలసి ఉంటె సుఖము కలదనీ చాటుచు
పెంచినారు నాడు పేర్మి తోను!



ప్రస్తుతం

చెంగు చెంగు మంటు చెలరేగు పిల్లలు
కానబడుట లేదు కన్నులకును
చిన్న పెట్టె బట్టి చిత్రమైన విధము
ఆడుచుండ్రు వారు అలవకుండ!

పిండి రొట్టి వదలి పిజ్జాలు బర్గర్లు
చద్ది అన్నమొదలి సేండువిచ్చు
అట్టు వడల నొదలి అరగని బేగుల్సు
అరిసెల రుచి మరచి అన్నమొదలి

పరుగు లెత్తి మనము పాలు తాగాలన్న
కొంటె నవ్వు నవ్వు క్రొవ్వు కొలత
నిలబడి ఒకచోట నీరు తాగాలన్న
నిముష కాలమైన నష్టమౌను!
మనము నడచు దారి మనదైన వారికి
మార్గదర్శనమ్ము మిగుల నిజము
తల్లి గట్టుపైన తినుచునుండిన వేళ
దూడ పొలములోకి దూరబోదు!

నేటి తరమువారు నేర్చుకొనుటలేదు
పెద్దవారి పట్ల ప్రేమ యనిన
గురువులంటె అసలు గౌరవమేలేదు
స్నేహమన్న పదము చెదిరి పోయె!
నీతి కథల తోడ నిద్రబుచ్చెడి రోజు
దేశభక్తుల గూర్చి తెలుపు దినము
మాట మాటలోన మధువులూరేటట్లు
తీర్చు దిద్దు వార్కి దీప్తి కలుగు!

ముగింపు

మనసునదుపు చేసి మారుతి కావలె
కానినాడు మనము కపికి సమము
వినయ సంపదలను వికసింపజేయుటే
ముక్తి మార్గమునకు మొదటి మెట్టు!
తోడి వార్కి యెపుడు తోచిన సాయము
చేయుచుండ వలెను చెప్పుకోక!
ఎదుటి వారి యందు ఎంచక తప్పులు
మెలగు జనులకెపుడు మేలు కలుగు!

సుశ్రీ కలం పేరుతో రచనలు చేస్తున్న అయినాపురపు శ్రీనివాసరావు సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్. సాహిత్యం, వేద గణితం ఆసక్తి. నివాసం సెయింట్ లూయిస్.
email: ainapura@yahoo.com

NIMBLE ACCOUNTING

see everything

Nimble Accounting is not just any accounting, it is specially created for your business

- Business health at a glance on the dashboard.
- No need for the use of spreadsheets.
- Easy and convenient accounting for multiple companies in single login.
- Arrest revenue leakage with real-time alerts.
- Insights on key performance indicators, with drill down analytics.
- Business specific automations for enhanced productivity.
- Information on demand to drive profitability.
- Automatic generation of combined financial statements of all group companies.
- Customized financial solutions for various business verticals.







Our Products

Nimble Retail

Nimble Staffing

Nimble Property

For Demo Contact Us :

sales@nimbleaccounting.com

1-866-964-6253

www.nimbleaccounting.com

Invest $500,000 in USA

Receive permanent residence for the family



The demand for steel is bound to grow with the boom in construction, housing and infrastructural projects.
Moreover, the sector is growing very fast. Considering the rate of increase of demand it is expected that Steel Billet manufacturing unit will perform well and will have no difficulty to market its products.Pursuing sustainable growth with a sense of responsibility towards employees and their families.Pursuing the highest quality, to be responsible for the safety and happiness of customers

As a human-centric company, our aim is to offer a safe, motivating and attractive workplace where people can grow and contribute to the company's development.



Process Flow



Life cycle assessment of steel manufacturing process(LCA)

What we manufacture?



Steel Billets are the basic raw material for manufacturing various types of re-rolled products. With the increased infrastructural activities in the country, the demand for steel billets are very high now-a-days.

The most commonly produced Steel Billets are 4x4 , 5x5, 6x6 inches and 10/20/40 ft.

SV steel inc, 14333 Woodrow Wilson St | Detroit | MI 48238| www.svsteel.net
contact: info@svsteel.net | phone : 313-826-7096

With Best Compliments

Water Color Painting by Moshe Dayan

Gemini
Consulting & Services



Ideate → Innovate → Incubate → Stimulate

Gemini i[g]nite

Honesty & Integrity
Enriching Partnerships

Featured in Inc. 5000
2014, 2015 & 2016

ISO 9001:2015 CERTIFIED COMPANY

SAP Partner

Mid-States Minority Supplier Development Council

MEMBER
CII Confederation of Indian Industry
www.cii.in

- ST.Louis
- Atlanta
- Chicago
- Hyderabad
- Noida
- Bhubaneshwar

www.gemini-us.com

KUBERA FINANCIAL SERVICES

US & INDIA : Accounting, Taxation and Investment Services

At Kubera Financial Services LLC, we help you organize your finances, by providing all related services under one umbrella . With our panel of experts we are dedicated to offer :

- **Accounting Services :** Centralized accounting services from our expert accounting teams of India and US for personal and business accounting
- **TAX Services :** Our US and Indian income tax law experts will provide advisory services in Tax planning, Tax filing and Tax advisory services for NRIs in India and in USA
- **Wealth Management Services:** Financial Planning, transferring inherited assets to US and Investment management services to NRIs under one umbrella with our panel of expert advisors

It's never too late and You are in the right place

"Ignorance of the Law Is No Excuse, But it is Reality"

"The hardest thing to understand in this world is the Income tax" Albert Einstein

"If we command our wealth, we shall be rich and free. If our wealth commands us, we are poor in deed"

Contact Us

Kubera Financial Services LLC

1688 Old Gravois Road, High Ridge, MO 63049

1-866-217-8586 ▸▸ email@kuberausa.com ▸▸ www.kuberausa.com